శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

యుద్ధకాండ

మందర మకరందం

వక్త ఆంధ్రవాల్మీకి - కవిసార్వభౌమ శ్రీ వాసుదాసస్వామి అనువక్త - వాచవి వనం జ్వాలా నరసింహారావు



ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ



శ్లో॥ ఆదౌ రామ తపోవనాది గమనం హత్వా మృగంకాంచనం
వైదేహీహరణం జటాయుమరణం సుగ్రీవసంభాషణమ్ ।
వాలీనిగ్రహణం సముద్రతరణం లంకాపురీదాహనం
పశ్చాద్రావణ కుంభకర్ణనిధనం హ్యేతద్ధి రామాయణమ్ ॥

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

యుద్ధకాండ
మందర మకరందం



వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ

వావిలికొలను సుబ్బారావు

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త–వాచవి

వనం జ్వాలా నరసింహారావు

దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సభక్తి పూర్వక సమర్పణం

యుద్ధకాండ మందరమకరందం

వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ
శ్రీ వాసుదాసస్వామి
అనువక్త–వాచవి
వనం జ్వాలా నరసింహారావు

ప్రథమ ముద్రణ

జనవరి 2020

ప్రతులు 1000

వెల: రు. 400


ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్ : **శ్రీనివాసరావు త్రిపురాన**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్,**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:
మరుమాముల వెంకట రమణ శర్మ
సంపాదకులు,
దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక
Sri Rama Siddhanthi Bhavanam, 29-105/4/1,
న్యూ విద్యానగర్, నేరెడ్‌మెట్, సికింద్రాబాద్–5000 56
ఫోన్: 94410 15469

అంకితం



నాన్న-అమ్మ
స్వర్గీయ వనం శ్రీనివాస రావు గారు-వనం సుశీల గారు
(ఆగస్ట్ 14, 1982 న తీసిన ఫోటో)

విషయసూచిక

జయభేరి

౹మొక్కెద రామచంద్రునకు మోడ్చెద గేలు సుమిత్ర పట్టికిన్
౹మొక్కెద దద్విదేహపతనూజకు శ్రీరఘురాము దేవికిన్
౹మొక్కెద ధర్మ వాసవ మరుద్గుణ మారుత రుద్రపాళికిన్
౹మొక్కెద సూర్యచంద్రులకు ౹మొక్కెద దామరసాప్తు సూతికిన్"

★

"జయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విశద సహ్యత రస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరధి సంపరిపాలితుడౌ వలీముఖో
చ్ఛయపతి సూర్యపుత్రునకు సాహస విక్రమ కీర్తిశాలికిన్"

★

"దాసుడ సర్వసద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసల దేశ వల్లభునకున్ హతశత్రుడ వాయుపుత్రుడన్
నాసరిగారు సంగరమునన్ దశకంతులు వేవురేనియున్
వాసియడంతురాల ద్రుమ పాళుల నే హనుమత్సమాఖ్యుడన్"

★

"అయోధ్యాపుర నేతారమ్, మిధిలాపుర నాయకీమ్
రాఘువాణా మలంకారమ్, వైదేహానా మలంకియామ్'
రఘూణామ్ కులదీపంచ, నిమీనామ్ కులదీపికామ్'
సూర్యవంశ సముద్భూతమ్, సోమవంశ సముద్భవమ్'

★

పుత్రమ్ దశరధస్యాపి, పుత్రీమ్ జనక భూపతే
వసిష్టను మతాచారమ్, శతానంద మతానుగామ్'
కౌసల్యా గర్భ సంభూతమ్, వేదగర్భోదితామ్ స్వయమ్'
పుండరీక విశాలాక్షమ్, స్ఫురదిన్దీ వరేక్షణామ్'
మత్త మాతంగ గమనమ్, మత్తహమ్స వధూగతామ్'

★

సర్వలోక విధాతారమ్, సర్వలోక విధాయినీమ్'
లోకాభిరామమ్ శ్రీరామమ్ అభిరామాంచ మైధిలీమ్
అన్యోన్య సదృశా వేతౌ త్రైలోక్య గృహదమ్పతీ''

ముందు మాట

రామకార్యం...రమ్య దర్శనమ్

మఱల నిదేల రామాయణంబన్నచో నీ ప్రపంచకమెల్ల నెల్ల వేళల
దినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్లు తనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రామునే తలచెద నేనును నా భక్తి రచనలు నావిగాన

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రామాయణ కల్పవృక్ష అవతారికలో చెప్పిన మాటలివి.. సాక్షాత్తు ధర్మస్వరూపుడైన రాముడి చరిత్రను ఎంతమందైనా ఎన్నిసార్లయినా రాయవచ్చు. రాసిన ప్రతిసారీ ఒక నూతన అనుభూతి కలుగుతుంది. తలిస్తే రాముణ్ణే తలచాలని విశ్వనాథ వారన్నారు. విశ్వేతిహాస చరిత్రలో రామాయణానికి ఉన్న శాశ్వతత్వం మరే ఇతిహాసానికి లేదు. భారతీయ వాఙ్మయంలో 24 వేల పద్యాలతో మహర్షి వాల్మీకికి మినహా మరెవరికీ అనితరసాధ్యమైన అత్యద్భుతమైన మహత్తరమైన పరమేతిహాసమిది. రామో విగ్రహవాన్ ధర్మః అన్నాడు వాల్మీకి. అత్యంత అనాచారమై.. తండ్రీ కొడుకులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, యజమాని–సేవకులు, రాజు–ప్రజలు, దేవాసుర వ్యక్తిత్వాలు.. పెచ్చరిల్లిపోతున్న నేటిసమాజానికి తప్పనిసరిగా అవసరమమైన అతి ముఖ్యమైన ధర్మనిర్మాణ ఖని. వ్యక్తిత్వ నిర్మాణం లేక సమాజంలో విలువలు కునారిల్లిపోతున్న నేటికాలంలో విశృంఖలత్వం విస్తరిల్లి పరిష్కారానికి ఆక్రోశిస్తున్న ఈ తరుణంలో సమాజానికి అత్యంత అవసరమైనది.. అనుసరణీయమైనది.. శ్రీమద్రామాయణం తప్ప మరొకటి లేదు. మన చరిత్ర, సంస్కృతి, మన నడత, నడవడిక, నమ్మకం,

ఆచారాలన్నింటికీ ఆధారభూతమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదర్శ జీవనానికి ప్రమాణమైనది. ఇంతటి మహేతిహాసాన్ని యథావాల్మీకంగా, పూర్వోత్తర కాండలతో తెనిగించిన మహాకవి కీర్తిశేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాస స్వామి). ఈయన రచించిన ఆంధ్రవాల్మీకి రామాయణ మందారాలు తెలుగునేల నాలుగు చెరగులా ప్రాచుర్యాన్ని పొందాయి. కుండలినీ విద్యాస్వరూపులైన సీతారాముల స్వస్వరూపాన్ని.. తాత్వికతను తేటతేట తెలుగులో ఆంధ్రీకరించిన మహానుభావుడు వాసుదాసస్వామి. తెలుగు పాఠకుల హృదయ సీమల్లో తన రామాయణంతో చిరస్థానం సంపాదించుకొన్న వారు శ్రీ వాసుదేవస్వామి. 'మందర' మకరందాలను, రమారామ పారమ్య పీయూషాలను నాలుగు చెరగులా పంచినవారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇప్పుడీ మందర మకరందాలను మరోసారి పాఠకులకు అందిస్తున్నారు వనం జ్వాలా నరసింహరావుగారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు గారి ప్రధాన ప్రజా సంబంధాల అధికారిగా తీరికలేని విధుల్లో నిమగ్నమై కూడా.. ధార్మిక చింతనతో తన సహజ సిద్ధమైన రచనా ప్రవృత్తిని విడిచిపెట్టలేదు. నరసింహరావుగారు ఇతరత్రా అనేక రచనలు చేసినప్పటికీ.. ఆయనలోని అచంచలమైన శ్రీరామచంద్రుని అచంచలమైన భక్తి ప్రపత్తులు.. తెలుగువారికి మరొక్కసారి తనదైన అనుభూతి తనది గాన అన్నట్టుగా రామాయణాన్ని అందించారు. సుందర సరళమైన తెలుగులో.. చిన్న పిల్లలకు సైతం అర్థమయ్యే పరిభాషలో అందించిన అద్భుతమైన రచన రామాయణం. శ్రీ వాసుదాస స్వామి వారి మందర మకరంద మైన రామాయణాన్ని అనువక్తగా వచనంలోకి అనుసృజన చేయడం అద్భుతం. చదివింది గణితం, సైన్స్, లైబ్రరీ సైన్సు అయినా.. తెలుగు భాషపై, పదాలపై, పదబంధాలపైన వనంవారికి ఉన్న పట్టు ఈ రామాయణ అనుసృజనలో ప్రతిఫలిస్తుంది. ఈ తరానికి వనంవారు మరోసారి.. సరికొత్త అనుభూతితో సీతారాముల తత్వాన్ని అందించారు. వారి రామాయణాన్ని తెలుగునాట విశిష్టమైన ఆధ్యాత్మిక పత్రిక దర్శనమ్ లో

ప్రచురించే అవకాశం లభించటం మా సుకృతం. ప్రస్తుత యుద్ధకాండతో ఆరు కాండలు పూర్తయినాయి. ఈ ఆరు కాండలను విశిష్ట ప్రచురణలుగా సభక్తికంగా పాఠకలోకానికి అందించే అపురూప భాగ్యాన్ని కలిగించిన నా మార్గదర్శి, శ్రేయోభిలాషి, హితవరి శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారికి నమస్సులు. రామాయణ రచనతో వనం వారు మరుజన్మ లేని మోక్షాన్ని సాధించారు. దాన్ని లోకానికి అందించే భాగ్యాన్ని సొంతం చేసుకున్న దర్శనమ్ పత్రిక పరివారం పునీతమయింది.ఈ పుస్తక ప్రచురణలో ప్రత్యక్షంగా,పరోక్షంగా సహకరించిన ప్రతిఒక్కరికీ మనఃపూర్వక నమస్సులు.

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే.. సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే.

మరుమాముల వెంకటరమణ శర్మ
సంపాదకులు, దర్శనమ్

ముందుగా నా మాట

పదహారు సంవత్సరాల యజ్ఞం పూర్తయింది. 2003 లో మా రెండో అమ్మాయి కిన్నెర సిన్సినాటి (అమెరికా) లో వున్నప్పుడు దాని కూతురు ప్రసవ సమయంలో సహాయంగా వుండడానికి దంపతీ సమేతంగా వెళ్లిన నేను హైదరాబాద్ లో మొదలుపెట్టిన సుందరకాండ మందర మకరందం పుస్తకాన్ని పూర్తిచేసాను. కొంతకాలానికి, మిత్రుల, సన్నిహితుల ప్రోత్సాహంతో బాలకాండ మొదలుపెట్టాను. అయితే, కారణాలు ఏమైనప్పటికీ, ఆ తరువాత చాలాకాలానికి గాని, అంటే, 2009 లో మా అబ్బాయి ఆదిత్య అమెరికా సాన్ ఫ్రాన్సిస్కో నగరంలో వున్నప్పుడు, మా మనవరాలు కనక్ పుట్టే సమయంలో అక్కడికి పోయినప్పుడు, బాలకాండ మందర మకరందం పూర్తి చేయగలిగాను. అది తీసుకుని ఒక పబ్లిషర్ దగ్గరికి వెళ్తే మొత్తం రామాయణాన్ని రాసిన తరువాత అన్నీ కలిపి ముద్రిస్తానన్నాడు. అదోక ఛాలెంజ్ లాగా తీసుకున్నాను. అన్ని కాండలు రాయాలని నిశ్చయించుకున్నాను. బాలకాండ మొదటి ముద్రణ చిన జీయర్ స్వామి దయతో జరిగింది.

తరువాత అయోధ్య కాండ మందర మకరందం మొదలుపెట్టాను. అది సాగనివ్వదని పలువురు చెప్పిన మాట నిజమేమో అన్నట్లుగా అది పూర్తి చేయడానికి చాలా కాలం పట్టింది. దాన్ని హైదరాబాద్ లో, సింగపూర్ లో కూడా

రాశాను. కాని చివరకు 2017 లో మరోమారు అమెరికా పర్యటనకు సాన్ ఫ్రాన్సిస్కో, హ్యూస్టన్ నగరాలకు అబ్బాయి, అమ్మాయిల దగ్గరికి వెళ్లినప్పుడు పూర్తి చేయగలిగాను. తరువాత రెండేళ్ళు అమెరికా రావడం కుదరలేదు. అరణ్యకాండ మందర మకరందం, కిష్కింధ కాండ మందర మకరందం హైదరాబాద్ లోనే పూర్తి చేశాను. యుద్ధకాండ మొదలు పెట్టాను. కాని అది కూడా అమెరికాలోనే పూర్తి కావాలని వుందేమో! అమెరికా రావడం (2019 నవంబర్) పూర్తి చేయడం జరిగింది. ఆ విధంగా మొత్తం రామాయణం ఆరు కాండలు రాయడానికి పదహారేళ్ల సుదీర్ఘ కాలం పట్టింది. నేను రామాయణం రాయడానికి పూర్వ రంగం వుంది.

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు దశాబ్దాల క్రితం అదనపు సంచాలకుడిగా పనిచేస్తున్న రోజుల్లో అక్కడి ప్రభుత్వ క్వార్టర్స్లో నివసిస్తుండే వాడిని. మా పొరుగునున్న శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు లేచింది మొదలు నిద్ర పోయేదాక రామనామం తప్ప దేని మీద మనస్సు పోనీయడు. ప్రతినిత్యం రామాయణ పారాయణం చేస్తూ వుంటాడు. నా కంటే వయస్సులో చిన్న వాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలవరకు ఆయనకు నచ్చవు. నేనంటే మాత్రం ఇష్టం. ఆయన ఉదయం అనుష్టానం చేసుకుంటుంటే, చనిపోయిన మా నాన్న స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు గుర్తొచ్చేవారు. నాన్నగారు వాసుదాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం, మందరం అన్ని కాండల్నీ, కనీసం పాతిక సార్లకు పైగా పారాయణం చేసినవారు. వాసుదాసుగారూ ఆయన శిశ్యులు సుబ్బదాసుగారూ (దాసశేషుడు) ఖమ్మం జిల్లాలోని వనంవారి కృష్ణాపురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు.

మా శ్రీమతికి మా నాన్న గారి పూజ-పునస్కారాల వారసత్వం వచ్చింది. నాకంతగా అబ్బ లేదు. ప్రక్కనున్న విజయరాఘవ గారినీ, ఆయన భక్తి సంబంధమైన మాటలను ఎప్పుడూ వింటుంటే ఆమె: " మీరు అన్న గారి మార్గంలోనన్నా పోతారు, లేదా, ఆయన మీ దారికన్నా వస్తారు" అనేది, మేమిద్దరం చర్చించుకుంటుంటే. అదే నిజమైంది కొద్ది రోజుల్లో. నేను రామాయణం చదువుతాను, మీదగ్గరుంటే ఇవ్వండి, అయితే వాసుదాసు గారు వ్రాసిన ఆంధ్రవాల్మీకి రామాయణం మాత్రమే కావాలన్నాను. అలా అడగటానికీ,

అదే కావాలంటానికీ, ప్రత్యేక కారణం ఏమీ లేదు. కాకపోతే నా చిన్న తనంలో, మా నాన్న గారు "మందరం" పారాయణం చేస్తుంటే చూశాను కనుక అది మాత్రమే రామాయణమేమో అనుకున్నాను. ఆయితే నేను రామాయణం చదువుతానంటే ఆయన కొన్నాళ్ళు నమ్మలేదు. నేనూ గట్టిగా అడగనూలేదు. ఆయన ఇవ్వనూ లేదు. నేను ఆలోచన వచ్చిన వెంటనే చదవటమూ జరగలేదు.

మళ్ళీ నిత్య జీవితం. దైనందిన చర్యలు. మధ్యలో మా జిల్లాలోనే వున్న భద్రాచల రాముడినీ, పొరుగు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగనాధ స్వామినీ, దర్శించుకొనే భాగ్యం కలిగింది, డిసెంబర్ 2002-జనవరి 2003 లో. "శ్రీ రామావతార సమయంలో శ్రీ సీతా రాముల దర్శనం ఏదోవిధంగా కలగందే ఈ జన్మలో శ్రీరంగనాధుని (శ్రీరంగం) దర్శనం కలగనే కలగదు" అన్నారు విజయరాఘవ గారు. జనవరి 15, 2003 న తన ఇంట్లోకి పిల్చి, స్నానం చేసి రమ్మని, వాసుదాసుగారి శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం నా చేతిలో పెట్టారు. రామాయణం మొత్తం చదవడం తర్వాత, ముందిది చదవమన్నారు. ఎందుకంటే, రామాయణం పఠనమో, పారాయణమో సుందరకాండ తోనే మొదలెట్టాలన్నారు. అవునేమోననుకుని చదవడం ప్రారంభించాను.

సరీగ్గా పది రోజుల్లో ఆసాంతం చదివాను. ఏరోజుకారోజు, వీలున్నప్పుడల్లా చదివేవాడిని. చదివిన విషయ సారాంశం ఎప్పటికప్పుడు బడి పిల్లాడిలా, విజయరాఘవ గారికి అప్ప చెప్పే వాడిని. వశిష్ఠుడి నోట బ్రహ్మర్షి అంటేనే విశ్వామిత్రుడు ఒప్పుకున్నాడట! నేను చదువుతున్నానన్న నమ్మకం ఆయనకు కలిగితేనే నాకెందుకో తృప్తనిపిన్చేది. పదిరోజుల్లో చదవడం గొప్ప కాదు. నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి చదివించిన ఆయన గొప్పతనం అది. వాల్మీకి సంస్కృతంలో వ్రాసిన ఇరవైనాలుగు వేల శ్లోకాలను ఎప్పుడంటే అప్పుడు ప్రతిపదార్థంతో సహా అప్పచెప్పగల సమర్ధుడాయన!

ఆరువందల డెబ్బై పేజీల పద్య-గద్య-ప్రతిపదార్ధ తాత్పర్య సహిత సుందరకాండ మందరాన్ని చదవడానికైనా, పారాయణం చేయడానికైనా, నాలాంటి చాలామందికి తీరికా, ఓపికా వుండదేమో అనిపించింది. తెలుగు భాషలో కనీస ప్రావీణ్యత వున్నవారికి అర్ధమయ్యే రీతిలో వాసుదాసుగారి

సుందరకాండ మందరాన్ని, ఆయనే "వక్తగా", నేను కేవలం "వాచవిగా"– "అనువక్తగా" సంక్షిప్తీకరించి నలుగురికీ అందించగలుగుతే బాగుంటుందేమో అనుకున్నాను. అలా రాస్తూ వచ్చి ఇప్పటికి పూర్వకాండలు మొత్తం ఆరు పూర్తి చేయగలిగాను. సహృదయులు ప్రోత్సహించాలని ప్రార్థన.

– వనం జ్వాలా నరసింహారావు

చిన్నా–పెద్దా–అందరికీ కృతజ్ఞతలు

ఎందరో సహృదయులు, అందరికీ కృతజ్ఞతలు. ఈ యుద్ధకాండ మందర మకరందం పూర్తిచేయడం కేవలం నా కృషివల్లనే జరిగిందని ఎలా అనగలను? నేనేంటి? ఆంధ్రవాల్మీకి రామాయణం యుద్ధకాండ మందరం చదవడమేంటి? చదివిన తర్వాత మందర మకరందం గా మలచడమేంటి? తెలుగు సాహిత్యంలో, రచనా వ్యాసంగంలో అంతో, ఇంతో ప్రవేశం వున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ, ఆంధ్రవాల్మీకి యుద్ధకాండను మందర మకరందంగా మలిచే శక్తి నాకు కలగడమేంటి?

రామాయణం నేను రాయడానికి అనుక్షణం నన్ను ప్రోత్సహించిన మా శ్రీమతికి ధన్యవాదాలు.

మా పిల్లలు ప్రేమ మాలిని, కిన్నెర, ఆదిత్య, అల్లుళ్ళు విజయగోపాల్, కిషన్, కోడలు పారుల్, వాళ్ల పిల్లలు యశ్విన్, మేథ, మిహిర, అన్ష్, కనక్, ఇరాలకు కూడా థాన్క్స్.

ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన మరెందరికో ధన్యవాదాలు. ముఖ్యంగా కేవలం ప్రోత్సహించడమే కాకుండా ఆర్థికంగా మందర మకరందం పుస్తక ప్రచురణలకు సహాయం చేస్తున్న కోరమాండల్ సీతారామయ్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

దర్శనమ్ శర్మగారికి ధన్యవాదాలు. ముఖ చిత్రం వేసిన గణేష్ కు ధన్యవాదాలు. ముద్రించిన ప్రింటర్స్ కు ధన్యవాదాలు. పేజ్ మేకర్ శ్రీనివాస్ కు

కృతజ్ఞతలు. ఉపోద్ఘాతం రాసిన చిలకపాటి విజయ రాఘవాచార్యులు గారికి ధన్యవాదాలు.

చివరిగా, కానీ, ముఖ్యంగా,

మా నాన్న గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరు! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని కోరుకున్నాడో అలా కొంతవరకూ వున్నానంటానికి ఈ పుస్తకం కూడా నిదర్శనం.

నన్నింత వాడిని చేసిన నా తండ్రి, తల్లి, స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారికీ, స్వర్గీయ వనం సుశీలమ్మ గారికీ, వారి ద్వారా ముత్తవరం శ్రీసీతారామచంద్ర స్వామి వారికీ ఈ పుస్తకం అంకితం.

– వనం జ్వాలా నరసింహారావు

శ్రీరామ రామ రామ...
"మధుర మధురమే తత్ మంగళం మంగళానామ్"

'శ్రీరామాయణము' 'ఆదికవి' వాల్మీకి మహర్షి ప్రణీతము. సంస్కృత భాషలో ప్రథమ రచనము. ఇది 'ఆంధ్రవాల్మీకి' రామాయణము. తొలిసారిగా తెలుగు భాషలో వాల్మీకి రామాయణమునకు యథాతథముగా శ్రీ వావిలికొలను సుబ్బారావు గారు (అనగా వాసుదాసుగారు) పద్య గద్యములతో రచించిన సత్య, ధర్మ, జ్ఞానపీఠము. దీనిని ప్రస్తుతము కడప-తిరుపతి మార్గములో గల ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారికి వాసుదాసస్వామి వారు అంకితమిచ్చి,తాముతరించి,మనవంటిశ్రీరామదాసులకుశ్రీరామానుగ్రహము కలుగునట్లు అనుగ్రహించినారు. కాగా వాసుదాస స్వామి వారు వాల్మీకి రామాయణమునకు పద్యకావ్యముగా, మూల విధేయముగా వ్రాసి, వారే 'మందరము' అను పేరుతో ప్రతి పదార్థ, విశేషార్థ తాత్పర్యములతో చక్కని తెలుగు భాషలో రచించడము జరిగినది. ఇప్పటికి వంద సంవత్సరాలు దాటినది. భారత జాతికే ప్రతిష్టాత్మకమైన 'భారతరత్న', 'జ్ఞానపీఠ' పురస్కారాలకు సర్వథా పాత్రమైన ఈ రచనము 'మందరము' గా సుప్రసిద్ధము..దీని నిర్మాత ఆంధ్రవాల్మీకి వాసుదాసస్వామివారు. లక్షలమంది తెలుగువారు మందరాన్ని పఠించి ధన్యులైనారు, ఇంకా అవుతూనే వున్నారు. శ్రీరామాయణ క్షీరసాగరాన్ని 'మందరం' మథించింది. ఆ దివ్య పీయూషాన్ని స్వర్ణ కలశంలో భద్రపరచి మనకందరికీ ఆప్యాయంగా అందించింది.

అయితే కాలాంతరంలో వస్తోన్న మార్పుల వలన ఆనాటి భాష, భావం, శైలి, స్వరూపం, తాత్పర్యం ఈనాటి తరానికి కించిత్తు క్లిష్టమన్పిస్తూండడంతో,

'ఆంధ్రవాల్మీకి' మన వనం జ్వాలా నరసింహరావు గారిలో 'పరకాయ ప్రవేశం' చేశారు. శ్రీరామాయణ పారాయణ పరాయణులైన వనం శ్రీనివాసరావు గారి పుత్రరత్నమే జ్వాలా నరసింహరావుగారు. సంస్కార సంపన్నమైన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి భక్తి ప్రపత్తులతో బాటు జన్మతః సంతరించుకున్న భద్ర వారసత్వం వారిది! కొంచెం ఆలశ్యంగానైనా, జీవనయానంలో 'వాల్మీకం' జ్వాలా నరసింహారావు గారిని ఆవహించింది. ఇప్పటి ఈ వాసుదాసస్వామి వారి 'మందరా'నికి మకరందంగా, మధురాతి మధురమైన చక్కని తెలుగు నుడికారంతో షట్కాండయుక్తంగా వారిని వాల్మీకి రామయాణాన్ని రుచి చూపించే 'వాచవి' గా, మందరానికి 'అనువక్త' గా మలచి, శ్లోక సముచ్ఛయాల జోలికి పోకుండా, మఙ్గళప్రదమైన మధురధారగా నడిపించింది. ఇది 'శ్రీరామప్రభావ' మహిమ!

'జ్వాలా' గారు నాకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో (Dr MCR HRDI AP), సహవ్రతులే గాక సహవాసులు కూడా! నిద్ర లేచింది మొదలు నిద్రపోయేవరకు అవిశ్రాంత వక్త. వ్యాసకర్త. 'గోష్ఠీప్రియ' కర్త. ఒకవిధంగా, నిత్యసంధ్యానుష్టానాల క్రమశిక్షణ అటుంచితే, బహుముఖీనమైన కార్యక్రమాల వ్యగ్రత వారిది. అలాంటి వారిచేత శ్రీసీతారామచంద్రులు 16 సంవత్సరాల కృషిగా (2004-19) ఈనాటికి ఆరుకాండలకూ యథానువాద రూపంలో 'ఆంధ్రవాల్మీకి రామాయణా' నికి అనువక్తవ్యంగా ఆరుగ్రంథాలను సుప్రసిద్ధ ఆధ్యాత్మిక మాసపత్రిక 'దర్శనమ్' సౌజన్యంతో మనకు అందిస్తున్నారు. జ్వాలా గారి జీవితంలో ఇది ఒక సువర్ణాధ్యాయం!తెలిసినవారు ఊహించింది కాదు..మా దివ్య సోదరి, వారి శ్రీమతి విజయలక్ష్మి గారి కాంతాసమ్మిత సుకృతి!

భారతీయులకు భగవద్గీత - శ్రీరామాయణం - శ్రీమద్భాగవతం - శ్రీమద్ భారతం మహా పవిత్రగ్రంథాలు. ఇవి వేదంతో సమానమైన ప్రతిపత్తి కల్గినవి. వ్యాసవాల్మీకాదులు అనుగ్రహించిన అక్షరనిక్షేపాలు. భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యానికి దివ్యజ్యోతులు. మన బ్రతుకు బాటలో వెలుగులు నింపిన దివిటీలు. ధర్మమార్గదర్శకాలు. శ్రీ రామాయణం ఆదికావ్యం. భారతం ఇతిహాసం. భాగవతం పురాణం. ఈ మూడు శ్రీహరి అవతార కథాకథనాలు. భగవద్గీత సాక్షాత్తూ భగవంతుడైన శ్రీకృష్ణ పరమాత్మ ముఖారవిందం నుండి జాలు వారిన మధుర సుధాస్వాదనం.....ఇక శ్రీరామాయణం శ్రీరామచంద్రుడ్ని,

సీతమ్మ తల్లినీ ప్రధానంగా పెట్టుకుని ధర్మసంస్థాపనానికీ, ధర్మరక్షణకూ, సనాతన ధార్మిక సూత్రాలకూ రక్షాబంధనం చేసిన మహాకావ్యం.భారతీయులకు ప్రాణస్పందనం.. శ్రీసీతారామగుణగానం! దీనిని వేదానికి 'ఉపబృంహణం' అంటారు.

ఇక భారతం 'పంచమవేదం'గా ఆరాధించబడిన జాతీయనేపథ్య ఆంతరంగిక కథాగానం! లోకరీతిని వివిధ కోణాలలో వివరిస్తూనే, సామాన్య ధర్మాలను, విశేషధర్మాలను ఉపదేశించే వ్యాసపీఠం, జ్ఞానదీపం, జయసంహిత!

భాగవతం పురాణరత్నం.. ''బాగవతం... బాగవతం... భాగవతం..'' అంటేనే చాలు, ఎప్పటికైనా 'బాగు అవుతాం' అని లోకోక్తి. భాగవతం భగవంతుని చరితం. ఎవరు ఆ భగవంతుడు? అంటే 'కృష్ణస్తు భగవాన్ స్వయం' అని నిష్కర్ష. శ్రీ కృష్ణ స్వామే భగవంతుడు. ఆయనే జగన్నాటక సూత్రధారి, శ్రీ కైవల్యప్రదాత. ధాత.. విధాత... విధాతకు పిత. తాత. త్రాత. జగత్రాత... వ్యాస మహర్షి సంస్కృత భాషలో 18వేల శ్లోకాలలో దీనిని రచించారు. మన భాగ్యం పండినది. పోతనామాత్యుల వారు దీనికి 8984 పద్యగద్యాలలో చక్కని చిక్కని తెలుగు భాషలో ఆంధ్రీకరించి అందించారు.

అలాగే వ్యాసప్రోక్తమైన మహాభారతం లక్షాధికశ్లోకయుక్తమైనది. కాగా ఆంధ్ర కవిత్రయం వారు ఆంధ్రీకరించి 21,507 పద్యగద్యాలలో హృద్యంగా ఆవిష్కరించారు. ఇక వాల్మీకి విరచితమైన శ్రీరామాయణం – ఆదిలో శతకోటి శ్లోక ప్రవిస్తరం కాగా – 24 వేల శ్లోకాలతో అనుగ్రహించారు. శ్రీ రామాయణ, భారతాలు సంస్కారశోభితమైన మన వైదిక భారతీయ జాతికి నేత్రద్వయమైతే, భాగవతం మాత్రం హృదయసీమయే! ఈ మూడింటినీ కలిసి శ్రీ వైష్ణవులు 'రహస్యత్రయ సౌరభం' అంటారు. అందుకే ఇవి "హిరణ్యనిధి".

'ఆంధ్రవాల్మీకి' వాసుదాసస్వామి వారి 'మందరా'నికి జ్వాలాగారు అందించిన రుచులకు (ఆయన 'వాచవి'కద) ఆరు కాండలలో విస్తరించిన విశదవివరణమే నిదర్శనం. మొదట వారు 'సుందరకాండ' ను సాంప్రదాయిక మర్యాదనునసరించి జులై నెల 2004 లో వ్యాఖ్యానం చేశారు. సుందరకాండలో మొత్తం 68 సర్గలుండగా, దేనికదే ప్రత్యేకంగా 68 కథాంశాలుగా వివరిస్తూనే, చివరలో సుందరకాండ పారాయణ క్రమాన్నీ, ప్రాశస్త్యాన్ని వివరించారు.

గురుముఖంగా ఉపదేశం పొంది, సుందర కాండ తో శ్రీ రామాయణ పారాయణం ప్రారంభించాలని పెద్దలు అంటారు. జ్వాలా గారు ఆ సంప్రదాయాన్ని అనుసరించారు. సుందరకాండ 'బాపు' గారి చక్కని చిత్రాలతో విశేష ఆదరణ పొంది, ప్రస్తుతం నాల్గవ ముద్రణకు సిద్ధమౌతోంది. ఇది జ్వాలా గారి తొలి శ్రీరామాయణ రచనం. ఆనాటి MCR HRDI AP డైరెక్టర్ జనరల్, మహర్షిసత్తములు అయిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఎ.ఎస్. గారు దీనిని ఆవిష్కరించారు. నేను పుస్తక పరిచయ వాక్యాలను ఆ వేళ విన్నవించాను.

ఆ తరువాత క్రమంగా బాలకాండ, అయోధ్యాకాండ, అరణ్యకాండ, కిష్కింధా కాండ, ప్రస్తుతం యుద్ధకాండలకు అనువక్తగా మందరాన్ని అందంగా వాచానువాదనం చేస్తూ వచ్చారు. జూలై 2010లో బాలకాండను మెదట శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారు 'జీయరు శతాబ్ది శతగ్రంథమాల'లో భాగంగా ముద్రింపించి మజ్గాళాశాసనాలను అనుగ్రహించడం గమనార్హం! గణనార్హం! ఈ బాలకాండ, సత్సంప్రదాయానికీ, సనాతన ధర్మపథానికి నిలువుటద్దంగా భాసించే 'జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ప్రచురణం సర్వజనామోద ప్రమోదం అయింది. శ్రీ స్వామి వారి మాటలలో 'తెలుగులో – ఆంగ్లంలో సమాన ప్రతిభ కల్గి ఉండటంతో సవ్యసాచిలా తమ వ్యాఖ్యానాన్ని అతి విలువైన సమాచారంతో నింపిన' జ్వాలా వారు అభినందనీయులు! ఆ తరువాత బాలకాండను రెండో మారు కూడా ముద్రించారు.

అయోధ్యాకాండ, యుద్ధకాండలు పెద్దవి... అయోధ్యాకాండ 119 సర్గలతో 4315 శ్లోకాలతో నడిచే కథనం. ఇది నవంబరు 2017లో ఆవిష్కరించబడింది. అప్పటికే జ్వాలాగారు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యధౌరంధర్యవ్యగ్రతలో వున్నా, శ్రీరామానుగ్రహం వల్ల చక్కగా వాసుదాసస్వామివారిని 'సరళీకరించి' లోక వ్యవహార భాషలో 'మందరించారు'! మహా సహస్రావధాని మాడుగల నాగఫణిశర్మ గారు 'రామాయణంలోని అన్ని కాండలకు వాచవి వ్రాయుదురు గాక!' అని ఆశీర్వదించారు. నిజానికి వాసుదాస్వామి వారు 110 సంవత్సరాల క్రితం తమ 70 ఏట రోజుకు 20 గంటలు శ్రమించి 'మందరాన్ని' నిర్మించారు. నేను ముందే మనవి చేసినట్లు వాసుదాసస్వామి వారే జ్వాలా గారిని ఆవహించి

పరకాయ ప్రవేశం చేసి వుండకపోతే, జ్వాలా గారి బహుముఖ కార్యక్రమాల చక్రబంధంలో ఈ రామాయణం వ్రాయడం సాధ్యమయ్యేదా?! అయోధ్యకాండ భాషలో, భావంలో, భావప్రకటనంలో 'కండ' కలిగిన కలకండ కొండ! ఆద్యంతములూ శ్రీరామ గుణసాగరతరంగములే ప్రతిధ్వనిస్తూంటాయి. వాటికి సంక్షిప్త సుందరవచనానువాద పీయూషం రసరమ్యకోశం!

ఇక అరణ్యకాండ నవంబర్ 2018లో వెల్వడింది. ఇది అనుష్టానకాండ. అద్భుతమైన ఆర్షధర్మాలనూ, ధర్మసూక్ష్మాలను నిష్కర్షించిన మహర్షి మహోపదేశమే అరణ్యకాండ.

జ్వాలాగారి అనువచనం అరణ్యకాండలో మరింత సుధాస్వాదమైంది. ప్రముఖ పాత్రికేయులు కావడం వల్ల సామాన్య పాఠకులకు అవగాహనా సౌలభ్యంగా వుండే విధంగా వారు మందరమకరందాన్ని మరింత మధురాయమానం గావించారు. ముద్రాపకులు, ప్రచురణకర్తలు అయిన 'దర్శనమ్' మాసపత్రికాధిపతి శ్రీమాన్ మరుమాముల వేంకటరమణ శర్మ బొమ్మల గణేష్ తోడ్పాటుతో అద్భుతమైన ముఖచిత్రంతో, అందమైన అచ్చులో అందగించేలా ఆవిష్కరించడం అభినందనీయం!

ఇక కిష్కింధాకాండ జూలై 2019లో అచ్చుపడి, ముచ్చటగా బాపు శైలిలో, గణేష్ ముఖచిత్రంతో ఆవిష్కరణ అయింది. 'మందరం' తెలుగువారి నిరుపమభాగ్య శ్రీరామారామం! శ్రీరామానుగ్రహ ప్రాప్తికి దివ్యసాధనం. జ్వాలా గారి రచన కేవలం 'మందర' వ్యాఖ్యానానికే పరిమితం కాలేదు. వాసుదాసస్వామి వారు ప్రయోగించిన ఛందోవృత్తాలు, సాహితీపిపాసికి 'వసంత కుసుమాకరాలు', 'పూర్ణచంద్రోదయాలు' కాగా, జ్వాలాగారు వీటిని ప్రత్యేకించి చూసి, ఈ వృత్తాలను, వ్యాకరణ గ్రంథులను సైతం అవలోకనం చేసి,విడదీసి వేరొక గ్రంథంగా వ్రాయడం జరిగింది.

శ్రీరామకథామృతపానం అలా వుంచితే, మందరంలో వాసుదాస స్వామివారు ప్రస్తావించిన అనేక రహస్యాలు, విశేషాలు, శాస్త్రాలు ఒక మహా విజ్ఞాన సర్వస్వంగా భాసిస్తాయి. ఆ మహానుభావులు వాల్మీకి రామాయణాన్ని 108 సార్లు పారాయణం చేశారు. ఆ వేళ శ్రీ సీతారాములకు ఏ విధంగా వనవాసానంతరం మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని సురలు,

మహర్షులు, సకల దేవతా గణాలు నిర్వహించాయో, యథాతథంగా ఒంటిమిట్టలో శ్రీ కోదండరామస్వామి సన్నిధిలో 500 నదీ జలాలను తెప్పించి మహా సామ్రాజ్య పట్టాభిషేకాన్ని జరిపించిన 'శతాభిషేకి' వారు. ఇప్పటికీ ఒంటిమిట్టలో వారు ప్రతిష్ఠించిన శిలాఫలకం మనకు స్ఫూర్తిమంతం చేస్తోంది.

కిష్కింధాకాండలో అనువక్త క్రొత్తదనాన్ని నింపడం జరిగింది. శాబ్దికపారమ్యాన్నీ, శ్రీరామావతార వైభవాన్ని వివరిస్తూనే, ఇది 'జ్ఞానకాండ' అన్న విషయాన్ని గుర్తు చేసేట్లుగా నవీకృతం చేశారు. ఇది నిజానికి హనుమకాండ! కిష్కింధాకాండలోనే ప్రథమంగా 'హనుమ' దర్శనమిస్తారు శ్రీరామలక్ష్మణ సమేతులై! ఇందులో వర్ణనలు విశేషం. వర్షఋతువర్ణనం, భౌగోళిక, ప్రాదేశిక వర్ణనం, వాలివధ విషయమై 'ధర్మచర్చ', లౌకిక, ధర్మవివరణం – ఇలాంటి మహా విషయాలు ఆలోచనామృతాలుగా నడిపిస్తాయి. వీటిని అనువచనం చేయడం క్లిష్టమే అయినా 'వాగ్విదాంవరుని' చలవతో జ్వాలాగారు సమర్థంగా వ్యక్తపరచగలిగారు. వారు 24 పుటలలో "రామాయణంలో ఏముంది ? ఆంధ్రవాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?'' అన్న పీఠిక ఇందులో ప్రతివారు చదివి తీరవలసిన మంచి విషయం !

ఇక యుద్ధకాండ. చాలా పెద్దకాండ. ఆరవకాండ. శ్రీరామపట్టాభిషేకంతో శుభ సమాప్తి. దీని తరువాత ఉత్తరకాండ కూడా వున్నది. కానీ దానిని వాల్మీకి మహర్షి రచించాడనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. ఏది ఏమైనా, ఉత్తరకాండ పారాయణం సంప్రదాయంగా తోచదు. యుద్ధకాండ 131వ సర్గ శ్రీరామపట్టాభిషేక సర్గ. దానితోనే శ్రీరామాయణ పారాయణానికి మఙ్గళాశాసనం.

యుద్ధకాండ లో కథాంశం కంటే యుద్ధవర్ణనలు ఎక్కువ. పాఠకులకు క్లిష్టంగా ఉంటుంది. దీనిని అనువక్త క్లుప్తంగా సుందరీకరించారు. ప్రతి సర్గకు తనదైన శైలిలో వ్యాఖ్య వ్రాస్తూనే పాఠక సౌలభ్యాన్ని దృష్టిలో వుంచుకొని మూలానికి, కథా సూత్రానికి భంగం కలుగనిరీతిలో క్లుప్తసుందరంగా వ్రాయడం జరిగింది. మందరం మొత్తాన్నీ నవలా పఠనంగా నడిపించినందువలన యుద్ధకాండలో కూడా మూలకథకు విధేయంగానే రచన సాగింది. అయితే చివరి సర్గలను కొంచెం విశేషంగా వ్యాఖ్యానిస్తే భవ్యంగా

వుండేదనిపిస్తోంది. ఎలాగైతే ఏమి గాని, వాసుదాసస్వామి వారి చలవ జ్వాలాగారిపై ప్రసరించింది. వారిచేత తాను పలికిన కథను తాతగారు మనవడికి కథ చెప్పినట్లుగా జ్వాలాగారి చేత పలికించారు వాసుదాస స్వామి. ఇది జ్వాలా గారు చేసుకున్న సుకృతము. శ్రీరామానుగ్రహఫలము.

అన్ని కాండలను సాంగోపాంగంగా సంక్షిప్తీకరించిన చక్కని తృప్తితో... వీలైతే యథావిధేయంగా చిన్నపిల్లలకు కథ చెప్పే విధంగా మరింత క్లుప్తసుందరంగా 'శ్రీరామాయణ మందరా'న్ని వ్రాయాలని జ్వాలా గారికి సూచిస్తున్నాను. అలాగే తెలుగు – ఆంగ్ల భాషలలో చేయి తిరిగిన రచయిత గనుక ఈ 'వాచవి' ని ఆంగ్లీకరించే ప్రయత్నం చేయాలనీ, దానివల్ల విదేశియులకు సైతం వాసుదాసస్వామి వారిని, వారి మందరాన్నీ అనుసంధానించగలిగే భాగ్యం వారికి లభిస్తుందని నా ఆశంస!

ఇక్కడ వాసుదాసస్వామి వారి గురించి ప్రస్తావించాల్సి వుంది. శ్రీవారి జీవిత విశేషములను గురించి జ్వాలా నరసింహరావుగారు సంక్షిప్తంగా ఇందులోనే వివరించడం జరిగినదికద!

వావిలికొలను సుబ్బారావుగారే 'వాసు' దాసస్వామి. వారిది భారద్వాజ గోత్రము. ఆపస్తంబ సూత్రము. గోల్కొండ వ్యాపారి శాఖకు చెందిన శ్రీవైష్ణవ సంప్రదాయస్థులు. విశిష్టాద్వైతులు. పంచసంస్కారపరులైన నియోగి బ్రాహ్మణులు. వీరికి 15 ఏటనే క్షయరోగము సంభవించగా, పినతండ్రి లక్ష్మణరావు గారు సంరక్షించిరి. 73 సంవత్సరములు జీవించిరి. కాగా 47వ సంవత్సరమున భార్య రంగనాయకి గారు పరమపదించిరి. వాసుదాస స్వామి ఎన్నో మహాగ్రంథములను రచించిన మహానుభావులు. వాటిలో ఆర్యకథా నిధులు. హితచర్యమాలికా గ్రంథములు ధర్మశాస్త్ర సందేశములతో నిండినవి. వారు స్థాపించిన 'భక్తి సంజీవని' మాసపత్రిక అవిచ్ఛిన్నముగా సాగుచున్నది. వాసుదాసస్వామి 108 పర్యాయములు శ్రీమద్రామాయణ పారాయణము, 108 శ్రీ సీతారామ కళ్యాణములు, 108 సామ్రాజ్య పట్టాభిషేకములు చేసిన మహా తపస్వి.

శ్రీరామాయణము ధర్మశాస్త్రము. ఇందులో రాజ, ప్రజా, పతి, సతీ, భ్రాతృ, పుత్ర, భృత్య, మిత్ర ధర్మములున్నవి. శ్రీ రామాయణమ మంత్రశాస్త్రము.

ఇందులో ప్రతి అక్షరమూ మంత్రమేనని పెద్దల తీర్పు. సుందరకాండకు మించిన మహామంత్రభాగము ప్రపంచములో మరొకటి లేదుకద! గాయత్రీ బీజ సంయుతమని రామాయణమునకు ప్రసిద్ధి. గాయత్రీ మంత్రమందలి 24 అక్షరములే శ్రీరామాయణమందు 24 వేల శ్లోకములలో నిక్షిప్తమైనవి.

శ్రీ వాసుదాసస్వామి వారు గుంటూరు జిల్లా తెనాలి సమీపములో నడిగడ్డపాలెము గ్రామమునందొక ఆశ్రమమును స్థాపించి, నిర్వహించినారు. తదుపరి శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ (పెద్ద) రామానుజ జీయర్ స్వామి వారు, క్రమముగా శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి వారు దానిని నిర్వహించుచున్నారు.

శ్రీ వాసుదాసస్వామి వారు తరువాత తమ శిష్యులైన శ్రీ దాసశేషస్వామి వారు (యామర్తి సుబ్బారావుగారు 1890-1968), క్రమముగా శ్రీ శేషదాసస్వామి వారు (ఉలిచి ఆదిశేషయ్యగారు), శ్రీ నారాయణదాస స్వామివారు (ముదిగొండ సత్యనారాయణ గారు), ప్రస్తుతము శ్రీ రామానుజ దాసస్వామి వారు (వడ్లమూడి శ్రీమన్నారాయణ మూర్తిగారు) ఆచార్యత్వము వహించుచున్నారు. శ్రీ వాసుదాసస్వామి వారు తెనాలి – గుంటూరు మార్గములో గల అంగలకుదురు నందు శ్రీ కోదండ రామసేవక సమాజమును స్థాపించిరి. ఆ ఆశ్రమము ప్రస్తుతము పంచమ గురుస్థానీయులైన శ్రీరామానుజదాసస్వామి వారి ఆధ్వర్యంలో శ్రీ ఉలిచి సీతారామశర్మ (పట్టాభి), అర్చకస్వాములైన శ్రీ బలభద్రపాత్రుని సుబ్బారావు ప్రభృతుల సహాయ సహకారములతో దినదిన ప్రవర్ధమానముగా నిర్వహించబడుచున్నది. వాసుదాస స్వామివారి శ్రీరామాయణాది (మందరం) గ్రంథములన్నియూ ఇచ్చట లభించుచున్నవి. శ్రీ రామచంద్రస్వామి కైంకర్యముగా శ్రీ ఆత్మకూరి వేంకటశ్రీమన్నారాయణ గారు ఇటీవలనే మందర సంక్షిప్త ప్రతులను ఆంగ్లీకరించి ప్రాచుర్యము కల్పించినారు.

అయోధ్యలోగల 'వాల్మీకి మందిర్ (భవన్)' లో వాసుదాసస్వామి వారి 'మందరము' చక్కగా భద్రపరచబడి ఆరాధింపబడుచున్నది. వాసుదాస స్వామి వారు విశ్వవిఖ్యాతిగాంచిన 'నోబెల్' పురస్కారానికో, 'భారతరత్న' కో, 'జ్ఞానపీఠ' పురస్కారమునకో అర్హతనొందిన మహా విజ్ఞాన ప్రభాసంపన్నులు. పరిపూర్ణ శ్రీరామానుగ్రహ ప్రాప్తులు. శ్రీ సీతారాముల కటావీక్షణములు శ్రీ జ్వాలా నరసింహరావు గారిపై ప్రసరించడము, వారి చేత మందరమునకు

మందిరముగా 'వాచవి' గావించడమూ శ్రీ రామానుగ్రహ ఫలమే! దానివల్ల జ్వాలాగారు ధన్యులైనారు. వారి పితృపితామహప్రపితామహ పరంపరయూ తరించినది. పుణ్యాత్ములైన జ్వాలా నరసింహరావు గారిని శ్రీ సీతారామశ్రీచరణ పురస్సర అభినందనచందనము సమర్పిస్తూ విరమిస్తున్నాను.

శ్లో॥ భారద్వాజ కులోద్భవం వరకవిం శ్రీరామచంద్రాత్మజం
శ్రీవత్సాన్వయ నారసింహ కరుణాసంలబ్ధమంత్రోత్తమమ్।
సీతారామ పదాంబు జాత యుగళీ ధ్యానైక విష్ఠారతం
వాల్మీకిం వరదేశికం గుణనిధిం శ్రీ వాసుదాసంభజే॥

శ్లో॥ యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే।
తావత్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి ॥

విజయవాడ శ్రీరామ – రామానుజదాసానుదాసుడు

3 డిసెంబరు, 2019..

చిలకపాటి విజయ రాఘవాచార్యులు

ప్రిన్సిపల్ (రిటైర్డు) ఎ.పి. గురుకుల డిగ్రీ కళాశాల, నాగార్జున సాగర్..

పూర్వ కార్యదర్శి, హిందూ ధర్మ ప్రచారపరిషత్తు, టిటిడి, తిరుపతి

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం...
యుద్ధకాండ

శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు."చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకులవారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశ లవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ–జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య–వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని–అర్ధ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ–పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మధనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన–అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం–మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ–పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది–ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప

మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు. ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాల కాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ వాసుదాసుగారు, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుడి కుమారులైన కుశ-లవులు లోకానికి ప్రకటించినట్లే, తనకూ ఆయన కుమారుడిగా, అలాంటి అధికారం వుందని, అయితే సంకల్పించడం మాత్రమే తన వంతని-నిర్వహించడం శ్రీరాముడి వంతని, పూర్తిచేయించే భారం ఆయన భుజాలపైనే వేస్తున్నానని, ఆయన వలదన్నా వదలనని చెప్పుకుంటారు.

వాసుదాసుగారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని మిత్రులంటారాయనతో. మూల గ్రంథం రాయడంకంటే వ్యాఖ్యానం రాయడం కష్టమనుకుంటారాయన మొదట్లో. బాగా ఆలోచించిన తర్వాత, (శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం) "మందరం" పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం."మందరం"అంటే, క్షీరసాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, "మందరం" అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, "క్షీరవారాసి" గా సంభావించి, దానిని మథించిన తమ "మేథ" అందించిన మకరందాలను-మధురిమలను, ముచ్చటగా "మందరం" అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా-అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా-నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి "మందరం" అని నామకరణం చేయడంలో తను కొంతవరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట

నిగూఢార్థాలను–అంతరార్థాలను–ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే–అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది. ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం–ఖగోళ శాస్త్రం–సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు–సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు–వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పదంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

వావిలికొలను సుబ్బరావుగారు, కడప జిల్లా–జమ్మలమడుగులో 1863 లో జన్మించి 1939 లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893–1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904–1920 మధ్య కాలంలో పనిచేసారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీ కుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో,

వాసుదాసుగారు భక్తి-యోగ మార్గం పట్టారు. జీర్ణ దశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900-1908 మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన-స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బరావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం, తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. ఈ నాటికీ క్రమం తప్పకుండా గుంటూరు జిల్లా తెనాలి దగ్గరున్న అంగలకుదురు నుంచి ప్రచురించబడుతున్న "భక్తి సంజీవని" అనే భక్తి-జ్ఞాన-కర్మ యోగాలను తెలిపే ఆధ్యాత్మిక మాసపత్రిక సంస్థాపక సంపాదకులుగా-వాసుదాసుగా-ఆంధ్ర వాల్మీకిగా-కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కారు. అంగలకుదురులోని శ్రీ కోదండ రామ సేవక ధర్మ సమాజం స్థాపించింది ఆయనే. కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, ఈ నాటికీ దర్శనీయమైన రీతిలో శాశ్వత కైంకర్యం చేసిన వాసుదాసుగారు, వాఙ్మయ ప్రపంచంలోని భక్త కవులలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయనకు, తిరుపతి వేంకటకవులు, కొక్కొండ వేంకట రత్నం పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రులు మొదలైన ప్రసిద్ధ కవులందరూ స్నేహితులే.

వాసుదాసుగారు "కౌసల్యా పరిణయం" అనే ప్రబంధం, "సుభద్రా విజయం" అనే నాటకంతో పాటు, "హిత చర్యలు", "ఆధునిక వచనరచనా విమర్శనం", "పోతన నికేతన చర్చ", "పోతరాజు విజయం", "రామాశ్వమేధం", ఆంధ్రవిజయం" కూడా రాసారు."ఆర్యకథానిధులు" అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి."సులభ వ్యాకరణం" తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన రచించిన "కృష్ణావతార తత్వం" ప్రశస్త కృతిపాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించచేసి-తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బరావుగారు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య–పద్య రామాయణాలకు విశేషప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ – ఈ రోజుల్లోనూ, వాసుదాసుగారి రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. "ఆదికవి–ఆంధ్ర వాల్మీకి", యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందోయతులను ఆయా స్థానాలలో నిలిపి తెనిగించిన వాల్మీకానికి రావాల్సినంత మోతాదులో, ఎందుకు గుర్తింపు రాలేదు? వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను "ఆదికవి" గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో కలిపి ఉత్తర కాండను కూడా మొట్టమొదట తెనిగించిన వాసుదాసుగారు కూడా "ఆదికవే" కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో– ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకిరామాయణం, ఎప్పుడో–ఏనాడో నొబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న–జ్ఞానపీఠ ఆవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణానిదే కావ్యాలలో అగ్రస్థానం

శ్రీ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చరిత్రను, వీరు ఆచరించిన ధర్మాలను అన్ని లోకాలకూ శాశ్వతంగా చెప్పేందుకు, శత కోటి గ్రంథాత్మకమైన ప్రబంధంగా, ఓ బృహత్ గ్రంథాన్ని రచించి నారదుడికి, ఇతర మహర్షులకు ఉపదేశించాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఆగకుండా భూలోక వాసుల కొరకై శ్రీరామ భక్తుడైన వాల్మీకికి ఉపదేశించమని నారదుడిని ఆదేశించాడు. వాల్మీకి రచించిన రామాయణం బ్రహ్మ ప్రేరేపించినదే.

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది,. శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతా దేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. ఇహ-పర సాధకంబులైన "స్వధర్మాలలో, స్త్రీ ధర్మం సీతని, పురుష ధర్మం శ్రీరామచంద్రమూర్తని లోకానికుపదేశించాడు వాల్మీకి.

శ్రీరామచంద్రుడు బాలుడుగా వున్నప్పుడు జరిగిన సంగతులు తెలిపేది "బాల కాండ". ఇందులోనే సీతాకల్యాణ ఘట్టం అత్యంత మనోహరంగా రాసారు వాల్మీకి కవి. "కాండం"అంటే జలం...అంటే నీరు. శ్రీ రామాయణం మహార్ణవంగా చెప్పడంవల్ల, అందులోని జలం కాండమన్నారు. శ్రీ రామాయణంలోని బాల కాండలో శ్రీరామచంద్రమూర్తైన విష్ణువే "జగజ్జనన కారణభూతుడు" అని బోధపడుతుంది. జననం మొదలు ఇరవై అయిదు ఏళ్లు వచ్చేవరకూ రాముడు చేసిన చర్యలు ఈ కాండలో వున్నాయి. పన్నెండో ఏట

పెళ్లైనప్పటినుండి పట్టాభిషేకం ప్రయత్నం జరిగే వరకు చెప్పుకోదగ్గ విశేషం ఏమీలేదు. బాల కాండ వృత్తాంతమంతా 12 సంవత్సరాల కాలంలో జరిగింది.

రామాయణ రచనకు పూనుకున్న వాల్మీకి మహర్షి, భగవద్విషయాన్ని బోధించే యోగ్యతలున్న గురువు దొరకలేదనే నిర్వేదంతో శుష్కించి, తన ఆశ్రమానికి వచ్చిన నారదుడికి సాష్టాంగ నమస్కారం చేసి: "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు. వాస్తవానికి ఈ గుణాలన్నీ వున్నవాడు శ్రీరామచంద్రుడే! అందుకే ఆయన చరిత్రను మనకందించాడు వాల్మీకి మహర్షి.

బాల కాండలో శ్రీ మహావిష్ణువు భూమిపై అవతరించాల్సిన కారణం, అయోధ్య కాండలో స్థితి కారణం, అరణ్య కాండలో మోక్షమిచ్చే అధికారం, కిష్కింధ కాండలో గుణ సంపత్తి, సుందర కాండలో సర్వ సంహార శక్తి, యుద్ధ కాండలో వేదాంత వేద్యత్వం, ఉత్తర కాండలో సృష్టికి హేతువు లాంటి విషయాలను చెప్పడం జరిగింది. రామాయణంలో చెప్పబడిన పరతత్వం శ్రీరామచంద్రమూర్తిగా అవతరించిన విష్ణువేనని స్పష్టమవుతుంది. ఇటువంటి పరతత్వాన్ని స్థాపించి, పరమాత్మ అనుభవించే ఉపాయం శరణాగతని అర్థం చేసుకోవాలి. శరణా గతికి ముఖ్య ఫలం, భగవత్ సన్నిధానంలో చేరి, భగవంతుడికి సేవ చేయడమే. శరణాగతికి పురుష కారం అవశ్యం. పురుష కారానికి కావాల్సిన ముఖ్య గుణం శరణాగతుడి పట్ల దయ. రామాయణంలో పురుష కారం ప్రధానమైంది. శరణాగతుని అనుష్టించు అధికారికి శేషత్వం పారతంత్ర్యం స్వరూపం. భరతుడి చర్య వలన పారతంత్ర్యం స్పష్టంగా కనిపిస్తుంది. శత్రుఘ్నుడి చర్యలు భాగవత పారతంత్ర్యాన్ని తెలియచేస్తుంది. మనం సదా జపం చేయాల్సింది రామాయణమే.

రామావతారం పూర్ణావతారమే. అంటే ప్రకృతి సంసర్గం లేదు. శరీరం అప్రాకృతం. ప్రకృతి గుణాలు ఆయన్ను బాధించవు. రామచంద్రమూర్తి శోకించాడని వాల్మీకి రాసిందీ అసత్యం కాదు. నిజంగానే శోకం

కలిగిందాయనకు. అయితే శోకం కలిగింది తన కొచ్చిన కష్టానికి కాదు. తమకు దుఃఖాలొచ్చాయని మనుష్యులు దుఃఖిస్తారు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానని మాత్రమే రాముడు శోకించాడు. అలానే, సీతాదేవి విషయంలోనూ దుఃఖించాడు శ్రీరాముడు. తనను నమ్మి అడవులకు వచ్చిన సీతను, రాక్షసుడు ఎత్తుకుపోతే, తనను వదిలిన బాధతో, అమెకెంత దుఃఖం కలిగిందని రామచంద్రమూర్తి దుఃఖించాడు. వియోగంవల్ల తమకు కలిగిన నష్టానికి దుఃఖించే వాళ్లు మనుష్యులు. జీవులకు కలిగిన నష్టానికి దుఃఖించేవాడు భగవంతుడు. శ్రీరామ చరిత్ర అంటే మహాపురుష చరిత్రే. అందుకే దీనివలన ఎన్నో లాభాలున్నాయన్న భావన బాల కాండ మొదటి పద్యం లోనే వివరించబడింది.

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీరామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. "శ్రీరామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్తవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని–ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి–పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల

చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్థమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం" లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి-విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వని కావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ-లోభ-పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు.

ఇలా వాల్మీకి రామాయణంలో ఒకటి కాదు...వందల...వేల రకాల వ్యావహారిక, ప్రాపంచిక, ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధమైన అనేకానేక విషయాలు వుండడం వల్ల దానిని మించిన గ్రంథం మరోటి లేదని అంటారు.

"ప! ప్రపద్యేడిత! దురి

తాపహ! కారుణ్యసీమ యరిజన భీమా!
తాపహరా! విధిహరనుత!
క్ష్మాపుత్రీలోల! రామచంద్రనృపాలా!”

యుద్ధకాండార్థాన్ని, వాసుదాసకవి, తన ఇష్టదేవతైన రామాయణ కథానాయకుడుశ్రీరామచంద్రమూర్తినిసంబోధించి చెప్పాడు ఆరంభంలో. అరణ్య, కిష్కింధా, సుందర కాండలలో సీతారామ వియోగం చెప్పడం జరిగింది. దానివల్ల ఇంతవరకూ శ్రీరామచంద్రమూర్తి అశ్రీకుడనే చెప్పాల్సి వుంది. ఈ కాండలో ఆ శబ్దం సార్థకమవుతున్నది. జనులతో భజించబడుతున్న బ్రహ్మరుద్రాదులు కూడా శ్రీరాముడిని కొనియాడుతున్నారు. ఉత్తముల మాటలతో కొనియాడబడుతున్నాడు. మోక్షమార్గంలో పయనిస్తున్నవారితో కొనియాడబడుతున్నాడు. ఈ కాండలోని అర్థాన్ని తొలుత వాసుదాసు గారు రాసిన ఈ పద్యంలో సూచించడం జరిగింది. "శ్రీప" అనడంలో రాజలక్షణమైన సైన్య సంపత్తి గురించి; "ప్రపద్యేడిత" అనడంలో విభీషణుడి శరణాగతి గురించి; "దురితాపహ" అనడంలో సముద్రం మీద వేయదల్చిన బాణాన్ని సముద్ర ద్వీప వాసులైన పాపులమీద వేసి చంపడం గురించి; "కారుణ్యసీమ" అనడంలో వధ్యులైన శుకసారణుల వదిలిపెట్టడం గురించి; "అరిజనభీమ" అనడంలో సమస్త రాక్షస సంహారం గురించి; "తాపహరా" అనడంలొ సీతాపరిగ్రహం గురించి; "విధిహరనుత" అనడంలో బ్రహ్మాది స్తోత్రం గురించి; "క్ష్మాపుత్రీలోల – రామచంద్ర నృపాలా" అనడంలో సీతాసమేతంగా పట్టాభిషేకం చేసుకుని ప్రజలను పాలించడం గురించీ సూచించబడిందీ పద్యంలో.

సర్గ-1
హనుమంతుడిని ప్రశంసించిన శ్రీరాముడు

(సుందరకాండలో సీతాదేవి రామచంద్రుడిని ఏ ఉపాయంగాను, ఉపేయంగాను గ్రహించడం గురించీ, పారతంత్ర్యం, సీతాపురుషకారం గురించీ చెప్పడం జరిగింది. ఇలా తమను ఉపాయంగానూ, ఉపేయంగానూ గ్రహించినవారిని ఎలా సీతారాములు అనుగ్రహిస్తారో ఈ యుద్ధ కాండలో చెప్పడం జరుగుతుంది. సుందరకాండలో ప్రపన్నుడికి తన విషయమై భగవాదాశయం తెలియచేసి, భగవంతుడు తనను రక్షిస్తాడని, భయపడవద్దని చెప్పి, వాడి విషయంలో వాడు భగవంతుడిమీద ఎంత నిష్టతో వుండాలో, భగవంతుడికి తెలియచేయడం చెప్పడం జరిగింది. యుద్ధకాండలో ఆచార్యుడు ప్రపన్నుడిని రక్షించడం కోసం భగవంతుడిని ప్రేరేపించి ఆయనతో అతడిని రక్షించబడేట్లు చేయడం చెప్పబడుతుంది. సుందరకాండలో గురువుతో బోధించబడిన యోగి మనస్సు ఆత్మాన్వేషణలో ఆసక్తమై సంసార సాగరంలో కలిగే విఘ్నాలన్నింటినీ దాటి దేహాన్ని, ఆత్మను వెతికి, కనుక్కొని జీవాత్మ-పరమాత్మలకు గల సామ్యభేదాలను విమర్శించి, దేహానికి చిక్కుపడకుండా దాన్ని దహించి భగవంతుడి దగ్గరకు చేరడం వివరించడం జరిగింది. యుద్ధకాండలో జీవాత్మ-పరమాత్మలకు ఐక్యం సంపాదించి తాను శెలవు తీసుకోవడం చెప్పడం జరుగుతుంది. ఇందులో ప్రథమంలో భృత్యుడు కార్యాన్ని నెరవేర్చి వచ్చిన తరువాత యజమానుడాభృత్యుడి విషయంలో ఎలా ప్రవర్తించాల్నో చెప్పడానికి సీతవార్త తెచ్చిన హనుమంతుడిని సుగ్రీవాదుల ఉత్సాహానికొరకు రామచంద్రమూర్తి పొగిడాడు).

వానర శ్రేష్టుడైన హనుమంతుడు సీతావిషయంలో లంకలో జరిగినది

జరిగినట్లే చెప్పగా రామచంద్రమూర్తి విని, సంతోషించి, బదులుగా సుగ్రీవుడిని చూసి ఇలా అన్నాడు. "మన హనుమంతుడు చేసిన గొప్ప కార్యం మరెవరూ తాను చేయగలనని నోటితో చెప్పడమే కాదు, మనస్సులో అనుకోవడానికి కూడా శక్తికి మించిన పని. మిక్కిలి దుర్లభమైంది. అలాంటి కార్యాన్ని హనుమంతుడు చక్కగా నెరవేర్చి వచ్చాడు. ఇతడికి సమానమైనవాడని చెప్పగలవాడు ఈ లోకంలో ఎవరైనా వున్నారా? లేదు...లేదు....లేదు. ఈ హనుమంతుడు కాకుండా, గమన వేగానికి ప్రసిద్ధులైన గరుడానిలులు కాకుండా, మరెవ్వరికైనా ఆ సముద్రాన్ని దాటడం సాధ్యమయ్యేదా అని ఆలోచిస్తే ఒక్కడైనా అంతటివాడు ఆలోచనకు రాలేదు. సుగ్రీవా! లంకానగరాన్ని దేవతలకు, యక్షులకు, రాక్షసులకైనా దూరం నుండి దొంగతనంగా పొంచి చూడగలగడం తప్ప, యథా దృష్టి సారించి చూడడం సాధ్యం కానే కాదు. పదితలల రావణుడు పాలించే లంకను మరెవరూ, ఎంతటివాడైనా తన బలసంపదతో ప్రవేశించడం సాధ్యమా? ఒక వేళ రాక్షసులను ఏమరచి లోపల ప్రవేశించినా మళ్లీ ప్రాణాలతో తిరిగిరావడం సాధ్యమా? అలా చేయగలగడం మన హనుమంతుడికి ఒక్కడికే చెల్లింది".

రాముడు సుగ్రీవుడితో ఇంకా ఇలా అన్నాడు. "ఏమయ్యా! హనుమంతుడితో సమానమైన బలం, విక్రమం కలవారు లోకంలో లేరా అంటావేమో? ఒకవేళ వున్నా, అన్ని విషయాల్లో అంటే వేగం, బుద్ధి, దృష్టి లాంటివాటిలో, వాయునందనుడితో సమానమైన వాడు కాకపోతే, రాక్షసులు కాపాడుతున్న, దర్శించడం సాధ్యంకాని లంకను, హనుమంతుడు ప్రవేశించిన విధంగా ప్రవేశించడం సాధ్యమయ్యేదా? సుగ్రీవుడి లాంటివాడి భృత్యుడు ఎలా కార్యం చేయాలో అలాగే అమితమైన పొగడ్తకు తగ్గవిధంగా సీతాన్వేషణ కార్యాన్ని నెరవేర్చాడు హనుమంతుడు. అంతమాత్రమే కాదు. సుగ్రీవుడి యోగ్యతకు తగ్గట్లు తన అతిశయమైన శక్తికి తగినవిధంగా బలాన్ని కూడా చూపించి రాక్షసులను వధించి లంకాదహనం చేశాడు. యజమాని చేయడానికి చాలా కష్టమైన పనిని చేయమని ఆజ్ఞాపిస్తే, తనకింత కష్టమైన పని వచ్చిందికదా అని మనసులో బాధపడకుండా, తాను ఈ పని నెరవేరుస్తానని విశ్వాసంతో కదా, తనకీపని అప్పచెప్పిందని భావించి, భక్తితో యజమాని చెప్పిన పనిని చేయడమే కాకుండా, ఆ పనికి సంబంధించిన ఆయన చెప్పని మిగతా కార్యక్రమం కూడా నెరవేర్చే దూతను బుద్ధిమంతులు పురుషోత్తముడు అంటారు. ఇది ఉత్తమ దూత

లక్షణం. యజమాని చేత ఆజ్ఞాపించబడిన వాడై ఆయన చెప్పిన–చెప్పని పని ఆయనకు మేలు చేస్తుందని తెలిసికూడా చెప్పినదానికంటే హెచ్చుగా చేయనివాడిని, వాడికి ఉత్సాహం, సామర్థ్యం వున్నప్పటికీ అతడిని బుద్ధిమంతులు మధ్యముడు అంటారు. ఫలానా పని చేయాలి అని యజమాని చెప్పినప్పుడు, ఆ కార్యం చేయడంలో సామర్థ్యం వున్నాపనిలో శ్రద్ధలేక చెడగొట్టితే పెద్దలు అతడిని నీచుడు అంటారు".

"ఇలా వుండడం వల్లనే హనుమంతుడు పురుషోత్తముడైనందున రాక్షసులకు చిక్కినా, తన గౌరవానికి హానికలుగకుండా, తనను దూతగా నియమించిన సుగ్రీవుడికి సంతోషం కలిగేట్లు నియమిత కార్యాన్ని సాధించాడు. ఇది ఆయన తన స్వామికి చేసిన ఉపకారం. ఇక మా విషయానికొస్తే, జానకిని చూసి వచ్చి నాకు,లక్ష్మణుడికి, మా ఉత్తమ రఘువంశానికి ప్రాణాలిచ్చి రక్షించాడు. ఈయన ఈ పని చేయకపోతే లోకంలోని అందరూ చనిపోయినట్లు కాకుండా అపకీర్తితో చనిపోయేవాళ్లం. అలాంటి దుర్మరణాన్నుండి హనుమంతుడు మమ్మల్ని తప్పించాడు. ఆత్మహత్య అనే అధర్మానికి పూనుకోకుండా ధర్మాన్ని కాపాడాడు. మాకు మా వంశానికి, దుర్మరణం రాకుండా కాపాడినటువంటి గొప్ప ఉపకారమైన సంతోషవార్తను చెప్పిన హనుమంతుడి సహాయానికి సమానమైన సంతోషం ఆయనకు కలగచేయడానికి మాకు శక్తి లేకపోయెకదా అని చాలా దుఃఖపడుతున్నాం. నాకు లోకంలో నాది అనుకున్న ధనమంతా ఇచ్చి, నీవు చేసిన ఉపకారానికి సమానమైన ఉపకారం చేయగలిగితే సంతోషిస్తాను హనుమంతా. అలా చేద్దామంటే నాదగ్గర ధనమే లేదు. ఇక నేను నీకేం ఇవ్వగలను? శుష్కాలాపాలతోను,శూన్యహస్తాలతోను ఏం లాభం? నేనే రాజుగా వుంటే సర్వరాజ్యం నీకిచ్చేవాడిని. అది కూడా లేదాయె. కాబట్టి నువ్వు చేసిన దానికి బదులుగా నా కౌగిలిని తీసుకో ఆంజనేయా! ప్రార్థిస్తున్నాను. ఇది బదులుగా అంటున్నాను కాని సమానంగా అనడం లేదు. ఇది నువ్వు చేసినదానికి సమానం కాదు. అయినా, ఈ అల్ప దక్షిణను శాస్త్రోక్త దక్షిణగా తీసుకోమని నాకున్న అల్పమైన ఈ దేహాన్ని నీకు సమర్పిస్తున్నాను".

"నువ్వుదారచిత్తుడివి. ఎదుటివారి లోపాలను ఎంచేవాడివి కావు. కూలివాళ్లలాగా ప్రతిఫలాపేక్షతో పనిచేసినవాడివి కావు. కేవలం ధర్మబుద్ధితో,ఉపకారబుద్ధితో, దయార్ద్ర హృదయంతో చేసిన మహాత్ముడివి. కాబట్టి నా ప్రార్థన నిరాకరించక మన్నించమని కోరుతున్నాను. కృపతో

పరిగ్రహించు. నువ్వు నిరాకరిస్తే నాకంతకంటే వేరే మరణం లేదు. ఎందుకు నా కౌగిలి సమానం కాదంటున్నానా? అక్కడ చావడానికి సిద్ధంగా వున్న సీత ప్రాణాలు నిలిపావు. ఆ వార్త తెచ్చి ఇక్కడ నా ప్రాణాలు నిలిపావు. ఇలా ఇద్దరి దేహాలు నువ్వు ఇస్తే, నేను ఒక్క దేహాన్ని ఇవ్వడం ఎలా సమానమవుతుంది? కాదు. నేనేం చేయాలి? ఏమీ చేయలేకపోయానని బాధపడుతున్నాను. నా ఈ దుఃఖాన్ని నేనిచ్చిన దానిని ప్రేమతో స్వీకరించి అణచివేయి. నువ్వు చేసిన ఉపకారాలకు ఇది సమానం కాదనడానికి ఇంకో కారణం కూడా వుంది. నువ్వు నాకు సుగ్రీవుడితో స్నేహం కుదిర్చి గొప్ప ఉపకారం చేశావు. అప్పటినుండి నీకెలా ప్రత్యుపకారం చేయాల్నా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఇది రెండోది. ఈ రెంటికీ నేనిచ్చిన అల్పం ఎలా సమానం కాగలదు? కాబట్టి హెచ్చు, తక్కువలు ఆలోచించకుండా నేనిచ్చిన అల్పాన్ని ప్రేమతో స్వీకరించు" అన్నాడు రాముడు.

(కౌగిలి ఇవ్వడం అంటే తనను తాను సమర్పించుకొనడమే. ఆత్మాత్మీయనిక్షేపం అన్నట్లుగా తనను సమర్పించుకోవడం, అంటే, తనకున్న సర్వస్వాన్ని,అంటే, నిత్యవిభూతి, లీలావిభూతి రెండూ అర్పించినట్లే. వీటితో ఆయనకేం ప్రయోజనమంటే, ఆయనకు ప్రియమైనది ఇస్తేనే కదా, ప్రయోజనం అనవచ్చు. హనుమంతుడికి ప్రియమైంది శ్రీరామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహమే. పరస్వరూపంతో ఆయనకు పని లేదు. ఎవరికేది ప్రియమో దానినే భగవంతుడు వాడికిస్తాడు. కాబట్టి ఆ దివ్యమంగళ విగ్రహం మీద హనుమంతుడికి ప్రీతి అని తెలిసి రాముడు దాన్నే ఇచ్చాడు. దాంతో హనుమంతుడు తృప్తి చెందాడు).

ఆ తరువాత శరీరం పులకరిస్తుంటే రామచంద్రమూర్తి ఆంజనేయుడిని నిండుమనస్సుతో కౌగలించుకుని సుగ్రీవుడిని చూసి ఇలా అన్నాడు. "జానకీదేవిని వెతికే పని చక్కబడింది. కాని సముద్రాన్ని తలచుకుంటే దిగులుగా వుంది. దాటడానికి సాధ్యపడని సముద్రాన్ని దాటి, వానరులందరూ దక్షిణ దిక్కు తీరానికి చేరే ఉపాయం నీకేమైనా తెలిస్తే చెప్పు. వానరులారా! సీత ఎక్కడున్నది? ఎలా వున్నది? అనే విషయం మీరు చెప్తే విన్నాను. అక్కడికి మనం పోవాలికదా? పోయే మార్గంలో సముద్రాన్ని దాటాలికదా? మీరంతా ఆ సముద్రాన్ని ఎలా దాటాలో ఉపాయం వుంటే చెప్పండి". ఈ విధంగా వానరులకు చెప్పి, రామచంద్రమూర్తి ఆంజనేయుడితో కలిసి ఆలోచన చేశాడు.

సర్గ–2
శ్రీరాముడికి ఉత్సాహం కలిగేట్లు మాట్లాడిన సుగ్రీవుడు

సముద్రాన్ని దాటడం ఎలా అని విచారపడే శ్రీరామచంద్రమూర్తిని చూసి సుగ్రీవుడు ఆయనకు ధైర్యం కలిగించే మాటలను ఇలా చెప్పాడు. "రాజకుమారా!నువ్వు క్షత్రియుడివైనప్పటికీ, ఉత్సాహం లేకుండా సామాన్యుడిలాగా ఎందుకు ఆలోచిస్తున్నావు? కృతఘ్నుడు స్నేహాన్ని వదిలినట్లు నువ్వు దుఃఖాన్ని వదిలిపెట్టు.ఇప్పుడేమైందని నువ్వు బాధపడ్తున్నావు? నీ విచారానికి కారణం ఏంటో చెప్పు. ఇంతదాకా పగవాడు ఎక్కడున్నదీ తెలియక విచారపడ్డాం. వాడున్న ప్రదేశం తెల్సింది. ఇక మనం పోయి మన బలం ప్రదర్శించి సముద్రాన్ని దాటి, లంకను ముట్టడించి, నీ విరోధిని చంపగలం. ఎందుకు అకారణంగా కలవరపడ్తావు?రామచంద్రమూర్తీ! కాగల విషయంలో నువ్వెంతో మంచి ఆలోచన చేయగల సామర్థ్యం వున్నవాడివి. ఆ ఆలోచనకూడా శాస్త్రానుసారం చేస్తావేకాని, శాస్త్రజ్ఞానం వున్నవాడివైనందున దానికి విరుద్ధంగా చేయవు. ఎందుకంటే నువ్వు పండితుల్లో శ్రేష్టుడివి. ప్రాజ్ఞులందరూ నీ బుద్ధిని స్తోత్రం చేస్తారు. ఇలాంటి నువ్వు శోకంతో బాధపడవచ్చా? నువ్వు సంకల్పించిన సీతాప్రాప్తి అనే ఫలానికి విరోధమైన శోకం అనే అధైర్యాన్ని విడిచిపెట్టు. లేకపోతే నీ కార్యం చెడిపోతుంది. కార్యసాధనమైన బుద్ధి సంపద వుందికాని, సహాయ సంపత్తి లేదని దుఃఖిస్తున్నావా?"

"అప్పుడే శత్రువులు రాబోయినారా? అని రాక్షసులు హెచ్చరికతో లేకుండా వుండగానే, వానరులు ఒక్కఫళాన వున్నట్లుండి సముద్రం దాటి, వానలేకుండా పిడుగులు పడ్డాయే! అని రాక్షసులు దిక్కుతోచక తికమకలాడుతుంటే లంక కోట గోడలు ఎక్కి, నీ శత్రువులను కలవరపడ చేస్తారు వానరసేనలు. ఈ వానర

సేనానాయకులందరూ చక్కగా ఆలోచించడంలో సమర్థులు. కేవలం ఆలోచన చేయడమే కాకుండా, దాన్ని నెరవేర్చే శక్తికలవారు. పరాక్రమవంతులం అనే గర్వం కలవారు. ఎంతకైనా తెంపుచేయగలరు. నీ కార్యాన్ని సాధించాలన్న ఉత్సాహంతో వున్నారు. నిప్పుల్లో దూకడానికి కూడా వెనుకాడరు. ఇక నీళ్ల విషయం మామూలే వాళ్లకు. వీళ్ల సంతోషం చూస్తుంటే యుద్ధాభిలాష బాగావున్నవారిలాగా కనపడుతున్నారు. అది శుభసూచకం. మనకు మేలు కలుగుతుంది. నా ఊహ వ్యర్థం కాదు.ఏ ఉపాయం చేస్తే పాపాత్ముడైన రావణుడిని యుద్ధంలో చంపి సీతాదేవిని తీసుకురావచ్చో ఆ మార్గాన్ని ధీరుడివై చేపట్టు. నువ్వు చేయాల్సినదంతా సముద్రాన్ని దాటి లంక చేరడానికి ఏం చేయాలన్న ఆలోచనే. లంక కనబడితే ఇక రావణుడు చచ్చినట్లే. రామచంద్రా! ఒకటి మాత్రం నిశ్చయం. సేతువు కట్టకుండా సముద్రాన్ని దాటడం దేవతలకైనా సాధ్యంకాదు. సేతువే ఏర్పాటైతే వానరులు సముద్రాన్ని దాటడం శత్రుసంహారం చేయడం తథ్యం. ఆ విషయంలో నువ్వు సందేహించాల్సింది లేదు. ఎందుకంటే ఈ వానరులు కామరూపులు. యుద్ధంలో శూరులు. కలహానికి భయపడరు. కాబట్టి నువ్వు దుఃఖాన్ని వదిలిపెట్టు. అది నీకు తగదు. శౌర్యం వున్నవాళ్లు పనులు చేయడాని అధైర్యపడరు".

"సముద్రం దాటడం అసాధ్యకార్యమని నువ్వు బాధపడడం లేదని అంటావా? సీతను చూడడానికి నోచుకోలేదు కదా అని దుఃఖపడతానంటావా...అది కూడా సరైందికాదు. బలంలో అసమానులైన నీలాంటి మహాత్ములు, మొదలంటా నాశనమైనవారికి, కించిత్కాలం కనబడనివారికి ఏ సందర్భంలోనూ కలతచెందరు.ఎందుకంటే దుఃఖం సమస్తకార్యాలను నాశనం చేస్తుంది. ఇది తెలిసిన నువ్వు దుఃఖాన్ని వదిలి ధైర్యంగా వుండు. నువ్వేమో అన్ని విధాలైన శాస్త్రసమూహాల్లో,బుద్ధిమంతుల్లో అసమానుడివి. పరిపూర్ణుడివి. పండుతుడివి. ఏ లోపంలేని పరాక్రమవంతుడివి. ఇలాంటి నువ్వు రాజేంద్రా! ఈ సమయంలో నాలాంటి స్నేహితుల సహాయంతో శత్రువుల గర్వం అణచడానికి సిద్ధంకావాలే కాని ఏడ్వాల్సిన అవసరం లేదు. చేతిలో విల్లు ధరించి నిలబడిన నీకు ఎదిరించి యుద్ధం చేయగల వాడు ముల్లోకాల్లో లేడు. ఇలాంటి నాయకుడిగా వున్న నీకు సైన్యంగా బలవంతులైన వానరులున్నారు. వాళ్లు చేయతలపెట్టిన పనికి కీడు ఎన్నడూ కలగదు. కాబట్టి ఎలాగైనా సముద్రాన్ని దాటుతావు. నీ ప్రియురాలిని శీఘ్రంగా చూస్తావు. నువ్విలా ఏడుస్తుంటే శత్రువులు భయపడరు. కాబట్టి

ఏడుపు ఆపుచేసి కోపం తెచ్చుకో.కోపమున్నవారికి ఉత్సాహం లేని అదృష్టహీనులైన రాజులు భయపడతారు. మాతో సహా నువ్వు సముద్రాన్ని దాటే ఉపాయం ఆలోచించు. సముద్రపు దక్షిణతీరాన వానరులు చేరగానే శత్రువులు నాశనమైనట్లే. వాళ్లు రాళ్లవానతో, చెట్లవానతో శత్రుసమూహాలని ధ్వంసం చేస్తారు. కాబట్టి సహాయసంపత్తికి, సాధనసంపత్తికి కొరతలేదు. ఏ విధంగానైనా సముద్రాన్ని దాటాలి. అంతవరకే కష్టం. ఆ పని జరుగుతే రావణాసురుడు యుద్ధంలో చనిపోయినట్లేనని నా అభిప్రాయం. రామచంద్రా! నీకు ఎలాగైనా జయం కలుగుతుంది. శుభశకునాలు నాకు కనపడుతున్నాయి. నా మనస్సుకు సంతోషం కలుగుతున్నది. ఇది గొప్ప శుభ చిహ్నం".

సర్గ-3

లంకలోని దుర్గాల గురించి హనుమంతుడిని అడిగిన శ్రీరాముడు

యుక్తియుక్తంగా సుగ్రీవుడు చెప్పిన మాటలు విన్న రామచంద్రమూర్తి, వాస్తవార్థం తెల్సినవాడైనందున, హనుమంతుడితో, "హనుమంతా! నువ్వు లంకానగరాన్ని కళ్లారా చూశావుకదా! దానిలో కోటలెన్ని వున్నాయి? సైన్యం ఎంతమేరకు వుంది? చెప్పు. లంకకు ద్వారాలెన్ని? కోటలెన్ని? వాటిని ఏవిధంగా కట్టించారు? రాక్షసుల ఇండ్లు ఎన్ని? వాటిని రక్షించడానికి ఎలాంటి ఉపాయం చేశారు? ఇవన్నీ చెప్పు. తీరిగ్గా లంకంతా తిరిగి చూశావు కదా? అన్నింటికీ సమర్థుడివి కాబట్టి నీకీ విద్య కూడా తెలిసే వుండాలి! వివరంగా చెప్పు" అని అన్నాడు.

రామచంద్రమూర్తి తనని ఇలా అడగ్గా హనుమంతుడు, "దేవా! లంక గొప్పదనం, దానిలోని కోటల, సేనల ఏర్పాటు, రథగజాది వాహనాలకు కట్టబడ్డ ఇండ్ల విధానం, సముద్రం భయంకరత్వం, శత్రువులను చంపడానికి చేయబడ్డ రహస్య ఏర్పాట్లు, రావణాసురుడిమీద రాక్షసులకున్న భక్తి, సర్వం చెప్తావిను. రాజేంద్రా!లంకాపురంలో అందరూ సంతోషంగా వుండేవారే. లంకంతా మదించిన ఏనుగులతో, పెద్ద రథాలతో, బలమైన గుర్రాలతో, రాక్షస సమూహాలతో నిండి వుంటుంది.లంకకు నలుదిక్కులా నాలుగు ద్వారాలున్నాయి. వాటి ద్వారాలను అడ్డగడియ చెట్లతో బంధించి వుంచారు. ఆ ద్వారాలలోని రాతి యంత్రాలతో ఆ మార్గాన వచ్చిన విరోధిసైన్యం అక్కడే చచ్చిపోతుంది. రాక్షసులు నిర్మించిన శతఘ్నులు వేటుకు వందమందిని చంపగలవు. అవి ద్వార-ద్వారాన విశేషంగా ఏర్పాటుచేయబడి వున్నాయి. బంగారు కెంపులు, వైడూర్యాలతో మధ్య-మధ్యన పొదుగబడిన కోటగోడలను

పగులగొట్టి లోపలికి పోవడం సాధ్యపడదు. ఆ పట్టణం చుట్టూ మిక్కిలి భయంకరమైన మొసళ్లతో నిండి చాలా లోతులో నీరున్న కందకాలున్నాయి. చల్లటి నీటితో, చేపలతో నిండిన ఆ కందకాలు చూడడానికి మనోహరంగా వుంటాయి.ద్వారాలలో ఆ కందకాలమీద ప్రజల రాకపోకలకు అనుకూలంగా వుండే విధంగా వెడల్పాటి వంతెనలున్నాయి. శత్రువులు వచ్చినప్పుడు యంత్రాలను తిప్పితే, ఆ వంతెనలు లేచి కోట ద్వారాలకు తలుపుల్లాగా అడ్డుపడతాయి. అక్కడ ఇండ్ల వరసలున్నాయి. అవికూడా ఆ పలకల వంతెనల్లాగే శత్రువులు వచ్చినప్పుడు లంకాపురాన్ని రక్షిస్తాయి. ఆ పలకల వంతెనలను యంత్రాలబలంతో పని లేనప్పుడు నీళ్లమీద వదులుతారు. శత్రువులు వచ్చినప్పుడు యంత్రాలతో చేదుకుంటారు. ఆ నాలుగింటిలో అరుగులు, బంగారు స్తంబాలు కలదై, బిగువు కలదై, గట్టిగా పాదుకొని కదిలించలేనిదైన ఒక వంతెన ఉత్తర ద్వారంలో వుంది. అది సైన్యాన్ని విమర్శించడానికి రావణుడు వచ్చినప్పుడు వాడికి విశ్రమ స్థానమై వుంటుంది".

"రావణాసురుడు ఎంతో హెచ్చరిక, ఆలోచన కలిగినవాడు. స్వస్వభావయుక్తుడై ఎల్లప్పుడూ ఒక్కరిమాటలమీదనే ఆధారపడివుండక, తానే యుద్ధాసక్తుడై,సేనాసమూహాలను విమర్శగా చూస్తుంటాడు. ఇంకా లంకా మహాత్త్వాన్ని గురించి చెప్తా విను. లంకలో జలదుర్గం, కృత్రిమ దుర్గం, పర్వత దుర్గం, వనదుర్గాలనే నాలుగు రకాల భయంకర దుర్గాలున్నాయి. ఇవి ఇతరులకు సాధ్యపడవు. లంక నిరాధారంగా సముద్రతీరంలో వున్నది. దానిలోకి ప్రవేశించడం దేవతకు కూడా సాధ్యంకాదు. నావలు కూడా దాని సమీపంలోకి పోవడానికి దారిలేదు. పర్వత శిఖరం అమరావతిలాగా వుంది. బయటి వార్త లోపటికి పోవడం కానీ, లోపలివార్త బయటికి రావడానికి కానీ వీలుకాదు. ఏనుగులు, గుర్రాలు అనేకం వున్నాయి. గొప్ప యంత్రాలు, నానారకాల అగడ్తలు, శతఘ్నులు వున్నాయి. జయించడానికి ఏదీ సాధ్యపడదు. దీనిని రావణుడు పాలిస్తున్నాడు. ఇక సైన్య సన్నివేశాన్ని చెప్తా విను. తూర్పునుండి సైన్యం రావడానికి వీలుపడదు. ఆ ద్వారంలో పదివేలమంది రాక్షసులు సైన్యానికి ముందు నిలిచి యుద్ధంచేయడానికి సిద్ధంగా వుంటారు ఎల్లప్పుడూ. దక్షిణద్వారందగ్గరశూలాలుధరించినశూరులు,అజేయులు,పరాక్రమవంతులు లక్షమంది రాక్షసులు నాలుగు రకాలైన (రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలిబంట్లు) సేనలతో కాపలాకాస్తుంటారు. పడమటి వాకిట్లో పదిలక్షలమంది

రాక్షసులు డాలులు, తరవారులు ధరించి కాపలాగా వుంటారు. వీరికి అస్త్రవిద్యకూడా తెలుసు. ఉత్తరద్వారం దగ్గర పది అర్బుదాల గొప్ప వంశంలో పుట్టిన రాక్షసులు ఏనుగులు, గుర్రాలు వాహనాలుగా రక్షిస్తుంటారు. వీరంతా రావణుడికి పూజ్యులు, విశ్వాసపాత్రులు".

"ఇది నేను లంకను మొదట చూసినప్పుడున్న విధానం. ఇప్పుడెలా వున్నదో తెలియదు. ఎందుకంటే వంతెనలన్నింటినీ పాడుచేశాను. గట్టివంతెన ఒక్కటీ లేదు. పాతికవంతుసైన్యాన్ని పాడుచేసాను. అగడ్తలు పాడుపడేట్లు చేశాను. కోటగోడల దుమ్ము లేపాను. ఇప్పుడు లంకలోకి పోవడానికి అన్నీ దారులే. ఏ కంతలోనుండైనా దూరి పోవచ్చు. రామచంద్రా! లంక ఎంత ధృఢంగానైనా వుండవచ్చు. ఎంతమందైనా రక్షించవచ్చు. ఎలాగైనా సముద్రాన్ని దాటితే వానరుల చేతిలో లంక నాశనమైనట్లే అని నమ్ము. వానరసేన అంతా పోవాల్సిన పనికూడా లేదు. అంగదుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, నీలుడు, మైందుడు, పనసుడు, నలుడుమాత్రం సముద్రాన్ని దాటగలిగితే, లంకలోకి ప్రవేశించి, పర్వతదుర్గాలను, వనదుర్గాలను విరిచి, ద్వారాలు పాడుచేసి, ప్రాకారాలను పొడిచేసి, ఇండ్లన్నీ దుమ్ములో కలిపి రాగలరు. వీరినైనా పంపు. ప్రయాణానికి మంచి ముహూర్తం ఏర్పాటుచేయి".

సర్గ-4
కపిసేనతో లంకమీదికి దండయాత్రకు బయల్దేరిన శ్రీరాముడు

ఇలా చెప్తున్న హనుమంతుడి మాటలను మొదటినుండి చివరివరకూ విన్న రామచంద్రమూర్తి ఈ విధంగా అన్నాడు. "లంకను పాడుచేయడం పెద్ద పనికాదని భావిస్తున్నాను. రావణాసురుడి పురాన్ని ధ్వంసం చేస్తాను. సత్యం చెప్తున్నాను. ప్రయాణానికిదే మంచి ముహూర్తం. అంతే కాదు, సూర్యుడు ఆకాశం మధ్యలో వున్నాడు. ఈ ముహూర్తానికి విజయం అని పేరు. ఇది మంచి ముహూర్తం. సుగ్రీవా! ఇప్పుడు మనం బయల్దేరి పోతే పగవాడు జానకిని తీసుకుని ఎక్కడికి పోగలడు? ఎక్కడికి పోయినా చస్తాడు. ఈ ముహూర్తానికి "అభిజిత్" అని పేరు. (పగటి పదహారు ముహూర్తాలలో-ముహూర్తానికి ముక్కాలు గంట కాలంలో-ఎనిమిదవది అభిజిత్. అంటే, పదకొండు గంటల పదిహేను నిమిషాలు నుండి పన్నెండు వరకు అభిజిత్). నేను దండయాత్రకు బయల్దేరడం త్రిజటాదులు చెప్పగా విన్న నా ప్రియురాలు బతకడానికి ఆశ కలుగుతుంది. ఒక్కరోజుతో పోయిందేమిటి? రేపు పోదామంటావా? సుగ్రీవా! ఈ రోజు ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. నా జన్మ నక్షత్రానికి ఆరవది కాబట్టి శుభం కలుగుతుంది. రేపు చంద్రుడు హస్తతో కూడి ఏడవతారై ధనతార అవుతుంది. అది అశుభం. రేపు ప్రయాణం చేయకూడదు. కాబట్టి ఈ రోజే సైన్యంతో సహా ప్రయాణం చేయాలి. మంచి శుభశకునాలు కనపడుతున్నాయి. కాబట్టి రావణుడిని చంపి సీతను తేవడం సత్యం. శత్రువులను నాశనం చేసి,జయం పొంది, అవమానాన్ని పోగొట్టుకుంటావని చెప్పేవిధంగా కంటిపైభాగం అదురుతున్నది. ప్రయాణం చేయడానికి ఇదే సరైన సమయం".

(ఈ రోజు ఉత్తర నక్షత్రం అనీ, దానితో చంద్రుడు కూడి వున్నాడనీ, చెప్పడం వల్ల ఇది ఫాల్గుణమాసం కాబట్టి పౌర్ణమి అని అర్థం చెసుకోవాలి. చదుర్దశి నాటి సాయంకాలం రామాంజనేయ సమాగం అయింది. కాబట్టి పౌర్ణమి నాడు దండయాత్ర. అభిజిత్ లో ప్రయాణం చేయడానికి తిథితో పని లేదు).

సుగ్రీవుడు, లక్ష్మణుడు తనను ప్రేమతో కొలుస్తుండగా, నీతిశాస్త్రం చక్కగా తెలిసిన శ్రీరామచంద్రుడు సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

"మొట్టమొదట సేనగా మహా బలవంతులైన, వేగంగా పోగలిగిన, నూరు వేల వానరులను దారి కనుక్కోవడానికి సేనానాయకుడైన నీలుడి వెంట పంపు. వీరు బలవంతులు కాకపోతే శత్రుభయం కలుగుతుంది. వేగవంతులు కాకపోతే పెద్ద సేన వచ్చి కలుస్తుంది. ఈ రెండూ సరైనవి కావు. నీలా! వానరులకు ఆహారాలైన మంచి ఫలాలు, మూలాలు, చల్లటి నీళ్లు,విస్తారంగా తేనె లాంటివి వారు దారిలో తీసుకుంటానికి వారికి సమకూర్చు. నువ్వొక విషయంలో జాగ్రత్తగా వుండాలి. ఏమిటంటే, రాక్షసులు దారిలో పొంచి వుండి తటాలున మీద పడతారు. దుష్టబుద్ధులు కాబట్టి వీరికి ఆహారంగా వున్న పదార్థాలలో విషం కలుపుతారు. అందుకే ఇలాంటి భయం లేని దారిలోనే సేనలను నడిపించు. మీరు పోయేటప్పుడు ఇంకోటి కూడా కనిపెట్టాలి. మనం పోయేటప్పుడు తటాలున మీద పడడానికి శత్రువులు జలదుర్గాలలో, అడవుల్లో చెట్లచాటున, గుంతల్లో, బొరియలలో దాక్కుని వుంటారు. కాబట్టి ఇలాంటివారిని వానరులు పైన ఎగురుతూ కనిపెట్టాలి".

"నీలా! బలపరాక్రమాలు కలవారే యుద్ధం చేయడానికి అర్హులు. కాబట్టి నీ సైన్యంలో బలహీనులుంటే, వాళ్లను కిష్కింధకు పంపు. వాళ్లెందుకు రావాలి? ఎందుకు చావాలి?సేనానీ! సముద్రం ఏరులాగా ప్రవహించే రీతిలో నూరువేలమంది వానరులను ముందుగా పంపు. ఆ సేనలో గజుడు, గవాక్షుడు, గవయుడు, ఆవులలో కోడెల్లాగా ముందు పోవాలి. కుడి పార్శ్వంలో రక్షించడానికి ఋషభుడు సైన్యంతో పోవాలి. ఎడమవైపున రక్షించడానికి మదించిన ఏనుగు బలంకల గంధమాదనుడు వానరులతో పోవాలి. అందరికీ నేను కనపడేట్లు వారి సంతోషం మేరకు ఐరావతం ఎక్కిన ఇంద్రుడిలాగా నేను హనుమంతుడి మీద ఎక్కి సైన్యం మధ్యలో వస్తాను. ప్రభువు అందరికీ కనపడుతుంటే సేనలో ఉత్సాహం కలుగుతుంది. సార్వభౌమమనే తన ఏనుగు

మీద కుబేరుడు ఎక్కినట్లు అంగదుడిమీద ఎక్కి లక్ష్మణుడు వస్తాడు. సేనల మధ్యభాగాన్ని సుశేణుడు, జాంబవంతుడు, వేగదర్శి రక్షించాలి".

రామచంద్రమూర్తి ఇలా చెప్పగా, సుగ్రీవుడి ఆజ్ఞ మేరకు గుహలనుండి, పర్వత శిఖరాలనుండి, భూమ్యాకాశాలు దద్దరిల్లేట్లు భయంకరంగా బయల్దేరారు వానరులు. రామచంద్రమూర్తి లక్ష్మణ సుగ్రీవులతో కలిసి సంతోషంగా, అతివేగంగా, దక్షిణ దిక్కుగా ప్రయాణం చేశాడు. శ్రీరాముడి వెంట వానర సైన్యం నడిచింది. ఎవరికివారు తామే రావణుడిని చంపుతామని అన్నారు. సైన్యానికి ముందు తోవలను పరీక్షించేటందుకు కుముదుడు, నీలుడు, ఋషభుడు తదితరులు పోయారు. మహాబలవంతుల మధ్యన రామలక్ష్మణసుగ్రీవులు పోయారు. శతవలి పదికోట్లమంది వానరులతో సేనకంతా కాపలాగా తిరుగుతున్నాడు. వేయివేల వానరులతో బనసుడు, అర్కుడు, గజుడు, కేసరి పార్శ్వాలను రక్షించసాగారు. జాంబవంతుడు ఎలుగులతో సేనామధ్యభాగాన్ని రక్షించసాగాడు. ఆయనకు సహాయంగా సుషేణుడున్నాడు.

సుగ్రీవుడు ముందు పోతున్నాడు. త్వరగా నడవమని వానరులను ప్రోత్సహించారు. అలా వేగిరపెట్టుతూ రంభుడు, దరీముఖుడు, రభసుడు, ప్రజంఘుడు వారితో పోయారు. ఇలా పోయి గొప్ప సరస్సులతో, వనాలతో కూడిన సహ్యపర్వతం చేరారు. వానరులెవరూ గ్రామాలలో కానీ, జనావాసాలలో కానీ, వాళ్లకు చెందిన సాగు భూముల్లోకానీ పోకూడదని రామచంద్రమూర్తి కఠినమైన ఆజ్ఞ జారీచేసినందున ఆయనకు కోపం కలుగుతుందేమోనని భయంతో వానరులు జనసంచారం లేని మార్గాలలో, అడవుల్లో పయనించారు. సముద్రధ్వనితో సమానమైన ధ్వనితో సముద్రం పొంగి వెల్లువగా మారిన విధంగా వానరసేన చక్కగా తోలబడ్డ గుర్రాల దండు వేగంలాగా రామచంద్రమూర్తి పక్కనే నడిచాయి. హనుమ, అంగదులు మోసుకుని పోతున్న రామలక్ష్మణులు గురుశుక్రులతో కూడిన సూర్యచంద్రుల్లాగా పోయారు.

శుభశకునాల గురించి శ్రీరాముడితో చెప్పిన లక్ష్మణుడు

అంగదుడి భుజాలమీద కూర్చున్న లక్ష్మణుడు రామచంద్రమూర్తితో అన్నాడిలా. "అన్నా! రావణుడపహరించిన సీతాదేవిని మళ్లీ నువ్వు తీసుకుని

వస్తావు. ఇది నిజం. భూమ్మీద, ఆకాశం మీద, కనిపించే శుభశకునాలు కార్యసిద్ధి తెలియచేస్తున్నాయి. అన్నా! అనుకూల వాయువులు మన సైన్యం మీద మృదువుగాను,హితకరంగాను, సుఖకరంగాను, మెల్లగాను వీస్తున్నాయి. వినడానికి ఇంపైన ధ్వనులతో మృగాలు, పక్షులు ధ్వనిస్తున్నాయి. దిక్కులన్నీ ప్రసన్నంగా వున్నాయి. సూర్యుడు నిర్మలంగా ప్రకాశిస్తున్నాడు. వేదమూర్తైన సూర్యుడు దుష్టగ్రహ సంగతిలేని శుక్రుడిని కూడి మనకు అనుకూలంగా వున్నాడు. సప్తర్షులు ధృవుడిని ప్రదక్షణ చేస్తున్నారు. మన వంశకూటస్థ పురుషుడు త్రిశంకుడు అక్కడున్న సప్తర్షి మండలంలో వశిష్టుడితో కలిసి ప్రకాశిస్తున్నాడు.

(రాముడి అవతార కాలంలో జాతకఫలాలు సూచించినట్లే, దండయాత్రాకాలంలో గోచార ఫలాలు రాక్షసుల విపరీత పరిణామానికి సూచనలు అయ్యాయి.రాముడు కిష్కింధకు ఆగ్నేయంగా వున్న లంకకు ప్రయాణమై పోతున్నాడు. అప్పుడు శుక్రుడు అనుకూలంగా, వెనుక వున్నాడని చెప్పడం జరిగింది. శుక్రుడు తరచుగా సూర్యుడున్న రాశికి ముందు రాశిలో వుంటాడు. రాముడు బయల్దేరింది ఫాల్గున మాసం పౌర్ణిమ నాడనే చెప్పడం జరిగింది. అప్పుడు సూర్యుడు మీనరాశిలో వున్నందున శుక్రుడు మేషరాశిలో వున్నట్లు భావించాలి. రాముడి జన్మరాశి కర్కాటం. దానికి పదవరాశైన మేషంలో శుక్రుడు వుండడం రాముడికి అనుకూలం. వెనుక శుక్రుడు వుండడం కూడా అనుకూలమే. శుక్రానుకూలత చెప్పడం వల్ల బృహస్పత్యాది అనుకూలత కూడా వుంది. బృహస్పతి శ్రీరాములవారి జన్మకాలంలో కటకరాశిలో వున్నాడు. ఇతడికి ఒక్కోరాశిలో ఒక్కొక్క సంవత్సరం నివాసం కాబట్టి పన్నెండేళ్లకు పన్నెండు రాశులను చుట్టి వస్తాడు. అలా మూడుసార్లు చేస్తే ముప్పయ్యారు సంవత్సరాలు గడిచాయి. ముప్పైఎనిమిదో ఏట రాముడి దండయాత్ర.

ఆ ఏడు బృహస్పతి రామరాశి, ద్వితీయ రాశైన సింహంలో వున్నాడు. గురువు రెండో ఇంట వుండడం అనుకూలం.రామజన్మకాలంలో శని తులావర్గోత్తమంలో వున్నాడు. శనికి రెండున్నరేళ్లు ఒక రాశిలో నివాసం. తులనుండి పన్నెండు రాశులు చుట్టిరావడానికి ముప్పై సంవత్సరాలు గడుస్తాయి. ముప్పై రెండున్నర దాకా తులలోను, ఆ పైన రెండున్నర వృశ్చికంలోను, ఆపైన రెండున్నర ధనస్సులోను వుండి ఆపైన అంటే, ముప్పై ఏడున్నర ఏళ్ల తరువాత మకరానికి

పోవాల్సినప్పటికీ వక్రతాదులవల్ల ధనస్సులోనే వున్నాడని అర్థమవుతున్నది. రామావతారకాలంలో రాహువు సింహరాశిలో వున్నాడు. రాహువుకు ప్రతిరాశిలోను ఒకటిన్నర సంవత్సరం నివాసం. అప్రదక్షిణ సంచారం. అక్కడినుండి ముప్పెఎనిమిదో ఏట కటకరాశిలో వుండాల్సినవాడు అతిచారాదులవల్ల మిథునరాశిలో వున్నాడని అనుకోవాలి. రాహువుకు ఏడవ ఇంట కేతువు నివాసం. కాబట్టి ఇప్పుడు ధనస్సులో కేతువున్నాడు. ధనస్సు కర్కాటక రాశికి ఆరోది. అక్కడున్న శనికేతువులు రాముడికి అనుకూలురు. బుధుడు రాముడికి పదవ రాశిలో వున్నాడు కాబట్టి అనుకూలుడు. చంద్రుడు ఉత్తరఫల్గుణితో చేరి వున్నాడు కాబట్టి కన్యారాశిలో వున్నట్లు లెక్క. అప్పటికి తృతీయ చంద్రుడు కాబట్టి రాముడికి అనుకూలుడు. మీనంలో వున్న సూర్యుడు కటకానికి తొమ్మిదో ఇంట వున్నాడు కాబట్టి అనుకూలుడు. మిథునంలో వున్న రాహువు కటకానికి పన్నెండో ఇంట వుండడంవల్ల రాముడికి కొంచెం బాధకలిగిస్తాడు. ఇలా రాముడికి అనుకూలమైన గోచార ఫలాలు కనపడుతున్నాయి.

ఈ గోచారం జన్మరాశినిబట్టి చూపించింది. చంద్రరాశినిబట్టి చూడలేదు. అలాగే ఈ గోచారం రాక్షసులకు విపరీత ఫలమైందిగా వుంది. రాక్షసుల నక్షత్రం మూల.దానికి సంబంధించింది ధనూరాశి. ఇదే రాక్షసుల రాశి. దీనికి ఐదో ఇంటిలో వున్న శుక్రుడు ప్రతికూలుడు. జన్మరాశి ధనస్సులో వున్న శనికేతువులు ప్రతికూలురు. దానికి ఏడవ ఇంట వున్న రాహువు కొంచెం అనుకూలుడు. పన్నెండో ఇంట వున్న అంగారకుడు ప్రతికూలుడు. తొమ్మిదవ ఇంట వున్న గురువు అనుకూలుడు. నాలుగో ఇంట వున్న సూర్యుడు, అయిదో ఇంట వున్న బుధుడు అనుకూలురుకారు. పదవ ఇంట వున్న చంద్రుడు కొంచెం అనుకూలుడు. ఇందులో కొంచెం ఈ విధంగా అనుకూలంగా వున్నప్పటికీ విశేషభాగం ప్రతికూలంగా వుంది. కాబట్టి రాక్షసులకు ఈ గోచారం విపరీత ఫలితాన్నే ఇస్తుంది).

"మన ఇక్ష్వాకు వంశతార విశాఖ. అదెలా నిర్మలంగా, ఉపద్రవం లేకుండా ప్రకాశిస్తున్నదో చూడు. ఇక ఈ గ్రహాలు మన శత్రువులకు ఎలా పనిచేస్తాయో చెప్తా విను. రాక్షసుల నక్షత్రం మూల. దాన్ని ధూమకేతువు పీడిస్తున్నది. ఎన్ని విధాల ఆలోచించినా ఆ నక్షత్రం వాళ్లకు చేటు చెప్తున్నది. వాళ్లు నాశనమైపోయే

కాలం సమీపించింది. మరణం సమీపించినవారి నక్షత్రం క్రూరగ్రహాల పీడనకు గురై మరణకాలం తెలియచేస్తుందని శాస్త్రజ్ఞులు అంటారు. అలాంటి చిహ్నాలు వైరులలో కనపడుతున్నాయి. మనమార్గంలో సరస్సుల్లో నీళ్లు పుష్కలంగా వున్నాయి. అడవులన్నీ పూసివున్నాయి. ఘుమ్మని, కమ్మని వాసనలొస్తున్నాయి. ఈ ఋతువులో పూయాల్సిన చెట్లు పూచాయి. తారకామయమనే భయంకర యుద్ధంలో దేవసేనలాగా మనసేన ప్రకాశిస్తున్నది. కాబట్టి మనకు నిస్సందేహంగా విజయం చేకూరుతుంది".

ఈ విధంగా శకునాలు తెలుపుతూ లక్ష్మణుడు అన్నకు సంతోషం కలిగే విధంగా చెప్తుంటే రామచంద్రమూర్తి సైన్యాన్ని వేగంగా నడిపించాడు.

ప్రయాణమై పోయిన కపిసేనలు

మబ్బులు ఆకాశాన్ని మరుగుపరిచిన విధంగా వానరసేనలు అడవులు, కొండలతో నిండిన దక్షిణ దిక్కును కప్పగా వాళ్ల కాళ్లుచేతుల దెబ్బలకు రేగిన దుమ్ము సూర్యప్రకాశం పోయేట్లు లోకమంతా వ్యాపించింది. గుంపుగా వానరసేనలు ఒకదాని వెంట మరొకటి పోతున్న కారణాన, ఏరులు, వంకలు, వాగులు యథాప్రకారం పారడానికి వీలుకానందున ఎంతో దూరం వరకు ఎదురుగా పారాయి. వానరప్రముఖుల సేనాసమూహాలు నిర్మలమైన సరోవరాల్లో చల్లటి నీరుండడం వల్ల మధ్యలో ఆవరించాయి. చెట్లతో నిండిన పర్వతాలలో చెట్లు అడ్డంగా వుండడంవల్ల అడ్డంగా ఆవరించింది. సమంగా వున్న నేలల్లో అంతటా ఆవరించింది. మనోహరమైన పండ్లతో కూడిన అడవుల్లో పండ్లకోసం చెట్ల కిందుగా ఆవరించింది. ఆ సేనల్లోని వానరులు వారి-వారి సంతోషం, పరాక్రమం, బలం అతిశయించేట్లు, యౌవనం వల్ల కలిగిన గర్వం, విలాసం, పరాక్రమానికి తగ్గట్లు సింహనాదాలతో దిక్కులు నిండేట్లు చేశారు. కొందరు వానర శ్రేష్ఠులు కిలకిలారావాలు చేశారు. కొందరు ధ్వనిచేస్తూ గంతులు వేశారు.

ఇలా ఒక రాత్రి, ఒక పగలు విడవకుండా ప్రయాణం చేసి-చేసి, చెట్లతో, మృగాలతో నిండిన సహ్యం, మలయం అనే పర్వతాలను, బలిష్ఠమైన అడవులను, ప్రవాహాలను చూస్తూ పోతూ వానరులు కానుగచెట్లను విరిచారు. దారికడ్డంగా వచ్చిన యూడుగు చెట్లను, మామిడి చెట్లను, జువ్వి, పొగడ, నేరేడు

చెట్లను కూలదోస్తూ, విరుస్తూ వానరులు భయం లేకుండా సంచరించారు. వానరులు చెట్లకింద పోయేటప్పుడు అడవుల్లోని చెట్లు గాలికి కదిలి మంచి పరిమళాల పూలను వారిమీదకు కురిశాయి. చందనంలాగా చల్లని వాడై తుమ్మెదల ఝుంకారాలనే పాటలు పాడుతూ, మెల్లగా సుఖంగా తాకుతూ, శుభసూచకంగా గాలి అందమైన పరిమళాలతో అడవుల్లో వీచింది. వాయువు మహావేగానికి ధాతువులనుండి లేచిన పొడివల్ల పర్వతం విస్తారవానర సేనను ఇంకా అధికంగా చేసింది. (ఇవన్నీ శుభసూచకాలు). ఆ సహ్యపర్వతంలో మొగలి లాంటి చెట్లు వికసించి వున్నాయి. గంతులు పెట్టుకుంటూ పోతున్న వానరశ్రేష్టుల రాపిడికి కలిగిన బాధతో నానారకాలైన అడవిచెట్లు కాంతి చెడి చెదిరి కొండలమీద కనిపించాయి.

కొండలమీదున్న బావులు, చెరువులు, కుంటలు చల్లటి నీళ్ల చక్రవాకాలు నీటి కోళ్లు కలవై వున్నాయి. ఎక్కడ చూసినా పులులు, సింహాలు, ఎలుగులు, చిరుతలు, దున్నలు, పందులు కనబడ్డాయి. తామరలు, ఎర్రటి–నల్లటి–తెల్లటి కలువలు కలిగి సరస్సులు అందంగా కనబడ్డాయి. కొండచరియల్లో పక్షులు వినడానికి ఇంపుగా విశేషంగా కూయసాగాయి. అలాంటి ప్రదేశంలో వానరులు తృప్తిగా విహరించారు. దోసిళ్లకొద్దీ నీళ్లు తాగుతూ, మనసారా స్నానం చేస్తూ, దారిలో నడిచిన బడలిక తీరడానికి నీళ్లలో ఈదుతూ, ఒకరిమీద మరొకరి నీళ్లు చల్లుకుంటూ, తలలను నీళ్లలో ముంచుతూ, భయం ఏ మాత్రం లేకుండా ఇసుక దిబ్బలెక్కి పండ్లు తింటూ, ఎక్కడ చూసినా పింగళవర్ణం కల కోతులు వ్యాపించడం వల్ల దట్టంగా పండిన వరిపైరులాగా భూమి కనిపించింది. ఇంద్రసమానుడైన రామచంద్రమూర్తి మహేంద్రపర్వతంమీద ఎత్తైన శిఖరం ఎక్కి తాబేళ్లు, చేపలు అమితంగాకల సముద్రన్ని చూశాడు. మలయ పర్వతం, సహ్య పర్వతం దాటి సముద్రాన్ని సమీపించి, అక్కడ ఆంజనేయుడి మీదనుండి దిగి సముద్రతీరంలో వుండే వనం దాటి చెలియలి కట్ట దగ్గర అలలతో కడుగబడిన ప్రదేశానికి చేరారు.

కపిసేనతో సముద్ర తీరం చేరిన శ్రీరాముడు

రామచంద్రమూర్తి సుగ్రీవుడిని చూసి, "వానర రాజా! సముద్ర తీరం చేరాం. దీనికి రేవులు లేవు. లోతు విస్తరించి వుంది. దీన్నేదైనా గొప్ప ఉపాయం చేసి దాటాలే కాని మరేవిధంగా మన వానరసేన దాటడానికి సాధ్యపడదు. ఏం

చేయాలో ఆలోచించు. కిష్కింధలో మనకే విచారం కలిగిందో అదే ఇప్పుడు మళ్లీ కలిగింది. ఏదైనా ఒక ఉపాయం చేసి దీన్ని దాటాలికాని వ్యర్థంగా కాలం గడపకూడదు. (రావణాసురుడు జాగ్రత్తపడకముందే లంకమీద దాడి చేయాలనీ, అలా చేస్తే సంధికి దిగుతాడని రామచంద్రమూర్తి నమ్మకం). మనం ఈ విషయం ఆలోచన చేయాలి. వానరులందరికీ ఇక్కడే వారి-వారికి తగ్గట్లు బస ఏర్పాట్లు చేయి. శూరులైన నాయకులు తప్ప మరే కోతైనా, ఎంత పనున్నా జట్టునుండి విడిపోకూడదు. సేనలోనే వుండాలి. శూరులు మరుగు స్థలలో దాగి వుంటారు. వారెక్కడున్నారో తెలుసుకోవడానికి మాత్రం కొందరు వానరులు పోవచ్చు".

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా లక్ష్మణుడిని వెంట తీసుకుని సుగ్రీవుడు సేనలన్నింటినీ సముద్రతీరంలో రక్షకులతో సహా దిగాలని ఆజ్ఞాపించాడు. ఇంత పరిమాణం అని చెప్పడానికి సాధ్యపడని వానర సమూహం ఉప్పునీళ్ల సముద్రం సమీపంలో తేనెలాంటి పింగళ బలం కల సముద్రమా అన్నట్లు కనపడింది. వానర సేనల సన్నాహక సమూహం ధ్వని సముద్రధ్వనిని మింగింది. అప్పుడా సేన సుగ్రీవుడి ఆజ్ఞానుసారం మూడు విధాలుగా మెరిసింది. వానరులంతా ఒక గుంపుగా, ఎలుగులొక గుంపుగా, కొండముచ్చులు ఒక గుంపుగా విభజించడం జరిగింది.

సముద్రవర్ణన

దూరంగా తీరం కలది, రాక్షసులతో, మొసళ్లతో, గ్రాహాలతో కూడినది, సాయంకాలం సమయంలో మిక్కిలి భయంకరమైనది, నురుగురూపంలో నవ్వేది, అలల రూపంలో నాట్యం చేసేది, చంద్రోదయ సమయంలో వృద్ధిపొందేది, చంద్రుడి ప్రతిబింబంతో నిండేది, విశేషంగా తిమింగలాలు కలది, తుపానుగాలిలా తిరుగే మొసళ్లు కలది, రత్నాల, పడగల పాములతో ప్రకాశించేది, నీటికోతులు కలది, పెద్ద పర్వతాలతో పోవడానికి మార్గం లేనిదైన సముద్రాన్ని వానరులు చూశారు. వానరసేన ఆశ్చర్యంగా చూసిన ఆ సముద్రం ఎలా వుందంటే....మొసళ్లతో, పాముల పడగలతో ప్రవేశించబడినదై; గాలికి కదిలేదై; పడుతూ-లేస్తూ వుండే అలలతో నిండినదై; నిప్పుల పొడిలాగా భాస్వరంతో కలిసిన నీళ్లు, పెద్ద పాముకలదై; రాక్షసుల నివాస స్థానమై; భయంకరమై; పాతాళంలాగా విషమై; ఆకాశంతో సమానమై; అది ఆకాశమో,

సముద్రమో తెలియకుండా వున్నదై; ఆకాశం, సముద్రం కలిసిందా అన్నట్లుగా; తారకలనే మణులు, మణులనే తారకలు కలిసినదై; ఆకాశం, మేఘాలు కలిసినట్లు రెంటికీ భేదం తెలియనిదై; అలలు ఒకదానితో ఒకటి కలిసినదై; సముద్రరాజు మహాభేరులా అన్న విధంగా వుంది.

ఎక్కువ వేగంగా వీచే గాలి మూలాన కలతచెందిన అలల్లోని గొప్ప రత్నాలు, నీళ్లు ఒకదానితో ఇంకోటి కొట్టుకుంటుంటే పుట్టిన ధ్వని గలట్టి, జల జంతువులతో నిండినది, విడవకుండా వీచే గాలి వల్ల ఎగురగొట్టబడడం వల్ల ఆకాశాన్ని అంటుతున్నాయా అన్నట్లున్న అలలు, కదలుతున్న అలల ధ్వని గల సముద్రాన్ని వానరులు ఆశ్చర్యంగా చూశారు. విస్తార ధ్వని, పొరలి–పొరలి వచ్చే నురుగు కల సముద్రాన్ని చూడగా కల్లు తాగి కేకలు పెట్తూ నేలమీద పడి దేహం తెలియకుండా పొర్లుతూ నోట్లో చొల్లు కార్చే మూర్ఖుడిలాగా సముద్రం కనపడింది వానరులకు.

సర్గ–5

సీతను తలచుకుని దుఃఖించిన శ్రీరాముడు

రక్షకులున్న వానరసేనను సముద్రపు ఉత్తర తీరాన నలుడు దించాడు. శాస్త్రప్రకారం మైందద్వివిదులు ఏమరుపాటుగా నలుదిక్కులా కాపలా కాశారు. సముద్రతీరాన సేనలన్నీ ఏఏ సేన ఏఏ చోట దిగాల్నో ఆ విధంగానే దిగిన తరువాత రామచంద్రమూర్తి సముద్రానికి ఆవలి ఒడ్డున సీతాదేవిని తలచుకుని దుఃపడుతున్నాడు. సీతాదేవి దుఃఖిస్తున్నదని హనుమంతుడు చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకుని మరీ–మరీ దుఃఖించాడు. దుఃఖిస్తూ, తన పక్కన వున్న లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

"లక్ష్మణా! లోకంలో సాధారణంగా అందరిలో దుఃఖం కాలక్రమేణా క్షీణిస్తుంది. మొదలున్న దుఃఖం తరువాత కొన్నాళ్లకు తగ్గిపోతుంది. ఇది లోక సామాన్య విషయం. నాకేమో సీతను విడిచిన దుఃఖం నానాటికీ పెరుగుతున్నది కాని తగ్గడంలేదు. నాకు ప్రియురాలైన సీత ఎంతో దూరంగా వుందికదా అని నేను దుఃఖపడడం లేదు. రావణుడు ఆమెను దొంగిలించుకుని పోయేకదా అని నేను ఏడ్వలేదు. కమలాల లాంటి కళ్లున్న సీతాదేవి నా దగ్గర వున్నప్పుడు ఎంతో సంతోషంగా వుండేది. అలాంటి సంతోషం ఆమెకిప్పుడు లేకుండా కాలమంతా వ్యర్థం అయిపోతున్నది కదా అని దుఃఖపడుతున్నాను. నాతో వుండడమే ఆమెకు మహదానందం. నావల్ల ఆమెకు సంతోషం కలుగుతున్నదికదా అని నేనూ సంతోషించేవాడిని. అలాంటిదానికి విఘ్నం కలిగిందికదా అని దుఃఖపడుతున్నాను".

"వాయుదేవా! నువ్వు సీతాదేవి వున్న చోటుకు పోయి ఆమెను తాకు. దానివల్ల

ఇది రామచంద్రుడిని స్పృషించిన గాలికదా అని భావించి, నాదగ్గర నుండి వచ్చిన హనుమంతుడిని చూసి సంతోషించినట్లే ఆయన తండ్రివైన నిన్ను చూసి కూడా సంతోషిస్తుంది. అలా ఆమెను తాకి సంతోషింపచేసి మరల తిరిగివచ్చి నన్ను తాకితే నేనూ సంతోషిస్తాను. అప్పుడు నేను జానకిని తాకినవాడినవుతాను. ఇలాగే నేను జానకిని చూస్తున్నాను....జానకిని చంద్రుడిని చూస్తున్నది. ఆమె దృష్టులు చంద్రుడి మీద పడ్డాయి. నా దృష్టులు చంద్రుడిమీద పడ్డాయి. ఇద్దరి దృష్టులు చంద్రుడిలో కలుసుకున్నాయి. కాబట్టి నేనామెను, ఆమె నన్ను, చూసినట్లయింది. అలాగే నీమూలాన మేమొకరిని ఒకరం స్పృషించినట్లవుతుంది. అయ్యో నాకంత అదృష్టం కూడానా? రావణుడి చేతికి చిక్కుకుని చంద్రముఖి సీత ప్రాణేశ్వరా అని దుఃఖంతో ఏడుస్తూ అరిస్తే ఆ మాట నేను అనుకుని, విషం తాగినట్లు బాహ్య, అంతర్ ఇంద్రియాలు దహిస్తున్నాయి. నాయనా! చింత అనే జ్వాలలు కలదై వేర్పాటనే కట్టెల పోగుతో పెరిగిన మన్మథాగ్ని అన్ని వేళలా నన్ను మిక్కిలి కాలుస్తున్నది. నిన్ను చూస్తుంటే నాకు సీత జ్ఞాపకానికి వస్తున్నది. మీరిద్దరూ నన్ను విడవకుండా వుంటారు కదా? కాబట్టి నిన్ను కూడా వదిలి నేను సముద్రంలో హాయిగా నిద్రపోతాను. నిద్రపోయే వాడిని దుఃఖం ఏం చేస్తుంది? నీళ్లలో నిద్రపోతున్న నన్ను నీళ్లల్లో పుట్టిన కమలం బాణంగా కలవాడు నన్నెలా బాధిస్తాడు? నీళ్లమీద కమలంతో దెబ్బకొట్టే నీళ్లలో వున్నవాడికి నొప్పి కలుగుతుందా?"

"లక్ష్మణా! సీతను విడిచి నేను బతకడానికి రెండు కారణాలున్నాయి. ఒక పాన్పుమీద ఇద్దరం వున్నట్లు లోకభూమిలోనే ఇరువురం వున్నాం. రెండోది సీత జీవించే వుందని హనుమంతుడు చెప్పాడు. కాబట్టి నేను కూడా జీవించగలిగాను. కాని నేనామెను చూడగలనా? సీతాదేవి బతికి వున్నదని హనుమంతుడు చెప్పడం వల్ల నేను బతికి వున్నాను. బతికి వుండగా ఏమవుతుంది? ఆమె ఎక్కడ? నేనెక్కడ? నేను బతకడానికి ఆమె మరణం ఎలా కారణం కాగలదు అంటావేమో? మబ్బులో నీళ్లుంటే భూమిమీద పైరు పండుతుందా? అంటావేమో? అలా కాదు. మేమిద్దరం ఒకే భూమ్మీద వున్నాం. ఒక వరిమడి నిండా నీళ్లుంటే పక్క భూమిలో కూడా ఆ వూటతో పారుతాయి కదా? అలాగే ఆమె బతికున్నదన్న వార్త విని నేను బతికివున్నాను. బలవంతులైన పగవారిని చంపి బాగా అభివృద్ధి చెందే లక్ష్మిలాగా నేనెప్పుడు సీతాదేవిని చూస్తానోకదా? నేనెప్పుడు సీతాదేవి అధరామృతాన్నిఆశ తీరా తాగుతాను కదా? సీతాదేవి స్తనాలు నేను కౌగలించుకున్నప్పుడు చలిస్తాయి

కదా! నన్ను, ముల్లోకాలను కాపాడగల నన్ను, తన ప్రాణేశ్వరుడిగా స్వీకరించినప్పటికీ, పతివ్రతారత్నమైన సీత రాక్షసస్త్రీల మధ్య దిక్కులేనిదానిలాగా రక్షించేవారు లేక భయపడి శుష్కించి పోతున్నది కదా! తండ్రేమో జనక మహారాజట! మామగారు దశరథ మహారాజట! భర్త నేనట! ఇలాంటి ఉత్తమ స్త్రీ రాక్షసుల మధ్య ఎలా నిద్రిస్తుంది?"

"నల్లటి మబ్బులను చీల్చుకుని, బయటకొచ్చి కనపడే చంద్రరేఖలాగా, క్రూర రాక్షసులను ధిక్కరించి ఎప్పుడు బయటకు రాగలదో సీతాదేవి? సీతాదేవి స్వభావసిద్ధంగా జింక కళ్లు, సన్నటి దేహం కలది. ఇక ఇప్పుడేమో సహించలేని దుఃఖాతిశయంతో, దేశం, కాలం తారుమారైనందున, ఆహారం లేకపోవడంతో, ఎంత శుష్కించిందో కదా? రావణాసురుడిని చంపి నేనెప్పుడు సీతను తేగలనోకదా? దేవతాస్త్రీలాంటిదై, పరమ పతివ్రతలలో శ్రేష్ఠురాలైన నా దేవి సీత గొప్ప మనస్సుతో ఎప్పుడు నా మెడను గుచ్చి కౌగలించి ఆనందభాష్పాలు విడువగలదో కదా? నా భార్యను, స్త్రీరత్నాన్ని, భూపుత్రికను సీతను విడిచినందున కలిగిన దుఃఖం నేనెప్పుడు మాసిన గుడ్డను వదిలినట్లు వదిలి సుఖపడతానోకదా?"

ఇలా రాముడు శోకిస్తుంటే సాయంకాలమై సూర్యుడు అస్తమించాడు. ఆయన బాధ పోయేట్లు లక్ష్మణుడు సమాధాన పరిచే మాటాలు చెప్పాడు. అవి విని, సీతను స్మరించుకుంటూ రామచంద్రుడు సంధ్య వార్చాడు.

సర్గ-6
మంత్రులతో ఆలోచన చేస్తున్న రావణుడు

శ్రీరామాదులు సముద్రాన్ని దాటే ఉపాయం ఆలోచిస్తుండగా, ఆ మూడు రోజుల్లో, లంకలో జరిగిన వృత్తాంతం ఇలా వుంది. హనుమంతుడు లంకను విడిచినప్పటినుండి జరిగిన సంగతిది.

లంకలో రావణుడు, ఇంద్రసమానుడైన హనుమంతుడు ఒక్కడే చేసిన అసాధ్యమైన, భయంకరమైన రాక్షస వధ, లంకా దహనం లాంటి కార్యాలను తలచుకుంటూ, రాక్షసుల సభలో తన బల గర్వం క్షీణించగా సిగ్గుతో, నేలదిక్కులు చూస్తూ, రాక్షస వీరులతో ఇలా అన్నాడు. "హనుమంతుడు నిలబడి యుద్ధం చేసినప్పుడు రాక్షస సేనలను పంపగలిగాం. లంకాదహన సమయంలో హనుమంతుడు మిద్దెలమీద బరువైన వస్తువులను ఎత్తుకుంటూ, ఇండ్లలో, దొడ్లలో దూరి కొంపలు తగులబెట్టి వాయువేగంతో తిరుగుతూ నా ఇంటిని తగులబెట్టినా నేనేమీ చేయలేకపోయాను. నా ఇల్లే నేను కాపాడుకోలేనివాడిని లంకాపురాన్నంతా ఎలా కాపాడగలను? ఒక్కడిని నివారించలేనివాడిని పలువురు వానరులు వస్తే ఎలా నివారించగలను? ఇది బలహీనత, అవమానకరం కూడా. సామాన్య కోతి ఒక్కడు, మనలాగా ఆయుధాలు కూడా ధరించకుండా అతిశయించిన శక్తితో ఎవరికీ సాధ్యపడని లంకాపురంలో ప్రవేశించి, నన్ను తృణంకంటే నీచంగా ఎంచి, నా ఇంట్లో ప్రవేశించి, సీతను చూసి, గోపురాలను విరగతన్ని, నేలకూల్చి, రాక్షసులను చంపి పట్టణాన్ని భీభత్సంగా కాల్చాడు".

"అయిందేదో అయింది. దానికి విచారపడి ప్రయోజనం లేదు కదా! ఇక

జరగాల్సిన పని గురించి చెప్పండి. నేనేం చేయాలి? నేనేం చేస్తే నాకు, మీకు మేలు కలుగుతుంది? ఏం చేస్తే అంతా చక్కబడుతుంది? రాముడి విషయంలో ఏం చేస్తే మనకు మేలు కలుగుతుంది? మీ అభిప్రాయాన్ని చెప్పండి. మంచి ఆలోచన చేయడమే జయానికి కారణం అని పెద్దలంటారు. కాబట్టి ఆలోచించకుండా పనులు చేయకూడదు. లోకంలో ఉత్తములని, మధ్యములని, అధములని మూడు రకాల పురుషులున్నారు. రాక్షస శ్రేష్టులారా! వారే గుణాలవల్ల ఉత్తములయ్యారో, ఏ దోషాలవల్ల అధములయ్యారో చెప్తా వినండి. తన సుఖమే తమ సుఖంగా, తన దుఃఖమే తమ దుఃఖంగా ఎంచు బంధువుల సమూహంతో, తన మేలుకోరు స్నేహంకలవారితో, తన మనస్సు నమ్మిన మిత్రులతో, నిర్మలమైన బుద్ధితో, శీఘ్రంగా ఆలోచించి ఫలితం దైవాధీనమని కార్యం చేయడానికి పూనుకుంటాడో వాడు ఉత్తమ పురుషుడు. జయాపజయాలకు, లాభనష్టాలకు దైవమే కారణమని, ఆయనే రక్షకుడని దైవాన్నే నమ్మి, ఇతరులతో ఆలోచన చేయక, తనకు మేలని తోచిన విధంగా కార్యం చేయడానికి పూనుకున్నవాడు మధ్యమ పురుషుడు. ఇటు చేస్తే మేలు, అటు చేస్తే కీడు అని ఆలోచన చేయకుండా దైవాన్ని నమ్మక, దైవ సహాయం కోరకుండా కార్యం చేయడానికి పూనుకున్నవాడు, దాన్ని చివరదాకా చేయనివాడు పురుషాధముడు అని అనబడతాడు".

"పురుషులలో ఉత్తమ, మధ్యమ, అధములున్నట్లే మంత్రాలోచనలో మూడు రకాలు వున్నాయి. వాటి లక్షణాలు చెప్తా వినండి. శాస్త్రం మీద దృష్టి పెట్టి అది చెప్పిన విధంగా మంత్రులందరూ ఆసక్తిగా ఎలాగైనా ఈ కార్యాన్ని సాధించాలని పట్టుదలతో ఏకాభిప్రాయం కలిగితే అలాంటిది ఉత్తమమైన ఆలోచన అని పండితులంటారు. కార్యం చేయాలని తలచినప్పుడు, చేయబూనుకున్నప్పుడు, మొదలు వేరే అభిప్రాయం కలవారైనా చివరకు అందరూ ఏకాభిప్రాయం కలవారైతే మంత్రతత్వం తెలిసినవారు దాన్ని మధ్యమాలోచన అంటారు. ఒకడు చెప్పిన దాన్ని ఇంకొకడు అంగీకరించకుండా తాను చెప్పిందే సరైందని హఠవాదం చేస్తూ, ఏకాభిప్రాయానికి రాకుండా ఎవరి అభిప్రాయం వారిదే అనే ఆలోచన అధమాలోచన అంటారు. మీరంతా బుద్ధిమంతులు. మంచి ఆలోచన చేయగల శక్తిమంతులు. కాబట్టి ఏం చేస్తే మనకు మేలు కలుగుతుందో మీరంతా ఆలోచించి ఇదిగో...ఈ విధంగా చేస్తే మంచిదని చెప్పాలని నా కోరిక. అంత దీర్ఘంగా ఆలోచించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఏదో ఒక కోతి వస్తే ఇంతగా

ఆలోచించాలా అంటారేమో? అది సరైంది కాదు. ఎందుకంటే రామచంద్రుడు భయంకరాకారం కల వేలాదిమంది వానరులను వెంటబెట్టుకుని లంకను ముట్టడిస్తాడు కాని వదలడు. ఇది సత్యం".

"రాజేంద్రా! కోతి కాబట్టి గంతేసి సముద్రం దాటగలిగింది.... రామలక్ష్మణులెలా దాటిరాగలరు....ఒక వానరుడు దాటగానే అందరు వానరులు దాటగలరని ఎలా నిశ్చయించాలి అని సందేహించ కూడదు. రామచంద్రుడు తమ్ముడితో, సైన్యంతో, కష్టపడకుండా ఆయన పరాక్రమానికి సరిపోయే విధంగా సముద్రాన్ని ఎండించో, లేక తనదైన శైలిలో ఒక అద్భుతాన్ని చూపించో సముద్రాన్ని దాటగలడు. కాబట్టి అప్పుడు లంకాపురాన్ని ఎలా రక్షించుకోవాలి? ఎలా చేస్తే మనకు, మన సేనలకు మేలు కలుగుతుంది? దానికి ఒక ఉపాయాన్ని చెప్పండి. ఒకవేళ మీరనుకుంటున్నట్లు రాముడు రాలేకపోతే మనకు మేలే కదా? మనం ఆలోచించి జాగ్రత్త పడడంలో హానిలేదు కదా?"

సర్గ–7

రావణుడి పరాక్రమాన్ని పొగడిన రాక్షసులు

రావణుడు ఈ విధంగా చెప్పగా, మహాబలవంతులైన రాక్షసులు, దేహబలం వున్నా బుద్ధిబలం లేనందున, చేతులు జోడించి తమ బలమెంతో, విరోధుల బలమెంతో తెలుసుకొనలేక, ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించాలో తెలియక ఇలా అన్నారు.

"రాక్షసేశ్వరా! పట్టిసాలు, శక్తులు, ఋష్టులు, పరిఘములు, శూలాలు నిండిన గొప్ప సైన్యం నీకుండగా నువ్వెందుకు ఇలా విచారిస్తావు? భోగవతీపురంలో సర్పాలను గెలిచావు. కైలాసంలో యక్షసమూహాలతో వుండే కుబేరుడిని నీ బలంతో జయించావు. మహేశ్వరుడితో స్నేహం చేసి కీర్తిని సంపాదించి, కోపించి, దిక్పాలకులను గెలిచావు. యక్షులను తికమక చేసి పడగొట్టి, చంపి, కైలాసంలో వున్న విమానంలో ఇక్కడికి తెచ్చావు. నీకు సమానమైన వారు ముల్లోకాలలో వున్నారా? నయాన ఇవ్వకుంటే చంపుతావన్న భయంతోనేకదా నీ స్నేహం కోరి దానవేశ్వరుడు మయుడు తన కూతురును నీకు భార్యగా ఇచ్చాడు. పాతాళానికి పోయి యుద్ధం చేసి సర్పాలను, వాసుకిని, జటిని, శంఖుని, తక్షకుడిని శౌర్యంతో గెలవలేదా? దానవులకు అధిపతి, బలగర్వం కలవాడు, నీ చెలియలి కుంభీనసి మగడైన మధుడు నీకు వశపడలేదా? యుద్ధంలో సమస్త దిక్పాలకుల గర్వం అణచి ఇంద్రలోకానికి పోయి నువ్వు ఇంద్రుడిని జయించలేదా?బలవంతులు, బ్రహ్మ వరం పొందినవారు, రణశూరులు, నాశనం లేనివారు, అయిన తనుజులతో ఒక సంవత్సరం యుద్ధం చేసి గెలవలేదా? వారి వల్ల మాయలు నేర్చి కీర్తి సంపాదించలేదా? పరాక్రమం కలవారిని, సంపూర్ణ భుజబల సంపన్నులను, సేనలతో వున్నవారిని, వరుణ

కుమారులను, యుద్ధంలో గెలవలేదా నువ్వు?".

"ప్రసిద్ధమైన బూరుగు చెట్లతో ప్రకాశిస్తూ, భయంకరమైన మృత్యుదండమనే మొసళ్లతో, కాలపాశమనే అలలతో, యమకింకరులనే పాములతో వుండే యముని సైన్యమనే గొప్ప సముద్రంలో ప్రవేశించి, మృత్యుదేవతను కలవర పర్చలేదా? లోకం దిగ్భ్రమ పొందేట్లు జయించలేదా? దేవదానవుల వల్ల భయం లేకుండా వరం పొందినందునే ఇంద్రాదులను జయించగలిగాననీ, మనుష్యుల వల్ల భయం లేకుండా కోరలేదు కదా అనీ, రాముడు మనుష్యుడు కదా అనీ అంటావేమో? ఇంద్ర సమానులైన మహా బలపరాక్రమవంతులను, అనరణ్యాది క్షత్రియులను బాణాలతో నువ్వు చీల్చలేదా? వారు మనుష్యులే కదా? ఆ రాజులకీ రాముడు యుద్ధంలో సమానుడా? రాక్షసేశ్వరా! నువ్వే ఏ ఆలోచనా చేయనక్కర లేదు. ఏ కార్యమూ చేయాల్సిన అవసరం లేదు. నిశ్చింతగా వుండు. వానరులందరినీ ఒక్క ఇంద్రజిత్తే చంపగలడు. యముడిని జయించి, శివుడి గురించి యజ్ఞం చేసి ఆయన్ను సంతోషపరచి, దుర్లభమైన వరాన్ని సంపాదించి రాక్షసులందరినీ సంతోషపెట్టడా?ఇంద్రుడిని చెరబట్టి లంకకు తీసుకుని వచ్చి బ్రహ్మ ఆజ్ఞప్రకారం వాదిలిన శూరుడితడే కదా? ఇలాంటి గొప్ప పనిని చేసిన నీ కొడుకు ఇంద్రజిత్తును రాముడిని వానరులతో సహా చంపమని ఆజ్ఞాపించు. ఆయన వారిని చంపుతాడు. ఎవడో ఒక నీచకోతి కీడుకలిగించాడని విచారపడవద్దు. రాముడిని నువ్వు గెలుస్తావు.

సర్గ–8

రావణుడికి తమ పరాక్రమం చెప్పిన ప్రహస్తాదులు

సభలో వున్న రాక్షసులందరూ చెప్పిన తరువాత మంత్రులు, ఇతర ప్రముఖులు వారి అభిప్రాయాలను కూడా చెప్పారు. అందులో ముఖ్యుడైన ముఖ్య సేనానాయకుడు ప్రహస్తుడు అందరికంటే ముందు, రావణుడికి నమస్కారం చేసి, తన అభిప్రాయాన్ని చెప్పాడిలా. "రాక్షసేంద్రా! నీకెందుకు విచారం? దేవాసురులైనా,పన్నగ పిశాచాలైనా, నీ సమీపానికి కూడా రాలేవు. ఇక కోతులా నీ ఎదుట నిల్చి యుద్ధం చేసేది? మమ్మల్ని ఎదిరించేవాడెవడు? మమ్మల్ని గెలవగలిగేవాడేవడు?అని హెచ్చరిక తప్పి ఏమరుపాటుగా మేం వుండడం వల్లే ఆ వానరుడు వంచన చేసి ప్రాణాలతో పోగలిగాడు. కాని కొంచెం హెచ్చరికతో వున్నా వాడిని అప్పుడే చంపేవాళ్లం. సముద్రంతో చుట్టబడిన మొత్తం భూమిలో, కొండల్లో, అడవుల్లో, వానరులనేవారు లేకుండా చేస్తాను. ఆజ్ఞ ఇస్తే ఇప్పుడే పోయి ఆ పని చేస్తాను. నేనొక దారిలో పోతే వాళ్లు మరో దారిలో వూరిమీదకు వస్తారన్న భయం వద్దు. అలాంటి భయం లేకుండా వేయివిధాల రక్షణోపాయం చేస్తాను. చేతులార చేసుకున్న దోషం వల్ల కష్టం కలగదు నీకు".

ప్రహస్తుడు తాను అజాగ్రత్తగా వుండడం వల్లే వానరుడు చెడ్డ కార్యం విజయవంతంగా చేయగలిగాడని చెప్పగా కోపం తెచ్చుకున్న దుర్ముఖుడనే రాక్షసుడు తన మాటలుగా ఇలా చెప్పాడు. "దుర్బుద్ధికల కోతి నగరంలో వుండేవారి కొంపలు కాల్చి అంతఃపుర స్త్రీలు నడివీధుల్లోకి వచ్చేట్లు చేయడం వల్ల స్త్రీల గుంపుకు,ఇంద్రుడిని బట్టి కట్టిన రాక్షసేశ్వరుడికి అవమానం కలిగించడం నిజం. అజాగ్రత్తగా వున్నానంటే జరిగిన అవమానం పోతుందా?

ఈ అవమానం సహించడం సాధ్యమా?అవమానం కలగడం సత్యమే. దానిని సహించలేకపోవడం కూడా నిజమే. అయినా దానికి నేనేమి ప్రతీకారం చెప్తానంటావా? నేనొక్కడినే ఈ నిమిషంలో పోయి వానర సమూహాలు ఆకాశానికి ఎగిరిపోయినా సరే, ఏడ్చుకుంటూ సముద్రంలో దాగినా సరే, పాతాళానికి పోయినా కూడా పట్టుకుని చంపుతాను".

దుర్ముఖుడు ఇలా చెప్పగా దానిని మెచ్చని వజ్రదంష్ట్రుడు అనే వాడు సింహనాదం చేస్తూ ఇలా అన్నాడు. "కోతులను చంపుదామని కొందరంటున్నారు.కోతులు అడవుల్లో తిరుగుతాయి. మన ఇండ్లతో, వాకిళ్లతో, మనతో వాటికేం పని? అదీ కాకుండా తపస్సు చేసుకునే వారిలాగా కాయకూరలు తిని బతుకుతాయి.కాబట్టి వాటిని కనికరించాలి. వాటిని చంపితే ఏం లాభం? దాంతో విరోధం పోతుందా? మనల్ని అవమానించాలనుకున్న శత్రువులు రామలక్ష్మణ సుగ్రీవులు కదా?వాళ్లని వదిలి వానరులను చంపడం ఎందుకు? కాబట్టి నేనొక్కడినే మీ ఎవరి సహాయం లేకుండా లక్ష్మణ సుగ్రీవుడితో సహా రాముడిని ఇప్పుడే చంపుతాను. అది చూసి వానరులందరూ బెదిరి సంతాపంతో పరుగెత్తుతారు. రాజా! నేనొక ఉపాయం చెప్తాను. బలవంతులైన రాక్షసులను, కామరూపులను, యుద్ధక్రియలో భయంకరమైన వారిని, వెంటనే జతకూర్చాలి. ఇలా చేరిన వారందరూ మనుష్య వేషంలో రాముడి దగ్గరకు పోవాలి. పోయి, నీ తమ్ముడు భరతుడు పంపగా వచ్చామని, అయోధ్యలో ఆయన చక్కపరచాల్సిన పని ఒకటి వుందనీ, ఆయన్ను పిల్చుకొని రమ్మన్నారనీ చెప్పాలి. అతడు వెంటనే సైన్యంతో అయోధ్యకు పోతాడు.అలా రాముడు అయోధ్యకు పోయే సమయంలో, ఆయుధాలు ధరించి వానరసేన మీద పడి రాక్షసులు వారిని చంపాలి. ఈ విధంగా మేము పన్నిన వలలో చిక్కుపడ్డ రాముడు తమ్ముడితో చస్తాడు. అంతటితో మనపీడ వదలిపోతుంది".

ఈ మాటలు విన్న కుంభకర్ణుడి కొడుకు నికుంభుడికి కోపం వచ్చింది. రావణుడిని చూసి ఇలా మాట్లాడాడు. "మీరంతా రాక్షస శ్రేష్టుడి సేవ చేసుకుంటూ ఇక్కడే వుండండి. నేనొక్కడినే భుజబల పరాక్రమంతో యుద్ధరంగంలో రాముడిని, లక్ష్మణుడిని, హనుమంతుడిని, సుగ్రీవుడిని చీల్చి పారేస్తాను. మిగిలిన వానర సైన్యమంతా తునాతునకలుగా చిటికలో ఖండిస్తాను". అప్పుడు వజ్రహనుడనే కొండంత దేహం కల రాక్షసుడు కోపంతో

వూగిపోతూ, ధైర్యంగా ఇలా అన్నాడు. "రాక్షసులారా! ఈ ప్రసంగం మీకెందుకు? మనస్సులో విచారం వదిలి ఇష్టం వచ్చినట్లు మీమీ గృహకృత్యాలు చేసుకోండి. మీకు తృప్తితీరా మాంసం తినండి. సారాయి తాగండి. నేనొక్కడినే రామలక్ష్మణులను, సుగ్రీవాంగదులను, హనుమంతుడిని చంపుతాను".

సర్గ-9
విజృంభించి మాట్లాడిన రభసాదులు

ఆ తరువాత యజ్ఞహుడు, నికుంభుడు, రభసుడు, మహాపార్శ్వుడు, రశ్మికేతువు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, మహోదరుడు, అగ్నికేతుడు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, అతికాయుడు, విరూపాక్షుడు, ధూమ్రాక్షుడు, దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడు....ఇలా అందరూ మాట్లాడారు. వీరంతా నికుంభుడి మార్గం అనుసరించి అలాగే చేయాలని అనుకుని తాను ముందంటే తాను ముందని వారి-వారి ఆయుధాలు పట్టుకుని విజృంభించి ఎగిరిపడుతూ కోపంతో మండిపడుతూ రాక్షసశ్రేష్టుడితో అలాగే అన్నారు. ఇలా అయుధాలు ధరించి పౌరుషపు మాటలు పలుకుతున్న వారిని ఆపుచేస్తూ విభీషణుడు అన్నకు నమస్కారం చేసి ఇలా అన్నాడు.

రావణుడికి రాజనీతిని తెలియచెప్పిన విభీషణుడు

"రాజనీతిలో కార్యం సాధించడానికి సామ, దాన, భేద అనే మూడు ఉపాయాలున్నాయి. ఈ మూడు ఉపాయలతో కార్యం సాధించలేకపోతే అప్పుడు దండమనే నాలుగో ఉపాయం అవలంభించాలని నీతిశాస్త్రంలో పండితశ్రేష్టులు చెప్తున్నారు. మొదటి మూడు ఉపాయాలను ప్రయత్నించకుండా యుద్ధానికి దిగడం శాస్త్రవిరుద్ధం. మనవారు యుద్ధాన్ని పొగుడుతున్నారు కదా? ఎవరితో యుద్ధం చేస్తే గెలుపు లభిస్తుందని శాస్త్రం చెప్తున్నదో విను. రాజ్య కార్యాలమీద ప్రీతి లేకుండా వున్నవాడి మీద, ఇంద్రియ సంతోషం మీద ఆసక్తికలవారి మీద, దైవ సహాయం లేనివారి మీద, పిల్లల మీద, పిరికి వాళ్ల మీద, కార్యాకార్యం విమర్శించి యుద్ధం చేస్తే జయం తప్పక కలుగుతుంది. మనస్సునందైన

రాముడు ప్రమాదంలో వుండేవాడు కాదు. ఎలాగైనా జయించాలనుకునే వాడు. యుద్ధంలో ఆయన్ను కన్నెత్తైనా చూడడానికి సాధ్యపడదు. నివారింపకాని పరాక్రమవంతుడు. కోపాన్ని జయించినవాడు. నిష్కారణంగా కోపం తెచ్చుకోడు. ఇలాంటి రామభద్రుడిని పరాక్రమంతో జయించడం ఎలా సాధ్యం? భయంకరమైన నదులను, సముద్రాన్ని దాటి ఒక్క కోతి ధైర్యంతో అసాధ్య కార్యం చక్కచేసుకుని పోతుందని మనస్సులోనైనా ఎవడైనా అనుకున్నాడా? ఏమి ఆశ్చర్యం? వానరాధిపతైన సుగ్రీవుడు రాముడికి తోడుగా వున్నాడని విన్నం కదా? చూశాం కదా? వానరసేన ఎంతో, ఎలాంటిదో మనకు తెలుసు కదా? కాబట్టి రాముడి సైన్యం లెక్క కట్టలేనిది. పగవారి పౌరుషం గట్టిగా వుంది. ఇలాంటప్పుడు శత్రువులను అలక్ష్యం చేయవచ్చా? మీరు రాక్షస వీరులేనా? మనమే వీరులం, ఇతరులు కారని అనవచ్చా?"

"ఏ విషయంలో వారు మీకంటే తక్కువో చెప్పండి. రాముడిమీదకు యుద్ధానికి పోదామని అంటున్నారు కదా? కారణం ఏంటి? ఆయన మీకు చేసిన అపకారం ఏంటి? తన దూత చేత మన నగరాన్ని తగలపెట్టించి మనవారిని చంపించాడని అంటారేమో? ఎందుకు ఇలా చేశాడు? ముందు ఎవరెవరికి అపకారం చేశారు? రాముడేమైనా మన రాక్షసరాజుకు అపకారం చేశాడా? ఇతడే కదా ముందు పోయి ఎక్కడో అడవిలో వున్న రాముడి భార్యను అపహరించి తెచ్చాడు. ఇందులో అన్యాయం ఎవరిది? కలహానికి కాలు దువ్వినవారెవ్వరు? ఆయన భార్యను అపహరించడమే కాకుండా, తన భార్యను మరల తాను తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్న రాముడిని తప్పుపట్టవచ్చునా? సీతాదేవి ఇక్కడ లేకుంటే వానరుడు ఇక్కడికి వచ్చేవాడా? అంతపని చేసేవాడా? ఇదెందుకు మీరు ఆలోచించరు? నీ భార్యలను పరులు అపహరిస్తే మీరు వూరుకుంటారా? కుంభీనసిని మధుడు హరించినప్పుడు వాడిమీదకు మీరు యుద్ధానికి పోలేదా? మీరు చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పా?".

"విభీషణా! నువ్వు చెప్తున్నది వాస్తవం కాదు...ఖరాదులను ముందుగా రాముడు చంపడం వల్లే కదా రాక్షసరాజు రాముడి భార్యను అపహరించింది అంటారా? కాబట్టి కలహకారకుడు రాముడే అంటారా? రాముడు ఖరాదులమీదికి దండెత్తి వచ్చాడా? ఖరుడు రాముడి మీదికి దండెత్తి పోయాడా? ఖరుడే కదా పోయింది. తన ప్రాణానికి అపాయం కలిగినప్పుడు వారి శక్తికొద్దీ తమ్ముం తాము రక్షించుకొనడం సహజమే కదా? అలాగే తన్ను తాను రాముడు

రక్షించుకొంటే తప్పేంటి? మీ ప్రాణాలమీదికి వస్తే మీరు కాపాడుకోరా? రాక్షస రాజా! ఇతరుల భార్యలను హరించడం వల్ల మిక్కిలి అపకీర్తి కలుగుతుంది. అది పాపాన్ని వృద్ధి చేస్తుంది. ఆయుస్సు క్షీణింప చేస్తుంది. అర్థం నాశనం చేస్తుంది. ఈ లంకలోని వారందరికీ అపాయం కలగ చేయడానికి కారణం సీతే! ఆమె ఇక్కడ వున్నంతదాకా ఈ ఉపద్రవం తప్పదు. కాబట్టి ఆమెను వదిలిపెట్టు. అదే సరైన పని. 'విభీషణా! నేను కాముకడనై సీతను తీసుకుని రాలేదు...రాముడు ఖరాదులను చంపాడు....కాబట్టి యుద్ధంలో రాముడిని చంపాలి'. అతడిని యుద్ధానికి లాగడానికి సీతను తెచ్చానంటావా? అలా యుద్ధమే నీ ముఖ్య ఉద్దేశం అయితే సీతతో లంకలో ఏం పని? సీత లేకున్నా మనం వారిమీదకు యుద్ధానికి పోవచ్చు కదా? నా తమ్ములను చంపినందుకు నేను వారిమీదకు యుద్ధానికి పోతున్నానంటే లోకం మెచ్చుతుంది. అప్పుడే నువ్వాపని చేసి వున్నట్లయితే రాముడికి వానర సేనాసంపత్తి లభించి వుండేది కాదు. వాళ్లు అన్నదమ్ములిద్దరే కాబట్టి సులభంగా జయించేవాడివి. వారు వచ్చి మన వూరిమీద పడేవారు కాదు. అలా కాకుండా నువ్వు వక్రమార్గాన సీతను తేవడం వల్ల వారెంత బలసంపత్తి కలవారైపోయారో చూడు".

"అన్నా! రామచంద్రమూర్తి సామాన్యమైన బలం కలవాడు కాదు. సారవంతమైన మహా బలం కలవాడు. దేహబలానికి తోడు ధర్మపు నడవడిలో ఆసక్తికలవాడు. ధర్మం వున్న చోటే విజయం వుంటుంది. కాబట్టి ధర్మబలం,దాని వెంట దైవబలం కలవాడు అయిన రామచంద్రుడితో నువ్వు అకారణంగా కలహానికి దిగడం సరైంది కానేకాదు. కాబట్టి సీతాదేవిని రాముడికి అర్పించు. లంక శత్రువుల బారిన పడకముందే సీతాదేవిని రాముడికి అప్పచెప్పు. వానరసేన లంకకోటలు లగ్గలు పట్టకముందే సీతాదేవిని శ్రీరాముడికి అర్పించడం గౌరవకరం. నువ్వు సీతాదేవిని రాముడికి తిరిగి ఇవ్వకపోతే రాక్షసులతో సహా లంకానగరం నాశనమై పోతుంది. కాబట్టి సీతాదేవిని మళ్లీ రామచంద్రుడికి ఇవ్వు. నువ్వు మాకు కేవలం రాజువు మాత్రమే కాదు. నాకు అన్నవు. కాబట్టి అన్న అనే గౌరవంతో, ప్రేమతో నమస్కారం చేసి చెప్తున్నాను. నన్ను అనుగ్రహించు. నామీద దయ వుంచి నేను చెప్పినట్లు చేయి. అన్నా! నీకు మేలు కలుగుతుంది. మంచిమాటలే చెప్పాను కాని, దానికి విరుద్ధంగా నేనేం చెప్పలేదు. సీతాదేవిని రామచంద్రుడి దగ్గరకు పంపించు".

విభీషణుడి మాటలు రావణుడికి రుచించలేదు. అవి వాడికి కోపం

తెప్పించాయి. అయినా విభీషణుడు భయపడకుండా చెప్పడం కొనసాగించాడు. "అయ్యా! ధర్మాన్ని, సుఖాన్ని నాశనం చేసే కోపాన్ని వదిలిపెట్టు. సౌఖ్యాన్ని, కీర్తిని వృద్ధి చేసే ధర్మాన్ని సేవించు. కొడుకులతో, మిత్రులతో రాక్షసులందరూ భోగాలను యధావిధిగా అనుభవించవచ్చు. కాబట్టి రామచంద్రుడికి సీతను ఇవ్వు" అంటాడు విభీషణుడు.

విభీషణుడు ఇలా చెప్పగా, ఆ మాటలు విన్న రావణాసురుడు సభ చాలించి తరువాత ఈ విషయాన్ని పరిష్కరిద్దామని, అందరినీ పంపించి, పరిచారకులతో సహా తన ఇంటికి పోయాడు.

సర్గ-10
రావణుడికి గృహానికి పోయిన విభీషణుడు

అన్న గృహానికి వెళ్లాడు విభీషణుడు. సీతాదేవిని మళ్లీ రామచంద్రమూర్తికి ఇప్పించాలనే నిశ్చయ బుద్ధి కలవాడైన విభీషణుడు, అపాయకరమైన ఆ విషయాన్నిరావణుడితో చెప్ప సాహసించిన విభీషణుడు, నిర్మలమైన మనస్సుతో లంకానగరం దహనమైన మర్నాడు రావణుడి ఇంటికి వెళ్లాడు. (ఇది హనుమంతుడు లంకానగరం కాల్చిన మర్నాటి వృత్తాంతం. ఉదయాన్నే స్నాన-సంధ్యాది కార్యక్రమాలను, దైవపూజ చేసేవాడు కావడం వల్ల, ఆ సమయంలో రావణుడి మనస్సు సత్త్వ గుణం కలదై వుంటుంది. కాబట్టి అప్పుడు ధర్మ విషయం చెప్తే అంగీకరిస్తాడని అనుకున్నాడు విభీషణుడు. అన్నకు జయం కలగాలని, ఫలం కలగాలని వేద పండితులు (రాక్షస బ్రాహ్మణులు) ఆశీర్వదిస్తున్న సమయంలో ఆయన్ను చేరి నమస్కారం చేశాడు. ఇలా నమస్కరించి, ప్రభువుల దగ్గర ఏ సమయంలో ఎలా నడవాలో ఆ ఆచారాలను తెలిసినవాడు కాబట్టి సమయోచిత చర్యల నడచుకుని, రావణుడు కూర్చోమని సైగ చేయగానే ఒక బంగారు పీఠం మీద విభీషణుడు కూర్చున్నాడు.

లంకలో అపశకునాలు కలిగాయని రావణుడికి చెప్పిన విభీషణుడు

రావణుడి ఇంటికి పోయిన విభీషణుడు ఇతరులెవరూ వినడం లేదని నిర్ధారణ చేసుకున్న తరువాత తన మాటలుగా ఇలా చెప్పాడు. "అన్నా! ఏనాడైతే సీత ఈ వూరికి దాపురించినదో ఆ దినం మొదలు లెక్కలేని అపశకునాలు లంకాపురంలో కనపడుతున్నాయి. మంచి మంత్రాలతో హవిస్సు, హోమం చేసినప్పటికీ పొగతో సహా జ్వాలలు కల అగ్నిహోత్రుడు ప్రకాశించడం లేదు.

వంట ఇండ్లలో, అగ్నిహోత్ర గృహాల్లో, వేదాలు పఠించే మందిరాలలో పాములు తిరుగుతున్నాయి. హవ్యాలకు చీమలు పట్టున్నాయి. మన నగరంలో ఆవుల పొదుగుల్లో పాలు ఎండిపోయాయి. ఏనుగుల మదం చెడిపోయింది. కళ్లల్లో నీళ్ళు కారుతుంటే గుర్రాలు కొంచం సంతోషంగా కూడా లేవు. మేత ముట్టుకోవడం లేదు. గద్దలు గుండ్రంగా తిరిగి ఇండ్లమీద వాలుతున్నాయి. ఉదయాస్తమాన సమయంలో నక్కలు భయంకరంగా కూస్తున్నాయి. ఒంటెలు, కంచరగాడిదలు ఏడుస్తున్నాయి. కాకులు గుంపులు గుంపులుగా అరుస్తున్నాయి. మాంసం తినే మృగాలు నగరం వాకిట్లో నిలుచుని విచ్చలవిడిగా పిడుగుల ధ్వనితో చాలా భయంకరంగా నగరంలోకి వినపడేట్లు అర్సున్నాయి.

సీతాదేవిని శ్రీరాముడికి ఇవ్వమని రావణుడికి చెప్పిన విభీషణుడు

విభీషణుడు ఇంకా ఇలా అన్నాడు. "ఈ అపశకునాలకు కారణం సీత ఇక్కడ వుండడమే. సీతను శ్రీరాముడి అర్పించు. నేనిలా చెప్పడం తెలివితక్కువతనం అనుకున్నా, వీడు పిరికివాడని అనుకున్నా, చస్తానని భయపడి చెప్తున్నాడని అనుకున్నా, దేవ విరోధీ! పరవాలేదు. కాని నేను ద్రోహబుద్ధితో చెప్తున్నానని మాత్రం అనుకోవద్దు. నేను చెప్పిన దుష్ట శకునాలు నగరంలోనూ, నీ అంతఃపురంలోనూ, అందరికీ తెల్సినవే. రహస్యాలు కావు. నేను కల్పించి చెప్పడం లేదు. నీ ఇష్టముంటే వాస్తవాన్ని విచారించు. నేను చెప్పేది నిజమే అయితే నీ మంత్రులు నీకెందుకు చెప్పలేదంటావేమో? వారు భయంతో నీకు చెప్పలేదు కాని నేను చెప్పేవి వారికి తెలియక కాదు. నేనేమో నీకు తమ్ముడనైనందున నీ మేలు కోరి చెప్తున్నాను. మంత్రులకు ఒక రాజుపోతే మరో రాజు వస్తాడు. నాకు అన్న పోతే మరో అన్న రాడు కదా! కాబట్టి అన్నను పోగొట్టుకోలేక చెప్తున్నాను. అన్నా! సీతాదేవిని ఇవ్వడం న్యాయమా? అన్యాయమా? ఇస్తే కలిగే ఫలం ఏమిటి? ఇవ్వకపోతే కలిగే నష్టం ఏమిటి? రాబోయేది అంతా ఆలోచించి నీ ఇష్టం వచ్చినట్లు చేయి. ఆలోచించకుండా తొందరపడి ఏదీ చేయొద్దు". అని మంత్రులంతా వింటుంటే చెప్పాడు.

హితమైన, గొప్ప ప్రయోజనం కల, మృదుత్వంతో కూడిన, యుక్తి-యుక్తమైన, గడచిన-వర్తమాన-భవిష్యత్ కాలాలకు శుభం-సౌఖ్యం కలిగించే తన తమ్ముడు చెప్పిన వాక్యాలు చెవిలో పడగానే రావణుడు కోపగించి తాను చేయదల్చుకున్న పని మీదే ఎక్కువ పట్టుదల కలవాడై ఈ విధంగా విభీషణుడితో చెప్పాడు.

"ఇప్పుడేంటిరా నాకంత ప్రాణభయం వచ్చింది? అదలా వుండనీ...కాని, రాముడు సీతాదేవి సమీపానికైనా రాగలడా? దేవతలతో, ఇంద్రుడితో సహా కలిసి యుద్ధం చేయడానికి వచ్చినా రాముడు నా ఎదుట నిల్వగలడా?".

ఈ విధంగా చెప్పి దేవతా సేనను దండించిన వాడు, మిగుల ప్రచండ బలుడు, పది తలలు కలవాడు అయిన రావణుడు విభీషణుడిని విడిచి లోపలికి పోయాడు. అందరి ఎదుట అతడిని ఏమీ అనలేక తానే వెళ్లిపోయాడు.

సర్గ–11
కొలువుకూటానికి పోయిన రావణుడు

హితులైన వారు తనను అనాదరం చేసిన కారణాన, తానుగా చేసిన సీతాహరణం పాప కార్యమైనందున, సీతమీద కల కామాతిశయం వల్ల బుద్ధి నాశనం కావడాన, రావణాసురుడు తేజోహీనుడై శుష్కించసాగాడు. ఆలోచనకు తగ్గ సమయాన్ని చూసుకుని ముందు ఆలోచించి తరువాత కార్యం చేపట్టాలి. అది దాటిపోయింది. కార్యం కానే అయింది. దాని ఫలితంగానే ఇప్పుడు యుద్ధం చేయాల్సి వస్తున్నది. ఇది అందరితో కలిసి చేయాల్సిన పని. ఇప్పుడేం చేయాలి? అని మంత్రులతో, హితులతో ఆలోచించడానికి సమయం ఇదేనని అనుకున్నాడు రావణుడు. విభీషణుడు తనకు విరుద్ధంగా చెప్పడం, ఇతర మంత్రులు దాన్ని ఆమోదించినట్లు వూరకే వుండడం, దీనర్థం తన విషయంలో కొందరికి భేదాభిప్రాయం వున్నదని రావణుడు గ్రహించి, తాను చేసినది అందరికీ సమ్మతమే అని అనిపించాలనుకుని రావణుడు సభకు పోదల్చుకున్నాడు. విభీషణుడిలాగా చెప్పినవారు కొందరున్నప్పటికీ అలా తెగబడి చెప్పినవారు మాత్రం లేరు. వారంతా రావణుడి కోపానికి భయపడ్డారు. రావణుడు అలా సభా మందిరం దిక్కుగా తరలి వస్తుంటే, , తరవారి, డాలు ధరించి కొందరు ఆయన ముందుగా నడిచారు. పలువురు ఇరుపక్కల నడిచారు. వీరంతా రావణాసురుడిని విశేషంగా చుట్టుకుని అతడి వెంటపోయారు.

రావణుడు సభామందిరానికి బయల్దేరి పోతుంటే వాద్యధ్వనులు అన్నిచోట్లా పెద్దగా వినిపించాయి. శంఖాల పెద్ద ధ్వనులు పరంపరలుగా అయ్యాయి. రథచక్రాల ధ్వనులు భూమ్యాకాశాలను ఆక్రమించాయి. ఛత్రాలు నక్షత్రాల లాగా కనిపించాయి. రావణుడు పోతున్నప్పుడు మార్గంలో ఎదురైన రాక్షసులు

వాహనాలు దిగి నేలమీద నిలబడి వినయంగా రెండు చేతులు జోడించి తలవంచి రథమ్మీద వున్న రావణుడికి మొక్కి పోసాగారు. కొందరు రాక్షసులు జయజయ అని దీవించగా కొందరు స్తోత్రం చేయగా తేజస్సుకల రావణుడు విశ్వకర్మ నిర్మితమైన మందిరంలోకి తొందరగా ప్రవేశించాడు. ఆ తరువాత వైడూర్యాలతో నిండిన,చిత్రవర్ణపు జింక చర్మంతో అలంకరించబడిన, యొరుగు దిండుకల ఎత్తైన ఉన్నతాసనం మీద కూర్చున్నాడు.

రాక్షసులందరినీ సభకు రప్పించిన రావణుడు

రావణుడు ఆసనం మీద కూర్చోక ముందే వేగంగా పోగల దూతలను పిలిచి, వారిని త్వరగా పోయి సమర్థులైన, ఆలోచనాపరులైన రాక్షసులందరినీ, ఆలోచించాల్సిన పని ఒకటుందని చెప్పి సభకు తీసుకుని రమ్మన్నాడు. వారంతా ఆయన ఆజ్ఞ మేరకు అలాగే పోయారు. ఆ ధూతలు ఇంటింటికీ పోయి రాజాజ్ఞ ప్రకారం రమ్మని చెప్పారు. ఇలా దూతలు పిలవగానే రాక్షసులు రథాలను ఎక్కో, ఏనుగులనెక్కో, గుర్రాలను ఎక్కో, నడిచో సభకు వస్తుంటే పక్షుల గుంపులు కమ్మిన ఆకాశంలాగా వీధులు కనిపించాయి. వాళ్ల వాహనాలను దూరంలోనే నిలిపి, కిందకు దిగి, కాలినడకన గుహలోకి పోయే సింహాలలాగా సభలోకొ పోయి, రావణుడి పాదాలకి నమస్కారం చేసి, వారి-వారి యోగ్యతకు తగ్గట్లు ఆసీనులయ్యారు. పురోహితులు పీటలమీద, శ్రోత్రియులు దర్భాసనాల మీద, కొడుకుల్లాంటివారు నేలమీద పరిచిన కంబళ్ల మీద రావణుడి ఆజ్ఞ ప్రకారం కూర్చున్నారు. కార్యం నిశ్చయించే సామర్థ్యం కల పండితులు, సర్వం తెలిసినవారు, జ్ఞాననేత్రం కలవారు, గుణవంతులు, మంత్రిశ్రేష్టులు ఆ సభలో వందలమంది వున్నారు. యుద్ధనిపుణులైన వారనేకులున్నారక్కడ. వీరంతా ఒక్కసారి వున్నట్లుండి తమను పిలిపించడం వల్ల ఏమి అపాయం వచ్చిందో అని రావణుడి క్షేమం విచారించడానికి వచ్చారు. అప్పుడు మహానుభావుడైన విభీషణుడు వచ్చి,అన్న దగ్గరికి పోయి, పాదాలు స్పృశించి తన పేరు చెప్పి నమస్కారం చేశాడు. ఆ విధంగానే శుకుడు, ప్రహస్తుడు కూడా చేశారు. వారందరికి తగిన ఆసనాలు ఏర్పాటు చేయడంతో వారంతా కూర్చున్నారు. ఆ రాక్షసులలో ఒక్కడైనా గట్టిగా మాట్లాడినవాడు లేడు. అక్రమంగా వాదించేవాడు లేడు. మర్యాద తప్పి చప్పుడు చేసేవాడు లేడు. అంతా ధీరులు, వీరులు. రావణుడి ముఖం చూస్తూ ఇంద్రుడిని వసువులు కొలిచినట్లు కొలుస్తుంటే అతడు ప్రకాశించాడు.

సర్గ–12
రాక్షసులను సంబోధించిన రావణుడు

అప్పుడు రావణుడు సభలో వున్నవారందరినీ కలియచూశాడు. చూసి, సేనానాయకుడైన ప్రహస్తుడితో ఇలా అన్నాడు. "సేనాపతీ!నువ్వు త్వరగా పోయి, నాలుగు రకాలైన యోధులను, వీరులైనవారిని, ఇదివరకంటే ఎక్కువగా కాపలా పెట్టు" అని చెప్పగా అతడు రాజాజ్ఞ ప్రకారం పట్టణం లోపల, వెలుపల, అన్ని ప్రదేశాలలో పట్టణం రక్షించడానికి వేర్వేరు రాక్షసులను వేర్వేరు స్థలాలలో వుండడానికి నియమించాడు.

"రాక్షసేశ్వరా! అన్ని సేనలను అన్ని స్థలాలలో నిలిపాను. భయం లేదు. సందేహం లేకుండా మీ పని మీరు చేయవచ్చు" అని ప్రహస్తుడు చెప్పాడు. రావణుడప్పుడు తాను చేయదల్చుకున్న కార్యం గురించి చెప్పసాగాడిలా.

"రాక్షసులారా! ధర్మం, అర్థం, కామం....వీటిలో ఏది చేయతగింది అని ఆలోచిస్తే ఏది చేసిన కీడు, మేలు, సౌఖ్యం, దుఃఖం, ప్రియం, అప్రియం కలుగునో అని విచారించి మంచి–చెడు నిశ్చయించండి. నాకేది మేలో, మీకేది మేలో నాకు తెలియదా, మిమ్మల్ని అడగాల్నా అని అంటారేమో? నాకు తెలిసినా, తెలియకున్నా ఇంతదాకా మీరంతా చెప్పినట్లే ఏ పనైనా చేస్తున్నాను కదా! దానివల్ల ఏ పనీ చెడిపోలేదు. అన్నీ సానుకూలంగానే వున్నాయి. కాబట్టే ఇప్పుడు కూడా మీ ఆలోచనప్రకారమే పోవాలని అడుగుతున్నాను. ఆ ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, దేవతలు సమ్మతించిన మార్గంలో పోవడానికి మీరు చెప్పినట్లు చేసేకదా నేనీ సంపద పొందాను. మీరు సంపాదించి ఇచ్చింది కాపాడాల్సింది మేరేకదా? ఇప్పుడు నేను మీకు చెప్పబోయేదంతా ముందే

చెప్పాలని నా మనసులో వుండేది. కాని కుంభకర్ణుడు నిద్రపోతున్నందువల్ల చెప్పలేదు. ఆరు నెలలు నిద్రపోయి ఇప్పుడే మేల్కొన్నాడు కదా! కాబట్టి ఇప్పుడు చెప్పుదామనుకున్నాను".

(ఆరు నెలలు కుంభకర్ణుడు నిద్రపోతే సీతాదేవిని తెచ్చి పదినెలలయింది కదా! ఆరునెలలకు ముందు వాడు ఒకసారి మేల్కొన్నాడు కదా? అప్పుడెందుకు చెప్పలేదు? వాస్తవమేమంటే సీతను తాను తెచ్చిన విషయం రావణుడెవ్వరికీ తెలియకుండా దాచిపెట్టాడు. ఎవరికీ తెలియరాదనీ, తన అంతఃపుర స్త్రీలు మాత్రమే సంచరించే ఉద్యానవనంలో వుంచాడు. కాబట్టి అంతఃపురానికి వచ్చిపోయేవారికి మాత్రమే ఆమె గురించి తెలుసు. ఆడవారి వల్ల విభీషణాదులకు తెలిసింది. హనుమంతుడు బహిరంగ పరిచేవరకు నగరంలో చాలామందికి తెలియదు. ఇంతెందుకు...యుద్ధానికి పోయే భటులకు ఆ యుద్ధం ఎవరితోనో, ఎందుకో కూడా తెలియదు. ఇది రాజనీతే కావచ్చుకాని దుర్నీతి కూడా. రాజనీతి రెండు రకాలు. ఒకటి సునీతి, రెండోది దుర్నీతి. సునీతి ధర్మాన్ని అనుసరించి వుంటుంది. దుర్నీతి ధర్మ విరుద్ధంగా వుంటుంది. రాజులకు ఉభయ నీతుల్లో అధికారం వుంది. ఇతరులకు దుర్నీతిలో అధికారం లేదు).

రాక్షసులకు సీత వృత్తాంతం చెప్పిన రావణుడు

రావణుడు రాక్షసులతో ఇలా చెప్పసాగాడు. "రాముడి భార్యను,విదేహరాజు కూతురైన సీతను, దండకారణ్యంలో వుండగా తెచ్చాను. ఎందుకు తెచ్చానంటారా....ముల్లోకాలలో వెతికినా అలాంటి అందగత్తె ఇంకొకరు లేరు. ఆమెను నా భార్యగా చేసుకోవాలని భావించి తెచ్చానుకాని ఆమె ఇంతవరకు నా పానుపు ఎక్కడానికి అంగీకరించలేదు. ఆ బంగారు బొమ్మను, అందగత్తెను, చూసినప్పుడు మయుడే దీన్ని సృష్టించెనా అని అనిపిస్తుంది. ఆ సుందరి పాదాలు, ఎర్రటి గోళ్లు, చూడగా-చూడగా మన్మథుడు నన్ను పరాక్రమించి కాలుస్తున్నాడు. సీత నాకు లభించకపోతే నేను మదనతాపంతో చావడం తథ్యం. కాబట్టి నేను బతికుండాలని అనుకుంటే నాకు తగిన ఉపాయం చెప్పండి. ఆ సీతను చూసి నేను మన్మథ వశమైనాను. చక్కటి అవయవసంపద కలిగిన ఆ స్త్రీ ముఖం చూసి రాక్షసులారా! నేను మారుడి వశమైనాను. మన్మథుడి వల్ల కలత చెందిన మనస్సుకలవాడినైనాను. మన్మథుడి దాటికి స్రుక్కిపోయాను".

"కోతులైనా, రాజకుమారులైనా, భయంకరమైన జంతువులున్న ఈ

సముద్రాన్ని ఎలా దాటిరాగలరని అనుకోకూడదు. ఎందుకంటే ఒక్క కోతేకదా సముద్రం దాటివచ్చి మనతో అంత పెద్ద యుద్ధం చేసింది. ఏ పని, ఎప్పుడు, ఎలా జరుగుతుందో ఎవరూహించగలరు? ఆ కారణాన ఇకముందు నేను చేయాల్సిన పనేదో దాన్ని మీ ఇష్టప్రకారం ఆలోచించి చెప్పండి. మనుష్యులవల్ల మనకు భయం లేదన్న మాటను మనస్సులోనే వుంచుకోండి. దేవదానవ యుద్ధంలో మీ భుజశౌర్యం ఆధారంచేసుకునేకదా నేను జయించాను. యుద్ధాలలో మీరేకదా నాకు జయం కలిగించారు. ఆ రాజకుమారులు సీతాదేవి ఇక్కడ వున్న విషయం తెలుసుకుని సుగ్రీవుడి సారధ్యంలో వానరసేనతో సముద్ర తీరానికి వచ్చి వున్నారు. మీరు నాకు చెప్పాల్సిన ఆలోచన ఏంటంటే, సీతాదేవిని తిరిగి ఇవ్వడానికి వీల్లేదు...రాముడిని చంపాలి...దానికి తగ్గ ఉపాయం కావాలి".

రావణుడి మీద కోపంతో మాట్లాడిన కుంభకర్ణుడు

రావణుడు ఇంకా ఇలా అన్నాడు."వానరసేనతో సహా సముద్రం దాటగలవాడు రాముడొక్కడే. రాముడు రాకపోతే వానరులు రాలేరు. కాబట్టి ఆ ఒక్క రాముడిని చంపితే, మనకు జయం లభిస్తుంది. దానికి ఉపాయం చెప్పండి".

కామంవల్ల వైపరీత్యం చెందిన మనస్సుకల రావణుడి ఏడుపు విని కోపంతో కుంభకర్ణుడు వాడితో ఇలా అన్నాడు. "రామలక్ష్మణులు ఇద్దరూ రక్షిస్తున్న సీతాదేవిని నువ్వు ఎవరిని అడిగి ఎత్తుకొచ్చావు? ఆలోచించిన తరువాతే ఏ పనైనా చేయాలికదా? పనైన తరువాత ఆలోచన చేస్తారా ఎవరైనా? కార్యం నువ్వు చేయకముందు మా ఆలోచన అడిగితే నీకీ మనక్షోభ లేకుండా ఉపాయం చెప్పేవాళ్లం. అలా చేసి వున్నట్లయితే మంచి జరిగేది. కార్యం చేసి, ఇప్పుడు ప్రాణం మీదకు వచ్చిన తరువాత విచారపడితే లాభం ఏమిటి? రాచకార్యాలు మొదటే న్యాయమార్గాన ఆలోచించి చేసినట్లయితే ఆ కార్యం చెడ్డా విచారపడడు. మనం న్యాయంగా చేయాల్సినది చేశాం...దైవం ప్రతికూలిస్తే ఏం చేయగలం? అని బాధపడకుండా వుండవచ్చు. ఎంతమంచి కార్యమైనా విపరీతంగా ఆలోచించి చేయడంలో సామర్ధ్యం లేకపోతే ఆ పని అందమే చెడుతుంది. చెడిపోవడం మాత్రమే కాదు, చెడుఫలితం కూడా కలిగిస్తుంది. ఒక్కొక్కప్పుడు మంచి పనులే చెడు ఫలితాలను ఇస్తుంటే నువ్వు చేసిన అకార్యం చెడు ఫలితం ఇవ్వడంలో ఆశ్చర్యం ఏముంది? వెనక చేయాల్సిన పని ముంది, ముందు చేయాల్సిన పని వెనక చేసేవాడు నీతి, అనీతి తెలిసినవాడని చెప్పవచ్చా? కాబట్టి

నువ్వు నీతి తెలిసినవాడివి కాదు".

"ఒకడెవరైనా బలవంతుడే అయినా, ఆ కారణాన అసాధ్యుడే అయినా, వాడు బుద్ధి, స్థయిర్యం లేకూండా నియమం తప్పి కార్యాలు చేస్తే వాడిలోని దోషాలు కనిపెట్టి, సిలువుగా విరోధులు భేదిస్తారు. క్రౌంచ పర్వతం బలిష్టమై, భేదించడానికి వీల్లేకపోయినప్పటికీ, దాంట్లో వున్న రంధ్రంలో దూరికదా పక్షులు బయటకు, లోపలికి పోయివస్తుంటాయి. కుమారస్వామి క్రౌంచ పర్వతాన్ని శక్తితో భేదించాడు. అప్పుడు దాంట్లో రంధ్రం ఏర్పడింది. ఆ రంధ్రంలో దూరి హంసలు మానస సరోవరానికి పోతుంటాయి. నువ్వు దోషయుక్తమైన పనిని, అపాయంతో కూడిన పనిని, చేశావు. నిన్ను రాముడు అక్కడే చంపకుండా విడవడం అంటే నువ్వు నిజంగా అదృష్టవంతుడివే! ఇతరులెవ్వరూ చేయని దుష్కార్యాలను నువ్వు చేయాలనుకున్నావు. నీతోడబుట్టిన కారణాన నాకు ఇప్పుడు నీతో నిల్వక తప్పుతుందా? తప్పదు. అయినా దానికి వగచి లాభం ఏమిటి? ఇక జరగాల్సింది చెప్తా విను".

"ఇంద్రుడు, అగ్ని, సూర్యుడు, వాయువు,కుబేరుడు అడ్డుపడ్డా నీ శత్రువులను చంపి నీ కార్యాన్ని చక్కబరుస్తాను. నేను చేతిలో గుదియ ధరించి, తిప్పుతూ, కరకైన కోరలనుఅన్నిదిశలలో వ్యాపిస్తుంటే కొండంత దేహంతో, బలం కొద్దీ సింహనాదం చేస్తే ఇంద్రుడైనా డీలా పడిపోవాల్సిందే. 'ఓయీ! నువ్వు సమీపానికి పోయి మాత్రమే కొట్టగలవు. రాముడు దూరంనుండే నీ మీద బాణాలు ప్రయోగిస్తాడు. నువ్వేం చేయగలవు?' అంటావేమో? రాముడి మొదటి బాణానికే నేను చావను. కాబట్టి రెండో బాణం వేసి నన్ను చంపేలోపలే ఆయన మీద పడి రాముడి నెత్తురు నేను పూర్ణంగా తాగుతాను. ఆ తరువాత నువ్వు సుఖపడు. రామలక్ష్మణులను చంపి వానరులందరినీ భక్షించి, తేల్పులు తీస్తూ, నీకు విజయం, సౌఖ్యం కలిగిస్తాను. నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు సారాయి తాగి, నీకు ఇష్టమైన పనులలో భయం లేకుండా వుండు. ఆ శ్రీరాముడు భయంకర యుద్ధంలో చనిపోయి యమపురికి పోగా ఆ తరువాత సీతాభామరత్నంతో నువ్వు సంతోషంగా వుండు".

సర్గ–13

సీతాదేవిని విడవద్దన రావణుడికి చెప్పిన మహాపార్శ్వుడు

రావణుడు చేసిన పని మంచిదికాదని కుంభకర్ణుడు చెప్పడం వల్ల అతడికి కోపం వచ్చిందని గ్రహించిన మహాపార్శ్వుడనే వాడు అతడి కోపం చల్లారే ఉపాయం కొంచెం ఆలోచించి, నమస్కారం చేసి, గర్వంతో ఇలా అన్నాడు.

"కష్టపడి అడవికి పోయినవాడికి తేనె దొరికితే, దాన్ని తాగకుండా ఉపేక్షించే వాడిని బుద్ధిమంతులు మూఢుడంటారు.అలాగే నువ్వు ప్రాణగండమైన కార్యాన్ని చేసి, సీతను తెచ్చి, అనుభవించలేకపోతే మూఢుడివే! నువ్వే లోకాలకు ప్రభువివి. నీకు వేరే ఎవరైనా ప్రభువున్నాడా? కాబట్టి రాక్షసేశ్వరా! నువ్వు సీతతో నిత్య సుఖాన్ని అనుభవించు. సీతాదేవి ప్రేమగా తనకుతానుగా నీతో సుఖపడడానికి ఇష్టపడకపోతే బలవంతంగా అనుభవించు. అందులో కూడా సుఖం వుంది. శీఘ్రంగా నీ కోరిక నెరవేరితే ఆ మరుక్షణమే నువ్వు చనిపోయినా పరవాలేదు. లేక, కొంతకాలం తరువాత మరణం వచ్చినా రానీ. దాన్ని నువ్వు సహించవచ్చు. ఇప్పుడు నువ్వు పడే బాధకంటే మరణం కష్టం కాదు. రాముడిని చంపడం ఒక గొప్ప పనిగా నువ్వు ఆలోచిస్తున్నావే? వజ్రాయుధం ధరించి ఇంద్రుడు రాముడికి తోడుగా వచ్చినప్పటికీ కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, మేం ఆయన్ను శీఘ్రంగా చంపుతాం. నీదాకా రానిస్తామా?రాక్షసరాజా! కొందరు సీతను ఇవ్వడం మంచిదని నీకు భోదిస్తున్నారు. ఆ విషయంలో నా అభిప్రాయం విను. శక్తిలేనివారు, పిరికి వాళ్లు, మొదలు సామం అనీ, దానం అనీ, అవి వ్యర్థం అయితే భేదం సలపమనీ అంటారు. కాని అది బలవంతుల మార్గం కాదు. శక్తికలవాడు అన్ని వేళలా దండనీతినే అనుసరిస్తాడు. కొట్టి తీసుకునే శక్తి వున్నప్పుడు లంచం ఎందుకు ఇవ్వాలి? కాబట్టి నీకోరికను యుద్ధం ద్వారానే తీర్చుకో. పగవారు ఇక్కడికి వస్తే మేమే వాళ్లందరినీ చంపుతాం. సందేహం

లేదు. నీ అంతట నువ్వు నీ కోరిక ప్రకారమే నడుచుకో".

బ్రహ్మ తనను శపించిన సంగతి మహాపార్శ్వుడికి చెప్పిన రావణుడు

మహాపార్శ్వుడి మాటలను రావణుడు మెచ్చుకుని తన పూర్వ చరిత్రను అతడితో ఇలా విచారంగా చెప్పాడు.

"మహాపార్శ్వా! నా విషయంలో గతంలో చోటుచేసుకున్న ఒక విషయం చెప్తా విను. అది రహస్యం ఎవరికీ తెలియదు. పూర్వం ఒకనాడు పుంజికస్థల అనే అప్సరస బ్రహ్మ సేవకొరకు ఆకాశమార్గాన పోతూ నన్ను చూసి భయపడి ఒదిగి, ఒదిగి పోసాగింది. అగ్నిశిఖలాంటి కాంతికల దాన్ని నేను బలవంతంగా పట్టుకుని చెరిచాను. దానికి ఒంటిమీద చీర లేకుండా చేశాను. అది నలిపిన తామరలాగా బ్రహ్మ సభకు పోయింది. బ్రహ్మ దాని వృత్తాంతం తెలుసుకుని నన్ను శపించాడు. శపిస్తూ, 'ఇది మొదలు రావణా! నువ్వు, నిన్నొల్లని స్త్రీని బలవంతంగా చెరచడానికి సమీపిస్తే, వెంటనే నీ తల నూరు తునకలై నేలపడి పోతుంది'. అని అన్నాడు. ఈ శాపానికి భయపడి సీతను ఆశించక ఆగిపోయాను. ఈ భయమే లేకపోతే ఎప్పుడో ఆమెను నా పానుపు మీదకు తెచ్చేవాడిని".

(ఈ కారణానే రావణుడు సీతను తాకినప్పుడు చావలేదు. రావణుడు సీతను అంగీకరింప చేసి తరువాత అనుభవించాలన్న అభిప్రాయంతో వున్నాడు. అందుకే చావలేదు).

"యుద్ధంలో సముద్ర వేగం ఎలాగో నాదీ అలాగే. సుడిగాలి ఎలా వృద్ధి చెందుతుందో అలాగే నేనూ వృద్ధి చెందుతాను. ఇది తెలియక ఇక్కడికి సీత కొరకు రాముడు సుగ్రీవుడి సహాయంతో పెద్ద వానరసేనతో వస్తున్నాడు. కొండగుహలో నిద్రించే పెద్ద సింహాన్ని నిద్ర లేపినట్లు, కోపించిన మృత్యువును నిద్ర లేపినట్లు, నా భయంకరమైన పాములలాంటి బాణాలను రాముడెప్పుడూ చూడలేదు. కాబట్టి నన్నెదిరించి యుద్ధం చేయడానికి వస్తున్నాడు. నా విల్లు నుండి బయటకొచ్చిన వజ్రాయుధంతో సమానమైన బాణాల వర్షం తనమీద వ్యాపించగా చేసి, ఇంద్రుడు సహాయంగా వచ్చినా, యుద్ధరంగంలో రాముడిని పారదోలుతాను. వేయికన్నుల ఆ ఇంద్రుడైనా, పాశాలను చేత ధరించిన వరుణుడైనా, నన్ను ఎదిరించి యుద్ధంలో నిలవగలరా? కుబేరుడి గర్వం అణచి లంకను హరించాను కదా? ఇక రాముడి బలమెంత? ఉదయించే సూర్యుడు నక్షత్రాల కాంతిని హరించినట్లు రాముడి సైన్యాన్ని నేను రూపుమాపనా?"

సర్గ–14
సీతాదేవిని శ్రీరాముడికి ఇవ్వమని రావణుడికి భోదించిన విభీషణుడు

రావణుడు చెప్పిన మాటలను, కుంభకర్ణుడి వదరు మాటలను, వినీ–వినీ, హితంగా, స్వప్రయోజనంగా విభీషణుడిలా అన్నాడు.

"రావణా! రాక్షసరాజా! సీత అనే మహా విషసర్పాన్ని తీసుకుని రావడం సరైనదేనా? ఆలోచించు. రాక్షసులను రంజింప చేయడమే నీ పని కాని, వారికి చేటుతేవడం కాదు. నువ్వు చేసిన పనివల్ల కలిగే కీడు నీ ఒక్కడితో పోదు. పర్వత శిఖరాల లాగా ఎత్తైనవారు, గోళ్లు, కోరలు ఆయుధాలుగా కలవారు, భయంకరమైన గమనం కలవారైన కోతులు వచ్చి ముట్టడించి పౌరులను భాదిస్తారు. ముందుగా బాధపడేవారు రాక్షసులే. అందరూ అయినతరువాత నువ్వు బాధపడుతావు. కాబట్టి వానరులు రాకముందే సీతను రాముడికివ్వు. ఒక్క వానరుడే ఇంత చేస్తే అందరు వానరులు ఇంకెంత చేస్తారో ఆలోచించు. వానరులకంటే ముందే వాయువేగంతో, పిడుగుల గుంపుతో సమానమైన రామబాణాలు వచ్చి, రాక్షసుల తలలు నేలపడవేస్తాయి. అవి రాకముందే సీతను రాముడికివ్వు. అప్పుడు నీవల్ల రాక్షసులకు చేటు తప్పుతుంది".

"వానరులు, రాముడు వస్తే ఇక్కడున్న వారు నిద్రపోతున్నారా అని అంటావేమో? కుంభకర్ణుడైనా, కుంభ–నికుంభులైనా, ఇంద్రజిత్తే అయినా, మహోదర మహాపార్శ్వులైనా రాముడిని ఎదిరించగలరా? (ప్రహస్తుడిని ఉద్దేశించి) ప్రహస్తా! నువ్వు సునాయాసంగా చంపుతానంటున్నావు. యుద్ధంలో నువ్వు రాముడిని ఎదిరిస్తే....సూర్యుడు నిన్ను తనలో పెట్టుకుని నిన్ను రక్షించినా, ముప్పైమూడు కోట్ల దేవతా సమూహాలు నిన్ను కాపాడినా, నీమీద నిండారు

దయతో ఇంద్రుడు తన తొడలో నిన్ను దాచిపెట్టినా, ఇప్పుడే నిన్ను చంపవద్దని మృత్యుదేవత అడ్డుతగిలినా, పాతాళలోకానికి పోయి నువ్వు దాక్కున్నా రాముడు నిన్ను ప్రాణాలతో వదలడు".

అని చెప్పిన విభీషణుడి మాటలకు ప్రహస్తుడు బదులిలా చెప్పాడు. "దేవతలు, సిద్ధులు, కింపురుషులు, యక్షులు, వాసుకి లాంటి సర్పాల వల్ల మాకు భయం లేదు. నిశ్చయం. ఇక రాజకుమారుడి వల్లా మాకు భయం? ఎందుకు మమ్మల్ని ఇలా వ్యర్థపు మాటలతో బెదిరిస్తున్నావు?".

ప్రహస్తుడిని గర్హించిన విభీషణుడు

ప్రహస్తుడిలా చెప్పగా, ధర్మార్థ, కామములలో ఆసక్తికలిగిన విభీషణుడు ప్రభువు రావణుడి మేలు కోరి ఇలా అన్నాడు.

"ప్రహస్తా! ఎందుకిలా మాట్లాడుతావు? నువ్వు, మహోదరుడు, కుంభకర్ణుడు, రామచంద్రమూర్తి విషయంలో చేస్తున్న ఆలోచన అధర్మవర్తనానికి దారితీస్తుంది. కార్యనిర్వహణలో సమర్థుడైన శ్రీరాముడిని, నువ్వు, నేను, సకల రాక్షసులు కలిసినా చంపలేం. అలా చంపడం సాధ్యమే అయితే నేనెందుకు ఇలా అంటాను? ఇదైనా ఆలోచించలేవా? ధర్మమే పరమని భావించే రామచంద్రుడిని దేవతలే ఎదిరించలేక పోవడమే కాకుండా, ఆయన శక్తి ఇంత అని తెలుసుకోలేక పోయారు. ఇక మనం ఎంతమాత్రం? ఇంద్రుడి వజ్రాయుధంతో సమానమైన వేగం కల రామబాణాలు నీ శరీరంలో గతంలో ఎప్పుడూ నాటుకోలేదు కాబట్టి నీకు తెలియదు. అందుకే ఇలా అజ్ఞానంతో మాట్లాడుతున్నావు. ప్రహస్తా! నువ్వొక్కడివే కాదు....రావణుడైనా, ఇంద్రజిత్తైనా, కుంభకర్ణుడైనా, త్రిశిరుడైనా, నికుంభ, నరాంతకాదులైనా, పర్వతమంత బలవంతుడైన అకంపనుడైనా, అతికాయుడైనా, వీరంతా కలిసికాని, విడి-విడిగా కాని యుద్ధంలో రాముడి కనుచూపుమేరలో నిలవలేరు".

"ప్రహస్తా! రావణుడి శత్రువులు చేయాల్సిన పని మీరు చేస్తున్నారు. పేరుకే మీరు స్నేహితుల్లాగా నటిస్తున్నారు. రావణుడి దగ్గరున్న సకల రాక్షసులు నాశనమైపోవడానికి మీరు దోహదపడుతున్నారు. ఇలాంటి సర్వవైనాశికులైన మీకు నేనేం చెప్పగలను? రామద్వేషమనే పాము రాక్షసేశ్వరుడిని చుట్టుకున్నది. ఆయన దాన్నుండి తప్పించుకోలేక మతి చెడిపోయింది. మీరన్నా బలవంతంగా ఆయన్ను బయటికి లాగండి. శత్రువులు వచ్చి ఆయన తల వెంట్రుకలు

పట్టుకోకముందే ఆయన్ను రక్షించాలి. అలా చేయకపోతే మీరు క్రుతఘ్నులు, ద్రోహులు అయిపోతారు. ఆయన బాగుంటేనే కదా మీరు తినవచ్చు, కాబట్టి మీ మేలు కోసమైనా ఆయన్ను రక్షించండి. లక్ష్మణుడనే సముద్రంలో మునిగి, శ్రీరాముడనే బడబాగ్నిలో పడబోయే రావణుడిని బుద్ధిమంతులైన మీరు బలవంతంగానైనా బయటపడేసి రక్షించండి. ఇలా మీరు చేస్తే రాక్షస సమూహానికి, రావణుడికి చాలా మేలు కలుగుతుంది. ఇది చేయాల్సిన పని. రామచంద్రుడికి సీతను అప్పగించడమే మేలని నా అభిప్రాయం".

"మంత్రులారా! మీరు చేయకూడని పని చేయమని చెప్పడానికి నేను రాలేదు. మీరేదైతే చేయాలో అదే చెప్తున్నాను. ఏమిటా కార్యం అంటే చెప్తా వినండి. మనరాజు బలమెంత? శత్రువుల బలమెంత? తన స్థితి ఏమిటి? శత్రువుల స్థితి ఏంటి? శత్రువులు తగ్గి వున్నారా? మనం తగ్గి వున్నామా? వృద్ధి శత్రువులకు వుందా? మనకుందా? అని ఆలోచించి తమ రాజుకు మేలైనదానిని చెప్పడం మంత్రికృత్యం. దాన్నే మీరు చేయాలని చెప్తున్నాను".

యుద్ధమే జరుగుతే రావణుడికి జయం కలగదని విభీషణుడికి నమ్మకంగా తెలుసు. ప్రత్యక్షంగా కీడు కలగనున్నందున తన వాదనను నొక్కి చెప్పాడు.

సర్గ-15
విభీషణుడిని ధిక్కరించి పలికిన ఇంద్రజిత్తు

విభీషణుడు చెప్పిన ఆమాటలు విన్న ఇంద్రజిత్తు తండ్రితో ఇలా అన్నాడు. "ఇదేంటి తండ్రీ! నీ తోడబుట్టిన వాడే ఇలాంటి నీచమైన, నిష్ప్రయోజనమైన, భయం కలిగించే విధంగా, మన జాతికే అయోగ్యమైన మాటలంటున్నాడు? విన్నావా? మన వంశంలో పుట్టినవాడే కావచ్చు. ఈ విధంగా ఎవడైనా చెప్పవచ్చా? ఒకవేళ ఇలాంటివాడు చెప్పినా, ఎంతటి శక్తిహీనుడైనా వింటాడా? శౌర్యంకాని, దానికి కావాల్సిన బలం కాని, సాహసం కాని, దృఢమైన విక్రమం కాని, నిలకడకాని, తిరస్కారంలో సహనం కాని, బలిష్ఠమైన ధైర్యంకాని, వీటిలో ఏవైనాకాని లేని నపుంసకుడు నీ తమ్ముడు. విభీషణుడొక్కడే ఈ గొప్ప కులంలో అపకీర్తి సంపాదించడానికి పుట్టాడు". ఆ తరువాత విభీషణుడి వైపు తిరిగి తన పరాక్రమ పౌరుషాలను గురించి చెప్పాడిలా.

"పిరికీ! నువ్వా మాకు భయం నేర్పేది? మాలో అధముడైన ఒక్క రాక్షసుడు రామలక్ష్మణులిద్దరినీ తరుమగొట్టలేడా? ఎందుకు వ్యర్థంగా ఇన్ని మాటలు చెప్తున్నావు? లోకాలన్నిటినీ పాలించేవాడిని, జయించే స్వభావం కలవాడిని, జిష్ణుడని పేరున్న వాడిని, చావులేని దేవతలకు ప్రభువు అయిన ఇంద్రుడి గర్వాన్ని అణచి చెరసాలలో పడవేయలేదా? దిక్కుతోచనక తికమకపడే దేవతలను తరిమి కొట్టలేదా? నా శక్తి గమనించి నేను కొట్టక ముందే నేలపడి అరుస్తున్న ఐరావతం కొమ్ములను వూడబెరికి వాటితో శత్రువులను తరమలేదా? దేవతా సమూహాల గర్వం అణచలేదా? ఇవన్నీ నీకు తెలియదా? అంత గొప్ప కార్యాలను చేసినవాడినైన నేను సామాన్యమైన రాజకుమారులను, బలం లేని మనుష్యులను జయించడం ఆశ్చర్యమా విభీషణా?"

జవాబుగా ఇంద్రజిత్తును చూసి అందరూ వింటుండగా జంకక విభీషణుడు ఆయనకు మేలు కలిగే మంచి మాటలను చెప్పాడు.

ఇంద్రజిత్తును నిందించిన విభీషణుడు

విబీషణుడు ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు. "కుమారా! నువ్వు పిల్లవాడివి. నీ బుద్ధి ఇంకా పరిపక్వం కాలేదు. కాబట్టి మంత్రాలోచనలో యథార్థం తెలుసుకునే శక్తి నీకులేదు. అందుకే చెడిపోవడం అంటే కూడా తెలుసుకోలేక తెలిసినవాడిలాగా లేనిపోని మాటలతో ఉపన్యాసం ఇచ్చావు. అంతమాత్రాన నీపని చక్కబడిందా? నువ్వు చెప్పేది యుద్ధ విషయాలు. ఇక్కడ జరుగుతున్న చర్చ నీ తండ్రి చేసింది తప్పా? కాదా? అనేది. తప్పైతే ఎలా సవరించుకోవాలి? కార్యం నిరపాయంగా సాధించడానికి ఏ ఉపాయం మంచిదని ఆలోచన జరుగుతున్నదిక్కడ. ఇంకా యుద్ధ ప్రసక్తి రాలేదు. యుద్ధం చేద్దామని తీర్మానం అయినప్పుడు చెప్పాల్సిన ఆమాటలు ఇప్పుడే ఎందుకు చెప్తున్నావు? సామం, దానం, దండం, వీటిలో ఏది మంచిదన్న చర్చ జరుగుతున్నది. గోటితో పోయేదానికి గొడ్డలి ప్రయోగించేవాడు బుద్ధిమంతుడా? ఇది ఆలోచించే బుద్ధి నీకు లేదు. నీకు యుద్ధం మీదే దృష్టి ఉన్నందున మిగాతా విషయాలు కనబడడం లేదు. కాబట్టి నీ ఆలోచన ప్రకారం నడుచుకుంటే నువ్వు నాశనం అవుతావని తెలియక ఏవేవో చెప్తున్నావు. ఈ మాటలతో కార్యం చక్కబడుతుందా?".

"కొడుకనే పేరుతో ప్రియమిత్రుడి లాగా వాస్తవానికి నువ్వు నీ తండ్రికి మంచి మాటలు చెప్పాలి. సీతాపతి అయిన రాముడి వల్ల భయం వుంది. యుద్ధం వద్దని నేను అంటుంటే, అది నీకు, నేను కీడు చెప్పినట్లు అనుకుంటున్నావు. అలా భావించి ఏదేదో మాట్లాడుతున్నావు. నీకు, నీ తండ్రికి నేను కీడు కోరేవాడిని కాదు. నీ వివేకం ఇంతగా వుంది! నీవు అహితం బోధిస్తున్నావు. కాబట్టి నువ్వు పగవాడిలాగా దండించతగిన వాడివి. ఒక గొప్ప విషయం ఆలోచిస్తున్న సమయంలో, సాహసమే ప్రధానంగా భావిస్తున్న వాడిని, పిల్లవాడిని, పట్టినపట్టు వదలని వాడిని సభకు రానివ్వడం తప్పు. ఎందుకంటే మూఢులు కూడిన సభలో కార్యాలోచన ఎలా జరుగుతుంది?గొప్ప కార్యాలు ఆలోచన చేసేటప్పుడు ఏడవ చెవి కూడా వినకూడదని శాస్త్రం చెప్తుంటే నీలాంటి పిల్లవాళ్ళను, ఆలోచన చేయలేని శక్తికలవారిని సభకు రానివ్వడం తప్పు కదా?"

"ఇంద్రజితా! నీకు తెలివి సున్నా. నీ స్వభావ గుణం క్రౌర్యం. పెద్దలను

సేవించిన వాడివి కాదు. కాబట్టి వినయం అంటే ఏమిటో తెలియదు నీకు. పైగా తెలిసినవాడిలాగా తీర్పులు చెప్తున్నావు. మందమతివి. బుద్ధి విశేషం లేనివాడివి. చెడు బుద్ధి కలవాడివి. నీకు తెలియదు, ఒకరు చెప్తే వినవు. చిన్న బాలుడివి. దురాలోచనపరుల్లో మేటివి. కాబట్టి పిల్లతనంతో ఇలా వదరుతున్నావు. భయంకరమైన యముడి ఆకారంతో సమానమైన ఆకారం కల రాముడేసే బాణాలను ఎవరు ఆపగలరు? (రావణుడి వైపు తిరిగి) రాక్షసేశ్వరా! నా విన్నపం హృదయంలో నాటుకోనివ్వు. సీతను బుద్ధిపూర్వకంగా రామచంద్రుడికి అప్పగించు. వూళ్లో వారంతా సుఖపడుతారు. అలా చేయకపోతే నీకు కీడు తప్పదు.

సర్గ-16

విభీషణుడికి జ్ఞాతిలక్షణం తెలిపి నిష్టూరాలాడిన రావణుడు

ఈ విధంగా చక్కటి కూర్పుకల మాటలతో హితం ఉపదేశించే విభీషణుడి ముఖం చూసి (మృత్యుప్రేరితుడైన) రావణుడు కఠినమైన మాటలతో ఇలా అన్నాడు.

"తనపై కోపించిన పాముతోనైనా, తనను చంపాలనుకునే ప్రత్యక్ష శత్రువుతోనైనా కలిసి వుండవచ్చు. కాని, తన మేలుకోరే మిత్రుడిలాగా నటిస్తూ లోలోపల తన శత్రువుకు సేవకుడై వుండేవాడితో కలిసి వుండలేం. ముల్లోకాల్లోనూ దాయాదులైన వారి సహజ గుణాలు నాకు తెలియదా? దాయాదులకు కష్టం కలిగితే సంతోషించేది కూడా వారి దాయాదులే. జ్ఞాతులలో బుద్ధిమంతుడిని, ధర్మాత్ముడిని, ఉత్తమ గుణాలు కలవాడిని, శూరుడై హితకార్యాలు సాధించే వాడిని, వాడి జ్ఞాతులు మెచ్చుకోరు. పైపెచ్చున అవకాశం దొరికితే అవమానిస్తారు. నువ్వూ అలాంటివాడివే. నీ లాంటివారు కలిసిమెలిసి తిరుగుతూనే సమయం వస్తే ఎంతటి ఘోరమైన పని చేయడానికైనా సందేహించరు. తమ మనసులో మాట బయటికి చెప్పరు. ఆపదల్లో చంపడానికి ప్రయత్నం చేస్తారు. కాబట్టి జ్ఞాతులు ఎప్పటికైనా అపాయం కలిగించేవారే. ఈ సామాన్యమైన జ్ఞాతి లక్షణం నీలో కూడా వుంది".

"నీకొక విషయం చెప్తా విను. తమను పట్టుకొనడానికి కొందరు మనుష్యులు పగ్గాలను, వారికి మచ్చికైన ఏనుగులను తీసుకునిరాగా, పద్మవనంలో వున్న ఏనుగులు వారితో ఇలా అన్నాయట. ఆ మాటలు వింటే నీకు జ్ఞాతులు ఎలాంటివారో అర్థం అవుతుంది. 'మనుష్యులారా! మీ పగ్గాలకు మేం

భయపడం. మీరు ధరించిన ఆయుధాలకూ మేం భయపడం. కాని, కఠినచిత్తులైన మా దాయాదులకు మాత్రం మేం భయపడుతాం. అవి మమ్మల్ని ఏమి చేశాయంటారా? మీ పోషణలో వున్న, మీతో ఇప్పుడు వచ్చిన ఏనుగులు మమ్మల్ని పట్టుకునే ఉపాయం చెప్తాయి. అందుకే, అన్ని భయాల్లో జ్ఞాతుల వల్ల కలిగే భయం సహించలేనిది. ఇది మాకు బాగా తెలుస్తుంది'. అని అన్నాయి ఆ ఏనుగులు''.

"గోవుల స్వభావం ఐశ్వర్యాన్ని ఇవ్వడం. బ్రాహ్మణుల స్వభావం ఇంద్రియనిగ్రహం. చపల చిత్తం స్త్రీ స్వభావం. కీడు చేయడం జ్ఞాతుల స్వభావం. లోకులు నన్ను గౌరవించడం, అసమాన సంపద నాకు లభించడం, నేను వైరుల తలమీద ఎక్కి వారిని దండించడం చూసి జ్ఞాతివైన నువ్వు సహించలేక పోయావు కదా! కాబట్టి నా శత్రువులకు నన్ను లోకువ చేసి అవమానించాలని అనుకుంటున్నావు. తామరాకు మీద వున్న జలబిందువులు దాన్ని తాకి వుంటాయి కాని తడపలేవు. కాబట్టి తాకినా, తాకకున్నా ఒకటే. తాకడం వల్ల కలిగే గుణాలు కనబడవు. అలాగే నీచుడైనవాడు కలిసిమెలిసి చేసే స్నేహం స్నేహఫలాన్ని చూపదు. రాక్షసుడా! ఇది నీచ సంబోధన...నువ్వు నిజంగా రాక్షసుడివే. పూలమీద వున్న తేనె తాగి, తమ అవసరం తీర్చుకునిన తరువాత ఆ తుమ్మెదలు ఆ పూలమీది తేనెవల్ల కదా తమ ఆకలి తీరింది అని అనుకోకుండా విడిచిపోయినట్లు, దుష్టులు తాము ఎవరివల్ల బాగుపడ్డారో వారిని, తమ పని అయిపోయిన తరువాత తలచుకోరు. రాక్షసుడా! నేను నిజం చెప్తున్నాను. నువ్వు అలాంటివాడివే. స్నానం చేసిన ఏనుగు ఒడ్డుకు వచ్చి తన నెత్తిమీద తానే మట్టి కొట్టుకున్నట్లు దుష్టులతో స్నేహం వ్యర్థం. పూర్వ స్నేహాన్ని దుష్టులు తామే నాశనం చేసుకుంటారు. నువ్వు అట్లాగే చేస్తున్నావు. నీచుల సంగతి సారహీనం, వ్యర్థం. నువ్వు పలికినట్లు ఇంకెవరైనా పలికినట్లయితే వాడి తల నిమిషంలో నేలమీద పడి వుండేది. నువ్వు తమ్ముడివని చంపకుండా వదులుతున్నాను. పాపాత్ముడా! కులద్రోహీ! ఛీ...పో. నా ఎదురుగా నువ్వు వుండవద్దు''.

సభను విడిచి ఆకాశానికి ఎగిరి రావణుడికి హితం చెప్పిన విభీషణుడు

ఇలా కఠినంగా మాట్లాడిన అన్నమీద కోపంతో, ఇక ఈ పాపాత్ముడి నేలమీద అడుగు పెట్టకూడదని, రావణుడి పంచప్రాణాలు పోతున్నాయా అన్నట్లు ఆకాశానికి ఎగిరి విభీషణుడు ఆయనకు హితం బోధించాడు మళ్లీ ఇలా.

"నువ్వు నాకు అన్నవు కాబట్టి పెద్దవాడివి. తండ్రితో సమానమైన వాడివి. కాబట్టి నేను నీకు ఎదురు మాట్లాడకూడదు. అందునా నువ్వు రాజువి. బంధువు కాకపోయినా రాజువు కాబట్టి నీకు ఎదురు చెప్పకూడదు. అందుకే నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడవచ్చు. అయినప్పటికీ నేను చెప్పదలచుకున్నది చెప్తాను. నువ్వు సీతను దొంగిలించి తెచ్చి అధర్మ కార్యం చేశావు. నేను శత్రువులకు లోబడి నీకు కీడు కలిగించడానికి ఈ మాటలు చెప్పానని అన్నావు. ఇది అసత్యం. అధర్మంలో, అసత్యంలో వున్న నువ్వు, ధర్మం, సత్యం ఆధారంగా మాట్లాడే నన్ను సభలో అవమానించి మాట్లాడావు. ఆ అవమానాన్ని నేను సహించలేను. నీ మాటలు ఒప్పుకుంటే అవి నిజమని ఒప్పుకున్నట్లే కదా! నీ మేలు కోరినవాడినైనందున విపులంగా చెప్పాల్సిన విధంగా ఇన్ని మాటలు చెప్పాను. ఇహపర సాధనమైన మంచి నీతిమార్గాన్ని చెప్పాను. అది నీ మనసుకు ఎక్కటం లేదు. ఎందుకంటావా? నీ మనసుకు కామం ఎక్కింది. కాబట్టి అక్కడ నీతి ఎక్కటం లేదు. అదీకాకుండా నువ్వు మృత్యుదేవతకు వశపడ్డావు. అది దానికనుకూలంగా నువ్వు ప్రవర్తించేట్లు చేసుకుంటున్నది. మరో విధంగా అది నడవనీయదు. హితం విననీయదు".

"లోకంలో అనేకమంది నీ మంత్రులు నీకు నచ్చేట్లు ఇచ్చకాలు చెప్పడానికి సిద్ధంగా వున్నారు. అప్రియమైనా పథ్యంగా చెప్పేవాడు మారీచుడిలాంటి వారు, నాలాంటి వారు తక్కువగా వున్నారు. ఒకవేళ మాలాంటి వారు చెప్పినా వినేవారు లేరు. దానికి నీవే ప్రత్యక్ష నిదర్శనం. కొంప కాలకముందే హెచ్చరికతో వుండాలన్న రీతిలో లంకలోని జనులందరూ, నువ్వూ, యమపాశం బారిన పడకుండా వుండాలని మంచిమాటలు చెప్పాను. రామబాణం నిన్ను నేలపడగొట్టకూడదని అనుకున్నాను. నువ్వు శూరుడివే, నీ మంత్రులు కుంభకర్ణాదులు బలవంతులే, ఇంద్రజిత్తాదులు అస్త్రశస్త్ర సంపన్నులే కాని మృత్యువు చేత చిక్కారు కాబట్టి మీ గట్టితనం వ్యర్థం. నువ్వు నాకు అన్నవని, నీ మేలుకోరి చెప్పడం నా విధి అని, నేను చెప్పిన మాటలు నువ్వు గౌరవించలేకపొయ్యావు. నామాటలు ఆదరించకపోగా నన్ను పాపమని, శత్రువని, సా సాహసం నీకపాయకరమని, నన్ను వెళ్లిపోమ్మన్నావు. అలాగే పోతాను. నన్ను విడిచి రాక్షసులను, లంకను, నిన్ను చక్కగా నిర్విచారంగా కాపాడుకో. నీకు మేలు కలుగుగాక! నేను చంపుతానన్న భయం వదిలి సుఖంగా వుండు. నేను నీ మేలు కోరి ఎంత చెప్పినా నా మాటలు నీ మనసుకు పట్టనీయడం

లేదు. మృత్యువు సమీపించి ప్రాణం పోవడానికి సిద్ధంగా వున్నవారికి హితమైన వాక్యాలు రుచించవు".

(రావణాసురుడు చేసిన తెలివితక్కువ పని విభీషణుడుని విడవడమే. కేవలం కామక్రోధాలకు వశుడై తన అభిప్రాయానికి ఎవరు ఎదురు చెప్పుతారులే అనే దురహంకారంతో విభీషణుడిని తిరస్కరించాడు. అలా కాకుండా, సభను ఏర్పాటు చేయడంలోని ఉద్దేశం అందరి అభిప్రాయం తెలుసుకోవడం కొరకనీ, అంతా ఒక్కమాట మీద వుంటే విభీషణుడు ఒక్కడే వేరే విధంగా చెప్తున్నాడనీ రావణుడు అంటే బాగుండేది. పదిమంది చెప్పినట్లు పోవాల్నా, విభీషణుడు ఒక్కడే చెప్పినట్లు పోవాల్నా అని సభ అభిప్రాయం తీసుకోవాల్సింది. గర్వాంధకారం కళ్ళను కప్పివేస్తే, మృత్యుదేవత తల వెంట్రుకలు పట్టి ఈడుస్తుంటే, సౌమ్యమైన మార్గం ఎలా కనపడుతుంది? రావణుడు ఇలా చెప్పి వున్నట్లయితే విభీషణుడు శత్రుపక్షంలో చేరి వుండేవాడు కాదు. పదిమందిలో అవమానించడం వల్లే శత్రువయ్యాడు).

సర్గ–17

నలుగురు మంత్రులతో శ్రీరాముడున్న చోటుకు పోయిన విభీషణుడు

ఈ విధంగా కఠినమైన మాటలు చెప్పి, దుష్టుడైన రావణుడిని వదిలి రావణానుజుడైన విభీషణుడు లక్ష్మణ సహితంగా వున్న రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు.

(రాముడి పరాక్రమాన్ని పలుమార్లు ఉచ్చరించినందున విభీషణుడికి శరణాగతి అనే ఉపాయం మీద మహా విశ్వాసం వుందని అనుకోవాలి. తనను తిరస్కరించిన రావణుడి దగ్గర వుండవద్దనుకున్నాడు. శ్రీరామసేవే కర్తవ్యం అనుకున్నాడు. దుర్మార్గుడి తమ్ముడైనా విభీషణుడు సత్వగుణాధికుడు కాబట్టి సర్వ విధాలా హితోపదేశం చేశాడు. ఇవేవీ పనిచేయక పోవడంతో విభీషణుడు రామ సన్నిధికి వచ్చాడు. తనకు రావణ సభలో చోటు లేనప్పుడు స్వగృహమని భావించాడు. విభీషణుడు సకల ధర్మాలను తెలిసినవాడు. రావణుడు ఆయనకు తండ్రిలాగా సేవించ తగినవాడు. బాల్యం నుండీ ఆయనే పోషకుడు. అలాంటప్పుడు, ఇప్పుడు శత్రువులు ఆయనమీద దండెత్తి వస్తున్నప్పుడు ధర్మాత్ముడైన విభీషణుడు తనకింత మహోపకారం చేసిన రావణుడిని ఆపత్సమయంలో క్షుద్ర బుద్ధిలాగా వదిలి పోవచ్చా? అలా పోయినా ఆయన్ను చంపాలనుకుంటున్న రాముడి దగ్గరికి పోవచ్చా? రావణుడి చావుకి తగిన ఉపాయాలను రాముడికి చెప్పవచ్చా? ఈ ఆక్షేపణలు విభీషణుడి మీద కలగవచ్చు. అయితే, రావణుడిని వదలడంలో విభీషణుడికి దోషం తగలదని అంటారు).

(విభీషణుడు బ్రహ్మ ఇచ్చిన వరం ప్రకారం గొప్ప జ్ఞాన సంపన్నుడైనందున,

సర్వ వేదాంత వేద్యుడై, సర్వ లోకేశ్వరుడై, సర్వ లోక శరణ్యుడై, ముక్త ప్రాప్యుడై, బ్రహ్మమైన శ్రీమన్నారాయణుడే లోకోజ్జీవనార్థమైశ్రీరాముడిగా భూమ్మీద అవతరించాడని ఎరిగినవాడు. ఇలాంటి విశేష జ్ఞానంకల విభీషణుడికి ఆయన అనుష్టించే ధర్మాలలో సామాన్య, విశేషాలను పరీక్షించి, దేనిని అనుష్టించాలో తెలుసు. అన్నను అనుసరించి వుండడం సామాన్య ధర్మం అయితే, పరమాత్మ అయిన శ్రీరాముడిని అనుసరించి వుండడం విశేష ధర్మం. అయితే ఈ రెండు ధర్మాలు ఆచరించాలి కాబట్టి, విభీషణుడు మొదలు రావణుడికి కావాల్సినంత హితోపదేశం చేశాడు. అసురస్వభావుడైన రావణుడు రాముడిమీద వైరంతో విభీషణుడి హితోపదేశాన్ని ఏమాత్రం వినలేదు. ఇది గమనించిన విభీషణుడు రామవిరోధైన రావణుడిని తానూ అనుసరిస్తే రావణుడిలాగా తనకూ రాముడితో విరోధం తప్పదనుకున్నాడు. అందుకే దుర్మార్గుడైన రావణుడి సాంగత్యం వదిలి విశేష ధర్మమైన రామసేవే చేద్దామనుకున్నాడు. ఇందులో తప్పేమీ లేదు. విభీషణుడు రాజ్యాపేక్షతో రాముడిని ఆశ్రయించినట్లు ఎక్కడా చెప్పలేదు. కేవలం రాముడి పాదసేవే కావాలన్నాడు. ఆయనకు రాజ్యం ఇష్టం లేకున్నా, ధర్మసంస్థాపానార్థమై అవతరించిన శ్రీరాముడి ఆజ్ఞానుసారం రాక్షసులను ధర్మ మార్గాన తిప్పడానికి రాజ్యాన్ని అంగీకరించాడు. కాబట్టి విభీషణుడిలో ఎలాంటి దోషం లేదు).

విభీషణుడు రావణుడిని వదిలి ఆకాశానికి ఎగిరినప్పుడే సుగ్రీవాది వానరులు అతడిని కనిపెట్టారు. రాక్షసులు ఏ పక్కనుండైనా రావచ్చునని వానర నాయకులు కనిపెట్టి వుండాలని రామచంద్రమూర్తి ఆజ్ఞాపించాడు. అందుకే పది దిక్కులనూ పరిశీలిస్తూ, హెచ్చరికతో వున్న వానర శ్రేష్ఠులు విభీషణుడిని దూరం నుండే చూశారు. ఆయనే కాకుండా మరి నలుగురిని తీసుకొస్తున్న అతడిని చూసి సుగ్రీవుడు వెంటనే వానరులతో కలసి ఆలోచించాడు. ఆలోచిస్తూనే హనుమంతుడితో, ఇతరులతో ఇలా అన్నాడు. "ఈ మనుష్య భక్షకుడు నలుగురు రాక్షసులతో, సమస్తాయుధాలతో నిజంగా మనల్ని చంపడానికే వస్తున్నాడు". అలా ఆయన అనగానే వానరులంతా రాళ్లు, చెట్లు తీసుకుని వారిని చంపడానికి సిద్ధమై, ఆజ్ఞ ఇవ్వమని సుగ్రీవుడిని కోరారు.

శ్రీరాముడికి తన రాక గురించి చెప్పమని వానరులను వేడుకున్న విభీషణుడు

ఇలా వానరులు సమాయత్తమవుతున్న సమయంలో విభీషణుడు వారితో తన గురించి చెప్పాడిలా. "చెడునడవడికల రాక్షసరాజైన రావణాసురుడికి నేను

తమ్ముడిని. నా పేరు విభీషణుడు. రావణుడు సీతాదేవిని దండకారణ్యంలో వున్నప్పుడు అపహరించాడు. అడ్డుతగిలిన జటాయువును సంహరించాడు. సీతను తీసుకెళ్లి లంకలో ఇతరులెవరూ చొరరాని చోట బంధించాడు. ఆమెను ఏడిపిస్తున్నాడు. మా అన్న మహాపాపాలు చేస్తున్నాడు. సీతను రాముడికి ఇవ్వమని, అలా చేస్తే ఆయన సొత్తు ఆయనకు ఇచ్చినట్లవుతుందని, ఆయన సంతోషిస్తాడని ఎన్నో సార్లు చెప్పాను. నేను చెప్పినదంతా వ్యర్థమైపోయింది. నేనెంత మంచి చెప్పినా మృత్యుప్రేరితుడైన రావణుడు నా మాటలు వినలేదు. పాముకు పాలుపోస్తే మీదపడి పీకినట్లు తనకు హితోపదేశం చేసిన నన్ను కఠోరమైన మాటలన్నాడు. నన్ను అవమానించాడు. కాబట్టి వాడినే కాకుండా, నా భార్యను, బిడ్డలను, తల్లితండ్రులను, ధనధాన్యాదులను, లంకను, సర్వాన్ని వదిలి శ్రీరామచంద్రమూర్తే రక్షకుడని వచ్చి ఆయన శరణుజొచ్చాను. రఘువంశంలో పుట్టిన ఉత్తముడైన శ్రీరామచంద్రమూర్తికి శరణాగతుడై విభీషణుడు వచ్చాడని నా స్థితి తెలపమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను".

విభీషణుడి విషయం చెప్పి రాక్షసులను నమ్మవద్దని రాముడికి సూచించిన సుగ్రీవుడు

విభీషణుడి మాటలు విన్న సుగ్రీవుడు వెంటనే రాముడి దగ్గరికి పోయి, లక్ష్మణుడు వింటుండగా ఇలా అన్నాడు. "విభీషణుడు అనే పేరుకలవాడు వచ్చాడు. రావణాసురుడి తమ్ముడట. నలుగురితో కలిసి వచ్చి నీ శరణుజొచ్చాడు. దేవా! జయం కలగాలని కోరికున్న నువ్వు చాలా హెచ్చరికతో వుండాలి. పండిత శ్రేష్టుడా! రాక్షసులు కోరిన రూపాన్ని దరించగలరు. మోసపు విద్యలు వస్తాయి. శూరుల్లో శ్రేష్ఠులు. ఎప్పటికి ఎలాంటి వేషభాషలతో శత్రువులను గెలవాలో అవన్నీ తెలిసి ఆ ప్రకారమే ప్రవర్తిస్తారు. మన కళ్లకు కనబడకుండా మనలో తిరగ గలరు. కాబట్టి వారిని ఎప్పటికీ నమ్మకూడదు. రావణుడు పంపిస్తే వేగులవాడిలాగా వచ్చాడో, లేక, తనంతట తానే మనలో కలిసిమెలిసి వుండి, నమ్మకం కలిగించి, సమయం చూసి మనం హెచ్చరికగా లేనప్పుడు మనల్ని చంపడానికే వచ్చాడో తెలియదు. వీడు నిజమైన భక్తితో రాలేదు. మనకు సహాయ సంపత్తి ఎక్కువ, శత్రువులకు తక్కువ కావడం మంచిదేకదా, ఎందుకు విభీషణుడిని చేర్చుకోకూడదంటావేమో? తన మిత్రులు పంపిన సేనను నమ్మవచ్చు. తన రాష్ట్రంలో వున్న అడవుల్లోని వారి బలాన్ని నమ్మవచ్చు. పరంపరగా వచ్చిన మూల బలాన్ని నమ్మవచ్చు. జీతానికి కుదిరిన

భటులను నమ్మవచ్చు. వీరివల్ల అపాయం లేదుకాని, శత్రువులు పంపిన సేనను నమ్మకూడదు. కీడు కలుగుతుంది".

"వచ్చినవాడు పుట్టుకతో రాక్షసుడట. రావణాసురుడి తమ్ముడట. ప్రత్యక్షంగా శత్రువుల దగ్గరనుండి వచ్చాడట. ఇవన్నీ అతడే చెప్తున్నాడు. ఇలాంటి వాడిని ఎలా నమ్మాలి? నువ్వే ఆలోచించు. శరణన్నవాడిని ఎలా చేరదీయక నిరాకరించవచ్చు అని అంటావేమో? నిజమైన భక్తి శ్రద్ధలు కలిగి శరణు కోరినవారిని రక్షించడం మన విధి. అది నేను కాదనను. ఈ విభీషణుడు రావణుడి వేగులవాడు. వాడు పంపితే మోసబుద్ధితో ఇక్కడికి వచ్చాడు. నువ్వు ఆయన్ను శరణాగతుడని నమ్మి చేరదీస్తే ఏదో వంచన చేసి మనల్ని తప్పక చంపుతాడు. కాబట్టి వీడిని ఇప్పుడే చంపడం మంచిదని నా అభిప్రాయం. నువ్వు సమర్థుడివే. కాదనను. కాని, మనం ఏమరివున్న సమయంలో మనల్ని చంపుతాడేమో ఆలోచించు. విరోధిని నమ్మకూడదు. రావణాసురుడు క్రూరుడు. వాడి తమ్ముడు వీడు కాబట్టి వీడిని చంపడమే తగిన కార్యం".

విభీషణుడి విషయంలో కపుల అభిప్రాయం అడిగిన శ్రీరాముడు

జవాబుగా శ్రీరాముడు వానరుల అభిప్రాయం అడిగాడిలా.

"సుగ్రీవుడు విభీషణుడి గురించి చెప్పిన మాటలను మీరందరూ విన్నారు కదా! మీరు మౌనం వహించకుండా మీ మీ అభిప్రాయాలను చెప్పండి".

ఎలా చేస్తే రామచంద్రమూర్తికి మేలు కలుగుతుందో అని ఆలోచించి ఆ విధంగానే కపులు తమ అభిప్రాయాన్ని చెప్పారాయనకిలా.

"మహాత్మా! నీకు తెలియనిది, మా ద్వారా తెలుసుకోవాల్సింది కొంచెమైనా లేదు. అయినా మామీద నీకు కల నిర్మలమైన స్నేహభావం వల్ల, మాకు కీర్తి సంపాదించి పెట్టడానికి మమ్మల్ని అడిగావు. ఏ పనైనా నువ్వు ముందు పరీక్షించకుండా చేయవు. స్నేహితుల ఇష్టప్రకారమే ప్రవర్తించే వాడివి. నువ్వు చేయదలచిన కార్యాన్ని మిత్రులతో ఔననిపించి మరీ చేస్తావు. సత్యవ్రతం కలవాడివి. నువ్వు పట్టిన వ్రతాన్ని వదలవు. మేం ఏం చెప్పినా శరణాగత రక్షణ అనే వ్రతాన్ని విడువవు. ఏది చేసినా ధర్మాన్ని అనుసరించే చేస్తావు. బలం, దృఢశౌర్యం, దృఢసత్త్వం, జ్ఞప్తి, నీలో దృఢంగా వున్నాయి. ఇలాంటి నువ్వు ఏమి చేసినా కాదనేది ఎవరు? పరాక్రమంతోనే సర్వ కార్యాలు సాధించగలవు. ఇలాంటి నీకు మేం ఏం చెప్పగలం?"

అప్పుడు రామచంద్రమూర్తి సుగ్రీవుడితో అన్నాడు ఇలా. "నీ మంత్రులంతా చక్కగా ఆలోచించి చెప్పగల సమర్థులు. బుద్ధిమంతులు. మాటలు చెప్పడంలోనే కాకుండా కార్యాలు చేయడంలోనూ సమర్థులు కాబట్టి అంతా కలిసి ఒక్కటిగా చెప్పడం కంటే ఒక్కొక్కడు ఫలానా కారణం చేత విభీషణుడిని చేర్చుకోవచ్చనో, చేర్చుకోకూడదనో వారి-వారి అభిప్రాయాలు చెప్పడం మంచిది".

తమ-తమ అభిప్రాయాలను చెప్పిన అంగదాదులు

రామచంద్రమూర్తి మాటలకు జవాబుగా అంగదుడు ఇలా అన్నాడు. "దేవా! విభీషణుడు మన శత్రువుల దగ్గర నుండి వచ్చాడు కాబట్టి సందేహించాల్సిన వాడే. ఆయన పూర్వోత్తరాలు విచారించకుండా తటాలున నమ్మకూడదు. ఎందుకంటే, ద్రోహులు తమ యథార్థస్థితి దాచి మారువేషం వేసి సమయం చూసి దెబ్బతీస్తారు. కాబట్టి కీడు కలుగుతుంది. అందుకే కొత్తవారిని చేర్చుకునేటప్పుడు వాడితో గొప్ప పనులు చేయించి అవి వాడెలా చేస్తాడో, వాడి నడవడి ఎలాంటిదో చక్కగా నిర్ధారించి, గుణవంతుడైతే చేర్చుకోవచ్చు. దురభిప్రాయం కలవాడని తేలితే తిరస్కరించవచ్చు".

ఈ మాటలు విన్న శరభుడు ఇలా అన్నాడు. "రామచంద్రా! ఇతడిని మనలో ఇప్పుడే కలుపుకోకుండా దూరంగా వుంచి, సూక్ష్మబుద్ధికల వేగులను నియమించి పరీక్షించి ఇతడి నడవడులన్నీ వారు పరీక్షించి తెలుసుకొన్న తరువాత ఇతడిలో అనుమానించాల్సిన కారణం లేదని తేలితే చేర్చుకోవచ్చు".

ఆ తరువాత జాంబవంతుడిలా చెప్పాడు. "రావణుడికి మనమీద మాత్సర్యం వుంది. విరోధంగానే వుండాలని కంకణం కట్టుకున్నాడు. అలాంటి వాడిని విడిచి రావడానికి సరైన కారణం ఇతడు చెప్పలేదు. ఇతడు చెప్పింది నమ్మదగ్గ కారణంగా కనపడడం లేదు. అదీకాకుండా వీడు వచ్చింది దేశకాల విరుద్ధమైంది. మనమేమో లంకకు నూరామడల దూరంలో వున్నాం. మన ముఖాలు వాళ్లు చూడలేదు. వాళ్ల ముఖాలు మనం చూడలేదు. మనవల్ల వాళ్లకు వచ్చిన ఉపద్రవం ఏదీ లేదు. కాబట్టి ఇంతదూరం వెతుక్కుంటూ రావడానికి కారణం కనిపించడం లేదు. అన్న తిట్టితే వచ్చాననంటున్నాడు. తన ఎదురుగా వుండవద్దన్నాడు కాని లంకలో వుండకూడదని అనలేదు కదా? కాబట్టి ఇతడు ఇంత దూరం రావాల్సిన పనిలేదు. ఇతడు రావడానికి ఇది సరైన సమయం కూడా కాదు. అన్న మాట తమ్ముడు వినాల్నా? తమ్ముడి మాట అన్న వినాల్నా?

తన మాట అన్న వినలేదని అతడిని ఆపత్కాలంలో విడిచి రావడం కాలవిరుద్ధం కాబట్టి మీరు ఇతడిని నమ్మకూడదు".

జాంబవంతుడు చెప్పిన తరువాత మైందుడు ఇలా అన్నాడు. "ముందుగా విభీషణుడిని పిలిచి మాటలు కలిపి, ఆ మాటల ధోరణి వల్ల రావణుడి వ్యవహారం, వాడి విషయంలో ఇతడి అభిప్రాయం, నిజంగా తెలుసుకుని దుష్టుడని అనిపిస్తే దండించవచ్చు, శిష్టుడని అనిపిస్తే చేర్చుకోవచ్చు".

విభీషణుడిని చేర్చుకోవచ్చని తన అభిప్రాయంగా చెప్పిన హనుమంతుడు

ఇలా అంతా చెప్పిన తరువాత శాస్త్రజ్ఞానం తెలిసినవాడు, మంత్రులందరిలో శ్రేష్టుడైన హనుమంతుడు ఇలా అన్నాడు.

"రామచంద్రా! బుద్ధిమంతులందరిలో నువ్వే శ్రేష్టుడివి. నీకు సమానమైనవారు లేరు. అధికులూ లేరు. పురుషార్థాలను ఆలోచించి చేయడంలో నువ్వు నేర్పరివి. నువ్వు చేసే పనులను ఇతరులు మెచ్చుకునే విధంగా మాటలను యుక్తియుక్తంగా, శాస్త్ర సమ్మతంగా చెప్పగల సామర్థ్యం కలవాడివి. నువ్వు చెప్పింది సరైంది కాదనడానికి బృహస్పతి సైతం సమర్థుడు కాదు. ఇతరుల అభిప్రాయం తప్పని నేను అనడం లేదు. నా తర్క చాతుర్యం చూపడానికి నేను ఆలోచించలేదు. మిగతా అందరికంటే హనుమంతుడు బుద్ధిమంతుడన్న గౌరవాన్ని సంపాదించుకోవాలన్న కోరిక లేదు. విభీషణుడు లంకలో నాకు అనుకూలంగా పలికాడు కాబట్టి నేను సమర్థించడం లేదు. రామచంద్రా! కార్యగౌరవాన్నిబట్టి, నాకు నువ్విచ్చే గౌరవాన్ని బట్టి వున్న వాస్తవాన్ని చెప్తాను. సీతాదేవి వృత్తాంతాన్ని నేను నీకు చెప్పినప్పుడు నన్ను ఉత్తమ భృత్యుడిని అన్నావు. నన్ను కౌగలించుకుని గౌరవించావు. అలాంటి ఉత్తమ భృత్యుడనే గౌరవాన్ని నేను వదులుకోను. కాబట్టి చెప్తాను".

"ఒకడిని పరీక్షించి చేర్చుకోవాలంటే వాడికి పనులను అప్పగించాలి. అప్పుడే వాడి గుణదోషాలు తెలుస్తాయి. ఒకడి గుణదోషాలు తెల్సుకోకుండా వాడికి రాచకార్యాలు అప్పగించలేం. అలా చేస్తే మన గుట్టు రట్టవుతుంది. కాబట్టి ఇలాంటి పరీక్ష సరైందికాదు. ఇదెలా వుందంటే 'పిచ్చి కుదిరితే పెళ్లి కాదు... పెళ్లయితేనే కాని పిచ్చి కుదరదు' అన్నట్లు వుంది. ఇతడు దేశంకాని దేశంలో, కాలం కాని కాలంలో వచ్చాడన్న విషయంలో నా అభిప్రాయం చెప్తాను. రావణుడు సర్వరాక్షస నాశనకరమైన సీతాపహరణం వల్ల, తరువాత ఆమెను

ఇవ్వడానికి తిరస్కరించడం వల్ల దుష్టుడిగా అయినందున, ఖరవాలి వధ వల్ల నువ్వు శూరుడివైనందున, ఈ విషయాలన్నీ విభీషణుడికి చక్కగా తెలిసే వుండాలి. కాబట్టి, గుణాల వల్ల గొప్పవాడివైన నిన్ను, ఏ సమయంలో చేరాల్నో ఆ సమయంలోనే, ఏ ప్రదేశంలో చేరాల్నో ఆ ప్రదేశంలోనే చేరాడు. ఇతడి సౌమ్య బుద్ధికి ఇదే తగింది. సముద్రం దాటిన తరువాత రావచ్చుకదా అంటారేమో? మనం నిన్న రాత్రి ఇక్కడికి వచ్చాం. ఆ విషయం తెలిసి రావణుడు ఈ రోజు ఉదయం సభ ఏర్పాటు చేశాడు. అక్కడ ఇతడికి, రావణుడికి వాదోపవాదాలు జరిగి వుండవచ్చు. వాడు దుష్టుడు కాబట్టి ఇతడిని అవమానపరచి వుండవచ్చు. మనం సముద్రం ఎప్పుడు దాటుతామో తెలియని అతడు, అప్పటిదాకా లంకలో ఎందుకు వుండాలి? వుండి చేసేదేముంది? వుంటే అక్కడో, లేక, ఇక్కడో వుండాలి. అక్కడ వుండవద్దనుకుని ఇక్కడికి వచ్చాడు. మనం సముద్రం దాటిన తరువాత ఆయన వస్తే, ఎప్పుడో అవమానిస్తే, అప్పటి దాకా ఎందుకు ఆగావు అని మనమే అడుగుతాం".

"విభీషణుడిని దూరంగా పంపించి, కొందరు మారువేషాలతో పోయి అతడిని ప్రశ్నించాలని అంటున్నారు. పూర్వం పరిచయంలేని కొత్తవాడు తనను ప్రశ్నిస్తే బుద్ధిమంతుడు వాడికి సరైన జవాబులు ఇస్తాడా? అడిగిన వారందరికీ తన విషయం తేట తెల్లంగా చెప్పాలని నియమం లేదు. ఆప్తులకు చెప్పాల్సిన విషయాలు అనాప్తులకు చెప్తారా? కాబట్టి యితడు దోషి అని ప్రశ్న వేసినవాడు నిర్ణయించవచ్చు. అంటే, నిర్దోషి కూడా దోషిగా నిలుస్తాడు. ఇది నీతిశాస్త్ర సమ్మతం కాదు. మాట్లాడంలో తానే నేర్పరి అని అనుకున్నవాడు బుద్ధిబలంతో తన భావన తెలియనీయకుండా మాట్లాడితే వాస్తవాభిప్రాయం తెలుసుకోలేడు. కుట్ర ప్రశ్నలకు బుద్ధిమంతుడు కుట్ర సమాధానాలే ఇస్తాడు. అప్పుడు కూడా వాస్తవాభిప్రాయం తెలియదు. కాబట్టి ఈ ఆలోచన వ్యర్థమని నా అభిప్రాయం. ఎదుటివాడి మనశ్శుద్ధి తెలుసుకోడానికి శాస్త్రాలలో నాలుగు ఉపాయాలున్నాయి. వాటిని ఇంగితం, ఆకారం, చేష్ట, భాష అంటారు. విభీషణుడు మాట్లాడేటప్పుడు వాడిది దుష్ట స్వభావం కాదని ఇంగితం చెప్తుంది. ముఖం ప్రసన్నంగా వికారంగా లేనందున ఆకారం శుద్ధమని తెలుసుకోవచ్చు. మోసగాడు నిబ్బరంగా జంకు, గొంకు, భయం లేకుండా రాడు. ఇతడు వచ్చాడు కాబట్టి చేష్ట శుద్ధమని ఏర్పడుతున్నది. మాటల్లో తడబాటు, పూర్వోత్తర విషయాలలో సందిగ్ధం లేదుకాబట్టి భాషా శుద్ధి వుంది. కాబట్టి ఇతడు నిర్దోషి అని నా అభిప్రాయం".

"ఇంగితం, ఆకారం ప్రబల ప్రమాణాలు అని నేనంటున్నప్పుడు, భావం ఒక విధంగా వుండి, ముఖనయనాదులు మరోలా వుండకూడదా? అని అనవచ్చు. వాడు ఇష్టప్రకారం వేషాలు మార్చవచ్చు కాని లోపల వుండే భావాన్ని బయటకి రాకుండా దాచడం సాధ్యపడదు. లోపలి భావాన్ని ముఖం ఎలాగైనా బయట పెట్టుంది (Face is the index of mind). అంటే ముఖం మనసు విషయసూచిక అని అర్థం. ఈ కారణాలవల్ల ఇతడు దుష్టుడని సందేహించడానికి హేతువు కనబడడం లేదు. మంచి అభిప్రాయంతో చేరదీయవచ్చు. దేశం, కాలం ఆలోచించి కార్యం చక్కగా చేస్తే ఫలితం కూడా త్వరగానే సిద్ధిస్తుంది. ఇతడిని తిరస్కరించకుండా చేర్చుకుంటే మేలు, ఫలం కనబడుతుంది కాని కనబడకపోదు. మహాత్మా! నీకు చెప్పగలవాడినా నేను?"

"ప్రయోజనం ఆశించకుండా ఎవడూ ఏపనీ చేయడుకదా? వీడు బుద్ధిమంతుడని నేను చెప్తున్నాను కదా? వీడు ప్రయోజనం ఆశించకుండా వచ్చాడా? అని అడుగుతావేమో? రావణాసురుడు చంపుతాడని భయంతో ప్రాణం కాపాడుకోవడానికి వచ్చాడా? ఎక్కడా నిలువనీడలేక కొన్నాళ్ళు ఇక్కడ వుందామని వచ్చాడా? అని నా అభిప్రాయం అడగవచ్చు నువ్వు. నువ్వు చేస్తున్న గొప్ప ప్రయత్నం, రావణుడి నీతిమాలిన పనులు చూసి, రావణుడు తప్పక చస్తాడని తెలిసి నువ్వు లోగడ దుర్నీతిపరుడైన వాలిని చంపి సుగ్రీవుడికి రాజ్యం ఇచ్చినట్లే రావణుడిని చంపి తనకు రాజ్యం ఇమ్మని ప్రార్థించడానికి బుద్ధిపూర్వకంగా వచ్చాడు. ఈ విషయాలన్నీ నా బుద్ధిబలంతో ఆలోచించి వీడు సాధు వర్తనం కలవాడని చెప్పాను. నువ్వు బుద్ధిమంతులలో ఉత్తముడివి. ఇక చేయాల్సిన పని, ఇతడిని చేర్చుకోవాలో, వద్దో నువ్వే ఆలోచించు".

సర్గ–18
విభీషణుడు గ్రాహ్యుడని కపులకు చెప్పిన శ్రీరాముడు

ఆంజనేయుడు చెప్పిన (న్యాయంతో కూడిన) మంచిమాటలు విన్న రామచంద్రుడు, ఇలాంటి సందర్భాలలో శాస్త్రాలు ఏమి చెప్పాయో, పూర్వులు ఎలా ఆచరించారో, వసిష్ఠాది పెద్దలవల్ల విన్నవాడైనందున, చేయాల్సిన పని చేయడానికి నిశ్చయించుకుని, ప్రసన్నమైన మనస్సుతో వానరులతో ఇలా అన్నాడు. "మిత్రులారా! మీరంతా నా మేలు కోరేవారు. మీమీ అభిప్రాయాలు చెప్పారు. విభీషణుడిని గురించి నా అభిప్రాయాన్ని నేను చెప్తాను. అది మీరు విని ఏది బాగుంటుందని మనం అంతా నిర్ణయిస్తామో అదే చేద్దాం. నిజమైన మైత్రికలవాడుకాని, మిత్రుడిలాగా నటించేవాడు కానీ, సమీపించి వచ్చినా, దూరంలోనే వున్నా, శరణాగతుడిని విడవను. దానివల్ల నాకు మేలే కలుగుతుందా, కీడు కలుగుతుందా అని నెపం పెట్టి శరణాగతుడిని తోసిపుచ్చరాదు. అలా తోసిపుచ్చితే నేను దుష్టులలో చేరుతాను".

ఇలా ఇది తన స్వభావమని రామచంద్రమూర్తి చెప్పడంతో, అలాంటి స్వభావం అపాయకరమైన సాహసమని తలచిన సుగ్రీవుడు భయపడి, నీతిశాస్త్రం ప్రకారం దానిని విమర్శించి, రాముడిది తప్పని అనిపించడంతో, స్నేహభావంతో, వినయంగా ఇలా అన్నాడు.

"రామచంద్రా! విభీషణుడు దుష్టుడని నేనన్నాను. నీ అభిప్రాయంలో అతడు దుష్టుడు కాదని నువ్వన్నావు. అదలా వుండనీ. వీడు దుష్టుడే కాని, శిష్టుడే కాని, ఇతడి వల్ల మనకు కలిగే లాభం ఏమిటి? నా అభిప్రాయం ప్రకారం అతడు దుష్టుడే అయితే అపాయం తప్పదు. నీ అభిప్రాయమే సరైంది అయితే భయం

లేదు. అది అనుభం మీద తెలవాల్సిందే. ఇతడెలాంటివాడైనా ఎవరికేం సహాయం చేయగలడు? తనకు మనవల్ల మేలున్నదని అనుకున్నంత కాలం మనతో వుంటాడు. మేలు లేదనుకోగానే వెళ్లిపోతాడు. తన మేలుకోరి వచ్చాడేకాని నిన్ను, నన్ను ఉద్ధరించడానికి రాలేదు. ఇతడు ఇలాంటి వాడని నాకెలా తెలుసంటావా? ప్రాణాపాయ కష్ట దశలో వున్న తండ్రి సమానుడైన అన్నను వదిలివచ్చినవాడు నిన్ను కూడా అలాగే వదిలిపోడా? నిన్ను, నన్నేకాదు, ఎవరినైనా ఇతడు వదిలేవాడే. ఎవరికీ ఇతడు సహాయం చేయడు. కాబట్టి నిష్ప్రయోజనమైన, అపాయకరమైన కార్యం నువ్వు చేయవచ్చా?".

ఈ విధంగా సుగ్రీవుడు చెప్పగా, ఆయన ధర్మసూక్ష్మం కాని, తన పరమశక్తి కాని, తన శరణాగత రక్షణ వ్రతనిష్ఠ కాని, తెలియక యుక్తివాదన చేస్తున్నాడు కదా అని తనలో తానే నవ్వుకుంటూ, వానరులను, సుగ్రీవుడిని, లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

"లక్ష్మణా! ఈ సుగ్రీవుడు శాస్త్రాన్ని అధ్యయనం చేయకుండా, యోగ్యులైన పెద్దలను సేవించక వుంటే ఇలా సమయోచితంగా మాట్లాడే నేర్పు దృఢపడి వుండేదా? సుగ్రీవా! విభీషణుడు మనదగ్గరకు వచ్చిన కారణం చెప్తావిను. రాజులైన వారిలో ఒక సూక్ష్మధర్మం సుప్రసిద్ధంగా వుంది. అది రహస్య విషయం కాదు. ఏ రాజుల రాజ్యాల పొలిమేరలు కలిసి వుంటాయో, ఎవరొక వంశంలో పుట్టారో, వారు పగవారవుతారు. వీళ్లు, ఇతరులకు కష్టం వచ్చినప్పుడు పరస్పరం ద్రోహం చేసుకుంటారు. విభీషణుడు, రావణుడు జ్ఞాతులు కాబట్టి విరోధులే. ఆ కారణాన వీడు మనదగ్గరికి వచ్చాడు కాని, నువ్వనుకున్నట్లు రావణుడు పంపితే వాడిమీద ప్రేమతో రాలేదు. పాప విచారంలేని మనస్సుకల జ్ఞాతులు తమ వంశంలో పుట్టి, తమ మేలుకోరేవారికి గౌరవం కలిగిస్తారు. ఇది ప్రభువులుకానివారు ప్రభువుల విషయంలో నడిచే విధానం. మన అన్న ప్రభువైతే ఏమిటి? నేనైతే ఏమిటి? అని అన్నకే ఎక్కువ గౌరవం కలిగిస్తారు. అలా వారున్నప్పటికీ, ప్రభువులు మాత్రం ప్రజ్ఞా శౌర్యసామర్థ్యం వల్ల నిర్మలమైన మనస్సుకల జ్ఞాతుల మీద తరచుగా ద్రోహబుద్ధి కలవారై, వీడేవేళకు మనకేం కీడు చేస్తాడోనని అణగతొక్కి వుంచుతారు. అలాంటప్పుడు నిర్మలమైన వారు కూడా తామెంత శుద్ధంగా వున్నప్పటికీ తమను నమ్మడం లేదని కలుషచిత్తులైపోతారు. అలాగే విభీషణుడు నిర్మల మనస్కుడైనా రావణుడు దుష్టుడు కాబట్టి ఇతడిని సందేహించాడు. సందేహించి వెడలగొట్టాడు.

విభీషణుడు రావడానికి ఇదీ కారణం కాని, నువ్వు చెప్పింది కాదు".

"వీడు మనకు శత్రువు అనీ,వీడిని చేర్చుకుంటే మనకు అపాయం కలుగుతుందనీ, అది నీతిశాస్త్ర విరుద్ధమనీ చెప్పావు. నీతిశాస్త్రం ప్రకారం ఎవరు ఎవరికి విరోధులో చెప్పానుకదా! ఇతడికి మనమెవ్వరం జ్ఞాతులం కాదు. ఆ కారణాన మనకూ, వాడికీ విరోధం లేదు. రాజ్యవిషయంలోనూ విరోధం లేదు. హనుమంతుడు చెప్పినట్లు అతడు రాజ్యం కోసం కూడా వచ్చివుండవచ్చు. అలా వచ్చినవాడు మనకు కీడు కలిగిస్తే వాడి నెత్తిమీద వాడే మన్ను పోసుకున్నట్లు కదా! అప్పుడు రెంట చెడిన వాడవుతాడు. రాక్షసులలో ఇంత తెలివికలవారు వుంటారా అంటే, వాళ్లలో కూడా కొందరు బుద్ధిమంతులుంటారు. ఈ కారణాన విభీషణుడిని గ్రహించవచ్చు. ఇంతకుముందు జ్ఞాతులలో ఒకడు ఎక్కువ, ఒకడు తక్కువ, ఒకడు దుష్టుడు, ఒకడు శిష్టుడు అని చెప్పాను. శూరుల్లో ఇరువురు సమానంగా, నిర్మలంగా వున్నప్పటికీ ఒక్కోసారి వారిలో వారికి విరోధం కలుగుతుంది. అప్పుడే, ఇప్పుడు రావణుడికి, విభీషణుడికి కలిగిన విధంగా కలహం వస్తుంది. ఆ కారణాన కలిగిన భయంవల్ల ఇతడు రావణుడితో కలిసి వుండకుండా వేరుపడి నన్ను చేరడానికి వచ్చాడు. ఆ కారణాన వీడిని గ్రహించవచ్చు".

"నేను చెప్పేది భిన్నోదరుల విషయమనీ, ఏకోదరుల విషయంలో అలాంటి కలహాలు కలుగుతాయా అని అడుగుతావేమో? గుణాలు ప్రధానంకాని, ఏకోదరత్వ, భిన్నోదరత్వాలు ప్రధానం కాదు. నువ్వు, వాలి ఏకోదరులే కదా? ఎందుకు కలహించారు? భరతుడు నాకు సవతి తల్లి కొడుకే కదా? తనకు తండ్రి ఇచ్చిన రాజ్యాన్ని తిరిగి నాకివ్వడానికి అడవులకు వచ్చి నన్ను ఎంతో ప్రార్థించాడు. అయినా నేను ఒప్పుకోనందున అతడు కూడా నాలాగే వానప్రస్థుడై కాలం గడుపుతున్నాడే? న్యాయంగా నాకు రావాల్సిన రాజ్యం నాకివ్వకుండా నన్ను మా తండ్రి అడవులకు పొమ్మంటే వచ్చానే? తండ్రికి అటువంటి కొడుకు కదా కావాల్సింది? నేను లక్ష్మణుడిని పంపించి నిన్ను తిట్టించినా నువ్వు నా స్నేహం వదలలేదు కదా? ఇప్పుడు నామీద ప్రేమతోనే కదా విభీషణుడిని చేర్చుకోవద్దంటున్నావు? నీలాంటి స్నేహితుడేడీ? కాబట్టి గుణాలు ప్రధానం కాని బంధుత్వం కాదు".

ఈ విధంగా రామచంద్రమూర్తి చెప్పగా విని బుద్ధిమంతుడైన సుగ్రీవుడు లక్ష్మణుడితో సహా లేచి అణకువగా ఇలా అన్నాడు.

“ ఈ రాక్షసుడు వేగులవాడు. వీడు మోసగాడు. వీడు చెప్పింది సత్యం కాదు. కాబట్టి వీడిని సంహరించడమే తగిన కార్యం. రావణుడు పంపగా వచ్చిన వీడిని నమ్మితే మనం ఏమరి వున్న సమయంలో ఏదో టక్కుచేసి నిన్నో, నన్నో, లక్ష్మణుడినో చంపుతాడు. కాబట్టి వీడిని మంత్రులతో సహా చంపడమే తగిన కార్యం”.

అని చెప్పి నిశ్శబ్దంగా వుండిపోయిన సుగ్రీవుడి మాటలకు జవాబుగా, రామచంద్రమూర్తి, ఇంతకు ముందు చెప్పిన నీతిశాస్త్ర వాక్యాలకంటే మేలైన దాన్ని చెప్పడం ప్రారంభించాడు. స్నేహం కోరి ఎవరు తనదగ్గరకు వచ్చినా తాను అంగీకరిస్తానని చెప్పాడు.

శరణాగత రక్షణ అవశ్య కర్తవ్యమని సుగ్రీవుడికి చెప్పిన శ్రీరాముడు

“సుగ్రీవా! వాడు దుష్టుడు, మనలో ఎవరికైనా ఏదైనా కీడు చేస్తాడని ఎందుకు భయపడ్తున్నావు? వాడు దుష్టుడైనా, కాకపోయినా, వాడేమి చేయగలడు? మనం హెచ్చరికగా వున్నా, లేకపోయినా, నిద్రపోతున్నా, ఇంకేదైనా చేస్తున్నా, నాకుకానీ, నావారికి కానీ, వారి-వారికి కానీ, ఎలాంటి కీడు చేయడానికైనా వాడు సమర్థుడు కాదు. నామాట నమ్ము. నేను ప్రగల్భాలు చెప్పేవాడిని కాదు. ఏం చెప్పానో అది జరగాల్సిందే. మనం నిద్రపోతున్నప్పుడు వాడు రాక్షసులను తీసుకొచ్చి మనల్ని చంపుతాడని నీ భయం కదా? ఒక్క రాక్షసులనే కాదు.... లంకలో వున్నవారందరూ వచ్చినా, భూమ్మీద వున్నవారంతా వచ్చినా అందరినీ చంపేయనా? వాళ్లను చంపడానికి నాకు ఆయుధాలు, సైన్యం కావాల్నా? నా సంకల్పంతోనే చంపగలను. వీడి అన్న కుబేరుడితో చెప్పి యక్షులందరినీ, వీడి మామ మయుడితో చెప్పి దానవులందరినీ, వీడి స్వాధీనంలో వున్న వీడి తల్లి వైపు రాక్షసులను, వీడికి వరమిచ్చిన శివుడి పరిచారకులను, పిశాచాలందరినీ పిలుచుకుని వచ్చినా వేలుతో చంపేస్తాను. అలాగైతే నాకూ, ఈ వానరులకు కష్టమెందుకు ఇవ్వాలని అంటావేమో? లంకలోని అందరినీ చంపమంటావేమో? విభీషణుడిలాగానే మనదగ్గరికి రాకపోయినా, లంకలో మనమీద వ్యతిరేకత లేనివారు ఎందరో వున్నారు. వారితోపాటు ముసలివారు, బాలురు, స్త్రీలు కూడా వున్నారు. వాళ్లందరినీ ఒకేవిధంగా చూసి ఎలా చంపాలి? కాబట్టి మనమీదికి ప్రత్యక్షంగా వచ్చినవారిని మాత్రమే చంపాలనుకున్నాను. అంటే, వీడు మనతో ప్రతిఘటించి ఎవరినైనా పిలుచుకుని వస్తే అప్పుడు వారందరినీ ప్రత్యక్షవిరోధి సమూహంగా చంపుతాను”.

"మిత్రమా! నువ్వీ చరిత్ర వినలేదా? ఒక పావురం తన భార్యను ఒక బోయవాడు చంపి, తన ప్రాణాలు ఆకలితో తపిస్తూ రక్షణ కోరి తనవద్దకు రాగా, ఆ మగపక్షి తన మాంసాన్ని వాడికి ఆహారంగా ఇచ్చి రక్షించింది. పక్షే అలా రక్షిస్తే శరణని వచ్చిన వాడిని వదిలిపెట్టడం నాలాంటివాడికి ధర్మమా? పూర్వం కణ్వమహర్షి కుమారుడైన కండుమహర్షి చెప్పిన మాటలు చెప్తా విను. తనను రక్షించమని కోరినవాడు తనకు శత్రువైనా కరుణాగుణంతో వాడిని రక్షించాలి. కాపాడాలి. శాస్త్రం మీద నమ్మకం వున్నవారు తమకు శరణాగతుడైనవాడు శత్రువైనా, ఆర్తుడైనా, తృప్తుడైనా, తన ప్రాణం పోయినా వాడిని రక్షించాలి. తన సహాయం కోరిన శరణాగతుడిని తన శక్తికొలది రక్షించని వాడు ఈ లోకంలో, పరలోకంలో కూడా నాశనమవుతాడు. తనకు శరణాగతుడైనవాడు తాను రక్షించనందువల్ల, అతడు, వాడి శత్రువు చేతుల్లో చంపబడితే సుకృతమమతా ఇతడి పోతుంది. ఈ కారణాన శరణాగతుడైన పురుషుడిని కాపాడకపోతే కలిగే పాపాలకు అంతం లేదు. దానివల్ల పరలోకంలో నరకబాధ అనుభవించాలి. ఈ లోకంలో అపకీర్తి పాల్పడాలి. ఇవి రెండూ కొంచెం కూడా తప్పవు. పాపం వల్ల నష్టం కలుగుతుంది. కాబట్టి సత్కీర్తికి విలువ స్థానమై, పాపహరమై, స్వర్గసుఖదాయకమైన కండువాక్యాన్ని సార్థకం చేస్తాను"

ఇలా శరణాగత రక్షణ సర్వసామాన్య విషయమని చెప్పిన శ్రీరామచంద్రుడు ఆ విషయంలో తన విధానం చెప్పాడు.

విభీషణుడికి అభయమిచ్చిన శ్రీరాముడు

(ఇలా శరణాగతి గురించి విశేషంగా చెప్పడం వల్లే శ్రీమద్రామాయణానికి దీర్ఘ శరణాగతి అని పేరు వచ్చింది. అంటే, ఆది నుండి అంతం వరకు శరణాగతే ఎన్నో రకాలుగా, ఎన్నో చోట్ల చెప్పడం జరిగింది).

రామచంద్రమూర్తి తన వ్రతం ఇదేనని చెప్పడంతో సుగ్రీవుడు మళ్లీ ఏమీ చెప్పకపోవడమే కాకుండా ముఖాన్ని ప్రసన్నం చేసుకోవడంతో ఇతడి సందేహం తీరిందని శ్రీరాముడు భావించాడు. అందుకే విభీషణుడిని పిలుచుకు రమ్మని సుగ్రీవుడినే పొమ్మంటున్నాడు.

"సుగ్రీవా! నువ్వే విభీషణుడి దగ్గరికి పోవాలి. నువ్వు ఆయన్ను రమ్మని సైగ చేయడం కాదు. పోయి పిలుచుకునిరా. ఇప్పటికే చాలా ఆలశ్యం జరిగింది. అతడి మనసెంత తపిస్తున్నదో? నిష్కారణంగా ఎందుకు అతడికి కష్టం కలగాలి?

చేయాల్సిన పనైతే వెంటనే చేయాలి. రావణుడి తమ్ముడని నువ్వు సందేహించావు. వీడు రావణుడి తమ్ముడైనా సంతోషమే, లేదా, రావణుడే ఈ వేషంలో వచ్చినా సంతోషమే. శరణన్నప్పుడే వాడికి నేను అభయమిచ్చాను. మీ సందేహం తీర్చడానికి ఇంతసేపు మాట్లాడాను".

శ్రీరాముడి దయాగుణాన్ని అర్థం చేసుకున్న సుగ్రీవుడు, ఆయన స్వాభావిక కళ్యాణగుణాలను చూసి ఆశ్చర్యపడి, ఆయనతో ఇలా అన్నాడు. "చరాచర ప్రపంచాన్నంతా క్రమం తప్పి నడవకుండా శాసించేవాడివి. ఎలా ప్రవర్తిస్తే అది ఎలా చక్కగా వుంటుందో తెలిసినవాడివి. లోకానికి సుఖం ఎలా కలగాలా అని ఆలోచించే నువ్వు నీ సౌఖ్యం కూడా లక్ష్యం చేయవు. ఇతరుల వల్ల నీకేమీ లాభం లేకపోయినా వారికి ఎలా మేలు చేయాలా అని ఆలోచించేవాడివి. రాక్షసుడు శరణాగతుడు కాగా రక్షించి రఘువంశానికి కీర్తి కలిగించిన వాడివి. ఈ లోకంలో సన్మార్గాన్ని స్థాపించాలని అవతరించిన వాడివి. పరాక్రమవంతుడవని పేరు తెచ్చుకున్నవాడివి. బుద్ధిమంతులనిపించుకున్న వారిలో శ్రేష్టుడివి. ఇలాంటి నువ్వు శరణాగతుడిని రక్షించాలని చెప్పడంలో ఆశ్చర్యం ఏముంది? నువ్వు యుక్తియుక్తంగా పలికిన మాటలను అర్థం చేసుకున్నాను. వాస్తవంగా శరణాగత లక్షణాలేవో అవన్నీ వీడిలో వున్నాయి. ఇవన్నీ ఆలోచించి చూస్తే వీడు మనస్సులో, బాహ్యంలో కూడా శుద్ధుడే. వీడిలో వంచనలేదని నిర్ధారించుకున్నందున నా సందేహం తీరింది. ఈ కారణాన విభీషణుడు ఈ క్షణం నుండి మా స్నేహితుడై మాతో కలిసిమెలిసి, మాతో సమానంగా వుంటాడు. ఇది నాకే కాకుండా వానరులందరికీ సమ్మతమైన కార్యం".

అని చెప్పి పోయి సుగ్రీవుడు విభీషణుడితో, "విభీషణా! నీకు శ్రీరామచంద్రమూర్తి అభయమిచ్చాడు. నావెంటరా" అన్నాడు. ఆ మాటలకు సుకీర్తి అయిన రామచంద్రమూర్తి సంతోషించాడు. విభీషణుడికి ఎదురుగా పోయి ఆయన వైపు చేతులు చాచి స్నేహం చేశాడు.

సర్గ–19
శ్రీరాముడి పాదాలమీద పడి తనను నివేదించుకున్న విభీషణుడు

వచ్చిన విభీషణుడు రామచంద్రమూర్తి పాదాలను ఉద్దేశించి శరణమే ప్రయోజనం అనుకున్నవాడై సాష్టాంగ నమస్కారం చేశాడు. ఈ విధంగా ఆలశ్యంచేయకుండా శరణాగత ధర్మంలో నిశ్చయ బుద్ధికలవాడు, రక్షకుడిని వెతుకుతున్నవాడైన విభీషణుడు, తన వెంటవచ్చిన నలుగురు రాక్షసులతో కలిసి శ్రీరామచంద్రమూర్తి పాదాలమీద వాలి, శరణాగత ధర్మలక్షణయుక్తం, యోగ్యమైన మంచిమాటలను ఇలా చెప్పాడు.

"రామచంద్రా! నేను రావణుడి తమ్ముడిని. అతడు నన్ను అవమానించిన కారణాన సాహసించి సర్వప్రాణి రక్షకుడవైన నీదగ్గరికి వచ్చాను. నీ శరణు చొచ్చాను. 'నీకెవరు రక్షకులు లేరా? సహాయులు లేరా? ఇక్కడికి ఎందుకు వచ్చావు?' అని అడుగుతావేమో? స్నేహితులను, చిరకాలంగా నివసించిన లంకను, అక్కడ నాకుకల సకల సంపత్తిని, సర్వాన్ని వదిలి వచ్చాను. కాబట్టి నాకెవ్వరూ రక్షకులు లేరు. నేను, నా సుఖజీవనాన్ని, నా పాలనకు లోబడిన సమస్త ఉపకరణాలను, భోగాలను అన్నీ నీ స్వాధీనం చేశాను. ఇక నా యోగక్షేమాలకు నువ్వే దిక్కు".

విభీషణుడు చెప్పిన మాటలు విన్న రామచంద్రమూర్తి "విభీషణా! రాక్షసుల బలాబలాలు చెప్పు" అని అడిగాడు.

రాక్షస బలాన్ని శ్రీరాముడికి తెలిపిన విభీషణుడు

రామచంద్రమూర్తి ప్రశ్నకు జవాబుగా విభీషణుడు ఇలా అన్నాడు. "దేవా! నరవానరులు తప్ప దేవరాక్షసుల వల్ల, ఇతర భూతకోటివల్ల మరణం లేకుండా

రావణుడు బ్రహ్మ వరం పొందాడు. నువ్వు రాజకుమారుడివి కాబట్టి నీ చేతిలో వాడు చస్తాడు. అలా నువ్వు చేస్తే భక్తులంతా సంతోషిస్తారు. కుంభకర్ణుడు రావణుడి తమ్ముడు. యుద్ధంలో అమితమైన శౌర్యంకలవాడు. మొక్కవోని పరాక్రమం కలవాడు. ఇంద్రసమానుడు. వాడు నాకు అన్న అవుతాడు. ప్రహస్తుడనేవాడు సేనానాయకుడు. వీడి విషయం నువ్వు హనుమంతుడి ద్వారా వినే వుంటావు. అతడు కైలాసంలో యక్షులకు, రాక్షసులకు జరిగిన యుద్ధంలో కుబేరుడి సేనాపతైన మాణిభద్రుడిని పరాభవించాడు. ఇంద్రజిత్తు రావణుడి కొడుకు. భేదించలేని కవచం కలవాడు. ఉడుం తోలుతో చేయబడిన వేళ్ళ కవచం కలవాడు. యుద్ధంలో విల్లు ధరించి శత్రువులకు కనపడకుండా వారిని చంపుతాడు. అగ్నిహోత్రుడి హోమం చేసి ఆయన అనుగ్రహంతో విల్లు, రథం పొంది, వాటితో ఇతరులకు కనబడకుండా శత్రువులను చంపుతాడు. బలపరాక్రమాలలో రావణుడితో సమానమైనవాడు. మహోదర, మహాపార్శ్వ, అకంపనుడు అనేవారు దిక్పాలకులతో సమానమైన సేనానాయకులు. వీళ్లు దేవతలను శౌర్యపరాక్రమాలతో జయించారు. కోరిన రూపం ధరించగల రాక్షసులు పదివేల కోట్లమంది వున్నారు. వారి సహాయంతో రావణుడు దేవతలను ఓడించాడు”.

విస్తార పరాక్రమంకల రామచంద్రమూర్తి విభీషణుడు చెప్పిన మాటలు విని కార్యం ఎలా చేయాలా అని ఆలోచించి, ఇలా అన్నాడు.

“విభీషణా! నువ్వు ఇప్పుడు సవిస్తరంగా చెప్పిన దుష్ట రావణుడి నడవడి అంతా ఏకాగ్రచిత్తంతో గ్రహించాను. నేను చెప్పే మాట విను. రావణుడికి కొడుకులతో, మంత్రులతో, స్నేహితులతో యుద్ధంలో చంపుతాను. వాడు కింది లోకంలో, పాతాళలోకంలో, పైలోకాల్లో, సత్యలోకంలో దాగినా ప్రాణాలతో వదలను. అంతేకాకుండా రాక్షస రాజ్యలక్ష్మికి నిన్ను పట్టాభిషిక్తుడిని చేస్తాను. విభీషణా! రావణుడిని కొడుకులతో, స్నేహితులతో, సేనలతో చంపకుండా నేను అయోధ్యలో ప్రవేశించనని ప్రమాణం చేస్తున్నాను”.

ఇలా రామచంద్రమూర్తి చెప్పడంతో విభీషణుడు రెండు చేతులు జోడించి “పుణ్యచరిత్రా! నా శరీరంలో ప్రాణాలున్నంతదాకా నువ్వు శత్రు సేనలో దూరి లంకను, రాక్షసులను చంపడంలో సహాయం చేస్తాను” అని అంటాడు.

విభీషణుడికి పట్టాభిషేకం చేసిన శ్రీరాముడు

విభీషణుడు ఇంకా ఇలా అంటాడు శ్రీరాముడితో. "రామచంద్రా! నేను నీసేవ కోరి వచ్చానుకాని రాజ్యం ఆశించి రాలేదు. నేను పరతంత్రుడిని కాబట్టి నువ్వు అనుగ్రహించే రాజ్యాన్ని నాకు వద్దని అనడం అంటే, పారతంత్ర్యానికి హాని కలిగించడమే. అందుకే నీ ఆజ్ఞాబద్ధుడినై అంగీకరిస్తాను". ఇలా అన్న విభీషణుడిని రామచంద్రమూర్తి కౌగలించుకున్నాడు. ఆ తరువాత లక్ష్మణుడిని పిలిచి వేగంగా సముద్ర జలాలను తెమ్మన్నాడు. తెచ్చి, విభీషణుడిని రాక్షస రాజ్యానికి రాజుగా పట్టాభిషేకం చేయమన్నాడు. లక్ష్మణుడు రామాజ్ఞప్రకారం వానర సేన మధ్య విభీషణుడికి పట్టాభిషేకం చేశాడు. వానరులంతా రాముడి దయాగుణాన్ని మెచ్చి కేకలు వేశారు. అప్పుడు సుగ్రీవ, హనుమంతులు విభీషణుడితో వానరసేనతో సహా ఈ సముద్రాన్ని దాటే ఉపాయం చెప్పమని అడిగారు.

ఈ సముద్రాన్ని రామచంద్రమూర్తి పూర్వ వంశీకులైన సగర కుమారులు తవ్వారనీ, వారి వల్లే ఇతడికి ఈ రూపనామం వచ్చిందనీ, సముద్రుడు అందువల్ల కృతజ్ఞుడు కాబట్టి రామచంద్రమూర్తి ప్రార్థిస్తే తగిన ఉపాయం చెప్తాడనీ విభీషణుడు అంటాడు. (ఇది ఫాల్గుణ శుద్ధ ద్వితీయ నాటి సంగతి).ఇలా చెప్పిన విభీషణుడి అభిప్రాయాన్ని సుగ్రీవుడు రామచంద్రమూర్తికి తెలియచేశాడు. దానికి రామచంద్రమూర్తి సంతోషించి లక్ష్మణ సుగ్రీవులను ఈ విషయంలో ఆలోచించి వారి అభిప్రాయం చెప్పమన్నాడు. వారేది చెప్పితే అదే తనకు సమ్మతమని కూడా అంటాడు. వారు విభీషణుడి సూచన సబబే అంటారు. సేతువు కట్టాలంటారు.

ఇక ఆలశ్యం చేయడం ఎందుకని భావించిన రామచంద్రమూర్తి వేదిలోని అగ్నిహోత్రుడిలాగా దర్భశయనంలో పడుకోవడానికి ప్రయత్నం చేశాడు.

సర్గ-20

శ్రీరాముడు వానరులతో సముద్రం ఒడ్డున వున్న వార్త రావణుడికి చెప్పిన శార్దూలుడు

ఇదిలా వుండగా, రావణుడు నియమించిన శార్దూలుడనే వేగులవాడు సుగ్రీవుడి సేనను చూసి వేగంగా రాక్షసరాజు దగ్గరికి పోయాడు. పోయి, "రాజా! వానరుల, ఎలుగుబంట్ల సేన మన పట్టణం మీద పడడానికి పోర్లిపోయి వచ్చింది. ఆ సేన పరిమాణం ఇంత అని చెప్పలేం. చాలా గంభీరంగా, మరో సముద్రంలా వుంది. పదియోజనాల నేల ఆక్రమించి వుంది. దశరథకుమారులు ఇరువురూ, అన్నదమ్ములైన రామలక్ష్మణులు శ్రేష్టమైన ఆయుధాలు ధరించి సీతాదేవి దగ్గరికి రావడానికి సమీపంలోనే సముద్రం ఒడ్డున వున్నారు. ప్రభూ! వారి సమాచారం సర్వం తెలిసికొనుట కొరకు, త్వరగా వారు వచ్చి మన ఊరిమీద పడకముందే దూతలను పంపు. నా అభిప్రాయంలో, ఈ సమయంలో సామమో, దానమో, భేదమో అవలంభించడం మంచిదని". ఈ మాటలకు రావణుడు హెచ్చరికతో తదుపరి కార్యాన్ని ఆలోచించాడు.

శుకుడిని సుగ్రీవుడి దగ్గరికి రాయభారానికి పంపిన రావణుడు

శుకుడు అనే పేరుకలవాడిని రహస్యంగా పిలిచాడు రావణుడు. వాడిని త్వరగా పోయి సుగ్రీవుడికి తన మాటలుగా ఈ విధంగా చెప్పమన్నాడు.

"సుగ్రీవా! నువ్వు మహాబల సంపత్తి కలవాడివి. కాబట్టి అల్పబలుడైన రాముడితో నీకు జరిగేదేం లేదు. ఋక్షరజస్సుకుమారుడివి కాబట్టి గొప్ప రాజవంశంలో పుట్టినవాడివి. కాబట్టి నిష్కారణ కలహం నీకు ధర్మం కాదు. అదీకాకుండా నువ్వు బ్రహ్మ మనుమడివి. నేనూ బ్రహ్మ మనుమడినే. కాబట్టి మనకు భందుత్వం వుంది. అల్పుడైన రాముడితో నీకేం పని? రాముడితో

స్నేహం చేయడం వల్ల నీకు కలిగే లాభం లేదు. వదిలిపోతే నీకు కలిగే నష్టం లేదు. ఇక మన విషయం ఆలోచిస్తే నువ్వు నాకు సోదరసమానుడివి. పూర్వపు మన స్నేహం తలచుకో. రాముడి భార్యను నేను అపహరిస్తే నీకు కలిగే నష్టం ఏమిటి? రాముడు నీజాతివాడు కాదుకదా? వాడికీ, నీకూ ఎలాంటి సంబంధం లేదుకదా? బుద్ధిమంతుడివి. ఇది ఆలోచించి నీ వూరికి వెళ్లిపో. స్నేహితులుగా, సోదరులుగా ఇంతవరకున్న మనకు విరోధం ఎందుకు? నువ్వు పోకపోతే, ఎలాగైనా సముద్రాన్ని దాటి వానరులు ఇక్కడికి రాలేరు. ఇది నువ్వు ఆలోచించు".

ఇలా చెప్పిన రాక్షసరాజు ఆజ్ఞానుసారం శుకుడు చిలుకలాగా ఆకాశమార్గాన పోయి, నేలదిగకుండా అక్కడినించే రావణుడు చెప్పిన మాటలను యథాతథంగా సుగ్రీవుడికి చెప్పాడు. ఆ మాటలకు వానరులు కోపించి, ఆకాశానికి ఎగిరిపోయి వాడిని పట్టుకుని, విసిరి నేలపైకి కొట్టారు.

శుకుడిని మర్దించిన వానరులు

నేలమీద పడవేసిన శుకుడిని ఒకరి తరువాత మరొక వానరుడు పిడికిళ్ళతో మర్దించగా వాడు కలవరపడి, దిక్కు తోచక, ఏమీ చేయడానికి దారిలేక, "రామచంద్రా! నేను దూతను కాబట్టి నన్ను చంపకూడదు. వీరు నన్ను చంపుతున్నారు. వారిని నివారించు. ప్రభువు చెప్పినట్లు చెప్పకుండా తన ఇష్టప్రకారం చెప్తూ అసలు విషయం చెప్పని దుష్ట దూతలను కదా చంపాల్సింది? నేను నా ప్రభువు చెప్పిన మాటలను చెప్పాను. ఇది దోషమా?" అని రాముడిని ఉద్దేశించి అన్నాడు.

వాడి మొర విన్న రామచంద్రమూర్తి, ఆదరంతో వాడిని చంపవద్దని చెప్పడంతో వాడి రెక్కలు వూడగొట్టి వదిలారు. వాడప్పుడు ఆకాశానికి పోయి భయపడుతూ సుగ్రీవుడితో ఇలా అన్నాడు. "ఐశ్వర్యం, బుద్ధిబలం విశేషంగా వున్న పరాక్రమవంతుడా, సుగ్రీవా! వానర రాజా! నేను లంకకు పోగానే రాక్షసరాజు సుగ్రీవుడు ఏమి చెప్పాడని అంటే, నీ మాటగా ఏం చెప్పాలి?". అప్పుడు సుగ్రీవుడు ఆ దూతను చూసి ఇలా జవాబిచ్చాడు.

"ఓరీ! నువ్వు చారుడివే కాని దూతవు కాదు. అయినా నువ్వు దూతవని చెప్పి ప్రత్యుత్తరం ఇవ్వమంటున్నావు. కాబట్టి రావణుడితో ఇలా చెప్పు. నేను ఎన్ని విధాల ఆలోచించినా నువ్వు నాకు స్నేహితుడివి కాదు. ఎందుకంటే గతంలో ఎప్పుడూ నీకూ, నాకూ స్నేహభావం లేదు. ఉపకారం చేసినవాడే కదా

స్నేహితుడు. నువ్వు నాకు చేసిన ఉపకారం ఏదీ లేదు. ప్రియుడివీ కాదు, ఉపకారం కూడా చేయలేదు. ఈ కారణాన రాక్షసరాజా! నీమీద దయ తల్చాల్సిన అవసరం లేదు. రామచంద్రమూర్తి నామీద స్నేహభావంతో వున్నాడు. అగ్నిసాక్షిగా స్నేహం చేశాడు. నా మేలు కోరేవాడు. వాలిని చంపి నాకు ఉపకారం చేశాడు. కాబట్టి ఆయన మీద నేను దయగా వుండాలి కాని నీ విషయంలో ఎలా వుంటాను? రామచంద్రమూర్తి నీకు పగవాడు. నేనేమో ఆయన మేలు కోరేవాడిని. కాబట్టి నువ్వు నాకూ పగవాడివే. వాలి వరుసను బట్టి నువ్వు నాకు సోదరుడిని అన్నావు. వాలి నాకు పగవాడు కాబట్టి చంపించాను. నిన్నూ అలాగే చంపిస్తాను".

"నిన్ను నీ జ్ఞాతులతో, హితులతో, చుట్టాలతో, కొడుకులతో ఒక్కడిని కూడా వదలకుండా అందరినీ యుద్ధంలో చంపుతాం. ఇవి మోసపు మాటలుకాదు నిజాలు. వానరసేనను పంపి నిమిషంలో నీ లంకను శ్మశానం చేస్తాను. నీ గర్వం ఇంక పనికిరాదు. దుష్టతత్వం కలకాలం పనిచేయదు. నువ్వు రాక్షసులకు రాజుకావడాన నీ దోషాన నువ్వే కాకుండా వారంతా చస్తారు. నువ్వు లంక నుండి దేశాంతరం ఎక్కడికి పోయినా నిన్ను వదలం. దుష్టుడా! నువ్వు పాతాళంలో దాక్కున్నా, ఆకాశంలో దాగినా, ఇంద్రుడిని తోడు తెచ్చుకున్నా, ఇంకేం చేసినా మూర్ఖుడా! రావణా! సీతాపతి యుద్ధంలో నీ తల నేలకూలుస్తాడు. రామచంద్రమూర్తి ఎవరిమీద కోపగిస్తాడో అలాంటి పాపాత్ముడిని రక్షించ కలవాడు బ్రహ్మాండంలో నాకు తెలిసి ఎవరూ లేరు. కాబట్టి నీ చావు తథ్యం. జటాయువును చంపినంత మాత్రాన నువ్వు శూరుడివైనానని భావిస్తున్నావేమో? నీలో దుర్మార్గమే కాని వీరత్వం లేదు. రాముడు ఏం చేయగలడని అంటావేమో? నువ్వు బలపౌరుషాలు కలవాడివే అయితే సీతను రామచంద్రమూర్తి చూస్తుండగా తెచ్చేవాడివి. ఆయన కాకున్నా ఆయన తమ్ముడు లక్ష్మణుడు వున్నప్పుడైనా తేగలిగేవాడివా? వారు చూస్తే చంపుతారని దొంగతనంగా తెచ్చావు. ఇలాంటి ఆకార్యంవల్ల కలిగే హాని ఏమిటో ఆలోచించావా? ఇంద్రాదులకు కూడా జయించనలవి కాని రామచంద్రమూర్తిని సామాన్యుడని భావించావా? రామచంద్రమూర్తిని నీపాలిటి మృత్యువుగా అనుకో".

ఇలా సుగ్రీవుడు చెప్తున్నప్పుడు శుకుడు మరలిపోతాడేమోనని, అంగదుడు ఆకాశంలో వాడిని చూపిస్తూ సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

"వానర రాజేంద్రా! వీడు రాచకార్యం మీద దూతగా రాలేదు. నీతో పని వుండి

వచ్చినవాడు నిన్ను చూసుకుంటూ మాట్లాడాలి. అలా చేయకుండా వీడు సైన్యం అంతా కనబడే చోట ఆకాశాన్నుండి దొంగచూపులతో సేనను లెక్క పెట్టుతున్నాడు. కాబట్టి వీడు వేగులవాడే కాని దూత కాదు. దూతను చంపకూడదు కాని, వేగులవాడిని చంపవచ్చు కదా? వీడిని తిరిగి లంకకు పోనీయకూడదు''.

అంగదుడు ఇలా చెప్పగానే సుగ్రీవుడి ఆజ్ఞ ప్రకారం వానరులు వాడిని పట్టుకుని దయలేకుండా కొట్టారు. బాధతో వాడు దిక్కులేనివాడిలాగా, దీనంగా, పెద్ద గొంతుతో, ''రామా! రామా! నీవే గతి రామా! వీళ్లు నన్ను చంపుతున్నారు. కాపాడు'' అని మొరపెట్టుకున్నాడు. తన కంటి గుడ్లు పెరికారని, రెక్కలు విరిచారని, చచ్చిపోతున్నానని అరిచాడు శుకుడు.

రామచంద్రమూర్తి వాడి ఏడుపు విని, వాడు దూత కాబట్టి వాడిని చంపవద్దనీ, రక్షించమనీ చెప్పాడు. ఆ మాటలకు వాడిని చంపలేదు కాని, చెరలో వేశారు. సేతువు కట్టి, వానరులు ఆవలి ఒడ్డుకు చేరినతరువాతే వాడిని వదిలారు. అప్పుడు రామచంద్రమూర్తి సముద్రం ఒడ్డున దర్భశయనం మీదకు చేరాడు.

సర్గ-21
దర్భశయనం మీద పడుకున్న శ్రీరాముడు

తన కుడి భుజాన్ని దిండుగా చేసుకుని సముద్ర తీరంలో తూర్పు ముఖంగా (నియమబద్ధంగా) పడుకున్నాడు శ్రీరాముడు. తాను సముద్రాన్నైనా దాటాలి, లేదా, సముద్రుడు చావనైనా చావాలి. రెంటిలో ఒకటి కావాలని శ్రీరాముడు నిశ్చయించుకున్నాడు. మౌనవ్రతం పూని సముద్రాన్ని ప్రార్థిస్తూ మూడు రాత్రులు (పాడ్యమి, విదియ, తదియ) పండుకున్నప్పటికీ బుద్ధిమాలిన సముద్రుడు కనబడలేదు.

సముద్రుడిమీద ఆగ్రహం తెచ్చుకున్న శ్రీరాముడు

మూడు రాత్రులు దర్భశయనం మీద వుండినా సముద్రుడు దర్శనం ఇవ్వకపోవడంతో కళ్లెర్ర చేసిన శ్రీరాముడు తన సమీపంలో వున్న లక్ష్మణుడిని చూసి, "లక్ష్మణా! చూశావా! సముద్రుడు ఎంత పొగరుతో కనబడడం లేదు. మలినచిత్తులను ప్రార్థించడం వల్ల గౌరవహానే కాని లాభం లేదు. మంచిమాటలు చెప్పడం దుర్జనుల విషయంలో పనిచేయవు. నేను మొదట్లోనే సముద్రాన్ని ఎండించి కాలహరణం చేయకుండా వానరసేనను సముద్రాన్ని దాటించాలనుకున్నాను. మీరంతా సౌమ్య మార్గాన్ని సూచించడం వల్ల మీమాట తీసేయలేక కాలహరణమైనా సరే అని సహించడం వల్ల నన్ను దేనికీ పనికిరాని వాడిగా సముద్రుడు తలచాడు. తాను గొప్పవాడిని అనుకుంటున్నాడు. ఔరా! ఏమిటీ వీడి ధైర్యం? ఇలాంటి వాడి విషయంలో ఓర్పు పనికిరాదు. నా బాణ పరంపరలతో దీనిలోని మొసళ్ళను, తాబేళ్లను చీల్చి తేలేట్లు చేసి, నీరు కదలకుండా స్థంబించి, వీడి గర్వం అణచి, అల్లకల్లోలమయ్యేట్లు చేస్తాను.

ఏనుగుల ఆకారం కల చేపల తొండాలు, పాముల దేహాలు, చేపల శరీరాలు, నా బాణాలతో చీల్చబడి నీటిమీద తేలడం చూస్తావు. పదునైన బాణాలతో సాగరాన్ని చేపలతో, ముత్యపు చిప్పలతో, శంఖాలతో సహా ఎండబెట్టాను. మంచితనంతో వీడు మాట వినడు. సౌమిత్రీ! విల్లును, గొప్ప పాములను పోలిన బాణాల సమూహాలను తెచ్చి ఇవ్వు. ఎందుకంటే ఈ సముద్రాన్ని ఎండబెట్టి దుమ్ము లేపుతాను. వానరులు కాలినడకన సముద్రాన్ని దాటేట్లు చేస్తాను. చెలియలికట్టను దాటిరాకూడదనే మర్యాదను పోగొట్టి పొంగి పోరలేట్లు చేసి క్షోభకు గురిచేస్తాను" అని అంటాడు.

సముద్రుడి మీద బాణాలు వేసి క్షోభిల్ల చేసిన శ్రీరాముడు

ఇప్పుడీ సముద్రాన్ని ఏం చేస్తానో చూడమని, దానికి ఏగతి పట్టుందో గమనించమని అంటూ, శ్రీరాముడు ప్రళయకాలాగ్ని లాగా మండిపడుతూ విల్లు గట్టిగా పట్టుకుని నారిలాగి, ఇంద్రుడి పిడుగుల్లాగా బాణాలను వదిలాడు. అగ్ని శిఖల్లాంటి ఆ బాణాలు చరచరపోయి సముద్రాన్ని అల్లకల్లోలం అయ్యేట్లు చేశాయి. అవి సముద్రం లోలోపలికి ప్రవేశించగానే వున్నట్లుండి వచ్చిన ఉత్పాతానికి పాములు భయపడ్డాయి. గ్రాహాలతో, మొసళ్ళతో కూడిన నీరు పెనుగాలి విసరడం వల్ల కలిగే ధ్వనికి భయంతో కనిపించింది. నీళ్లు గుండ్రంగా తిరుగుతూ, బుడ–బుడమని ముత్యపు చిప్పలను కక్కుతూ, లోపల చెదురుతూ, వికార రూపంలో సముద్రం చాలా బాధపడి కళవళ పడింది. పాతాళంలో వుండే పన్నగులు విచ్చలవిడిగా వస్తున్న బాణాల వేగానికి ముఖాలు, కళ్ళు మండుతుంటే డీలాపడి శోకించారు. అలల సమూహాలు ఆకాశానికి తగిలేట్లు ఎగిసాయి. సముద్రం అడుగు నుండి కలత పడింది. ఎన్నడూ, ఏ దశలోనూ వేయని వేగాతిశయంతో శ్రీరామచంద్రమూర్తి బాణాలు వేస్తున్న తీరును, ఆయన కోపాన్ని చూసి భయపడిన లక్ష్మణుడు "అన్నా! అన్నా! బాణాలు ప్రయోగించ వద్దు" ని చెప్పడంతో పాటు, ఆ రామచంద్రుడి విల్లును పట్టుకున్నాడు.

సర్గ-22

సముద్రుడి మీద బ్రహ్మాస్త్రం వేయాలనుకున్న శ్రీరాముడు

ఇంత జరిగినా సముద్రుడి దగ్గరనుండి స్పందన లేకపోవడంతో కోపం తెచ్చుకున్న శ్రీరామచంద్రమూర్తి, భయంకరమైన మాటలతో సముద్రుడితో ఇలా అన్నాడు. “ఓరీ సముద్రుడా! నిన్ను పదునైన వేగం కల నా గొప్ప బాణాల సమూహంతో నీరు ఇంకి పోయేట్లు చేసి, అంతటితో వదలక, మళ్లీ వూట కూడా పుట్టకుండా, పాతాల లోకం దాకా ఎండగట్టి అల్పకాలంలో దుమ్మురేపుతాను. నీ స్వరూపం లేకుండా చేస్తాను. చూస్తూ వుండు. నాకు కోపం వస్తే నువ్వు బతుకుతావా? ఓరీ! రాక్షసులకు ఉనికి పట్టయిన వాడా! నా పదునైన బాణాలతో సేతువు కట్టి వానరసేనను కాలినడకన ఈ క్షణంలోనే అవతలి ఒడ్డుకు చేరుస్తాను. అలా నా పరాక్రమం చూపకపోతే నీకు అసమానమైన నా బలపరాక్రమాలు ఎలా తెలుస్తాయి?కానీ రా!”.

ఇలా అంటూ, బ్రహ్మ దండంతో సమానమైన ఒక బాణాన్ని వింటిలో సంధించి, రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రంతో దాన్ని అభిమంత్రించి, అమితమైన వేగంగా అల్లె తాటిని తన చెవి కొనవరకు లాగాడు. అప్పుడు కొండలు గడ-గడలాడాయి. దిక్కులు గాఢమైన అంధకారంలో మునిగి వణికాయి. సూర్య చంద్ర నక్షత్రాలు పెడతోవన పోయాయి. నదుల్లో, సరస్సుల్లో నీళ్ళు ఎండిపోయాయి. నక్షత్రాలు పెద్ద ధ్వనితో నేలరాలాయి. జంతువులు మూర్ఛపోయాయి. అంతటా చీకటి ఆవరించింది. సుడిగాలి వీచి వృక్షాలు పడిపోయాయి. భయంకర ధ్వనులతో భయంకరాకారంకల మేఘ సమూహాలు భూమీమ్మద నిప్పులు కక్కే పిడుగులను కురిపించాయి. భూత సమూహాలు దుఃఖంతో ఏడ్చాయి. జంతువులు భయపడి కదలక-మెదలక ఎక్కడున్నవి

అక్కడే వుండిపోయాయి. కానరాని భూతాల గుంపులు ధ్వనులు చేశాయి. సముద్రం తనలో వున్న జంతువులతో సహా బాధపడింది.

శ్రీరాముడికి ప్రత్యక్షమైన సముద్రుడు

సముద్రంలో ఒక యోజనం దూరందాకా నీళ్లు చెలియలికట్టను వదిలి లోపలికి ఈడ్చుకు పోయాయి. దయాసముద్రుడైన రామచంద్రమూర్తి భూత సంహారం అంటే ఇష్టం లేనందున బాణం వదల లేదు. అప్పుడు సూర్య తేజస్సుతో సర్పాలతో చుట్టుకుని బంగారు సొమ్ములు ధరించిన సముద్రుడు నీళ్లలోనుండి బయటకి వచ్చాడు. అసమానమైన ఒంటిపేట ముత్యాలసరాన్ని నడుముకు ధరించి, ఎర్రటి కాంతితో కౌస్తుభంలాగా ప్రకాశించే మణిపతకాన్ని వక్షాన ధరించి, నునుపైన వైడూర్యం లాంటి కాంతి కలిగి, ఎర్రటి పూలదండలు, ఎర్రటి వస్త్రాలు ధరించి, తామర రేకులలాంటి కళ్ళతో, దేవతా పుష్పాల మాలికలతో ప్రకాశించే శిరస్సుతో, తనలో పుట్టిన మణులను అలంకరించుకుని, మంచు కొండలాగా నానాధాతువులతో, తిరుగుతున్న అలలు కలిగి, తలకిందులవుతున్న మొసళ్లలాంటి జంతువులు కలిగి, రాక్షస పాములు తనలో వుంచుకున్న వీరవర్యుడు సముద్రుడు ఆ అస్త్రపాణి (రామచంద్రమూర్తి) దగ్గరకు వచ్చి నమస్కారం చేసి, "రామచంద్రా!" అని ఆదరంగా పిలిచి ఇలా అన్నాడు.

"పంచమహాభూతాలైన భూమి, ఆకాశం, అగ్ని, జలం, వాయువు శాశ్వతమైన తమ మార్గాన్ని వదిలి వాటి స్వభావాన్ని విడవవు. ఆ విధంగానే జలరూపంలో వున్న నేను నా లోతు తెలియనీయను. కాలి నడకన దాటనీయను. ఇది నా స్వభావం. దీన్ని నేను తప్పకూడదు. రామచంద్రా! సౌమ్యుడా!నేను నా స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తించడం సరైన పని కాదు. ఏ కారణాన కూడా నేను నా నీటిని గట్టిపడేట్లు చేయకూడదు. అలా చేస్తే ఆ జీవజంతువులు బాధపడ్తాయి. చచ్చిపోతాయి. కాబట్టి నేనెప్పుడూ అలాంటి పనిచేయకూడదు. నన్నాశ్రయించిన వారిని నేనెలా బాధపెట్టుతాను? అయినప్పటికీ నీ వానర సేనంతా సముద్రాన్ని దాటేంతవరకూ వారికి ఏ ఆపద లేకుండా, నా చేతనైనంత వరకు రక్షిస్తాను. నీ సేన దాటడానికి మిట్ట ప్రదేశాన్ని ఇస్తాను. కోపం వదులు". అని సముద్రుడు చెప్పగా రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

బ్రహ్మాస్త్రాన్ని ద్రుమకుల్యం మీద ప్రయోగించిన శ్రీరాముడు

"ఈ బాణం వ్యర్థం కాకూడదు. దీన్ని ఎక్కడ వేయాలి?" అని రామచంద్రమూర్తి

సముద్రుడిని ప్రశ్నించాడు. జవాబుగా, ఆయన, ఈ మహాస్త్రాన్ని పవిత్రమైన ద్రుమకుల్యమనే ప్రదేశంలో వేయి. అక్కడ భయంకరమైన చూపులు కల దస్యుజాతులవారు, మహా పాపాత్ములు వున్నారు. ఆ పుణ్య ప్రదేశంలో ఆ భీరులు చేరారు. వారు కుటిల వృత్తికలవారు. వారి స్పర్శ నేను సహించలేకున్నాను. వారు నిర్బంధంగా నా జలాన్ని తాగుతున్నారు. నీ అమోఘ బాణంతో వాళ్లను నాశనం చేయి''.

సముద్రుడు ఇలా చెప్పగానే ఆయన చూపించిన దిక్కుగా నిప్పులాగా మండుతున్న తన బాణాన్ని ప్రయోగించాడు రామచంద్రమూర్తి. ఆ బాణం పడ్డ చోట ఎడారి అన్న పేరు వచ్చింది. ఆ బాణం భూమిలో ప్రవేశించినందున కలిగిన రంధ్రం నుండి పాతాళ జలం పైకి వుబికింది. ఆ కూపానికి వ్రణకూపం అని పేరు. అక్కడ నుండి వచ్చిన నీరు సముద్రంలాగా అనిపిస్తుంది. ఆ బాణం భూమిని భేదించడం వల్ల ఆ వేడికి అక్కడ వారు తాగుతున్న గుంటల్లోని నీరు కూడా ఎండిపోయింది. అలా జలంలేని అడవి ఇంపైన పచ్చిక బయళ్ళతో, ఆరోగ్యకరంగా వుండే కందమూలాలతో, సువాసనకల మూలికలతో వుండేట్లు వరమిచ్చాడు. ఆ వరబలం వల్ల ఆ భూమి శుభస్థలం అయింది. ఈ విధంగా సముద్రంలోని ఒక భాగం రామచంద్రమూర్తి తీక్ష్ణమైన బాణానికి కాలిపోగా, సేతువు కట్టడానికి తనలో స్థలం చూపిస్తానని సముద్రుడు చెప్పాడు. రామచంద్రమూర్తిని చూసి సముద్రుడు ఇలా అన్నాడు అప్పుడు.

“మీ దగ్గర వున్న నలుడు అనేవాడు విశ్వకర్మ కుమారుడు. శిల్ప విద్యలో తండ్రితో సమానమైన వాడు. తండ్రి వరబలం వల్ల ఆ విద్యల్లో ప్రవీణుడు, ప్రసిద్ధ శక్తి కలవాడు అయ్యాడు. వీడు సేతువు నిర్మించడానికి ప్రయత్నం చేయాలి. ఆ సేతువు భారాన్ని నేను వహిస్తాను. కొండలు, చెట్లు నీళ్లలో వేసినప్పుడు అవి మునిగి పోకుండా నేను కాపాడుతాను. నీళ్లమీద తేలేట్లు చేస్తాను''.

సేతువు నిర్మించిన నలుడు

ఇలా చెప్పి సముద్రుడు కనబడకుండా పోయాడు. అప్పుడు నలుడు ఇలా అన్నాడు. “రామచంద్రదేవా! సముద్రుడు నిజం చెప్పాడు. నా తండ్రి వరబలంతో నేను సముద్రం మీద సేతువు కట్తాను. సాగరుడు నీకు మొదట్లో కృతజ్ఞుడు కాదు కాబట్టి నువ్వు మంచితనంగా ప్రార్థిస్తే బిర్రబిగుసుకు పోయాడు. తన్నిన కారణాన బయటకు వచ్చి నా సేతుబంధనం చూడాలనుకుని తనలోటు మనకు

సాధ్యమయ్యేట్లు చేశాడు. నేను విశ్వకర్మకు ఔరస పుత్రుడిని. పూర్వం విశ్వకర్మ నా తల్లికి, తన కొడుకుకు సమస్త శిల్ప విద్యలు వస్తాయని వరం ఇచ్చాడు. ఆ వరం బలంతో నేను శిల్ప విద్యలో తండ్రితో సమానుడనయ్యాను. ఈ సముద్రుడు చెప్పడం వల్ల నా విద్య గుర్తుకు వచ్చింది. ఇంతకు ముందే ఈ విషయం చెప్పకపోవడానికి కారణం, నా సామర్థ్యం నేను చెప్పకూడదు కదా! అలా చెప్పినా, నా మాట నమ్మేవారెవరు? అనుకున్నాను. ఇప్పుడు సముద్రుడు చెప్పాడు కాబట్టి అంతా నమ్ముతారు. రామచంద్రదేవా! నేను సేతువు కట్టాను. దానికి కావాల్సిన పదార్థాలు తేవడానికి నాకు వానరుల సహాయం కావాలి. నేనే తెచ్చుకుని కట్టాలంటే ఆ పని కాదు".

ఇలా నలుడు చెప్పడంతో, రామచంద్రమూర్తి వానరులందరికీ చెట్టులు, గుట్టలు తెచ్చి నలుడికి అందివ్వమని ఆజ్ఞాపించాడు. వారలాగే అడవికి పోయి చెట్లు పెళ్లగించుకుని సముద్రతీరానికి వచ్చారు. అవన్నీ నలుడు సముద్రంలో పడవేశాడు. సేతువు వంకరగా పోకుండా నూరామడ పగ్గాలు ఈ కొన నుండి ఆ కొన దాకా ఈ పక్కన కొందరు, ఆ పక్కన కొందరు పట్టుకున్నారు. ఎలా–ఎలా చేయాలో అని రామచంద్రమూర్తి చెప్పుతుంటే వానరులు సహాయం చేస్తుండగా నలుడు మొదటి రోజున సముద్రంలో పద్నాలుగు ఆమడల సేతువు కట్టాడు. రెండో రోజున వానరుల సహాయంతో ఇరవై, మూడవ రోజున ఇరవై రెండు, నాల్గవ రోజున ఇరవై రెండు ఆమడల సేతువు ఉత్సాహంగా కట్టారు. సామర్థ్యసంపత్తి కల నలుడు ఐదవ రోజున ఇరవై మూడు ఆమడల దూరం సేతువు కట్టాడు. ఇలా మొత్తం 101 ఆమడ దూరం కట్టారు. నీటి పొడుగు నూరామడలే కాబట్టి, మిగతా ఆమడ అటూ–ఇటూ భూమ్మీద సగం ఆమడ కట్టారు.

ఆకాశ మార్గాన స్వాతిమార్గం లాగా సముద్రం మధ్యలో కట్టిన సేతువును చూసి ఆకాశ సంచారులు అక్కడి నుండే ఆశ్చర్యంగా చూశారు. పది ఆమడల వెడల్పు, నూరామడల పొడవు కలిగిన సేతువును చూసి ఆశ్చర్యంగా ముక్కుమీద వేలు వేసుకున్నారు. ఇది దైవ సహాయం లేకుండా అసాధ్యమని వారన్నారు. అందరూ ఆశ్చర్యంగా చూస్తుంటే వానరులు ముందుగా సేతువు మీదగా ఆవలి తీరానికి చేరారు. శత్రువులు ఏ పక్కనుంచైనా రావచ్చునని విభీషణుడు మంత్రులతో కలిసి గదతో కావలి కాశాడు. వార్తావరుడిగా వచ్చిన శుకుడు

ఇంకా బందీగానే వున్నందు వల్ల రావణుడికి ఈ విషయం తెలిసే అవకాశం లేదు. సముద్రం మధ్యలో సేతువు ప్రకాశించింది అందంగా.

(ఫాల్గుణ బహుళ పాడ్యమి నాడు సముద్ర తీరం చేరారు. ఆ నాడే విభీషణుడికి అభయ ప్రదానం. పాడ్యమి, విదియ, తదియ దర్భశయనం. చవితి, పంచమి, షష్టి, సప్తమి, అష్టమి,సేతు బంధనం. అష్టమి నాడే సువేలారోహణం).

కపిసేనతో కలిసి సేతువు దాటిన శ్రీరామ లక్ష్మణులు

అప్పుడు సుగ్రీవుడు రామచంద్రమూర్తితో హనుమంతుడి వీపుమీద రాముడు, అంగదుడి వీపుమీద లక్ష్మణుడు ఎక్కి ఆకాశ మార్గాన ఆవలి ఒడ్డుకు రావచ్చని చెప్పాడు. కాని రాముడు వానరులను విడిచి పోదల్చుకోలేదు. సుగ్రీవుడు వెంటే ఆయనా దాటసాగాడు. కొందరు వానరులు సేతువు మీదగా, కొందరు ఈదుకుంటూ, కొందరు ఆకాశ మార్గాన ఆవలి ఒడ్డుకు చేరారు. వీరంతా చేసే ధ్వని సముద్ర ధ్వనిని నిమిషంలో మింగేసింది. కపిసేన సేతువు దాటి పండ్లు, నీళ్లు, ఇతర ఆహారవస్తువులు దొరికే ప్రదేశంలో సుగ్రీవుడి ఆజ్ఞప్రకారం విడిది చేశారు. అప్పుడు, రామచంద్రమూర్తి చేసిన ఈ అసాధారణ కార్యం వల్ల ఇక రావణుడి చావు తప్పదని దేవఋషి సిద్ధ చారణులు సంతోషంతో తమ మనస్సులలో ఉప్పొంగి పోయారు. రామచంద్రమూర్తిని పవిత్ర జలాలతో అభిషేకించి శత్రువులను జయించమనీ, అనేక సంవత్సరాలు భూమండలాన్ని పాలించమనీ, భక్తితో పూజించారు.

సర్గ–23
లక్ష్మణుడికి తనకు కనపడే శకునాల గురించి చెప్పిన శ్రీరాముడు

సమస్త శుభాశుభ శకునాల లక్షణం తెలిసిన రామచంద్రమూర్తి తనకు శుభ శకునాలు కలగడం చూసి సంతోషించి తమకిక భయం లేదని భావించి, లక్ష్మణుడిని కౌగలించుకుని, వానరసేనను ఒక మంచి ప్రదేశంలో, ఎక్కడైతే మంచినీరు విస్తారంగా లభిస్తుందో అక్కడ,వ్యూహాత్మకంగా తీర్చమని చెప్పాడు. వానరులకు, భల్లూకాలకు, రాక్షసులతో వినాశనకరమైన, మిక్కిలి భయంకరమైన యుద్ధం లోకనాశనం కొరకు తటస్థించింది. దుమ్మురేపుతూ గాలి వీచింది. కొండల శిఖరాలు వణకాయి. భూకంపం పుట్టింది. ఆ కారణాన చెట్లు నేలకూలాయి. భయంకరమైన డేగలు, మృగాలు, మేఘసమూహాలు ఉత్పాత సూచకంగా నెత్తురు వర్షం కురిపించాయి.

"లక్ష్మణా! సంధ్యాకాల మేఘాలు కుంకుమ వర్ణం కలవిగా వున్నాయి. సూర్యుడిలో ఒక నల్లటి చుక్క కనపడుతున్నది. సూర్యుడి నుండి ఒక నిప్పు సమూహం మండుతూ నేలమీద పడింది. సూర్యుడిని చూసి అన్ని ప్రదేశాల్లో వున్న మృగాలు, పక్షులు, దుఃఖస్వరంతో ధ్వనిస్తున్నాయి. రాత్రుల్లో చంద్రుడు తన కాంతి క్షీణించడంతో కోనల్లో నలుపు, ఎరుపు కలిసిన కాంతి కలిగి ప్రళయకాలంలో లాగా వేడి కలిగిస్తున్నాడు. పరివేషం పొట్టిదై, పరుషమై, ఘోరంగా వుంది. చూశావా! (ఇది అష్టమి నాటి సాయంకాలం). నక్షత్రాలు మలినమై లోక నాశనం తెలియచేస్తున్నాయి. చిన్నపిట్టలు తరుముతుంటే కాకులు, గద్దలు, ధైర్యం కల డేగలు సంకట పడుతున్నాయి. నక్కలు అంతటా వ్యాపించి భయంకరంగా కూస్తూ కీడు తెలియచేస్తున్నాయి. (లంకలో ఈ ఉత్పాతాలు కనపడడం అంటే లంకకు కీడు కలుగనున్నదని అర్థం). ఈ

శకునాల ఫలం ఏంటంటావా? ఈ నేల నెత్తురుతో, మాంసంతో బురదకాబోతున్నది. కాబట్టి రావణపాలిత లంకానగారాన్ని ఇప్పుడే సేనతో పోయి ముట్టడిద్దాం” అని మహాశూరుడు రామచంద్రుడు చేతిలో విల్లు ధరించి లంకకు అభిముఖంగా పోయాడు.

యుద్ధాభిలాష ఆవహించడంతో సంతోషంతో పోతున్న రామచంద్రమూర్తి వెంట సుగ్రీవ విభీషణులు, ఇతర వానరులు రాక్షసులను చంపాలన్న నిశ్చయంతో పోయారు. ఆ వానరుల భక్తి, శక్తి, వీరాలాపాలు, వీరులు చేయాల్సిన చేష్టలు, ధైర్యం చూసిన శ్రీరాముడు, వీరంతా ఉత్సాహంగా వున్నారు కాబట్టి మనకు జయం తథ్యం అని తన మనస్సులో సంతోషించాడు.

సర్గ–24

లంకలో ధ్వని విని సీతను తలచుకుని దుఃఖపడిన శ్రీరాముడు

సముద్రాన్ని దాటిన వానరసేన దాడిని, వేగాన్ని సహించలేని భూమి అమితమైన బాధతో గడగడ వణికింది. వానరులు వారి–వారి స్థలాలో నిలబడి ప్రకాకాశించారు. వానరులు సందడి చేయకుండా, నిశ్శబ్దంగా కుదురుగా వుండడం వల్ల లంకలోని మద్దెలల, తుత్తూరాల ధ్వనులు విశేషంగా వారికి వినపడ్డాయి. ఎత్తిన ధ్వజాలు కూడా కనబడ్డాయి. అలా చిన్న, పెద్ద ధ్వజాలు కల లంకను చూసిన రామచంద్రమూర్తి సీతాదేవిని తలచుకున్నాడు. పాపాత్ముడైన రావణుడి చెరలో సీత మనోవేదనతో దీనురాలై దుఃఖపడుతున్నది కదా! అని తనలో అనుకున్నాడు. ఒక వేడి నిశ్వాసం విడిచి, తమ్ముడిని చూసి, "పొగడ్తగన్న బలవంతుడా! ఈ లంకానగరం పొంకం చూశావా? విశ్వకర్మ నిర్మించిన ఈ లంక పర్వత శిఖరం మీద ఒప్పుతున్న లంకలాగా వుంది చూడు. విమాన సమూహాలతో భూమ్మీద తెల్లటి మేఘాలతో ఒప్పే ఆకాశంలాగా వుంది. మనోహరమైన పూ పొదలతో అలంకరించబడిన చైత్ర రథంతో సమానమై, ఝుంకారం చేసే తుమ్మెదల, పక్షుల, ధ్వనులతో నిండిన తోపులతో అందంగా వుంది. పూలల్లో దాగిన తుమ్మెదలు కలదై, మదించిన పక్షులు కలదై, ఆడకోవెలల ధ్వనులు కలదై, వనాల సమూహాన్ని చల్లటి గాలి వూపుతున్నది" అని అన్నాడు.

సేనల వ్యూహాన్ని తీర్చిన శ్రీరాముడు

ఈ విధంగా చెప్పి రామచంద్రమూర్తి, రాజనీతి శాస్త్రం ప్రకారం సేనలను విభజించాడు. నీలుడు అతడి సేనతో అంగదుడు హృదయ స్థానంలో వుండేట్లు, ఋషభుడు తన సేనతో కుడిపక్క వుండే విధంగా, గంధమాదనుడు ఎడమవైపు

నిలిచేట్లు, వేగదర్శి, సుసేషణుడు, జాంబవంతుడు వారి-వారి సేనలతో గర్భం కాపాడేట్లు ఆజ్ఞచేసి, తానూ లక్ష్మణుడితో కలిసి శిరోదేశంలో నిలిచాడు. పడమటి భాగాన్ని వరుణుడు కాచేట్లు, సేన పుచ్ఛ భాగాన్ని సుగ్రీవుడు రక్షించేట్లు వ్యూహం పన్నాడు శ్రీరాముడు. (సేన ఒక విధంగా గరుడ వ్యూహంగా తీర్చబడిందని అర్థమవుతున్నది). మేఘాలతో నిండిన ఆకాశంలాగా వున్న వానరసేన చెట్లు, శిఖరాలు తీసుకుని విజృంభించి, లంకను కొండలతో, శిఖరాలతో, పిడికిళ్లతో పొడి పొడిగా దంచి రూపుమాపడానికి సిద్ధంగా వుంది.

తాను పోయివచ్చిన వృత్తాంతాన్ని రావణుడికి చెప్పిన శుకుడు

శత్రువుల వల్ల ఇక విఘ్న భయం లేదు కాబట్టి, సేతునిర్మాణ, సేనా స్థాపనాది కార్యక్రమాలు తీరాయి కాబట్టి, శుకుడిని వదిలిపెట్టమని రామచంద్రమూర్తి సుగ్రీవుడికి చెప్పాడు. ఆయన వెంటనే శుకుడిని వెళ్లగొట్టాడు. వాడు భయం-భయంగా మళ్లీ పట్టుకుంటారేమోనని వెంటనే బయల్దేరి రావణుడిని సమీపించాడు. వాడి దీనస్థితికి నవ్విన రావణుడు, "ఏమిరా! శుకుడా! ఇలా వున్నావు? చపల చిత్తులు, దుష్టులు అయిన వానరుల చేతికి చిక్కావా? ఏంటీ? నీ రెక్కలను కత్తిరించినట్లున్నదే?" అని అడిగాడు.

తనను తంతాడేమో అని భయపడ్డ శుకుడు రావణుడితో ఇకా అన్నాడు. "రాక్షసరాజా! నీ ఆజ్ఞ ప్రకారం నేను సముద్రం ఉత్తర తీరానికి పోయాను. మంచి తియ్యటి మాటలతో నేర్పుగా సుగ్రీవుడితో మాట్లాడాను. నువ్వు చెప్పినట్లే తుచ తప్పకుండా చెప్పాను. ఆ ఆమాటలు విన్న వానరులు కోపంతో నన్ను ఆకాశం నుండి నేలమీద పడేశారు. తోకపట్టుకుని గిరగిరా తిప్పి నేలకేసి కొట్టారు. నేను ఏడుస్తున్నా విడవలేదు. నువ్వు చెప్పిన మాటలు చెప్తుంటే నన్ను చంపడానికి ప్రయత్నించారు. దెబ్బమీద దెబ్బ విరామం లేకుండా కొట్టారు. ఖరుడిని, విరాధుడిని, కబంధుడిని చంపిన రామచంద్రమూర్తి సుగ్రీవుడితో కలిసి సీతాదేవి సమీపానికి రానే వచ్చాడు. అదిగో అక్కడే వున్నాడు. నువ్వే చూడు. రామచంద్రమూర్తి సముద్రం నీళ్ళలో సేతువు కట్టాడు. సముద్రం దాటి దాని దక్షిణ తీరంలో సేనలతో వచ్చి లంకను ముట్టడి చేశాడు. రాక్షసులను చంపడానికి విల్లు చేతపట్టి సిద్ధంగా వున్నాడు. వానరులు లంక కోటలమీదకు ఎక్కక ముందే సీతను ఇవ్వడమో, యుద్ధం చేయడమో నిర్ణయించు. ఆలశ్యం చేస్తే కార్యభంగం అవుతుంది".

సీతను ఇవ్వనని అంటూ తన పరాక్రమాన్ని శుకుడికి చెప్పిన రావణుడు

సీతను మళ్లీ రామచంద్రమూర్తికి అర్పించడమే శ్రేయస్కరమని శుకుడు చెప్పిన మాటలకు కోపం వచ్చింది రావణుడికి. కళ్లెర్ర చేసి వాడితో ఇలా అన్నాడు. "ఓరీ! శుంఠా! శుకా! విను. దేవదానవులు గుంపుగా ఒక్కటై యుద్ధంలో నన్నెదిరించినా, జనులందరూ గుంపులు-గుంపులుగా చేరి సంతాప పడ్డా రామలక్ష్మణులకు సీతను ఇచ్చేది లేదు. ఎప్పుడు నా బాణాలు తుమ్మెద గుంపుల్లాగా రాముడి మీదకు పోతాయో, ఎన్నడు నా బాణ సమూహం రాముడిని ఖేదపడేట్లు చేస్తాయో అని నేను ఎదురు చూస్తుంటే, నన్ను సీతను ఇమ్మని చెప్తావా? రాముడి బలాన్ని యుద్ధంలో నేను హరించి వేస్తాను. ఇంతమాత్రం దానికి నువ్వెందుకు వ్యాకులపడుతున్నావు? సముద్ర గమనం, వాయువేగం నాలో వున్న విషయం ఆ మనుష్యుడికి తెలియదు. కాబట్టే నన్ను యుద్ధంలో ఎదిరించాలనుకుంటున్నాడు. తెలిసి వుంటే ఇలాంటి ఆలోచన చేస్తాడా? అంబుల పొదిలో వున్న పదునైన నా బాణాలు తనను నిద్రలేపిన వాడిని హింసించునన్న విషయం రాముడికి తెలియదు. తెలిస్తే యుద్ధంలో నన్ను సమీపించడు. శత్రుసేన చూస్తుంటే నేను యుద్ధ భూమిలో తిరుగుతాను. ఇంతకు ముందు రాముడికి నా బలం, వీర్యం, శక్తి, ఏమాత్రం తెలియదు కాబట్టి యుద్ధానికి వస్తున్నాడు. దీనికే నువ్వు భయపడితే ఎలా? వేయికన్నుల ఇంద్రుడు వచ్చి ఎదిరించినా, పాశం పట్టుకుని వరుణుడు వచ్చినా, యమదండం చేతబూని యముడే వచ్చినా, ధనాధిపతి కుబేరుడే వచ్చినా, నాకే కీడు చేయలేరు పిరికివాడా!".

సర్గ–25

శుకసారణులను వానర సేన పరికించి రమ్మన్న రావణుడు

ఇలా శుకుడికి చెప్పిన రావణుడు వాడిని పొమ్మన్నాడు. ఆ తరువాత శుక (ఇతడు మంత్రి శుకుడు. అంతకు ముందు పోయిన శుకుడు వేరు) సారణులు అనే తన మంత్రులను చూసి, గర్వాతిశయంతో ఇలా చెప్పాడు. "ఇప్పుడు నేను చెప్పదల్చుకున్నది ఎన్నడూ విన్నది కాదు. ఏమిటి అంటారా? రాముడట.... మహా సముద్రానికి పెద్ద సేతువు కట్టాడట.....దానిమీద వానరులు మన నగరం మీద పడడానికి వచ్చారట....ఇలా విన్నాను. నిజమని నేననుకోను. ఎందుకంటే సముద్రం ఎక్కడ? దానిమీద సేతువు కట్టడం ఏమిటి? అదేమన్నా వాగా? వంకా? సేతు నిర్మాణం నిజమా? అబద్ధమా? అనేది తెలుసుకోవడంతో పాటు, వానర సేన సంఖ్య ఎంతో కూడా తెలవాలి. కాబట్టి మీరు మారు వేషాలు వేసుకుని ఎవరూ చూడకుండా వానరసేనలోకి పోవాలి. పోయి, వానరుల శక్తి ఏమాత్రం? రాముడి, సుగ్రీవుడి మంత్రులెవరు? యుద్ధానికి ముందుగా కాలు దువ్వుతున్న వారెవ్వరు? ఎక్కువ శౌర్యం కల వానరులెవ్వరు? వానరసేన దిగింది ఎక్కడ? సేతువు ఎలా కట్టారు? అది నిజమేనా? వానర సేనానాయకుడు ఎవరు? మంత్రులారా! ఇవన్నీ చక్కగా తెలుసుకుని రండి. అలాగే యుద్ధ విషయంలో రాముడి ప్రయత్నం, ఆ మనుష్యుడి బలం ఎంత? అతడే ఆయుధాలతో యుద్ధం చేస్తాడు? లక్ష్మణుడి పరాక్రమం ఏమాత్రం? మంత్రులారా ఇవన్నీ ఆమూలాగ్రంగా తెలుసుకోండి".

ఇలా రావణుడి ఆజ్ఞానుసారం శుకసారణులు వానరుల వేషాలు ధరించి పోయి వానరసేన చూసి భయపడ్డారు. భయంతో దేహాలు పులకరిస్తుంటే దిక్కు తెలియక వానర సేనను పరికించి చూశారు. లెక్కపెట్టడానికి వశం కాని ఆ

వానర సేన కొండ గుహలలో, సముద్ర తీరంలో, ఉద్యానవనాలలో, సేతువు దాటిన వారిని, దాటుతున్నవారిని, వేచి చూస్తున్న వారిని చూసి దాని అంతం, ఆరంభం తెలుసుకోలేక తిరగసాగారు. ఆ సమయంలో, రావణుడు ఎవరినైనా వేగులవారిని పంపుతాడేమోనని అనుమానించి, వారిని కనిపెట్టాలని తిరుగుతున్న విభీషణుడు, శుకసారణులను పట్టుకుని, పెడరెక్కలు విరిచి, వీరు రావణుడి వేగులవారని చెప్తూ, రాముడి ఎదుట నిలబెట్టాడు.

శుకసారణులను శ్రీరాముడికి అప్పగించిన విభీషణుడు

పట్టుబడిన శుకసారణులు దుఃఖపడి, రాజనీతి ప్రకారం చంపుతారేమోనని భయపడి, బతుకుమీద ఆశ వదులుకుని, రెండు చేతులు జోడించి, రావణుడి ఆజ్ఞానుసారం వానరసేన పరిమాణాన్ని తెలుసుకునేందుకు వచ్చామని చెప్పారు. ఇది తాము చేసిన దోషమని, అందుకుగాను తమను చంపదల్చుకుంటే చంపవచ్చని, రక్షించదల్చుకుంటే రక్షించవచ్చని అంటారు. "జానకీపతీ! మా ప్రాణాలు నీ అధీనం" అనగానే శ్రీరాముడు నవ్వాడు. శత్రువు, మిత్రుడు అన్న భేదం లేకుండా అందరి మేలుకోరే శ్రీరాముడు సంతోషంతో ఇలా అన్నాడు.

"మీరు సమస్త సైన్యాన్ని చూసి వుంటే, మేమున్న విధానాన్ని చక్కగా పరీక్షించితే, రావణాసురుడు మీకు చెప్పిన పనులన్నీ చక్కగా నెరవేర్చినట్లయితే, మీరు వెళ్లిపొండి. మీ ఇష్టప్రకారం ఇంకా చూడాలనుకుంటే చూసి పొండి. ఒంటరిగా వానరసేనలోకి పోవడానికి మీకు భయం అయితే, మీకు పరిచయం వున్న మా విభీషణుడు మీకు తోడుగా వస్తాడు. ఆయనే సర్వం మీకు చూపిస్తాడు. మీరు చస్తామని భయపడవద్దు. ఆయుధహీనులై చేత చిక్కిన వేగులను అణగదొక్కి చంపడం న్యాయం కాదు. కాబట్టి మీరు విలవిలపోవద్దు".

ఆ తరువాత విభీషణుడితో వారిని వదలమని చెప్పాడు. వారిని భాదించవద్దని కూడా అంటాడు. రాక్షసులను వారి లంకాపురానికి పోయి తన మాటలుగా రావణుడికి ఇలా చెప్పమని అంటాడు.

"రాక్షసరాజా! నువ్వే బలాన్ని నమ్ముకుని నా భార్యను అడవిలో మోసం చేసి దొంగిలించావో ఆ బలానికంతటికీ వారి చుట్టాలతో సహా నా సేనను, నీ ఇష్టప్రకారం చూపించు. సూర్యోదయం కాగానే నానా రకాలైన గొప్ప-గొప్ప అస్త్రాలతో నీ కళ్ళ ఎదుటే నువ్వు చూస్తుండగానే నీ వారిని నాశనం చేస్తాను. నా

కోపాన్ని నీ సేనమీద రేపు ఉదయం కాగానే చూపించి గోపురాలతో, ప్రాకారాలతో కూడా నీ లంకను నాశనం చేస్తాను".

అని రాక్షసరాజుకు చెప్పమని శుకసారణుల కట్లు విప్పించాడు. వారు రామచంద్రుడిని "జయ జయ రామచంద్రా" అని పొగిడారు. ఆ తరువాత రావణుడి దగ్గరికి పోయారు. పోయి ఇలా చెప్పారు.

సీతాదేవిని శ్రీరాముడికి ఇవ్వమని రావణుడికి చెప్పిన శుకసారణులు

"రాక్షసరాజా! నీ ఆజ్ఞానుసారం పోయి వానరసేనలో తిరుగుతుంటే విభీషణుడు మమ్మల్ని పట్టుకుని దయాశాలి అయిన రాముడి దగ్గరకు తీసుకుని పోగా ఆయన మమ్మల్ని వదిలిపెట్టాడు. భయంకర తేజంకల ఆ గొప్ప పరాక్రమవంతుడి గురించి మేమేమని చెప్పగలం? చెప్పడం సాధ్యం కాదు. దిక్పాలకులతో సమానమైన నలుగురు బలశాలులు రామలక్ష్మణ, సుగ్రీవ, విభీషణులు ఒక్కచోట చేరారు. ఈ నలుగురే మన పట్టణాన్ని పాదుతో సహా పీకి నాశనం చేయగల సమర్థులు. మిగతా వానరుల మాట అలా వుంటే, ఒక్క శ్రీరాముడే తన పరాక్రమంతో మన లంకను పొడిచేసి నేలపడేయగలడు. మిగిలిన ముగ్గురు కూడా అవసరం లేదు. రామలక్ష్మణ సుగ్రీవులు రక్షించే వానరసేనను మనుష్యులు, రాక్షసులే కాదు దేవతల గుంపంతా ఇంద్రుడితో సహా జయించలేరు. నూరామడ పొడుగు, పది ఆమడ వెడల్పు కల సేతువును, సమీపంలో వున్న రాక్షసులు గమనిస్తారేమో అన్న భయం కూడా లేకుండా ధైర్యంగా నిర్మించి, దానిని దాటి, మన లంకకు దగ్గరలోనే వున్న తీరంలో వానరసేన అంతా విడిసి వుంది. సముద్రం దాటినవారి, దాటుతున్నవారి సేనకు తుది, మొదలు కనపడలేదు. వానరసైన్యంతో యుద్ధం చేయడానికి దిగడం తగదు. కోపం తగ్గించి రాముడికి సీతను ఇవ్వడమే సరైన పని. దానివల్ల నీకు మేలు కలుగుతుంది".

సర్గ–26
శుకసారణులతో ప్రాసాదం ఎక్కి కపిసేనలను చూసిన రావణుడు

ఇలా సారణుడు భయం లేకుండా మేలైన మాటలు చెప్పిన తరువాత రావణుడు ఇలా అన్నాడు. "ఓరీ! నువ్వెందుకు వ్యర్థంగా వదురుతున్నావు? దేవదానవులు కలిసి ఒక్కటిగా వచ్చి నన్ను ఎదిరించినా, లోకాలన్నీ కలిసి వచ్చి నన్ను చంపుతామన్నా, సీతను మళ్లీ ఇవ్వను. నమ్ము. ఓరీ! పిరికివాడా! వానరుల చేత చిక్కి వారితో తన్నులు తిని భయపడి, సీతను ఇమ్మని పనికిమాలిన మాటలు చెప్తున్నావు. ఎవడురా నన్ను జయించే శత్రువు? చూద్దాం రా!". ఇలా అంటూ, తాటి చెట్టంత ఎత్తున్న ఆకాశాన్ని అంటుతున్న తన ప్రాసాదాన్ని ఎక్కాడు. అక్కడ నుండి కొండల్లో, అడవుల్లో, సముద్రంలో, వానరులతో నిండిన ప్రదేశాన్ని, అంతంలేని, లెక్కలేని, వానరసేనను చూసి సారణుడితో ఇలా అన్నాడు.

"ఈ కోటి దండులో వున్న వీరులలో విశేష బలం కలవారు ఎవ్వరో చెప్పు. పరాక్రమం కలవారెవ్వరు? రామకీర్తి వృద్ధి చేయగలవారెవ్వరు? ఎవరు ముందుగా నడిచేది? ప్రసిద్ధులెవ్వరు? ఏ కార్యాన్ని ఎలా చేయాల్నో అనే కార్యక్రమాన్ని నిశ్చయించుతున్న వారెవరు? సుగ్రీవుడు ఎవరి మాట ముఖ్యంగా విని ఈ విధంగా చేస్తున్నాడు? వానరులలో సేనానాయకులు ఎవరు? సేనానాయకులకు నాయకులెవరు? ఇవన్నీ వున్నదున్నట్లు చెప్పు".

జవాబుగా ఆ విషయాలు తెలిసిన సారణుడు రావణుడితో యాల అన్నాడు.

అంగదాదుల గురించి రావణుడికి చెప్పిన సారణుడు

"లంక పునాదులతో సహా అదిరేట్లు రంకెలు వేస్తూ భయంకరమైన లక్షల

వానరుల గుంపులు సేవిస్తుండగా సేనలకు ముందు నిలుచున్నవాడే నీలుడు అనే వానర సేనానాయకుడు. దృఢమైన బలం కలవాడు, కోపంకలవాడు, లంకను చూస్తూ భయంకరంగా తోకతో భూమిని పగుళ్లు పడేట్లు కొట్టుతున్నవాడే అంగదుడు. సుగ్రీవుడు అతడికి వానర యౌవ రాజ్యాన్ని ఇచ్చాడు. చూశావా? వాడు నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాడు. వాలికి తగ్గ కొడుకు. సుగ్రీవుడికి మిక్కలి ప్రియమైన వాడు. వాడు ఇంద్రుడి పక్షాన వరుణుడు చేసినట్లు రాముడి పక్షాన యుద్ధం చేస్తాడు. అతడి ఆలోచన మేరకే హనుమంతుడు సీతను వెతకడానికి పోయి ఇక్కడికి వచ్చి చూశాడు. యుద్ధంలో దయాదాక్షిణ్యాలు లేని వాడతడు రాక్షసేస్వరా! నీతో యుద్ధం చేయడానికి వచ్చాడు. అంగదుడి వెనుకపక్క వానరసేనతో పులితో సమానంగా ప్రకాశించేవాడే సేతువు కట్టిన నలుడు. ఆ నలుడి సేనను చూడు. నిన్ను చూసి మీదికి దూకేట్లున్నారు. వీరు మిక్కిలి సాహసం కలవారు".

"వెండి కొండతో సమానమైనవాడిగా చెప్పతగ్గ శ్వేతుడు భయంకరమైన పరాక్రమం కలవాడు. అదిగో వాడే కుముదుడు. వీడు గోమతీ తీరంలో వేలాది మంది వానరులను పాలిస్తాడు. నిర్మలమైన మనస్సు కలవాడు. మహా వీరుడు. చాలా కోపంకల యితడు నీతో యుద్ధం చేయడానికి సిద్ధంగా వున్నాడు. అదిగో వాడే రంభుడనేవాడు. ధైర్యం కలవాడు. పరాక్రమంలో సింహ సమానుడు. చూపులతోనే నీ నగరాన్ని దహించి వేస్తున్నాడు. అసమాన శౌర్యం కలావాడు. వీడిని ముప్పై కోట్ల మంది వానరులు సేవిస్తారు. సింహనాదం చేస్తున్న ఈ వానరుడి పేరు శరభుడు. యుద్ధంలో వేగాతిశయం కలవాడు. మృత్యువును ఎదిరిస్తాడు. ఇతడిని విహారులనే నూరువేల మంది సేనానాయకులు సేవిస్తుంటారు. వీరంతా లంకను నాశనం చేయాలనుకుంటున్నారు. యుద్ధం అంటే అభిలాష వున్న మరో వీరుడు పనసుడు అనేవాడు. ఇతడిని ఏభై లక్షల వానర శ్రేష్ఠులు పారియాత్ర పర్వతం దగ్గర కొలుస్తుంటారు. దర్దర పర్వతంతో సమానమైన ఇతడే వినతుడు. మరొకడు క్రోధనుడు. ఇంకొకడు గవయుడు. వీరంతా బలపరాక్రమవంతులే. నీమీద దబాలున పడి ఒక దెబ్బకొట్టాలని చూస్తున్నవాడే వీడు. వీరంతా యుద్ధంలో సహించలేని బలవంతులు. శత్రుబలాన్ని హరిస్తారు. కామరూపులు. మిక్కిలి వేగం కలవారు".

సర్గ–27

హరాది యూథనాథుల గురించి రావణుడికి చెప్పిన సారణుడు

సారణుడు ఇంకా ఇలా చెప్పాడు. "రామచంద్రమూర్తి నిమిత్తమై ప్రాణాలు పోగొట్టుకోవడానికి సిద్ధపడి వున్న మిగతావారిని గురించి చెప్తా విను. హరుడనేవాడు యూథపతి. చెట్లను చేతిలో తీసుకుని లంక ప్రాకారాలను ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నవారు సుగ్రీవుడికి ఆప్తులు. పరాక్రమించి నీమీద జంకకుండా పడడానికి సిద్ధమై వున్న భల్లూక వీరులను చూడు. ఇక ధూమ్రుడనేవాడు ఋక్షవంత పర్వతం దగ్గర నివసిస్తూ, నర్మదా జలాలను తాగుతుంటాడు. ఎలుగుల సమూహాలకు వాడు ప్రభువు. వాడి భయంకరమైన కళ్ళు, దేహం చూశావా? వాడి తమ్ముడు జాంబవంతుడు కొండలాగా వున్నాడు. అన్నకు సమానమైన ఆకారం కలవాడు. విక్రమంలో ఆయనకంటే శ్రేష్టుడు. యూథప యూథపుడు. ఇతడికి సమానమైనవాడు లేడు. గురుసేవ చేశాడు. యుద్ధంలో భయంకరుడు. దేవాసుర యుద్ధంలో ఇంద్రుడికి సహాయం చేసి అనేక వరాలను పొందాడు. దండధరుడినైనా ఎదిరించి ఓడిస్తాడు. వీడి సేన కొండమీదనుండి కిందికి గుండులను, బండలను దొర్లిస్తున్నాయి చూడు".

"ఇదిగో చూడు, ఈ గొప్ప వానరసేన అగ్నికాంతి లాంటి కాంతితో తిరుగుతున్నది. అదిగో వాడే దంభుడనేవాడు. ఎవడు పూర్వం ఇంద్రుడిని ఎదిరించి అపజయం పొందలేదో, వానరులకు దాత ఎవరో, అలాంటి భయంకరమైన దర్పం కలవాడు అతడే. రాక్షసరాజా! ఈ క్రథనుడు అనేవాడిని చూడు. వీడొక గంధర్వ స్త్రీకి అగ్నిహోత్రుడికి కుమారుడై పుట్టాడు. దేవాసుర యుద్ధంలో ఇంద్రుడికి సహాయం చేశాడు. పరాక్రమంలో ఇంద్రుడికి సమానం. ఎక్కడైతే కుబేరుడు వుంటాడో, వుండి నేరేడు చెట్టు సేవ చేస్తాడో, ఎక్కడ అతడిని

కిన్నరులు సేవిస్తుంటారో ఆ పర్వతం దగ్గర ఈ ఆత్మశ్లాఘం ఎరుగని క్రథనుడు వుంటాడు. వేలకోట్ల వానరులు తనను సేవిస్తుంటే తన సేనలతో ఎప్పుడు లంకను నాశనం చేద్దామా అని వీడు తలస్తుంటాడు. కోటి వానరులు సేవిస్తుంటే ప్రమాథి అనే పేరుకల ఈ యూథనాథుడు ఇంద్రుడు స్వర్గాన్ని పాలించినట్లు నుశీరబీజం అనే కొండను పాలిస్తుంటాడు. వీడి సైన్యం ఉత్సాహం చెప్పనలవి కాదు. పరుషంగా కనబడుతున్న ఈ వానర సేన ప్రమాథిదే. ఇక శూరుడైన గవాక్షుడనేవాడు బలంకల కొండముచ్చులలో బలశాలి. వాడిని నల్లటి ముఖాలున్న కోటి కొండముచ్చులు సేవిస్తాయి".

"కేసరి అనే ఈ వానర నాయకుడు మేరుపర్వతం మీద వుంటాడు. రాక్షస సమూహంలో నువ్వెలాగో, అలాగే, వీడు శూరుల్లో శూరుడు. అరవై వేల బంగారు కొండల మధ్య వున్న నలుపు, తెలుపు కోతులు ఇతడిని సేవిస్తుంటాయి. ఈ లంకను సమూలంగా నాశనం చేయనున్న వానర శ్రేష్ఠుల మధ్య జయ కాంక్షతో వున్న ఆ వానరుడే శతవలి. వీడు తూర్పు కొండమీద వుండి ప్రతి రోజూ సూర్యుడిని ఉపాసిస్తుంటాడు. రాముడికి ప్రియమైన వీడు ఎప్పుడు లంకను పాడుచేయాలా అని ఎదురు చూస్తున్నాడు. గజుడు, గవాక్షుడు, నీలుడు, గవయుడు, నలుడు ఒక్కొక్కరు పదికోట్ల యోధుల గుంపుకు నాయకులు. ఇక వింధ్య పర్వతం మీద వున్న కోతులను లెక్కించడం సాధ్యం కాదు. అంతా అపరిమిత ప్రభావం కలవారే. కొండంత దేహబలం కలవారే. అందరూ కొండలను పిండి-పిండిగా నిమిషంలో కొట్టగల సమర్థులు". అని అంటాడు సారణుడు.

సర్గ–28

మైందాదుల గురించి వివరించిన శుకుడు

సారణుడు చెప్పిన మాటలు విన్న రావణుడికి వానరుల విషయం ఇంకా పూర్తిగా చెప్పాలనుకున్న శుకుడు సముద్రంతో సమానంగా వున్న వానరసేనను తేరిపార చూసి ఇలా అన్నాడు.

“కిష్కింధలో వుండే కోరిన రూపం దరించగలవారు, దేవదైత్య సమానులు, యుద్ధంలో దేవసమానులు, ఇరవై ఒక్క కోటి వానరులు, వేయి శంఖంబులు, నూరు బృందాలు యుద్ధంలో భయంకరులు. బ్రహ్మ ఆజ్ఞప్రకారం బలగర్వాలు అతిశయించగా అమృతం తాగిన వీరిని మైందుడు, ద్వివిదుడు అంటారు. నిన్ను నీ పట్టణాన్ని కూడా భుజబలాతిశయంతో సమూలంగా పడగొట్టాలని చూస్తున్నారు. వారి పక్కనే పర్వతం లాగా వున్న వీరులు, తండ్రితో సమానమైన వారు, యముడి కుమారులు, అపరిమిత బలం కలవారే సుముఖుడు, అసుముఖుడు. వారిని పరికించి చూడు. మదపుటేనుగు లాగా వున్నవాడు, వాయుపుత్రుడు అని పేరున్నవాడు, కేసరి పుత్రుడు, కోరిన రూపం దరించగలవాడు, వాయువేగం కలవాడు, వానర సమూహంలో శ్రేష్టుడు, బలగర్వంతో సముద్రాన్ని దాటినవాడు, సీతను, నిన్ను చూసినవాడు, నీతో మాట్లాడినవాడు, మరలిపోయి ఇంతమందిని తీసుకువచ్చినవాడైన హనుమంతుడు అతడే. చూశావా అతడిని? అతడు శిశువుగా వున్నప్పుడు ఆకలైతే సూర్యుడు తూర్పున ఉదయించడం చూసి, పండు అని భావించి, ఆకలితీరా తిందామని చివాలున ఆకాశానికి ఎగిరి మూడువేల ఆమడ పోయాడు. చివరికి సూర్యుడిని సమీపించలేక పర్వత శిఖర ప్రదేశంలో పడిపోయాడు. చెంపగాయం అయినందున ఈ శూరుడు హనుమంతుడు అని

ప్రసిద్ధుడు అయ్యాడు. హనుమంతుడి బలం, మహిమ వర్ణించడం సాధ్యపడదు. లంకనంతా నాశనం చేయ సమర్థుడు".

శ్రీరామ లక్ష్మణులను రావణుడికి చూపిన శుకుడు

ఎవరి భార్యను నువ్వు జనస్థానం నుండి అపహరించుకుని వచ్చావో, ఆ మహాబలశాలి, ధర్మాత్ముడు, ధైర్యశాలి, వేదవేదాంగాలలో జ్ఞానం వున్నవాడు, సూర్యవంశం రాజుల్లో అతిరథుడు, బ్రహ్మాస్త్రం లాంటి మంత్రాలను ఎరిగినవాడు, పరాక్రమంలో ఇంద్రుడి కంటే గొప్పవాడైన శ్రీరాముడు ఇతడే. చూడు. నీతో యుద్ధానికి సిద్ధంగా వున్నాడు. ఆ రామచంద్రమూర్తికి సహాయుడు, అన్నకు సమానుడు, మెరుస్తున్న బంగారు కాంతికలవాడు, ఆయనకు కుడిపక్కన వున్నవాడే లక్ష్మణుడు. ఆయనకు జీవించడం అంటే అన్న సేవచేయడమే. పరాజయం అంటే ఏమిటో తెలియనివాడు. రాముడికి కుడిచేయి లాంటివాడు. ఆయన బహిప్రాణం. యుద్ధంలో ఆయనను గెలవడం ఎవరికీ సాధ్యం కాదు. నీమీద హృదయమంతా కోపమే. లక్ష్మణుడు అన్నకు అమితమైన ప్రియమైనవాడు. ప్రాణసమానుడు. అన్నిరకాలయిన అస్త్ర-శస్త్రాలలో పండితుడు. రామచంద్రమూర్తి మేలు కోరుతూ, రాముడిని ఆశ్రయించి, రాముడికి ఎడమ వైపున తన మంత్రులైన రాక్షసులతో కూడి వున్నవాడు నీ తమ్ముడు విభీషణుడు. నిన్ను మనుష్య రూపంలో వున్న రామచంద్రమూర్తి రక్షించడు. లక్ష్మి నీ దగ్గర నిలవదు. విభీషణుడు శ్రీమంతుడైన రాముడి అనుగ్రహం సంపాదించాడు. రాజరాజైన రామచంద్రుడి చేతులమీదుగా రాక్షసరాజుగా లంకాపురికి అభిషేకం చేయబడి, సంతోషంగా నీతో యుద్ధం చేయడానికి తయారై వున్నాడు. కోతుల మధ్య కొండలాగా వున్నవాడు వానర రాజైన సుగ్రీవుడు. యుద్ధంలో వీపు చూపని బలశాలి. దేవతలకు, మనుష్యులకు మనోహరమైన బంగారుసరాన్ని ధరించాడు. యుద్ధంలో వాలిని చంపి తారను, హారాన్ని కపిరాజ్యాన్ని, సుగ్రీవుడికి లభించేట్లు చేశాడు శ్రీరాముడు"

వానర సేనా సంఖ్యను రావణుడికి చెప్పిన శుకుడు

శుకుడు ఇంతవరకు వానర సేన వీరులను గురించి చెప్పి ఆ తరువాత వానర సేనా సంఖ్యను వివరించాడు. "రాక్షసరాజా! ఇక సంఖ్యా లక్షణం, వానర సేనా సంఖ్య చెప్తా విను. నూరు లక్షలు ఒక్క కోటి. లక్షకోట్లు ఒక్క శంఖం. లక్ష శంఖాలు ఒక మహాశంఖం. లక్ష మహాశంఖాలు ఒక బృందం. లక్ష బృందాలు

ఒక మహాబృందం. లక్ష మహాబృందాలు ఒక పద్మం. లక్ష పద్మాలు ఒక మహాపద్మం. లక్ష మహాపద్మాలు ఒక ఖర్వం. లక్ష ఖర్వాలు ఒక మహాఖర్వం. వేయి మహాఖర్వాలు ఒక సముద్రం. లక్ష సముద్రాలు ఒక ఓఘం. లక్ష ఓఘాలు ఒక మహౌఘం అని గణిత శాస్త్రజ్ఞులు చెప్తారు. ఈ గణితం ప్రకారం వానరసేన సమాఖ్య చెప్తా విను. వేయి కోట్లు, నూరు శంఖాలు, వేయి మహాశంఖాలు, నూరు బృందాలు, ఒక మహాబృందం, వేయి నూర్ల పద్మాలు, వేయి మహాపద్మాలు, నూరు ఖర్వాలు, నూరు సముద్రాలు, నూరు మహౌఘాలు, పదివేల మహౌఘాలు కలిగి పెద్ద సముద్రంలాగా వున్న కపిసేనతో విభీషణుడు తనకు తోడుండగా, మంత్రులతో కలిసి సుగ్రీవుడు నీతో యుద్ధానికి సన్నద్ధంగా వున్నాడు. దేవరా! సుగ్రీవుడు నువ్వు అల్ప ప్రయత్నం చేస్తే వూరికే పోడు. మిక్కిలి బలశాలి. వీర్యం, విక్రమం సమృద్ధిగా కలవాడు. వానర సేనను బాగా తేరిపార చూసి, ఎలా చేస్తే ఓడిపోకుండా శత్రువును గెలుస్తావో అలాంటి ప్రయత్నం చేయి''.

సర్గ-29

శుకసారణులను నిందించిన రావణుడు

శుకుడు ఈ విధంగా చెప్పగా వానర శూరుల సమూహాన్ని, రామచంద్రమూర్తి సమీపంలో వున్న తన తమ్ముడు విభీషణుడి అసమాన బలాన్ని, రాముడికి కుడి భుజమైన లక్ష్మణుడి పరాక్రమాన్ని, సర్వ వానర ప్రభువైన సుగ్రీవుడి శౌర్యాన్ని తలచుకుని భయంతో గుండె ఝల్లుమంది. అది బయటపడకుండా కోపం తెచ్చుకున్నాడు. తెచ్చుకుని, శుకసారణులను చూసి, వారు భయపడుతుంటే ఇలా అన్నాడు.

"నా ఎదుటనే నాకు అప్రియమైన ఈ మాటలు మీరు చెప్పవచ్చునా? ఎందుకు మీ తెలివితేటలు బూడిదైపోయాయి? మీరా నాకు బుద్ధి చెప్పే పెద్దలు? మీరు మీ యోగ్యత ఆలోచించకుండా ఇలా చెప్పవచ్చా? విరోధులు బలవంతులై యుద్ధానికి వస్తుంటే, మనం యుద్ధం చేయాల్సిన సమయంలో మీరు వారి స్నేహితుల్లాగా వారిని పొగుడుతారా? ఇది మీకు తగిన కార్యమా? ఇది హితం చెప్పే సమయమా? ఎప్పుడు హితం చెప్పాల్నో అప్పుడు ఎందుకు చెప్పలేదు? మిమ్మల్నందరినీ అడిగాను కదా? అప్పుడు మీరంతా యోధుల్లాగా పౌరుషాలు మాట్లాడి నన్ను యుద్ధానికి దింపి, ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారా? మీరు చదివిన చదువంతా వ్యర్థం అయింది. గొప్ప రాజులను ఎలా కొలవాలో ఆ రహస్యం మీరు నేర్చుకోలేదు. ఒకవేళ మీకు అది తెలిసి వున్నా అనుభవానికి రాకపోవడం వల్ల అది నిష్ఫలం. అనుభవంలో వుపయోగపడని బలిష్టమైన శాస్త్రజ్ఞానాన్ని మోసుకుంటూ తిరుగుతున్నారు. మీలాంటి మూర్ఖులను మంత్రులుగా వుంచుకుని ఇన్నాళ్లు ఎలా రాజ్యం చేసానంటారా? మీలాంటి బుద్ధిమాలిన మంత్రులున్నప్పటికీ దైవ కృపవల్ల రాజ్యం చేస్తున్నాను కాని మీ ఆలోచనాబలం

వల్ల మాత్రం కాదు".

"ఓరీ! మీకు మేలు, కీడు కలిగించేది నా నాలుక అని ఎరుగారా? నాలుక నుండి మాట వెలువడితే మీరేమైపోతారో అనే భయం లేకుండా కఠినంగా మాట్లాడుతున్నారంటే మీకు చావు భయం లేదనుకోవాలి. రాజుకు కోపం వస్తే అపరాధి బతకడు. పగవారి పక్షాన్ని పొగిడిన మీలాంటి పాపులను నాకోపానికి ఆహుతిగా ఇవ్వనా? మీరింతకు ముందు చేసిన మేలును ఆలోచించి కృతజ్ఞుడనై మనసు మెత్తదైనందున సహించి వూరుకున్నాను. మీరు కుత్సిత మార్గంలో తిరిగేవారు. ఛీ! బయటకు పొండి. నా ఎదురుగా వుండవద్దు. ఇదివరకు మీరు చేసిన మేలు తలచి మిమ్మల్ని చంపలేకపోతున్నాను. నీతిమాలి, నేను చేసిన మేలు మరచి, నా ప్రేమకు దూరమైనారు కాబట్టి మీరు చచ్చినవారితో సమానమే. ఆ శిక్ష మీకు చాలు".

ఇలా రావణుడు చెప్పగా సిగ్గుతో తలలు వంచుకుని ఆ మంత్రులు వినయంగా జయజయ ధ్వానాలు చేస్తూ సభనుండి వెళ్ళిపోయారు.

శార్దూలాదులను శ్రీరాముడి చర్య కనుగొమ్మని పంపిన రావణుడు

వాళ్లు వెళ్లిపోయిన తరువాత దగ్గరలో వున్న మహోదరులను పిలిచి, గొప్ప గుణాలున్న వేగులను తీసుకు రమ్మని చెప్పాడు రావణుడు. వారలాగే బుద్ధిమంతులైన వేగులను రావణుడి ముందు నిలబెట్టారు. జయజయ ధ్వానాలు చేస్తూ చేతులు జోడించి నిలబడి వున్న నీతిశాస్త్రం తెలిసిన ఆ వేగులను చూసి రావణుడు ఇలా అన్నాడు.

"మీరు ఇక్కడనుండి సరాసరి రాముడి సైన్యం దిగిన చోటుకు పోవాలి. రాముడెలాంటి యుద్ధ ప్రయత్నాలలో ఉన్నాడో శోధించి తెలుసుకోవాలి. అ ఆతరువాత అతడికి నమ్మకమైన వారెవరు? వారి నడవడి ఎలాంటిది? అతడంటే ప్రేమకల మంత్రులు ఎవరు? వాళ్ల ప్రయత్నాలు ఏంటి? ఇవన్నీ చక్కగా తెలుసుకుని రావాలి. రాముడు నిద్రించేది ఎప్పుడు? అప్పుడు ఆయనకు తోడుగా ఎవరుంటారు? లేక అతడు ఒంటరిగా నిద్రిస్తాడా? ఎప్పుడు మేల్కొంటాడు? ఎప్పుడెప్పుడు ఏఏ పనులు చేస్తుంటాడు? ఇవన్నీ తెల్సుకుని రావాలి".

రావణుడి మాటలు వింటూనే ఆ వేగులవాళ్ళు అలాగే తెల్సుకుని వస్తామని ఆయనకు ప్రదక్షిణ చేసి, నమస్కారం చేసి, శార్దూలుడిని ముందు వుంచుకుని, శీఘ్రంగా పోయి మారువేషాలు వేసుకుని, రామలక్ష్మణులు సంచరిస్తున్న

సముద్ర తీరానికి చేరారు. అక్కడ సుగ్రీవ, విభీషణులతో కూడిన రామలక్ష్మణులను, వారి సైన్యాన్ని చూసి భయపడి, వెలవెలబోయారు. వారి విషయం కనిపెట్టిన విభీషణుడు వారిని వేగులుగా గుర్తించి, వారిలో శార్దూలుడే దోషి అని, ఇతరులు ఆయన వెంట వూరకే వచ్చారని నిర్ణయించి, శార్దూలిడిని తప్ప మిగతావారిని కొట్టి వెళ్ళగొట్టారు. శార్దూలిడిని పట్టుకుని పిండి దంచినట్లు దంచారు. వాడి ఏడుపు ధ్వని విన్న రామచంద్రుడు దయతో వాడిని విడవమని చెప్పాడు.

సర్గ-30
కపుల చేతిలో తానుపడ్డ బాధలు రావణుడికి చెప్పిన శార్దూలుడు

రామచంద్రుడి దయవల్ల విడుదలైన శార్దూలుడు ప్రాణాలు దక్కాయిరా అనుకుంటూ, ఊపిరి పీల్చుకుని, రావణుడి దగ్గరికి పోయి, జగదీశ్వరుడు, రాముడు సువేలలో వానరసేనా సమేతుడై వున్నాడని చెప్పాడు. రామచంద్రమూర్తి సమీపానికి వచ్చాడన్న విషయం విని రావణుడు తత్తరపడ్డాడు. సమాధానంగా శార్దూలుడు, వానరులలో వేగుతీయడం చాలా అపాయకరమైన కార్యమని, వాళ్లు అమిత బలపరాక్రమవంతులనీ, రామరక్షితులనీ, వారిని సమీపించడం కూడా సాధ్యం కాదనీ చెప్పాడు. "వానరుల దగ్గర ఇతరులు శబ్దం కూడా చేయలేరు. ఏమీ అనలేరు. ఇక ప్రశ్నించడం ఎలా సాధ్యం? అన్ని మార్గాలలో కొండంత కోతులు కావలిగా వున్నారు. లోపలికి పోవడానికి మార్గమే లేదు. ఏదోరకంగా కొంచెం దూరం పోగానే విభీషణ మంత్రులు నన్ను పట్టుకుని, రకరకాల గట్టిగా కొట్టారు. నాలుగు పక్కలా వీడు వేగులవాడు అంటూ తిప్పారు. విడిపించుకుని రావడం కష్టమైంది. తిప్పీ, తిప్పీ, చివరకు రాముడి దగ్గరికి తీసుకుపోయారు. నన్ను రక్షించమని రాముడి పాదాలమీద పడి వేడుకున్నాను. నన్ను చివరకు వదిలిపెట్టారు. నన్ను వదిలి లంకను ఎలా గెలవాలా అని దృష్టి సారించారు. కోతులు గెలుస్తారనడంలో సందేహం లేదు. యుద్ధం చేయడం మంచిదా? సీతనివ్వడం మంచిదా? అనే విషయం ఆలోచించుకో" అని అన్నాడు శార్దూలుడు.

కపుల పరాక్రమం రావణుడికి తెలిపిన శార్దూలుడు

శార్దూలుడు చెప్పిన మాటలు విన్న రావణుడు వాడితో ఇలా అన్నాడు. "ఓరీ!

యుద్ధం చేయాల్నా? సంధి చేయాల్నా? అన్న సందేహం నాకు లేదు. ఆ విషయం నేను ఆలోచించడం లేదు. దేవగంధర్వులు, దైత్యులు, దానవులు అంతా ఒక్కటిగా వచ్చి నన్ను ఎదిరించినా సీతను అప్పగించను. ఇది సిద్ధాంతం. యుద్ధం చేయడమే నిశ్చయం. ఆ విషయం అలా వుండనీ. నువ్వెలాగూ దెబ్బలు తిన్నావు కదా? ఆ విధంగానైనా వానరసేనను అంతా చూసి వచ్చావా? ఏ పార్శ్వంలో శూరులున్నారు? ఆ శూరులు ఎలాంటివారు? వారి శక్తి ఎంత? వారి మహాత్మ్యం ఎంత? వారిలో బలిష్టులు ఎవరు? ఆ శూరులు ఎవరి పుత్రులు? ఎవ్వరి మనుమలు? విరోధుల సేన గురించి అంతా సవివరంగా తెలుసుకుని వచ్చావా? ఏం చేయాలో చేస్తాను". ఇలా అడిగిన రావణుడికి సమాధానం ఇచ్చాడు శార్దూలుడు.

"సుగ్రీవుడు ఋక్షరజసుడి కొడుకు. వానరరాజు. అతడిని యుద్ధంలో గెలవడం అసాధ్యం. జాంబవంతుడు గద్గదుడి కొడుకు. భల్లూకరాజు. సుషేణుడు వరుణుడి కుమారుడు. ధర్మాత్ముడు కాబట్టి ధర్మం పక్షానే వుంటాడు. వీర్యమే ధనంగా కలవాడు. భుజబల గర్వం కలవాడు. దధిముఖుడు చంద్రుడి కొడుకు. సౌమ్యమైన స్వభావం కలవాడు. దుష్కార్యాలకు రాడు. సుముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి అనేవారు మృత్యుదేవత కొడుకులు. బ్రహ్మ దేవుడే వీరిని వానర రూపంలో సృష్టించాడు. అగ్నిహోత్రుడి కొడుకు వానరసేనా నాయకుడైన శూరుడు నీలుడు. హనుమంతుడి తండ్రి కేసరి. అతడే వాయుదేవుడి కుమారుడు కూడా. కేసరి ఇంద్రుడి గురువైన బృహస్పతి కుమారుడు. యుద్ధంలో ప్రబలుడు. హనుమంతుడు ఎంతటి కార్యమైనా సాధించగల సమర్థుడు. ప్రాయంలో వున్న అంగదుడు ఇంద్రుడి మనుమడు. మైందుడు, ద్వివిదుడు అశ్వితనయులు. గజుడు, గవాక్షుడు, గవయుడు, గంధమాదనుడు, శరభుడు యముడి కొడుకులు. యముడితో సమానమైన వారు. నేను లెక్కించిన శూరులైన వానరులే పదికోట్ల మందికి పైగా వున్నారు. ఇంకా వున్నారు కాని నేను లెక్కించలేక పోయాను".

"ఇక రామలక్ష్మణులు దశరథపుత్రులు. రాముడు శూరులలో శూరుడు. విరాధుడిని, కబంధుడిని చంపిన రాముడు యముడితో సమానుడు. పరాక్రమంలో రాముడితో సమానమైన వారు ముల్లోకాలలో ఎవరూ లేరు. ఇక ఆయన సద్గుణాలు లెక్కించడం ఎవరి తరంకాదు. ఆయన తమ్ముడు లక్ష్మణుడు బలంలో ఏనుగులాంటివాడు. వారించనలవికాని విక్రమం కలవాడు. ఆ వీరుడి

బాణాలకు ఇంద్రుడు కూడా తట్టుకోలేడు. శ్వేతుడు, జ్యోతిర్ముఖుడు సూర్యుడి కొడుకులు. ప్రసిద్ధ బలులు. హేమకూటుడు వరుణుడి కొడుకు. సేతువు కట్టిన నలుడు విశ్వకర్మ కొడుకు. దుర్ధరుడు వానరులలో గొప్పవాడు. వసువు కుమారుడు. ఇక రాక్షస శ్రేష్టుడైన విభీషణుడు నీ తమ్ముడే. రామలక్ష్మణులకు మిక్కిలి హితుడు. ఈ విధంగా కపిసేన గురించి చెప్పాను. వారంతా సువేలాద్రిమీద వున్నారు. తరువాత చేయాల్సిన పనులేంటో నువ్వే నిర్ణయించుకో".

సర్గ-31
రాముడి శిరస్సు జాపం కల్పించాలని విద్యుజ్జిహ్వుడిని ఆజ్ఞాపించిన రావణుడు

వానర సేన విషయం విన్న రావణుడి గుండె ఝలుక్కుమ్మంది. కొంచెం భయపడ్డాడు. మళ్లీ ధైర్యం తెచ్చుకున్నాడు. మంత్రి సమూహాన్ని చూసి "మంత్రులారా! నీతిశాస్త్రం తెలిసినవారలారా! మంత్రాలోచన చేయాల్సిన అవసరం వుంది. మీరంతా ఆలశ్యం చేయకుండా వేగంగా ఇక్కడికి రండి" అనగానే వారంతా వచ్చారు. వారితో ఆలోచన చేసి, వారిని పొమ్మని చెప్పి, తన ఇంటికి పోయి మహా బలవంతుడైన, తనకంటే కూడా ఎక్కువ మాయలు చేయడం నేర్చిన విద్యుజ్జిహ్వుడనే వాడిని పిలిచాడు. సీతను మోసగించాలనీ, అందుకోసం కొంచెం కూడా తేడా లేకుండా శ్రీరాముడు శిరస్సును, బాణంతో సహా అతడి విల్లును, విద్యుజ్జిహ్వుడు తన శక్తితో కల్పించి తానున్న చోటుకు తీసుకురమ్మని చెప్పాడు. అతడు సరే, అలాగే చేస్తానని చెప్పగా, కొన్ని సొమ్ములు అతడికి బహుమానంగా ఇచ్చి పంపాడు. ఆ తరువాత సీతాదేవిని చూడాలనుకుని రావణుడు అశోకవనం ప్రవేశించి, రాక్షస స్త్రీలు చుట్టుకుని భర్తనే స్మరిస్తూ వున్న సుందరి సీతను చేరబోయాడు. ఆమెకేదో సంతోష వార్త చెప్పబోయే వాడిలాగా ఆమెతో ఇలా అన్నాడు.

శ్రీరామాదులు చనిపోయారని సీతకు చెప్పిన రావణుడు

"ఓసీ సీతా! నన్ను స్వీకరించమని నిన్ను ఎంతగానో ప్రార్థించాను కదా! నామాట నువ్వు ఏమాత్రం లక్ష్యం చేయకుండా ఛీకొట్టి పొమ్మన్నావు. నువ్వు ఎవరిమీద మనసుంచి నన్ను ధిక్కరించావో, ఆ నీమగడు, నీ ప్రియుడు యుద్ధంలో చనిపోయాడు. నువ్వు ఏడ్చిన ఏడుపే నీ మగడిని నిర్మూలంగా

నాశనం చేసింది. నీ తలలో వున్న కొవ్వును వదిలించాను కదా! ఇక ఇప్పుడు ఎంత ఏడవాలని వుంటే అంత ఏడువు. వేరే దిక్కులేక నువ్వే నా భార్యవవుతావు. నువ్వే చూస్తూ వుండు. ఎందుకు చనిపోయిన వాడికోసం ఏడుస్తావు? చనిపోయినవాడు నువ్వు ఏడుస్తే బతికొస్తాడా? నీ పిచ్చి చేష్టలు వదిలి నా భార్యలలో ఒకదానివై వుండు. రాముడు చనిపోయినా నేను దిక్కుగా వున్నాను''.

"ఇక నీ మగడు చనిపోయిన విధం చెప్తా విను. నీ మగడు వానరసేనతో నన్ను చంపడానికి సముద్ర తీరానికి వచ్చాడు. సూర్యాస్తమాన సమయంలో లవణ సముద్ర తీరంలో ఉత్తర దిక్కున నీ మగడు బడలికతో నిద్రపోయాడు. ఆ రాత్రివేళ నేను పంపిన వేగులు ఆ విషయాన్ని నాకు చెప్పారు. ఈ వార్త తెలియగానే ప్రహస్తుడు సైన్యంతో అక్కడికి మెల్లగా పోయి తటాలున పైన పడి వానర సేనను చంపాడు. ప్రహస్తుడు పోయిన సమయంలో రాముడు గురకపెట్టి నిద్రిస్తున్నాడు. అదను చూసి పైన పడి పెద్ద కత్తితో అతడి గొంతు కరకరమని నరికాడు. ఇది చూసి విభీషణుడు ఆకాశానికి ఎగిరపోయాడు. మా వాళ్ళు అది గమనించి వాడిని పట్టి కట్టేశారు. లక్ష్మణుడు కోతుల్లో కలిసిపోయి, కోతిగా మారి దిక్కుల వెంట పరుగెత్తాడు. వానర సేన నాయకుడైన సుగ్రీవుడు నేలమీద పడుకున్నాడు. హనుమంతుడు చెంపలు చీలి తన ప్రాణవాయువును తండ్రి వాయుదేవుడికి అప్పచెప్పాడు. రాక్షసుల దెబ్బలకు అరుస్తూ జాంబవంతుడు చచ్చిపోయాడు. మైందుడు, ద్వివిదుడు రాక్షసేనలు తమ మీద దాడికి దిగగా భయపడి కలతపడి చచ్చారు. ఇలా ఒక్కొక్కరే చస్తూ వానరులు నేలకూలారు. కొందరు సముద్రంలో దూకారు. కొందరు ఆకాశానికి ఎగిరిపోయారు. ఇలా నా సేనలు చంపగా నీ మగడు పరివారంతో సహా చచ్చాడు''.

రాముడి కల్పిత శిరశ్చాపాన్ని సీతకు చూపిన రావణుడు

ఇలా సీతాదేవితో అంటూనే, రాముడి శిరస్సును యుద్ధభూమి నుండి తెచ్చిన విద్యుజ్జిహ్వుడిని పిలుచుకుని రమ్మని ఒక రాక్షసుడికి చెప్పాడు. వాడలాగే రాముడి శిరశ్చాపాన్ని తెచ్చి జానకి ఎదుట పెట్టి వెళ్లిపోయాడు. రావణుడు వాటిని సీతాదేవి ముందుకు తోసి, "ఓ కమలాక్షీ! ఇదిగో మా ప్రహస్తుడు బహిరంగంగా, అందరూ చూస్తుండగా, యుద్ధభూమి నుండి తెచ్చిన రాముడు ఎక్కుబెట్టే విల్లు. ఇంకా ఎందుకు ఆలశ్యం చేస్తావు? నాకు స్వాధీనపడు'' అంటాడు.

సర్గ–32

శ్రీరాముడి మాయా శిరశ్చాపాలను చూసి దుఃఖపడ్డ సీత

సీత చూసిన ఆ శిరస్సు అచ్చు రాముడిదిలాగా వుండడంతో, అది తన మగడి తల అని నమ్మి శోకాతిశయంతో ఏడిచింది. తాను పంపించిన జడబిళ్ళను చూసిన సీతాదేవి అది తన మగడిదే అని నమ్మి బాగా ఏడ్చింది. ఏడుస్తూ ఇలా అనుకుంది. "అయ్యో! కలహశీలవైన కైకా! రాముడు చావాలన్న నీ కోరిక నెరవేరింది కదా! ఓసీ మహాధూర్తురాలా! సూర్యవంశం అనే పాలసముద్రానికి చంద్రుడు అస్తమించాడు. మంచి వంశాన్ని సాహసురాలివై విపత్తుల పాలు చేశావు. సూర్య వంశమే నిలిచిపోయింది. ఇక ఏ అభ్యంతరం లేకుండా హాయిగా సుఖంగా వుండు. గొప్ప మనస్సుకల రామచంద్రమూర్తి నీకయిష్టమైన దానిని దేన్ని చేశాడని ఆ విధంగా నార చీరెలు కట్టించి నాతో సహా అడవుల పాలు చేశావు? ఎందుకలా పగ సాధించావు?". ఇలా అనుకున్న సీత తెలివి తప్పి పడిపోయి, మళ్లా లేచి, ఆ తలను వాసన చూసింది.

చూసి, భర్తను ఉద్దేశించి ఇలా అనుకుంది. "భార్య గుణహీనత వల్లే భర్త ముందుగా చనిపోతాడని జ్ఞానులు అంటారు. నువ్వు సదాచార సంపత్తిలో పొగడ్తకన్నవాడివి. కాబట్టి నువ్వు అర్థాయుడివి కావడానికి నీ దోషం ఏదీ లేదు. నేను చేసిన పాపం వల్లే, నేను జీవించి వుండగానే నువ్వు మరణించావు. నేను పాపాత్మురాలిని అనడంలో సందేహం వుందా? గొప్ప వంశంలో పుట్టినవాడా! నీకా ఇట్టి నికృష్టపు చావు? రామభద్రా! నేను చేసిన పాపం నేను అనుభవించాల్సిందే. తప్పదు. ఇది నాతో ఆగదే. ఈ క్రూరమైన వార్త వినగానే సాదుస్వభావి అయిన నా అత్తగారు కౌసల్య, కొడుకా! కొడుకా! రామచంద్రా! అని ఎంత దుఃఖపడునో కదా? నేను చేసిన పాపం ఎంతమంది నిరపరాధులను

బాధిస్తున్నదో చూడు. ఏమిటీ ఆశ్చర్యం? జ్యోతిషం తెలిసినవారు అసమాన పరాక్రముడవైన నీకు యుద్ధంలో మరణం లేదనీ, దీర్ఘకాలం జీవిస్తావనీ చెప్పారు. వారిమాటలు అసత్యమయ్యాయి. ప్రాణేశ్వరా! నువ్వు అల్పాయువుడివి అయ్యావు. పాపరహితుడవైన నీకు మృత్యువు ఇప్పుడు రావాల్సిన కారణం లేదు. నీకు నిష్కారణంగా అకాల మృత్యువు ఎలా వచ్చిందో వారికి మతిహాని కూడా అలాగే వచ్చింది. ఈ రెండిటికీ దైవమే కారణం. నీతిశాస్త్రాలు అన్నీ నీకు తెలుసుకదా? ఎప్పుడు ఏది చేయవచ్చు, ఏది చేయకూడదు అని తెలిసిన నీకు మృత్యువు కళ్ళకు కనపడకుండా వచ్చి పైన పడింది. దైవ సంకల్పానికి అడ్డం లేదుకదా?"

"తామర రేకుల లాంటి కళ్ళు కలవాడా! దయలేని మనస్సు కలదాన్ని. కాబట్టి కఠినచిత్తను. అందుకే నేను భయంకరను. ఎందుకంటే, మహా భయంకరమైన పాపాలు నా ఆకారాన్ని ధరించాయి. వల్లభ! నేను నీపాలిటి కాళరాత్రిని. ఇలాంటి నన్ను నువ్వు చేరదీయడం వల్ల నిన్నే చంపాను. తేలును దగ్గరకు తీస్తే కుట్టకుండా వుంటుందా? దీర్ఘమైన బాహువులకలవాడా! నీతో వుండాలని నేను నిష్టగా పూజలు చేస్తుంటే నువ్వు నన్ను వదిలి భూదేవిని ప్రేమతో కౌగలించుకున్నావు కదా! నువ్వు ఏకపత్నీ నియమం కలవాడివి కదా? నీకు ఈ దక్షిణనాయకత్వం తగునా? ప్రాణేశ్వరా! నీ తండ్రితో కలిసి స్వర్గలోకంలో సుఖాలు అనుభవిస్తున్నావా? నువ్వు నన్ను అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న సమయంలో మనం ఇద్దరం కూడా బాల్యంలో వున్నవాళ్ళంకదా! అప్పటి నుండీ నువ్వు చేస్తున్న ధర్మ కార్యాలలో, సుఖ దుఃఖాలలో నీతోనే వున్నాను కదా? వల్లభా! సదాచారసంపత్తి కలదానినే కదా? నువ్వే కదా నన్ను భరించాల్సింది? నన్ను వుంచుకునే కదా నువ్వు యజ్ఞాలు చేయాలి. ఇలాంటి నన్ను ప్రేమతో ఎందుకు చూడవు? ఒక్క మాటైనా మాట్లాడవేంటి? నామీద నీకేమైనా కోపమా? హృదయేశ్వరా! నేనేదైనా మహా ఘోరపాపం చేశానా?"

"వివాహ సమయంలో నా పాణిని పట్టుకుని ధర్మార్థకామాలలో నన్ను అతిక్రమించి పోనని ప్రమాణం చేశావు కదా ప్రాణేశ్వరా! దాన్ని నువ్వు మరచిపోవచ్చా? నీ సుఖ దుఃఖాలలో నీతో సమానంగా అనుభవించాల్సిన దాన్ని కదా? కాబట్టి నువ్వు పోయిన చోటుకు నన్ను కూడా తీసుకుని పో. నీ ప్రాణాలకు ప్రియురాలిని కదా? ఇక్కడ నేను దుఃఖపడుతుంటే నువ్వు మాత్రమే పోవడం న్యాయమా? నాకు నువ్వు తప్ప దిక్కెవరు? నన్నిక్కడ దిక్కుమాలినదాన్ని

చేసి నువ్వు ఒంటరిగా పరలోకానికి పోవడం న్యాయశీలుడివైన నీకు ధర్మమా? రాజేంద్రా! నన్ను ప్రతిదినం కౌగలించుకునే నీదేహం నేడిలా గద్దల పాలయ్యేకదా? నువ్వు అగ్నిష్టోమాది యాగాలు చేసి అగ్నులను పూర్తిగా తృప్తిపరిచి, నీ పూర్వపు రాజుల్లాగా ఆ అగ్నులతో సంస్కారం పొందడం వీలుకాలేదు కదా? ఒంటరిగా లక్ష్మణుడు అయోధ్యకు పోతే కౌసల్య ఆయన్ను చూసి రాముడు ఏడని అడుగుతే, ఆయన్ను రాక్షసులు చంపారని, నన్ను వారు చెరపట్టారనీ చెప్తే, ఆ పుణ్యవతి గుండెపగిలి మరణిస్తుంది. అసమాన ఖరదూషణాదులను చంపిన బలవంతుడైన రామచంద్రుడు, అల్పుడైన ప్రహస్తుడి చేతిలో చచ్చాడట. నేను పాపాత్మురాలిని అయినందునే రామచంద్రుడికి భార్యే మృత్యువు అయింది. భార్య చేసిన పాపం భర్తకు కీడు, పుణ్యం మేలు కలిగిస్తుంది అంటారు".

"నేను పూర్వజన్మలో నిశ్చయం కాబడిన ఉత్తమ కన్యాదానాన్ని క్రూరురాలినై విఘ్నపరిచాను. ఆ కారణాన ఇప్పుడు సర్వజన సంపూజ్యుడైన వాడికి భార్య అయ్యికూడా సుఖం అనుభవించాల్సిన సమయంలో శోకం అనుభవిస్తున్నాను. రావణా! ఆలశ్యం చేయకుండా రామచంద్రుడి మీద నన్ను పడేయి. భార్యను భర్తతో కలిపి మంచి పనిచేయి. ఇలా చేస్తే, నీకు మేలు కలుగుతుంది. రాక్షసరాజా! రాముడి దేహంతో నా దేహం, నాధుడి శిరస్సుతో నా శిరస్సు కూర్చు. సహగమనం చేసి నా భర్త పోయిన లోకానికి నేను కూడా పోతాను".

ఈ విధంగా సీతాదేవి పలు విధాలుగా దుఃఖిస్తూ, భర్త శిరస్సు, ధనుస్సు అనేక పర్యాయాలు చూసి-చూసి ఏడుస్తూ, మూర్ఛ పోతుంది.

మంత్రుల పిలుపు మేరకు కొలువుకూటానికి పోయిన రావణుడు

ఇలా సీత ఏడుస్తున్నప్పుడు ద్వారపాలకులకు అధిపతి వచ్చి మంగళవాక్యాలు పలికి, "రాజా! మిమ్మల్ని చూడాలనుకుని ప్రహస్తుడు ఇతర మంత్రులతో వచ్చాడు. వాకిట్లో నిలబడి వున్నాడు. ఆయన వచ్చిన వార్త మీకు చెప్పమంటే నేను వచ్చాను. మీరు చేయాల్సిన అవశ్యమైన పని వున్నదట. త్వరగా రమ్మని అంటున్నాడు" అని చెప్పగా అశోకవనాన్ని వదిలి రాముడు చేయబోయే ప్రయత్నం తెలుసుకోవాలని సభకు పోయాడు రావణుడు. అక్కడ యుద్ధ విషయంలో చేయాల్సిన ఆలోచన చేయసాగాడు. ఇక్కడ రావణుడు అశోకవనం నుండి వెళ్లగానే రాముడి తల, విల్లు అదృశ్యం అయింది. ఆ సభలో రావణుడు

చేయాల్సిన పని చక్కగా ఆలోచించి దగ్గర వున్న మంత్రులతో, సేనానాయకులతో ఇలా అన్నాడు.

"అందరూ వినేట్లు భేరులు గట్టిగా వాయిస్తూ, రాక్షస సేననంతా యుద్ధ ప్రయత్నంలో ఒక్కచోటికి తెండి. వారికి కారణం చెప్పవద్దు". ఆ మంత్రులు, సేనానాయకులు అలాగే చేస్తామని చెప్పి, వారి–వారి సేనలను ఒక్కో చోట చేర్చి, ఆ వృత్తాంతాన్ని రావణుడికి చెప్పారు.

సర్గ–33
సీతాదేవిని సమాధానపర్చిన సరమ

రావణుడి ఆజ్ఞానుసారం సీతను కాపాడే వారిలో ఒకామైన సరస అనే రాక్షసి దృఢమైనపాతివ్రత్యం వున్నామె. సీతా రక్షణలో భర్త అనుసరించిన మార్గాన్నే అనుసరించేది. ప్రాణమిచ్చైనా సీతాదేవిని రక్షించడమే వ్రతంగా పెట్టుకున్నది. స్వభావరీత్యా దయాగుణం కలది. రావణుడి వల్ల మోసగించబడ్డ సీత దగ్గరికి పోయి, మెత్తటి వాక్యాలతో ఊరడించి ఇలా అన్నది. "జానకీ! ఊరడిల్లు. మాయలమారి అయిన రావణుడి మాటలు నమ్మి ఎందుకు దుఃఖపడతావు? సంతాప పడవద్దు. రావణుడు నీకు చెప్పినదంతా సర్వం విన్నాను. వాస్తవం చెప్తాను విను. అమ్మా! సీతా! విదితాత్ముడైన రామచంద్రమూర్తిని నిద్రపోయే సమయంలో హింసించడం సాధ్యం కాదు. అలా చంపబడనూలేదు. వానరులంతా క్షేమంగా వున్నారు. ఒక్కడు కూడా చావలేదు. వానరులను రాముడు రక్షిస్తున్నందున వారిని బాధించడం ఎవరికీ సాధ్యంకాదు. నీ భర్త తమ్ముడైన లక్ష్మణుడితో క్షేమంగా వున్నాడు. రాముడి లాంటివాడికి మృత్యువు ఎలా వస్తుందమ్మా? శ్రీరామచంద్రమూర్తిని ఎవరూ చంపలేదమ్మా! రావణుడు నిన్ను కావాలనే బాధపెట్టాడు. నీకు సంతోషకరమైన విషయం చెప్తా విను".

యుద్ధ సన్నాహాన్ని సీతాదేవికి తెలిపిన సరమ

సరమ సీతాదేవికి ఇలా చెప్పసాగింది. "సముద్రాన్ని దాటి వానరసేనతో నీ మగడు దక్షిణ తీరానికి వచ్చి వున్నాడు. వానరసేన అంతా సముద్రం ఒడ్డున రాముడిని రక్షిస్తూ వుంది. యుద్ధానికి వానర సేనకు కావాల్సినవన్నీ పూర్ణంగా సంపాదించి పెట్టుకున్నారు. రాముడు తమ్ముడితో వున్నాడు. ఇవన్నీ నేను చూసి

చెప్తున్నాను. విన్నమాటలు కావు. రావణుడు పంపించిన రాక్షసులు, రామచంద్రమూర్తి దక్షిణ తీరానికి చేరాడని చెప్పారు. ఆ కారణాన రావణుడు మంత్రులతో సమాలోచన చేస్తున్నాడు. (ఇలా సరమ చెప్తున్నప్పుడే యుద్ధ ప్రయత్నంలో వున్న సేనాభటుల భయంకర ధ్వనులు, నగారా ధ్వనులు వినపడ్డాయి. ఆ ధ్వనులు విన్న సరమ తన సంభాషణ కొనసాగించింది). పిరికిదానా! నువ్వు వూరికే భయపడ్డావు. విన్నావు కదా! రాక్షసులు చేస్తున్న యుద్ధ ప్రయత్నాలు? యుద్ధ ప్రయత్నాలు ఏం జరుగుతున్నాయని అంటావా? మేఘాల ఉరుములతో సమానమైన భేరీ ధ్వనులు నలుదిక్కులా వ్యాపిస్తున్నాయి. నీకు వినబడుతున్నాయి కదా? ఘీంకరిస్తున్న ఏనుగులను అలంకరించి తొండాలకు రోకళ్లు ఇచ్చి ముఖాలకు అడ్డంగా ఇనుప రేకులు కట్టడం జరుగుతున్నది. రథాలకు గుర్రాలు కట్టుతున్నారు. రౌతులు ఈటెలు చేతిలో ధరించి ఉత్తమజాతి గుర్రాలను ఎక్కుతున్నారు".

"సీతమ్మా విను! ఘంటల ఘణఘణలు, రథాల దబదబలు, గుర్రాల సకిలింపులు, వాద్యాల మోతలు. ఇవన్నీ యుద్ధ ప్రయత్నాలే. కాబట్టి రామచంద్రమూర్తికి కీడు కలిగిందని విచారపడవద్దు. అదే నిజమైతే ఇప్పుడు ఈ ప్రయత్నాలు ఎందుకు? సంతోష లక్ష్మి నిన్ను చేరుతుంది. రాక్షసులకు కీడు కలుగుతుంది. నీ మగడు రావణుడిని చంపి నిన్నేలుకుంటాడు. లక్ష్మణుడితో కలిసి నీ మగడు రాక్షస సేనలను నాశనం చేస్తాడు. శత్రువులను జయించిన నీ మగడితో కలిసి నువ్వు కులుకుతుంటే నేను చూడనా? సంతోషపడవమ్మా జానకమ్మా! నీ మగడితో కూడి నువ్వు పూర్ణ సంతోషం అనుభవిస్తావు".

సర్గ–34

రావణుడి మనో నిశ్చయం తెలుసుకొమ్మని సరమను కోరిన సీతాదేవి

సరమ మాటలకు సీతాదేవి సంతోషించింది. సమయం తెలుసుకుని పని చేయగల నేర్పరైన సరమ చిరునవ్వుతో మాట్లాడుతూ సీతతో ఇలా అన్నది. "ముగ్ధా! నేనెవ్వరికీ కనపడకుండా పోయి నీ క్షేమం, నువ్వు చెప్పే మాటలు రాముడికి చెప్పి రాగలను. ఏం చెప్పి రమ్మంటావో చెప్పు. లంకలోని వీధుల్లో వున్న రాక్షసుల గుంపు మధ్యనుండి ఎలా పోయి వస్తానని అంటావేమో? నిరాధారంగా నేను ఆకాశాన విమానం లేకుండానే పోతుంటే నా వేగానికి సరిసమానంగా గరుత్మంతుడు కాని, వాయువు కాని ఎంత ప్రయత్నించినా రాలేరు". ఆమె శక్తి తనకు తెలుసునని అన్న సీతాదేవి తన కోరిక చెప్తా వినమంటుంది ఇలా.

"స్నేహితురాలా! నీకు నామీద ప్రేమ వుంటే, నాకు సహాయం చేయాలని కోరిక వుంటే ఒక్క పనిచేయి ముందు. దుష్టుడైన రావణుడు ఇప్పుడేం చేస్తున్నాడో, నన్ను ఇంకేదైనా మాయోపాయం చేత దుఃఖపెట్టాలనుకుంటున్నాడా? నన్ను చంపాలను కుంటున్నాడా? ఇంకా ఏమని ఆలోచిస్తున్నాడో కనుక్కొని రా. నా మగడి దగ్గరికి పోయి నువ్విప్పుడే చేయాల్సింది ఏమీలేదు. నేను ఇక్కడ దుఃఖపడడం ఆయనకు తెలుసు. ఆయనకు నేను చెప్పేదేమున్నది? రావణాసురుడిని నా మగడు చంపేలోపు నన్ను రావణుడు చంపక విడుస్తాడా? అని నా సందేహం. నన్నేవేళకు చంపుతాడో అని భయపడుతున్నాను. కావలిగా వున్న ఈ రాక్షస స్త్రీలు నన్ను అదిరించి, బెదిరించి, బాధ పెట్టున్నారు. ఏ నిమిషంలో వాడికి ఏవిధమైన దుర్బుద్ధి పుట్టుందో? ఏంచేస్తాడో అని సందేహంగా వుంది. వాడి స్వాధీనంలో వున్న ఈ అశోకవనంలో

వాడికి భయపడి శోకిస్తున్నదానిని. వాడు ఇంకా ఏం చేయదల్చుకున్నాడో నాకు కొంచెమైనా అర్థం కావడం లేదు. కాబట్టి వాడి ఆలోచన కనుక్కొని రా". ఇలా చెప్పిన సీత కన్నీళ్లు తుడిచి సరమ ఇలా అన్నది.

"నీ కోరిక ఇదే అయిన పక్షంలో నేనిప్పుడే పోయి పగవారి మనస్సు తెలుసుకుని శీఘ్రంగా తిరిగి వస్తాను. నువ్వు ఏడవకుండా సంతోషంగా వుండు".

రావణుడి నిశ్చయం సీతకు తెలియచేసిన సరమ

సీతాదేవికి తనమాటలుగా చెప్పిన సరమ పొగరుబోతైన రావణుడు వున్న చోటుకు పోయింది. అక్కడ వాడు తన మంత్రులకు చెప్పే విధం విని, వాడి నిశ్చయం తెలుసుకుని ముహూర్తకాలంలో అశోకవనానికి తిరిగి వచ్చింది. మరలి వచ్చిన సరమను చూసిన సీతాదేవి స్వయంగా ఆమెకు పీటవేసి కూర్చోమని చెప్పింది. దానిమీద ఆమెను సుఖంగా కూర్చోమని చెప్పి మూర్ఖుడైన రావణుడి హృదయం ఎలా వుందో చెప్పమని అడిగింది. అప్పుడు సరమ మంత్రులతో, సహాయులతో కూడిన రావణుడి ఆలోచనను వున్నదున్నట్లు సర్వం ఈ విధంగా చెప్పింది.

"సీతమ్మా! రావణుడి తల్లి కైకసి, వృద్ధమంత్రి యవిద్ధుడుఇద్దరు కూడా శ్రీరామచంద్రమూర్తికి సీతను ఇమ్మని నానా విధాలుగా బోధించారు. జన స్థానంలో ఖరాదులను, పద్నాలుగువేల రాక్షసులను అల్పకాలంలో లక్ష్మణుడు కూడా తోడు లేకుండా ఒంటరిగా, పాదచారై వధించడం అత్యాశ్చర్యమైన విషయమని వారు చెప్పారు. ఇప్పుడు కూడా లక్ష్మణుడు, సేనలతో సుగ్రీవుడు తోడుగా వున్నారని చెప్పారు. కాబట్టి వారు ఎంత పనైనా చేయగలరు. 'నాకిక్కడ కోటలు లేవా? సేనలు లేవా? ఖరాదులను మించిన బలవంతులు లేరా అని అంటావేమో? ఒక్క కోతి సముద్రం దాటి ఇక్కడకు వచ్చి నీకు తెలియకుండా సీతను చూసి మాట్లాడి, కోటలన్నీ చెరిచి, పాతిక భాగం సేనను చంపినప్పుడు నీ వీరులంతా ఎక్కడ వున్నారు? ఒక్కడైనా వాడిని నిగ్రహించగలిగారా? తమ కొంపలైనా తాము కాపాడుకోగలిగారా? ఇప్పుడు అలాంటి కోతులెందరు వున్నారో? వారంతా ఊరిమీద పడితే, ఏంగతి? ఇవన్నీ సామాన్య మనిషి చేయడం సాధ్యమా? ఇవన్నీ నువ్వు ఆలోచించాలి' అని బోధించారు."

"కాని లోభి ధనం వదలనట్లు, రావణుడు నిన్ను వదలడానికి

అంగీకరించలేదు. వాడు పీనుగై పోయేవరకు నిన్ను వదలడు. వాడికెందుకు ఇలాంటి దుర్బుద్ధి అంటావా? మృత్యుదేవత వాడిని మింగడానికి ఆశగా వుంది. కాబట్టి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లు, వాడు అలా నిశ్చయం చేసుకున్నాడు. బెదిరింపు మాటలకు వాడు భయపడడు. కాబట్టి రాక్షసులంతా చనిపోయేవరకు నిన్ను వాడు రాముడికి అప్పగించడు. ఈ కారణాన నీకు ప్రాణభయం లేదు. నిన్ను బెదిరిస్తాడే కాని చంపడు. అలాగైతే నీ మగడి దగ్గరికి నువ్వు చేరడం ఎలాగంటావా? నీ మగడు రావణుడిని చంపి నిన్ని అయోధ్యకు తీసుకుని పోతాడు. నువ్వు సందేహించవద్దు".

ఇలా సరమ చెప్తున్నప్పుడు వానరుల సింహనాదాలు, శంఖాల, భేరుల ధ్వనులు భూమి తబ్బిబ్బు అయ్యేట్లు వినపడ్డాయి. ఆ ధ్వనులకు రాక్షసులు భయపడి, తెల్ల ముఖాలు వేసుకుని, తమ రాజు చేసిన దోషం వల్ల ప్రాణాల మీద ఆశలు వదలుకున్నారు.

సర్గ-35
సీతాదేవిని ఇమ్మని రావణుడికి నీతి బోధించిన మాల్యవంతుడు

వానరులు చేస్తున్న ధ్వనులు దిక్కులు పిక్కటిల్లేట్లు వ్యాపిస్తుంటే, రాముడు లంక ముట్టడించడానికి వస్తున్న విషయం అర్థం చేసుకున్న రావణుడు ఒక్క ముహూర్తకాలం ఏం చేయాల్నా అని ఆలోచించసాగాడు. తన మంత్రులను చూస్తూ, వాళ్లను తిట్టుకుంటూ, బొబ్బలు పెట్టూ, ఇలా అన్నాడు.

"మీరంతా రాజకుమారుడు సేనలతో సహా సముద్రం దాటి వచ్చాడని చెప్తేకదా నాకా విషయం తెలిసింది. సీతానాథుడైన రామచంద్రుడి బలగర్వం విని మీరంతా నోరు మూసుకున్నప్పటికీ, మీరంతా యుద్ధంలో అద్భుతమైన పరాక్రమం చూపుతారని నా నమ్మకం. మిమ్మల్ని నమ్మేకదా సందేహం లేకుండా, ఎంత గొప్ప, కష్ట సాధ్యమైన పనైనా చేయగలిగాను. ఇప్పుడు కూడా మీరు నిండు మనస్సుతో సహాయం చేస్తే నేనీ కార్యం నేరవేర్చలేనా?"

రావణుడు ఇలా అనగానే, అతడి తల్లికి పెదనాన్న అయిన మాల్యవంతుడు ఇలా అన్నాడు. "రాజధర్మం తెలిపే నీతి విద్యల్లో పండితుడై, నీతిమార్గాన్ని అనుసరించే రాజు, ఐశ్వర్యంతో కూడి చిరకాలం రాజ్యం చేస్తూ, శత్రువులను తనకు లోబర్చుకుంటాడు. కాలానుగునంగా శత్రువుతో సంధి చేసుకోవాల్సి వచ్చినప్పుడు సంధి, యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు యుద్ధం చేసేవాడు తన పక్షాన్ని వృద్ధి చేసుకుని సంపద కలవాడవుతాడు. ఎప్పుడు సంధి చేసుకోవాలి, ఎప్పుడు యుద్ధం చేయాలని అడుగుతావేమో? శత్రువు కంటే తనబలం తగ్గినప్పుడు, లేదా, శత్రువు సమానుడైనప్పుడు సంధి చేసుకోవాలి. శత్రువు బలం తగ్గి, తన బలం పెరుగుతుంటే శత్రువులను ఉపేక్ష చేయకూడదు. యుద్ధం

చేయాలి".

"ఇప్పుడు సంధి చేయాల్నా? యుద్ధం చేయాల్నా అని నువ్వడిగితే నేను చెప్పేది ఒక్కటే. నేను చెప్పేది నీతి పద్ధతి కాబట్టి ఇప్పుడు రాముడితో సంధి చేసుకోవడమే తగిన కార్యం. దానికేమి చేయాలి? రాముడి కాళ్ల మీద పడాల్నా? అంటావేమో! అవసరం లేదు. కలహకారణం సీత. అలాంటి సీతాదేవిని తక్షణమే, వేగంగా రాముడి దగ్గరికి పంపించు. దాంతో పగ ముగుస్తుంది. అంతటితో నువ్వు నిర్భయంగా, నిరపాయ సుఖం పొందగలవు. సీతను పంపగానే యుద్ధం ఆగిపోతుందన్న నమ్మకం ఏంటి అని అడుగుతావేమో? రాముడు తన భార్యను తీసుకుపోవడానికి యుద్ధానికి వచ్చాడేకాని నీ రాజ్యం ఆశించి రాలేదు. కాబట్టి ఆమెను ఇవ్వడంతో పగ, కారణం తీరిపోతుంది. నీ రాజ్యంలో నువ్వు, ఆయన రాజ్యంలో ఆయన సుఖంగా వుండవచ్చు".

"సంధి ఎందుకు చేసుకోవాలి? యుద్ధం ఎందుకు చేయకూడదు అంటావా? దేవర్షులు, దేవగంధర్వులు, ఎవరికి విజయం చేకూరాలని కోరుకుంటున్నారో అలాంటి రాజకుమారుడితో నీకు విరోధం ఎందుకు? రాముడికి మనకు కనబడే వానర బలంతో సహా దైవబలం కూడా వుంది. బ్రహ్మదేవుడు లోకంలో ధర్మ పక్షమని, అధర్మ పక్షమని రెండు సృజించాడు. దేవతలు గొప్ప బుద్ధికలవారు కాబట్టి ధర్మాన్ని ఆశ్రయించారు. అసురులు, రాక్షసులు మహితాత్ములు కానందున తత్కాలంలో మంచిగా కనిపించే అధర్మాన్ని ఆశ్రయించారు. ఎప్పుడు ధర్మం అధర్మాన్ని అతిశయిస్తుందో అదే కృతయుగం. ఎప్పుడు అధర్మం ధర్మాన్ని అణగదొక్కుతుందో అదే కలియుగం. తన్నాశ్రయించిన వారిని ఉద్ధరించడం ధర్మం గుణం. తన్నాశ్రయించిన వారిని అధోగతి పాలుచేయడం అధర్మ లక్షణం. ఎంతెంత ధర్మం హెచ్చునో అంతంత దాన్ని ఆశ్రయించినవారికి మేలు కలుగుతుంది. ఎంతెంత అధర్మం హెచ్చవుతుందో దాన్ని ఆశ్రయించినవారికి అంతంత కీడు కలుగుతుంది. నువ్వు పరాక్రమం వల్ల ధర్మాన్ని నాశనం చేసుకుని పర్యవసానం ఎలా వుంటుందో లక్ష్యం చేయకుండా అధర్మం సంపాదించావు. నీ అధర్మం నీకు కీడుచేయక మానదు. ధర్మంలో వున్నవారు బాగుపడుతారు. కాబట్టి మన పగవారు మనకంటే బలవంతులయ్యారు. వారివల్ల మనకు కీడు కలుగుతుంది".

"అధర్మం వల్ల కీడు కలదని నువ్వు గమనించకుండా హెచ్చరిక తప్పి,

వదలకుండా అధర్మాన్నే అంటిపెట్టుకుని వున్నావు. ఎప్పుడు మన అధర్మం మనకు కీడు చేయడం ఆరంభించిందో అప్పుడే అది దేతలకు మేలు చేసింది. ఒకటి తగ్గితే రెండవది పెరుగుతుంది. రాముడు ధర్మాన్ని అనుసరిస్తున్నాడు కాబట్టి, దేవతలంటే పక్షపాతం వుంది కాబట్టి, వారంతా ఆయన మేలు కోరుతున్నారు. విషయ సౌఖ్యానికి అలవాటుపడ్డ నువ్వు ఋషుల కన్యలను, వారి భార్యలను కోరి చేయరాని పనులు చేశావు. ఇలాంటి ఘోరకార్యాలు నువ్వు చేశావు కాబట్టి, అగ్నిహోత్రుడులాంటి ఋషీశ్వరులు మనస్తాపం చెంది నీమీద కోపంగా వున్నారు. ఆ ఋషీశ్వరులు ధర్మాన్ని అభివృద్ధి చేసే వారు. వారి శాపం నీకు తగులుతున్నది. ఈ కారణాన ధర్మ పక్షం అభివృద్ధి చెంది, అధర్మ పక్షం నిన్ను అణగదొక్కుతున్నది. నీకు కీడు కలుగుతున్నది. రాక్షసులు ఆ ఋషుల ఎదుట నిలవలేక దిక్కులవెంట పరుగెత్తుతున్నారు. ఋషులకు ముందుగా హోమాగ్నులవల్ల కలిగిన పొగలు పది దిక్కులా వ్యాపించాయి. హోమధూమం రక్షోవినాశకరం కాబట్టి, ఆ పొగ వ్యాపించిన స్థలాల నిలవలేక రాక్షసులు పరుగెత్తుతున్నారు".

"నీకు దానవుల వల్ల, రాక్షసుల వల్ల, దేవతల వల్ల చావులేకుండా వరం వుంది. ఇప్పుడు యుద్ధానికి వచ్చినవారు వీరెవ్వరూ కాదు. నువ్వు వరం పొందని మనుష్యులు, వానరులు, ఎలుగులు వచ్చి లంకను ముట్టడించారు. వారు కూడా మనం ఇదివరలో చూసిన సామాన్యమైన మనుష్యులు, మృగాలు కావు. మనుష్యులలో దుర్లభమైన శౌర్యంకలవారు. ఇలాంటి సందర్భంలో నువ్వు చేయాల్సిన కార్యం ఏమిటో సరిగ్గా ఆలోచించు. ఈ సమయంలోనే భూమ్యాకాశాలలో కీడును సూచించే భయంకరమైన అపశకునాలు కనబడుతున్నాయి. వాటిని చూస్తే నీ ఒక్కడికే కాకుండా యావత్ రాక్షస సమూహానికి కీడు తప్పదనే అనిపిస్తున్నది. కఠోరంగా మేఘాలు ఉరుముతూ లంకంతా వేడి నెత్తురు కురుస్తున్నది. ఏనుగులు, గుర్రాలు, వాహనాలు కన్నీరు కారుస్తున్నాయి. ధ్వజాలు కాంతి చెడి విరిగిపోతున్నాయి. రాపులుగులు, నక్కలు, గడ్డలు లంకలోపల భయంకరంగా ధ్వనులు చేస్తున్నాయి. నీచ పిశాచాలు ఇండ్లలోని వస్తువులను దొంగిలిస్తున్నాయి. రాత్రులు అవి స్త్రీల కలల్లో కనిపించి వెకిలిగా నవ్వుతున్నాయి. దేవతలకు వేసిన బలి పిండాలను ఇండ్లలోకి దూరి కుక్కలు తింటున్నాయి. ఆవులకు గాడిదలు పుట్టున్నాయి. ఎలుకలు,

ముంగీసలు కలిసి మెలిసి తిరుగుతున్నాయి. పిల్లులు, పులులు; కుక్కలు, పందులు; కలిసిమెలిసి తిరుగుతున్నాయి. కిన్నరులు, రాక్షసులు, నరులు స్నేహంగా వున్నారు. రక్తపాదాలు, తెల్లటి దేహాలు గల పావురాలు రాక్షసులకు వినాశకాలం సూచిస్తున్నాయి. మృగాలు, పక్షులు వాటి మర్యాద వదిలి సూర్యుడిని చూసి ఏడుస్తున్నాయి. ఇలాంటి ఉత్పాతాలు పుట్టుతున్నాయి కాబట్టి బుద్ధి కలిగి ఇక చెడ్డ పనులు మానుకో. సంధి చేసుకో".

సర్గ–36

మాల్యవంతుడిని ధిక్కరించిన రావణుడు

మాల్యవంతుడు చెప్పిన మాటలు విన్న రావణుడు కోపించి, కళ్లెర్రచేసి, కనుబొమలు ముడివేసి, గుడ్లు తిప్పుకుంటూ, చెప్పినవాడు పెద్దవాడన్న గౌరవం కూడా లేకుండా, సభలో అందరూ వినేట్లు ఇలా అన్నాడు.

"ఇలాంటి వ్యర్థమైన మాటలు వదరడానికి నీకు మనసెట్లా వచ్చింది? శత్రువులకు అనుకూలమైన వారివల్ల ఏదో లాభం పొంది ఇలా చెప్తున్నావు. కాబట్టి నీమాటలు వినను. రాముడు నీచ మనుష్య జాతికి చెందినవాడు. బలహీనుడు. స్వభావం వల్ల నీచుడు. సంపదలో దరిద్రుడు. తనకంటే తక్కువైన కోతులను ఆశ్రయించినందువల్ల నీచాశ్రయం కలవాడు. కన్న తండ్రే దిక్కులేనివాడిగా చేసి వూరు వెడలగొట్టడం వల్ల పౌరుషం చెడి అడవుల్లో ఒంటరిగా తిరుగుతున్నాడు. ఇలాంటివాడిని నువ్వేమో విపరీతంగా మెచ్చుకుంటున్నావు. వాడిలో, నాలో లేని సామర్థ్యం ఏముందని మాట్లాడావు? నేను రాక్షసులందరికీ ప్రభువును. దేవగంధర్వులకు భయంకరుడిని. విశేష పరాక్రమవంతుడైన నన్ను ఎందుకు మిక్కిలి నీచుడిగా లెక్కించావు? నన్ను నువ్వింత కఠినంగా మాట్లాడడానికి నా మేలు ఓర్వలేనితనమైనా, లేదా, శత్రువుల వల్ల మేలు పొంది వారి ప్రేరణతోనైనా, లేదా, పక్షపాత వైఖరితోనన్నా కారణమై వుండాలి".

"శత్రువుల ప్రోత్సాహమే లేకుంటే నీలాగా గొప్ప శాస్త్రాలు తెలిసిన పండితుడు ఎవరైనా ఈ ప్రకారం రాజును ఉద్దేశించి మాట్లాడదు. ఆశ్రయరహితై ఒంటరిగా వున్న సీతను దండకారణ్యం నుండి తెచ్చిన నేను ఇప్పుడేమి మునిగి పోయిందని

రాముడికి బెదిరి నా కోరిక తీర్చుకోకుండా అప్పగించాలి? వానరులతో, లక్ష్మణుడితో, సుగ్రీవుడితో కూడిన రాముడిని యుద్ధభూమిలో నేను గద్దలపాలు చేస్తుంటే నువ్వే చూస్తావు. వీరాగ్రణి రావణుడు యుద్ధకేళికి భయపడుతాడా? నువ్వు చెప్పినట్లు రాముడు నీ అభిప్రాయం ప్రకారం గొప్పవాడే కావచ్చు. వాడేకాదు...వాడికి నూరింతలు ఎక్కువ గొప్పవాడు వచ్చినా నేను లోబడేవాడిని కాను. ఈ దోషం నాకు పుట్టుకతోనే వచ్చింది. దోషం అని తెలిసి కూడా ఎందుకు సవరించుకోనంటావా? స్వభావ గుణం దాటరానిది కదా? దాన్ని అతిక్రమించి ఎవడు పోగలడు? సముద్రం మీద రాముడు సేతువు కట్టాడని ఏదో గొప్ప పనిగా చెప్తున్నావు. అదొక లెక్కా? దానికి నేను భయపడ్తానా? ఆ రామచంద్రుడు వానరులతో ఇక్కడికి వస్తే మళ్లీ దేహంతో తిరిగి పోలేడని ప్రమాణం చేసి చెప్తున్నాను".

ఇలా రావణుడు చెప్పిన తరువాత మాల్యవంతుడు రావణుడి ఆజ్ఞ తీసుకుని జయ జయ అంటూ ఇంటికి పోయాడు. రావణుడు మంత్రులతో సమాలోచన చేసి లంకలో అన్ని వైపులా రాక్షసులను నియమించాడు.

పురద్వారాల వద్ద కాపలా పెట్టిన రావణుడు

తూర్పు పక్కన వున్న పురద్వారాన్ని రక్షించడానికి ప్రశస్తబలసంపత్తి కల ప్రహస్తుడిని, దక్షిణాన మహోదర,మహాపార్శ్వులను నిలిపాడు. పడమటి దిక్కున అనేక మాయలు నేర్చిన ఇంద్రజిత్తును విస్తార సేనతో సహా వుంచాడు. ఉత్తరపు దిక్కు కాయడానికి శుకసారణులను పంపి అక్కడికి తానే వస్తానని చెప్పాడు. ద్వీపం దక్షిణ భాగంలో పడమటి దిశగా నైరుతి మూలాన లంక వుంది. సేతువు ఉత్తరాన వుంది. ఉత్తరం-పడమర తాకుడు ఎక్కువ కాబట్టి అక్కడ ఒక చోట తాను నిలిచి ఒకచోట ఇంద్రజిత్తును వుంచాడు. పుర మధ్యభాగం రక్షించడానికి గొప్ప సైన్యంతో విరూపాక్షుడిని పెట్టాడు. ఈ విధంగా లంకకు నాలుగు వైపులా పదిలంగా రక్షకులను నియమించి, రావణుడు దైవ ప్రేరణ వల్ల, తాను కృతకృత్యుడైనానని అనుకున్నాడు. వారివారికి చెప్పాల్సిన పనులు అప్పచెప్పి వారందరినీ వారి సంస్థానాలకు పొమ్మని చెప్పి, తన అంతఃపురానికి సచివులు ఆశీర్వదిస్తూ వుంటే వెళ్లాడు రావణుడు.

సర్గ–37

రావణ సేనా సన్నాహ విధానం రాముడికి చెప్పిన విభీషణుడు

రామచంద్రమూర్తి, సుగ్రీవుడు, ఆంజనేయుడు, జాంబవంతుడు, అంగదుడు, మైంద ద్వివిదులు, లక్ష్మణుడు, సుషేషణుడు, విభీషణుడు, గజ నల కుముదులు, పనస గవాక్షులు, ఇలా అందరూ ఒకచోట చేరి చేయాల్సిన పని గురించి ఆలోచన చేయసాగారు. లంకకు చేరిన వానరులంతా దాన్ని ముట్టడి చేద్దామన్నారు. అలా ముట్టడించినప్పుడు ఎవరే పని చేయాల్నో అని ఆలోచించారు. అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు.

"నా మంత్రులు అనలుడు, శరభుడు, ప్రఘసుడు, సంపాతి; మాల్యవంతుడి మొదటి తమ్ముడు సుమాలి కూతురు కైకసి, రెండవ తమ్ముడు మాలి కొడుకులు అనలుడు, సరపాటి; ప్రహస్తుడి తమ్ముడు ప్రఘసుడు పక్షి వేషంలో శత్రు పురమైన లంకకు పోయి అక్కడ పుర రక్షణ కొరకు ఏర్పాటు చేయబడిన సేనల విధం చూసి వచ్చారు. వారి చెప్పినది చెప్తాను. గొప్ప సేనతో సేనానాయకుడైన ప్రహస్తుడు తూర్పు గవనిని కాపలా కాస్తున్నాడు. దక్షిణాన మహోదర, మహాపార్శ్వలున్నారు. పడమట ఇంద్రజిత్తు వున్నాడు. అతడికి సహాయంగా ఆయుధాలు ధరించిన వారెందరో వున్నారు. ఉత్తరాన రావణుడు స్వయంగా తానే రక్షిస్తున్నాడు. వీడికి సహాయంగా రాక్షస సమూహం వుంది. విరూపాక్షుడు నగర మధ్యప్రదేశాన్ని రక్షిస్తున్నాడు. ఈ విధంగా శత్రువులు తమ సేనను తీర్చిదిద్దారు. లంకలో వేయి ఏనుగులు, పదివేల రథాలు, అశ్వాలు పదివేలు, కోటి మంది పదాతులైన రాక్షసులున్నారు. వీరంతా మహాశూరులు, హింసాసక్తులు, రావణుడి మెప్పు పొందినవారు, భయంకరులు. ఈ తెగలలో ఒక్కొక్కదానికి పదిలక్షల పరిచారకులున్నారు. రావణుడు కుబేరుడిని

గెలిచినప్పటి సేనకంటే ఇప్పుడు చాలా ఎక్కువ గొప్ప సేన కలదు. యుద్ధంలో దేవతలనైనా గెల్వకల నువ్వు శత్రువును గెలవడానికి తగిన సన్నాహం చేయి. రామచంద్రా! నువ్వు నాలుగు విధాలైన సేనలున్న పగవారిని వధించు".

ఇలా విభీషణుడు చెప్పగానే, ఆలోచించిన రామచంద్రమూర్తి శత్రువులను జయించడానికి తన సేనను విభజించాడు. విభజించి ఇలా అన్నాడు.

లంకద్వారంలో సేనలను నిలిపిన శ్రీరాముడు

"గొప్ప సేనలతో నలుడు తూర్పు గావని వద్ద నిలిచి ప్రహస్తుడిని గెలవాలి. దక్షిణ దిక్కున అంగదుడు మహోదర, మహాపార్శ్వలను గెలవాలి. ఆంజనేయుడు తన సేనతో పోయి ఇంద్రజిత్తున్న పడమటి దిక్కున నిలిచి లంకను ఆక్రమించాలి. ఇక రావణుడిని చంపే వంతు నాది. వాడున్న ఉత్తర దిశలో నేను లక్ష్మణుడితో వుంటాను. జాంబవంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు సేనా మధ్యాన్ని రక్షించాలి. వానరులెవ్వరూ మనుష్య రూపంలో వుండవద్దు. ఇది నియమం. దీన్ని ఎవరూ, ఎప్పుడూ తప్పకూడదు. నేను, నా తమ్ముడు లక్ష్మణుడు, నా స్నేహితుడు విభీషణుడు, ఆయన నలుగురు మంత్రులు.....ఈ ఏడుగురు మాత్రం మనుష్యుల రూపంలో యుద్ధం చేసి శత్రువులను చంపగలం. మరెవరైనా మనుష్యరూపంలో కనబడితే వాడిని శత్రువని వెంటనే వధించాలి. కాబట్టి వానరులెవ్వరూ మనుష్యరూపాలు ధరించకూడదు".

ఇలా సేనలను ఏర్పాటు చేసి తన పని ఫలవంతం కావడానికి ఆలోచన చేస్తూ రామచంద్రమూర్తి లంకను చూడాలనుకుని సువేలాద్రి ఎక్కాడు.

సర్గ–38

సుగ్రీవాదులతో సువేలాద్రి ఎక్కిన శ్రీరాముడు

రామచంద్రమూర్తి తన వెంట వున్న లక్ష్మణుడిని, సుగ్రీవ విభీషణులను చూసి ఇలా అన్నాడు. "ఈ సువేలాద్రి పర్వతం ఎక్కి ఈ రాత్రి ఇక్కడే వుండి, ఉదయం కాగానే తన చావు కొరకై నా భార్యను అపహరించిన పాపాత్ముడి స్థానమైన లంకను చూద్దాం. అయ్యో! వీడెంత నీచుడో కదా! తాను పుట్టిన వంశాన్ని కాని, పెద్దల సాధు చరిత్రను కాని, ధర్మాన్ని కాని ఆలోచన చేయక దుష్టుడై లోకం తిట్టే పని చేశాడు. వాడి పేరు వింటేనే ఆద్యంతం దేహం మండుతున్నది. ఈ ఒక్క దుష్టుడి కొరకు నిరపరాధులైన రాక్షసులందరినీ ఎలా చంపాలి?".

ఇలా అంటూ కోపంగా రామచంద్రమూర్తి సువేలాద్రి ఎక్కగా, ఆయన వెంట లక్ష్మణుడు ఎక్కాడు. ఆ వెనుక సుగ్రీవుడు, మంత్రులతో విభీషణుడు, హనుమంతుడు, అంగదుడు, నీలుడు, మైంద, ద్వివిద, గజగవయ గవాక్షులు, గంధమాదనుడు, శరభుడు, జాంబవంతుడు, హరుడు, శతవలి, సుషేషణ, ఋషభ, దుర్ముఖులు మొదలైన వారంతా వాయువేగంతో ఎక్కారు. ఇలా అందరూ కొండ ఎక్కి ఆకాశాన్ని తాకుతున్నదా అన్నట్లున్న త్రికూటపర్వత శిఖరం మీదున్న అందమైన ప్రాకారాల వరుసలను, ద్వారాలను చూసి ఆ ప్రాకారాలలో వున్న నల్లటి రాక్షసులను వేరొక ప్రాకారమా అని భావించారు. లక్ష్మణ సుగ్రీవ విభీషణ సహితంగా రామచంద్రమూర్తి ఆ రాత్రి పర్వతం మీదే వున్నాడు.

సర్గ-39

లక్ష్మణ సుగ్రీవాదులతో లంకను చూసిన శ్రీరాముడు

ఉదయం కాగానే రామలక్ష్మణ సుగ్రీవ విభీషణ తదిర వీరులందరూ లంకానగరాన్ని చూసి ఆశ్చర్య పోయారు. సువేల పర్వతం వారికి సంతోషం కలిగించింది. అక్కడి పూలవనాలు వారికి మిక్కిలి సంతోషం కలిగించాయి. ఆ పర్వతం మీది చిన్న తోపుల్లో, వానరుల గుంపు ప్రవేశించి అక్కడక్కడ తిరిగి సంతోషించింది. ఇలా వానరులు ఉద్యానవనంలో ప్రవేశించి తిరుగుతుంటే మందవాయువులు వారికి ఘ్రాణసుఖం కలిగే విధంగా వీచాయి. సుగ్రీవుడి ఆజ్ఞానుసారం సువేలలోని వానరులు మినహా మిగిలిన వారంతా దండుగా బయల్దేరి లంకమీదకు పోయారు. వారి సింహనాదాలతో, కాలి తొక్కుళ్ళతో లంకానగరం అంతా అల్లల్ల చలించింది. (త్రికూట పర్వతానికి మూడు శిఖరాలు. అందులో ఒకటి సువేల. మధ్యలో లంకాపురి).

లంకలో భూమి వణికింది. దూళి అతిశయించింది. ఆ ధ్వనికి భయపడి జంతుసమూహాలు పరుగెత్తాయి. లంకానగరానికి మనస్సుతో పోవడమే అసాధ్యమైతే ఇక కాలి నడకతో పోవడం ఎలా సాధ్యం? లంకానగరం నిడివి నూరామడ. వెడల్పు ముప్పై ఆమడ. అందులోని గోపురాలు తెల్లటి మబ్బుల్లాగా వుంటాయి. ప్రాకారం బంగారం, వెండితో ప్రకాశిస్తుంటుంది. కాంతిగల ఏడంతస్తుల మేడల్లో కైలాసగిరి శిఖరంలాగా అందంగా వున్న వేయిస్థంబాల మెడ వుంది. దాన్ని ఎల్లవేళలా రాక్షసులు కాపాడుతుంటారు. ఆ లంకానగరానికి భూషణంగా మనోహరమైన రావణాసురుడి మేడ వుంది. దాన్ని వానరులు మిక్కిలి ఆశ్చర్యంగా చూశారు. రామచంద్రమూర్తి కూడా దాన్ని వానరులతో కలిసి చూశాడు. స్వర్గలోకంతో సమానమైన ఆ పురాన్ని, దాని అందాన్ని చూసిన రామచంద్రమూర్తి ఆశ్చర్యపడి సంతోషంగా సర్వం చూస్తూ వుండిపోయాడు.

సర్గ-40

రావణుడి గోపురాన్ని దాటి అతడితో పోరాడిన సుగ్రీవుడు

రామచంద్రమూర్తి త్రికూట పర్వతం దగ్గరున్న లంకను చూస్తున్నాడు. అలా వానరులతో సహా రావణుడిని, రాక్షస శ్రేష్టుడిని రామచంద్రమూర్తి చూస్తుండగా సుగ్రీవుడు చివాలున రావణుడున్న మేడమీదకు ఆకాశానికి ఎగిరి దూకాడు. దూకిన సుగ్రీవుడు, అల్పకాలమే అయినా నిలిచి భయం లేకుండా రావణుడిని చూసి, ఆ దుష్టుడిని కొంచెమైనా లెక్కచేయకుండా, వినడానికి కష్టమైన మాటలతో ఇలా అన్నాడు. "ఓరీ! క్రూరుడా! ముల్లోకాలకు నాథుడైన రామచంద్రమూర్తికి స్నేహితుడిని, దాసుడిని. తొలగిపోవద్దు. రాముడి తేజస్సు నాలో వుండడం వల్ల నీ గర్వాన్ని అణచకుండా వుంటానా?" ఇలా అంటూ మీది-మీదికి వస్తున్న సుగ్రీవుడి రత్నమయమైన కిరీటాన్ని లాగి నేలమీద కొట్టి మళ్లీ తనమీదికి వస్తున్న సుగ్రీవుడిని చూసి రావణుడు ఇలా అన్నాడు. "సుగ్రీవా! నా కంట పడకముందు నీకు చక్కటి మెడ వుంది కాని ఎప్పుడు నాకంట పడ్డావో అప్పుడే మెడలేనివాడివయ్యావు". ఇలా అంటూ కోపంతో సుగ్రీవుడిని ఎత్తి అవతల పారవైచాడు.

ఇలా విసిరివేయగా సుగ్రీవుడు పుట్ట చెండులాగా పైకెగిరి చేతులతో రావణుడిని నేలమీదికి తోశాడు. కిందపడ్డ రావణుడు భయపడక, వెనుదీయక త్వరగా లేచి చేతులతో యుద్ధం చేయసాగాడు. వాళ్ళిద్దరూ ఇలా కోపంతో యుద్ధం చేస్తుంటే చెమట నీళ్లు కారాయి. దేహాలలో నెత్తురు ఉబ్బింది. ఇద్దరూ గొప్ప ధైర్యం కలవారై యుద్ధం చేశారు. ఒకరినొకరు కొట్టుతూ, పడతోస్తూ, పెనుగులాడుతూ, ద్వంద్వ యుద్ధంలో నేర్పరులగా యుద్ధం చేశారు. బలవంతులైన ఆ ఇద్దరూ సమానంగా యుద్ధం చేశారు. ఇలా సుగ్రీవ-రావణులు

పరస్పరం సమాన బలాతిశయంతో యుద్ధం చేస్తున్నప్పుడు, సుగ్రీవుడిని న్యాయ యుద్ధంలో గెలవలేమని, మాయ చేసి గెలవాలని రావణుడు అనుకున్నాడు. తానే అనేక రావణాకారాలతో యుద్ధం చేస్తే సుగ్రీవుడు తికమకపడి ఎవరితో యుద్ధం చేయాల్నో తెలుసుకోలేడని, అప్పుడు అతడిని పట్టుకోవచ్చనీ భావించాడు రావణుడు. సుగ్రీవుడు వాడి ద్రోహబుద్ధి కనిపెట్టి, వున్నవాడు వున్నట్లే చిటిక వేసే లోపు ఆకాశానికి ఎగిరాడు. అలా రావణుడిని జయించినవాడై, బడలిక ఏమాత్రం లేకుండా సుగ్రీవుడు వేగంగా రాముడి దగ్గరికి పోయాడు. తాను చేసిన ఆలోచన తప్పిపోయిందికదా అని రావణుడు బాధపడ్డాడు. ఈ విధంగా రావణుడితో యుద్ధం చేసి సుగ్రీవుడు వానరులు తనను మెచ్చుకుంటుంటే స్నేహభావంతో రామలక్ష్మణులకు యుద్ధం మీద ఉత్సాహం కలిగించాడు.

సర్గ-41

సాహసం చేయవద్దని సుగ్రీవుడికి బోధించిన శ్రీరాముడు

సుగ్రీవుడి శరీరం మీద యుద్ధం గుర్తులు చూసిన శ్రీరాముడు అతడిని నిండు మనస్సుతో సంతోషంగా కౌగలించుకుని ఇలా అన్నాడు.

"ఇలాంటి పనిచేయవచ్చా? చేయకూడదా? అని నాతో ఆలోచించకుండా కపిరాజా! నీవిలాంటి సాహసం చేయవచ్చా? రాజైన వారు సాహసంతో ఇలాంటి పనులు స్వయంగా చేయవచ్చా? సుగ్రీవా! ఔరా! ఎంత సాహసం చేశావు? సాహసం మీదున్న ప్రేమ కార్యాలోచన విషయంలో లేదుకదా? యుద్ధం చేయడానికి వచ్చిన మనం యుద్ధం చేయడంలో సాహసం ఏముంది అంటావేమో? నువ్వక్కడ చిక్కుబడి వుంటే సీత గతి ఏంటి? నాగతి ఏంటి? ఈ వానరుల గతి ఏంటి? వీరికి నాయకుడు ఎవరు? నాయకుడు లేకుండా వారెలా యుద్ధం చేస్తారు? మనల్ని నమ్మి వచ్చిన విభీషణుడి గతి ఏంటి? నీ ఒక్కడి అనాలోచిత కార్యం వల్ల ఎందరికి ఎంత కీడు కలిగేదో ఆలోచించు. ఇకమీద నాతో ఆలోచించకుండా ఇతరులకు కష్టం కలిగించే ఇలాంటి పనులు చేయవద్దు. అక్కడ నీకేదైనా అపాయం కలిగినట్లయితే స్నేహితుడిని శత్రువుల పాలు చేసి నేనెలా జీవించేవాడిని? నీకు అపాయం కలుగుతుందేమో అని నువ్వు రాకముందు ఇలా ఆలోచించాను".

"ఏమి ఆలోచించానంటావా? విను. తనకు, తన స్నేహితుడికి ద్రోహం చేసినవారిని క్షమించకూడదు. కాబట్టి యుద్ధంలో రావణుడిని, కొడుకులతో, బంధువులతో సేనలతో చంపుతాను. నామాట అసత్యం కాకుండా విభీషణుడిని లంకారాజ్యానికి అభిషిక్తుడిని చేస్తాను. బలవంత పెట్టయినా నా సొంతరాజ్యానికి

భరతుడిని నిలుపుతాను. ఈ రెండు పనులు చేసి నాప్రాణాలను విడవాలనుకున్నాను". జవాబుగా సుగ్రీవుడు ఇలా అన్నాడు. "పుణ్యాత్మా! నీలాంటి వాడి భార్యను దొంగిలించిన దొంగను, ఎదుట ఠీవిగా నిలబడడం చూసిన నేను, నా శక్తి ఏమాత్రమో తెలిసి కూడా ఎలా ఊరకే చూస్తూ వుండగలను?". సుగ్రీవుడి నిష్కపట స్నేహానికి సంతోషించిన శ్రీరాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు.

లక్ష్మణుడికి శకునాలను తెలియచేసిన శ్రీరాముడు

లక్ష్మణుడితో శ్రీరాముడు ఇలా అచేప్పాడు. "మన సేనలను వారికి కావాల్సిన ఆహారం దండిగా ఇచ్చి, తాగడానికి చల్లటి నీళ్లున్న ప్రదేశంలో వారిని నిలపాలి. అప్పుడు మనం వ్యూహం ఏర్పాటు చేయాలి. వానరులకు, ఎలుగులకు, రాక్షసుల నాశనం తెలిపే ప్రళయచిహ్నాలు కనపడుతున్నాయి. చూశావా? అవేంటి అంటావా? విస్తారంగా దుమ్ము లేపుతూ వాయువు వీచింది. కొండల శిఖరాలు వణికాయి. భూమి కంపించింది. చెట్ల సమూహాలు నేల విరిగి పడ్డాయి. మబ్బుల గుంపులు రక్తంతో కలిసిన నీళ్లవాన కురిపించి మిక్కిలి అశుభం సూచిస్తున్నది".

సువేలాద్రి దిగి లంక ముట్టడించిన శ్రీరాముడు

శ్రీరాముడు లక్ష్మణుడితో ఇంకా ఇలా అన్నాడు. "లక్ష్మణా! రాక్షసుల కనిష్టసూచకాలు కనపడే సమయంలోనే మనం సేనలతో పోయి లంకను ముట్టడించాలి". ఇలా అంటూనే, వానరులంతా చూస్తుండగానే వేగంగా కొండ దిగి, "వానరులారా! ఇవే రాక్షసులకు అపజయం కలిగించే శకునాలు కనపడుతున్నాయి. ఈ సమయంలోనే పోయి లంకను ముట్టడి చేస్తే, అల్పకాలంలో రాక్షసులను, లంకను నుగ్గు-నుగ్గు చేయవచ్చు. మీకు రాగల అపాయం లేదు. మీకు అపాయం కలగకుండా నేను చూసుకుంటాను. రండి.... లంకను ముట్టడి చేయండి. ఏ మగాడు మన ఎదుట నిలిచి ప్రాణాలతో పోగలడో చూద్దాం" అని వానరులకు ఉత్సాహం కలిగే విధంగా సమయోచితంగా రామచంద్రమూర్తి పౌరుష వాక్యాలను పలికాడు. ఇలా అంటూనే స్వగ్రామానికి పోయేవాడిలాగా లంకకు ఎదురు ముఖంగా రాముడు పోతుంటే సుగ్రీవ, విభీషణ, లక్ష్మణ, హనుమంతులు, నల, నీల, జాంబవంతుడు వెంట పోయారు. వారి వెనుక వానర సేనలు కొండలు, చెట్లు ధరించి పోయారు.

ఈ విధంగా రామలక్ష్మణులు లంకాపురాన్ని సమీపించి, దానిని, లోపలివారు

బయటికి రాకుండా వుండే విధంగా, వానరసేనను నియమించారు. వారంతా రాముడి ఆజ్ఞానుసారం వారి-వారికి నియమించిన ప్రదేశాల్లో వుండిపోయారు. కొండ శిఖరంలాగా వున్న ఎత్తైన ఉత్తర ద్వారాన్ని రామచంద్రమూర్తి లక్ష్మణుడితో కలిసి అడ్డగించాడు. ఆ ద్వారం దగ్గరే రావణుడు లంకాపుర రక్షణ కొరకు కాపున్నాడు. రావణుడు కాపలా వున్న ఉత్తర ద్వారాన్ని అడ్డగించడానికి రామచంద్రమూర్తి తప్ప మరెవ్వరూ సమర్థులు కారు. వానర సేనానాయకుడైన నీలుడు తనకు మైందద్వివిదులు తోడుండగా లంకాపుర తూర్పు ద్వారాన్ని అడ్డగించాడు. గజగవయగవాక్ష ఋషభులు తనకు సహాయంగా వుండగా అంగదుడు తన సేనతో దక్షిణ దిక్కును అడ్డగించాడు. ప్రఘసుడు, ప్రమాథి సహాయులుగా ఆంజనేయుడు పశ్చిమ ద్వారాన్ని అడ్డగించాడు. సుగ్రీవుడు మధ్యలో వున్నాడు. ఆయనున్న చోట ముప్పైఆరుకోట్ల వానరులున్నారు. ఒక్కో గవనికి ఒక్కొక్క కోటి వానరులు అడ్డుగా నిలచారు.

జాంబవంతుడితో కలిసి సుగ్రీవుడు రామచంద్రమూర్తికి పడమటి వైపు, అంటే, కుడిపక్కన నిలిచారు. హనుమంతుడికి ఎదురుగా ఇంద్రజిత్తు, రామచంద్రమూర్తికి ఎదురుగా రావణుడు వుండడం వల్ల ఈ రెండు వైపులా తాకుడు ఎక్కువగా వుంటుందని సుగ్రీవుడు ఇద్దరి మధ్య నిలిచాడు. ఎప్పుడు యుద్ధం చేద్దామా అని వానరులు ఎదురు చూడసాగారు. గాలి కూడా లంకలోకి పోవడానికి సందులేనట్లు వానరవీరుల గుంపులు లంకను చుట్టుముట్టారు. వానరసేనను చూసి రాక్షసులు అబ్బురపడిపోయి గుండెలు అదరగా తబ్బిబ్బులయ్యారు. వానరులు నడిచివచ్చే ధ్వని లంకానగరంలో ధ్వని పుట్టించింది. లంక గడ-గడలాడింది. రామలక్ష్మణ సుగ్రీవుల వల్ల రక్షించబడే వానరసేన ప్రకాశించసాగింది.

ఈ విధంగా తన సేననంతా తగిన స్థలాలో నిలవబెట్టి మంత్రి పుంగవులతో రామచంద్రమూర్తి సమాలోచన చేయసాగాడు. రాజనీతి తెలిసిన రామచంద్రమూర్తి నీతి కోవిదుడైన విభీషణుడి అంగీకారం తీసుకుని అంగదుడితో ఇలా అన్నాడు.

అంగద రాయబారం

వీరుడైన అంగదుడిని చూసి హనుమంతుడు మరోమారు లంకకు పోవడం సరైంది కాదని, అలా పోవడానికి అంగదుడే సరైనవాడని ఆలోచించి ఆయనతో

రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "శూరుడా! కోట గోడ దాటి, లంక ప్రవేశించి, రావణుడిని సమీపించి, వాడంటే భయం లేకుండా నీ గొప్పతనానికి తగ్గట్లు నేను చెప్పానని నా మాటలుగా ఇలా చెప్పు. ఓరీ! రాజ్యలక్ష్మీ భ్రష్టుడా! ఓరీ ఐశ్వర్య భ్రష్టుడా! ఓరీ బుద్ధిహీనుడా! ఓరీ యాసన్న మరణుడా! బ్రహ్మ వరం ఉన్నదన్న పొగరుతో జ్ఞానహీనుడవై అప్సరసలకు, గంధర్వులకు, యక్షులకు, నాగులకు, ఋషులకు, రాజసమూహానికి ద్రోహం చేశావు. నీకా బ్రహ్మవరం పొగరు నశించే సమయం ఆసన్నమైంది. వారికి ద్రోహం చేస్తే వారే దండించాలి కాని నేనెందుకు వచ్చానని అడుగుతావేమో? నువ్వు నా భార్యను అపహరించి నన్ను బాధపెట్టావు. కాబట్టి నిన్ను దండించడానికి నీ లంక వాకిట్లో యముడిలాగా వచ్చాను. ఓరీ రాక్షస రాజా! ఆడదాన్ని ఏ బలంతో మోసం చేసి తెచ్చావో ఆ బలం నామీద చూపు".

"రాక్షస రాజా! నువ్వు వీరుడివై యుద్ధానికి వస్తే రా. నా బాణాలకు చచ్చి పోగలవు. అలా చేయడానికి నీకు ఇష్టం లేకపోతే గర్వం వదిలి సీతను నాకిచ్చి నా శరణు వేడుకో. ఈ రెంటిలో ఏదో ఒకటి చేయకపోతే నా బాణాలతో లోకంలో రాక్షసులనేవారు లేకుండా చేస్తాను. నీ ఒక్కడి కారణాన రాక్షసవంశమే నాశనం అవుతుంది. నువ్వు శరణాగతుడివైతే బతుకుతావు. రాక్షసులంతా బతుకుతారు. నువ్వు శరణాగతుడివి కాకపోతే నీకు లంకా రాజ్యం కూడా దక్కదు. ఎందుకంటే, రాజ్యాన్ని ధర్మాత్ముడు పాలించాలి కాని అధర్మచిత్తుడు పాలించకూడదు. నువ్వు అధర్మచిత్తుడివి కాబట్టి నువ్వు రాజుగా వుండడానికి అనర్హుడివి. విభీషణుడు ధర్మాత్ముడు కాబట్టి రాజుగా వుండడానికి అర్హుడు. విభీషణుడు రాక్షస సమూహంలో గొప్పవాడు, జ్ఞానసహితుడు. మరో కారణం....విభీషణుడు నన్నాశ్రయించాడు. నామీద ద్రోహ బుద్ధి కలవాడివి నువ్వు. నిన్ను చంపి, లేదా, తొలగించి, రాక్షస రాజ్యాదిపత్యం విభీషణుడికి ఇస్తాను. విభీషణుడిని సింహాసనం మీద కూర్చోబెట్టడానికే నేను వచ్చాను".

"మూర్ఖులను సహాయకులుగా పెట్టుకున్నవాడా! వినరా! ధర్మ మార్గం వదిలి పాప కార్యాలలో ఆసక్తికలవాడివై, కామవశుడివైన నువ్వు రాజ్యాన్ని ఒక్క నిమిషం కూడా పాలించ కూడదు. కాబట్టి ధైర్యంగా యుద్ధానికిరా. నువ్వు చేసిన పాపాలకు నా వాడి బాణాలతో శిక్ష అనుభవించి చచ్చి వీరస్వర్గాన్ని పొందుతావు. ముల్లోకాలలో ఎక్కడికి పోయినా నిన్ను వదలను. చివరకు కాకాసురుడి లాగా నా కాళ్లమీద పడాల్సిన వాడివే. నిన్ను రక్షించగలవాడు ముల్లోకాలలో ఎవరూ

లేరు. ద్రోహీ! నా కంటపడి చావకుండా బతకగలవా? నీకంటే ముందే నీవారందరూ చస్తారు కాబట్టి, నీకు శ్రాద్ధం పెట్టేవారు ఎవరూ వుండరు కాబట్టి, నీ శ్రాద్ధం నువ్వే పెట్టుకుని నీకిష్టమైన వారందరినీ కడసారి చూసి రా. నీ ప్రాణం నా చేతిలో వుంది కాని నీ దేహంలో లేదు''.

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా అంగదుడు అగ్నిహోత్రంలాగా మండిపోతూ, ఆకాశానికి ఎగిరి, కోట దాటిపోయి, రావణుడు మేడమీద వుండగా అక్కడ దిగి, మంత్రులతో కూడి వున్న రావణుడిని చూసి, సమీపానికి పోయి, రామచంద్రమూర్తి చెప్పిన మాటలను ఒక్క అక్షరం ముక్క కూడా వదలకుండా సర్వం వినిపించాడు. "రామచంద్ర మహారాజు దూతను నేను. ఆయన రాయబారం పంపగా వచ్చాను. నేను వాలి కుమారుడిని. అంగదుడు అంటే నేనే. పుణ్యాత్ముడైన రామచంద్రమూర్తి ఇలా చెప్పాడు. మగవాడివైతే యుద్ధానికి లేచిరా. మంత్రులతో, కొడుకులతో, చుట్టాలతో, స్నేహితులతో సహా నిన్ను చంపుతాను. లోకాలకు నీ బాధ తొలగిస్తాను. సగౌరవంగా సీతను తెచ్చి వెంటనే నాకు సమర్పించకపోతే, శరణు వేడకపోతే, నిన్ను చంపి నీ రాజ్యాన్ని విభీషణుడికి ఇస్తాను అని చెప్పమన్నాడు''.

రాక్షసులను చంపి తిరిగి శ్రీరాముడి దగ్గరికి వచ్చిన అంగదుడు

అంగదుడు ఇలా చెప్పగానే, రావణుడు కోపంతో కళ్ళు ఎర్రగా చేశాడు. దుర్భాషలాడిన అంగదుడిని పట్టుకుని కట్టేయమని, కొట్టమని, చంపమని అరిచాడు. రావణుడు అలా చెప్పగానే భయంకరులైన రాక్షసులు అంగదుడి మీద పడి పట్టుకోగానే, అంగదుడు వారికి చిక్కినట్లు నటించి, వారు దగ్గరికి రాగానే వారి మెడలు చంకలో ఇరికించుకుని పక్షిలాగా వేగంగా ఎగిరిపోయాడు. పైనుండి ఆయన పట్టుకున్న రాక్షసులను వదలగా వారు కిందపడి చచ్చారు. ఇంత జరిగినా రావణుడికి బుద్ధి కలగలేదు. తాను రామచంద్ర మహారాజు దూతననీ, తన పేరు అంగదుడు అనీ, వాలి పుత్రుడననీ, అందరూ వినేట్లు స్పష్టంగా పలికి సింహనాదం చేస్తూ, అంగదుడు ఆకాశ మార్గాన రామచంద్రమూర్తిని చేరుకున్నాడు. ఆయన్ను చూసి రామచంద్రమూర్తి మెచ్చుకుని యుద్ధాన్ని ప్రారంభించాడు. అంగదుడు చేసిన కార్యాన్ని చూసిన రావణుడు ఇది తనకు అపశకునంగా భావించాడు. అక్షౌహిణిల కొద్దీ వస్తున్న వానర సైన్యాన్ని చూసి రాక్షసులు భయపడ్డారు. వానరుల కేకలకు రాక్షసులు హాహాకారాలు చేశారు.

సర్గ – 42

లంకను వానరులు ముట్టడి చేశారని రావణుడికి చెప్పిన రాక్షసులు

ఇలా వానరులు లంకను నాలుగు వైపుల నుండి ముట్టడి చేసిన తరువాత రాక్షసులు రావణుడి ఇంటికి పోయి, వానరులు లంకను అన్ని దిక్కుల నుండి ముట్టడి చేసిన విషయం చెప్పగా అతడికి కోపం వచ్చింది. తన మేడ ఎక్కి వానరులు ఆక్రమించిన విధానం చూశాడు. భూమినే మింగేసే విధంగా వున్న ఈ వానరసేనను ఎలా చంపాల్నా అని ఆలోచించ సాగాడు. అయినా స్థైర్యం కలవాడై వారిని ధైర్యంగా చూశాడు. ఇదిలా వుండగా రామచంద్రమూర్తి ప్రాకార సమీప ప్రదేశానికి పోయి అన్ని పక్కలా రాక్షసులతో ఆవరించబడి, రక్షించబడి, ధ్వజాలతో అలంకరించ బడిన లంకను చూశాడు. చూసి, సీతాదేవిని తలచుకుని, మనస్సులో బాధపడి, సీత తనకొరకై శోకిస్తున్నది కదా అని కలతచెందాడు.

లంక కోటకు లగ్గలు పట్టడానికి వానరులకు ఆజ్ఞ ఇచ్చిన శ్రీరాముడు

అలా కలత చెందిన శ్రీరాముడు విరోధులందరినీ నాశనం చేయమని అనుమతి ఇవ్వగా వానరులు సింహనాదాలు చేస్తూ, విచ్చలవిడిగా, వారి–వారికి నచ్చిన రీతిలో రాక్షస సేనా సమూహాన్ని ఎదిరించారు. ప్రాణాలమీద ఆశ వదలుకుని రావణుడు చూస్తుండగానే బలాతిశయంతో లగ్గపట్టి వానర శ్రేష్ఠులు గుంపులు–గుంపులుగా కోట గోడలను, ద్వారాలను, వనభూములను, నేలను చదరంగా నాశనం చేశారు. ఇలా చేస్తూ, జయం–జయం శ్రీరామచంద్రమూర్తికి, జయం–జయం లక్ష్మణుడికి, రామచంద్రుడి రక్షణలో వున్న సుగ్రీవుడికి జయం–జయం అని సంతోషంగా అరిచారు. వీరబాహువు, సుబాహువు, నలుడు కోట

చుట్టూ తిరుగుతూ వ్యూహం చెడిపోకుండా జాగ్రత్త పడ్డారు. ఈ లోపల మిగతా వానరులు వ్యూహాన్ని, సేనను చక్కదిద్దారు. ప్రఘసుడు, పనసుడు సహాయకులుగా కుముదుడు ఈశాన్య దిశలో; శతవలి ఇరవై కోట్ల వానరుల సహాయంతో ఆగ్నేయంలో దక్షిణ ద్వారం దగ్గర; అరవై కోట్ల వానరులతో సుషేణుడు నైరుతి-పడమట గవనిని అరికట్టారు. రామచంద్రమూర్తి లక్ష్మణుడితో వాయువ్య దిక్కున వుండి సుగ్రీవుడితో కలిసి ఉత్తర ద్వారాన్ని అరికట్టాడు. గవాక్షుడు రాముడి సమీపంలోనే వున్నాడు.

రాక్షసులను యుద్ధానికి పొమ్మని ఆజ్ఞాపించిన రావణుడు

"రాక్షసులారా! యుద్ధానికి పొండ"ని రావణుడు చెప్పగానే రాక్షసుల సింహనాదాలు, పెడబొబ్బలు అతిశయించాయి. సముద్రం పొంగి పొర్లినట్లు రాక్షస సేనలు వానరుల మీద పడ్డారు. ఒకనాటి దేవదానవ యుద్ధంతో సమానమైన యుద్ధం రాక్షసులకు, వానరులకు మధ్య జరిగింది. ఇరు పక్షాలు జయజయ ధ్వానాలు చేశారు. వానరులు ప్రాకారం ఎక్కి శత్రువులను తికమక పెట్టారు.

సర్గ-43
వానర రాక్షస ద్వంద్వ యుద్ధం

యుద్ధంలో రాక్షస సైన్యం ప్రకాశించింది. ఇలా దొమ్మి యుద్ధం జరుగుతున్నప్పుడు ఇంద్రజిత్తు అంగదుడితో యుద్ధం చేశాడు. సంపాతి ప్రజంఘుడితో, జంబుమాలి హనుమంతుడితో, మిత్రఘ్నుడు విభీషణుడితో, గజుడు తపనుడితో, నీలుడు నికుంభుడితో, సుగ్రీవుడు ప్రఘసుడితో ఎదిరించి పోరాడారు. లక్ష్మణుడు విరూపాక్షుడిని అడ్డుకున్నాడు. ఇలా ఒకరినొకరు ఎదిరించి దొమ్మియుద్ధం చేస్తుంటే నెత్తురు నేలమీద వ్యాపించింది. ఆ సమయంలో ఇంద్రజిత్తు అంగదుడిని గదతో కొట్టాడు. దానికి ప్రతిగా అంగదుడు ఇంద్రజిత్తు రథాన్ని పిండి-పిండి చేశాడు. జంబుమాలి హనుమంతుడి రొమ్ముకు బాణం వేయగా కోపగించిన ఆంజనేయుడు ఆ రాక్షసుడిని చంపాడు. వానరసేనను ఇబ్బంది పెట్టున్న ప్రఘసుడిని సుగ్రీవుడు చంపాడు. లక్ష్మణుడు విరూపాక్షుడిని చంపాడు. ఇలా మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు తదితరులు ద్వంద్వ యుద్ధంలో రాక్షసులను చంపారు. ఈ నేపథ్యంలో అద్భుత రూపమై రణభూమి నక్కలకు పండుగగా వుంది. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. రాత్రి చీకట్లను వ్యాపింప చేసింది.

సర్గ–44

వానర రాక్షసుల రాత్రి యుద్ధం

ఆ గాఢమైన అంధకారంలో వానర రాక్షసులకు యుద్ధం భీకరంగా జరిగింది. దట్టమైన ఆ చీకట్లో రాక్షస సమూహాలు వానరులను పట్టి మింగడం ప్రారంభించారు. రాత్రుల్లో రాక్షసులకు బలం ఎక్కువ కాబట్టి వారు విజృంభించడం చూసి కోపించిన శ్రీరామలక్ష్మణులు జడివానలాగా బాణాలు కురిపించి రాక్షసులను వధించారు. చచ్చిపోతున్న రాక్షసుల ఏడ్పులు అన్ని దిక్కులా వ్యాపించాయి.

రాక్షసులను వధించిన శ్రీరాముడు

ఆ రాత్రి కాళరాత్రిలాగా వుంది. ఆ సమయంలో రాక్షస శ్రేష్ఠులు గుంపుగా వచ్చి రామచంద్రమూర్తిని ఎదిరించారు. వారు వస్తున్నది గమనించిన రామచంద్రమూర్తి బాణాలను సంధించి నిమిషకాలంలో రాక్షసులను చంపాడు. పారిపోతున్న రాక్షస నాయకులను వెంటాడాయి రామబాణాలు. వాటిలో పడి రాక్షసులు మంటల్లో పడ్డ మిడుతల్లాగా అయ్యారు. రామచంద్రమూర్తి చంద్రుడిలాగా కనబడ్డాడు. గాఢమైన అంధకారం కమ్మడం వల్ల భయంకరమైన ఆ రాత్రి మరింత భయంకరంగా కనపడ్డది. కొండముచ్చులు తమకు చిక్కిన రాక్షసులను పట్టి వదలకుండా తినసాగాయి.

అంగదుడి చేతిలో పరాజితుడై మాయా యుద్ధం చేసిన ఇంద్రజిత్తు

రామలక్ష్మణుల శౌర్యం, రాక్షసుల పరాజయం చూసిన ఇంద్రజిత్తు కోపించి, వానరులమీదికి దూకాడు. వెంటనే సునాయాసంగా అంగదుడు వాడి గుర్రాలను చంపాడు. సారథిని చంపాడు. అప్పుడు ప్రత్యక్ష యుద్ధంలో వీరిని జయించడం

సాధ్యం కాదని భావించిన ఇంద్రజిత్తు కనపడకుండా యుద్ధం చేద్దామనుకున్నాడు. అంగదుడి పరాక్రమాన్ని దేవర్షులు పొగిడారు. ఇంద్రజిత్తు మహాధైర్యశాలి అనీ, మాయా యుద్ధంలో సమర్థుడనీ, యుద్ధంలో అతడిని జయించడం కష్టమనీ లోకానికి తెలుసు కాబట్టి, అలాంటి వాడిని ఓడించినందువల్ల లోకం అంగదుడిని మెచ్చుకుంది. అంగదుడు చేసిన పనికి రామలక్ష్మణులు కూడా మెచ్చుకున్నారు. సుగ్రీవుడు, విభీషణుడు మేలు–మేలని చాలా సంతోషించారు. అంగదుడి దెబ్బకు వెనుకడుగు వేసిన ఇంద్రజిత్తు మాత్సర్యం అతిశయించగా, ఇతరులకు కనపడకుండా వుండే తిరస్కరణీ విద్యను ఆశ్రయించి ఎవరికీ కనబడక తన వాడి బాణాలతో వానరులను బాధించాడు.

ఆ సమయంలో రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "వానరులారా! వీడు రాత్రి యుద్ధంలో అసాధ్యుడు. బ్రహ్మ ఇచ్చిన దుష్ట వరాల బలంతో ముల్లోకాలను బాధించగల సమర్థుడు. నాకు అసాధ్యమైనది కూడా వుందా అని అడుగుతారేమో? నేను బ్రహ్మ మాట వ్యర్థం చేయను. గౌరవిస్తాను. గౌరవించాలి కూడా. నేను గౌరవించకుండా వ్యర్థం చేస్తే అతడు అసత్యమాడినవాడవుతాడు. తరువాత ఆయన్ను తలచుకునే వాడే వుండడు. అలాంటి స్థితి అతడికి తేకూడదు. కాబట్టి నేను లోబడి వుండాలి. (సర్వ మాయలను నాశనం చేయగల బ్రహ్మాస్త్రం, బ్రహ్మశిరోనామకాస్త్రం, నారాయణాస్త్రం లాంటి మహాస్త్రాలు రామచంద్రమూర్తి దగ్గరున్నాయి. వాటిని ప్రయోగిస్తే ఇంద్రజిత్తు అప్పుడే చస్తాడు కాని, అలా జరుగుతే, బ్రహ్మ మాట వ్యర్థం అవుతుంది. ఇంద్రజిత్తు ప్రథమ యుద్ధంలో అతడి బాణాలు బ్రహ్మాస్త్ర మంత్రం తెలిసిన హనుమద్విభీషణులను బాధించలేకపోయాయి. ఆ మంత్రం రామలక్ష్మణులకు తెలుసు. బ్రహ్మ కోసం కట్టుబడాల్సి వచ్చింది. యమరావణ యుద్ధంలో బ్రహ్మకు ఇలాంటి కష్టమే వచ్చింది. అప్పుడు బ్రహ్మ ప్రార్థించగా యముడు యుద్ధం చాలించి పోయాడు. బ్రహ్మరుద్రులు ఇలా అనాలోచితంగా వరాలు ఇవ్వడం మామూలే).

రాముడు సుగ్రీవుడి దగ్గర నిలబడి హెచ్చరికగా వుండమని చెప్పాడు. ఇంతలో ఇంద్రజిత్తు కోపంతో రామవానర నాశనం చేయాలనుకుని అంతర్థాన విద్యతో కనపడకుండా ఆకాశానికి ఎగిరి అందరికీ భయం కలిగిస్తూ వానరసేనమీద బాణాల వాన కురిపించాడు. వానరులు భయంతో కాళ్లు–చేతులు ముడుచుకుని వుండిపోయారు. రామలక్ష్మణులను కూడా

ఇంద్రజిత్తు తన బాణాలతో బాధించసాగాడు. యుద్ధభూమిలో రామలక్ష్మణుల ఎదురుగా నిలుచుని వారిని జయించడం సాధ్యం కాదని తెలుసుకున్న ఇంద్రజిత్తు, మాయతో వారిని ఖండించాలని భావించి, వానరులంతా చూస్తుండగా వారిని బాణాలతో కట్టివేయాలని ప్రయత్నం చేశాడు.

సర్గ–45

రామలక్ష్మణులను నాగపాశబద్ధులను చేసిన ఇంద్రజిత్తు

తిరస్కరణీ విద్యా బలంతో ఎవరికీ కనబడకుండా ఆకాశాన్నుండి పరాక్రమం చూపుతున్న ఇంద్రజిత్తును వెదకడానికి ఇంద్రుడి మనుమడైన అంగదుడిని, బ్రహ్మ కొడుకు జాంబవంతుడిని, నీలుడిని, సుశేణ పుత్రులను, శరభుడిని, ఋషభుడిని, వినతుడిని, సానుప్రస్థుడిని, ఋషభస్కందుడిని పంపారు. వారు చెట్లు, కొండలు సాధనాలుగా ఇంద్రజిత్తుమీదికి పోగా అతడు అసమాన వేగం కల బాణాలను ప్రయోగించాడు. వారెవరూ ఇంద్రజిత్తును చూడలేకపోయారు. వారిని ఉద్దేశించి ఇంద్రజిత్తు రామలక్ష్మణులతో ఇలా అన్నాడు "మీరా నన్ను ఎదుర్కొనగల శూరులు? యుద్ధభూమిలో నేను కనబడకుండా తిరిగేటప్పుడు ఇంద్రుడు కూడా నన్ను సమీపించలేడు. చూడనూ లేడు. ఇక మీరా నాకు ఒక లక్ష్యం? మిమ్మల్ని ఇద్దరినీ భయంకరమైన అస్త్ర సమూహాలతో చంపుతాను చూడండి".

ఆ రాక్షసుడు ఇలా మాట్లాడి నాగాస్త్ర సమూహాలను వారిమీద ప్రయోగించి రామలక్ష్మణులను ఆ బాణాలతో కట్టిపడేసాడు. బాణాల గాయాలకు వారి దేహం నుండి నెత్తురు కారింది. ఇంత బాధ కలిగినా భయపడకుండా సహించి వున్న రాముడి మీదికి మరిన్ని బాణాలను వేశాడు ఇంద్రజిత్తు. రామచంద్రమూర్తి విల్లుతో సహా నేలమీద పడిపోయాడు. బాణశయ్య మీద వీరులకు ఉచితమైన రీతిలో పడుకున్నాడు. అన్న ఈ విధంగా నేలమీద పడుకోవడం చూసి లక్ష్మణుడు కూడా తన ప్రాణం మీద ఆశ వదిలి బాణశయ్య మీద పడుకున్నాడు. వానరులంతా వారిని సమీపించి దుఃఖపడ్డారు.

సర్గ-46

బద్ధులైన శ్రీరామలక్ష్మణులను చూడడానికి వచ్చిన సుగ్రీవాదులు

ఇంద్రజిత్తు బాణ వేగం తగ్గగానే సుగ్రీవుడు, విభీషణుడు రామలక్ష్మణులు పడివున్న స్థలానికి వచ్చారు. వారిని చూసి ద్వివిదుడు, అంగదుడు, హనుమంతుడు, మైందుడు, కుముదుడు మొదలైనవారు వారి దురవస్థకు శోకించారు. వారెవరికీ ఇంద్రజిత్తు జాడ తెలియలేదు. అన్ని దిక్కులా అతడి కొరకు వ్యర్థంగా వెతికారు. ఇంద్రజిత్తు మాయా విద్య తెలిసిన విభీషణుడు ఒక్కడు మాత్రం అతడిని చూడగలిగాడు.

శ్రీరామలక్ష్మణులు చనిపోయారని రాక్షసులకు చెప్పిన ఇంద్రజిత్తు

కిందపడిపోయిన రామలక్ష్మణులను చూసిన ఇంద్రజిత్తు తనవారికి సంతోషం కలిగే విధంగా ఇలా అన్నాడు. "రామలక్ష్మణులను నా అస్త్రాలతో కట్టి చంపాను. ఈ కట్లు విప్పడానికి దేవర్షులు కూడా సమర్థులు కారు. ఇక తక్కినవారి మాటేల? ఈ రాముడు, లక్ష్మణుడు, ఈ సేన చేసిన పౌరుష కార్యాలన్నీ ఈ రాత్రితో వ్యర్థమై పోయాయి.

వానరవీరులను నొప్పించిన ఇంద్రజిత్తు

ఇంద్రజిత్తు తొమ్మిది బాణాలను తీసుకుని నలుడి మీద, మైందుడి మీద, ద్వివిదుడి మీద వేసి, ఆ తరువాత ఒక పెద్ద బాణాన్ని సంధించి జాంబవంతుడి మీద వేశాడు. ఆ వెంటనే ఆంజనేయుడి మీద, శరభుడి మీద, గవాక్షుడి మీద అతివేగమైన బాణ వర్షాన్ని కురిపించాడు. వానర శ్రేష్ఠులు సత్తువ చెడి భయంతో కుప్పలు-కుప్పలుగా పడగా ఇంద్రజిత్తు సింహనాదం చేశాడు. ఇలా వానరుల బలం పూర్తిగా చెడగొట్టి, పెద్దగా నవ్వి, రాక్షసులను చూసి "రామలక్ష్మణులు

ఇద్దరూ బాణాలతో కట్టబడి నేలమీద పడి వున్నారు. చూడండి" అని చెప్పగా వారంతా అతడు చేసిన పనికి ఆశ్చర్య పడ్డారు. రామలక్ష్మణులు చచ్చిపోయారని భావించిన రాక్షసులు మేఘాలు ఉరిమినట్లు సింహనాదాలు చేసి ఇంద్రజిత్తును గౌరవించారు. కాళ్లు-చేతులు కదిలించకుండా, శ్వాస విడవకుండా, భూమ్మీద పడి వున్న అన్నదమ్ములను చూసి వారి చనిపోయారని రాక్షసులు భావించారు.

సుగ్రీవుడికి ధైర్యం చెప్పిన విభీషణుడు

రామలక్ష్మణులు చనిపోయారన్న సంతోషంతో ఇంద్రజిత్తు లంకలోకి పోయాడు. రామలక్ష్మణులున్న స్థితి చూసి సుగ్రీవుడు భయపడి కన్నీరు కార్చాడు. అప్పుడు అతడితో విభీషణుడు ఇలా అన్నాడు. "వానరరాజా! పామరుడిలాగా నువ్వు భయపడవచ్చా? కన్నీరు కార్చవద్దు. యుద్ధ లక్షణాలు ఇవే కదా? యుద్ధంలో నేనే గెలుస్తానని నమ్మవచ్చా? నమ్మకూడదు. నీకంటే రెంటా చెడ్డవాడిని నేను. నన్ను నువ్వు సమాధానపర్చు. సుగ్రీవా! మనకు కూడా కొంచెమైనా అదృష్టం మిగిలి వుంటే అది వ్యర్థం కాకూడదు. కాబట్టి పాపరహితులు, మహాశూరులు, మహాత్ములు రామలక్ష్మణులు నిజంగా మూర్ఛ విడిచి లేస్తారు. అంత దృఢంగా నేనెలా చెప్పగలనని అంటావా? సర్వదా సత్య ధర్మాలంటే ప్రీతికలవారికి అకాల మరణభయం కలగదు. వీరలాంటి వారు కాబట్టి వీరికి అపమృత్యు భయం లేదు". ఇలా అంటూ విభీషణుడు చేతులు కడుక్కుని నీళ్లు మంత్రించి, ఆ తీర్థంతో సుగ్రీవుడి కళ్ళు తుడిచాడు. మంత్రించిన జలంతో మంత్రాలెరిగిన విభీషణుడు సుగ్రీవుడి రెండు కళ్ళు తుడిచి కాలయోగ్యమైన మాటలను ఇలా చెప్పాడు. ఈ లోపుల సుగ్రీవుడు కూడా వాస్తవం తెలుసుకున్నాడు.

(రామలక్ష్మణులు మూర్ఛ పోయారు కాని చావలేదు. ఆ అస్త్రాలకు కట్టివేయగలంత బలం మాత్రమే వుంది. మంత్రబలం తగ్గగానే కట్లు వూడిపోతాయి. విభీషణుడికి ఈ విషయం తెలుసు).

"ఈ విధంగా నువ్వు దిగులు పడకూడదు. ఇది ధైర్యంగా వుండాల్సిన సమయం. సుగ్రీవా! అధైర్యపడితే అన్ని పనులూ చెడిపోతాయి. కాబట్టి దాన్ని వదులు. రామచంద్రుడే తమకు దిక్కని ఈ వానరులంతా నమ్మి వున్నారు. నువ్వు దిగులుపడి కూర్చుంటే రాముడికి ఏదో అయిందని వీరంతా భయపడుతారు. దానివల్ల కార్యహాని కలుగుతుంది. నువ్వు ధైర్యంగా వుంటే వారికీ ధైర్యం

వస్తుంది. అలా కాకపోతే రామలక్ష్మణులు మూర్ఛ నుండి కోలుకునేవరకు వేరేవారిని కాపలా పెట్టక తప్పదు. వీరు మూర్ఛ తేరుకుంటే మన కష్టాలు సమసిపోతాయి. ఈ నాగపాశబంధాలు రామచంద్రమూర్తికి బాధ కలిగించలేవు. బ్రహ్మ వరం గౌరవించాల్సి వున్నందున ఇలా వున్నాడు కాని నిజంగా బాధవల్ల కానేకాదు. ఈ బాధతో రామచంద్రమూర్తి మరణిస్తాడని నువ్వు భయపడవద్దు. ఎందుకంటే మరణించే వారి ముఖంలో ఈ కాంతి కనపడదు. సుగ్రీవా! సమస్త కార్యాలు చక్కబెట్టి నేను వచ్చేవరకూ వూరడిల్లు. వానరసేనలను సమాధానపర్చు".

ఇలా సుగ్రీవుడికి వూరడింపు మాటలు చెప్పి పరుగెత్తి పోయే వానరులను సమాధానపరచి వారు భయపడకుండా చేశాడు విభీషణుడు.

శ్రీరామలక్ష్మణులను నాగపాశబద్ధులను చేసి వధించానని రావణుడికి చెప్పిన ఇంద్రజిత్తు

అక్కడ ఇంద్రజిత్తు రాక్షస సైన్యం తనను కొలుస్తుంటే బలగర్వంతో లంకలోనికి పోయి తండ్రి రావణాసురుడికి రామలక్ష్మణులు ఇద్దరూ చచ్చారని చెప్పగా అతడు తన ఆసనం మీదనుండి లేచి, "కొడుకా! బలే! బలే!" అని మెచ్చుకున్నాడు. సంతోషంగా రావణుడు కొడుకు శిరస్సు వాసనచూసి కౌగలించుకుని, "ఎలా చంపావు? ఏమి ఉపాయం చేశావు? ఆ విధమంతా చెప్పు" అని అడిగాడు. నాగపాశాలతో వాళ్లను కట్టేసానని, కాళ్లు-చేతులు కదిలించలేకుండా పడిపోయారని జవాబిచ్చాడు ఇంద్రజిత్తు. అక్కడ జరిగిన వ్యవహారమంతా వినిపించాడు రావణుడికి. రామలక్ష్మణుల వల్ల తనకింత వరకూ కలిగిన భయం పోగొట్టుకున్న రావణుడు సంతోషంగా కొడుకును పొగిడాడు.

సర్గ–47
శ్రీరామలక్ష్మణులకు కాపలాగా వున్న హనుమదాదులు

ఇంద్రజిత్తు వెళ్ళిపోయిన తరువాత రామలక్ష్మణులకు కాపలాగా హనుమదాదులు అక్కడే వుండిపోయారు. గడ్డిపోచ కదిలినా రాక్షసులు వస్తున్నారేమోనని భయంతో ఉలిక్కిపడుతూ పది దిక్కులా చూసేవారు వానరులు.

సీతాదేవికి రామలక్ష్మణులను చూపమని రాక్షస స్త్రీలకు చెప్పిన రావణుడు

పుష్పకం నుండి రామలక్ష్మణులను చూసిన సీతాదేవి

రామలక్ష్మణులు ఇంద్రజిత్తు చేతిలో చనిపోయారని సంతోషంగా సీతాదేవికి చెప్పి, ఆమె నమ్మడానికి బలవంతంగానైనా పుష్పక విమానం మీద కూర్చోబెట్టి యుద్ధ స్థలానికి తీసుకెళ్ళి వారిని చూపమని రావణుడు రాక్షస స్త్రీలకు చెప్పాడు. ఇక ఆమె సమస్త ఆభరణాలు ధరించి తనను చేరుతుందని భావించాడు రావణుడు. రాముడు తనను రక్షిస్తాడన్న ఆశ ఇక ఆమెలో వుండదనుకుంటాడు. ఆయన ఆజ్ఞానుసారం రాక్షస స్త్రీలు భర్త కొరకు తపిస్తున్న సీతను విమానంలో వుంచి యుద్ధభూమికి తీసుకెళ్లారు. యుద్ధంలో తెలివి తప్పి వున్న రామలక్ష్మణులను చూసింది సీతాదేవి.

సర్గ–48

నాగపాశబద్ధులైన రామలక్ష్మణులను చూసి దుఃఖపడ్డ సీతాదేవి

నాగపాశబద్ధులైన రామలక్ష్మణులను చూసిన సీత ఇలా అనుకుంది. "సాముద్రిక శాస్త్రం తెలిసిన బ్రాహ్మణులు నాకు కొడుకులు పుట్తారని, నాకు వైధవ్యం లేదని చెప్పారు. ఇప్పుడు నా భర్త హతుడైనందున ఈ రెండు అసత్యాలయ్యాయి. కాబట్టి జ్ఞానులు అసత్యమాడారు. నేను నూరు యజ్ఞాలు చేసే అభిలాషకలవారికి పట్టపురాణిని అవుతాననీ, సత్రయాగం చేసే వాడి పత్నినైకీర్తిగడిస్తాననీ,చెప్పారు.రాముడుహతుడైనందునవారుఅబద్ధమాడినట్లు అయింది. బ్రాహ్మణులు, పండితులు, జోస్యులు నన్ను గురించి ఎన్నో శుభాలు చెప్పారు. రాముడు హతుడైనందున జ్ఞానులు అసత్యమాడిన వారయ్యారు. అసమాన వీరులలో శ్రేష్టుడైన రాజుకు నేను భార్యనవుతాననీ, పుణ్యాత్మురాలిననీ బ్రాహ్మణులు చెప్పారు".

"కమలం వంటి అరచేయిగల ఏ స్త్రీ పాదాలలో నాకున్నటువంటి పద్మరేఖలు, ఇతర శుభరేఖలు వుంటాయో ఆ స్త్రీ రాజపత్నియై భర్తతో పట్టం కట్టుకుని అభిషేకం పొందుతుంది. దాని సంపద కూడా అభివృద్ధి చెందుతుంది. అయ్యో! నా దౌర్భాగ్య దశ వల్ల ఇలాంటి ప్రసిద్ధమైనవి కూడా వ్యర్థమైనప్పుడు బ్రాహ్మణులు అసత్యమాడారని ఎందుకనాలి? ఎలాంటి చిహ్నాలు ధరిస్తే స్త్రీలు భాగ్యహీనులు, విధవలు అవుతారని చెప్పబడిందో అలాంటి చిహ్నాలు ఒక్కటైనా నాలో లేదు. నాకెందుకు ఇలాంటి దుర్గతి వచ్చింది? నాకు శుభకరాలైన పద్మచామరాది రేఖలున్నాయి. అవి ఎలా వ్యర్థమైపోయాయి? నా తల వెంట్రుకలు సమానంగా నీల వర్ణంగా సన్నగా వున్నాయి. కనుబొమ్మలు రెండూ ఒకదానితో ఇంకొకటి కలియకుండా వున్నాయి. నా పిక్కల్లో వెంట్రుకలు లేవు. గుండ్రంగా వున్నాయి.

నా దంతాల మధ్యలో సందులేకుండా అన్నీ కలిసి వున్నాయి. కణతలు, కళ్ళు, కాళ్లు, చేతులు, తొడలు, చీల మండలాలు బలిసి వున్నాయి. గోళ్లు నున్నగా గుండ్రంగా సమానంగా వున్నాయి. స్తనాలు పెద్దవై ఒకదానికొకటి ఒరసికొని వున్నాయి. చనుముక్కులు నిట్టపొడుచుకుని వుండకుండా లోపలికి ముడుచుకుని వున్నాయి. నాభి పక్కల్లో ఉబ్బు కలిగి లోతై వున్నది. పక్కలు రొమ్ము వుబ్బి వున్నాయి. నా అవయవాల కాంతి రత్నకాంతిని పోలి వున్నది".

"నా తల వెంట్రుకలు మృదువుగా వుండడం, నా కాలి వేళ్ళు, కాలి అడుగు ప్రదేశాలు నడిచేటప్పుడు బాగా నేలకు ఆనడం శుభచిహ్నాలని నన్ను గురించి పెద్దలు చెప్పారు. నా అరికాళ్లు, అరిచేతులు ఎర్రటి కాంతి కలవి. వేలికి, వేలికి మధ్య సందు లేదు. పూర్ణమైన అవయవ కాంతికలవి. ముఖం మీద ఎప్పుడూ చిరునవ్వే వుంటుంది. ఇవన్నీ శుభప్రదమైనవని కన్యల లక్షణం తెలిసిన బ్రాహ్మణులు చెప్పారు. నేను గొప్ప రాజ్యంలో నా భర్తతో పట్టాభిషేకం అవుతానని బ్రాహ్మణులు చెప్పారు. అదంతా వ్యర్థం అయింది. నా నిర్భాగ్య దశ వల్ల బ్రాహ్మణ వాక్యం కూడా భంగమయింది. నా కొరకై జనస్థానమంతా వెతికి నేనెక్కడ వుండేది తెలుసుకుని, సముద్రానికి సేతువు కట్టి, ఎంతో కష్టసాధ్యమైన పనిచేసి కూడా, చివరకు ఇంద్రజిత్తు మాయవల్ల నా భర్త, మరది బాధ పడుతున్నారు కదా!"

"వారుణాస్త్రం, వాయువ్యాస్త్రం, ఆగ్నేయాస్త్రం, బ్రహ్మశిరోనామకాస్త్రం, ఐంద్రాస్త్రం లాంటి సమస్తాస్త్రాలు వీరికి తెలుసు. ఏ అస్త్రం ప్రయోగించినా శత్రువులు నాశనమై పోయేవారే. అలా ఎందుకు వీళ్లు చేయలేదో? అస్త్రాల దాకా పోవాల్నా? రామచంద్రమూర్తి కంటికి కనపడి శత్రువనేవాడు ప్రాణాలతో పోలేదు. ఆ శౌర్యం ఏమయిందో? ఎదుట నిలబడి యుద్ధం చేయలేక చాటునుండి కొట్టేవాడు పిరికి వాడేకదా! అలాంటి వాడిని కొట్టకూడదని వూరుకున్నారేమో? అది తెలిసి ఇంద్ర సమానులైన వీరిని మాయచాటున వుండి ఇంద్రజిత్తు రామలక్ష్మణులను వధించాడు. దీనినేమని అనుకోవాలి? రామచంద్రమూర్తి అంతటివాడు తమ్ముడితో యుద్ధంలో మరణించడం అంటే కాలానికి అసాధ్యమైనది ఏదీలేదనడం సత్యం. మేలుకాని, కీడుకాని చేయడానికి దైవమే కారణం కాని పౌరుషం కాదు. లోకంలో ఇంతకంటే పౌరుషవంతులు లేరు. పురుషకారం చేయగలవారు, చేసినవారు లేరు. దైవబలం దుర్బలమైనప్పుడు సర్వం వ్యర్థం అవుతుంది".

"కౌసల్యకు కలిగిన పుత్రశోకానికీ దుఃఖించినంతగా రాముడికొరకై నేను దుఃఖపడను. ఆయన కర్మ ఆయన అనుభవించాడని భావిస్తాను. అన్నకొరకై వచ్చిన లక్ష్మణుడి కొరకూ నేను దుఃఖపడను. అది కూడా ఆయన బుద్ధిపూర్వకృతమే. నా తల్లికి నా మూలంగా ఇంత దుఃఖం వచ్చింది కదా అని ఆమె కొరకూ దుఃఖపడను. నా కింత కష్ట దశ వచ్చింది కదా అని నాకై కూడా నేను ఏడవను. ఎప్పుడు రాముడు వస్తాడా అని ఎదురు చూస్తున్న కౌసల్య ఈ వార్త విని ఎలా ప్రాణం నిలుపుకుంటుంది?".

శ్రీరామలక్ష్మణులు జీవించి వున్నారని సీతకు చెప్పిన త్రిజట

ఇలా సీతాదేవి దుఃఖపడుతుంటే త్రిజట ఆమెను చూసి ఇలా చెప్పింది. "ఎందుకమ్మా నువ్విలా దుఃఖిస్తావు? నీ భర్త మరణించలేదు. ప్రాణాలతోనే వున్నాడు. కాబట్టి నువ్వు దుఃఖపడవద్దు. రామలక్ష్మణులు మరణించలేదనడానికి సాక్ష్యంగా పూర్వం నేను చూసినవి, నాకు తెలిసినవి చెప్తాను విను. ప్రభువు మరణిస్తే అతడి భటుల ముఖాలలో కోపం కాని, సంతోషం కాని కనపడదు. ఇది నేను చూసిన విషయం. ఇక్కడ వానరుల ముఖాలలో కోపం, సంతోషం కనపడుతున్నది. ఇక నాకు తెలిసిన విషయం చెప్తా విను. ఈ పుష్పకం దివ్య విమానం. ఇది భర్త మరణించిన దానిని మోయదు. నీ భర్త మరణించి వుంటే నిన్నిది మోయదు. కాబట్టి నీ భర్త మరణించలేదు. వానరులు వృక్షహస్తులై యుద్ధానికి సిద్ధంగా వున్నారు. ఈ వానర సేన భయపడకుండా రామలక్ష్మణులను కాపాడుతున్నది. వారు మరణిస్తే ఈ కాపలా ఎందుకు? నీమీద నాకున్న ప్రేమవల్ల శుభకారణాలన్నీ చెప్పాను. నా మాట నమ్ము. బాధపడవద్దు. అన్నదమ్ములు ప్రాణాలతో వున్నారు. మరణించలేదు".

"సీతాదేవీ! నేను ఇంతవరకు అసత్యం ఆడలేదు. ఇక మీద ఆడను. భయపడవద్దు. నా మాట నమ్ము. నీ నడవడితో, స్నేహంతో, పాతివ్రత్యంతో నా మనస్సుకు సంతోషం కలిగించావు. నిన్ను మెచ్చుకున్నాను కాబట్టి ఈ విషయాలన్నీ చెప్పాను. జానకీ! ఈ రాజకుమారులను ఇంద్రుడితో సహా దేవతలు, అసురులు కలిసి వచ్చినా గెలవడం సాధ్యంకాదు. వారిమీద వున్న శుభ చిహ్నాలు తొలగి పోకుండా వుండడం చూసి చెప్తున్నాను. వారి శరీరాల తీరు చూడు. మూర్ఛలో మునిగి వున్నా సహజ కాంతి చెడిపోలేదు. ప్రాణాలు పోతే దేహంలో ఈ కాంతి వుండదు. సుందరీ! రామలక్ష్మణుల గురించి నువ్వు ఏడ్వవద్దు. వారికి వచ్చిన భయం లేదు. నా మాట నమ్ము. వీరిని యుద్ధంలో

ఎవరూ చంపలేరు. ఎందుకు వూరికే కళవళపడుతావు?"

త్రిజట ఇలా చెప్పగా సీతాదేవి, "అమ్మా! నువ్వు చెప్పినదే వాస్తవం కావాలి" అని చేతులు జోడించి నమస్కారం చేసింది. పుష్పక విమానం మళ్లిపోయి సీతా, త్రిజటలను లంకలో దింపింది. అక్కడినుండి రాక్షస స్త్రీలు సీతాదేవిని అశోకవనానికి పిలుచుకుపోయారు. సీతాదేవి రామలక్ష్మణులను తలచుకుని వారి కష్టాలకు బాధపడ్డది.

సర్గ–49

మూర్ఛ నుండి లేచి లక్ష్మణుడిని చూసి దుఃఖించిన శ్రీరాముడు

బాణాలతో కట్టుబడి వున్న శ్రీరాముడు స్మృతి తెచ్చుకుని తన సమీపంలోనే బాణాలతో కట్టబడి మూర్ఛపోయి వున్న తమ్ముడిని చూశాడు. చూసి, సహించలేని దుఃఖతో బాధపడి, "నాయనా! లక్ష్మణా! నువ్విలా బాధపడుతుంటే చూడలేక పోతున్నాను. అయ్యో! ఎంతటి పాపాత్ముడిని?మూర్ఛపోయిన తమ్ముడిని చూసి కూడా నేను ఎలాంటి ప్రతిక్రియ చేయలేక, రక్షించలేక పోతున్నాను. ఇంక నాకు సీత ఎందుకు? ప్రాణాలెందుకు? ఇంతకంటే అవి ప్రియమైనవా? భూమ్మీద వెతికితే సీతలాంటి భోగ్యస్త్రీ దొరకవచ్చు. ఈ దేహం పోతే మరలా దేహం రావచ్చు కాని లక్ష్మణుడితో సమానమైన తమ్ముడు, మంత్రి, మిత్రుడు, యుద్ధవిద్యా సమర్థుడు ఎక్కడ దొరుకుతాడు? ఇది దుర్లభం. బాణాల దెబ్బలకు నా తమ్ముడే మరణిస్తే, నిశ్చయంగా నేను కూడా ఇక్కడే ప్రాణాలు విడుస్తాను".

"నేను బతకడం నాకొరకు కాదు. బతికి, యుద్ధంలో గెలిచి, సీతను తీసుకుని అయోధ్యకు పోయినా ఏం సంతోషం? పోగానే లక్ష్మణుడు ఏడని కౌసల్య అడిగితే ఏమి చెప్పాలి? కైకకు ఏమి చెప్పాలి? భరతుడుకి ఏం చెప్పాలి? శత్రుఘ్నుడికి ఏమని చెప్పాలి? లక్ష్మణుడిని లంకలో రాక్షసుల పాల్చేసి నేను, నా భార్య సుఖంగా వచ్చామని చెప్పాల్నా? సుమిత్రాదేవికి ఈ దుర్వార్త చెప్పగానే దుఃఖంతో వుండే ఆమెకు ఏమని సమాధాన పర్చాలి? నీకు సహాయకుడిగా నా కొడుకును పంపితే ఆయన లేకుండా నీ భార్యతో వచ్చావే? అని సుమిత్రాదేవి అంటే ఏమని చెప్పాలి?ఛీ! నేను బతికి ఏంలాభం? యుద్ధంలో ఎవరి పరాక్రమాన్ని అణచి వేశావో అలాంటి రాక్షసుల చేతనే కొట్టబడ్డావా? అడవులకు

ఒంటరిగా నేను పోతున్నానని కదా నువ్వు నాతోడు వచ్చావు. అలాంటప్పుడు నిన్నొక్కడినే యమలోకానికి ఒంటరిగా ఎలా పంపాలి? నాకు మేలు చేయాలని వచ్చినవాడికి కీడు కలిగించానే? వేయిచేతుల కార్త్యవీర్యార్జునిడిని లక్ష్మణుడు ఒక్క బాణంతో ఎదుర్కోగలడు. ఇంద్రుడి అస్త్రాలను తన అస్త్రాలతో ఖండించగలడు. అలాంటి బాహుబలుడు చచ్చినట్లు నేలపడి వున్నాడు కదా! విభీషణుడిని లంకకు రాజును చేస్తానన్నాను. నా ప్రతిజ్ఞ తప్పిపోయింది. ఇది సహించలేను".

సుగ్రీవుడిని కిష్కిందకు పొమ్మని చెప్పిన శ్రీరాముడు

సుగ్రీవుడితో శ్రీరాముడు ఇలా అన్నాడు. "సుగ్రీవా! నువ్వు వెంటనే అంగదుడిని, నలుడిని, నీలుడిని, వానరసేనను తీసుకుని సముద్రాన్ని దాటి వెళ్లు. ఇక్కడ వుండవద్దు. ఎందుకంటే నా సహాయం లేదని తెలుసుకున్న రావణుడు తన సమస్త సేనతో నీమీద యుద్ధానికి వచ్చి తోవను అడ్డగిస్తాడు. అప్పుడు పోవడం అసాధ్యమవుతుంది. హనుమంతుడిని, జాంబవంతుడిని, గవాక్షుడిని, అంగదుడిని, మైందుడిని, ద్వివిదుడిని, కేసరి, సంపాతులను, గాజుడిని, శరభుడిని, గవయుడిని, గంధమాదనుడిని, ఇతర వానర వీరులను వారి-వారి సాహస కృత్యాలకు మెచ్చుకుంటున్నాను. సుగ్రీవా! నువ్వు చేయగలంతా చేశావు. నాదే దురదృష్టం. వానరులారా! అనుజ్ఞ ఇచ్చాను. ఇక మీ అభీష్టం ప్రకారం పోవచ్చు".

రామచంద్రమూర్తి ఇలా చెప్పగానే వానరులకు కన్నీళ్ల ప్రవాహం వచ్చింది. ఇంతలో రామలక్ష్మణులు పడి వున్న చోటుకు విభీషణుడు వచ్చాడు. విభీషణుడిని చూసి వానరులు ఇంద్రజిత్తు అని భావించి పరుగెత్తారు.

సర్గ–50
విభీషణుడిని ఇంద్రజిత్తు అని భ్రమించి పరుగెత్తిన వానరులు

విభీషణుడిని చూసి పరుగెత్తుతున్న వానరులను చూసి సుగ్రీవుడు ఇలా అన్నాడు. దానికి కారణం విభీషణుడనీ, ఆయన్ను చూసి ఇంద్రజిత్తని భ్రమపడ్డారని అర్థమయింది సుగ్రీవుడికి. అప్పుడు జాంబవంతుడిని చూసి వానరులకు వాస్తవం చెప్పి తిరిగి రప్పించమని అంటాడు. ఆయన అలాగే అని వానరులకు ధైర్యం చెప్పాడు.

దుఃఖిస్తున్న విభీషణుడిని ఓదార్చిన సుగ్రీవుడు

రామలక్ష్మణులు ఇద్దరూ ఇంద్రజిత్తు బాణాలకు, ఆయన మాయా యుద్ధంలో పడిపోవడం విభీషణుడికి అమితమైన బాధ కలిగించి దుఃఖపడ్డాడు. రాక్షసులు ధర్మ యుద్ధంలో కాకుండా మోసం చేసి రామలక్ష్మణులను బంధించారు కదా అని బాధపడ్డాడు. లోకంలో ఎవరి దగ్గర చేరితే తనకు గౌరవం కలుగుతుందని విభీషణుడు భావించాడో ఆ ధీరులు రామలక్ష్మణులు ఇద్దరూ మరణించినవారిలాగా పడిపోయారు అని దుఃఖపడ్డాడు. తానూ వ్యర్థమైన కైంకర్య రాజ్యాభిలాష కలవాడినై బతికి కూడా చనిపోయినవాడిలాగా అయిపోయాననుకున్నాడు. దాని ఫలితంగా పాపాత్ముడైన రావణుడి కోరిక సఫలమైంది అనుకుంటాడు.

ఇలా దుఃఖపడుతున్న విభీషణుడిని సుగ్రీవుడు కౌగలించుకుని "నువ్వే లంకను ఏలుతావు. రావణుడి కోరిక నెరవేరదు. విభీషణా! దుఃఖపడవద్దు. వీరు మూర్ఛపోయారు కాని ప్రాణాపాయం లేదు. వీరు మూర్ఛ నుండి లేవగానే రావణ సేనను, అతడిని చంపుతారు" అని ఊరడించాడు. ఆ తరువాత

సమీపంలో వున్న సుషేణుడుని చూసి, రామలక్ష్మణులు మూర్చ తెరుకోగానే వారిద్దరినీ తీసుకుని కిష్కింధకు పొమ్మంటాడు. తాను సీతను తెస్తానని అంటాడు.

సంజీవకరణిని తెప్పించమని సుగ్రీవుడికి చెప్పిన సుషేణుడు

జవాబుగా సుషేణుడు సుగ్రీవుడితో మృత సంజీవని విద్యతో కూడిన కొన్ని మూలికలు పాల సముద్రం సమీపంలో వున్నాయని, వాటిని సంపాతి, పనసుడు లాంటి వానరులను పంపించి తెప్పించమని అంటాడు. లేదా ఆంజనేయుడిని పంపమంటాడు. అతడు తన పరాక్రమంతో వాటిని తెస్తాడని అంటాడు. దేవతలు పాలసముద్రం ఎక్కడ చిలికారో అక్కడ ద్రోణ పర్వతం, చంద్ర పర్వతం అనే రెండు కొండలున్నాయని, అక్కడ విశల్యకరణి, సంజీవ కరణి ప్రప్రకాశిస్తాయని వాటిని త్వరాగా తెప్పించమని అంటాడు. ఇంతలో చెవుడు కలిగే పెద్ద ధ్వని వచ్చింది.

శ్రీరామలక్ష్మణులను చూడడానికి వచ్చిన గరుత్మంతుడు

ధ్వనితో పాటు తీవ్రమైన గాలి వచ్చింది. పాములన్నీ కలతపడ్డాయి. ఆ క్షణంలోనే మండుతున్న అగ్నిహోత్రుడిలాగా ప్రకాశిస్తూ గరుత్మంతుడు ఆకాశంలో కనబడ్డాడు. ఆయన కనపడగానే రామలక్ష్మణులను చుట్టుకున్న పాపపు పాములన్నీ చెల్లాచెదరై భయంతో పరుగెత్తిపోయాయి. గరుడుడు రామలక్ష్మణులను సమీపించి వారిద్దరూ ముఖకమలాలను ముట్టుకోగానే వారి దేహాలకున్న గాయాలన్నీ మానిపోయాయి. ఆయన అలా ముట్టుకోగానే రామలక్ష్మణులకు బుద్ధిబలం, దేహబలం, వీర్యం, తేజం, ఓజస్సు, ఉత్సాహం, స్మరణ శక్తి, బుద్ధి సూక్ష్మత వృద్ధి చెందాయి. వారి దేహకాంతి బంగారు కాంతికంటే ఎక్కువయింది. గరుత్మంతుడు రామలక్ష్మణులను కౌగలించుకున్నాడు. అప్పుడు రామచంద్రమూర్తి గరుత్మంతుడితో ఇలా అన్నాడు.

నాగపాశ బంధ విముక్తులై గరుత్మంతుడిని ప్రశంసించిన శ్రీరామలక్ష్మణులు

"అయ్యా! నీ అనుగ్రహం వల్ల ఇంద్రజిత్తు కట్టిన నాగపాశ బంధాలను ఎలాంటి కీడు కలగకుండా, శ్రమలేకుండా వదిలించుకుని మునుపటిలాగా గొప్ప శక్తి పొందాం. నిన్ను చూస్తుంటే మా తండ్రి దశరథ మహారాజును, తాత యజమహారాజును చూసినట్లు సంతోషం కలుగుతున్నది. మహాత్మా!

నువ్వెవరివి? నీ రూపం మనుష్యులలో కనపడేది కాదు. దివ్యంగా వుంది. నువ్వు ధరించిన వస్త్రాలు దేవతలు ధరించేవిగా వున్నాయి. నువ్వు దివ్య తేజస్సుతో వున్నావు. నువ్వెవరివి?''.

హెచ్చరికగా యుద్ధం చేయమని శ్రీరాముడికి బోధించిన గరుత్మంతుడు

శ్రీరామలక్ష్మణులను చూసి సింహనాదాలు చేసిన కపులు

జవాబుగా గరుత్మంతుడు, "మీకు తోడ్పడడానికి వచ్చాను. దానవులు, అసురులు, గంధర్వులు ఇంద్రుడిని ముందు వుంచుకుని వచ్చినా నీ శరబంధాలను వదిలించలేరు. ఎందుకంటే వీటిని ఇంద్రజిత్తు మంత్రాల వల్ల కలిగిన అద్భుత శక్తితో సృష్టించాడు. అప్పుడు విషంతో క్రూరమైన కోరలున్న సర్పాలు బాణాల్లాగా వచ్చి, మిమ్మల్ని బంధించాయి. ఈ వృత్తాంతం విని నీమీద వున్న స్నేహభావం వల్ల నేను అతి శీఘ్రంగా బయల్దేరి వచ్చాను. ఆ కట్లను విడిపించాను. రామచంద్రా! రాక్షసులు మోస యుద్ధం చేస్తారు కాబట్టి నువ్వు అప్రమత్తంగా వుండాలి. రాక్షసులకు మోసం చేయడమే బలం. అది లేకపోతే వారు దేనికీ పనికిరారు. కాబట్టి రణంలో మీరు రాక్షసులను నమ్మవద్దు. మీరు ఋజుత్వాన్ని వదలక, వారి మాయలకు లోబడక, హెచ్చరికగా వుండాలి. నేనెవరో యుద్ధం పూర్తయిన తరువాత తెలుసుకుంటావు. నాకు సెలవిస్తే నేను పోతాను. ధర్మ శాస్త్రం నీలాగా తెలిసిన వారెవరూ లేరు. రాక్షస సమూహాలను పూర్తిగా నాశనం చేసి నువ్వు పతివ్రత అయిన సీతను గ్రహిస్తావు''.

ఇలా చెప్పి వారిని కౌగలించుకుని వారికి సంతోషం కలిగించి ప్రదక్షిణ చేసి గాలిలాగా ఆకాశమార్గాన గరుడుడు పోయాడు. రామలక్ష్మణులు మూర్ఛ నుండి తెప్పరిల్లారు. రామలక్ష్మణులను అలా చూసిన వానరులు సింహనాదాలు చేసారు. ధ్వనులు చేశారు.

సర్గ-51

కపుల సంతోషానికి కారణం అడిగిన రాముడు

సర్వత్రా వ్యాపించిన వానరుల కేకలు, గంభీరమైన కంఠనాదాలు రావణుడు విని ఉలిక్కిపడి రాక్షసులతో ఇలా అన్నాడు. "వానరుల సింహనాదాలు వానాకాలంలో మేఘాల, ఉరుముల సమూహాన్ని స్మృతికి తెస్తున్నాయి. నగరాన్ని కుదిలిస్తున్నాయి. సముద్రాన్ని కలత పెట్టున్నాయి. ఈ ప్రకారం వారు సంతోషించడానికి కారణం ఏమిటి? వారికేదో సంతోష కారణం లభించి వుండాలి. రామలక్ష్మణులు ఇద్దరూ నాగపాశబద్ధులై భూమ్మీద పడి వుంటే ఏ కారణం లేకుండా అలా సంతోషం వ్యక్తం చేస్తారా? ఎవరైనా దేవతలు సహాయంగా వచ్చారా? వారు కట్లు విడిపించుకున్నారా? నాకు బలమైన సందేహం కలుగుతున్నది. మీరు త్వరగా పోయి విషయం కనుక్కోండి. విచారించి రండి. పొండి".

రావణుడు ఇలా చెప్పగానే వారంతా భయంతో గుండెలు కొట్టుకుంటుంటే పరుగెత్తిపోయి ప్రాకారాలు ఎక్కి, వానరుల గుంపును చూసి, వారిలో బంధాలు వదిలించుకుని స్వేచ్ఛగా యుద్ధభూమిలో తిరుగుతున్న రామలక్ష్మణులను చూసి గుండెలు గుభిల్లుమనగా, రాక్షసుల ముఖాలు వెలవెల బోయాయి. వారు చూసిన వృత్తాంతాన్నంతా సర్వం రావణుడికి ఇలా చెప్పారు. "రాజా! ఇంద్రజిత్తు బాణాలతో కట్టబడి కదలక-మెదలక పడివున్న రామలక్ష్మణులు తమ్ము కట్టిన తాళ్ళను తెంచుకుని ప్రకాశిస్తున్నారు".

శ్రీరామలక్ష్మణులు నాగపాశ విముక్తులయినందుకు వ్యసనపడిన రావణుడు

ఇలా రాక్షసులు చెప్పగా రావణుడు ఏం చేయాల్నా, చేసినదంతా

వ్యర్థమైపోయింది కదా! అని విషాదపడ్డాడు. ఇలా ఆలోచించాడు. “ఏమి ఆశ్చర్యం? వాసుకి, తక్షకుడు లాంటి గొప్ప సర్పాలతో సమానమైనవి, బ్రహ్మ వరంతో సంపాదించినవీ అయిన నా కుమారుడి మహాస్త్రాలు ఎప్పుడూ వ్యర్థం కావే? అలాంటి బాణాలను కూడా రామలక్ష్మణులు విడిపించుకున్నారే? ఇది ఆశ్చర్యమైన విషయం. నా బలం ఇంకా నన్ను రక్షిస్తుందని నేను నమ్మలేను. అది సందేహించ తగిందే. నమ్మరాదు ఇక. శత్రువుల ప్రాణాలను నిశ్శేషంగా తీయగలిగే భయంకర శరసమూహం, వాసుకి తేజంతో సమానమైన తేజంకలవి ఈ ప్రకారం వ్యర్థమైపోయినపుడు ఇక అనుకోవాల్సింది ఏమున్నది?”.

యుద్ధానికి పోయిన ధూమ్రాక్షుడు

ఈ ప్రకారం అనుకుని కోపంతో కళ్లెర్ర చేసి పాములాగా బుసగొట్టుతూ ధూమ్రాక్షుడిని చూసి, గర్వించిన వానరులతో కూడి వున్న రాముడి మీదకు యుద్ధానికి పొమ్మంటాడు. వాడు సంతోషంగా రావణుడికి నమస్కారం చేసి, సేనానాయకుడిని సైన్యంతో సహా తనకు అండగా ఇవ్వమని అడిగాడు. వాడు వెంటనే రావణుడి ఆజ్ఞ తీసుకుని సైన్యాన్ని సిద్ధం చేసి ధూమ్రాక్షుడికి చెప్పాడు. వారంతా సింహనాదాలు చేస్తూ యుద్ధానికి సాగారు. ధూమ్రాక్షుడు యుద్ధం చేయాలన్న కోరికతో వారితోపాటే త్వరగా పోయాడు.

ధూమ్రాక్షుడికి కలిగిన అపశకునాలు

ధూమ్రాక్షుడు హనుమంతుడున్న పశ్చిమ ద్వారం చేరబోగా ఆకాశంలో పక్షులు కూశాయి. రథం మీద గద్ద దభాలున పడింది. ధ్వజం మీద కూడా పారదోలినా ఆగకుండా గద్దల గుంపులు వాలాయి. అతడి దగ్గరలో తెల్లటి మొండెం కనబడింది. ఆ అపశకునాలను చూసిన ధూమ్రాక్షుడు తన చావు తథ్యమని అనుకుని బాధపడ్డాడు. రాక్షసులు కూడా భయంతో మూర్ఛపోయారు.

సర్గ–52
కపులతో పోరాడిన ధూమ్రాక్షుడి సేనలు

కపులను వధించిన ధూమ్రాక్షుడు

వానర–రాక్షసులు దొమ్మి యుద్ధం చేశారు. ఒకరినొకరు కొట్టుకున్నారు. రక్తం ఏరులై పారింది. చివరకు వానరుల ధాటికి తట్టుకోలేక రాక్షసులు పారిపోయారు. కొందరు రాక్షసులు మాత్రం వానరుల రొమ్ము మీద కొట్టారు. రాక్షసులు పారిపోవడం, వానరులు వారిమీద పడడం చూసిన ధూమ్రాక్షుడు కోపంతో శత్రువుల మీద పడ్డాడు. తన పరాక్రమంతో వానరుల పరాక్రమాన్ని అణిచి వేశాడు. ధూమ్రాక్షుడు విజృంభించడంతో రాక్షసులకు కొంచెం అవకాశం దొరికినట్లయింది. వారు వానరులను నరకసాగారు. ధూమ్రాక్షుడు యుద్ధం చేస్తుంటే వానరులు ఆయన ధాటికి పరిగెత్తారు.

హనుమంతుడి చేతిలో చచ్చిన ధూమ్రాక్షుడు

ధూమ్రాక్షుడు మీద హనుమంతుడు వంద బాణాలను విసిరాడు. దాన్ని చూసి ధూమ్రాక్షుడు తన గద తీసుకుని రథం మీదనుండి భూమ్మీదకు దూకాడు. హనుమంతుడు విసిరినా బండ రాయి ధూమ్రాక్షుడి రథాన్ని నాశనం చేసింది. అది చూసి రాక్షసులు హనుమంతుడి మీద పడ్డారు. ప్రతీకారంగా ఆంజనేయుడు రాక్షసులపై పడి వారి తలలు పగులగొట్టాడు. రాక్షసులు భయపడి తూలిపోయారు. ధూమ్రాక్షుడుని రక్షించడానికి వచ్చిన రాక్షసులు పరుగెత్తి పారిపోగా హనుమంతుడు ఒక పర్వత శిఖరాన్ని చేతిలో పట్టుకుని గురిచూసి ధూమ్రాక్షుడి నడినెత్తిమీద వేశాడు. దాంతో వాడు ఆయుష్షు తీరి చచ్చాడు. ఇది చూసి రాక్షసులు లంక దారి పట్టారు. హనుమంతుడు విజయ గర్వంతో తన స్థానానికి పోయాడు.

సర్గ–53
వజ్రదంష్ట్రుడిని యుద్ధానికి పంపిన రావణుడు

యుద్ధానికి పోయిన వజ్రదంష్ట్రుడు

ధూమ్రాక్షుడు చనిపోయాడని విన్న రావణుడు కోపాతిశయంతో వజ్రదంష్ట్రుడనేవాడిని చూసి యుద్ధానికి పోయి రామలక్ష్మణులను సంహరించమని చెప్పాడు. వాడలాగేనని యుద్ధ కాంక్షతో రణరంగానికి బయల్దేరాడు. వజ్రదంష్ట్రుడు అంగదుడు వున్న పడమటి ద్వారానికి బయల్దేరాడు. ఆ సమయంలో రాక్షసుల వినాశనం తెలిపేవిధంగా అపశకునాలు అనేకం కనపడ్డాయి. ఆ అశుభసూచకాలకు రాక్షసయోధులు దిగ్భ్రమకు గురై భయంతో వణికారు. వజ్రదంష్ట్రుడు యుద్ధం మీద ఆసక్తితో వీటికి భయపడలేదు. వజ్రదంష్ట్రుడు రావడం చూసి వానరులు ఆకాశం పగిలేట్లు నిర్భయంగా కేకలు వేస్తూ, రాక్షసుల మీద పడి భయంకర యుద్ధం చేయడంతో, రాక్షసులలో ముఖ్యులు కోప్పడి, ఒకరినొకరు పిడుగుల్లాంటి దెబ్బలు కొట్టుకున్నారు. ఒకరినొకరు చంపబూనారు. యుద్ధంలో కలిగిన ధ్వనులు ఇరుపక్షాల వారికి చెవుడు కలిగించి గుండెలు చెదరగొట్టాయి. ఇలా ఇరుపక్షాల వారు యుద్ధం చేస్తుండగా వజ్రదంష్ట్రుడు బలగర్వంతో కళ్ళుకనపడక మేఘం ఉరిమిన విధంగా వానరుల మీదకు తన రథాన్ని తోలాడు. తన బాణాలతో కోతుల గుంపును నాశనం చేయసాగాడు.

శత్రుసేనపై విజృంభించిన అంగదుడు

వజ్రదంష్ట్రుడి అండ చూసుకుని రాక్షస సమూహం వానర సమూహాలను

నరికాయి. అది చూసి కోపగించిన అంగదుడు ప్రళయకాలాగ్నిలాగా మండిపడుతూ చేతిలో ఒక పెద్ద చెట్టు తీసుకుని వజ్రదంష్ట్రుడిని సమీపించాడు. ఆయన బాణధాటికి రాక్షసులు నేలకూలారు. భయంకరంగా యుద్ధం చేస్తూ రాక్షసులను ధ్వంసం చేశాడు.

సర్గ–54
వజ్రదంష్ట్రుడి సేనలను ఉసిగొల్పిన వానరులు

ఇలా అంగదుడు తన పరాక్రమాన్ని ఉద్ధృతం చేసి విరోధి సేనను చంపుతుంటే వజ్రదంష్ట్రుడు కోపగించి పాముల వర్షంలాగా బాణవర్షం కురిపించాడు. అప్పుడు వానర రాక్షస యుద్ధం భీకరంగా సాగింది.

వానరసేనపై విజృంభించిన వజ్రదంష్ట్రుడు

అలా జరుగుతున్న యుద్ధంలో రాక్షసులు, వానరులు బాణాల దెబ్బకు పడిపోయారు. వానర సేన చేతుల్లో పరాభవం పొంది తమ రాక్షసులు కొందరు చెల్లాచెదరై పారిపోవడం చూసి వజ్రదంష్ట్రుడు విల్లు తీసుకుని వానరులు భయపడే విధంగా బాణాలు ప్రయోగించాడు. అలా వజ్రదంష్ట్రుడు యుద్ధంలో తన పాండిత్యాన్నంతా చూపాడు.

అంగదుడితో పోరాడి చనిపోయిన వజ్రదంష్ట్రుడు

ఇలా జరుగుతున్నప్పుడు అంగదుడు, ఏనుగు మీద పడ్డ సింహంలాగా వజ్రదంష్ట్రుడి మీదికి దూకి వాడిని ఒక గుద్దు గుద్దాడు. ప్రతీకారంగా వజ్రదంష్ట్రుడు, అంగదుడి దేహాన్ని నెత్తురుతో తడిసేట్లు చేశాడు. అప్పుడు అంగదుడు ఒక పెద్ద చెట్టును విసిరివేయగా రాక్షసుడు దానిని చిన్న-చిన్న తునకలుగా చేశాడు. అంగదుడు వేసిన పర్వతాన్ని చూసి రథం మీద నుండి కిందకు దూకాడు వజ్రదంష్ట్రుడు. ఆ పర్వతం రథాన్ని గుర్రాలతో సహా నాశనం చేసింది. అంతటితో ఆగకుండా అంగదుడు చెట్లతో సహా ఒక పర్వతాన్ని విసరగా రాక్షసుడు దాని తాకిడికి నెత్తురు కక్కుతూ భూమ్మీద తెలివితప్పి తన గదను ఆధారంగా చేసుకుని పడిపోయాడు. కొంతసేపటి స్మృతికి వచ్చి గదను

అంగదుడి మీదకు విసిరాడు. అంగదుడు దాన్ని గుంజుకుని దూరంగా పారవేశాడు. అలా అంగద వజ్రదంష్ట్రులు పలుమార్లు ఒకరినొకరు కొట్టుకున్నారు. అప్పుడు తటాలున అంగదుడు రాక్షసుడి మీదకు దూకి వాడి శిరస్సును తన కత్తితో నరికాడు. వాడు తన మొండెం విడిచి తల నేలకూల్చాడు. తమ సేనానాయకుడు మరణించగా రాక్షసులు భయపడి తమను వానరులు తరుముతుంటే లంకలోకి పరుగెత్తారు. అంగదుడిని వానరులు గౌరవించారు.

సర్గ–55

యుద్ధానికి పోయిన అకంపనుడు

అంగదుడి చేతిలో వజ్రదంష్ట్రుడు మరణించాడని విన్న రావణుడు ప్రహస్తుడితో ఇలా అన్నాడు. "శౌర్యవంతులైన రాక్షసులను ఇచ్చి యుద్ధానికి అకంపనుడిని పంపు. ఇతడు సర్వశాస్త్రాలు తెలిసినవాడు. యుద్ధంలో ప్రశస్తికన్నవాడు. తన సేనను రక్షించుకుంటూ, శత్రుసేనను శిక్షిస్తూ, సేనను నడపగల సమర్థుడు. నా మేలు కోరేవాడు. గొప్ప బలం కలవాడు. ఇతడు రామలక్ష్మణ సుగ్రీవులను జయించగలడు". రావణుడి అలా అనగానే ప్రహస్తుడు గొప్ప సేనను యుద్ధానికి సిద్ధం చేసి అకంపనుడి స్వాధీనం చేశాడు. అకంపనుడిని దేవతలైనా యుద్ధంలో జయించలేరు కాబట్టి అతడికి ఆ పేరు వచ్చింది. అతడు రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరి పోయాడు. మునుపటి వలెనె అకంపనుడు యుద్ధానికి పోతున్నప్పుడు కూడా అపశకునాలు కనిపించాయి.

అపశకునాలను లక్ష్యపెట్టకుండా యుద్ధానికి పోవడానికి ఉత్సాహం కనబరచాడు అకంపనుడు. రాక్షస సైన్యం సింహనాదాలు చేసింది. దానికి వానరసేన ఉలిక్కిపడి యుద్ధానికి సిద్ధమయింది. ఇరు పక్షాల సేనలకు భయంకర యుద్ధం జరిగింది. యుద్ధంలో రేగిన దుమ్ముకు ఒకరికొకరు సరిగ్గా కనిపించక ఒక్కోసారి రాక్షసులు తమవారిని, వానరులు తమ వారిని చంపుకున్నారు. చేతికి ఎవరు దొరికితే వారే శత్రువు అని భావించారు. అకంపనుడు ప్రేరణతో రాక్షస సమూహాలు వానరులను బాధించాయి. అప్పుడు మైందుడు, ద్వివిదుడు, నలుడు, కుముదుడు వృక్షాలను పీకి రాక్షసుల మీద వేసి వారిని పీనుగుపెంటలు చేశారు.

సర్గ–56
వానరసేన మీద పడ్డ అకంపనుడు

శత్రుసేనలు తమవారిని చంపడం చూసిన అకంపనుడు తన సారథిని అతి వేగంగా రథాన్ని శత్రువులు భయపడే విధంగా అతి వేగంగా తోలమన్నాడు. వారిని చంపాలని తనకు కోరికగా వుందన్నాడు. సారథి రథాన్ని అక్కడికి తీసుకుపోయే లోపునే అకంపనుడు తన తీవ్రమైన బాణాలను వానరుల మీదకు ప్రయోగించి వారి బలాన్ని అణచివేశాడు. వాడి ధాటికి వెనక్కు పోతున్న వానరులను చూసిన హనుమంతుడు ఆ రాక్షసుడిని ఎదుర్కొన్నాడు.

హనుమంతుడి చేతిలో హతుడైన అకంపనుడు

హనుమంతుడు అలా అకంపనుడి మీదకు రావడం చూసిన వానరులు ధైర్యం తెచ్చుకుని సింహనాదాలు చేస్తూ రాక్షస సేనను ఎదిరించారు. తన ఎదురుగా నిల్చిన హనుమంతుడి మీదకు అకంపనుడు బాణాలను ప్రయోగించినా ఫలితం కనపడలేదు. వాడు బాణాలు వేస్తున్నా లక్ష్యపెట్టని హనుమంతుడు అమితమైన వేగంతో వాడిమీదకు పోయాడు. వాడు దిగ్భ్రమ చెందాడు. హనుమంతుడు వేసిన పెద్ద కొండను అకంపనుడు ఖండించడం చూసి కోపగించిన ఆంజనేయుడు ఒక ఇనుమద్ది చెట్టును వేళ్లతోసహా పెరికి నవ్వుతూ దాన్ని గిరగిర తిప్పుతూ అకంపనుడి మీద వేశాడు. దాన్నీ ఖండించిన అకంపనుడు తన బాణాలతో హనుమంతుడిని బాధించాడు. అప్పుడు నెత్తురు కారే దేహంతో అగ్నిలాగా మండుతూ హనుమంతుడు వేరే ఇంకొక చెట్టును పీకి తిప్పుతూ అకంపునుడి తల పగిలేట్లు కొట్టగా వాడు ఆ దెబ్బకు నేలమీద పడి చచ్చాడు. తక్కిన రాక్షసులు భూకంపానికి చెట్లు కూలినట్లు పడిపోయారు.

మిగిలిన రాక్షసులు లంకలోకి పరుగెత్తారు. అలా, బలవంతుడైన అకంపనుడిని చంపి హనుమంతుడు త్రివిక్రముడిలాగా ప్రకాశించాడు. హనుమంతుడు చేసిన మహాకార్యానికి రామలక్ష్మణులు, సుగ్రీవ విభీషణులు, దేవతలు మెచ్చుకున్నారు.

సర్గ-57
ప్రహస్తుడిని యుద్ధానికి పొమ్మని చెప్పిన రావణుడు

యుద్ధంలో అకంపనుడు చనిపోయిన వార్త విన్న రావణుడు వ్యసనగ్రస్తుడై మంత్రులతో ఆలోచించి, తన సమీపంలో వున్న ప్రహస్తుడిని చూసి, ఇలా అన్నాడు. "ప్రహస్తా! మన కోట ముట్టడిని వదిలించాలంటే యుద్ధం తప్ప వేరే మార్గం లేదు. యుద్ధం చేసి వానరులను తరిమికొట్టితేకాని ముట్టడి పోదు. ఇంత కార్యం చేయగలవారెవరంటావా? ఇంతటి కార్యభారం నెరవేర్చడానికి నేనో, నా తమ్ముడు కుంభకర్ణుడో, వాడి కొడుకు నికుంభుడో, సేనానాయకుడివైన నువ్వో, నా కొడుకు ఇంద్రజిత్తో తప్ప ఇతరులు పనికిరారు. కాబట్టి నువ్వు కావాల్సినంత సైన్యం తీసుకుని యుద్ధానికి పో. నువ్వు వస్తున్నావని తెలియగానే వానరులు పారిపోతారు. నువ్వు యుద్ధం చేయాల్సిన పని కూడా లేదు".

ఇలా రావణుడు చెప్పగానే, ప్రత్యురంగా ప్రహస్తుడు, "రాజా! ఈ విషయాన్ని నేను, మంత్రులు, ముందే ఆలోచించాం. మేం వాదించుకున్నాం కాని ఏకాభిప్రాయానికి రాలేకపోయాం. అందుకే నేను నీకు చెప్పలేదు. నా అభిప్రాయం చెప్తా విను. సీతను తిరిగి అప్పగించడం శ్రేయస్కరమని నా అభిప్రాయంగా మంత్రులకు చెప్పాను. మనందరం కలిసి ఈ విషయాన్ని రావణుడికి చెప్పుదామన్నాను. మన మాట వినకపోతే యుద్ధం చేద్దామన్నాను. రాజా! జరిగిపోయిన ముచ్చట ఇప్పుడెందుకు? నువ్వు నాకెన్నో విధాల సహాయపడ్డావు. ఇదంతా నువ్వు నాకు చేయడం అంటే అక్కరవేళ నేను నీకు ఉపయోగపడాలనే కదా? అలా నీ ఋణాన్ని నేను తీర్చుకోవడానికి ఇదే సమయం. ఇది తప్పితే నేనెలా నీ ఋణం తీర్చుకుంటాను? కాబట్టి నేను నువ్వు చెప్పినట్లే చేస్తాను. నీ కొరకై నేను నావారినందరినీ వదులుకుంటాను. యుద్ధ

యజ్ఞంలో నా దేహాన్ని కొంచెమైనా వెనక్కు తీయకుండా హోమం చేస్తాను. నా మాట నమ్ము" అని అంటాడు.

యుద్ధానికి బయల్దేరిన ప్రహస్తుడు

ఇలా రావణుడికి చెప్పి, సర్వసేనానాయకుడైన ప్రహస్తుడు యుద్ధంలో జయం లభించాలని కోరుతూ, అగ్నిలో హోమం చేశాడు. యుద్ధ ప్రయత్నంలో రాక్షసులు వుండిపోయారు. రావణుడి ఆజ్ఞానుసారం మంచిగా అలంకరించిన రథం ఎక్కి ప్రహస్తుడు యుద్ధానికి బయల్దేరి పోయాడు. బయల్దేరుతూ సింహనాదం చేశాడు.

ప్రహస్తుడికి కలిగిన అపశకునాలు

సమున్నతుడు, నరాంతకుడు, మహానాథుడు, కుంభహనుడు అనే నలుగురు మంత్రు వారి పరివారాలతో వెంట రాగా తూర్పు ద్వారాన్నుండి ప్రహస్తుడు బయల్దేరాడు. ఆ సమయంలో అనేక అవలక్షణాలు, అపశకునాలు కనపడ్డాయి. సారథి చేతిలోని కొరడా ఊరకే జారి కిందపడ్డది. గుర్రాలు నేలమీద పడ్డాయి. ప్రహస్తుడి ముఖ కాంతి సమసిపోయింది. ఇలాంటి అపశకునాలు చూసి జంకకుండా పౌరుషం కల ప్రహస్తుడు ముందుకు వేగంగా సాగుతుంటే, వానరులు కేకలు వేశారు. ఇరుపక్షాల వారు ఒకరినొకరు పౌరుషంతో చూస్తూ యుద్ధానికి దిగారు.

సర్గ-58
వానరులతో పోరిన ప్రహస్తుడి సేనలు

శత్రువులను గెలవాలన్న కోరికతో ప్రహస్తుడు వానర సేనమీద భయంకరంగా పడుతుండగా, అతడిని చూసిన రామచంద్రమూర్తి చిరునవ్వుతో, ఎవరీ బలశాలి అని విభీషణుడిని అడిగాడు. వీడు రావణాసురిడి నమ్మిన బంటనీ, శౌర్యం కలవావాడనీ, పరాక్రమంలో ప్రసిద్ధుడనీ, గొప్ప అస్త్రాలు తెల్సినవాడనీ, సర్వసేనాధిపతి అనీ, లంకలోని సైన్యంలో మూడో వంతు ఇతడి స్వాధీనంలో వుందనీ, యుద్ధం అంటే భయం లేనివాడనీ, వీడి పేరు ప్రహస్తుడనీ జవాబుగా రామచంద్రమూర్తికి చెప్పాడు విభీషణుడు. ఇంతలో ప్రహస్తుడు యుద్ధానికి దిగాడు. యముడితో సమానులైన సమున్నతుడు, నరాంతకుడు, మహానాథుడు, కుంభహనుడు తమమీదకు వస్తున్న వానరులను నిలువరించారు. అప్పుడు ద్వివిదుడు ఒక కొండను వేయడంతో నరాంతకుడు చచ్చాడు. దుర్ముఖుడు వేసిన పెద్ద చెట్టు తగిలి సమున్నతుడు చచ్చాడు. జాంబవంతుడి చేతిలో మహానాథుడు చచ్చాడు. తారుడు విసిరిన చెట్టుకు కుంభహనుడు కొండలాగా నేలకూలాడు.

కపులను వధించిన ప్రహస్తుడు

వానరుల చేతిలో తన మంత్రులు చావడాన్ని చూసి ప్రహస్తుడు తన రథాన్ని మిగిలిన వానరుల మీదికి తోలాడు. రాక్షసుడి యుద్ధం ప్రళయంలాగా కనిపించింది. సముద్ర ఘోషలాగా సేనాభటుల ధ్వని వుంది. వానరుల, రాక్షసుల నెత్తురుతో భూమంతా తడిసిపోయింది. కపులను రాక్షసుడు వధించసాగాడు.

ప్రహస్తుడిని వధించిన నీలుడు

అలా వానరులను వధిస్తున్న ప్రహస్తుడిని చూసి నీలుడు కళ్లెర్ర చేశాడు. ప్రహస్తుడిని అడ్డగించాడు. ప్రహస్తుడు అప్పుడు శూరుడై తన ప్రతాపాన్ని చూపించసాగాడు. నీలుడి మీదికి బాణాలను వేశాడు. ఆ బాణాలు నీలుడి దేహంలో ప్రవేశించి నెత్తురుతో తడిసి భూమిలో దూరాయి. అంతటితో ఆగకుండా భయంకరమైన ఒక నదిని నీలుడి మీదికి ప్రవహింప చేశాడు. నీలుడు ఒక చెట్టు పీకి ఆ నదికి ఎదురీది తన భుజబలం కొద్దీ రాక్షసుడిని ఒక దెబ్బ కొట్టాడు. ఇలా వారిద్దరి మధ్యా యుద్ధం కొనసాగింది. అలా జరుగుతుండగా నీలుడు ఒక గుండు తీసుకుని గురి చూసి ప్రహస్తుడిని కొట్టాడు. ఆ రాతి దెబ్బకు ప్రహస్తుడి తల తునకలైపోయింది. వేరు నరికిన చెట్టులాగా ప్రహస్తుడు నేలమీద పడ్డాడు. తమ సేనాపతి ఇలా చావగానే రాక్షసులు యుద్ధభూమి విడిచి రావణుడున్న సభకు పోయారు. పోయి మూగగా వుండి పోయారు. రామలక్ష్మణులు నీలుడిని శ్లాఘించారు.

సర్గ-59
తొలిసారి యుద్ధానికి పోయిన రావణుడు

ప్రహస్తుడి వెంటబోయి చావగా మిగిలిన సేన జరిగిన వృత్తాంతమంతా రావణుడికి తెలపగా అతడు పరాభవం వల్ల కలిగిన కోపంతో దేహం తెలియనివాడై జయించి వస్తాడని నమ్మిన వాడే ఇలా అయినందుకు బాధపడి, రాక్షసులతో ఇలా అన్నాడు. "ఇంద్రుడి బలం నాశనం చేసినవాడిని, నా సేనకు నాయకుడైన వాడిని, యుద్ధంలో వానురులా చంపింది? ఔరా! ఇక వూరుకుంటే లాభం లేదు. ఆహా! ఏమి వింత? కోతులా రాక్షసులను చంపుతున్నది? అవి ఎలాంటి కోతులో? చూస్తాను. నేనే పోయి వారి పేరు లేకుండా చేసి జయాన్ని, కీర్తిని పొందుతాను. ఎవడురా నన్ను యుద్ధంలో ఎదిరించి బతికి పోయేది? ఇంతవరకు ఈ అల్ప కార్యానికి మనం పోవాల్నా అని ఉపేక్షించి వున్నాను. ఇక ఉపేక్షించరాదు. ఇక నేనెలాంటి వాడినో చూపిస్తాను. కోతి గుంపును కూలుస్తాను. రామలక్ష్మణులను శుష్కింప చేస్తాను. చెదపురుగులను ఇక సహించను".

ఇలా అంటూ రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరాడు. రాక్షసులు అసురనాథుడైన రుద్రుడి వెంట పిశాచాలు పోయినట్లు రావణుడి వెంట పోయారు. యుద్ధానికి పోయిన రావణుడు భయంకరమైన వానర సేనను చూశాడు. యుద్ధం కోరివచ్చిన రావణుడి సైన్యాన్ని చూసి రామచంద్రమూర్తి విభీషణుడితో ఇలా అన్నాడు. "ఇప్పుడు కనిపిస్తున్న సేన కలపరానిదై వుంది. ఇది ఎవరి సేనయో చెప్పు".

రాక్షస వీరుల గురించి శ్రీరాముడికి చెప్పిన విభీషణుడు

జవాబుగా విభీషణుడు, "ఏనుగు మెడమీద కూర్చున్నవాడు, కాంతి కల ముఖం కలవాడు, శౌర్యవంతుడు, వాడే, రావణాసురుడి కొడుకు అకంపనుడు. ఇంద్రధనుస్సు కాంతిగల విల్లును తిప్పేవాడు, సింహ ధ్వజం కల రథం మీదున్నవాడే ఇంద్రుడి గర్వం అణచిన ఇంద్రజిత్తు. యుద్ధంలో అద్భుత కార్యాలు చేయగల అతడే అతికాయుడు. ఉదయిస్తున్న సూర్యుడి లాంటి కళ్ళు కలవాడే మహోదరుడనే రాక్షసుడు. రణపరిశ్రమలో అభిలాష కలవాడై వచ్చేవాడే పిశాచుడు అనేవాడు. శూలాన్ని చేతిలో పట్టుకుని వేగంగా వస్తున్నవాడే త్రిశిరుడు అనే బలశాలి. అతి తీవ్రమైన పరాక్రమం కల మరొకడే కుంభుడు అనేవాడు. ఆ కుంభుడి తోడబుట్టిన వాడే నికుంభుడు. భయంకరమైన రూపంతో పర్వతాలతో యుద్ధం చేసేవాడే నరాంతకుడు. ఇక రుద్రుడిలాగా వెలుగుతున్న వాడు, రెండవ సూర్యుడి వంటివాడు, దేవతలను దుఃఖపెట్టిన వాడు, వాడే రాక్షసరాజు రావణాసురుడు".

రావణుడిని చూసి ఆశ్చర్యపడ్డ శ్రీరాముడు

శ్రీరాముడు రావణుడిని చూసి ఇలా అన్నాడు. "ఈ విధంగా అదృష్ట వశాన్న ఈ పాపపు మనస్సు కలవాడు నాకు కనపడ్డాడు. సీతాదేవిని వీడు అపహరించిన కోపమంతా వీడిమీద చూపుతాను". అని చెప్పి రామచంద్రమూర్తి విల్లు తీసుకుని ఎక్కుపెట్టి, తీక్షణమైన బాణాలను పొదినుండి బయటకు తీసి, యుద్ధం మీద మనస్సుతో లక్ష్మణుడితో సహా నిలబడ్డాడు.

రావణుడు తన వెంట వచ్చిన వారితో ఇలా అన్నాడు. "మీరంతా మరలిపోండి. కోట గవకుల దగ్గర, ఇండ్ల దగ్గర, గృహగోపురాల దగ్గర కావలి వుండండి. భయపడవద్దు. అంతా ఇక్కడికి వచ్చారన్న వార్త వానరులకు తెలిస్తే ఇదే సమయమని నగరంలోకి పోయి మొత్తం నాశనం చేసి పాడు చేసే ప్రయత్నం చేస్తారు. కాబట్టి పొండి". ఇలా అంటూ వానరసేనను రెండుగా పగుల తీసుకుంటూ గర్వంగా ప్రవేశించాడు.

సుగ్రీవాదులతో పోరిన రావణుడు

రావణుడిని చూసి కోపంతో సుగ్రీవుడు భుజబల వేగంతో ఒక కొండ శిఖరం ఎత్తి వాడిమీద వేశాడు. రావణుడు దాన్ని నూరు తునకలు చేశాడు. తరువాత సుగ్రీవుడిని చంపాలన్న కోరికతో ఒక బాణాన్ని అతడి రొమ్ములో నాటుకునేట్లు

వేశాడు. అది సుగ్రీవుడి రొమ్మును ఈ పక్క తాకి ఆ పక్కకు పోయింది. ఆ బాణం వల్ల కలిగిన బాధతో సుగ్రీవుడు కేక వేసి నేలపడ్డాడు. రాక్షస సైన్యం పెద్దగా నవ్వింది. వానర ప్రభువు ఇలా కాగానే జ్యోతిర్ముఖుడు, గవయగవాక్షులు, ఋషభుడు, సుదంష్ట్రుడు చెట్లను తీసుకుని రావణుడి మీదికి విసిరారు. రావణుడు వాటిని పడగొట్టాడు. వానర గుంపు మీద పడి వారిని నాశనం చేశాడు. వానరులు భయపడి పరుగెత్తి రామచంద్రమూర్తిని రక్షించమని వేడుకున్నారు. ఆయన వారిని భయపడవద్దని చెప్పాడు.

రావణుడితో పోరాడడానికి శ్రీరామాజ్ఞ తీసుకున్న లక్ష్మణుడు

వానరులకు అభయమిచ్చిన శ్రీరాముడు విల్లు తీసుకుని రావణుడి మీదికి పోతుండగా లక్ష్మణుడు ఆయనతో ఇలా చెప్పాడు. "దేవరవారే ఈ మహాపాపాత్ముడిని, రావణుడిని యుద్ధంలో చంపడానికి సమర్థులు. అందులో సందేహం లేదు. అయినా వీడిని నేను చంపాలనుకుంటున్నాను. దేవా! సంతోషంగా నాకు ఆజ్ఞ ఇవ్వండి". ఇలా లక్ష్మణుడు ప్రార్థించగా రామచంద్రమూర్తి జవాబుగా "లక్ష్మణా! యుద్ధానికిపో. యుద్ధంలో ఆత్మరక్షణలో ఏమరుపాటుగా వుండు. ఎందుకంటే ఈ రాక్షసరాజు యుద్ధంలో అసమానమైన పరాక్రమం కలవాడు. ఆశ్చర్యకరమైన బలం కలవాడు. అహంకారంతో ముల్లోకాలవారు వీడిమీద దండెత్తి వచ్చినా, వీడు కోపిస్తే, వీడి వేలిని కూడా వంచలేరు. ఇక జయించడమా? యుద్ధం చేసే విషయంలో వాడిలో కొన్ని లోపాలున్నాయి. అవి నువ్వు తెలుసుకో. నీలో వున్నవి కూడా నువ్వు తెలుసుకో. కాని వాటిని వాడికి కనబడనివ్వ వద్దు. విల్లుతో, కంటితో నిన్ను నువ్వు కాపాడుకుంటూ యుద్ధం చేయడానికి ప్రయత్నం చేయి" అని చెప్పాడు.

అప్పుడు సౌమిత్రి అన్నను కౌగలించుకుని, పాదాలకు మొక్కి యుద్ధానికి బయల్దేరాడు. తన ఎర్రటి కళ్ళతో రావణుడిని చూశాడు.

రావణ హనుమంతుల యుద్ధం

లక్ష్మణుడు యుద్ధానికి రావడం చూసిన హనుమంతుడు, దాసుడైన తానుండగా స్వాములు ముందుగా యుద్ధానికి రావచ్చా? అని భావించి, రావణుడికి, లక్ష్మణుడికి మధ్య అడ్డంగా దూకి, రావణుడు వేసే బాణాలను తన తోకతో తనను తాకకుండా చెదరగొట్టాడు. అమితమైన కోపంతో రావణుడి

రథం మీదకు దూకి వేగంగా తన కుడి చేతిని ఎత్తి, రావణుడు బెదిరేట్లు క్రూరపు చూపులతో అతడిని చూస్తూ ఇలా అన్నాడు. "రావణా! నువ్వు నాగులు, యక్షులు, దేవతలు, రాక్షసులు, దానవులు, పక్షులతో చావక పోవచ్చు. వానరుల చేతిలో నీకు చావు తప్పదు. వారి వల్ల చావులేకుండా నీకు బ్రహ్మ వరం ఇవ్వలేదుగా? ఓరీ! ఇదిగో నా కుడి చేయి చూడు. ఐదు వేళ్లతో కూడినది. ఇన్ని రోజులుగా నువ్వు నీ దేహంలో కాపాడుకుంటున్న ప్రాణాలను ఇప్పుడే చెదరగొట్టుతా. ధీరుడవై చలించకుండా నిలువు".

ఇలా హనుమంతుడు అనగా రావణుడు కోపగించి ఎర్రటి కళ్ళతో ధైర్యంగా, ఆంజనేయుడితో ఇలా అన్నాడు. "వానరా! నీ బలం ఏమిటో చూస్తాను. కొట్టు. రావణుడంతటి వాడిని హనుమంతుడు కొట్టాడన్న కీర్తి సంపాదించు. నువ్వు కొట్టిన తరువాత నీ శౌర్యం ఏమిటో చూసి నిన్ను చంపుతాను". రావణుడు ఇలా అనగానే "ఓరీ! నా శౌర్యం ఎలాంటిదో నా చేతిలో చచ్చిన నీ కొడుకును తలచుకుని వూహించు" అని చెప్పాడు. అప్పుడు రావణుడు హనుమంతుడిని గట్టిగా అర చేత్తో కొట్టి అతడిని అమితంగా బాధకు గురిచేశాడు. అర నిమిషం ముందు–వెనుకలకు చాలా సార్లు ఊగి మరల తెప్పరిల్లి, గాండ్రిస్తూ, రావణుడిని ఒక్క గుద్దు గుద్దాడు. హనుమంతుడు చేతి దెబ్బకు ఎంతగానో బాధపడ్డ రావణుడిని చూసి వానరులు, దేవతలు, మునులు మిక్కిలి సంతోషించారు. దెబ్బతిన్న రావణుడు కాసేపటికి తెప్పరిల్లుకున్నాడు. హనుమంతుడి శౌర్యానికి మెచ్చుకున్నాడు.

రావణుడి మెచ్చుకోలుకు స్పందనగా హనుమంతుడు "ఎందుకు నన్ను మెచ్చుకుంటావు రావణా? ఛీ రావణా! ఇది ఏమి పోటు? నువ్వు చావకుండా బతికే ఉన్నావే? ఎందుకు నా భుజ బలం? కాల్పనా? నీకు పోటుల్లోని హెచ్చుతగ్గులు తెలియవు. నీ భుజబలం కొద్దీ నువ్వు నన్ను గుద్దు. ఆ తరువాత నా భుజబలం కొద్దీ నేను గుద్దుతాను. అప్పుడు నా పోటు శక్తి నువ్వు చూడవచ్చు. నువ్వు చావకుండా వుండవు" అన్నాడు. ఇలా చెప్పగానే రావణుడు కోపంతో కళ్లెర్రచేసి మండిపడుతూ తన శక్తి అంతా పూని హనుమంతుడి రొమ్మును కుడి చేతి పిడికిటితో కొట్టాడు. ఆ దెబ్బకు హనుమంతుడు తబ్బిబ్బులాడుతుంటే, తెప్పరిల్లితే ఆంజనేయుడు తనను చంపుతాడని భయపడి వేగంగా నీలుడి మీదికి పోయాడు.

నీలుడితో యుద్ధం చేసిన రావణుడు

నీలుడు తన మీదికి వస్తున్న రావణుడిని, తనపై బాణాలు వేస్తున్న రావణుడిని చూసి, ఒక పెద్ద పర్వత శిఖరాన్ని వాడి మీదకు వేశాడు. ఇంతలో హనుమంతుడు స్మృతి వచ్చి లేచాడు. నీలుడితో యుద్ధం చేస్తున్న రావణుడిని చూసి సమయం తప్పింది కదా! అనుకున్నాడు. మరొకరితో యుద్ధం చేస్తున్నప్పుడు తాను పోవడం మర్యాద కాదనుకుని వూరుకున్నాడు. నీలుడికి, రావణుడికి మధ్య యుద్ధం కొనసాగింది. అప్పుడు నీలుడు తన రూపాన్ని చిన్నదిగా చేసి, ఎగిరి రావణుడి ధ్వజం మీద పడ్డాడు. అతడు తప్పించుకుని పోతున్నాడని రావణుడు బాణాలు వేయసాగాడు. నీలుడు రావణుడిని చాలా రకాల ఇబ్బంది పెట్టాడు. నీలుడి వేగానికి, యుద్ధ చాతుర్యానికి, రామలక్ష్మణులు, హనుమంతుడు ఆశ్చర్యపోయారు. రావణుడు ఇంతలో తేరుకుని, స్వస్థచిత్తుడై తన ధ్వజం మీదున్న నీలుడిని చూసి ఆగ్నేయాస్త్రం ప్రయోగిస్తున్నానని అన్నాడు. నీలుడికి శక్తి వుంటే కాచుకొమ్మని సవాలు విసిరాడు. ఆ అస్త్రానికి నీలుడు తెలివి తప్పి పడిపోయినప్పటికీ, తండ్రి మహిమ వల్ల, తన బలం తేజస్సు వల్ల చావలేదు. అప్పుడు రావణుడు అహంకారంతో లక్ష్మణుడి మీదికి పోయాడు.

రావణ లక్ష్మణ సంవాదం

తనవైపు, తన మీదకు యుద్ధానికి వస్తున్న రావణుడిని చూసి లక్ష్మణుడు, “ఓరీ! క్రూర రాక్షసుడా! బలవంతుడనన్న గర్వంతో బక్క కోతులను చంపడం ఆశ్చర్య కార్యమా? శూరులకు ధర్మమా? నామీదకురా. నీగర్వాన్ని నాశనం చేస్తాను” అంటాడు. జవాబుగా రావణుడు, “రాజకుమారా! ఏమి నా అదృష్టం. యముడి దగ్గరకు పోదలచి విపరీత బుద్ధితో నామీదకు యుద్ధానికి వచ్చావు. కొంచెం సేపు నాకు కనబడకుండా తొలగిపో. లేకపోతే నా బాణాలు నీ కోరిక ప్రకారం నిన్ను యమలోకానికి పంపుతాయి” అంటాడు. ఆ మాటలను లక్ష్యపెట్టని లక్ష్మణుడు “పాపాత్ములలో మొదటివాడా! ఎందుకు నీకు నువ్వే పౌరుషాలు పలుకుతున్నావు? వ్యర్థమైన మాటలతో మహిమాత్ములు వాగరు. రాక్షసరాజా! ఏనాడు దండకారణ్యంలో ఒంటరిగా వున్న సీతాదేవిని నువ్వు దొంగ సన్న్యాసి వేషంలో వచ్చి దొంగిలించి తీసుకెళ్లావో ఆనాడే నీ బలం, ప్రతాపం, శౌర్యం అన్నీ తెలుసుకున్నాను. ఇప్పుడు నువ్వు చెప్పనక్కరలేదు. తెలుసుకునే ఇలాంటి శూరుడివి కాబట్టే నీతో యుద్ధం చేయడానికి విల్లు, బాణాలతో వచ్చాను. యుద్ధానికి రా చూద్దాం” అని జవాబిచ్చాడు.

రావణ లక్ష్మణ యుద్ధం

రావణ లక్ష్మణుల మధ్య యుద్ధం మొదలైంది. ఒకరు వేసిన బాణాలను మరొకరు చేదించసాగారు. ఒకరిపై ఒకరు శ్రేష్టమైన బాణాలను వేసుకున్నారు. ఒకరినొకరు స్మృతి తప్పేట్లు బాణాలతో కొట్టుకున్నారు. మళ్లీ తేరుకున్నారు. చివరకు రావణుడు బ్రహ్మదేవుడు ఇచ్చిన పొగలేని అగ్నిసమానమైన, వ్యర్థం కాని, విస్తార శక్తికల, ఆయుధాన్ని వానరులు భయపడుతుంటే,లక్ష్మణుడి మీదికి విసిరాడు. అమోఘమైన ఆ బాణం భయంకరంగా లక్ష్మణుడి మీదికి వచ్చింది.

మూర్ఛిల్లిన లక్ష్మణుడిని ఎత్తడానికి ప్రయత్నించిన రావణుడు

రావణుడు వేసిన బాణం శీఘ్రంగా వచ్చి వెడల్పైన లక్ష్మణుడి రొమ్ములో నాటుకోగా లక్ష్మణుడు సొమ్మసిల్లి, నేలకూలాడు. అది చూసి రావణుడు ఆ మహావీరుడిని తన ఇరవై చేతులతో ఎత్తడానికి ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నం చేసినా రావణుడు లక్ష్మణుడిని కదిలించలేక పోయాడు. దీనికి కారణం తన స్వస్వరూపాన్ని లక్ష్మణుడు సంస్మరించడమే. దాని మూలాన అతడి బరువు అనేకరెట్లు పెరిగిపోయింది. అందువల్ల రాక్షసగర్వనాశకుడు, గొప్ప బలసంపత్తికల లక్ష్మణుడిని రాక్షసరాజు తన ఇరవై చేతులు బిగబట్టినా కొంచెమైనా ఎత్తలేకపోయాడు. ఆ సమయంలో ఎత్తలేకపోవడంవల్ల అప్రతిష్టపాలు అవుతానే అని, విడిచి పోలేక పెనుగాడాడు రావణుడు.

రావణుడిని తన్ని లక్ష్మణుడిని ఎత్తుకుని శ్రీరాముడి దగ్గరికి పోయిన హనుమంతుడు

ఇదిలా వుండగా, హనుమంతుడు పరుగెత్తుకుంటూ వచ్చి, వజ్రంతో సమానమైన తన పిడికిటితో తన శక్తికొలదీ రావణుడి రొమ్ము మీద గుద్దగా అతడు దిక్కు తెలియక కాళ్ళు-చేతులు కదిలించడం ఆపి, తన రథంలో కూలబడి పోయాడు. హనుమంతుడు పాత కసి అలా తీర్చుకున్నాడు. రావణుడు అలా మూర్ఛపోవడం చూసిన దేవతలు సంతోషంతో కేకలు వేశారు. లక్ష్మణుడిని హనుమంతుడు తన చేతుల మీదుగా ఎత్తుకుని పోయి రాముడి దగ్గర వుంచాడు. లక్ష్మణుడి మీద రావణుడు వేసిన బ్రహ్మశరం అనే బాణం లక్ష్మణుడిని జయించడం తనకు సాధ్యం కాదని భావించి రావణుడి రథం దగ్గరికి పోయింది. బాణం పోగానే లక్ష్మణుడి మూర్ఛ వదిలింది. తెప్పరిల్లుకున్నాడు. ఇంతలో రావణుడు లేచి విల్లు-బాణాలు ధరించి యుద్ధానికి సిద్ధమయ్యాడు మళ్లీ.

హనుమంతుడిపైకి ఎక్కి రావణుడిమీదికి యుద్ధానికి పోయిన శ్రీరాముడు

తన సైనికులు పడిపోవడం, మిగిలిన వానరులు రావణుడిని చూసి పరుగెత్తిపోవడం చూసిన రామచంద్రమూర్తి, కోపగించి, ఇక ఆలశ్యం చేయకూడదని భావించి, రావణుడిమీదికి పోవడానికి సిద్ధంకాగా, హనుమంతుడు ఆయన్ను సమీపించి తన వీపుమీద కూర్చుని రాక్షసుడిని దండించమని అన్నాడు. వెంటనే శ్రీరాముడు హనుమంతుడి భుజాలమీద ఎక్కి, ఇరవై చేతుల రావణుడిని చూసి, గంభీర కంఠ ధ్వనితో "ఓరీ! నిలు-నిలు. నాకు అప్రియమైన కార్యాన్ని నువ్వు చేసి ఎక్కడికి పోతావు వీరమానీ! నిన్ను వదుల్తానని అనుకుంటున్నావా? ఓరీ! నువ్వు ఇంద్రుడిని, యముడిని, సూర్యుడిని, నీకు వరాలిచ్చిన బ్రహ్మదేవుడిని, రుద్రులను అర్థించినా, పది దిక్కులకు పోయి దాగినా, నిన్ను వదలను. నీ ప్రాణానికి, నీ దేహానికి వున్న సంబంధాన్ని విడగొట్తాను. నువ్వు నీ శక్తితో ఎవరిని పడగొట్టాలని అనుకుంటున్నావో ఆ బలశాలి లక్ష్మణుడే నిన్ను యముడి దగ్గరికి పంపడానికి వచ్చాడనుకో. ఇక నా విషయం నీకు తెలియదా? జనస్థానంలో ఇక్కడ నీకు కనిపిస్తున్న నేనే కదా రాక్షస సమూహాన్ని యుద్ధంలో చంపాను.

శ్రీరామరావణుల మొదటిసారి యుద్ధం

రాముడి మాటలకు కోపగించిన రావణుడు ఆయన వాహనమైన హనుమంతుడిని ప్రళయ కాలాగ్నితో సమానమైన బాణాలతో కొట్టి బాధించాడు. తత్కారణంగా హనుమంతుడి స్వభావ తేజం అంతకంతకూ పెరగసాగింది. రావణుడి బాణాలకు గాయపడ్డ హనుమంతుడిని చూసిన రామచంద్రమూర్తికి కోపం వచ్చింది. రామబాణ సమూహం రావణుడి సారథితో సహా ఆయన్నూ ఇబ్బందికి గురిచేసింది. వజ్రాయుధ సమానమైన ఒక బాణం రావణుడి విశాల వక్షంలో నాటుకుపోయింది. వాడప్పుడు విల-విల బోయి చేష్టలుడిగాడు. రామబాణంతో విలపించాడు. అప్పుడు ఒక ఆలోచనచేశాడు రావణుడు. రాముడు విల్లుచేతిలో లేని శత్రువును చంపడని భావించి నేలమీద తన విల్లుని విడిచాడు. వెంటనే యుద్ధ ధర్మాన్ని అనుసరించి రాముడు గొప్ప మనస్సుతో రావణుడి కిరీటాన్ని నేలపడగొట్టాడు. దాన్ని పడగొట్టిన బాణాన్ని కంఠానికి గురిపెట్టినయితే తల ఎగిరిపోయేది. తన కిరీటం పోయిందంటే తల పోయినట్లే కదా అన్న జ్ఞానంతో సీతను అప్పగిస్తాడని రాముడు అనుకొని వుండవచ్చు. వాస్తవానికి కిరీటం పోయింది అంటే ప్రభుత్వం పోయినట్లేకదా! కిరీటం పోయి,

బడలికతో వున్న, కాంతిహీనుడైన రావణుడిని చూసి రామచంద్రమూర్తి వాడితో ఇలా అన్నాడు.

"నిశాచర రాజా! నిన్ను చంపడానికి సమ్మతించను. రాముడు నిరాయుధుడైన వాడిని, ఆయుధం వున్నా కాళ్లు–చేతులు కదిలించలేని వాడిని చంపడు సుమా! ఎందుకంటే, యుద్ధం చేసి–చేసి అలసిపోయిన వాడిని రాముడు చంపాడు, అదొక శౌర్యమా? అని లోకులు అంటారు. ఆ కారణాన నిన్ను కొట్టను. తాను రథం మీద వుండగా రథం లేకుండా నేలమీద వున్న శత్రువును చంపకూడదు. నపుంసకుడిని చంపరాదు. ఇప్పుడు నువ్వేం చేయాలంటావా? నీకు అనుజ్ఞ ఇస్తున్నాను. నిర్భయంగా లంకకుపో. ఇక నిన్ను కొట్టను. పోయి అలసట తీర్చుకుని మళ్లీ విల్లు బాణాలు తీసుకుని రథం మీద కూర్చుని నీ దగ్గర వున్న అస్త్రాలన్నీ తీసుకునిరా. అప్పుడు నువ్వు నీ రథం మీదనుండి నా శౌర్యం చూస్తావు".

ఇలా చెప్పగా రావణుడు గర్వం పోయి సంతోషహీనుడయ్యాడు.

పరాజితుడై లంకకు పోయిన రావణుడు

విల్లు విరిగిపోగా, సూతుడు చావగా, గుర్రాలు మరణించగా, క్రూరమైన బాణాల దెబ్బలకు నొప్పులు పుట్టిన శరీరంతో, వెంట్రుకలు విరబోసుకున్న తలతో ప్రతాపం క్షయించగా రావణుడు లంకకు పోయాడు. అలా రాక్షసరాజు రావణుడు సిగ్గుతో తలవంచుకుని యుద్ధభూమిని విడిచిపోగా రామచంద్రమూర్తి తన తమ్ముడితో కూడి, బాణాల ములుకులతో బాధపడే వానరులకు ఆ ములుకులు తీయించి బాధ తొలగించాడు. ఇంద్ర శత్రువైన రావణుడు యుద్ధంలో ఓడిపోయి పరుగెత్తిపోగా దేవతలు, అసురులు, భూతాలు, జలచరాలు, ఋషులు, సర్పాలు, దిక్పాలకులు అంతా మిక్కిలి సంతోషించారు.

సర్గ-60
తన పరాభవం తలచుకుని దుఃఖించిన రావణుడు

ఈ విధంగా యుద్ధభూమిని వదిలిపోయిన రావణుడు రామబాణాలు ఇంకా తనను తరుముతున్నాయేమోనని నాల్గు దిక్కులా చూస్తూ భయపడ్డాడు. తన దగ్గరున్న రాక్షసులతో, దుఃఖిస్తూ, తన మనస్సులో వున్నదున్నట్లు ఇలా చెప్పాడు.

"అయ్యో! నేను చేసిన తపస్సంతా నేడు వ్యర్థమై పోయిందికదా! ఔరా! ఏమీ ఈ విచిత్రం? ఎంతో మందిని జయించిన నేను ఈ రోజున యుద్ధభూమిలో ఒక మనుష్యుడిని గెలవలేక పోయాను. మనుష్యులను తినేవారిని మనుష్యులే బలగర్వంతో గెలుస్తున్నారు. ఎంతటి విపరీత కాలం వచ్చిందో కదా! నాకు వరాలిచ్చినప్పుడే బ్రహ్మదేవుడు నాకు మనుష్యులవల్ల భయం కలుగుతుందని చెప్పాడు. ఆ మాటలు నేడు యదార్థమయ్యాయి కదా! ఎవరితో చావకుండా బ్రహ్మ వరం పొందాను. అప్పుడు దురహంకారంతో మనుష్యులు ఏమి చేయగలరని భావించి వారి పేరు చెప్పలేదు. అది ఇప్పుడు నా ప్రాణానికే అపాయం అయింది. నాకు హితం బోధించిన కొందరు, విష్ణువే మనుష్య రూపంలో రాముడిగా నన్ను చంపడానికి వచ్చాడనీ, అతడితో సంధి చేసుకొమ్మనీ చెప్పారు. నా అభిప్రాయం అది కాదు. ఎందుకంటే ఇక్ష్వాకు రాజైన అరణ్యుడనే అయోధ్యారాజును నేను యుద్ధంలో ఓడించాను. అతడు నన్ను చూసి, ఆయన వంశంలో, నన్ను చంపేవాడు పుట్టాడని చెప్పాడు. ఆ రాజు అన్న మాట నేటికి చెల్లుతున్నది కదా! ఇది వాస్తవం కాబట్టి దశరథుడి కొడుకు రాముడు మనుష్యుడనే నమ్ముతాను. దశరథుడు మనుష్యుడైతే ఆయన కొడుకు కూడా మనిష్యుడే కదా!".

“నేను చేసిన పనికి అవమానపడి, కోపంతో వేదవతి అనే ఒక తపశ్శాలినైన స్త్రీ, నన్ను నా కులాన్ని నాశనం చేస్తానని శపించింది. ఆ వేదవతే ఇప్పుడు విదేహరాజుకు కూతురై సీతగా పుట్టింది. ఆ వేదవతి ఋషి కన్య. మానుష్య స్త్రీ కాబట్టి సీత కూడా మనుష్య స్త్రీనే. కాబట్టి సీతారములిద్దరూ మనుష్య జాతివారే. మనుష్యులు కాబట్టే ఒకరినొకరు వివాహం చేసుకున్నారు కాని, రాముడు విష్ణువైతే మనుష్యస్త్రీని వివాహం చేసుకుంటాడా? సీత లక్ష్మి అయితే మనుష్యుడిని వివాహం చేసుకుంటుందా? కాబట్టి లక్ష్మీనారాయణుల వాదన నాకు సమ్మతం కాదు. అలాంటి మహిమ వారిలో లేదు. వారి చేసినవి అమానుషాలు కాదు. మనుష్య సాధనాలే. పార్వతి, రంభ, నందీశ్వరుడు నన్ను గురించి చెప్పింది జరగడం ఆరంభమైంది. ఋషుల మాటలు వ్యర్థమవుతాయా? ఇవి నాకున్న శాపాలు. ఇది తెలుసుకున్న మీరు విరోధులను సంహరించే ఉపాయం ఆలోచించండి. ఈ శాపాలు నన్ను బాధిస్తాయికాని మిమ్మల్ని ఏమీ చేయలేవు. కాబట్టి, మీకు భయం లేదు. మీరు అజాగ్రత్తగా వుంటే ఇబ్బంది పడతారు. నాకోసం కాకపోయినా, మీ కోసమైనా జాగ్రత్తగా వుండండి. మీరేం చేయాలంటే, మూలల్లో, బురుజుల్లో, గోపురాలలో రక్షణగా వుండండి. ఇంకో విషయం, నిద్రబోతున్న కుంభకర్ణుడిని లేపాలి".

కుంభకర్ణుడిని నిద్రలేపడానికి మంత్రులను నియోగించిన రావణుడు

భయంకరమైన యుద్ధంలో ప్రహస్తుడు చనిపోయాడు. నేను పరాజయం పొంది వచ్చాను. పగవారిని ఎదిరించి జయం పొందగల వాడెవరున్నారిప్పుడు? కాబట్టి లోపంలేని శూరుడైన కుంభకర్ణుడొక్కడే తన బలంతో వైరులను చంపగలడని నిశ్చయించుకున్న రావణుడు, తన సేనతో ఇలా అన్నాడు.

"వానరులు లోపలికి రాకుండా దారులన్నీ ప్రయత్నంతో కాపాడండి. వారు దూరంలో వున్నప్పుడే ప్రాకారాలెక్కి పగవారు రాకుండా చూడండి. ఇలాంటి కష్టదశలో నేనుండగా కుంభకర్ణుడు హాయిగా శరీరాన్ని మరిచి నిద్రపోతున్నాడు. అతడు ఒక్కోసారి ఆరేడు, ఎనిమిది, తొమ్మిది నెలలు నిద్రిస్తుంటాడు. వాడింతకు ముందు తొమ్మిదోనాడు నిద్రపోయాడు. ఇంకా గాఢనిద్రలోకి పోలేదు కాబట్టి ఇప్పుడే సులువుగా నిద్రలేపవచ్చు. వాడు మేల్కొంటే రామలక్ష్మణులను, వానరులను చంపుతాడు. నా తమ్ముడు కుంభకర్ణుడు రాక్షసులలో శ్రేష్టుడు. ఇది యధార్థం. భయంకర యుద్ధాలలో శత్రుసమూహాలను నాశనం చేస్తాడు. అలాంటి అసమాన బలశాలి నిద్రాసక్తుడై దేహం తెలియకుండా

సోమరిపోతులాగా వుంటాడు కాని నాదుఃఖం తెలుసుకోలేదు. ఇక ఆలోచించడం ఎక్కడ? నిద్రలేపకూడదన్న నీతి పాటిస్తే వాడు ఇంకా ఆరుమాసాలకు కాని లేవడు. అంతవరకీ యుద్ధం అలాగే వుంటుందా? ఇంద్రుడితో సమానమైన బలశాలి, మహాసాహసి, యుద్ధంలో నాకు తోడుండాలి కాని నిద్రపోతే ఎలా? అలాంటివాడున్నా నాకు లాభం ఏంటి? వున్నా లేనట్టేకదా? వాడిని నిద్ర లేపండి?" అని రావణుడు చెప్పాడు.

ఆయన ఆజ్ఞానుసారం రాక్షసులు నిద్రిస్తున్న కుంభకర్ణుడిని, నిద్రపోయేటప్పుడు చూడడానికి భయంకరంగా కనిపించేవాడిని, లేపే ప్రయత్నం చేస్తూ, వాడు లేవగానే తినడానికి ఆహారం, తాగడానికి పానీయం సిద్ధం చేశారు.

కుంభకర్ణుడిని నిద్రలేపిన రాక్షసులు

కుంభకర్ణుడిని నిద్రలేపడానికి రాక్షసులు అనేకవిధాలైన ప్రయత్నాలు చేశారు. ధ్వనులు చేసారు. చప్పట్లు కొట్టారు. భయంకరంగా అరిచారు. ఉడుకలు, నగారాలు, శంఖాలు మోగించారు. పెడబొబ్బలు పెట్టారు. గట్టిగా తట్టారు. సింహనాదాలు చేశారు. అయినా కుంభకర్ణుడు కొంచెమైనా మేల్కొనలేదు. పక్కకు కూడా పొర్లలేదు. ఆయన్ను మద్గరాలతో, గదలతో, కొండలతో, చెట్లతో, చేతులతో వాళ్ల బలం కొద్దీ కొట్టారు. దెబ్బలకు వాడు లేవకపోగా వాడి ముక్కులో నుండి వచ్చే గాలిదెబ్బకు వారంతా కొట్టుకుపోసాగారు. భయంకర బలసంపత్తికల పదివేలమంది రాక్షసులు గుంపుగా ఒక్కచోట చేరి రకరకాల పరికరాలతో ధ్వనులు చేసినా రాక్షసుడికి నిద్రాభంగం కలగలేదు. బ్రహ్మశాపం వల్ల దేహం తెలియక పడివున్న కుంభకర్ణుడిని ఎన్నివిధాలగానో లేపడానికి ప్రయత్నించారు రాక్షసులు. అప్పుడు మదించిన ఏనుగుల గుంపును వాడిమీదకు పంపగా కొంచెం కదలిక వచ్చింది కుంభకర్ణుడిలో.

నిద్రలేచిన కుంభకర్ణుడు

కుంభకర్ణుడు కళ్లు తెరిచినప్పటికీ నిద్రమత్తు వదల్లేనందున రాక్షసులు ఆయనమీద కొండలు, చెట్లు వేశారు. శస్త్రాలతో కొట్టారు. ఇవేవీ వాడికి తెలియలేదు. ఆ విషయం ఆలోచన కూడా చేయలేదు. నిద్రలేచిన కుంభకర్ణుడు రెండు చేతులూ జాడించాడు. బడబానలంతో సమానమైన నోరు తెరిచాడు. అది

పాతాళంలాగా, మేరు పర్వతంలోని సూర్యుడిలాగా వుంది. అతడి రెండు కళ్లు బలంకల మహాగ్రహాల లాగా వున్నాయి. వాడికి అప్పుడు ఆకలైంది. అక్కడ వుంచిన భక్ష్యాలను, నానారకాలైన మాంసాలను, దున్నపోతుల, పందుల మాంసాన్ని కావాల్సినంత తిని నెత్తురు, సారాయి తాగి తృప్తిపడి, సంతోషించిన తరువాత అక్కడక్కడ దాక్కున్న రాక్షసులు వాడి దగ్గరికి వచ్చి నమస్కారం చేశారు. చేసి ఆయన చుట్టూ నిలుచున్నారు. తననెందుకు నిద్రలేపారని ఆశ్చర్యంగా వాళ్లను అడిగాడు కుంభకర్ణుడు. రావణుడి క్షేమం గురించి విచారించాడు. తనకేదో సందేహం వుందని అంటాడు. తనను మేలికొల్పిన కారణం ఆలశ్యం చేయకుండా చెప్పమని అడిగాడు. "ఇంద్రుడిని స్వర్గం నుండి మెడపట్టి నెట్టుతాను. అగ్నిహోత్రుడిని గట్టిగా కట్టేస్తాను. మరెవ్వరిననైనా చూర్ణం చేస్తాను. సామాన్యమైన కారణం వల్ల నన్ను రాక్షసరాజు నిద్రలేపడు. కాబట్టి ఏ విపత్తు వచ్చిందో చెప్పండి" అని అంటాడు.

కుంభకర్ణుడిని నిద్రలేపిన కారణం అతడికి చెప్పిన యూపాక్షుడు

ఇలా కోపంతో వున్న కుంభకర్ణుడిని చూసి యూపాక్షుడనే మంత్రి అతడితో ఇలా అన్నాడు. "మన రాక్షసులకు దేవతల భయం ఎప్పుడూ లేదు. ఇప్పుడు మనకు అర్థంకాని మహాభయం మనుష్యుల వల్ల కలిగింది. ఇంతదాకా దైత్యుల వల్ల, దానవుల వల్ల, దేవతల వల్ల కలగని ఉపద్రవం ఇప్పుడు మనుష్యుల వల్ల కలిగింది. కొండంత దేహంకల వానరులు లంకను ముట్టడించారు. సీతాదేవిని అపహరించడం వల్ల బాధపడుతున్న రాముడితో రాక్షసులకు చావుకాలం వచ్చింది. ఇంతకు ముందు ఒక వానరుడు వచ్చి లంకను కాల్చాడు. అక్షకుమారుడిని చంపాడు. ఇప్పుడు సూర్యతేజస్సుకల రాముడు బలవంతుడై వచ్చి రావణుడు చచ్చేట్లు యుద్ధంలో పరుగెత్తించి మరీ కొట్టాడు. దైత్యులు, దానవులు, దేవతలైనా కలిగించలేని అవమానం సీతావల్లభుడు కలిగించి రావణుడి ప్రాణాలు పోయీ-పోనట్లు చేసి విడిచిపెట్టాడు. అవమానం వల్ల, రాముడి బాణాల దెబ్బల వల్ల, అన్ని ప్రాణాలు పోయినట్లే అయినా, నీమీద ఆశతో ఒక్క ప్రాణాన్ని మాత్రం బిగబట్టుకుని బతికున్నాడు". అని చెప్పిన యూపాక్షుడితో కుంభకర్ణుడు ఇలా చెప్పాడు.

రావణుడిని చూడడానికి పొమ్మని కుంభకర్ణుడికి చెప్పిన మహోదరుడు

"యూపాక్షా! అలా అయితే నేను ఈ నిమిషంలోనే పోయి రామలక్ష్మణులతో

సహా వానరసేననంతా చంపి తరువాత రావణుడిని చూసి రాక్షసులకు తృప్తి కలిగిస్తాను" అన్నాడు కుంభకర్ణుడు. వాడి మాటలు విని యూపాక్షుడు ముందు అతడు రావణుడిని చూడమని సూచించాడు. అలాగే చేస్తానని కుంభకర్ణుడు లేచాడు. ఆయన ఇలా లేవగానే రాక్షసులు ముందుగా పోయి రావణుడిని చూసి చేతులు జోదించి, కుంభకర్ణుడు మేల్కొన్నాడని, రావణుడు వాడి దగ్గరికి పోతాడా? లేదా వాడినే ఆయన దగ్గరకు రమ్మని చెప్పాల్నా అని అడిగారు. అతడినే ఇక్కడికి రమ్మనమని చెప్పండంటాడు. వారు వెంటనే పోయి రావణుడు రమ్మంటున్నాడని, పోవడానికి ఇష్టమేనా అని అడిగారు కుంభకర్ణుడిని. తనకు పోవడం ఇష్టమేనని అంటూ, తన పక్కమీద నుండి లేచి, ముఖం కడుక్కొని, స్నానం చేసి, అలంకారం చేసుకుని, బలం రావడానికి వీరపాణం చేసి దప్పిక తీర్చుకున్నాడు. ఆ తరువాత ఆ బలశాలి అన్నను చూడడానికి పోతుంటే భూమి వణికింది. పురంలోని రాజమార్గాలు వాడి ఆభరణాలతో ప్రకాశించాయి. దారి పొడుగునా ఇరు పక్కలా అందరూ చేతులు జోడించుకుని నిలబడి వున్నారు. అలా పోతున్న కుంభకర్ణుడిని ఆశ్చర్యంగా లంక బయట వున్న వానరులు కూడా చూశారు. కొందరు వానరులు భయపడి పరుగెత్తి, కాళ్లు కుప్పలుగా కూలబడ్డారు. కొందరు రాముడి దగ్గరికి పోయి ఆయనే గతి రక్షించమని వేదుకున్నారు.

సర్గ–61
రావణుడిని చూడడానికి పోతున్న కుంభకర్ణుడి విషయం విభీషణుడిని అడిగిన శ్రీరాముడు

భయంకరమైన ఆకారంకల కుంభకర్ణుడిని చూసి వానరులు పరుగెత్తసాగారు. అప్పుడు శ్రీరాముడు "వీడెవడయ్యా, కొండలాగా వున్నాడు" అని విభీషణుడిని అడిగాడు. ఇంతకు ముందు ఇంత అద్భుతమైన ప్రాణిని భూమ్మీద చూడలేదంటాడు. జవాబుగా విభీషణుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు.

కుంభకర్ణుడిని గురించి శ్రీరాముడికి వివరించిన విభీషణుడు

విభీషణుడు శ్రీరాముడికి కుంభకర్ణుడిని గురించి ఇలా చెప్పాడు. "యుద్ధంలో బలవంతుడైన ఇంద్రుడిని ఓడించి శూరుడైన వీడు విశ్రవసుడి కొడుకైన కుంభకర్ణుడు. వేరే ఇతర రాక్షసులు ఇంత లావు, పొడుగున్నవారు కాదు. రాక్షసులంతా బ్రహ్మరుద్రుల వరబలం వల్ల బలవంతులయ్యారు. వీడికి బలం పుట్టుకతోనే వచ్చింది. అసురులను, గంధర్వ, కిన్నర, యక్షులను, సర్పాలను, దనుజులను, విద్యాధరులను యుద్ధంలో ఎన్నో సార్లు ఓడించాడు. దేవతలకు వీడి పేరు గుండెల్లో గాలంలాంటిది. శూలం చేతబట్టుకుని ఈ విరూపాక్షుడు యుద్ధంలో విజృంభిస్తే వీడు యముడేమోనని దేవతాసమూహాలు దగ్గరకు రావడానికి భయపడ్తారు. వీడు పుట్టీపుట్టకముందే బాగా ఆకలితో వేలాది జంతువులను మింగడానికి ప్రయత్నిస్తే ప్రజలంతా ఇలా జరుగుతే లోకమంతా త్వరలోనే శూన్యమవుతుందని భయపడి ఇంద్రుడికి పిర్యాదు చేశారు. ఆయనప్పుడు వీడిమీదకు వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ దెబ్బకు వాడు వణికి అరవగా ఆ ధ్వనికి భూచక్రం మరింత దిగాలుపడ్డది. అప్పుడు కుంభకర్ణుడు ఐరావతం దంతాన్ని పెరికి దాంతోనే ఇంద్రుడిని కొట్టాడు. ఆ దెబ్బకు ఇంద్రుడు

భయపడడంతో దైత్యులు, ఋషులు బాధపడ్డారు".

"ఇతడు పెట్టే ఉపద్రవాన్ని సహించలేక ఇంద్రుడు బ్రహ్మ దగ్గరికి పోయి, పాపాత్ముడైన కుంభకర్ణుడు ప్రజలను బక్షించడం, దేవతలను బాధించడం, స్త్రీలను చెరచడం, ఋష్యాశ్రమాలను పాడుచేయడంలాంటివన్నీ విన్నవించాడు. వారి మాటలు ఆలకించిన బ్రహ్మ కుంభకర్ణుడిని పిలిచి, 'నిన్ను లోకాలను నాశనం చేయడానికే విశ్రవసుడు పుట్టేట్లు చేశాడు. కాబట్టి ఇక నుండి నువ్వు చనిపోయినవాడితో సమానంగా పడి వుండు' అని శపించాడు. ఆ క్షణంలోనే వీడు నేలమీద పడ్డాడు. అప్పుడు రావణుడు చాలా భయపడి బ్రహ్మను చూసి, 'తాతా! నువ్విలా శపించవచ్చా? వీడు నీ మనుమడు కాడా? వీడిని సృష్టించిన వాడివి నువ్వే కదా? నీ మాట అసత్యం కాకూడదు. అందుకే, ఇన్ని రోజులు నిద్రపోవాలి, ఇన్ని రోజులు మేల్కొని వుండాలి అని నియమం ఏర్పాటు చేయి' అని ప్రార్థించాడు. అప్పుడు వాడిని ఆరు నెలలు నిద్రించాలని, ఆ తరువాత ఒక్క పగలు మేల్కొని అగ్నిహోత్రుడిలాగా ఆరు నెలల తిండి ఒక్కరోజే తిని విహరించాలి అని బ్రహ్మ తన శాపాన్ని సవరించాడు. మహాత్మా! కుంభకర్ణుడు ఇలాంటివాడు. నీ బలానికి భయపడి రావణుడు వీడిని నిద్రలేపాడు. ఈ రాక్షసుడిని చూసి వానరులు భయంతో పరుగెత్తుతున్నారు. వీడిని యుద్ధంలో ఇక ఎలా ఎదిరుస్తారో? ఏమో? 'వానరులారా! ఇది మిమ్మల్ని బెదిరించడానికై వచ్చిన కీలుబొమ్మ' అని, దీనిని చూసి భయపడవద్దని నలువైపులా చాటించు. అలా చేస్తే వానరులు భయం వదులుతారు". అని అన్న విభీషణుడి యుక్తి–యుక్తమైన మాటలు విని రామచంద్రమూర్తి నీలుడిని పిలిచి ఇలా చెప్పాడు.

కుంభకర్ణుడితో యుద్ధానికి సేనలను సిద్ధం చేయమని నీలుడికి చెప్పిన శ్రీరాముడు

"నీలా! మన వానరసేనలను అక్కడక్కడా తగినవిధంగా పన్ని వుంచు. లంక వాకిళ్లను, అగడ్తల మీద వున్న వంతెనలను, గోపురాల పక్కన భటులుండే ప్రదేశాలను, అడ్డగించు. కొండ శిఖరాలను, చెట్లను, రాళ్లను సమకూర్చు. వానరులు ఆయుధాలను, కొండలను చేతుల్లో ధరించి సిద్ధంగా వుండాలి" అని చెప్పాడు శ్రీరాముడు నీలుడితో. తక్షణమే నీలుడు రామాజ్ఞను వానరులకందరికీ తెలియచేశాడు. వానరులు శ్రీరాముడు చెప్పినట్లే చేశారు. శరభుడు, గవాక్షుడు, అంగదుడు, హనుమంతుడు విజృంభించి కొండ శిఖరాలను చేతుల్లో ధరించి పగవారు భయపడేట్లు సింహనాదలు చేశారు.

సర్గ-62
రావణుడిని చూసిన కుంభకర్ణుడు

మత్తు వదిలించుకుని అన్న రావణుడిని చూడడానికి కుంభకర్ణుడు త్వరగా పోయాడు. అన్నను చేరిన తమ్ముడిని చూడగానే రావణుడు "నాయనా వచ్చావా!" అని సంతోషంగా లేచి ప్రేమాతిశయంతో కౌగలించుకున్నాడు. కుంభకర్ణుడు అన్న పాదాలకు మొక్కి, సమీపంలో వున్న ఆసనం మీద కూర్చుని, కోపంతో ఎర్రటి కళ్ల చూపులతో ఇలా అన్నాడు. "త్వరగా చెప్పు. నన్ను లేపాల్సిన విషయం చెప్పు. ఎందుకు నీకు భయం వేసిందో చెప్పు" అని అడిగాడు. తన స్థితికి తమ్ముడికి కోపం వచ్చిందని గమనించిన రావణుడు కళ్ళు తిప్పుకుంటూ కుంభకర్ణుడు చేస్తాడో, చేయడో అన్న సందేహం వున్నప్పటికీ ఇలా అన్నాడు.

శ్రీరాముడి వల్ల రాక్షసులకు విపత్తు వుందనికుంభకర్ణుడికి చెప్పిన రావణుడు

"తమ్ముడా! నువ్వు సుఖంగా నిద్రపోవడం వల్ల దీర్ఘకాలంగా నన్ను శ్రీరాముడు బాధపెట్టే వ్యవహారం నీకు తెలియదు కదా? సుగ్రీవుడి సహాయంతో వానరసేనతో రాముడు సముద్రం దాటివచ్చి రాక్షస సేననంతా నాశనం చేస్తున్నాడు. చూశావా! సముద్రానికి సేతువు కట్టి వానరసేనను తరలించి, లంక చుట్టూ వానరులనే సముద్రంతో రాముడు నిలిచాడు. యుద్ధానికి పోయిన రాక్షసులంతా అలాగే పోవడమే కాని మరలి రావడం లేదు. వానరుల్లో పేరున్న వీరుడు ఒక్కడైనా చచ్చినట్లు లేదింకా. ఆ కారణాన భయం కలుగుతున్నది. వీరోత్తమా! ఈ నగరాన్ని నువ్వే రక్షించాలి. వానర సమూహాన్ని నువ్వు చంపాలని నిన్ను నిద్రలేపాను. ఆర్జించిన ధనంలో చాలా భాగం నశించింది. ముసలివారు, పిల్లలు మాత్రమే మిగిలివున్న ఈ నగరాన్ని అన్నకొరకు రక్షించు. ఎంతో కష్టమైన

ఈ పనిని నువ్వు చేయి. ఇంకా ఇంద్రజిత్తు లాంటి శూరులున్నారు. మూలబలం కూడా వుంది. అది నశించిన తరువాత నీ వంతు వస్తుంది. తమ్ముడా! ఇదివరకెప్పుడైనా నేను నీకు ఇలా చెప్పానా? నీమీద నాకెంత ఆదరం, స్నేహం వుందో నీకు తెలియదా? దేవదానవులకు యుద్ధం జరిగినప్పుడు నువ్వు దేవతలను గెలవలేదా? అప్పుడు నువ్వు చేసినదంతా నేనెప్పుడైనా మరచిపోయానా? భయంకర పరాక్రమ సంపత్తి కలవాడా! నీ భుజబలం, శౌర్యం, ధైర్యం ఈ రోజున యుద్ధభూమిలో చూపు. నీలాంటి శూరుడికి సమానమైన వాడేడీ? ఎక్కడా లేదు. నీకు కూడా యుద్ధం అంటే మక్కువే. కాబట్టి మన శత్రువులను చంపు. మామీద స్నేహం చూపు. దేవతలనే ఓడించినవాడికి కోతులు ఒక లెక్కా? అసమాన తేజస్సుకలవాడా! నీ బలం అనే గాలితో విరోధులనే మేఘాలను చెదరగొట్టు".

సర్గ-63

రావణుడిని నిందించిన కుంభకర్ణుడు

ఇలా ఏడుస్తూ మాట్లాడుతున్న అన్న రావణుడిని చూసి నవ్వాడు కుంభకర్ణుడు. “గతంలో ఆలోచన చేసే సమయంలో నీకు ఎలాంటి కీడు మూడుతుందో అని మేము నిశ్చయించామో అలాంటి కీడే నేడు కలిగింది. దీంట్లో విపరీతం ఏదీ లేదు. యుద్ధం జరిగితే మనవారిలో కొందరైనా చస్తారు కదా? చావకుండా వుండరు కదా? ఒక ఆడదానికోసం నీ మేలుకోరేవారిని చంపుకుంటున్నావు. చెప్పినా వినకపోతివి. ఆడదానిమీద వున్న కామానికి ఫలితం అనుభవిస్తున్నావు. అనుకున్నదానికి విరుద్ధంగా ఏదీ జరగలేదు. పాపం చేసినవాడికి నరకానుభవం తప్పదన్నట్లు నువ్వు చేసిన పాపకార్యానికి వెంటనే ఫలితం కనబడ్డది. దాన్ని అనుభవిస్తున్నావు. చేసిన పుణ్యపాపాలు త్వరలోనేకదా ఫలితం చూపేది?. ఈ చేత్తో చేశావు, ఆ చేత్తో అనుభవిస్తున్నావు. ఇప్పుడు ఏడిస్తే లాభం ఏంటి? రాజా! నువ్వు సీతను తెచ్చేముందర రాముడి విషయం తెలిసినవాడివైనప్పటికీ, అతడిని ఎలా చంపాలో అన్న సంగతి నన్ను కాని, నా అభిప్రాయంకానీ, ఇతరుల అభిప్రాయం కానీ ఆలోచించవైతివి. బలవంతుడినన్న మదంతో రాబోయే కీడును గుర్తించలేకపోయావు. ఇది రాజనీతా? నీతివంతుడిలా చేయవచ్చా? రాగల లాభనష్టాల గురించి ఆలోచించలేదు నువ్వు. అప్పుడు లక్ష్యపెట్టకుండా ఇప్పుడు ఆలోచిస్తున్నావు. ఇది నీతి తెలిసినవాడి లక్షణమా?"

"ధర్మం, అర్థం, కామం అనే ఈ మూడింటిని వేరువేరుగానైనా, ఒక్కొక్కదానినైనా, అన్నింటినీ కలిపైనా, క్రమం తప్పించి రెండు-రెండుగానైనా, అంటే, ధర్మార్థాలు కాని, ధర్మకామాలు కాని, అర్థకామాలు కాని, అను నిత్యం దానికి విధించిన సమయంలో చేయాలి. అంటే, ప్రాతఃకాలంలో ధర్మం,

మధ్యాహ్న సమయంలో అర్థం, సాయంకాలం కామం గురించి ఆలోచించాలి. ఇది వేరువేరుగా చేసే పద్ధతి. అలా కాకుండా ప్రాతఃకాలంలో విహితమైన ధర్మాన్ని ఆచరించి, తరువాత దానికి తోడుగా అర్థాన్ని ఆలోచించవచ్చు. మధ్యాహ్నాన విహితమైన అర్థాన్ని ఆలోచించి ఆ తరువాత దానికి తోడు ధర్మాన్ని ఆచరించవచ్చు. సాయంకాలం కామం ఆచరించి ఆ తరువాత దానికి తోడుగా ధర్మం కాని, అర్థం కాని ఆలోచించాలి. అంతే కాని సాయంకాలం తప్ప ఇతర వేళల్లో కామ విచారం నిషిద్ధం. ఇది రెండు-రెండుగా చేసే పద్ధతి. సాయంకాలం ధర్మార్థకామాలు మూడు కూడా ఆలోచన చేయడం మూడో పద్ధతి. అలా కాకుండా సర్వ వేళలా కామన్నే ఆలోచించే వాడు ఒక మనుష్యుడా? వాడి దగ్గర లక్ష్మి నిలుస్తుందా? ఈ కారణాన ధర్మార్థకామాలలో ఉత్తమాధమ మధ్యమాలలో ఏది శ్రేష్టమో అది తెలుసుకోవాలి. కేవలం ధర్మం కాని, ధర్మంతో కూడిన అర్థం, కామం కాని, తెలుసుకుని రాజైనా, ఇంకెంతటివాడైనా విడువకుండా అనుష్టించకపోతే చదివిన చదుకుకు ఫలం లేదు. వాడు చదివిన చదువు వ్యర్థం. నీ చదువు ఇలాంటిదే".

"నీతి శాస్త్రం ప్రకారం ధర్మార్థకామాలనే పురుషార్థాల అనుష్టాన రహస్యాలను తెలుసుకుని ఇది చేయవచ్చి, ఇది చేయకూడదు అని ఆలోచించి, ఏది మంచిదో దాన్ని చేసేవాడు సుఖంగా జీవిస్తాడు. యదార్థజ్ఞానం లేకుండా సరైనదాన్ని తప్పనీ, తప్పును ఒప్పనీ అనుకునే ప్రభువులకు, నీతిశాస్త్ర రహస్యాలు తెలియనివారు మంత్రులై, కార్యాకార్యాలు ఆలోచించే సమయంలొ వూరక వుండే మూఢులను ప్రభువు అనుకుంటాడేమోనని ఏదో ఒక ఆలోచన చెప్పడానికి ముందుకు వస్తారు. వాళ్లు చెప్పినట్లు చేస్తే మేలు కలుగుతుందా? కీడు కలుగుతుందా? అని ఆలోచన చేయరు. నీతిశాస్త్రం తెలియనివారై, సంపద బాగా రావాలన్న కోరిక మాత్రం కలవారైన శాస్త్రార్థజ్ఞానం లేనివారు చెప్పే కీడుకలిగించే మాటలను రాజైనవాడు కొంచెం కూడా ప్రామాణికంగా తీసుకొనరాదు. శాస్త్రజ్ఞానం లేనివాడు చెప్పే మాటలు వినకపోవడమే కాకుండా, రాజైనవాడు వాడిని మంత్రాలోచన సభకు కూడా రానీయకూదదు".

"పైకి హితంగా కనపడే అహితమైన మాటలు ధీరుడై వదరే కార్యనాశకరుడిని, కార్యం ఆలోచించే సమయంలో సభకు రానీయకుండా దూరంగా వుంచాలి. ఏపే పనులు ఎలాఎలా చేయాలో తెలిసిన పగవారికి తన ప్రభువు రహస్యాలను చెప్పి అతడితో చెడు కార్యాలు చేయించే దుర్మంత్రి తన ప్రభువును ఆపదల్లో

ముంచకుండా వుంటాడా? అవశ్యం ముంచుతాడు.విమర్శించకుండా తొందరపడి పనిచేస్తూ చెడునడవడి కలవాడిని హితుడైన మంత్రిగా నమ్మే ప్రభువు మర్మం తెలుసకుని పగవారు దూరుతారు.స్నేహితుడిలాగా నటిస్తూ కపటం కలిగిన శత్రువును తెలుసుకోలేక వాడిమాటలు నమ్మి, అవసరమైనప్పుడు తనను రక్షించుకోలేని ప్రభువు తన పదవి పోగొట్టుకుని సంపద కూడా నాశనం చేసుకుంటాడు".

(ప్రహస్తుడు, కుంభకర్ణుడు ఏకాభిప్రాయం కలవారు. నువ్వు క్షుద్ర కామాన్ని ప్రధానంగా భావించి దానికోసం ధర్మార్థాలను నాశనం చేసుకోవాలనుకోవడం నీ మొదటి తప్పు. నీకు వాస్తవం తెలియచేయకుండా భయం వల్లో, దాక్షిణ్యం వల్లో, తెలివితక్కువ తనంతో దుర్బోధలు చేసి నువ్వు చేసిందే మంచిదని ఇచ్చకాలు పలికే వారిని దూరంగా వెళ్లగొట్టకపోవడం నీ రెండో తప్పు. నీమేలుకోరి చెప్పినవాడిని వదలుకోవడం మూడో తప్పు. ఈ మూడు తప్పుల వల్ల నువ్వు నాశనం అయిపోతున్నావు. ఇలా చెప్పడం కుంభకర్ణుడి ఉద్దేశం).

కుంభకర్ణుడిమీద కోపం తెచ్చుకున్న రావణుడు

కుంభకర్ణుడి మాటలకు కోపం తెచ్చుకున్న రావణుడు ఇలా అన్నాడు తమ్ముడితో: "ఓరీ మహాబలశాలీ! నీతి గుణం కలవాడిలాగా, పూజ్యుడైన పెద్ద ఆచార్యుడిలాగా, నేను చేసినది తప్పనీ, నన్నిలా చేయమనీ ఆజ్ఞాపిస్తున్నావేమిరా? చాలు, చాలు. మాట్లాడవద్దు. పని వున్నప్పుడు పనిచేస్తే కార్యం చక్కబడునుకానీ, వుత్తుత్తి మాటలు నోరు పారవేసుకుని మాట్లాడితే ఏం లాభం?చేయాల్సిన పని ప్రమాదవశాత్తునో, అజ్ఞానం వలనో, బలం,శౌర్యం కలదన్న నమ్మకం వల్లనో, చేయక తప్పిపోయింది. దాన్నే నువ్వు మళ్లీ-మళ్లీ తప్పు-తప్పు అని అంటూ ఇంకొకటి మాట్లాడక పోవడం వల్ల వచ్చిన లాభం ఏమిటి?బుద్ధిమంతులు తమ చేయిదాటి పోయినదానికి పోయిందే అని ఏడుస్తారా ఏమిటి? పోయిందేదో పోయింది.కార్యాన్ని ఇప్పుడెలా చక్కబెట్టాలో దానికి ప్రయత్నం చేయి. అంతేకాని గడిచినదాన్ని గురించి ఉపన్యాసం ఇవ్వకు. అలా చేస్తే పనెలా జరుగుతుంది?"

"నా మీద నీకు అమితమైన ప్రేమ వున్నా, నీ బలశౌర్యాలు ఎంతో నీకు తెలిసి వున్నా, ఇప్పటి యుద్ధ ప్రయత్నం నిరాక్షేపకార్యమని నీకు తోచినా, వెంటనే నేను నీతిమాలి చేసిన పనిని, దానివల్ల కలిగిన కీడును నీ శౌర్యంతో సరిదిద్దు.ఆపద కలిగిందని తెలిసి దుఃఖపడేవాడిని చేరుకొని సహాయం చేసేవాడే స్నేహితుడు.

నీతిమాలిన పనిచేసి దుఃఖపడేవాడిని రక్షించేవాడే బంధువు. కాని సహాయం చేయకుండా నువ్విలా చేశావు, అలా చేశావు అని దేప్పేవాడు బంధువు కాదు. స్నేహితుడు కాదు”.

రావణుడిని సమాధానపర్చిన కుంభకర్ణుడు

ఈ విధంగా రావణుడు చెప్పగా ఇక వాడికి నీతులు చెప్పి ప్రయోజనం లేదని భావించాడు కుంభకర్ణుడు. వాడికి తియ్యగా మంచిమాటలు చెప్పాడిలా. "రాక్షసరాజా! ఇకచాలు. బాధపడవద్దు. కోపం వదలుకో. యథాప్రకారం నీ మనస్సును కలతలేకుండా వుండనివ్వు. నేను బతికి వుండగా దీనిని మనస్సులో వుంచుకోవద్దు. ఎవడివల్ల నీకింత కష్టం కలిగిందో వాడిని చంపుతాను. నీ మేలుకోరే వాస్తవాన్ని, హితాన్ని చెప్పాను. అది నీకు రుచించలేదు. నా ఇష్టప్రకారం నువ్వు రానప్పుడు, నీ ఇష్టప్రకారంనేను రావాలి కాబట్టి, అసమానమైన నా శౌర్యంతో యుద్ధం చేసి నీ పగ తొలగిస్తాను. సర్వ రాక్షసులు రాముడు చావగా నన్ను ప్రీతితో చూద్దురు గాక. సుగ్రీవుడు చిన్న-చిన్న తున్కలై కుప్పగా నేలవాలి ఏగతి పట్టునో చూడు. రాముడు మొదట నన్ను యుద్ధంలో చంపితే ఆ తరువాత నిన్ను చంపకుండా వదలడు. ఎందుకంటే అతడు బలశ్రీమహితుడు కాబట్టి లక్ష్మీవంతుడికి పరాజయం వుండదు. ఇది సత్యం. నేను యుద్ధంలో అవమాన పడతానన్న విచారం నాకు లేదు. కాబట్టి నన్నే పంపు. నేను చేతిలో త్రిశూలం తీసుకుని యుద్ధంలో వుండగా నన్ను ఎదిరించడానికి ఇంద్రుడు, అగ్ని, వాయువు కూడా సరిపోరు. శత్రువులంతా చావరా?”

“ఏ ఆయుధమూ లేకుండా ఉత్త చేతులతో పోయి విరోధులను నలిపినప్పుడు ప్రాణాలమీద ఆశకలవాడెవడూ నన్నెదిరించి నిలబడగలడు? నాకు బాణాలెందుకు? కత్తులెందుకు? గద ఎందుకు? శక్తి ఎందుకు? ఇవన్నీ ఎవరికి? దేహబలం సరిపోనివారికి మాత్రమే కాని నాకెందుకు? నేను వుత్తచేతులతోనే ఇంద్రుడిమీదకు కూడా యుద్ధానికి పోగలను. వాడిని ముద్ద చేస్తాను. నా పెద్ద పిడికిటి పోటును రాముడు సహించి బతికితేకదా, అతడి బాణాలు నన్ను చంపేది? నా గుద్దుతోనే రాముడు చనిపోయిన తరువాత అతడు నన్నేమి చేయగలడు? నేను జీవించి వుండగా రాక్షసరాజా! ఎందుకు దుఃఖిస్తావు? వేగంగా పోయి శత్రుసమూహాల గర్వం అణుస్తాను. రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను మిగతా పెద్ద కోతులను నేను చంపుతాను. రాముడివల్ల భయం వదులుకో. నీకు అసమానమైన కీర్తి కలుగుతుంది. ఇంద్రుడిని, బ్రహ్మను

కూడా చంపగలను. నేను కోపగిస్తే దేవతాసమూహం నేలతో సహా చాపలాగా పడిపోతుంది. యముడిని చంపుతాను. సర్వభక్షకుడిని భక్షిస్తాను. నక్షత్రాలతో సహా సూర్యుడిని నేలపడదోస్తాను. ఇంద్రుడిని యుద్ధం అనే యజ్ఞంలో పశువుని చేస్తాను. వరుణుడి కొంప నాశనం చేస్తాను".

"బలగర్వంతో కులపర్వతాలను పిండిపిండిగా దంచుతాను. భూమిని తునకలు-తునకలుగా చేస్తాను. ఇన్నాళ్లు నిద్రపోయిన కుంభకర్ణుడు తన బలంతో, తేజంతో వానరులను భక్షిస్తుంటే భూతసమూహాలు బాధపడి మూర్ఛపోతారు. గర్వంతో మూడు లోకాలను భుజించినప్పటికీ సంతుష్టిలేదు. శ్రీరాముడిని చంపడం వల్ల నీకు స్థిరమైన సౌఖ్యం ఇవ్వడానికి నేను యుద్ధానికి పోతాను. రామలక్ష్మణులను రక్షించే సమస్త వానర సేనను మింగి సంతుష్టి చెందుతాను. నువ్వెందుకు విచారపడ్తావు? నేను యుద్ధానికి పోతాను. నువ్వు చింతవిడిచి కోరికలనన్నింటినీ అనుభవించు. చేయాల్సిన పనులన్నీ చేయి. రామవిభుడు నా చేతిలో చావగా అక్షయంగా నీకు రమణి సీత దొరుకుతుంది. ఎందుకు విచారపడ్తావు?

సర్గ-64

కుంభకర్ణుడి వాదనను ఖండించిన మహోదరుడు

ఈ విధంగా కుంభకర్ణుడు చెప్పగా విని సంతోషించని మహోదరుడు ఇలా అన్నాడు. "నువ్వు గొప్ప వంశంలో పుట్టావుకాని ఆ వంశంలో పుట్టినవారికి వుండాల్సిన బుద్ధులు లేవు. గర్వం మాత్రం వుంది. పామరుల ఆలోచకలవాడా! పైపైన చూశావే కాని కార్యం లోపలకు పోయి చూసినవాడివి కాదు. కాబట్టి పిల్లతనంతో నోటికి వచ్చినట్లు వాగావు. నీతికి, దుర్నీతికి తేడా రావణుడికి తెలియదా? నీకు తెలిసినంత మాత్రం ఆయనకు తెలియదా? అన్నీ చక్కగా రాజుకు తెలుసుకదా? తెలియక చేయలేదు. రాజు దేశకాలాలను ఆలోచించలేదన్నావు. ఆలోచన ఏ దేశంలో చేయాలి? అడవిలో ఎవరూలేని చోట ఒంటరిగా చేయాల్నా? తన వూళ్లో, తన ఇంట్లో, తనకు కావాల్సినవారున్న చోట చేయాల్నా? తగిన సమయంలో ఆలోచించలేదన్నావు. యుద్ధం చేయడానికి శత్రువులు వచ్చినప్పుడు ఆలోచించాల్నా? ఎప్పుడో శత్రువులు రాబోతున్నారని ముందుగానే యుద్ధ ప్రయత్నం గురించి ఆలోచించాల్నా? శత్రువుల జాడే తెలియనప్పుడు ఎవరితో ఏమి ఆలోచించాలి? కుంభకర్ణుడా! మన రాజు సర్వ శాస్త్రాలు తెలిసిన పండితుడు. అలాంటివాడు కేవలం తన బలాన్నే నమ్ముకుని క్షుద్ర బుద్ధిలాగా పెద్దల సేవ చేయనివాడిలాగా కార్యం చేస్తాడని నువ్వెలా అనుకున్నావు?"

"ధర్మం, అర్థం, కామం వేర్వేరు ఫలాలని, ఫలితాలను ఇస్తుందని నువ్వు చెప్పావు. ఏది ఎలాంటి ఫలం, ఫలితం తప్పక ఇస్తుందో నువ్వు నిశ్చయించి చెప్పగలవో తెలియచేయి. ధర్మమే ధర్మ ఫలం ఇస్తుందని నియమం కలదు కదా?

అర్థం వల్ల, కామం వల్ల ధర్మఫలం కలగకూడదా? ధర్మం సుఖం తప్ప కష్టం కలగ చేయదా? స్వర్గాది సుఖాలకొరకు యజ్ఞం చేసేటప్పుడు, యజ్ఞం చేసే ముందర ధనార్జనాదులకు, చేసేటప్పుడు శరీరాయాసనానికి, చెసిన తరువాత అగ్ని సంరక్షణాది కార్యాలవల్ల కష్ట ఫలం కలగడం లేదా? అలాగే అధర్మమని నువ్వు చెప్పే జారత్వ, చోరత్వంలో సౌఖ్యం లేదా? తన భార్యవల్ల కలిగే సౌఖ్యం పరుల భార్యవల్ల కలగదా? కష్టపడి సంపాదించిన ధనం వల్ల కలిగే సౌఖ్యం దొంగతనంగా సంపాదించిన ధనం వల్ల కలగదా? కాబట్టి ధర్మాధర్మానికి ఫలనియతిలో ఎలాంటి ప్రమాణం లేదు. ఐహికాది ఫలాలు కావాలంటే కర్మమే కదా చేయాలి? కర్మం చేయకపోతే ఫలం లేదు. కాబట్టి సుఖం కోరినప్పుడు ఏ కర్మం చేస్తే సుఖం కలుగునో ఆ కర్మే చేయాలి. తరువాత ఆ కర్మ ఏ ఫలం ఇవ్వాలో దాన్నే ఇస్తుంది. కాబట్టి అది చేస్తే ఇది వస్తుంది అనడం సరికాదు. పాపాత్ములు సుఖాన్ని అనుభవిస్తూ మంచి స్థితిలో వుండడం మనం చూడలేదా? ధర్మానికి, అర్థానికి కారణమైన పుణ్య కర్మం శ్రేయస్సు కలిగించినట్లే అధర్మం అనర్థాన్ని, శుభాన్ని రెంటినీ కలిగిస్తుంది. అధర్మం అనర్థమైన పాపాన్నే ఘటింపచేయడం కాకతీళీయంగా ఎక్కడో కాని సంభవించదు. అనుభవం ఇలా వుండగా నువ్వే ఆధారం చేసుకుని ధర్మమే సత్ఫలితాన్ని ఖచ్చితంగా ఇస్తుందని సిద్ధాంతం చేస్తావు?".

"పాపసంపర్కం లేని పుణ్యకార్యాలకు ఈ లోక సుఖాలు, పరలోక భోగాలు విశేషంగా లభిస్తాయని లోకులు కొందరు పుణ్యకార్యాలే చేస్తారు. కొందరు ఏ నియమం లేకుండా తమ ఇష్టప్రకారం కార్యాలు చేసినప్పటికీ సంపదలు వస్తాయి. ధర్మాధర్మాలకు ఫల నియతి వుంటే, ఇలా జరగడానికి కారణం ఏమిటి? బుద్ధిమంతుడా చెప్పు. ఫలాన్ని బట్టి పుణ్యకర్మమని, పాపకర్మమని చెప్తున్నాం. ఈ కర్మానికి ఈ ఫలం అనే నియతి ఎప్పుడు లేదో అది పాపకర్మం, ఇది పుణ్యకర్మమని పేరు అప్పుడే లేదు. కాబట్టి, సుఖకరమని తోచిన పనే చేయాలి. దాని ఫలం అనుభవించాలి. దొంగతనం కాని, రంకుతనం కాని సుఖం ఇస్తే అదే పుణ్యకార్యం. అదే ధర్మం. ఇది వాస్తవ విషయం. దీనికి శాస్త్రం ప్రమాణం కాదేమో కాని బుద్ధి ప్రధానం".

"ధర్మం వల్లనే సుఖం, అధర్మం వల్ల సుఖం లేదనే నియతి మతం అంటే, కర్మములందు ధర్మం, అధర్మం అనే భేదం లేదు అనే మతం కలవాడు రావణుడు కాబట్టి సీతవల్ల సుఖపడాలనుకుని ఆమెను అపహరించి తెచ్చాడు. ఇది

దోషమా? మా మతంలో కాదు. రాజు అలా చేస్తే మాకు సమ్మతమే. కాబట్టి రాజు న్యాయాన్యాయాలు విచారించకుండా, తెలియక చేశాడనడం సరైందికాదు. తెలిసే అది సరైన కార్యమే అని నిర్ణయించే చేశాడు. ఇక శత్రువుల విషయంలో రాజేం సాహసం చేశాడు? తన రాష్ట్రంలో, అడవిలో దిక్కులేక ఒంటరిగా వున్న ఒక స్త్రీని సుఖపెట్టాలనుకుని తెచ్చాడు కాని, ఎవర్నైనా బాధించాడా? కాబట్టి రాజు చేయకూడని పనేం చేశాడు? చెప్పగలవా? ఇక నువ్వు తోడెవారూ లేకుండా యుద్ధానికి పోతానంటున్నావు. ఇది నువ్వు బలగర్వం వల్ల చెప్పావు కాని ఔచిత్యం ప్రకారం చెప్పలేదు. ఎలా అంటావా? చెప్తా విను".

"శౌర్య సంపత్తికల జనస్థానంలోని వీరులను సంహరించిన పరాక్రమవంతుడిని, ఇప్పటికీ ఖరదూషణాదుల ఆప్తులు భయంతో స్మరిస్తున్నారో అలాంటి శ్రీరాముడిని నువ్వా ఒంటరిగా పోయి ఎదిరించగల సమర్థుడివి? పరాక్రమానికి స్థానమైన వాడిని, మేరలేని శౌర్యం కలవాడిని అయిన రాముడిని బుద్ధిలేనివాడు నిద్రపోయే పామును లేపినట్లు లేపుదామనుకుంటున్నావా? ఇక్కడ లంకలో వున్నవారందరూ సేనలతో యుద్ధభూమికి పోలేమని అనుకుంటుంటే రాముడిని ఎదిరించడానికి నువ్వొక్కడివే పోతాననడం తగిన పనిగా నాకు తోచడంలేదు. మనుష్యులలో రాముడికి సమానమైన వారు లేరు. ఇంద్రుడికి రాముడు సమానుడు. అతడితో యుద్ధానికి ఎందుకు పోతావు? పోతే కీడు కలగదా?".

ఇలా అంటూ మహోదరుడు రావణుడిని చూసి "జానకి నీ స్వాధీనంలోనే వుందికదా? చేతిలో వున్నదాన్ని నువ్వెప్పుడు కోరుకుంటావో అప్పుడే వశమైపోయే ఉపాయం చెప్తాను" అంటాడు.

రావణుడికి ఉపాయం చెప్పిన మహోదరుడు

"రావణా!వినడానికి నీకు ఇష్టం వుంటే విను. కుంభకర్ణుడు, నేను, ద్విజిహ్వుడు, వితర్దనుడు, సంహాద్రి రాముడిని చంపడానికి యుద్ధానికి పోతారని వూరిలో చాటింపు చేయించు. మేమలాగే పోయి మా శక్తికొద్దీ రాముడితో పోరాడుతాం. మేమే జయిస్తే ఇంకే ఉపాయం అక్కరలేదు. ఒకవేళ మేమెంత సాహసం చేసినా రాముడే గెలిస్తే అప్పుడు చేయాల్సిన ఉపాయం ఒకటి వుంది. ఇదంతా నేను ముందే ఆలోచించి వున్నాను. పౌరుషంతో యుద్ధం చేసి రాముడిని గెలిచినట్లయితే రామలక్ష్మణులను చంపామని సింహనాదాలు చేస్తూ వచ్చి

నీపాదాల మీద పడతాం. రామలక్ష్మణులు చనిపోయారన్న వార్త చాటింపు చేయి. అప్పుడు నువ్వు మెల్లగా సీత దగ్గరికి పోయి ఆమె మనస్సు సంతోషపర్చు. నీ స్వాధీనం చేసుకో. ఇదే నేను ఇచ్చే ఉపాయం. రాముడు చనిపోయాడని తెలుసుకున్న సీత నువ్వు తప్ప వేరే గతి లేదని నీకు వశపడాలనుకుంటుంది. ఇది నేని నిశ్చయించిన మార్గం. ఇలా చెస్తే నువ్వు సుఖపడతావు. అలా కాకుండా రాముడు బారిన పడ్డావా నీకు కీడు తప్పదు. చస్తావు. కాబట్టి ఇక్కడే సుఖంగా, సంతోషంగా వుండు. యుద్ధభూమికి పోయే ప్రయత్నం చేయవద్దు. యుద్ధం చేయకపోతే సుఖం, లాభం కలుగుతుంది. నామాట గౌరవించు. శత్రుసేన ఏ పక్కన వుంటే ఆ పక్క నువ్వు చూడనుకూడా వద్దు. అలా చేసి ప్రాణభయం లేకుండా జయం పొందు. యశం, కీర్తి, పుణ్యం, సంపద నువు పొందగలవు".

సర్గ-65
మహోదరుడిని నిందించిన కుంభకర్ణుడు

మహోదరుడు ఇలా చెప్పగానే అతడిని ఛీకొట్టుతూ నిందించి కుంభకర్ణుడు, రావణుడిని చూసి, దుర్బుద్ధి అయిన రాముడిని చంపి అన్న భయం పోగొట్తానని అంటాడు. ఇంకా ఇలా అంటాడు. "శత్రువులు లేనివాడివై మునుపటి లాగానే నువ్వు హాయిగా వుండు. నీరులేని మేఘంలాగా బలం వున్నవారు వ్యర్థంగా గర్జించరు. శత్రువులను జయించి నేను చేసే సింహనాదాన్ని అప్పుడు విను. వీరులు అవమానాన్ని సహించరు. తమ్ముతాము పొగుడుకోరు. శూరులైనవారు బయటకు ఏమీ తెలియనివారిలాగా వుండి పనిబడ్డప్పుడు ఇతరులకు సాధ్యంకాని పనులను సాధిస్తారు. ఓరీ మహోదరా! యుద్ధమంటే భయపడే నీలాంటి పిరికివాళ్లు, పండితులమని తమకుతామే భావించేవారు, మూఢులు, ముఖప్రీతి మాటలు చెప్పేవారు, ఆలోచన చేయడానికి శక్తిలేనివారు, నీలాంటివారు బోధించేవారైనందున మీమాటలు విని రావణుడికి ఈ గతి పట్టింది. చివరకు నగరంలో రాజు ఒక్కడే మిగిలేట్లు చేశారు. ధనకోశాలు, సేన అంతా రూపం లేకుండా చేశారు. ఇంకా ఏమి యుక్తులు చెప్తారు? ఇదివరకు చెప్పినవి చాలు. చేసినవీ చాలు. మీరు దుర్నీతిపరులై చేసిన కీడును యుద్ధానికి పోయి చక్కచేస్తాను". ఇలా అన్న కుంభకర్ణుడిని చూసి రావణుడు ఇలా అన్నాడు.

కుంభకర్ణుడిని ప్రశంసించిన రావణుడు

"రాముడికి భయపడి మహోదరుడు యుద్ధం చేయడానికి ఇష్టపడడు. అది వాస్తవం. నావరకు నాకు నీలాంటి స్నేహశీలి, బలవంతుడు ఇంకొకడు లేడు.

కాబట్టి యుద్ధానికి పో. పగవారిని క్రూరంగా చంపిరా. నా ప్రాణభయాన్ని పోగొట్టు. ఆ ప్రాణభయం వల్లే కదా నిన్ను నిద్రలేపాను. నాకు ఆప్తులైన వారు సహాయం చేయాల్సిన సమయం ఇదేకదా? కాబట్టి యుద్ధానికి పో. అందర్నీ చంపు. నీ ఆకారం చూడగానే ఎక్కడివారక్కడే వానరులు చావరా? రామలక్ష్మణులు గుండెలు పగిలి చావరా?" అని చెప్పిన రావణుడు కుంభకర్ణుడి బలం తెలుసుకనుక ధైర్యంగా భయం వదిలాడు.

ఒంటరిగా యుద్ధానికి పోవద్దని కుంభకర్ణుడికి చెప్పిన రావణుడు

అన్న రావణాసురుడి ఆజ్ఞ ప్రకారం కుంభకర్ణుడు యుద్ధ ప్రయత్నాలు ఆరంభించి, చేత శూలాన్ని ధరించి, అన్నతో తాను ఒంటరిగానే యుద్ధానికి పోతానని తాను వచ్చేదాకా సైన్యాన్ని అక్కడే వుంచమని అంటాడు. వానరులను వరుసపెట్టి మింగుతాననగా రావణుడు అది నీతికాదని, వానరులు అతి బలవంతులనీ హెచ్చరించాడు. మన విరోధులందరినీ చంపమంటాడు. ఇలా చెప్పిన రావణుడు తన అందంతో ప్రకాశించాడు. కుంభకర్ణుడు కూడా అన్నకు ప్రదక్షిణ చేసి కౌగలించుకుని, నమస్కారం చెసి యుద్ధానికి పోయాడు.

యుద్ధానికి బయల్దేరిన కుంభకర్ణుడు

బలశాలైన కుంభకర్ణుడు అన్న ఆశీర్వాదం తీసుకుని సింహనాదం చేస్తూ యుద్ధానికి పోతుంటే ఆయన వెంట శస్త్రాలను ధరించి సింహనాదాలు చేస్తూ భటులు పోయారు. భయంకరాకారుడైన కుంభకర్ణుడు రాక్షసులను చూసి నవ్వుతూ ఇలా అన్నాడు. "రాక్షసులారా! వానరులను కాల్చి వేస్తాను, కాని అలా చేయను, ఎందుకంటే వారేమీ అపరాధం చేయలేదు. మన పట్టణాన్ని ముట్టడించింది రామలక్ష్మణులు, ముందుగా వారిని చంపితే సర్వం నశించినట్లే". ఆయన మాటలకు రాక్షసులు అప్పుడే రామలక్ష్మణులు చనిపోయినట్లు సంతోషించారు. సింహనాదాలు చేశారు. కుంభకర్ణుడు యుద్ధానికి పోతుంటే అనేక అపశకునాలు కనబడ్డాయి. అయినా వాటిని కొంచెమైనా లక్ష్యపెట్టక రాక్షసుడు కాలబలం వల్ల ముందుకు సాగాడు. వానరసేనను అతిశయించిన కోపంతో చూశాడు. వాడిని చూసి వానరసేన చెల్లాచెదరైంది. అలా పోతున్న వారిని చూసి కుంభకర్ణుడు సింహనాదం చేశాడు.

సర్గ–66

కుంభకర్ణుడిని చూసి పరుగెత్తుతున్న వానరులకు ధైర్యం చెప్పిన అంగదుడు

కుంభకర్ణుడిని చూసి కోతి గుంపులు చెల్లాచెదరై చెదిరిన పాదరసంలాగా అయిపోయాయి. పరుగెత్తిపోతున్న నీలుడిని, గవాక్షుడిని, నలుడిని, కుముదుడిని, అంగదుడు సమీపించి బలవంతులైన వారే అలా పరుగెత్తి పోవచ్చా అని అడిగాడు. "వీరులారా! ప్రాణాలను కాపాడుకోవడానికి పరుగెత్తి పోవచ్చా? ఇక్కడ వుండే కాపాడుకోలేరా? మనల్ని రాక్షసులు భయపెట్తే భయపడాలా? అందుకే వారొక బొమ్మను తెచ్చారు. రండి....దాన్ని పడగొడ్దాం. శాశ్వత కీర్తిని సంపాదిద్దాం''.

కుంభకర్ణుడితో పోరాడి, ఓడి పారిపోయిన వానరులు

ఇలా చెప్పగా వానరులు ధైర్యం తెచ్చుకుని మదించిన ఏనుగును కొట్టినట్లు చెట్లతో కుంభకర్ణుడిని కొట్టారు. కుంభకర్ణుడిని తాకిన అవన్నీ వేయి తునకలై పోయాయి. ఆ తరువాత రాక్షసుడు వానరులను తారుమారుగా కూల్చాడు. కూలిన వానరులు కూలగా మిగిలినవారు భయంతో వెనుకకు తిరిగి చూడకుండా నలుదిక్కులా పరుగెత్తారు. అలా పరుగెత్తుతున్న వానరవీరులను అంగదుడు ఆపి అందరూ వినేట్లు పెద్దగా ఇలా అన్నాడు.

వానరుల భయం పోగొట్టి క్రమ్మరించిన అంగదుడు

"వానరశ్రేష్టులారా! పోవద్దు...పోవద్దు. నిలబడండి. యుద్ధం చేయడానికి మరలిరండి. వీరులైన శత్రువులు పరుగెత్తిపోయే మిమ్మల్ని చూసి నవ్వరా? ఇలా మీరు పరుగెత్తి పోతే మీకు లోకంలో కొంచెమైనా సుఖం కాని, కీర్తి కాని కలగదు. మానం కంటే మీ ప్రాణం అంత గొప్పదా? ఆయుధాలు వదిలి, పౌరుషం

కోల్పోయి ఇండ్లకు పారిపోతే మీ ఆడవారే మిమ్మల్ని చూసి నవ్వరా? మగవారికి ఇంతకంటె వేరే మరణం వున్నదా? ముందు మీరు భయం వదలండి. వీడు మనల్ని చంపితే బ్రహ్మలోక సౌఖ్యాలు పొందుతాం.....అలా కాకుండా మనం వీడిని చంపితే శాశ్వత కీర్తితో బతకవచ్చు. వీడి ప్రతాపం రాముడు కనిపించేదాకే కదా? అంతవరకు ధైర్యంతో వుండండి". ఇలా అంగదుడు వారికి చెప్పి వారిని తిరిగి యుద్ధభూమికి మళ్లించాడు.

సర్గ–67
వానరసేనను హతం చేసిన కుంభకర్ణుడు–ద్వివిదుడితో పోరు

యుద్ధభూమికి మరలి వచ్చిన వానరులను కుంభకర్ణుడు మింగుతున్నప్పటికీ మిగిలినవారు ఉత్సాహంగా యుద్ధం చేశారు. అప్పుడు ద్వివిదుడు కోపంతో ఒక శిఖరాన్ని కుంభకర్ణుడి మీదికి విసిరాడు. అది వాడిని తాకకుండా మధ్యలో వున్న గుర్రాలను, రథాలను, ఏనుగులను నాశనం చేసింది. యుద్ధం భయంకరంగా మారింది. రాక్షస రక్తం నేలంతా నిండింది. అప్పుడు రాక్షసులు భయంకరాకారులయ్యారు. వానర సేనమీద పడి రాక్షసులు నరకడం ప్రారంభించారు. ఆ సమయంలో వచ్చాడు హనుమంతుడు.

కుంభకర్ణుడితో పోరాడిన హనుమంతుడు

ఆంజనేయుడు అప్పుడు జడివాన కురిసినట్లు ఆకాశాన తిరుగుతూ కుంభకర్ణుడి తలమీద కొండ శిఖరాలను, చెట్లను వేశాడు. కుంభకర్ణుడు వాటిని తన శూలంతో నరికాడు. అంతే కాకుండా వానర సైన్యాన్ని తన శూలధారతో సంహరించాడు. అప్పుడు ఆంజనేయస్వామి పెద్ద కొండ శిఖరాన్ని కుంభకర్ణుడి మీద వేయగా ఆ గిరి శిఖరం తాకుడుకు అతడు మహావ్యథ చెంది రక్తంతో తడిశాడు. వెంటనే వానర వీరుడి వక్షస్థలాన్ని విరోధులు భయపడే విధంగా చీల్చాడు. హనుమంతుడప్పుడు ప్రలయకాల మేఘం ఉరిమినట్లు ధ్వనించి నేలమీద పడ్డాడు. ఆయన అలా పడడం చూసి రాక్షసులు సింహనాదాలు చేశారు. వానరులు భయపడి పరుగెత్తారు. పరుగెడ్తున్న వానరులను నిలిపిన నీలుడు ఒక శిఖరాన్ని ఎత్తుకుని త్వరగా పోయి కుంభకర్ణుడి మీద వేయగా దానిని వాడు పిడికిటి పోటుతో నేలపడగొట్టాడు.

కుంభకర్ణుడితో పోరిన శరభాదులు

సాహసవంతులైన శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు, ఋషభుడు చెట్లతో, కొడలతో, రాళ్లతో, పిడికిళ్లతో కుంభకర్ణుడిని నలుదిక్కుల నుండి బాధించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. దాన్ని వాడు లక్ష్యపెట్టక ఋషభుడిని కొట్టిన దెబ్బకు అతడు నెత్తురు కక్కుతూపడిపోయాడు. అలాగే మిగతావారిని రకరకాల కొట్టాడు. వారంతా నేలపడ్డారు. అప్పుడు ఒక కోటిమంది వానరులు కుంభకర్ణుడి మీదికి ఒకేసారి పడి కొట్టారు.

వానరులను మింగిన కుంభకర్ణుడు

వానర సమూహాన్ని కుంభకర్ణుడు గరుడు సర్పాలను మింగినట్లు బక్షించాడు. అలా వానరులందరినీ చిటిక వేసేంతలో మింగాడు. వానరుల మరణాలతో నేలంతా నెత్తురు మాంసాలతో తడిచి బురదయింది. వాడెమో వానర సేనను దహించాడు. చావగా మిగిలిన వానరులు రాముడి దగ్గరికి పోయి శరణు జొచ్చారు.

కుంభకర్ణుడితో పోరిన అంగదుడు

విరిగిపోయిన వానరులను చూసి అంగదుడు భయపడకుండా అతి వేగంగా ఒక శిఖరాన్ని తీసుకుని కుంభకర్ణుడి తలమీద వేశాడు. దానికి కోపించిన కుంభకర్ణుడు సింహనాదం చేస్తూ ఒక శూలాన్ని అంగదుడిమీద వేశాడు. యుద్ధ రహస్యం తెలిసిన అంగదుడు లాఘవంగా తనకు శూలం తగలకుండా లంఘించిపోయి తన చేతి దెబ్బతో కుంభకర్ణుడిని కొట్టాడు. వాడు ఆ దెబ్బకు మూర్ఛపోయి, స్మృతి తెచ్చుకుని ఎడమ చేతి ముష్టితో అంగదుడిని గట్టిగా పొడవగా అతడు స్మృతి తప్పి పడిపోయాడు.

కుంభకర్ణుడితో పోరిన సుగ్రీవుడు

అంగదుడు పడిపోగానే కుంభకర్ణుడు తన శూలంతో సుగ్రీవుడి మీదికి పోగా, సుగ్రీవుడు ఒక శిఖరాన్ని ఎత్తుకుని కుంభకర్ణుడితో "వానర వీరులను చంపావు. అమాయక కోతులను చంపడం ఆపు. ఇలా వచ్చి నా కొండ దెబ్బకు కాచుకో" అని అన్నాడు. జవాబుగా కుంభకర్ణుడు, "సుగ్రీవా! నువ్వు బ్రహ్మకు మనుమడివి. ఋక్షరజస్సుడికి కొడుకువి. అయినా ఎందుకు వదరుతున్నావు" అని అంటుండగానే సుగ్రీవుడు కొండ శిఖరాన్ని అతడి మీదికి వేశాడు. అది

కుంభకర్ణుడిని తాకి ముక్కలవగానే రాక్షసులు సింహనాదాలు చేశారు. వానరులు దుఃఖపడ్డారు. కుంభకర్ణుడు కొండ దెబ్బకు బాధ కలిగి ఒక త్రిశూలాన్ని తీసుకుని సుగ్రీవుడి మీద ప్రయోగించాడు. దానికి తటాలున ఆంజనేయుడు అడ్డుపడి దాన్ని విరిచి వేశాడు. వానరులు అప్పుడు సింహనాదాలు చేసి హనుమంతుడిని పొగిడారు. తన శూలం విరిగి పోగానే కుంభకర్ణుడు లంక దగ్గరున్న మలయ పర్వతం శిఖరాన్ని వూడబీకి దాంతో సుగ్రీవుడిని కొట్టాడు.

మూర్ఛపోయిన సుగ్రీవుడిని లంకకు ఎత్తుకుని పోయిన కుంభకర్ణుడు

సుగ్రీవుడు స్మృతి తప్పి పడిపోయాడు. అతడు కదలకుండా-మెదలకుండా నేలపడడం చూసిన రాక్షసులు సింహనాదాలు చేశారు. కుంభకర్ణుడు పడిపోయిన సుగ్రీవుడి దగ్గరికి వచ్చి, అతడిని ఎత్తుకుని లంకకు పోయాడు. సుగ్రీవుడు చిక్కడం అంటే రాముడి సేనంతా చిక్కినట్లే అని కుంభకర్ణుడు భావించాడు. ఇదంతా చూస్తున్న ఆంజనేయుడు తనలో ఇలా అనుకున్నాడు. "కుంభకర్ణుడు చేసినదానికి ప్రతిక్రియగా ధర్మం తప్పకుండా ఏం చేయాలి? ఏదైనా చేయాలి. వూరికే వుండకూడదు. కొండంత దేహం పెంచి ఆ రాక్షసుడిని తన్నాల్నా? అలా చేస్తే సుగ్రీవుడిని విడుస్తాడు. వీడిని చంపినా, సుగ్రీవుడిని విడిపించినా వానరులంతా సంతోషిస్తారు. నిజమే. అయినా నేనెందుకు పరాక్రమం చూపాలి? సుగ్రీవుడే విడిపించుకుని రాకపోతే కదా నేను విడిపించే ప్రయత్నం చేయాలి. సుగ్రీవుడు సామాన్యుడా? వీడికి ఎందుకు వశపడి వుంటాడు? దేవతా శ్రేష్టులు పట్టుకున్నప్పటికీ లక్ష్యం చేయకుండా పరాక్రమంతో తానే విడిపించుకుని వచ్చే దార్ఢ్యం కలవాడు. అలా అయితే ఇప్పుడెందుకు ఇలా వున్నాడు? కొండ దెబ్బలకు స్మృతి తప్పి వుండడం వల్ల ఇలా చిక్కాడు. అల్పకాలంలో స్మృతి వస్తే అతడికి వానర సేనకు ఏది మేలో అదే చేస్తాడు. నేనాయనను విడిపిస్తే అతడి కీర్తి తగ్గుతుంది".

కుంభకర్ణుడి ముక్కు చెవులు కొరికి శ్రీరాముడి దగ్గరికి వచ్చిన సుగ్రీవుడు

లంకకు తీసుకుని పోబడి, మూర్ఛనుండి తేరుకున్న సుగ్రీవుడు, తనను తీసుకువచ్చినందుకు ప్రతీకారంగా ఏం చేయాల్నా అని ఆలోచించాడు. చంకనుండి తటాలున దిగి చివాలున పైకెగిరి, ఏకకాలంలో నోటితో కుంభకర్ణుడి ముక్కు కొరికి, గోళ్లతో చెవులు పెరికాడు. చెవులు, ముక్కు పోగా, దేహం నెత్తురుతో తడవగా కుంభకర్ణుడు సహనం కోల్పోయి, సుగ్రీవుడిని గట్టిగా

పట్టుకుని నేలమీద కొట్టాడు. రాక్షసులు కూడా సుగ్రీవుడిని కొట్టారు. ఇంత జరిగినా సుగ్రీవుడు తన లాఘవం తెలిసే విధంగా ఆకాశానికి ఎగిరి రామచంద్రుడి దగ్గరకు చేరాడు. అక్కడ లంకలో కుంభకర్ణుడు నెత్తుటి ముద్ద అయ్యాడు.

మత్తుడై వానరులను మింగిన కుంభకర్ణుడు

దెబ్బతిన్న కుంభకర్ణుడు నెత్తురు కక్కుతూ ఆయుధం లేకపోయినా యుద్ధభూమికి పోయి ఒక రోకలి లాంటి ముద్గరం తీసుకుని శత్రువులను నాశనం చేశాడు. దొరికిన వానరులను దొరికినట్లే మింగసాగాడు.

కుంభకర్ణుడితో యుద్ధం చేసిన శ్రీరాముడు

కుంభకర్ణుడు తమను తిప్పలు పెట్టుంటే ఏమీ చేయజాలని వానరులు శ్రీరాముడి శరణుజొచ్చారు. అది చూసిన లక్ష్మణుడు కుంభకర్ణుడి మీదికి యుద్ధానికి పోయాడు. కుంభకర్ణుడు లక్ష్మణుడిని లక్ష్యపెట్టక రామచంద్రమూర్తి వున్న చోటుకు పరుగెత్తాడు. అప్పుడు రామచంద్రమూర్తి రౌద్రాస్త్రం సంధించి కుంభకర్ణుడి విశాలమైన రొమ్ము తాకేట్లు వేశాడు. దానికి వాడు చలించి బెదిరిపోయాడు. వాడప్పుడు రాముడి మీదికి పోకుండా వెనక్కు తిరిగి వానరులను తరిమాడు. రామచంద్రమూర్తి వేసిన బాణాల బాదవల్ల వాడి చేతిలో వున్న ఆయుధాలు వాటంతట అవే జారిపడిపోయాయి. అయుధాలు పడిపోవడంతో చేతులతో యుద్ధం చేస్తూ రాక్షసులను, వానరులను మింగుతూ, ఒక కొండ శిఖరాన్ని తెచ్చి వడిగా రాముడి మీదికి వేశాడు. రాముడు దాన్ని ఏడు బాణాలతో ఖండించాడు, ఇది చూసి కోతి గుంపులు రాక్షసుడి మీదికి ఎక్కాయి. రాక్షసుడు తన అవయవాలను విదిలించి వారందరినీ కింద పడవేశాడు. రాముడప్పుడు తీక్షణమైన బాణాలను వాడిమీద ప్రయోగించాడు. అప్పుడు రాముడికి ఎదురుగా కుంభకర్ణుడు పోయాడు.

శ్రీరామ కుంభకర్ణుల సంవాదం

ఎదురుగా వస్తున్న కుంభకర్ణుడిని చూసి రాముడు "రాక్షస శ్రేష్టా! రా రమ్ము. దుఃఖపడవద్దు. నేనే రాముడిని. విల్లు పట్టుకుని సిద్ధంగా వున్నాను. ఇంకెక్కడికి పోతావు? అల్పకాలంలో నిన్ను యముడికి అతిథిగా పంపుతాను. నీ ప్రతాపాన్ని నాశనం చేస్తాను" అన్నాడు. జవాబుగా కుంభకర్ణుడు "రామచంద్రా! నేను విరాధుడిని కాదు. కబంధుడినీ కాదు. వాలిని కాదు. ఖరుడిని కాదు. మారీచుడినీ

కాదు. దేవతా సమూహాన్నైనా చీల్చగల కుంభకర్ణుడిని. నేనే వచ్చాను. నీ బలం, శౌర్య సంపత్తి ఏ మాత్రమో చూసి తరువాత నా సంపూర్ణ పరాక్రమాన్ని సార్థకంగా కనపర్చి నా గొప్పతనం పెరిగేట్లు నిన్ను మింగుతాను". కుంభకర్ణుడు ఇలా చెప్పగానే రామచంద్రమూర్తి వాడి మీద విశేషమైన బాణాలను చిమ్మాడు. వాటి దెబ్బకు వాడు కొంచెమైనా చలించలేదు. కుంభకర్ణుడు రాముడి బాణాలను జలవర్షాలుగా గ్రహించి, వాటిని ఎదుర్కుంటూనే, వానరులను తరిమాడు.

కుంభకర్ణుడి కాళ్లు చేతులు నరికిన శ్రీరాముడు

తాను వేస్తున్న బాణాలు కుంభకర్ణుడిని కొట్టే సామర్థ్యం లేదని గ్రహించిన రామచంద్రమూర్తి వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించి అతడి హస్తాన్ని ఆయుధంతో సహా నేలపడగొట్టాడు. ఆ హస్తం వాడి చుట్టూ వున్న వానరుల మీద పడి వారిని నాశనం చేసింది. చేయి నరకబడిన రాక్షసుడు వేరొక చేతితో సమీపంలోని చెట్టును పీకి దానితో రాముడిని కొట్టడానికి రాగా రామచంద్రమూర్తి ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి ఆ హస్తాన్ని కూడా నరికాడు. అప్పుడు రాక్షసుడు కోపంతో విజృంభించాడు. కాళ్లతో దూకి రథం మీదనుండి కిందకు దిగాడు. రాముడిని మింగడానికి సమీపంలోకి వచ్చాడు. రాముడు వేసిన బాణాలకు కాళ్లు విరిగి స్మృతి తప్పి పడిపోయాడు.

కుంభకర్ణుడి శిరస్సు తెగవేసిన శ్రీరాముడు

అప్పుడు రాముడు ఇంద్రుడి వజ్రాయుధంతో సమానమైన వేగంతో పోగలిగిన, బ్రహ్మాస్త్రంతో సమానమైన ఐంద్రాస్త్రాన్నివిల్లులో సంధించి విడిచాడు. అది పిడుగులాగా పోయి రాక్షసుడి తలను తుంపగా అది తటాలున పైకి ఎగిసి దభాలున నేలమీద పడింది. పడుతూ ఆ పురంలోని ఎత్తైన గోపురాలను, ఇండ్లను, కోటగోడలను నాశనం చేసింది. మొండెం ఎగిసిపడుతూ కోటిమంది వానరులను చంపుకుంటూ పోయి సముద్రంలో పడగా అందులోని పాములు, మొసళ్లు, చేపలు నాశనం అయ్యాయి. వాడి చావుకి భూచక్రం వణికింది. ఆకాశం నుండి దేవతలు సంతోషం వ్యక్తపరిచారు. రావణుడి బంధువులు పెద్దగొంతుతో శ్రీరాముడిని చూసి ఏడిచారు. యుద్ధంలో అలా కుంభకర్ణుడిని సంహరించి రాముడు వానరుల నడుమ ప్రకాశించాడు. కపులు స్తోత్రం చేశారు.

సర్గ–68

కుంభకర్ణుడి మరణం గురించి రావణుడికి చెప్పిన హతశేషులు

చావగా మిగిలిన హతశేషులు, రాక్షసులు రావణుడి దగ్గరికి పోయి, "దేవా! నీ తమ్ముడు కుంభకర్ణుడు విరోధులను భయభ్రాంతులను చేసి, అల్పకాలం కీర్తికరంగా యుద్ధం చేసి, వానరులను చంపి, చివరకు రామచంద్రమూర్తి చేతుల్లో కాళ్లుచేతులు నరకబడిన వాడై, చనిపోయాడు. వాడి తల వాకిట్లో అడ్డంగా పడి వుంది. మొండెం సముద్రంలో పడి జీవజంతువులను నాశనం చేస్తున్నది" అని చెప్పారు. యుద్ధంలో కుంభకర్ణుడు చనిపోయాడని విన్న రావణుడు సహించరాని దుఃఖంతో గాఢంగా మూర్ఛపోయి నేలమీద పడ్డాడు. యముడితో సమానుడైన తమ పినతండ్రి చనిపోయాడన్న వార్త విని, త్రిశిరుడు, అతికాయుడు, దేవాంతకుడు, నరాంతకుడు వికలమైన మనస్సులతో కుంభకర్ణుడి గుణగణాలను వర్ణించసాగారు.

కుంభకర్ణుడి మరణానికి దుఃఖపడ్డ రావణుడు

"అనాయాసంగా దేవదానవ సమూహాల గర్వమణచిన సమర్థుడివైన నువ్వు, అగ్నితో, రుద్రుడితో సమానమైన నువ్వు, యుద్ధంలో ఒక్క రాముడి చేతిలో చనిపోయావా? ఏమి ఈ ఆశ్చర్యం? సామాన్యుడైన రాముడి చేతిలో చనిపోయావా? ఔరా చిత్రం! నువ్వు చావడం, మేం ఏడ్వడం విన్న వానరులు నగరంలో నలుదిక్కులా వస్తారు. ఇక ఇప్పుడు ఇంద్రుడు నామీద దండయాత్రకు వస్తే ఎలా జయించాలి? విభీషణుడి మాట లక్ష్యపెట్టకపోతినే? ఇప్పుడు ఏం చేయాలి? ధర్మయుక్తమైన గొప్ప మనస్సుకల విభీషణుడిని వెడలగొట్టాను. ఆ పాపమే ఇలా చేస్తున్నది, ఇప్పుడేం చేయాలి".

సర్గ–69

రావణుడికి దుఃఖశాంతి వాక్యాలను చెప్పిన త్రిశిరుడు

ఇలా ఏడుస్తున్న రావణుడిని చూసి త్రిశిరుడు అనేవాడు ఈ విధంగా అన్నాడు. "తండ్రీ! నువ్వు చెప్పినట్లు నీ తమ్ముడు చాలా గొప్పవాడే. నిజమే. అయినా దైవవశాన శత్రువుల చేతికి చిక్కి చచ్చిపోయాడు. పరాక్రమవంతులకు యుద్ధంలో ఇలా జరగడం స్వభావసిద్ధమే. కాబట్టి బుద్ధిమంతులైన నీలాంటి వారు దానికి గోలుగోలున ఏడవడం ఉచితంకాదు. నువ్వు ఇలా నీచుడిలాగా ఏడవవచ్చా? ముల్లోకాలను నువ్వు యుద్ధంలో జయించగల శక్తికలవాడివి. నీకు బ్రహ్మదేవుడు ఇచ్చిన బాణాలు, విల్లు, శక్తికవచం, మేఘధ్వని కలిగిన వేయి కంచారగాడిదలు కట్టిన రథం, అన్నీ అమోఘంగా వున్నాయి కదా? అయినా ఈ ఆయుధాలతో నీకేం పని? నువ్వు చేతిలో ఆయుధం లేకుండానే ఎన్నోసార్లు దేవదానవులను జయించలేదా? అలాంటి నువ్వు ఇప్పుడు సమస్తాయుధాలతో పోయి నీ భుజబలంతో రామచంద్రుడిని దండించు. ఆ మాటకొస్తే, అసలు నువ్వెందుకు పోవాలి? నువ్వు సుఖంగా నీ ఇష్టప్రకారమే వుండు. నేను పగతీర్చుకుంటాను. నీ శత్రువులను చీల్చి చెండాడుతాను. రామచంద్రుడిని సంహరిస్తాను".

ఇలా త్రిశిరుడు చెప్పడంతో రావణుడు సంతోషపడి దుఃఖం మానాడు. ఆ తరువాత యుద్ధోత్సాహంలో వున్న దేవాంతక, నరాంతక, అతికాయ, త్రిశిరుడు, మత్త, యుద్ధోన్మత్తులను పిలిపించాడు. (మత్తుడు, యుద్ధోన్మత్తుడు అనేవి మహోదర, మహాపార్శ్వులకు పర్యాయ నామాలు). ఆ రావణుడి కొడుకులంతా ఆకాశాన తిరగ్గలరు. అందరూ మాయలలో పండితులే. అందరూ దేవతలా గర్వం అణచినవారే. అందరూ యుద్ధంలో జయించనలవి

కానివారే. అందరూ శౌర్యం, ధైర్యంకలవారే. అందరూ ప్రసిద్ధికెక్కిన కీర్తిమంతులే. అందరూ యుద్ధంలో పరాజయం ఎరగనివారే. అందరూ వరాలు పొందినవారే.

దేవాంతక, నరాంతక, అతికాయ, త్రిశిర, మత్త, యుద్ధోన్మత్తులను యుద్ధానికి పంపిన రావణుడు

దేవాంతక, నరాంతక, అతికాయ, త్రిశిర, మత్త, యుద్ధోన్మత్తులను పిలిపించిన రావణుడు, వారందరినీ యుద్ధానికి పంపాడు. సర్వ ఔషధులైన గంధాలను ఆ ఆరుగురు వేర్వేరుగా పూసుకుని భుజబల గర్వంతో వానరుల మీదికి యుద్ధానికి వేగంగా పోయారు. దేవాంతకుడు, త్రిశిరుడు, అతికాయుడు, నరాంతకుడు, మహోదరుడు, మహాపార్శ్వుడు భయం లేకుండా యుద్ధానికి బయల్దేరారు. వీరంతా యుద్ధంలో వారివారి శక్త్యానుసారం ప్రకాశించారు. దేవతలు అమరావతిని విడిచి యుద్ధానికి పోయినట్లు సైన్యసమూహంతో రథాలు, ఏనుగులు, గుర్రాలు, ఆయుధాలు ధరించిన కాలిబంట్లు తమ వెంట రాగా వారు లంక విడిచి పోయారు. చావనైనా చావాలి, గెలవనన్నా గెలవాలి అన్నదే వారి ధ్యేయం. వారి సింహనాదాలు, వారి రెట్టలు, వారి పాద ఘట్టనలు ఆకాశాన్ని పగిలేట్లు చేసింది. భూమిని వణికించింది. ఇలా బయల్దేరి యుద్ధ స్థలానికి పోయిన రాక్షసులు, యుద్ధానికై ఎదురు చూస్తున్న దానికొరకు కొండలు, చెట్లు చేతిలో వుంచుకున్న వానరసేనను చూశారు. వారు కూడా రాక్షస సైన్యాన్ని చూశారు.

వానర రాక్షస సేనల యుద్ధం

రాక్షస సేనలను చూసిన వానరులు కొండలు, చెట్లు ఎత్తుకుని కేకలు వేశారు. రాక్షసులు ప్రతిధ్వని చేశారు. వానరులు భయపడకుండా శత్రు సేనలో దూరారు. కొండల రాళ్ళవాన కురిపించారు వానరులు. రాక్షసులు కూడా వెనుదీయక పదునైన బాణాలను వానరుల మీద వేశారు. ఇరు సేనలు పరాక్రమించి యుద్ధం చేశారు. ఇలా రెండు పక్షాలవారు అతివేగంగా యుద్ధం చేయడంతో కాసేపట్లోనే నెత్తురు వరదలుగా పారి భూమి కుంకుమ పరిసినట్లయింది. వానరులు, రాక్షసులు యుద్ధంలో తమ నేర్పరితనాన్ని ప్రదర్శించారు. చివరకు దేవతల స్తోత్రం మధ్య వానర శ్రేష్ఠులు యుద్ధభూమిలో ఇటూ-అటూ తిరుగుతుంటే రాక్షసుల శవాలతో నేల నిండింది.

కపులను చంపిన నరాంతకుడు

వానరుల ధాటిని ఆపడానికి నరాంతకుడు రంగంలోకి దిగాడు. తన శక్తితో వానరులను చాలామందిని క్షణంలో చంపాడు. ఎక్కడ చూసినా తానే అయిపోయి ఇష్టం వచ్చినట్లు తిరుగుతూ, రావణ కుమారుడు భూమంతా నెత్తురు మాంసంతో బురద అయ్యేవిధంగా వానరుల పీనుగులను నింపాడు. తనకు ఎదురులేకుండా నరాంతకుడు విరోధులకు భయంకరుడై వానర సేనను నాశనం చేశాడు. దీంతో, వానరులు ఆ సమయంలో ఒక్కసారిగా పెద్ద పెట్టున దుఃఖించారు.

అంగద నరాంతకుల యుద్ధం

వానరులు ఇలా పడిపోవడం చూసిన సుగ్రీవుడు, అంగదుడితో నరాంతకుడిని చంపమని చెప్పాడు. రాజాజ్ఞమేరకు అంగదుడు నిరాయుధుడై, గోళ్లు మాత్రమే ఆయుధంగా కలవాడై, రాక్షసరాజు కొడుకు నరాంతకుడి మీదికి యుద్ధానికి పోయాడు. పోయి, రాక్షసుడితో, “రాక్షస శ్రేష్టా! సామాన్యమైన కోతి గుంపును ఎందుకురా చంపుతావు? దానివల్ల నీ బలం పెరుగుతుందా? కీర్తి కలుగుతుందా? ఫలం ఏదైనా వుంటుందా? ఏదీ చూపించి నీ బలం. నువ్వు గొప్పదని భావిస్తున్న నీ ఈటెను నా రొమ్ము మీద వేయి” అని నరాంతకుడికి సవాలు విసిరాడు. ఆ ఆమాటలకు కోపం తెచ్చుకున్న నరాంతకుడు నాగుపాములాగా బుసలు కొట్టుతూ అంగదుడి రొమ్ముమీద తన బలం కొద్దీ ఈటెను ప్రయోగించాడు. ఆ ఈటె అంగదుడి రొమ్ముకు తగిలి తునకలై పోయింది. అది చూసి అంగదుడు రాక్షసుడి మీద పడ్డాడు. వాడి గుర్రాన్ని ఒక గుద్దుకు చంపాడు. కోపంతో ప్రతిగా నరాంతకుడు వాలి కొడుకు తలమీద ఒక గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు వానరుడు నేలమీద పడిపోయి అతికష్టం మీద స్మృతి తెచ్చుకున్నాడు. తెచ్చుకుని, చివాలున లేచి, తన దృఢమైన పిడికిలితో రాక్షసుడి రొమ్ము నలిగిపోయేట్లు పొడిచాడు. ఆ దెబ్బకు వాడు దూరంగా కొట్టుకు పోయి కొండలాగా పడిపోయాడు. నరాంతకుడు అలా చనిపోయాడు. అంగదుడు చేసిన పనికి వానరులంతా సంతోషించారు.

సర్గ–70
దేవాంతక, మహోదర, త్రిశిరులతో పోరిన అంగదుడు

నరాంతకుడు చావడం చూసిన త్రిశిరుడు, మహోదరుడు, దేవాంతకుడు బాధపడి ఒక్కసారిగా సాహసం చేసి, అంగదుడిని తాకి బాధించారు. అంగదుడు ఒక చెట్టును పీకి దేవాంతకుడి మీద వేయగా దాన్ని త్రిశిరుడు ఖండించాడు. కోపంతో అంగదుడు చెట్లవాన కురిపించాడు. త్రిశిరుడు వాటినీ ఖండించాడు. త్రిశిరుడు, మహోదరుడు, దేవాంతకుడు ఒకరి వెంట ఇంకొకరు అంగదుడిని చుట్టుకున్నారు. అయినా అంగదుడు భయపడక ఒక ఏనుగు తలమీద కొట్టగా అది నేలమీదపడి ఘీంకారం చేసింది. అప్పుడు అంగదుడు ఏనుగు దంతం పీకి దాంతో దేవాంతకుడిని కొట్టాడు. వాడు ఆ దెబ్బకు నేలకొరిగి, తెప్పరిల్లి అంగదుడిని గుదియతో కొట్టాడు. త్రిశిరుడు బాణాలను వేశాడు అంగదుడి మీదికి.

హనుమంతు చేతిలో చనిపోయిన దేవాంతకుడు

నీలుడి చేతిలో చనిపోయిన మహోదరుడు

ఇలా ముగ్గురు రాక్షసులు బాలుడైన అంగదుడిని తాకిన సంగతి తెలుసుకున్న హనుమంతుడు, నీలుడు ఆ దిక్కుగా వచ్చారు. నీలుడు త్రిశిరుడితో, హనుమంతుడు దేవాంతకుడితో యుద్ధం చేశారు. హనుమంతుడి పిడికిటి పోటుపుకు దేవాంతకుడు చచ్చాడు. నీలుడు చెట్లతో కూడిన ఒక పర్వతాన్ని తీసుకుని మహోదరుడి మీద వేయగా వాడు దాని తాకిడికి నేలకూలి చచ్చాడు. పినతండ్రి చావు చూసిన త్రిశిరుడు హనుమంతుడిని బాణాలతో నొప్పించాడు.

హనుమంతుడి చేతిలో చనిపోయిన త్రిశిరుడు

త్రిశిరుడి బాణాలకు బదులుగా హనుమంతుడు ఒక కొండ శిఖరాన్ని వాడిమీదికి వేయగా రాక్షసుడు దాన్ని తన బాణంతో పొడి చేశాడు. హనుమంతుడి చెట్లవానను కూడా వాడు ధైర్యంగా ఎదుర్కున్నాడు. ఇరువురూ ఆ తరువాత ద్వంధ యుద్ధానికి దిగారు. హనుమంతుడి అరచేతి దెబ్బకు వాడు స్వాధీనం తప్పి కిందపడ్డాడు. తిరిగి తెప్పరిల్లి యుద్ధం కొనసాగించాడు. హనుమంతుడు అప్పుడు తన కత్తితో త్రిశిరుడి మూడు తలలను నరికి వేశాడు.

ఋషభుడి చేతిలో చచ్చిన మత్తుడు

దేవాంతక, నరాంతక, మహోదర, త్రిశిరులు యుద్ధంలో అసాధ్యులు. అయినా శత్రువుల చేతిలో చచ్చారు. వారి చావుతో కోపించిన మహాపార్శ్వుడు గదను ధరించి వానరులను పారతోలుతుండగా ఋషభుడు ఎగిరిపోయి వాడి ముందు నిలబడ్డాడు. నిలబడిన ఋషభుడిని పెద్ద గదతో కొట్టాడు మహాపార్శ్వుడు. కోపంతో ఋషభుడు వాడిచేతిలో గదను గుంజుకుని వాడినే కొట్టాడు. ఆ దెబ్బకు వాడు పెద్ద పర్వతం పడ్డట్లు పడిపోయి, ప్రాణం పోయి చచ్చాడు. వాడు పడిపోయిన వెంటనే భయపడ్డ రాక్షసులు తమ సామర్థ్యం అంతా చూపి పరుగెత్తారు.

సర్గ–71
కపులను పారతోలిన అతికాయుడు

తన తోడ బుట్టినవారు, పినతండ్రులు, చావగా అతికాయుడు రథాన్ని ఎక్కి గర్జిస్తూ, వానరులను అదిలిస్తూ తరమసాగాడు. వానరులు వాడిని చూసి మరల కుంభకర్ణుడు వచ్చాడేమో అని భయపడ్డారు. వారంతా రామలక్ష్మణుల శరణు కోరారు. వారిని బయపడవద్దని చెప్పిన శ్రీరాముడు విభీషణుడితో ఇలా అన్నాడు.

అతికాయుడిని గురించి విభీషణుడిని అడిగిన శ్రీరాముడు

"విభీషణా! వీడెవ్వడు?కొండంత దేహం వుంది. అపారమైన ఆయుధాలున్నాయి. యముడిలాగా భయంకరమైన ముఖం వుంది. మబ్బుమాటున వున్న సూర్యుడిలాగా వున్నాడు. వీడి ముఖం చంద్రుడిలాగా వుంది. వీడెవ్వడు?" అని అడిగిన శ్రీరాముడికి జవాబుగా విభీషణుడు ఇలా అన్నాడు. "రామచంద్రా! యితడు రావణుడికి దాన్యమాలి వల్ల పుట్టాడు. యుద్ధంలో శూరుడు. పెద్దల సేవ చేశాడు. అస్త్రాలు బాగా తెలిసినవాడు. ఉత్సాహవంతుడు. వేదాధ్యయనం చేశాడు. యుద్ధం చేయడంలో మిక్కిలి సమర్థుడు. నీతిశాస్త్రం తెలిసి, సామదాన భేదోపాయాలు ఎరిగినవాడు. వీడి పేరు అతికాయుడు. వీడు బ్రహ్మను సంతోషపరచి దేవతలవల్ల చావులేకుండా వరాలు పొందాడు. అభేద్య కవచాన్ని, ఇప్పుడు వీడెక్కిన రథాన్ని సంపాదించాడు. యక్షులను, దేవతలను, దానవులను తరిమికొట్టి రాక్షసులను రక్షించాడు. రాక్షసులలో బుద్ధిమంతుడు. బలవంతుడు. వీడి చేతిలో వానరులు చావకముందే వీడిని చంపు".

ఇలా విభీషణుడు చెప్తుతున్నప్పుడే రాక్షసుడు యుద్ధాన్ని ప్రారంభించాడు.

వాడి సింహనాదాలను సహించలేక వానరులు ఎక్కడివారక్కడే చెల్లాచెదరై పోయారు. అతికాయుడు వారిని తరుముకుంటూ రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు. వచ్చి, గర్వంతో ఇలా అన్నాడు.

లక్ష్మణుడిని తూలనాడిన అతికాయుడు

"రామా! విల్లు, బాణాలు ధరించి వచ్చాను. బలపరాక్రమాలు ఉన్నవాడిని నేను. సామాన్యులమీద నా బాణాలు ప్రయోగించను. కాబట్టే వానరులను బాధపెట్టకుండా నీ మీదికి వచ్చాను. రథం మీద వున్నాను. ఇక్కడ వున్న నీ సేనలోని వాడెవరైనా సమర్థుడు వుంటే నాతో యుద్ధానికి ముందరికి రానివ్వు". అనగానే లక్ష్మణుడు చివాలున వాడి ముందరికి వచ్చి, నిలబడి, వాడైన బాణాలను బయటకు తీశాడు. అతికాయుడు అతడి బాణాల ధ్వని విని ఇలా అన్నాడు. "ఓరీ! మనుష్యుడా! పుట్టుకతోనే మనుష్యులను తినే మాతో యుద్ధం చేసే యోగ్యత నీకు లేదు. అందునా నువ్వు పిల్లవాడివి. నువ్వా నాతో యుద్ధం చేయడానికి వచ్చావు? పో...పో. మృత్యువులాంటి నన్నా నువ్వు ఎదిరించి నిలుస్తావు? నీ బలం నువ్వు ఆలోచించలేక పోతున్నావు. నా ఎదుటికి రాబోకు. విల్లు, బాణాలు పారేసి పో. పోనని కండపొగరుతో నిలుస్తావా? ఇప్పుడే ప్రాణాలు వదిలి యమపురికి పోతావు. ఓ మనుష్యుడా! నాబాణం శివుడి త్రిశూలంతో సమానమైనది. చక్కగా చూడు. సర్పాల్లాంటి నా బాణాలు నీ రక్తాన్ని తాగుతాయి".

అతికాయుడిని ధిక్కరించి పలికిన లక్ష్మణుడు

ఈ ప్రకారం మాట్లాడిన అతికాయుడు బాణాలను విల్లులో సంధించాడు. ఆ మాటలకు నిప్పులు కక్కుతూ లక్ష్మణుడు "ఓరీ! రాక్షసుడా! మాటలు చెప్పడంతోనే నువ్వు గొప్పవాడివి కావు. ఎందుకు వృధాగా వదురుతావు? నీ శక్తి చూపించు. అలంకారంగా నువ్వు ఎన్నో శస్త్రాలను దేహం నిండా ధరించావు. నాకు ఒక్క విల్లు తప్ప ఏ ఆయుధం లేదు. నువ్వు రథం మీద వున్నావు. నేను కింద నేలమీద రెండు కాళ్లమీద నిలబడి వున్నాను. నీ బలమెంతో బాణాలతోనైనా, అస్త్రాలతోనైనా చూపరాదా? నీ బలం చూసి నా బాణాలతో నీ తల పడగొట్టుతా. నా బాణాలు నీ దేహంలోని నెత్తురు తాగడం నువ్వే చూస్తావు. నేను బాలుడినో, వృద్ధుడినో, ఎవరైతే నీకేంటి? నీకు మృత్యువు తప్పదు".

లక్ష్మణ, అతికాయుల యుద్ధం

లక్ష్మణుడు ఇలా అనగానే కోపించిన అతికాయుడు తీక్ష్ణమైన బాణాలను సంధించి వేశాడు. లక్ష్మణుడు సహితం తన బాణాలను వేశాడు. లక్ష్మణుడు వేసిన ఒక బాణానికి అతికాయుడు సహించలేక వణికాడు. ఆ దెబ్బతిని అతికాయుడు లక్ష్మణుడి బాణ శక్తిని మెచ్చుకున్నాడు. ఆ తరువాత ఇరువురి మధ్య యుద్ధం కొనసాగింది. లక్ష్మణుడు ఆగ్నేయాస్త్రం వేస్తే, అతికాయుడు సౌరాస్త్రాన్ని సంధించాడు. అతికాయుడు ఐశీక బాణం వేస్తె, లక్ష్మణుడు ఐందాస్త్రాన్ని వేశాడు. లక్ష్మణుడి బాణాలు అతికాయుడిని చంపలేక పోయాయి.

లక్ష్మణుడి చేతిలో చనిపోయిన అతికాయుడు

లక్ష్మణుడి బాణాలు వ్యర్థమైపోతుంటే వాయుదేవుడు లక్ష్మణుడిని సమీపించి ఇలా చెప్పాడు. "వీడు అభేద్య కవచుడు. అది బ్రహ్మ ఇచ్చిన వరం. వీడు బ్రహ్మాస్త్రంతో చస్తాడు. మిగిలిన ఏబాణాలు కూడా వీడిని చంపలేవు. ఎందుకంటే వీడి కవచం బ్రహ్మావరప్రసాదం. అది బాణాలకు తెగదు. ఇక అస్త్రాలంటావా? అన్ని మహాస్త్రాలు వీడికి తెలుసు. నువ్వే అస్త్రాన్ని వేసినా బదులుగా అస్త్రాన్ని వేయగల సమర్థుడు. కాబట్టి అల్ప ప్రయత్నంతో చచ్చేవాడు కాదు". అని చెప్పగా, లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. దాన్ని శత్రువైన అతికాయుడి మీద వేశాడు. అతికాయుడు దాన్ని ఎదుర్కోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. లక్ష్మణుడు వేసిన బ్రహ్మాస్త్రం వాడి శిరస్సును కవచంతో సహా నేలకూల్చింది. వాడు చావగా మిగతా రాక్షసులంతా ఏడుపు ముఖాలతో లంక దిక్కుగా పరుగెత్తారు. వానరులు లక్ష్మణుడిని స్తోత్రం చేశారు.

సర్గ–72

అతికాయాదుల మృతి విని దుఃఖించిన రావణుడు

యుద్ధ భూమిలో లక్ష్మణుడి బాణాలకు అతికాయుడు చచ్చాడని విన్న రావణుడు దుఃఖంతో ఏడుస్తూ తనవారితో ఇలా అన్నాడు.

"ధూమ్రాక్షుడు, ప్రహస్తుడు, కుంభకర్ణుడు, అకంపనుడు....వీరంతా అత్యధిక శూరులే! భుజబలవంతులే! యుద్ధాసక్తి కలవారే! అయ్యో! ఇలాంటివారా రాముడి బాణాలకు చనిపోయింది? యుద్ధానికి పోయినవారందరూ ధైర్యవంతులు. దేహపుష్టి కలవారు. గొప్ప అస్త్రశస్త్రాలను ప్రయోగించకలవారు. దేవదానవులను చంపినవారు. ఇలాంటివారు చనిపోయారు కదా! నా కొడుకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాలతో అన్నదమ్ములను కట్టిపారేసాడు. దానిని విడిపించడం ఎవరికీ సాధ్యం కాదు. అలాంటివాటిని రామలక్ష్మణులు విడిపించుకున్నారు. ఇదేమన్నా మాయా? వారి మహిమా? లేక బ్రహ్మ మోసగించాడా? లేక, మాకు తెలియని మంత్ర తంత్రాలు వారికి తెలిసి విడిపించుకున్నారా? నేను యుద్ధానికి పొమ్మని పంపిన రాక్షసులు వానరుల బలానికి లోబడి చావడమే కాని తిరిగి రావడం లేదుకదా? రామచంద్రుడిని, సుగ్రీవుడిని, విభీషణుడిని గెలవడానికి సమర్థుడైనవాడు ఒక్కడు కూడా ఈ లంకా నగరంలో వెతికినా కనపడడే! ఆహా! ఏమీ రాముడి పరాక్రమం? ఏమీ ఆ అస్త్రబలం? రాక్షస శ్రేష్టులందరూ ఆయన చేతిలో చచ్చారు కదా? అలాంటి రాముడిని, సర్వక్లేశరహితుడిని విష్ణుమూర్తి, ఆదినారాయణుడుగా నేను భావిస్తాను. ఆయనకాకుండా మరెవ్వరూ ఈ కార్యం చేయలేదు. ఇక లంకంతా మీరు హెచ్చరికగా కాపలా కాయండి".

లంక అంతా కావలి వుంచిన రావణుడు

రావణుడు ఇంకా ఇలా అన్నాడు. "నా ఆజ్ఞలేకుండా ఎవ్వరైనా అశోకవనానికి, సీత వున్న ప్రదేశానికి పోకూడదు. అక్కడున్న వారు బయటకు రాకూడదు. ఇంతవరకు సైన్యం విడిసివున్న గుల్మాలలో మీరు సేనలతో కాపలా వుండాలి. నడిరేయైనా, సాయంకాలమైనా, మరెప్పుడైనా మీరు రహదారులను పరీక్షిస్తూ వుండాలి. శత్రువుల యుద్ధ ప్రయత్నాలు ఆరా తీయాలి. లంకలో దూరాలనుకుంటున్నారా? లేక వేరే ఏదైనా ఆలోచనలో వున్నారా? ఇదంతా సర్వదా మీరు కనిపెట్టి నాకు చెప్పాలి". రావణుడి ఆజ్ఞానుసారం వారు వెళ్ళిపోయారు. కోపంతో తపిస్తున్న రావణుడు సభ విడిచి ఇంటికి పోయి, అతికాయుడు, ఇతర కొడుకుల గురించి దుఃఖపడుతూ, మనస్సులో ఇక ఏం చేద్దామా? అని నిట్టూర్పులు విడిచాడు.

సర్గ–73
రావణుడిని ఓదార్చిన ఇంద్రజిత్తు

ఇలా శోకాతిశయంతో ఏం చేయడానికి తోచక రావణుడు వుండగా ఇంద్రజిత్తు సమీపించి ఇలా అన్నాడు. "నీ కొడుకు, దేవదానవుల గర్వం అణచిన ఇంద్రజిత్తు బతికే వుండగా ఎందుకు దుఃఖపడతావు? ఇంద్రజిత్తు వేసే బాణాల దెబ్బలను సహించగలవాడెవ్వడు? నా బాణాల వర్షానికి రామలక్ష్మణులు నిలబడి పొరలుచుండగా నువ్వే చూస్తావు. రాక్షసేశ్వరా! ఈ ఇంద్రజిత్తు ప్రతిజ్ఞ విను. రామలక్ష్మణులను యుద్ధ భూమిలో భయంకరమైన నా బాణాలతో పడగొట్టుతాను". ఇలా చెప్పి తండ్రి ఆజ్ఞ తీసుకుని వాయువేగం కల గాడిదల రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరాడు.

మొదటిసారి యుద్ధానికి బయల్దేరిన ఇంద్రజిత్తు

రాక్షసులు స్తోత్రం చేస్తూ వెంటరాగా ఇంద్రజిత్తు అగ్నిదత్తమైన గుర్రాలు, విల్లు, బాణాలు, సూతుడు కల రథం ఎక్కి, కనపడకుండా ఆకాశానికి ఎగిరి యుద్ధం చేయమని తన పక్కనున్న రాక్షసులను ప్రేరేపించాడు. అప్పుడు గగ్గురుపాటుకల యుద్ధం జరిగింది.

మాయాబలంతో కపిసేనలను చంపిన ఇంద్రజిత్తు

ఇంద్రజిత్తు పురికొల్పినప్పటికీ రాక్షసులు అతి కష్టం మీద యుద్ధం చేస్తుంటే తానున్నానని భయపడవద్దని అంటాడు. వానరులను చంపమంటాడు. వారప్పుడు ధైర్యం తెచ్చుకుని పరాక్రమించి యుద్ధం చేశారు. ఇంద్రజిత్తు తన బాణాలతో వానరులను చంపాడు. వానరులు కూడా శ్రీరాముడి కొరకు ప్రాణాలమీద ఆశలు వదిలి యుద్ధం చేశారు. ఇంద్రజిత్తును ఎదిరించారు.

ఇంద్రజిత్తు గంధమాదనుడిని,నలుడిని,మైందుడిని,గజుడిని,జాంబవంతుడిని, నీలుడిని, సుగ్రీవుడిని, అంగదుడిని, ఋషభుడిని, ద్వివిదుడిని, తీవ్రమైన బాణాలతో నొప్పించాడు. వానరసేనను అల్లకల్లోలం చేశాడు. అదృశ్యుడై ఆకాశాన్నుండి యుద్ధం చేశాడు. ఆ యుద్ధానికి వానరసమూహం వికార స్వరంతో ధ్వనించింది. హనుమంతుడిని, సుగ్రీవుడిని, అంగదుడిని, జాంబవంతుడిని, మైందుడిని, హరిలోమ–నీలగవాక్ష–గోముఖ–వేగదర్శి–సుశేణ–దదిముఖ–గజులను, ఇంద్రజిత్తు తీక్షణమైన ఆయుధాలతో కొట్టి, మరిన్ని బాణ సమూహాలతో రామలక్ష్మణులను ముంచి విక్రమిస్తున్న ఇంద్రజిత్తు వ్యవహారం చూసి శ్రీరాముడు తమ్ముడితో ఇలా అన్నాడు.

బ్రహ్మ వరం మన్నించి ఓర్చుకొమ్మని లక్ష్మణుడికి చెప్పిన శ్రీరాముడు

"అన్నా! లక్ష్మణా! రావణుడి కొడుకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర బలంతో వానరసేనలను నేలపాలు చేసి మనల్ని బాదిస్తున్నాడు. వీడిని మనం ఎలా జయించగలం? ఇది స్వయంభు భగవంతుడైన బ్రహ్మదేవుడి బాణం. దీని మహిమ చాలా గొప్పది. దీన్ని నాలాగే నువ్వు కూడా ఓర్చుకో. మనమంతా స్మృతి తప్పి ఏ ప్రయత్నం చేయకుండా వుండడం చూసి, జయలక్ష్మిని గ్రహించి, ఇంద్రజిత్తు తన నగారానికి పోతాడు". ఇలా ఆయన చెప్తున్నప్పుడే బాణవర్షం అధికమై, సహించరానిదై, రామలక్ష్మణులు మూర్ఛపోయారు. వారు మూర్ఛపోవడం చూసి సంతోషించిన ఇంద్రజిత్తు వారిని ఓడించిన సంతోషంతో తన నగరానికి పోయాడు.

సర్గ-74
జాంబవంతుడిని వెతికిన విభీషణ, ఆంజనేయులు

ఇంద్రజిత్తు దెబ్బలకు సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు, నీలుడు ఏంచేయాల్నో తోచక భయపడి వుండగా, దుఃఖిస్తున్న వానర వీరులను చూసి విభీషణుడు "కపులారా! రామలక్ష్మణులు పరవశులై పడ్డారని దుఃఖిస్తే లాభం ఏమిటి? ఇది దుఃఖించాల్సిన సమయం కాదు. రాజకుమారులు బ్రహ్మవాక్యం గౌరవించాలి అనుకుని రాక్షసుల బాణాలకు చిక్కారేకాని, పరాక్రమహీనులై కాదు" అన్నాడు. అప్పుడు హనుమంతుడు విభీషణుడిని చూసి ఇలా అన్నాడు. "మహాత్మా! మన సేనలో ఇంకా ఎవరెవరు ప్రాణాలతో వున్నారో వెతికి చూద్దాం". ఆ మాటలకు ఇద్దరూ కలిసి, చావగా మిగిలిన వానరుల కొరకు, వెతికారు.

అనేక రకాలుగా అవయవాలు కోల్పోయిన వానరులను, గంధమాదనుడిని, అంగదుడిని, నీలుడిని, సుగ్రీవుడిని, ద్వివిద సుషేణుడిని, వేగదర్శిని, నలుడిని, పనసుడిని, జ్యోతిర్ముఖుడిని, మైందుడిని, ఆహుకుడిని, గవాక్షుడిని, మిగతా కోతులను కలతపడగా చూశారు. దాదాపు అరవైఏడు కోట్ల వానరులు ఇంద్రజిత్తు చేతిలో చచ్చారు. అప్పుడు హనుమంతుడు, విభీషణుడు జాంబవంతుడిని కనుగొన్నారు.

హనుమంతుడి క్షేమం గురించి విభీషణుడిని అడిగిన జాంబవంతుడు

జాంబవంతుడితో విభీషణుడు ఇలా అన్నాడు. "ఓ గొప్ప మహిమకలవాడా! బాణ సమూహాలు నిన్ను ప్రాణం లేకుండా చేయలేదు కదా!". జవాబుగా, అతికష్టం మీద మాట్లాడడానికి సత్తువ తెచ్చుకున్న జాంబవంతుడు నోరు తెరిచి

ఇలా అన్నాడు. “మహాబలుడివైన రాక్షసరాజా! నువ్వెక్కడ వున్నది నాకు కనపడకపోయినా నీమాట ధ్వనిని బట్టి నువ్వే అని తెలుసుకున్నాను. వాడి బాణాలు నాటుకున్నందున నాకు కళ్ళు బొత్తిగా కనపడడం లేదు. అయ్యా! విభీషణా! అంజనాదేవి ముద్దు బిడ్డ వాయుపుత్రుడు హనుమంతుడు ప్రాణాలతో వున్నాడు కదా? అయ్యా చెప్పు”. అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు. “రామలక్ష్మణులు క్షేమంగా వున్నారా అని అడగకుండా హనుమంతుడు బాగున్నాడా అని ఎందుకు అడుగుతున్నావు? వాస్తవానికి నీకు హనుమంతుడి మీద వున్న ప్రేమ రాజకుమారుల మీద కాని, బాలుడైన అంగదుడి మీదకాని, ప్రభువైన సుగ్రీవుడి మీదకాని లేకపోవడానికి కారణం ఏమిటి?”.

విభీషణుడి ప్రశ్నకు సమాధానంగా జాంబవంతుడు “హనుమంతుడు జీవించి వుండి మన సేనలు హతమైనా మనకు మనుగడ వుంటుంది. అలా కాకుండా హనుమంతుడు లేకుండా మనమంతా బతికున్నా లేనట్లే లెక్క. హనుమంతుడు గమనవేగాన వాయుదేవుడితోను, వీర్యాతిశయాన అగ్నిదేవుడితోను సమానం” అని అన్నాడు. ఇది విన్న హనుమంతుడు ఆ పుణ్యాత్ముడి పాదాల మీద వాలి అభివాదం చేసి, తాను వచ్చానని చెప్పాడు. సంతోషించిన జాంబవంతుడు హనుమంతుడితో ఇలా అన్నాడు.

సంజీవకరణి తెమ్మని హనుమంతుడికి చెప్పిన జాంబవంతుడు

“అన్నా! ఆంజనేయా! నీతో సమానమైన బలవంతుడు నేనెక్కడ వెతికినా కనబడడు. నువ్వు లోకోన్నత శౌర్యశాలివి. లోకంలో అందరికంటే నువ్వు బలవంతుడివి. నీ పరాక్రమం చూపాల్సిన సమయం ఆసన్నమైంది. వానరులను, భల్లూకాలను, రామలక్ష్మణులను సంతోషపెట్టు. నువ్వు సముద్రం దాటి చాలాదూరం పోయి హిమవత్పర్వతం చూసి అక్కడ ఋషభ శైలం, కైలాస పర్వతాలను చూడు. వాటి మధ్యన మిక్కిలి కాంతికలదై సర్వౌషధులు కలిగి అందమైన మూలికల కొండ చూడు. ఆ పర్వతం కొనలో అధికమైన తమ కాంతితో దిక్కులను వెలిగించే నాలుగు మూలికలను చూడు. వాటి కాంతిని బట్టి నువ్వు వాటిని గుర్తించగలవు. వాటిలో మృతసంజీవని (చచ్చిన వారిని బతికించేది), విశల్యకరణి (దేహంలో నాటిన ఇతర పదార్థాలను, బాణాలను, ములుకులను ఊడతీసేది), సావర్ణ్యకరణి (గాయాలతో వన్నె మారిన చోట మళ్లీ వన్నె వచ్చేట్లు చేసేది), సంధానకరణి (విరిగిన ఎముకలను, అవయవాలను అతికించేది) వుంటాయి. నువ్వు వెంటనే వెళ్లి వాటిని తెచ్చి వానరసేనకు

ప్రాణాలను ఇవ్వు". అని అంటాడు జాంబవంతుడు.

సంజీవని తేవడానికి పోయిన హనుమంతుడు

హనుమంతుడు తన దేహాన్ని పెంచాడు వెంటనే. త్రికూట పర్వత శిఖరం ఎక్కాడు. రెండవ కొండలాగా అతిశయించిన హనుమంతుడి కాలి దెబ్బలకు సహించలేక పర్వత శిఖరాలు వణికాయి. చెట్లు నేలకూలాయి. పరాక్రమవంతుడైన హనుమంతుడు కేవలం తన స్వశక్తిమీదనే ఆధారపడకుండా కార్యం నిర్విఘ్నంగా సాగడానికి భక్తితో రామచంద్రమూర్తికి నమస్కారం చేశాడు. ఆ తరువాత ఆయన కుప్పించి ఎగరగా ఆయన వేగానికి సముద్రంలో అలలు తిరిగాయి. సమస్త జంతువులు భయపడ్డాయి. సముద్రాన్ని దాటి పోయి మనోహరమైన మంచుకొండ చేరి జాంబవంతుడి మాటలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. హిమవత్పర్వతాన్ని సమీపించిన హనుమంతుడు అక్కడ వున్న మునిజనుల పుణ్యాశ్రమాలను భక్తి శ్రద్ధలతో చూశాడు. అక్కడి బ్రహ్మకోశాన్ని, కైలాసాన్ని, హరిహయగృహాన్ని, రుద్రుడు బాణాలను వినోదానికి వేసే స్థలాన్ని, హయగ్రీవుడు నిర్మించిన బ్రహ్మశిరాన్ని, యమకింకరుల వజ్రాలయం, సూర్యకాంతికల కుబేరుడి గృహాన్ని, సూర్యుడి సానకు కట్టిన స్థలాన్ని, బ్రహ్మాసనాన్ని, భూనాభిని, కైలాస ప్రాంతంలో వున్న ఋషభ పర్వతాన్ని చూశాడు.

సంజీవని తెచ్చిన హనుమంతుడు

హనుమంతుడు మూలికలకోసం వేయి యోజనాల స్థలాన్ని వెతికాడు. ఆ మూలికలు కనబడలేదు. అవి కనపడక పోవడంతో హనుమంతుడు కళ్లెర్రచేసి పెద్ద ధ్వనితో ఆ కొండతో ఇలా అన్నాడు. "ఏమీ పర్వతోత్తమా! రామచంద్రమూర్తి మీద నీకు కొంచెమైనా దయలేదా? ఎందుకని నీ ఔషధులు దాచిపెట్టావు? రామచంద్రమూర్తికి సహాయం చేయకూడదనా? నామీద అలక్ష్యమా? ఔషదులు నాకు లభించకూడదని నీ నిశ్చితాభిప్రాయం అయితే నావల్ల ఎలా పరాభవించబడుతావో నీకు తెలియదా? ఇదిగో నిన్నిప్పుడే పిండి చేస్తాను". ఇలా చెప్పి ఆ శైలాన్ని పాటులతో సహా పెళ్ళగించి ఆకాశానికి ఎగిరి, శీఘ్రంగా వచ్చాడు. ఆ పర్వతాన్ని హనుమంతుడు చేత ధరించి ఆకాశమార్గాన వస్తుంటే రెండవ సూర్యుడిలాగా కనిపించాడు.

సంజీవని వల్ల జీవించిన వానరాదులు

హనుమంతుడు దూరం నుండి వస్తుంటేనే మూలిక గాలి సోకడం వల్ల

వానరులంతా ప్రాణాలతో లేచి కూర్చున్నారు. హనుమంతుడిని చూసి కేకలు వేశారు. ఆ మహామూలికల వాసన చూసి రామలక్ష్మణులు స్మృతి తెచ్చుకుని తెప్పరిల్లారు. వానరులంతా బతికారు కాని రాక్షసులు ఎవరూ బతకలేదు. దానికి కారణం, చనిపోయిన రాక్షసులను రావణుడు సముద్రంలో పారవేయమని ఆజ్ఞాపించడమే.

సర్గ–75
లంక కాల్చమని కపులను ఆజ్ఞాపించిన సుగ్రీవుడు

సుగ్రీవుడు తమ వానరసేనకు ఇంద్రజిత్తు మోసంతో చేసిన అపకారానికి కోప్పడి హనుమంతుడితో కలిసి వానరులతో ఇలా అన్నాడు. "రావణుడు తన తమ్ములు, కొడుకులు చావడం వల్ల శోకంలో వున్నాడు. యుద్ధానికి రావడం లేదు. వాడు రాకపోతే మనం ఎందుకు వూరకే వుండాలి? మీరు లంకాపురంలో చొరబడి లంకను కాల్చండి, కొల్లగొట్టండి" అని అన్నాడు. కొంచెం సేపటికి గాఢమైన అంధకారం వచ్చి భయంకరమైన రాత్రి ప్రారంభమైంది. అప్పుడు రోషంతో వానరశ్రేష్టులు సర్పాలలాగా బుసలు కొట్టుతూ, చేతిలో దొరికింది తీసుకుని, కావలి వున్న రాక్షసులను తరుముకుంటూ లంకలో ప్రవేశించి మేడలు, మిద్దెలు అగ్నికి సంతర్పణం చేస్తుంటే అవి కూలిపడ్డాయి.

లంకను కాల్చిన కపులు

అగ్నికి లంకానగరం ఆహుతి అవుతుంటే, అగరుచెక్కలు, గంధపు చెక్కలు కాలి మంచి వాసనలు కలిగించాయి. ముత్యాలు, వజ్రాలు, పగడాలు, శంఖాలు కాలి భస్మమయ్యాయి. పట్టు వస్త్రాలు కాలి బూడిదయ్యాయి. ఏనుగుల సొమ్ములు, కవచాలు, ఏనుగులకు, గుర్రాలకు కప్పే వస్త్రాలు, ఖడ్గాలు, విల్లంబులు, అల్లెత్రాడులు, ఆయుధాలు, శూలాలు కాలి చూర్ణమయ్యాయి. అన్నీ నాశనమయ్యాయి. వేలాది రాక్షసుల ఇండ్లు బూడిదయ్యాయి. అంతా కాలిపోయారు. కాలి నేలబడుతున్న ఇండ్ల చప్పుడుకు పౌరులు చెవిటి వారైపోయారు. ఇదంతా దూరం నుండి చూస్తున్న వారికి మంటలతో కూడిన మేడలు ఔషధులతో ప్రకాశించే హిమవత్పర్వత శిఖరంలా, మోదుగు చెట్ల

సమూహంలా, అల్లకల్లోలమైన సముద్రంలా కనిపించింది. రాక్షస నగరాన్ని కాలుస్తున్న అగ్నికాంతులు సముద్ర జలాల్లో పడినప్పుడు సముద్రం రక్తసముద్రంలా కనిపించింది. మంటల్లోనుండి తప్పించుకుని బయటకు వచ్చిన రాక్షసులతో వానరులు యుద్ధం చేయగా వారిద్దరి భయంకర ధ్వనులు భూమ్యాకాశాలు నిండాయి.

ఇదిలా వుండగా అక్కడ యుద్ధభూమిలో బాణాల బాధ తొలగగానే రామలక్ష్మణులు విల్లులు ధరించి, అల్లెతాడు మీటి టంటమ్మనే ధ్వని పుట్టించారు. ఆ ధ్వనికి రాక్షసులు భయపడి కలతచెందారు. వానరుల సింహనాదాలు, రాక్షసుల అరుపులు, రామచంద్రమూర్తి అల్లెతాటి ధ్వని కలిసి పెద్ద మోత పుట్టింది. రామచంద్రమూర్తి విల్లు నుండి వెలువడిన బాణాల పరంపరలు లంకలోని ఎత్తైన బురుజులను, గోపురాలను, శిధిలం చేశాయి. నేలకూలాయి. దానికి భయపడి రాక్షసులు వేగంగా దొమ్మి యుద్ధం చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పుడు సుగ్రీవుడు వానరులనుద్దేశించి "ద్వారాన్ని కపులారా ముట్టడించండి" అని ఆజ్ఞాపించాడు. వానరులు ఆయన ఆజ్ఞానుసారం రావణుడు కాపలాగా వున్న ద్వారాన్ని అడ్డగించారు. దానికి రావణుడు కోపంతో కళ్లెర్రచేసి, చివాలున లేచి, కుంభకర్ణుడి కొడుకులైన కుంభుడిని, నికుంభుడిని, వారితో సహా యూపాక్ష, శోణితాక్ష, కంపనుడు అనే వారిని, ప్రజంఘుడిని వారి సేనతో సహా యుద్ధానికి పొమ్మంటాడు.

యుద్ధానికి వెడలిన కుంభనికుంభులు

కుంభకర్ణుడి కొడుకులైన కుంభనికుంభులు శత్రు సైన్యానికి భయపడకుండా జయజయ ధ్వనులు చేసుకుంటూ తమ సేనలతో సహా యుద్ధానికి బయల్దేరారు. అలా గుంపులుగుంపులుగా వస్తున్న రాక్షస సేనను చూసి వానరసేన సింహనాదాలు చేసింది. రాక్షసుల, వానరుల మధ్య యుద్ధం జరిగింది. ఒకరినొకరు కత్తులతో నరుక్కున్నారు యుద్ధం చాలా భయంకరమైపోయింది. చివరకు పారిపోతున్న రాక్షసులను వానరులు చుట్టుముట్టి పోనీయకుండా చంపసాగారు.

సర్గ–76
కంపను చంపిన అంగదుడు

అలా దొమ్మి యుద్ధం జరుగుతుండగా అంగదుడు సాహసించి కంపనుడు అనేవాడిని ఎదిరించగా అతడు అంగదుడిని గదతో కొట్టాడు. అంగదుడు ఆ గదనే లాక్కుని దాంతోనే వాడిని తిరిగి కొట్టగా దేహం వణికినప్పటికీ, తేరుకుని, బదులు కొట్టాడు. అంగదుడు ఒక పర్వత శిఖరాన్ని వాడి తలమీద వేయడంతో వాడు ప్రాణాలు విడిచి యుద్ధభూమిలో పడిపోయాడు. ఇది చూసి శోణితాక్షుడు బాణాలను కురిపిస్తూ అంగదుడిని నొప్పించాడు. ఆ తరువాత ఆకాశానికి ఎగిరాడు. అంగదుడు కూడా వాడితో ఎగిరి వాడి చేతిలో వున్న కత్తిని బలవంతంగా గుంజుకుని, వాడి కవచాన్ని నరికాడు. అప్పుడు ప్రజంఘుడు, యూపాక్షుడు అనేవారిద్దరూ శోణితాక్షుడిని కలిశారు. అంగదుడి రక్షణకు మైంద, ద్వివిదులు పోయారు. ముగ్గురు రాక్షసులకు, ముగ్గురు వానరులకు ఘోరంగా యుద్ధం జరిగింది. ప్రజంఘుడు భయంకరమైన ఒక ఖడ్గాన్ని తీసుకుని అంగదుడిని ఎదుర్కొన్నాడు.

ప్రజంఘుడిని చంపిన అంగదుడు

తన సమీపంలోకి వచ్చిన ప్రజంఘుడిని అంగదుడు మద్దిచెట్లతో కొట్టగా ఆ దెబ్బకు వాడి చేతిలోని కత్తి జారిపోయింది. ఆ రాక్షసుడు అప్పుడు అంగదుడిని ముష్టితో నొసట పొడిచాడు. అంగదుడు కత్తితో ప్రజంఘుడి తల నరికాడు. చనిపోయిన తన పినతండ్రిని కన్నీరు కారుస్తూ చూసి యూపాక్షుడు ఒక కత్తి తీసుకుని అంగదుడి మీదికి పరుగెత్తగా, ద్వివిదుడు వచ్చి ఎదిరించి, ఆ యూపాక్షుడి రొమ్మున గుద్ది, రెండు చేతులా బంధించాడు. తన సోదరుడు

యూపాక్షుడు చిక్కుబడి వుండడం చూసిన శోణితాక్షుడు గదతో ద్వివిదుడిని రొమ్ము మీద గుద్దగా అతడు బదులుగా రాక్షసుడి చేతిలోని గదను అపహరించాడు. ద్వివిదుడు శోణితాక్షుడిని నేలమీదికి తోసి రొమ్ము మీద కాలుపెట్టి, తొక్కి, గొంతు నులిమి చంపాడు. ఇంతలో మైందుడు యూపాక్షుడిని చంపాడు.

వానరవీరులను నొప్పించిన కుంభుడు

చనిపోగా మిగిలిన రాక్షసులు కుంభుడి దగ్గరికి పోయారు. కుంభుడు కొట్టిన దెబ్బకు ద్వివిదుడు వెలవెలబోయి, కొండలాగా పడిపోయాడు. తమ్ముడు ఇలా పడిపోగా మైందుడు కుంభుడి మీద పెద్ద బండను విసిరాడు. ప్రతిగా కుంభుడు వేసిన బాణానికి మైందుడు నేలకూలాడు. అది చూసి అంగదుడు కుంభుడిని ఎదిరించాడు.

కుంభుడి దెబ్బకు పడిపోయిన అంగదుడు

తనమీదకు వస్తున్న అంగదుడి మీద కుంభుడు అనేక రకాలైన బాణాలను వేశాడు. వాటన్నిటినీ చీల్చి అంగదుడు కుంభుడి మీద రాళ్లవాన కురిపించాడు. ఇరువురూ భీకరమైన యుద్ధం చేశారు. చివరకు కుంభుడి బాణాలకు దేహం చీల్చబడగా కలతచెంది అంగదుడు బాధ సహించలేక నేలకూలాడు. ఇది చూసి వేగదర్శి, సుషేణుడు, జాంబవంతుడు కోపంతో కుంభుడి మీదకు పోగా వాడు తన బాణపరంపరతో వారిని అడ్డగించాడు. వారు చివరకు ఆ బాణపరంపరకు చిక్కుపడ్డారు. అది చూసి కోపించిన సుగ్రీవుడు అంగదుడిని వెనకవేసుకుని కుంభుడిని తరిమి, చెట్లను వాడిమీద వర్షంలాగా కురిపించాడు.

కుంభుడిని ఎదుర్కొన్న సుగ్రీవుడు

సుగ్రీవుడికి, కుంభుడికి మధ్య యుద్ధం జరిగింది. ఒకానొక సందర్భంలో కుంభుడి బాణ వేగాన్ని పొగిడాడు సుగ్రీవుడు. ఆయన పెదతండ్రికి సమానుడవని కూడా అంటాడు. అది హేళనగా కూడా కావచ్చు. అతడి బలమంతా తన మీద చూపమని అంటాడు. తనకు అపకీర్తి వస్తుందనే భయంతో ఇప్పుడే కుంభుడిని చంపననీ, అతడు యుద్ధం చేసి అలసిపోయాడనీ, బడలిక పోగొట్టుకుని యుద్ధానికి మళ్లీ రావాలనీ, అప్పుడు తన బలం చూపిస్తాననీ సుగ్రీవుడు అన్నాడు కుంభుడితో.

కుంభుడిని వధించిన సుగ్రీవుడు

ఆ తరువాత జరిగిన యుద్ధంలో సుగ్రీవుడు యముడిలాగా కుంభుడి మీద పడ్డాడు. రాక్షస–వానర వీరుల మధ్య యుద్ధం సాగింది. అదను చూసి, సుగ్రీవుడు కుంభుడిని పట్టుకుని ఎత్తి సముద్రంలో పారవేశాడు. అప్పుడు కుంభుడు శౌర్యంతో భయంకరుడై సముద్రం నుండి లేచి, సుగ్రీవుడి సమీపంలో దూకి, అతడిని ముష్టి ఘాతం చేయగా, ఆ దెబ్బకు నెత్తురు ప్రవహించింది. కాకపోతే, ఆ దెబ్బలకు సుగ్రీవుడి దేహంలో కొత్త కాంతి వచ్చింది. సుగ్రీవుడు తన పిడికిలి బిగబట్టి కుంభుడిని కొత్తగా, ఆ దెబ్బకు కుంభుడు నేలకూలాడు. కిందపడి, తన్నుకుని, జ్వాలలు చల్లారిన అగ్నిలాగా సుగ్రీవుడి చేతిలో చావగా రాక్షస సమూహం భయపడింది.

సర్గ–77
కపులను పారదోలిన నికుంభుడు

తన అన్నైన కుంభుడిని సుగ్రీవుడు వధించగా రోషంతో నికుంభుడు వానరుల మీదికి పోయి వాళ్లను తరిమికొట్టాడు. వారంతా భయపడి వణికారు.

నికుంభుడిని వధించిన హనుమంతుడు

వానరులను తరిమి కొట్టుతున్న నికుంభుడు తన ఎదురుగా నిలబడిన హనుమంతుడిని చూసి, అతడి ఎదురు రొమ్ము గురి చూసి, బాణం వేయగా, అది హనుమంతుడి రొమ్ము తాకి తునకలైపోయింది. ఆ దెబ్బకు హనుమంతుడు భూకంపం వచ్చినప్పుడు పర్వతంలాగా వణికాడు. వెంటనే తెప్పరిల్లుకుని నికుంభుడి మీదికి దూకి మెడపట్టి గిరగిరా తిప్పి కొట్టి, గొంతు నులుమి చంపాడు. ఇలా అంతా దాదాపు ఏకకాలంలోనే చచ్చారు.

సర్గ–78
యుద్ధానికి వెడలిన మకరాక్షుడు

కుంభనికుంభులు నేపాలవడం విన్న రావణుడు రోషంతో పరవశుడై, కోపం వల్ల, దుఃఖం వల్ల బాధపడినవాడై, మండిపడి, మూర్ఛపోయి లేచి, ప్రసిద్ధబలుడు, ఖరుడి కొడుకైన మకరాక్షుడిని చూసి, "కుమారా! నా ఆజ్ఞమేరకు పోయి వానరులను, రామలక్ష్మణులను చంపు" అని చెప్పాడు. అతడు అలాగే చేస్తానని చెప్పి, రావణుడికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, తన రథం తయారు చేయమని సేనానాయకుడిని ఆజ్ఞాపించాడు. అతడు అలాగే చేసి, సేనను సమకూర్చి సిద్ధం అని అంటాడు. రథానికి ప్రదక్షిణ చేసి, రథం ఎక్కి, సారథిని అతి వేగంగా రథం పోనిమ్మని అంటాడు. తనకంటే ముందుగా పోయి యుద్ధం చేయమని రాక్షసులను పురమాయించాడు. వారలాగే సేన ముందు నిలిచారు. అలా పోతున్న మకరాక్షుడికి అపశకునాలు కనిపించాయి. అలా రాక్షస సైన్యం రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చింది.

సర్గ-79
శ్రీరాముడిని తూలనాడిన మకరాక్షుడు

వానరులకు, రాక్షసులకు భయంకరమైన యుద్ధం జరిగింది. మకరాక్షుడి బాణాలకు, అతడి ప్రతాపానికి, భయపడి వానరులు రాక్షసులు తరుముకుని వస్తుంటే, పరుగెత్తారు. ఇలా వానరులను తరుముతున్న రాక్షసుల మీదికి రామచంద్రమూర్తి కోపంతో తన వాడి బాణాలను వేసి వానరుల పైన పడకుండా నిలిపాడు. అప్పుడు మకరాక్షుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "నిలు నిలు రామా! ఎందుకు గర్వంతో మిడిసిపడతావు? నీ బలం ఏమాత్రమో నాకు చూపు. ద్వంద్వయుద్ధంలో నీ ప్రాణాలను బలి ఇస్తాను. పారిపోకు. నేను లేని చోట నా తండ్రిని నువ్వు దండకారణ్యంలో చంపావు. నిన్ను చూస్తుంటే దుష్టుడా! దేహం మండుతున్నది. నువ్వు నా చేతుల్లో చచ్చి త్వరగా యమపురికి పోయి అక్కడ నీతో పూర్వం చచ్చిన రాక్షసులతో స్నేహంగా ఆడుకో. నీ ఇష్ట ప్రకారం, నీకే యుద్ధం కావాలనుకుంటే ఆ యుద్ధమే చేయి".

ఇలా అన్న మకరాక్షుడిని చూసి చిరునవ్వు నవ్వి, "ఓరీ! రాక్షసుడా! యుద్ధంలో మాటలవల్ల లాభం లేదు. నీ శౌర్యం చూపు. యుద్ధంలో ఖరదూషణులను, నీ తండ్రిని, పద్నాలుగు వేల రాక్షసులను చంపాను. నిన్నూ అలాగే చంపుతాను" అంటాడు.

మకరాక్షుడిని వధించిన శ్రీరాముడు

శ్రీరాముడు ఇలా అనగానే, మకరాక్షుడు ఆయన్ను తన బాణాల వర్షంలో ముంచెత్తాడు. రామచంద్రమూర్తి ఆ బాణాలన్నిటినీ తన బాణాలతో ఖండించాడు. ఇరువురూ సమానంగా యుద్ధం చేశారు. దేవదానవులు ఆ

యుద్ధాన్ని రెప్పవాల్చకుండా వీక్షించారు. వారిద్దరూ వేసిన బాణాలతో ఎనిమిది దిక్కులు నిండాయి. తనతో సమానంగా పోరాడుతున్న రాక్షసుడిని చూసి శ్రీరాముడు ఆశ్చర్యపోయాడు. వెంటనే వాడి ధనస్సును తెగగొట్టి, ఎనిమిది బాణాలతో సారథిని చంపి, గుర్రాలను ఖండించి, రథం ఎగిరిపోయేట్లు కొట్టగా మకరాక్షుడు శూలం తీసుకుని కిందకు దూకాడు. దాన్ని రాముడి మీదకు విసిరాడు. దాన్ని రాముడు తుంచాడు. శూలం విరిగిపోగా రాక్షసుడు పిడికిలి పట్టి రాముడిని నిలబడమని అంటూ మీదికి దూకాడు. రాముడు చిరునవ్వు నవ్వి ఆగ్నేయాస్త్రాన్ని సంధించి వాడి రొమ్ము చీల్చి చంపాడు.

సర్గ–80
రెండవసారి యుద్ధానికి పోయిన ఇంద్రజిత్తు

మకరాక్షుడి మరణ వార్త విన్న రావణుడు ఇంద్రజిత్తును చూసి “వీరా! ఇంద్రజిత్తా! వీరులైన రామలక్ష్మణులను యుద్ధరంగంలో ఎలాగైనా చంపు. ఎదురుగా నిలబడి యుద్ధం చేయడానికి వారు నీకంటే బలవంతులు. కాబట్టి పొంచి కాని, కనబడీకనబడకుండా కాని, మాయ ప్రయోగించి కానీ వాళ్లను చంపు. ఈ పని చేయడానికి నువ్వే సమర్థుడివి. బలం కలవాడివి కూడా నువ్వే. శూరుడివైన నువ్వు ఇంద్రుడిని కూడా యుద్ధంలో జయించావు. ఇక మానవులు ఒక లెక్కా నీకు?” అని అన్నాడు.

రావణుడి మాటలకు స్పందించిన ఇంద్రజిత్తు, అదృశ్యంకాగల శక్తి కల నాలుగు గుర్రాలను కట్టిన అగ్నిలాగా ప్రకాశించే రథం ఎక్కి లంకను వదిలి రాక్షస సమూహాలతో ఇలా అన్నాడు.

అదృశ్యుడై కపిసేనలను, రామలక్ష్మణులను నొప్పించిన ఇంద్రజిత్తు

“జనాలను మోసగించడానికి మునుల వేషాలను ధరించిన రామలక్ష్మణులను యుద్ధంలో చంపి నా తండ్రికి విజయం సాధించి పెట్తాను. ఈ రోజే రామలక్ష్మణులనేవారు భూమ్మీద లేకుండా చేస్తాను. రాక్షస రాజుకు నిండు సంతోషం కలిగిస్తాను” అని చెప్పి ఇంద్రజిత్తు కనబడకుండా యుద్ధానికి పోయాడు. వానరసేన మధ్య వున్న రామలక్ష్మణులను గుర్తించాడు. గుర్తించి, విల్లు ఎక్కుపెట్టి,బాణసమూహాన్ని జడివానలా కురిపించి వారిమీద వేయగా వారు కూడా బాణాలను వేశారు. అయితే, రామలక్ష్మణుల బాణాలేవీ ఆకాశాన్ని తాకాయి కాని ఇంద్రజిత్తుకు తగల్లేదు. గాఢమైన అంధకారాన్ని కలిగించి,

ఆకాశంలో దట్టమైన మంచు కమ్మినట్లు చేసి, ఇంద్రజిత్తు బాణవర్షం కురిపించగా అతడి అల్లెతాటి మోతకాని, గుర్రాల గిట్టెల చప్పుడు కాని, రథచక్రాల ధ్వని కాని వినపడలేదు రామలక్ష్మణులకు. చప్పుడు వస్తే, శబ్దవేధులతో ఆ బాణాలను రామలక్ష్మణులు ఎప్పుడో పడగొట్టేవారు. బాణాలు పడడం మాత్రమే తెలుస్తున్నది.

ఇంద్రజిత్తు బాణాలు రామలక్ష్మణులకు ఎదురుగా పోయి దేహాలను తాకి బాధపెట్టాయి. ఆ బాణాలు వచ్చే మార్గాన్ని కనిపెట్టి అటువైపుగా తమ బాణాలను వేసి రామలక్ష్మణులు యుద్ధం చేశారు. వీరి బాణాలకు ఇంద్రజిత్తు వణికి బాధపడి, తిరిగి బాణాలను వేయగా ఇరువైపులా యుద్ధం కొనసాగింది. ఇంద్రజిత్తు ఇలా తన శక్తితో యుద్ధం చేస్తుంటే వేలాదిమంది వానరులు నేలకూలారు. వంచనతో యుద్ధం చేస్తున్న ఇంద్రజిత్తు వ్యవహారానికి కోపించి లక్ష్మణుడు "అన్నా! నువ్వు అంగీకరిస్తే బ్రహ్మాస్త్రం ప్రయోగించి ప్రపంచంలో రాక్షసులనేవారు లేకుండా చేస్తాను" అని అన్నతో అన్నాడు.

జవాబుగా శ్రీరాముడు, "లక్ష్మణా! ఎవడో ఒక్కడు మనకు అపరాధం చేశాడని నిరపరాధులుగా వున్న రాక్షసులందరినీ చంపడం న్యాయమా? నువ్వు బ్రహ్మాస్త్రం సర్వ రాక్షసులమీద ప్రయోగిస్తే శత్రువులు కాని రాక్షసులు, బాలురు, వృద్ధులు, నిద్రపోయేవారు, వూరికే ఇండ్లలో వున్నవారు, ఇలా ఎందరో చనిపోతారు కదా? అది ధర్మమా? కాబట్టి అలా చేయకు. సర్వసంహార కార్యానికి పూనుకోకుండా వీడిని మాత్రం చంపే ఉపాయం ఆలోచించు. వీడు మాయతోనే కదా ఇంతపని చేస్తున్నది. మనం ఆ మాయను చెడగొట్టితే ఆ తరువాత మన అవసరం లేకుండా వానరులే వాడిని చంపుతారు. లేదా వాడెక్కడికి పోయినా నేనే చంపుతాను. ఇక చూడు నేను ఆ పనిలోనే వుంటాను" అని అన్నాడు. అలా అంటూ, రామచంద్రమూర్తి కళ్లెర్ర చేసి ఆకాశాన్ని చూశాడు.

సర్గ–81
మాయాసీతతో హనుమంతుడున్న దిక్కుకు పోయిన ఇంద్రజిత్తు

తన పినతండ్రులు, తమ్ములు, చుట్టాలు, స్నేహితులు, హితులు అందరూ చనిపోయిన విషయాన్ని మనసులో తలచుకుంటూ, కోపంతో మండిపడుతూ, కళ్లల్లో నిప్పులు రాలుతుంటే ఇంద్రజిత్తు పశ్చిమ ద్వారానికి వచ్చాడు. పశ్చిమ ద్వారంలో హనుమంతుడున్నాడు. ఇలా రావడం ద్వారా యుద్ధ ప్రయత్నంలో వున్న రామలక్ష్మణుల ఉద్రేకాన్ని అణిచాడు. ఆ తరువాత మాయా సీతను తన శక్తితో కల్పించి, ఏడుస్తున్న ఆరూపాన్ని తన రథం మీద వుంచుకుని, వానరులకు ఎదురుగా (మాయా) సీతను చంపడానికి పూనుకున్నాడు. వానరులంతా వాడిని చూడగానే హనుమంతుడిని ముందుంచుకుని వాడిని చంపాలన్న కోరికతో ముందుకు పోయారు. హనుమంతుడు రథం మీదున్న మాయా సీతను చూసి ఆమె నిజమైన సీతే అని సంకటపడ్డాడు. కొన్నాళ్ల క్రితమే తాను సీతను చూసిన విషయం గుర్తు చేసుకుని బాధపడ్డాడు.

మాయాసీతను చంపబూనిన ఇంద్రజిత్తు

ఇంద్రజిత్తు ఏకీడు చేయకముందే (మాయా) సీతను రక్షించాలనుకున్నాడు హనుమంతుడు. తన మీదికి వస్తున్న హనుమంతుడిని చూసి ఇంద్రజిత్తు తన ఖడ్గం దూసి, పైకెత్తి, (మాయా) సీతాదేవి తల వెంట్రుకలు పట్టుకుని, ఆమె "రామా! రామా!" అని అరుస్తుంటే తల నరకడానికి ప్రయత్నం చేశాడు.

అలా ప్రయత్నం చేస్తున్న రాక్షసుడితో హనుమంతుడు కోపంగా ఇలా అన్నాడు. "ఓరీ! పాపకార్యాలు చేసేవాడా! పాపపు మనస్సు కలవాడా! బుద్ధిలేని వాడా! ఎందుకురా నువ్వు నాశనమై పోవడానికి పరస్త్రీ వెంట్రుకలు

పట్టుకున్నావు? ఓరీ! నీ తండ్రి వంశం గౌరవించాల్సిన బ్రహ్మఋశి వంశం అయినా నువ్వు రాక్షస స్త్రీ యోనిలో పుట్టావుకాబట్టి క్షేత్ర మహాత్మ్యం వల్ల నీకా గుణాలే అబ్బాయి. ఓరీ! పాపాత్ముడా! నరకానికి పోవడానికి ఇలాంటి పాపకార్యం తలపెట్టావు. నీచ స్వభావుడా! క్రూర చరిత్రుడా! దయలేనివాడా! ఆడదాన్ని చంపడం నీచమని తెల్సి కూడా ఎందుకిలా చేస్తున్నావు? ఆమె నీకే అపకారం చేసింది? రాముడి సన్నిధి వదిలింది. ఆమెను మీరు సకల బాధలు పెట్టారు. అయినా సహించి వుంది. ఆమె ఒక మహాత్ముడి కూతురు. గొప్ప వంశంలో పుట్టింది. అపరాధం అంటే ఏమిటో తెలియదు. అలాంటి ఆమెను ఏం తప్పు చేసిందని చంపుతావురా? నువ్వు కనుక ఈమెను చంపితే నువ్విక బతకవు. ఆడదానిని చంపబూనిన నిన్ను ఎవరైనా చంపవచ్చు. స్త్రీవధ చేసిన నువ్వు పాపాత్ముల లోకానికి పోతావు కాని వీరస్వర్గానికి పోవు".

మాయా సీతను వధించిన ఇంద్రజిత్తు

ఇంద్రజిత్తును సంబోధిస్తూ ఇలా అంటూనే హనుమంతుడు వాడిమీదికి పోబోగా, హనుమంతుడిని, అతడి సేనను ఇంద్రజిత్తు బాణవర్షంతో ముంచి, పారిపోయేట్లు చేసి, పోకుండా ఇంకా నిలబడిన హనుమంతుడితో ఇలా అన్నాడు. "నువ్వు, సుగ్రీవుడు ఏ స్త్రీ కొరకై ఇక్కడికి వచ్చారో, ఆ స్త్రీని నీ కళ్లెదుటే, నువ్వు చూస్తుండగానే, నరికి చంపుతాను. ఆ తరువాత రామలక్ష్మణులను, నిన్ను, సుగ్రీవుడిని, అనుచిత మార్గాన నడిచే విభీషణుడిని ఖండిస్తాను. ఓరీ! వానరుడా! ఆడదాన్ని చంపకూడదని అన్నావు. శత్రువుల మనస్సు నొచ్చుకునే కార్యం ఏదైనా, పాపాత్మకమైనా చేయవచ్చని నీకు తెలియదా?". ఇలా అంటూ ఇంద్రజిత్తు కల్పించబడిన సీతను తన కత్తితో నరికాడు. అది రెండు తునకలై నేలకూలింది. (మాయా) సీతను చంపిన తరువాత ఇంద్రజిత్తు హనుమంతుడిని ఉద్దేశించి, "ఓరీ! అడవి ద్రిమ్మరీ! రాముడిమీద కోపంతో సీతను చంపాను. మీ కష్టమంతా వ్యర్థమయింది కదా!" అని అరిచాడు. ఆ అరుపులకు కోతుల సేన బలం చెడి శత్రువును చూస్తూ పరుగెత్తింది.

సర్గ-82
ఇంద్రజిత్తుతో పోరాడిన హనుమంతుడు

భయంతో పరుగెత్తుతున్న వానరులను చూసి హనుమంతుడు అంతా వినేట్లు మెత్తటి మాటలతో ఇలా అన్నాడు. "ఓ వానరులారా! మీరంతా ఎంతో తెంపుకలవారు. యుద్ధం అంటే ఆసక్తికలవారు. ఇలాంటి మీరు ఈ విధంగా పరుగెత్తవచ్చా? మీ శౌర్యం ఏమైంది? ఎందుకీ పిరికితనం? మీకంత ప్రాణభయం వుంటే ముందుగా నేను పోతాను. నా వెనుక మీరు రండి". హనుమంతుడు ఇలా చెప్పగానే వానరులంతా కొండలను, చెట్లను తీసుకుని హనుమంతుడి వెంట నడిచారు. హనుమంతుడు ప్రళయాగ్నిలాగా శత్రుసేనలను నాశనం చేయసాగాడు. ఒక పెద్ద బండను ఎత్తి ఇంద్రజిత్తు రథం మీద వేశాడు. సారథి అది తగలకుండా రథాన్ని దూరంగా తీసుకుపోయాడు. అది అక్కడ పడి మిగతా రాక్షస సమూహాన్ని నాశనం చేసింది. హనుమంతుడి వెంట వస్తున్న వానరులు ఇంద్రజిత్తును చెట్లతో, కొండలతో నొప్పించసాగారు. ఇంద్రజిత్తు తన బాణాలతో వారందరినీ తరిమి కొట్టాడు. ఇది చూసి రాక్షసులు భయం లేకుండా వానరుల మీద పడి చంపసాగారు. అప్పుడు హనుమంతుడు కపి వీరులతో ఇలా అన్నాడు.

రణం చాలించి శ్రీరాముడిని చూడబోయిన హనుమంతుడు

"వానరవీరులారా! మనం శత్రుసేననంతా చంపినా రాగల లాభం ఏమిటి? మనం రామచంద్రమూర్తి కొరకై ప్రాణాలమీద ఆశలు వదిలి యుద్ధం చేస్తున్నాం. ఆయన సీతాదేవి కొరకై పాటుపడుతున్నాడు. ఆయనైనా, మనమైనా యుద్ధం చేయడానికి కారణం సీతాదేవే. అలాంటి సీతను ఇంద్రజిత్తు చంపాడు. ఇలా

జరిగిందని మనం పోయి రామచంద్రమూర్తికి, సుగ్రీవుడికి చెప్పుదాం. వారెలా చేస్తే మంచిదని అంటారో అలాగే చేద్దాం". ఇలా అంటూ హనుమంతుడు వానరులను మెల్లమెల్లగా వెనక్కు మళ్లించాడు. వానరుల గుంపుతో రామచంద్రమూర్తిని చూడడానికి పోయాడు. ఇక్కడ ఇంద్రజిత్తు తన వ్యూహం ఫలించిందని సంతోషించి, శాస్త్రప్రకారం నికుంభిల ఆలయానికి పోయి గొప్ప హోమం చేయడం ఆరంభించాడు. రాక్షస శ్రేష్ఠులు ఆయన హోమం చేస్తున్న నికుంభిల ఆలయ ప్రాంగణాన్ని రక్షించారు.

సర్గ–83

ఇంద్రజిత్తు సీతాదేవిని వధించాడని శ్రీరాముడికి చెప్పిన హనుమంతుడు

వానర సేనల మధ్యన వున్న శ్రీరాముడిని సమీపించి మిక్కిలి దుఃఖంతో ఇలా అన్నాడు. "రామా! మేం యుద్ధం చేస్తున్నప్పుడు పాపాత్ముడు ఇంద్రజిత్తు మేమందరం చూస్తుండగానే సీతను చంపాడు. ఈ విషయం నీకు చెప్పాలనే ఇక్కడికి వచ్చాను". ఇలా హనుమంతుడు చెప్పగానే రామచంద్రమూర్తి నేలకొరిగాడు. వానరులు ఆయనమీద నీళ్లు చల్లారు.

ధర్మం నిరర్థకం అని శ్రీరాముడికి చెప్పిన లక్ష్మణుడు

శ్రీరాముడితో సమానంగా దుఃఖపడుతూ లక్ష్మణుడు అన్నను కౌగలించుకుని ఇలా అన్నాడు. "అర్థం, కామం వదిలైనా ధర్మం మీదే నిలబడాలని అంటావు. ధర్మం అంటే నీకు కడు ప్రేమ. ఇంద్రియాలను జయించావు. లోకహితం చేసేవాడివి. ఇలాంటి నిన్ను, ధర్మం, నీకు కీడుకలగకుండా కాపాడలేకపోయింది. కాబట్టి ధర్మం నిష్ప్రయోజనం. ధర్మం అనేదొకటి లోకంలో వుంటే, అది కదలని పర్వతంలాగా అనుకోవాలి కాని, కదిలే పశుపక్ష్యాది మనుష్యుల లాగా కాదు. కనపడకపోతే పరవాలేదు. చెట్లవలన, పశుపక్ష్యాదుల వలన మనకు కలిగే లాభం కూడా ధర్మం వల్ల కలగదు. కాబట్టి ప్రత్యక్ష ప్రమాణంతో ధర్మం వున్నదని అనడం సాధ్యపడదు. చెట్టును మనం చూడకపోయినా పండు చూస్తే, ఆ పండుకు కారణమైన చెట్టొకటి వున్నదని అర్థమవుతుంది. అలా ఊహించడానికి ధర్మం వల్ల కలిగే ఫలం కనబడడం లేదు. కాబట్టి ధర్మం కలదని చెప్పడం వీలుకాదు"

"అతీంద్రియములైనవి లోకంలో ఎన్ని లేవు.....అలాగే ధర్మాధర్మాలు అంటావా? అధర్మం అనేది ఒకటి వుంటే రావణాసురుడు విశేషమైన దుఃఖంతో

దాన్ని అనుభవించాలి కదా? ధర్మం అనేది ఒకటి వుంటే, నీకు ఇలాంటి దుఃఖం కలగాల్సిన అవసరమే లేదు. వాడు సుఖపడుతున్నాడు.....నువ్వు దుఃఖపడుతున్నావు. నువ్వు నిత్య ధర్మ సద్భావుడివి. సర్వదా ధర్మమందే వుండాలన్న మంచి అభిప్రాయం కలవాడివి. ఇలా ఉన్నప్పటికీ, క్రమ మార్గం తప్పి, ధర్మాధర్మాలు పరస్పర విరుద్ధమైన ఫలితాలను ఇస్తున్నాయి. నువ్వు దుఃఖపడుతుంటే వాడు సుఖపడుతున్నాడు. కాబట్టి ధర్మం కష్టానికి, అధర్మం సుఖానికీ కారణమైనప్పుడు ధర్మం కలదనీ, దానివల్ల మేలు ఫలమే కలుగుననీ ఎలా చెప్పగలం? కాబట్టి ధర్మం లేదు, దానికి ఫలం కూడా లేదు. అన్నా! ధర్మం ప్రకారం నడుచుకుంటే శుభం కలుగుతుంది, ధర్మం విడిస్తే దుఃఖం కలుగుతుంది అని ఆలోచిస్తావా? ఆ వూహ సత్యమైనది కాదు. ఎందుకంటావా? ధర్మం సౌఖ్యమే ఇస్తే, ధర్మాత్ములైన వారు ధర్మంలోనే నడుస్తుంటే వారికి ధర్మ ఫలాలే వుండాలికదా? లోకంలో ధర్మాత్ములు సుఖాలనే అనుభవిస్తున్నారా? లేదు కదా? ధర్మాత్ముడా! దీన్ని నువ్వి ఆలోచించు. అధర్మాలు కష్టాలనే కలిగిస్తే పాపాత్ములు కష్టాలనే కదా అనుభవించాల్సింది? లోకంలో అలా జరుగుతున్నదా? అదికూడా ఆలోచించు. లోకంలో పాపులు సుఖాలను అనుభవిస్తున్నారు. ధర్మాత్ములు కష్టాలను అనుభవిస్తున్నారు. ఆ కారణాన ధర్మం, అధర్మం అనేవి నిరర్థకాలు. ఫలాన్ని బట్టి చెట్టు వున్నదని ఊహించినట్లే, సుఖదుఃఖ రూపక ఫలాలను బట్టి ధర్మం, అధర్మం వున్నదని సిద్ధాంతం చేయడం సాధ్యపడదు''.

“రామచంద్రా! పాపాత్ములను క్రియారూపమైన అధర్మం (పాపకర్మం) భాదిస్తుందని అంటావా? అలా బాధ కలిగించే అధర్మం మూడు క్షణాలు మాత్రమే వుంటుందని శాస్త్రాలు చెప్తున్నాయి కదా? అలాంటప్పుడు మూడు క్షణాలు మాత్రమే వుండి నాల్గవ క్షణంలో నశించే అధర్మం, అది నశించి, కాలాంతరాన దుఃఖఫలం ఎవరికైనా ఎలా కలిగించగలదు? ఇది అసంగతం కదా? కాబట్టి అధర్మకర్మ దుఃఖం ఇస్తుందనీ, ఆ దుఃఖాన్ని బట్టి అధర్మం అనేదొకటి వున్నదని అనుకోవడం అసంగతం. శబ్దం, బుద్ధి, కర్మ మూడు క్షణాలే వుంటాయని శాస్త్రం చెప్తున్నది. కాబట్టి అవి క్షణికాలు. అలాగే ధర్మరూపమైన కర్మ సుఖం ఇస్తుందా? అదికూడా మూడు క్షణాలే వుండి నశిస్తుంది కాబట్టి తాను నశించి కాలాంతరాన ఎలా ఫలం ఇవ్వగలదు?''

“ఓయీ! కర్మ మూడు క్షణాల్లో చెడిపోతే పోనివ్వు. దానితో ఆరాధించబడిన దేవత చెడదుకదా? ఆ దేవతే ఈ ఫలం ఇస్తుందని అంటావా? అదికూడా సరైంది

కాదు. ఎందుకంటే, పురుషుడు తాను అధర్మం చేసి బాధపడడానికికాని, ఇతరులను బాధించడానికికాని, దైవమే కారణం. ఆ దైవమె పురుషుడితో ధర్మరూప కర్మ చేయించి, సంతోషించి, దానికి సుఖఫలం ఇచ్చి, అధర్మకర్మ చేయించి, అసంతుష్టుడై, దుఃఖఫలం ఇచ్చినట్లయితే అప్పుడు రెంటికీ ప్రయోజక కర్త దైవమేకదా అయ్యేది? అప్పుడు ఆ ధర్మాధర్మాల వల్ల కలిగే ఫలం, సుఖదుఃఖాలు, ప్రయోజక కర్తకు చెందుతుంది కాని, ప్రయోజ్యకర్తకు చెందదు కదా? రాజాజ్ఞప్రకారం ఒకడు ఒక పని చేస్తే దాని ఫలం రాజు అనుభవిస్తాడు కాని భటుడు అనుభవించడుకదా? కాబట్టి దైవమే తాను ధర్మంకాని, అధర్మం కాని అయి సుఖఫలం ఇస్తుందనడం సరైందికాదు".

"ధర్మానికి ఫలం వుందంటావా? అలా వుంటే ధర్మాత్ములలో శ్రేష్టుడవైన నీకు కీడెలా కలిగింది? ప్రాణం పోయేంత దుఃఖం నీకు కలిగింది కదా? ఇది అసత్యం కాదుకదా? ఇలాంటి దుఃఖం కలగాల్సిన అధర్మం నీలో లేదుకదా? ఈ దుఃఖం ఎలా కలిగింది? కాబట్టి ధర్మం వుందనడం అసత్యం. దైవానికి పౌరుషం (పురుష ప్రయత్నం) సహకారి. అలాంటి సహకారి లేనందున ధర్మం వ్యర్థమైపోయింది అంటావా? అలా అనతగునా? ధర్మానికి స్వతంత్ర శక్తి లేదు. పౌరుష సహాయం లేకుండా అదేపనీ చేయలేదనేకదా అర్థం. అలాంటి స్వతంత్ర శక్తి లేని దుర్బలం ధర్మాన్నే ప్రధానంగా ఎంచి అర్థకామాలను వదలడం సరికాదని నా అభిప్రాయం. ఎప్పుడు ధర్మం పురుషకార సహాయం లేకుండా కార్యం చేయజాలదో అప్పుడు ధర్మం విశేషమవుతున్నది. ముఖ్యమైంది పురుషకారం అవుతున్నది. కాబట్టి అప్రధానమైన ధర్మానికై బాధపడడం ఎందుకు? కాబట్టి దాన్ని వదిలి, ఇంతవరకు ధర్మమే ప్రధానమని దానిని రక్షించడానికి ఎలా శ్రమించావో, ఇక ముందు, పురుషకారానికొరకై శ్రమించు. అలా చేస్తే అన్ని పనులూ విజయవంతంగా జరుగుతాయి".

"సత్యం చెప్పడం శ్రేష్టమైన ధర్మమనీ, దాన్ని నువ్వు ఆచరిస్తున్నావనీ అంటున్నావు కాని, దాన్ని కూడా నువ్వు చక్కగా రక్షించలేదు. నిండు సభలో ప్రజలంతా వింటుండగా నీకు రాజ్యం ఇస్తానని తండ్రి చెప్పిన తరువాత దయలేకుండా ఆయనే నిన్ను అడవుల పాలు చేశాడు కదా? ఆయన మొదట చెప్పిన సత్యానికి నువ్వు ఆయన్ను దండించలేదు. మొదట చెప్పిన సత్యాన్ని పాటించకుండా రెండవసారి చెప్పినదాన్ని నువ్వేమని అంగీకరించావు? ధర్మాధర్మాలలో మనుష్యుడు ఏదో ఒకటి చేయాలి. రెండూ చేయకూడదా అంటావేమో? మనం సమయోచితంగా ప్రవర్తించాలి కాని ఒక్క ధర్మాన్నే

నిర్బంధంగా వుంచుకోకూడదు. కేవలం ధర్మాన్ని కాని, అధర్మాన్ని కాని, రెంటిలో ఒక్కదాన్నే అనుష్ఠించడం కర్తకు కీడుకలిగిస్తుంది. కాబట్టి, ఏవేళకు ఏది సరైందో ఆ వేళకు అది చేయడం సౌఖ్యం కావాలనుకునేవారికి సరైన విధానం".

ధనం సర్వార్థసాధకం అని శ్రీరాముడికి చెప్పిన లక్ష్మణుడు

లక్ష్మణుడు ఇంకా ఇలా చెప్పాడు. "తండ్రీ! ఇది నా అభిప్రాయం. న్యాయంగా నీకు రావాల్సినవై, ధర్మం చేయడానికి ఆధారమైన రాజ్యసంపదలను వదులుకున్నావు. దానివల్ల క్షేమానికి ఆధారమైన దాన్ని నువ్వు పాడుచేసుకున్నావు. ఇలాంటి నిన్ను ధర్మం కూడా వదిలిపెట్టదా? ధర్మ వృక్షానికి అర్థం వేరు. వేరు చెడితే చెట్టు చెడిపోదా? వేరుతో నాకు పనిలేదు, చెట్టు చాలన్నావు. అలాంటి చెట్టు ఎన్నాళ్లు నిలుస్తుంది? అర్థసహాయం లేకుండా ధర్మం చేయడం ఎలా సాధ్యపడుతుంది? అర్థం అనేది ప్రజలిచ్చే పన్నులతో కూడినది. ప్రజలిచ్చే పన్నులు కొండ వూటల వేళ్ళలాంటివి. ఆ నీళ్లు వేర్లకు తగిలి పారితే ఆ చెట్లు ఫలిస్తాయి. అలాగే ప్రజలిచ్చు ధనంతో ధర్మకార్యాలు జరుగుతాయి. కాబట్టి సకల కార్యసమూహాలకు ధనం ఒక్కటే కాదు ప్రధానమైంది. అలాంటి ధనం చేతికి దొరక్క, దాన్ని తొలగించి, తన పని పాడుచేసుకుంటే అలా చేసుకున్న వాడికి ఎప్పటికైనా మేలు కలుగుతుందా?"

"ధనంలేనివాడు బలంలేని వాడితో సమానం. ధనంలేనివాడిని అన్నదమ్ములు సహితం వదిలిపెట్టుతారు. ధనంలేనివాడు ఏదైనా పని తలపెట్టితే అది ఎండాకాలంలో ఏటి నీళ్ళలాగా నశిస్తుంది. దేహబలంలేనివాడు ధనబలం కలవాడైతే బహుజనులు వాడిని ఆశ్రయించి వాడు చెప్పినట్లు చేస్తారు. కాబట్టి వాడు బలవంతుడవుతాడు. ధనంకలవారికి అంతా బంధువులే. ధనంకలవాడు అనుకున్నపని ఎంత అసాధ్యమైనా నెరవేరుతుంది. ధనహీనుడి గతి ఇంత అని చెప్పలేం. ధనంకలవాడు సుఖాన్ని మరిగి, దానికొరకు ధనాన్ని వెచ్చించి, సుఖాలను అనుభవించి, ధనం పోగొట్టుకుని పేదవాడై, ధనంతో సుఖంకూడా పోవడం చూసి, ధనం వస్తే మళ్లీ సుఖం వస్తుందని నమ్మి, ధనార్జనకై పాపకార్యాలు చేస్తాడు. నిరుపేదలు కూడా ధనమున్నవాడి సౌఖ్యాలు చూసి, సుఖాభిలాషతో ధనమార్జించడానికి అధర్మ మార్గంలో పోతాడు. కాబట్టి ధనంలేమి అన్నిరకాలా అనర్థమే!"

"ధనంకలవాడికే స్నేహితులుంటారు. స్నేహితులున్నవాడు ధనవంతుడు

కాకపోతేఆ స్నేహితులు అతడితో దీర్ఘకాలం వుండరు. ధనమున్నవాడే బంధుజనులకు ఆప్తుడు. భందుజనులు ధనంలేనివాడిని ఆదరించరు. తమవాడిగా భావించరు. మగవాడైనా ధనంలేనివాడిని స్త్రీకంటే తక్కువగా, నికృష్టంగా చూస్తారు. డబ్బున్నవాడే సకల శాస్త్రాల పండితుడు. వాడు చెప్పింది అసత్యమైనా దాన్నే వేదవాక్యంగా లోకులు స్వీకరిస్తారు. ధనంలేనివాడు వేదవాక్యం చెప్పినా లోకులు దాన్ని లక్ష్యపెట్టరు. ధనవంతుడే బలవంతుడు, ధర్మాత్ముడు".

"ధనంలేకపోతే కలిగే కీడును గురించి ముందే చెప్పాను. ఏ ప్రయోజనం కోరి రాజ్యాన్ని నువ్వు వదులుకున్నావో నాకైతే తెలియదు. ఎవరికైనా అర్థం, కామం కొరకు దానం ఖర్చు పెట్టితే వాడికి ఏ పనైనా వ్యర్థంగా పోదు. సర్వం అనుకూలించి వస్తుంది. ధనంలేనివాడు ధనాన్ని కోరి అపకీర్తిపాలవుతాడు. ధర్మం, ధర్మం అంటూ ఇతర అర్థకామాలను వదిలి ధర్మమే రక్షక కవచమని భావించేవారికి ఈ లోకంలో సుఖం లేదు. సమస్త సుఖాలకు ప్రధాన కారణమైన ధనం నీకు లేదుకదా? నువ్వు అర్థకాంక్ష కలిగి రాజువై వున్నట్లయితే ఈ సీతాపహరణం వల్ల కలిగిన కష్టాలలో ఒక్కటైనా లేకుండా సుఖపడేవాడివి కదా? అసత్యమాడిన తండ్రిని సత్యవంతుడిని చేయాలని నీ సుఖం నువ్వు చూసుకోలేదు. దాని ఫలం చూశావా? నీ ప్రాణాలకంటే ఎక్కువైన నీ ప్రియురాలిని రాక్షసుడు దొంగిలించాడు. నువ్వు సుఖంగా రాజ్యంలో వుంటే నీకీ బాధ కలిగేది కాదుకదా? నీకీ కష్టం ప్రాప్తించి వుండేది కాదుకదా? అయిందేదో అయింది. గడచినదానికి చింతించి ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఏంచేయాల్నో ఆలోచిద్దాం. ఇంద్రజిత్తు చేసిన పనికి ప్రతీకారం తీర్చుకుందాం. నాకు ఆజ్ఞ ఇవ్వు. నీ ఆజ్ఞ లేకుండా నేనేదీ చేయలేను".

"రామచంద్రా! నువ్వు దేవుడివనే నా అభిప్రాయం. అలా అయితే ఎందుకు నేను ఇన్ని అస్తవ్యస్త మాటలు అన్నాననంటావా? నేను నీకు ప్రియం కలిగించడానికే వున్నాను. నీ క్షేమం కోరే నేను నీ ప్రియురాలిని చంపిన వార్తా విని ఎలా సహించాలి? అలా మాట్లాడినందుకు క్షమించు. అలా అయితే ఇప్పుడేమి చేద్దామంటావా? లంకను రావణాసురిడితో సహా నాబాణాలతో నాశనం చేస్తాను".

సర్గ–84
ఇంద్రజిత్తు మాయోపాయాన్ని శ్రీరాముడికి చెప్పిన విభీషణుడు

ఈ విధంగా తమ్ముడు లక్ష్మణుడు ప్రేమతో అన్న శ్రీరాముడికి ఓదార్పు మాటలు చెప్తుండగా, రామలక్ష్మణులు వున్న ప్రదేశానికి విభీషణుడు వచ్చి, దుఃఖిస్తున్న లక్ష్మణుడిని, ఇతర వానరులను చూసి, వారలా ఎందుకున్నారని అడిగాడు. జవాబుగా కన్నీరు కారుస్తూ లక్ష్మణుడు, సుగ్రీవుడిని, విభీషణుడిని, వానరులను చూస్తూ, హీనస్వరంతో, ఇంద్రజిత్తు చేతిలో సీతాదేవి హతమైందనీ, అది విని రామచంద్రుడు మూర్ఛపోయాడనీ అంటూ ఇంకా ఏదేదో చెప్పబోయాడు. అతడి మాటలకు అడ్డు తగిలి విభీషణుడు రామచంద్రమూర్తిని చూసి ఇలా అన్నాడు.

"పుణ్యాత్ముడా! సముద్రం ఇంకిపోయిందని ఎవరైనా చెప్తే, అది ఎంత నిజమో, హనుమంతుడు చెప్పింది కూడా అంత నిజమే! నమ్మతగినది కాదు. ఎందుకంటే, సీతావిషయంలో రావణుడి చిత్తవృత్తి నాకు తెలుసు. ఆమెను వాడు చంపడు కాక చంపడు. ఏవిధంగానైనా బాధించడు. నామాట నమ్ము. ఆమెకు భయంలేదు. రామచంద్రా! సీతాదేవిని వదిలిపెట్టు, లంకలో నీస్వాధీనంలో వుంచుకోవద్దని నేనెంతగానో నచ్చచెప్పాను. నా హితసూక్తి వాడు వినలేదు. సామదాన భేదం వల్లకాని, మాయాదండం వల్ల కాని, సీతాదేవి సమీపానికి పోవడం కూడా ఎవ్వరికీ సాధ్యపడదు. కాబట్టి ఇంద్రజిత్తు సీతాదేవిని లాక్కొని తెచ్చి సంహరించడం అనేది అవాస్తవం".

ఇంద్రజిత్తు నికుంభిల యాగం చేస్తున్నాడని శ్రీరాముడికి చెప్పిన విభాషణుడు

విభీషణుడు ఇంకా ఇలా అన్నాడు. "నేను చెప్పేది నిజమైతే ఇంద్రజిత్తు ఇలా

చేయడానికి కారణం ఏమిటని నువ్వు అడగవచ్చు. నిష్ప్రయోజనంగా వాడిలాంటి పని చేస్తాడా అంటావేమో? ఇప్పటిదాకా లంకలో వున్న యోధులంతా యుద్ధం చేస్తుంటే వాడు తన ఇష్టం వచ్చినట్లు హోమాలు చేసి వస్తున్నాడు. ఇప్పుడు లంకలో వాడు తప్ప ఇతరులెవరూ ఇక్కడికి వచ్చి మనతో యుద్ధం చేసేవారు లేరు. వూరికే హోమం చేస్తుంటే వానరులు లంకలోకి ప్రవేశించి దాన్ని ధ్వంసం చేసి యజ్ఞానికి విఘ్నం కలిగిస్తారు. ఎవరు అతడు చేస్తున్న యజ్ఞాన్ని విఘ్నం చేస్తాడో అతడి చేతిలో ఇంద్రజిత్తు చస్తాడని బ్రహ్మవరం వుంది. ఆ కారణాన వానరులు కాని, మీరు కాని ఆ పక్కకు రాకుండా మనం ఇక్కడ ఏడ్చే పని కలిపించి వాడు అక్కడ హోమం చేస్తున్నాడు. అది పరిపూర్ణంగా సమాప్తమైతే వాడిని దేవతలైనా జయించలేరు. కాబట్టి వాడి పరాక్రమాన్ని విఘ్నం చేయగల వానరులను పంపాలి. వాడు మిమ్మల్నందరినీ మోసం చేశాడు. ఇది వాస్తవం. కాబట్టి వాడి యజ్ఞం పూర్తికాకముందే వానరులను పంపు. నిష్కారణమైన ఏడుపు ఆపుచేయి. దుఃఖపడుతున్న నిన్ను చూసి సేనకూడా నిస్సారమై వుంది. నువ్వు లేచి ధైర్యంగా వుంటే వానరులు ఉత్సాహంగా వుంటారు. ఆలశ్యం చేయకుండా మా వెంట లక్ష్మణుడిని పంపు. పగతీరగా లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపుతాడు. అక్కడిపోయి ముందుగా లక్ష్మణుడు ఇంద్రజిత్తు యజ్ఞాన్ని బాణాలతో చెడగొట్టాలి. ఆ తరువాత వాడిని వధించాలి. శత్రువును చంపడానికి ఉపేక్షించ కూడదు. లక్ష్మణుడికి అజ్ఞ ఇవ్వు. యజ్ఞం పూర్తయితే దేవతలు కూడా వాడిని జయించలేరు. యజ్ఞం పూర్తవుతే వాడు అదృశ్యుడై యుద్ధం చేస్తాడు".

సర్గ-85
ఇంద్రజితును చంపడానికి లక్ష్మణుడిని పంపమని శ్రీరాముడిని కోరిన విభీషణుడు

ఈ విధంగా విభీషణుడు చెప్పగా రామచంద్రమూర్తి ఆయన మాటలకు ధైర్యం తెచ్చుకుని ఇలా జవాబిచ్చాడు. "రాక్షస వీరా! నువ్వు చెప్పిన హితవచనాలు మళ్లీ చెప్పు. నాకు వినాలని వుంది" అని అంటాడు. అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు. "నీ ఆజ్ఞ తీసుకుని పోయి ఎక్కడెక్కడ ఏఏ సేనలను నిలపాలో ఆయా ప్రదేశాలలో ఆయా సేనలను నిలిపి, విభాగించి ఎంతవరకు భద్రపరచాలో అంతా చేశాను. ఆ విచారం నీకక్కరలేదు. ఇక నా మనవి విను. మనమిప్పుడు శత్రువును వధించాలి. నీకు జానకిని మళ్లీ స్వీకరించాలని కోరిక వుంటే రాక్షసులందరినీ చంపు. అంతదాకా నీకోరిక నెరవేరదు. ఆ కార్యం సాధించే ఉపాయం నేను చెప్తాను. వానరసేనతో నికుంభిలకు నీ తమ్ముడు శూరాగ్రేసరుడు లక్ష్మణుడిని పంపు. అతడు ఇంద్రజిత్తును చంపుతాడు".

"లక్ష్మణుడు అతడిని ఎలా చంపగలడని అడుగుతావేమో? ఇంద్రజిత్తు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మవల్ల బ్రహ్మశిరం అనే అస్త్రాన్ని, ఆకాశ సంచారం చేయగల గుర్రాలను, రథాన్ని వరంగా పొందాడు. ఆ కారణాన వాడు యజ్ఞం పూర్తిచేయాలని తలచి దానిమీదే మనసు నిలిపి వున్నాడు. సేన తనను చుట్టుకుని వుండగా వాడు కనపడకుండా నికుంభిలకు పోయాడు. ఆ యజ్ఞం వాడు పూర్తి చేస్తే మనమంతా చచ్చిపోయినట్లే. బ్రహ్మదేవుడు ఆ వరం ఇచ్చేటప్పుడు ఈ యజ్ఞాన్ని ఎవరు విఘ్నపరుస్తారో వాడి చేతిలో ఇంద్రజిత్తు చావున్నదని చెప్పాడు. కాబట్టి లక్ష్మణుడు పోయి యజ్ఞాన్ని విఘ్నం చేసినట్లయితే అతడి చేతిలో ఇంద్రజిత్తు తప్పక చస్తాడు. కాబట్టి అతడు పోవడానికి అనుమతి ఇవ్వు. వాడు చస్తే రావణుడు చచ్చినట్లే. రామా! ఇంద్రజిత్తు చేసే మాయలు, వాడి బలం, వాడి

వేగం నాకు తెలియంది కాదు''.

ఇంద్రజిత్తును చంపడానికి లక్ష్మణుడిని నికుంభిలకు పంపిన శ్రీరాముడు

విభీషణుడు ఇలా చెప్పగా తమ్ముడు లక్ష్మణుడితో శ్రీరాముడు ఈ విధంగా అన్నాడు. "లక్ష్మణా! సుగ్రీవుడి సమస్త సైన్యంతో, హనుమంతుడు, జాంబవంతుడితో, ఇతర మహానాయకులతో సహా పోయి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ మాయలమారిని చంపు. విభీషణుడు నీవెంట వచ్చి యజ్ఞవాటికను చూపిస్తాడు''. ఆ మాటలకు లక్ష్మణుడు, విభీషణుడు తమ-తమ ఆయుధాలను తీసుకుని పోవడానికి సిద్ధపడ్డారు. లక్ష్మణుడు కవచం తొడుక్కుని, అన్న పాదాలకు నమస్కారం చేసి, తన యుద్ధ ప్రయత్న వివరాలను చెప్పాడీవిధంగా.

"నేను విడిచే బాణాలు ఇంద్రజిత్తు దేహంలో దూరి లంకలో పడుతాయి. అప్పుడు వాడు బాణాలతో చీల్చబడిన దేహం కలవాడైపోయి నేలకూలుతాడు''. అని చెప్పి ఇంద్రజిత్తును చంపాలన్న కాంక్షతో రామచంద్రమూర్తికి ప్రదక్షిణ చేసి ఆయన పాదపద్మాలకు మరోమారు నమస్కారం చేసి, విభీషణ, అంజనేయులతో, వానరసేనతో, జాంబవంతుడితో కలిసి యుద్ధానికి నికుంభిలవైపు పోయాడు. పోయి రాక్షస శ్రేష్టులను చూశాడు. చూసి భయంకరమైన తన విల్లు తీసుకున్నాడు. హనుమంతుడితో, అంగదుడితో, విభీషణుడితో ఇంద్రజిత్తు యజ్ఞాన్ని బ్రహ్మవాక్యం ప్రకారం నాశనం చేయడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు ఆ సేనను చూసి విభీషణుడు ఇలా అన్నాడు.

సర్గ–86
లక్ష్మణుడికి ఇంద్రజిత్తు వున్న ప్రదేశాన్ని చూపించిన విభీషణుడు

విభీషణుడు లక్ష్మణుడితో స్నేహభావంతో ఇలా అన్నాడు. "లక్ష్మణా! విరోధులైన యుద్ధవీరుల సమూహాలు మబ్బులాగా నల్లగా కనపడుతున్నది చూడు. ఆ సమూహాలను భయంకరమైన బాణాలతో చీలికలై పోయేట్లు కొట్టు. ఆ సేన తొలగిపోతే క్రూరుడు, నీచస్వభావం కల రావణుడి కుమారుడు ఇంద్రజిత్తు ఆ సేనమధ్యన యజ్ఞం చేస్తూ కనపడతాడు". విభీషణుడు అలా చెప్పగానే పిడుగుల్లాంటి బాణాలను లక్ష్మణుడు తన బలం కొద్దీ వేశాడు. కోతులన్నీ చెట్లను, కొండలను ఆయుధాలుగా తీసుకుని ఆ సేనమీద పడ్డాయి.

ఇంద్రజిత్తు సేనలతో పోరాడిన కపులు

వానరుల దాడికి, లక్ష్మణుడి బాణాలకు భయపడకుండా రాక్షస సేనలు వానరసేనను తాకగా వారికి, వీరికి ఘోరమైన యుద్ధం జరిగింది. యుద్ధ భీకర ధ్వని లంకంతా పాకింది. ఈ స్థితిలో వానరుల ముందు నిలబడలేక రాక్షసులు చెదరిపోగా తన సేన దీనస్థితిని చూసి కోపంతో ఇంద్రజిత్తు హోమం చేయడం ఆపుచేసి బయటకు వచ్చాడు. వస్తూనే ముందుగా గుర్రాలు కత్తి సిద్ధం చేసిన రథం ఎక్కి విల్లు ధరించగానే వానర సేన అతడి రథాన్ని చుట్టుముట్టాయి. ఈ లోపల, ఇంద్రజిత్తు కనపడలేదే అని అనుకుంటున్న హనుమంతుడు, తన దేహాన్ని బాగా పెంచి, ప్రళయాగ్నిలాగా రాక్షసులను కాల్చడం మొదలెట్టాడు. చెట్టునొకదానిని తీసుకుని రాక్షసులను తరిమాడు.

రాక్షసులను నాశనం చేసిన హనుమంతుడు

హనుమంతుడిని రాక్షస మూకలన్నీ కలిసికట్టుగా ఎదుర్కొన్నాయి.

వారందరినీ పీనుగుపెంటలు చేశాడు హనుమంతుడు. తనను ఎదిరించి రాక్షస సమూహాలను నాశనం చేస్తున్న హనుమంతుడున్న దిక్కుగా రథాన్ని వేగంగా పోనిమ్మనీ, లేకపోతే ఆ వానరుడు రాక్షస సేననంతా నాశనం చేస్తాడని ఇంద్రజిత్తు అన్నాడు.

హనుమంతుడిని ఎదిరించిన ఇంద్రజిత్తు

విభీషణుడు ఇలా అనగానే అది విన్న రాక్షస మూకలు హనుమంతుడిని చుట్టుముట్టాయి. హనుమంతుడు వారందరినీ తొలగించుకుని రోషంతో ఇంద్రజిత్తును ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఓరీ దుష్ట రాక్షసుడా! దుర్బుద్ధీ! యుద్ధం చేయడంలో నువ్వు కూడా ఒక శూరుడివే అయితే, వంచన చేయకుండా యుద్ధానికి రా. హనుమంతుడిని ఎదిరించి నువ్వెలా ప్రాణాలతో పోగలవో చూస్తాను. దృఢత్వంతో అతిశయించిన నా చేతి పోటును నువ్వు సహిస్తేనేకదా నువ్వు శూరుడివనిపించుకుంటావు?". హనుమంతుడి పైకి బాణాలు వేసేందుకు విల్లెక్కుపెట్టుతున్న ఇంద్రజిత్తును చూపించి విభీషణుడు లక్ష్మణుడితో వాడే ఇంద్రజిత్తు అని చెప్పాడు. త్వరగా పోయి వాడిని బాణాలతో పడగొట్టమని పురమాయించాడు.

సర్గ–87

ఇంద్రజిత్తు యజ్ఞం చేసిన న్యగ్రోదాన్ని లక్ష్మణుడికి చూపించిన విభీషణుడు

ఆ విధంగా ఇంద్రజిత్తును చూపించిన విభీషణుడు, ఆ తరువాత వాడు యజ్ఞం విడిచి వచ్చినందుకు సంతోషపడుతూ, లక్ష్మణుడిని పిలిచి సమీపంలోనే వున్న వనంలోకి తీసుకుపోయి, అక్కడ ఇంద్రజిత్తు యజ్ఞం చేసిన విధానమంతా వివరించాడు. "లక్ష్మణా! భయంకరమైన మర్రి చెట్టు ఇదే! ఇక్కడ ఇంద్రజిత్తు భూతాలకు బలులిచ్చి, హోమం పూర్తి చేసి, యుద్ధానికి వస్తాడు. రాగానే ఎవరికీ కనపడకుండా యుద్ధం చేస్తాడు. శత్రువులను చంపుతాడు. అందుకే మళ్లీ ఇక్కడికి ఇంద్రజిత్తు రాకుండా రథంతో, సారథితో సహా చంపు" అని చెప్పాడు విభీషణుడు. అలాగే చేస్తానని లక్ష్మణుడు తన విల్లు తీశాడు. ఇంతలో మర్రిదగ్గరున్న లక్ష్మణుడి దగ్గరికి ఇంద్రజిత్తు వచ్చాడు. అతడిని చూడగానే కోపంతో లక్ష్మణుడు ఇలా అన్నాడు. "నిన్ను వెతుక్కుంటూ వచ్చాను వంచకుడా! యుద్ధ బిక్ష పెట్టు. నీ మాయలిక సాగవు".

విభీషణుడిని అధిక్షేపించిన ఇంద్రజిత్తు

లక్ష్మణుడు ఇలా చెప్పగానే ఆయన పక్కనే వున్న తన పినతండ్రి విభీషణుడిని చూసి కోపంతో ఇంద్రజిత్తు "కఠినచిత్తుడా! ఈ కులంలో, వంశంలో పుట్టావు, పెరిగావు. నా తండ్రి, నువ్వు ఒక్క తల్లి బిడ్డలు. నువ్వు నాకు పినతండ్రివి అయినప్పటికీ నన్ను చంపించాలని ప్రత్యక్ష ద్రోహానికి తలపడడం న్యాయమా? ధర్మద్రోహీ! దుష్టబుద్ధీ! నీలో చుట్టం అనే మాట లేదు. నేను నీకు చుట్టాన్ని అని అనుకుంటే ఇలాంటి ద్రోహం చేస్తావా? జాత్యభిమానం లేకపోయినా స్నేహభావం కూడా నామీద లేదే? కనీసం ధర్మ విచారమైనా చేశావా? ఇవేవీ

లేని నీకు ద్రోహం చేయకూడదన్న బుద్ధి ఎలా కలుగుతుంది? నీచులకు బుద్ధి నేర్పు వుంటుందా? తన బంధువులను వదిలి, శత్రువులను ఆశ్రయించి, వారికి సహాయం చేసి, తనవారంతా నిర్మూలమైన తరువాత ఆ శత్రుపక్షం వారితోనే అతడూ చెడిపోతాడు. శత్రువులు అతడి సహాయంతో ప్రతిపక్షం వారిని వధించి, ఆ తరువాత శత్రుశేషం వుండకూడదని ఇతడినీ వధిస్తారు. దయ అన్న మాటకూడా లేని నీతిమాలినవాడా! నాలాంటి కొడుకును చంపించే ఘోరమైన పని నువ్వు తప్ప మరెవరైనా చేస్తారా?" అని అంటాడు.

ఇంద్రజిత్తుకు సమాధానం చెప్పిన విభీషణుడు

తనను ఇలా దూషిస్తున్న అన్న కొడుకు ఇంద్రజిత్తుతో విభీషణుడు ఇలా అన్నాడు. "రాక్షస రాజకుమారుడా! నువ్వు ఆ తండ్రికి తగ్గ తనయుడివే! నన్ను నువ్వు దయాహీనుడివి అన్నావు. కాని నీలాగా నేను నయవంచకుడిని కాదు. నా స్వభావం, నడవడి నీకు తెలియంది కాదు. నేనెప్పుడైనా నీటికి విరుద్ధమైన పని చేశానా? ఎందుకు ఇలా వాగుతావు? నేను నీ పినతండ్రినన్న గౌరవం నీకు నామీద వుంటే, నాకు నువ్వు అన్న కొడుకని తలచవచ్చు. నేను నీ పినతండ్రి అన్న గౌరవం వుంటే ఇలా మాట్లాడుతావా? నిండు సభలో నన్ను నువ్వు చులకనగా మాట్లాడలేదా? అలాంటప్పుడు నీమీద నాకెలా వాత్సల్యం వుంటుంది? ఆనాడు నువ్వు మాట్లాడిన మాటలు పినతండ్రిని అనాల్సిన మాటలా? ఈ బంధుత్వం, ఈగౌరవం ఇవ్వాళే గుర్తుకు వచ్చిందా?"

"ఓరీ నువ్వు చెప్పినట్లు నేను రాక్షసులలో పుట్టాను. రాక్షసులలో పెరిగాను. కాదనను. కులం ప్రధానమా? గుణం ప్రధానమా? గుణమే ప్రధానమైతే నేను రాక్షసుడిని కాదని వెయ్యిసార్లు చెప్తాను. మీరు చేసే క్రూరకార్యాలు నాకెప్పుడూ రుచించలేదు. వాటిని నేనేనాడూ ఆమోదించలేదు. ఏనాడైనా మీతో మీరు చేసే పనుల్లో కలసి వచ్చానా? మీ సహాయం నేనెప్పుడైనా అడిగానా? మీకెప్పుడైనా సహాయపడ్డానా? అధర్మం నాకిష్టం లేదు. అన్నను విడిచానని అన్నావు. ఎలాంటి అన్నైనా తమ్ముడిని ఛీ! పో! అని నిండు సభలో అంటాడా? నామాటలు ఇష్టం లేకపోతే విని వూరుకోవాలి. తమ్ముడిని సభలో అవమానించవచ్చా? నిష్కారణంగా ఆశ్రితుడిని వెళ్ళగొట్టడం అంటే చంపడమే! అన్నదమ్ముల వరసలు ఇవ్వాళే నీకు తెలిశాయా?".

"అయినవారైనా సరే, వారు ధర్మహీనులైతే వారిని వదిలిపోవాలి.

పాపకార్యాలు చేసినవారిని కూడా వదిలిపోవాలి. పాపపు మనస్సు, పాప స్వభావం కలవాడా! పరుల ధనం, పరుల భార్యలను హరించడం మీ నైజం. ఇలాంటివారితో కూడి వున్నవాడు వారితో సహా చస్తాడు. పరుల ధనం హరించడం, పరుల భార్యలకు ఆశపడడం, తన మేలు కోరినవారిని సందేహించడం, ఈ మూడూ వినాశకారణాలే. ఈ దుర్గుణాలన్నీ మీ తండ్రిలో వున్నాయి. ఆయన మేలుకోరి ఇవి తప్పని చెప్పిన నన్ను శత్రుపక్షంలో చేరానని దూషించాడు. నామీద శత్రుబుద్ధి వున్నవాడు నేనక్కడ వున్నా నన్ను మిత్రుడని భావిస్తాడా? నేనాయనకు ప్రత్యక్ష శత్రువునని నిండు సభలో చెప్పిన తరువాత కూడా నేనక్కడ వుంటే, నేనేదో కీడు తలపెట్టుతున్నానని వాడు భావిస్తాడు. అలాంటి పొత్తుతో నేనెట్లా బతకగలను?"

"నీ తండ్రిలో సుగుణాలు లేవా? అన్నీ దుర్గుణాలేనా అని అడుగుతావేమో? నేనామాట అనలేదు. నీ తండ్రిలో సుగుణాలు కూడా వున్నాయి కాని, అంతకంటే ఎక్కువగా దుర్గుణాలు వున్నందువల్ల , అవి సుగుణాలను కానరాకుండా చేశాయి. ఈ దోషాలున్నందువల్లే కదా నీ తండ్రిని, నా అన్నను సంతోషంగా వదిలి వచ్చాను. ఇక భూమ్మీద నీ లంక లేనట్లే లెక్క. నీ తండ్రి కూడా లేనివాడే. మీరంతా నాశనమయ్యారని నమ్ము. నువ్వు బలవంతుడిననీ, బ్రహ్మవరాలున్నాయనీ, నీకెవ్వరు ఎదురనీ గర్వం వుంది. దానికితోడు పిల్లవాడివి. కష్టనష్టాలు తెలియనివాడివి. బాలుడివైనందున మంచిచెడ్డల విచక్షణ చేయలేనివాడివి. వినయం అంటే ఏమిటో నీకు తెలియదు. చావడానికి సిద్ధపడ్డావు. కాబట్టి ఓరీ మూర్ఖుడా! నీనోటికి వచ్చినట్లు వాగు. నీకెలాగూ కీడు మూడింది. ఇప్పుడు నువ్వు చేయగలది ఏదీ లేదు. వాదన ఎందుకు? నువ్వు మళ్లీ మర్రి దగ్గరికి పోలేవు. హోమం చేయలేవు. ప్రత్యక్ష యుద్ధంలో నువ్వు లక్ష్మణుడిని ఎదిరించి బతకలేవు. ఇక నీ మాయా యుద్ధాలు చెల్లవు. యుద్ధంలో లక్ష్మణుడు నిన్నిప్పుడే చంపుతాడు. ఇక్కడ చేద్దామనుకున్న దేవతార్చన యమపురిలో చేయి. ఈ దేహంతో, సేనతో నువ్వు లంకకు పోలేవు".

సర్గ–88
ఇంద్రజిత్తు లక్ష్మణుల సంభాషణ

విభీషణుడు ఈ విధంగా చెప్పడంతో కోపించిన ఇంద్రజిత్తు, హనుమంతుడి వీపుమీద వున్న లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు. "నా బాణాలు నిన్నేమి చేయబోతున్నాయో చూడు. నీ సేనను అవి కాలుస్తాయి. ఇప్పుడే మీరంతా యమపురికి పోతారు. ఎవరైనా నా బాణ వర్షాన్ని సహించగలరా? లక్ష్మణా! గతంలో నా బాణాల దెబ్బకు తెలివితప్పి కొనవూపిరితో పడిపోయిన సంగతి మరిచావా? తెలివిమాలినవాడివై మళ్లీ ఇక్కడికి వచ్చావు". జవాబుగా లక్ష్మణుడు, "చేతగాని ప్రతిజ్ఞలు ఎందుకు పలుకుతావు? పనికిరాని మాటలు ఎందుకు అంటావు? మాయా యుద్ధం చేయలేవు కదా ఇక? ఏదీ నీ బాహాటమైన శక్తి చూపించు ఒక్కసారి. నా భుజబలంతో నిన్ను యుద్ధంలో ఓడిస్తాను".

ఇంద్రజిత్తు, లక్ష్మణుల మధ్య ప్రారంభమైన యుద్ధం

లక్ష్మణుడి మాటలకు జవాబుగా ఇంద్రజిత్తు అతడిమీద బాణాలను వేసి యుద్ధాన్ని ప్రారంభించాడు. లక్ష్మణుడి దేహం ఆ బాణాలకు తడిసి నెత్తురయింది. అతడలా వుండగా ఇంద్రజిత్తు పరుషపు మాటలతో లక్ష్మణుడిని రెచ్చగొట్టాడు. ఇరివురి మధ్య వాదన జరిగిన తరువాత లక్ష్మణుడు తన పదునైన బాణాలను రాక్షసుడి మీద వేశాడు. అవి వాడి రొమ్మును బలంగా తాకాయి. ఇలా ఇద్దరూ జయం చేకూరాలని యుద్ధం చేశారు. ఒకరినొకరు ఎదుర్కున్నారు తీవ్రంగా. ఇద్దరూ సమానంగా యుద్ధం చేశారు.

సర్గ-89
లక్ష్మణుడి బాణాలకు నొచ్చుకున్న ఇంద్రజిత్తు

లక్ష్మణుడు ఒక గొప్ప బాణాన్ని సంధించి వేయడంతో ఇంద్రజిత్తు కాంతి చెడినట్లు అయ్యాడు. అక్కడే వున్న విభీషణుడు ఇంద్రజిత్తు మీద త్వరత్వరగా బాణాలు వేయమని లక్ష్మణుడిని పురమాయించాడు. లక్ష్మణుడు అలాగే చేసి, బాణ సమూహాలను వాడి దేహంలో నాటుకునేట్లు వేశాడు. ఆ బాణాలకు ఇంద్రజిత్తుకు తెలివి తప్పినట్లయింది. అయినా తెప్పరిల్లుకున్నాడు. ఇరువురి మధ్య ఘోర యుద్ధం జరిగింది.

ఘోరంగా పోరిన ఇంద్రజిత్తు, లక్ష్మణుడు

తీవ్రమైన లక్ష్మణుడి బాణాలకు ఇంద్రజిత్తు కవచం, తునాతునకలై రథం మీద పడింది. ప్రతిగా భయంకరమైన బాణాలను వేసి ఇంద్రజిత్తు లక్ష్మణుడి కవచాన్ని కూడా ఖండించాడు. ఈ విధంగా ఇద్దరూ సరిసమానంగా యుద్ధం చేయసాగారు. ఒకరు వేసిన బాణాలను ఇంకొకరు ఖండిచారు. వారి బాణాలు ఆకాశాన్ని బంధించాయి. వారి బాణాలు కొన్ని వైరి దేహంలో దూరి, భూమిలో ప్రవేశించాయి. మరి కొన్ని బాణాలు ఆకాశానికి పోయాయి. కొన్ని ఎదుటివారి బాణాలను అణిచాయి. వీరి బాణాల యుద్ధం దేవతా సమూహాలకు సంతోషం కలిగించింది. ఇద్దరిలో ఎవరూ వెనుకడుగు వేయలేదు. యుద్ధం జరుగుతున్నంతసేపూ విభీషణుడు లక్ష్మణుడి పక్కనే వున్నాడు. శ్రద్ధగా లక్ష్మణుడికి సలహాలిచ్చాడు. ఎల్లప్పుడూ లక్ష్మణుడిని కనిపెట్టుకునే వున్నాడు.

సర్గ–90

కపులను ప్రోత్సాహపర్చిన విభీషణుడు

లక్ష్మణుడు, ఇంద్రజిత్తుల మధ్య ఘోరమైన యుద్ధం జరుగుతుండగా విభీషణుడి మంత్రులు శూలాలతో, బాణాలతో రాక్షసులను గుంపులుగుంపులుగా చెదరగొట్టారు. అప్పుడు విభీషణుడు, వానరులతో, "అసహాయ శూరులారా! నా మాట వినండి. రావణుడికి యుద్ధ వీరులలో ఇక మిగిలింది వీడొక్కడే. ఇక్కడ వున్న సేనమాత్రమే మిగిలింది ఇంకా. ఇక్కడ వీడు చస్తే, రావణుడు తప్ప మిగిలినవారంతా చచ్చినవారే. కాబట్టి, మీబలం పుంజుకుని రాక్షసులను చంపండి. రావణుడి సేనలోని కుంభకర్ణుడు, ప్రహస్తుడు లాంటి ప్రముఖ వీరులందరూ యుద్ధంలో చచ్చారు. వీడు ఒక్కడు మాత్రం మీకేం లెక్క? మీరు చేయాల్సిందల్లా ఈ సేనను చంపడమే. మిగిలినవారంతా ఇంతకు ముందే చచ్చారు. ఇంద్రజిత్తును లక్ష్మణుడే చంపుతాడు. మీరంతా కలిసి ఇంద్రజిత్తుకు సమీపంలోని సేనను చంపండి" అనగానే, వానరులంతా చెలరేగిపోయారు. వారితో అపరిమిత బలంతో యుద్ధం చేశారు. రాక్షస సేనలను చూసి వానరులు సింహనాదాలు చేశారు. అప్పుడు ఇంద్రజిత్తుకు, లక్ష్మణుడికి మధ్య దేవతలకు గగ్గురుపాటు కలిగించే రీతిలో యుద్ధం జరిగింది.

ఘోరంగా పోరిన ఇంద్రజిత్తు, లక్ష్మణుడు

ఇంద్రజిత్తు, లక్ష్మణుడు యుద్ధం చేస్తుంటే వారి బాణ సమూహాల మధ్య ఇద్దరూ దాదాపు కనబడలేదు. వారేకాదు....అక్కడున్న ఏ పదార్థమూ కనబడలేదు. భూమ్మీద గాఢ అంధకారం కమ్ముకుని కారు చీకటి కూడా

వ్యాపించింది. నెత్తురు వెల్లువలై పారింది. గాలి వీచలేదు. ఆ సమయంలో లక్ష్మణుడు నాలుగు బాణాలను వేసి ఇంద్రజిత్తు నాలుగు నల్ల గుర్రాలను కొట్టాడు.

ఇంద్రజిత్తు సారథిని చంపిన లక్ష్మణుడు

ఇలా ఇరువురి మధ్య ఘోర యుద్ధం కొనసాగుతుండగానే, లక్ష్మణుడు శూరుడైన ఇంద్రజిత్తు సారథి శిరస్సును నేల కూల్చాడు. సారథిని చంపి వెంటనే ఇంద్రజిత్తు విల్లు ఖండించగా ఇంద్రజిత్తు రథాన్ని తానే నడుపుకుంటూ మరో విల్లు తీసుకుని ఆశ్చర్యకరంగా యుద్ధం చేశాడు. సారథి పని కూడా వాడే చేస్తుంటే వాడి గుర్రాలను నొప్పించాడు. సారథి చనిపోయినందుకు దుఃఖపడ్డాడు ఇంద్రజిత్తు. కాంతివిహీనమైన అతడి ముఖం చూసి వానరులు లక్ష్మణుడిని శ్లాఘించారు. సారథి లేకపోయినా వాడి గుర్రాలు చక్కగా తిరగడం చూసిన శరభుడు, గంధమాదనుడు, రభసప్రమాధుడు అనే వానర వీరులు ఇంద్రజిత్తు నాలుగు గుర్రాలను చంపారు. రథాన్ని విరగ్గొట్టారు. గుర్రాలు, సారథి చావగా ఇంద్రజిత్తు నేలమీద నిలబడి లక్ష్మణుడిని ఎదిరించాడు కాని లక్ష్మణుడి బాణపరంపరలకు తట్టుకోలేక పోయాడు.

సర్గ–91

కపులను వంచించి లంకకు పోయి రథంతో వచ్చిన ఇంద్రజిత్తు

లక్ష్మణుడి బాణాలకు దీటుగా ఇంద్రజిత్తు కూడా బాణాలు వేశాడు. వారిద్దరూ ఇలా యుద్ధం చేస్తుంటే, వానరులు, రాక్షసులు కూడా ఒకరిమీద మరొకరు పోరాడారు. అప్పుడు ఇంద్రజిత్తు తెలివిగా రాక్షసులతో ఇలా అన్నాడు. "రాక్షసులారా! అన్ని దిక్కులా చీకట్లు కమ్ముకుని దట్టంగా వ్యాపించి వున్నాయి. మనవారెవరో, పరాయివారెవరో తెలవడం లేదు. ఇప్పుడొక సాహసకార్యం చేయాల్సివుంది. మీరు కొంచెమైనా ఎడమీయకుండా వానరులను తికమకపెట్టండి. వారు నేనిక్కడే వున్నానని భావించే విధంగా యుద్ధం చేయండి. అలా మీరు చేస్తే ఎవరూ అడ్డం రాకుండా నేను లంకకు పోయి వేరే రథాన్ని తీసుకుని క్షణంలో వస్తాను. ఈ వార్త వానరులకు తెలిస్తే నాకడ్డం తగులుతారు. లంకలోకి పోనీయరు. వారిని మీరు మోసగించాలి". ఇలా ఇంద్రజిత్తు చెప్పగానే రాక్షసులు తమ శక్తిసామర్థ్యాల మేరకు యుద్ధం చేశారు. ఇంద్రజిత్తు లంకకు పోయి వేరే రథంతో సారథితో సహా వచ్చాడు. వచ్చి, లక్ష్మణుడిని, విభీషణుడిని, వానరుల గుంపును తన బాణవర్షంతో యుద్ధం చేశాడు. వాడి యుద్ధ నైపుణ్యం లక్ష్మణుడిని, విభీషణుడిని ఆశ్చర్యానికి గురి చేసింది.

ఇంద్రజిత్తును బాధించిన లక్ష్మణుడు

ఇంద్రజిత్తు బాణాలను ఎదుర్కొనలేక వానరులు లక్ష్మణుడి చాటున దాక్కున్నారు. అప్పుడు లక్ష్మణుడు ఇంద్రజిత్తు విల్లు తునకలై పోయేట్లు ఒక బాణాన్ని వేశాడు. బాణ వర్షం కొనసాగించాడు వెంటవెంట లక్ష్మణుడు. ఇంద్రజిత్తు కవచం విరగ్గొట్టాడు లక్ష్మణుడు. ఇంద్రజిత్తు నెత్తురు కక్కుకుంటూ

లక్ష్మణుడి మీద బాణాలను వేశాడు వేగంగా. ప్రతిగా, లక్ష్మణుడు అనేక బాణాలను వేసి ఇంద్రజిత్తును ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఇరువురూ ఘోరంగా పోరాడారు. చివరకు లక్ష్మణుడు ఇంద్రజిత్తు సారథిని చంపాడు తన బాణాలతో. సారథి లేకపోయినా గుర్రాలు రథాన్ని నడిపించాయి. ఇంతలో విభీషణుడు తన గదతో ఇంద్రజిత్తు గుర్రాలను కొట్టి చంపాడు.

దివ్యాస్త్రాలతో పోరాడిన ఇంద్రజిత్తు లక్ష్మణుడు

గుర్రాలు చావడంతో ఇంద్రజిత్తు నేలమీదికి దూకి, విభీషణుడిని తన శక్తికొద్దీ కొట్టాడు. విభీషణుడు వజ్రాల లాంటి బాణాలను తన అన్న కొడుకు మీద వేశాడు. అవి అతడి రొమ్ములో నుండి దూసుకుపోయాయి. కోపించిన ఇంద్రజిత్తు యముడు తనకిచ్చిన భయంకరాస్త్రాన్ని విభీషణుడి మీద వేయగా లక్ష్మణుడు తనకు కుబేరుడు స్వప్నంలో ఇచ్చిన అసమానమైన మహాస్త్రాన్ని సంధించి దానిమీద వేశాడు. ఆ రెండు అస్త్రాలు నిప్పులు కక్కుతూ ఆకాశానికి ఎగిరి ఒకదాన్నొకటి ఎదుర్కొన్నాయి. రెండూ కలహించి, కలహించి నూరు తునకలై నేలరాలాయి. లక్ష్మణుడు అప్పుడు వారుణాస్త్రాన్ని వేయగా, ఇంద్రజిత్తు రౌద్రాస్త్రాన్ని వేసి దాన్ని ఖండించాడు. ఇంద్రజిత్తు వదలకుండా ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. లక్ష్మణుడు దాన్ని సౌరాస్త్రం వేసి ఖండించాడు. ఇలా దివ్యాస్త్రాలతో పోరాడుతున్న రాక్షస రాజకుమారుల యుద్ధాన్ని చూసిన దేవతలు ఆశ్చర్యపోయారు.

ఇంద్రజిత్తును వధించిన లక్ష్మణుడు

తాను వేసిన అన్ని అస్త్రాలనూ ఇంద్రజిత్తు ధైర్యంగా ఎదుర్కోవడంతో వాడిని అవి చంపలేక పోవడంతో లక్ష్మణుడు వాడిలా మామూలుగా చావడు అని నిర్ణయించుకున్నాడు. తాను ఒకవేళ బ్రహ్మాస్త్రం వేసినా వాడు కూడా బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడని భావించాడు. ఇలా ఆలోచించి, లక్ష్మణుడు, ఇంద్రాస్త్రాన్ని సంధించి ఇలా అనుకున్నాడు. “దశరథ రాజకుమారుడైన రామచంద్రమూర్తి ధర్మాత్ముడు, సత్యం తప్పని వాడు, పౌరుషంలో అసమానుడు అయితే, ఓ అస్త్రమా! ఈ ఇంద్రజిత్తును సంహరించు”. ఇలా అనుకుని బాణాన్ని సంధించి ఇంద్రజిత్తు మీద వేయగా అది సూర్యకాంతితో శిరస్త్రాణంతో, కుండలాలతో కూడిన ఇంద్రజిత్తు తలను ఖండించింది. అది చూసిన విభీషణుడు, వానరులు, దేవతలు సంతోషించారు.

ఇంద్రజిత్తు మరణానికి సంతోషించిన లోకాలు

తమ ప్రభువు మరణం చూసిన రాక్షసులు, వానరులు తమను తరుముకొస్తుంటే ఆయుధాలను నేలపడేసి, లంకవైపు పరుగెత్తారు. కొందరు తోచిన దిక్కుగా పరుగెత్తారు. కొందరు సముద్రంలో దూకారు. రాక్షసుల గుంపులో ఒక్కడైనా అక్కడ నిలబడలేదు. లోకాలకు ఆపద భయం లేకుండా పోయింది. జగాల దుఃఖం శమించింది. గంధర్వులు భయం విడిచి ఆకాశాన తిరగసాగారు. దేవతలు పుష్ప వర్షం కురిపించారు. దేవతలు, మునులు లక్ష్మణుడిని శ్లాఘించారు. బ్రాహ్మణులు ఇక నిర్భయంగా సంచరిస్తారని దేవతలు, బ్రహ్మర్షులు పలికారు. జాంబవంతుడు, హనుమంతుడు, విభీషణుడు, ఇంద్రజిత్తుని చంపిన లక్ష్మణుడిని పొగిడారు. ఆయన్ను స్తోత్రం చేశారు. దేవతలంతా సంతోషించారు.

సర్గ-92
ఇంద్రజిత్తు వధ విని లక్ష్మణుడిని పొగిడిన శ్రీరాముడు

ఇంద్రజిత్తును చంపిన లక్ష్మణుడు సంతోషంతో ఆ వార్త చెప్పడానికి విభీషణుడిని, హనుమంతుడిని వెంట పెట్టుకుని రామచంద్రమూర్తి దగ్గరికి పోయి ఆ విషయం చెప్పాడు. రామచంద్రమూర్తి ఆ వార్త విని చాలా సంతోషించాడు. "లక్ష్మణా! బలే-బలే! ఎంత మేలు చేశావు? నిన్ను మెచ్చుకుంటున్నాను. ఆ మూర్ఖుడు చావడం వల్ల ఇక సర్వకార్యాలు చక్కగా నెరవేరినట్లే" అని అంటూ శ్రీరాముడు లక్ష్మణుడిని తన తొడలమీద కూర్చుండబెట్టుకుని గట్టిగా కౌగలించుకున్నాడు. తమ్ముడి వంటి మీద వున్న ములుకులను చూసి అయ్యో! అతడికి ఇంత కష్టం వచ్చింది కదా అని బాధపడ్డాడు. అతడి దేహాన్ని తడుముతూ, శిరస్సు వాసన చూస్తూ శ్రీరాముడు తమ్ముడితో ఇలా అన్నాడు.

"అన్నా! లక్ష్మణా! నువ్వు చేసిన ఈ పరాక్రమ కార్యం ఇతరులకెవ్వరికీ సాధ్యం కాదు. మనకింక శుభాలు అధికంగా కలుగుతాయి. ఇంకా ప్రధాన శత్రువు రావణుడు వున్నాడని అంటావేమో? ఎప్పుడైతే కొడుకు చచ్చాడో, అప్పుడే తండ్రి కూడా చచ్చినట్లే. ఇక చచ్చినవాడిని చంపడం ఏం కష్టం? రావణుడిని అంత చులకనగా చూడొచ్చా అంటావేమో. యుద్ధంలో రావణుడికి కుడిచేయి ఇంద్రజిత్తు. కుడిచేయి పోయినవాడిని యుద్ధంలో జయించడం కష్టమా? రావణాసురుడికి అన్నిరకాల సహాయపడుతున్న ఇంద్రజిత్తును నువ్వు చంపావు. దాంతో నేను నిజంగా జయించినవాడినయ్యాను. వాడున్నంత వరకు నాకు జయం సందేహంగా వుండేది. ఈ యుద్ధంలో విభీషణుడు, ఆంజనేయుడు చేసిన సాహసకార్యాలు చెప్ప శక్యమా? వారిద్దరూ లేకపోతె మనం వాడిని

చంపగలిగే వాళ్లమా? మూడు పగళ్లు, మూడు రాత్రులు యుద్ధం చేసిన ఇంద్రజిత్తు ఎలాగో చచ్చాడు కదా? కొడుకు చావు వార్త విన్న రావణుడు తన మిగిలిన సేనతో సహా యుద్ధానికి వస్తాడు. నాకు యుద్ధ బిక్ష ఇస్తాడు. నాచేతుల్లో చస్తాడు. సాధుశీలా! నాకు యుద్ధంలో రక్షకుడిగా వుండి ఇంద్రజిత్తును చంపడం వల్లే కదా నాకు సీత లభిస్తున్నది? రాజ్యం కూడా లభిస్తున్నది. నువ్వా పని చేయకపోతే నాకా రెండు లేనట్లే కదా?"

ఇలా అంటూ శ్రీరాముడు లక్ష్మణుడిని గట్టిగా కౌగలించుకుని, సుషేణుడిని పిల్చి, తమ్ముడిని ఆరోగ్యవంతుడిగా చేయమని కోరాడు. తమ్ముడి దేహంలో నాటుకున్న ములుకులన్నీ బయటకు తీయమన్నాడు. అదేవిధంగా ఇతర భల్లూకాలను, వానరులను శీఘ్రంగా ఆరోగ్యవంతులను చేయమని చెప్పాడు శ్రీరాముడు. సుషేణుడు వెంటనే ఒక మూలికనిచ్చి లక్ష్మణుడిని వాసన చూడమన్నాడు. దాని వాసన చూడగానే దేహంలో నాటిన ములుకులన్నీ పడిపోయి లక్ష్మణుడి గాయాలన్నీ మానాయి. అలాగే సుషేణుడు మిగతా వానరులకు, భల్లూకాలకు, విభీషణుడికి, ఇతరులకు చికిత్స చేశాడు.

సర్గ–93

ఇంద్రజిత్తు మరణానికి విలపించిన రావణుడు

వానరులంతా ఇక్కడ ఇలా సంతోషంగా వుండగా, అక్కడ లంకలో రావణుడికి, ఆయన మంత్రులు, లక్ష్మణుడి చేతిలో ఇంద్రజిత్తు మరణించిన వార్తను చెప్పారు. కొడుకు మరణ వార్త వినగానే రావణుడు స్మృతి తప్పి పడిపోయి, మరల తెలివి తెచ్చుకున్నాడు. పుత్రశోకంతో మనస్సు కలత చెందినవాడయ్యాడు. దుఃఖంతో ఏడ్చాడు. ఏడుస్తూ ఇలా అన్నాడు.

"నేడు యముడు నాకు బలవంతంగానైనా పూజ్యుడు. ఎందుకంటే నీలాంటి బలవంతుడిని చంపాడు కదా? ఔరా! కాలగతిని ఎవరైనా ఎరుగుదురా? అన్నా! కుమారరత్నమా! మనుష్యులకైనా, దేవతలకైనా, శౌర్యవంతులకు, స్థైర్యంకలవారికి, తమ భర్తలకై ప్రాణాలు విడిచేవారికి, ఇదే మార్గం. కాబట్టి, నీలాంటివాడు ఏమార్గంలో పోవాలనో ఆ మార్గంలోనే నువ్వు పోయావు. కాబట్టి నీకొరకు నేను దుఃఖపడను కాని, నావాడని చెప్పుకోవడానికి వీలుకాని నా దుస్థితికి, నా దీనదశకు ఏడుస్తున్నాను. దేవతలు, దిక్పాలకులు, ఋషులు నువ్వు చనిపోయావన్న వార్త విని హాయిగా సుఖపడతారు. తండ్రినైన నన్ను, ఈ యౌవ రాజ్యాన్ని, లంకను, రాక్షస సమూహాలను, నీ భార్యను, నీ తల్లిని అందరినీ వదిలి నువ్వొక్కడివే పోవడం ధర్మమా నాయనా! ముందుగా నేను పోతే నువ్వేకదా నాకు ప్రేతకార్యాలు చేయాల్సినవాడివి? అలాంటిది, దైవం మోసగించడం వల్ల నేను నీకు చేయాల్సి వచ్చింది. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు ప్రాణాలతో వుండగా, వారిని చంపకుండా, నాకు సుఖం కలిగించకుండా, నన్నీవిధంగా

తీవ్ర దుఃఖంలో పడవేసి నువ్వు మాత్రం ఊర్ధ్వలోకాలకు పోవడం న్యాయమా?"

రాక్షసులకు తన పరాక్రమాన్ని తెలిపిన రావణుడు

ఇలా ఏడుస్తూ రావణుడు కోపంతో మండిపోతుంటే ఎండాకాలంలోని సూర్యుడిలాగా మండిపడ్డాడు. కోపాగ్నితో ఆయన ఎర్రటి కళ్ళు మరింత ఎర్రగా అయ్యాయి. వాడి శరీరం రుద్ర రూపం దాల్చింది. యముడి చూపుల్లాగా వున్న అతడి చూపులకు భయపడి రాక్షసులు గుంపులు కట్టి పరుగెత్తారు. అలా పోతున్న రాక్షసులను ఉద్దేశించి రావణుడు, పళ్ళు పటపటా కొరుకుతూ ఇలా అన్నాడు. "రాక్షస శ్రేష్టులారా! మీరెందుకు భయపడతారు? నా శక్తి విశదంగా చెప్తాను వినండి. వేలకొలది సంవత్సరాలు అప్పుడప్పుడూ గొప్ప తపస్సు చేసి బ్రహ్మదేవుడిని మెప్పించాను. ఆ తపోబలం వల్ల దేవాసురులవల్ల చావు లేకుండా బ్రహ్మతో వరాలు పొందాను. వజ్రంకూడా భేదించలేని కవచాన్ని బ్రహ్మవరం వల్ల పొందాను. అది ధరించి రథం మీద నుండి పోరాడుతుంటే యుద్ధంలో నన్నెవ్వరూ ఎదిరించలేరు. బ్రహ్మ ఇచ్చిన విల్లు, బాణాలు ధరించి యుద్ధభూమిలో నిలబడితే ఇంద్రుడైనా నన్ను గెల్వగలడా? ఇక రామలక్ష్మణులు నాకొక లెక్కా? అనేక వాద్యాల ధ్వనులు మోగుతుండగా నా విల్లు తీసుకుని రండి. సూర్యుడితో సమానమైన బాణసమూహాలను వేసి రామలక్ష్మణులను నరికి వేస్తాను".

సీతను చంపబోయిన రావణుడు

ఇలా కోపంతో మాట్లాడుతున్న రావణుడికి కొడుకు ఇంద్రజిత్తు స్మరణకు రాగానే అతడు చనిపోయాడే అని సంతాపపడుతూ కోపం పెరిగిపోయి, సీతను చంపాలి అని నిర్ణయించుకుని, దీనస్వరంతో రాక్షసులతో ఇలా అన్నాడు. "నా కొడుకు వానరులను వంచించడానికి మాయా సీతను సృష్టించి దాన్ని వధించాడు. నేనేమో వాస్తవ సీతనే, క్షత్రియాధముడి మీద ప్రేమకల సీతనే, జనకరాజు పుత్రికనే, చంపుతాను. దాంతో మన పీడ పోతుంది".

ఇలా అంటూనే, రావణుడు తన మంత్రులతో, భార్యలతో సీత వున్న అశోకవనం దిక్కుగా పోయాడు. సీతను చంపవద్దని మంత్రులు చెప్పినా, బంధువులు అడ్డగించినా, స్నేహితులు వారించినా, పెద్దలు తగదని సూచించినా వినకుండా సీతను చంపడానికి పరుగెత్తాడు రావణుడు.

రావణుడిని చూసి దుఃఖించిన సీతాదేవి

అలా వస్తున్న రావణుడిని చూసిన సీత, అయ్యో! వీడు నన్ను చంపడానికి

వస్తున్నాడే అనుకుంది. రామలక్ష్మణులను చంపి తన దగ్గరికి వస్తున్నాడేమోనని కూడా అనుమానించింది. లేదా, రామలక్ష్మణులను చంపలేక తనను చంపడానికి వస్తున్నాడని కూడా భావించింది. హనుమంతుడు చెప్పినట్లు, ఆయన సూచన మేరకు, ఆయన వీపు మీద ఎక్కి పోయి వుంటే బాగుండేది కదా అని కూడా అనుకుంటుంది. దీనంతటికీ ప్రధాన కారణం కైకేయి దాసి మంథర కదా అనుకుంటుంది.

రావణుడికి నీతి బోధించి మరలించిన సుపార్శ్వుడు

ఇలా బాధపడుతూ ఏడుస్తున్న సీతను గమనించిన సుపార్శ్వుడు అనే పవిత్ర గుణాలు కలిగిన మంత్రి రావణుడి దగ్గరికి పోయి వాడి మనస్సుకు హత్తుకునేట్లు కొన్ని మంచిమాటలు ఇలా చెప్పాడు. "పది తలలవాడా! రావణా! బ్రహ్మ వంశంలో పుట్టి, కుబేరుడికి తమ్ముడివై, వేదాలన్నీ చివరకంటూ అధ్యయనం చేసి, వ్రతాలన్నీ నెరవేర్చి, స్నాతకుడివై, నిత్యం చేయాల్సిన ఉచిత కర్మలు చేస్తున్నవాడివైన నువ్వు చివరికి ఒక ఆడదాన్ని చంపడానికి తెగించావు. నువ్వెంత వీరుడివి? ఈమె ఎంత సౌందర్యవతో అద్దైనా చూడు. ఇలాంటి దాన్ని చంపడానికి నీ మనసెలా ఒప్పింది? గౌరవించాల్సిన పదార్థాన్ని హింసించవచ్చా? రాక్షసరాజా! మాలాంటి శూరుల సహాయం తీసుకుని నీకోపాన్ని రామచంద్రుడి మీద చూపి ఆయన్ను గెలిస్తే లోకం నిన్ను శూరుడివని మెచ్చుకుంటుంది కాని, ఏ అపార్థం చేయని, నీ మీదకు యుద్ధానికి రాని, నీకు ఏకీడు చేయని ఆడదాన్ని చంపితే నిన్ను పౌరుషశాలి అని ఎవరంటారు? ఇవ్వాళ కృష్ణపక్ష చతుర్థశి. ఇప్పుడు శత్రువుపై దండయాత్రకు పోయే సన్నాహం చేసి, రేపు అమావాస్య నాడు సేనతో పోయి రాముడితో యుద్ధం చేసి ఆయన్ను చంపు. నువ్వే శూరుడివై, ధీరుడివై, సాయుధిడివై పోయి యుద్ధం చేసి జయించు. నీ కోరిక నెరవేరుతుంది. సీత నీకు స్వాధీనపడుతుంది".

(నవమినాడు యుద్ధారంభం. రెండు రోజుల్లో రావణ ఇంద్రజిత్తుల మూలబలం తప్ప తక్కినవారంతా చనిపోయారు. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి నాడు ఇంద్రజిత్తు యుద్ధం, ఆయన మరణం అయింది. చతుర్దశి నాడు మూలబల యుద్ధం. రావణుడు స్వయంగా యుద్ధానికి బయల్దేరడం).

ఇలా సుపార్శ్వుడు చెప్పడంతో చెడ్డ మనస్సు కలవాడైనప్పటికీ రావణుడు ధర్మంతో కూడిన మంత్రి మాటలు మన్నించి ఇంటికి పోయి మంత్రులతో కూడి సభ తీర్చి, సమాలోచన చేశాడు.

సర్గ-94
మూలబల యుద్ధం

మంత్రులకు, హితులకు, సన్నిహితులకు నమస్కారం చేసి రావణుడిలా అన్నాడు. "కార్యసాధకులారా! మీరు చతురంగ సైన్యంతో యుద్ధానికి పోయి వానరులతో యుద్ధం చేయకుండా కేవలం రాముడిని మాత్రం చుట్టుకుని శరవర్షాలతో ముంచి చంపండి. చంపలేకపోతే గాయాలు చేయండి. అలసిపోయేట్లు చేయండి. నేను యుద్ధానికి వచ్చేటప్పటికి అతడు అలసిపోతే అది నాకు సహాయపడుతుంది. రేపు నేను మీకు సహాయంగా వచ్చి రాముడిని చంపి, జగత్ప్రసిద్ధంగా జయం పొంది, మీ అందరికీ తగిన బహుమానాలు ఇస్తాను". రావణుడు ఇలా చెప్పగానే మూల సైన్యమంతా ఆయన మాటలకు అంగీకరించి యుద్ధానికి బయల్దేరారు. వెళ్లి వానరులతో యుద్ధం చేశారు. మహా భయంకరంగా వానర-రాక్షస యుద్ధం జరిగింది. నెత్తురు వరదలై పారింది.

మూల బలాలను సంహరించిన శ్రీరాముడు

ఇలా వానర-రాక్షస యుద్ధం జరుగుతుంటే, రామచంద్రమూర్తి ఉత్తమమైన ఒక విల్లు తీసుకుని శత్రుసమూహంలో ప్రవేశించి, జోరుమని బాణవర్షం కురిపించాడు. రామబాణాలు రాక్షసులమీద ఒక్కసారిగా అగ్నిజ్వాలలు పడ్డట్లు కురిశాయి. ఆ ధాటికి వారు మిడుతల దండులాగా కాలిపోయారు. రాక్షస సైన్యం పీనుగులతో యుద్ధభూమి నిండిపోయింది. రామచంద్రమూర్తి గంధర్వాస్త్రం ప్రయోగించి శత్రువులమీద వేయగా వారు దిగ్భ్రమ చెందారు. ఒకరినొకరు వారే చంపుకున్నారు. రామచంద్రమూర్తి ధనస్సనే సుదర్శన చక్రానికి రాముడి దేహమే మధ్య ప్రదేశం. బలమే జ్వాల. బాణాలే ఆకులు. నేమే

చాపం. అల్లైతాటి ధ్వనే జ్వాలల ధ్వని. తేజస్సే కన్ను. శరీరకాంతే ప్రభ. దివ్యాస్త్రాలే ధార. ఈ విధంగా ప్రకాశిస్తూ రాక్షసులను నాశనం చేస్తున్న రామచక్రాన్ని జ్యోతిశ్చక్రంలాగా ప్రజలు చూశారు. ఈ యుద్ధంలో లెక్కలేనన్ని (లక్షల, కోట్ల) రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం పాల్గొన్నాయి. ఇంత సేనకూడా హతమైపోయింది. ఇంత సేనను, కామరూపులైన రాక్షసులను, రామచంద్రమూర్తి కాలినడకన, ఎవరి సహాయం లేకుండా, ఒంటరిగా, గంటన్నర సమయంలో నేలపాలు చేశాడు. చావగా మిగిలినవారు లంకకు పారిపోయారు. రాక్షస సైన్యమంతా నాశనం కాగానే శ్రీరాముడు సమీపంలో వున్న సుగ్రీవుడిని, విభీషణుడిని, హనుమంతుడిని, జాంబవంతుడిని, మైందద్వివిదులను, మిగిలిన వానర నాయకులను పిలిచి తాను ఉపయోగించిన గంధర్వాస్త్రం శక్తిని వివరించాడు.

సర్గ–95
రాక్షస స్త్రీ విలాపం

రావణుడు పంపించిన మూల సైన్యమంతా రామబాణాలకు చావగా రాక్షస స్త్రీలు భోరున ఏడవడం జరిగింది. ఎందుకిలా జరిగిందని విచారించారు. ఖరదూషణాదులను రాముడు చంపిన తరువాత శూర్పణక కారణాన రామరావణులకు విరోధం కలిగిందనీ, దాని పర్యవసానమే ఇదనీ, ఇలా జరగడం తమ దురదృష్టమనీ వారనుకున్నారు. తన కోరిక తీర్చుకోవడానికి సీతాదేవిని తెచ్చాడు కాని, వాడి కోరిక తీరడం అసంభవమని వారనుకున్నారు. వాడు చావడం ఖాయం కాని వాడి కోరిక తీరడం జరగదని వారు ఏడ్చుకుంటూ అనుకున్నారు.

రాముడు ఎవరెవరిని (ఖరుడిని,దూషనుడిని, త్రిశీర్షుడిని, కబంధుడిని, వాలిని) ఎలా చంపాడో వారంతా జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సుగ్రీవుడిని రాజుగా చేసిందీ గుర్తు చేసుకున్నారు. ఇన్ని కారణాల వల్ల రామచంద్రమూర్తి బలవంతుడని రావణుడికి తెలియాలి కదా! అనుకున్నారు. విభీషణుడి మాటలు పెడచెవిన పెట్టాల్సింది కాదనుకున్నారు. అతడి మాటలు విని ఆనాడే సీతను శ్రీరాముడికి ఇచ్చివుంటే లంక ఇలా శ్మశానం కాకపోయేది కదా అనుకున్నారు. కుంభకర్ణుడి మరణం, ఇంద్రజిత్తు మరణం చూసైనా సంధి చేసుకోకపోవడం రావణుడి తప్పుగా భావించారు. రావణుడు ఎంత మూర్ఖుడో కదా అని బాధపడ్డారు. మూలబలాలను మొత్తం, లక్షల కొలది రాక్షసులను ఒక్క రాముడే భయంకరంగా వధించాడంటే ఆయన సామాన్య మనుష్యుడా? కాదనీ, విష్ణువో, రుద్రుడో, ఇంద్రుడో శ్రీరాముడి రూపంలో వచ్చారనీ, అందరినీ వధించాడనీ, ఇక మనమెలా బతకాలనీ వాపోయారు. రావణుడి వరాలు వాడిని కాపాడలేవని

నిర్ధారించుకున్నారు. రావణుడు కూడా రాముడి చేతిలో చావడం ఖాయమని అనుకున్నారు.

శ్రీరాముడి ఎదుట పడ్డవారిని ఎవరూ కాపాడలేరనీ, ఇక రావణుడు బతకడం జరగదనీ నిర్ణయించుకున్నారు. వారింకా ఇలా అనుకున్నారు. "ఈ రావణుడు బ్రహ్మను వరాలు కోరినప్పుడు దేవ, పన్నగ, గరుడ, రాక్షసాదులతో చావులేకుండా వరాలు కోరి మనుష్యులు తననేమీ చేయలేరని వారి చేతుల్లో చావు లేకుండా వరాలు కోరలేదు. దాని ఫలమే ఇప్పుడు వాడి చావుకు దారితీస్తున్నది. ఇదొక్క రావణాసురుడితో ఆగదు. సర్వ రాక్షసులు నాశనం కావాల్సినవారే. దేవతలు రావణుడి బారినుండి తమను రక్షించమని శివుడితో మొరపెట్టుకుంటే, ఆయన ప్రతి విధానం చెప్పాడు. దాని ప్రకారం, వారి మేలుకొరకై రాక్షసులను చంపే స్త్రీ పుట్టుతుందని ఆమె రాక్షసుల నాశనానికి కారణం అవుతుందని అంటాడు. ఆమే సీత. రావణుడి వంశనాశనం చేయడానికి వచ్చింది. రామచంద్రుడి బారినుండి మనల్ని రక్షించగలవాడు ముల్లోకాలలో ఎవరూ లేరు". ఇలా చెప్పుకుంటూ రాక్షస స్త్రీలు ఒకరినొకరు పట్టుకుని దుఃఖపడుతూ, గొంతెత్తి బిగ్గరగా ఏడ్చారు. వారి ఏడుపు ధ్వనికి దిక్కులు మారుమోగాయి.

సర్గ-96
పౌరుషోక్తులు పలికిన రావణుడు

రాక్షస స్త్రీల ఏడుపు ధ్వని రావణుడి చెవినపడ్డది. నిట్టూర్పులు విడుస్తూ రావణుడు ఆలోచనలో పడ్డాడు. ఆ సమయంలో ఆయన ఆకారాన్ని చూసిన రాక్షసులకు కూడా భయం కలిగింది. పటపటా పండ్లు కొరుకుతూ, పెదవి కొరుకుతూ, ముఖమంతా నెత్తురులాగా మారిపోగా సమీపంలో వున్న రాక్షసులతో "మహాపార్శ్వుడిని, విరూపాక్షుడిని, మహోదరుడిని యుద్ధానికి పొమ్మని నా ఆజ్ఞగా చెప్పండి" అనగానే వారలాగే పోయి వారికి రావణుడు చెప్పినట్లే చేశారు. వారంతా భయంతో రావణుడిని దగ్గరికి వచ్చారు. చేతులు కట్టుకుని నిల్చున్న వారిలో విరూపాక్షుడిని, ఇతరులను చూసి, రావణుడు ఇలా అన్నాడు.

"ప్రళయకాల సూర్యుడితో సమానమైన నా బాణాలతో, నా భుజబల వేడితో, మొట్టమొదట రామలక్ష్మణులను నరికేస్తాను. నాకొరకై చనిపోయిన ఖరుడికి, ఇంద్రజిత్తుకు, ప్రహస్తుడికి, కుంభకర్ణుడికి నేను ఋణపడి వున్నాను. కాబట్టి రామలక్ష్మణులను చంపి ఆ ఋణం తీర్చుకుంటాను. ఆ తరువాత వానర సమూహాలను సంహరించి భూమ్యాకాశాలు, కొండలు గుర్తించలేకుండా నా బాణాల మేఘాలతో చేస్తాను. నా బాణాల దెబ్బకు వానరులు ఊపిరాడకుండా కుప్పలుకుప్పలుగా పడేట్లు చేస్తాను. వానరుల తెగిన తలలతో యుద్ధభూమి తామరపూవులాగా మారుతుంది".

యుద్ధానికి వెడలిన రావణుడు

ఈ విధంగా పౌరుషోక్తులు పలికి, యుద్ధానికి అన్నీ సిద్ధం చేయమని చెప్పాడు

రావణుడు. అందరినీ సంగ్రామానికి పొమ్మంటాడు. ఆ మాటలకు ఇంటింటికీ పోయి రాక్షసులను యుద్ధానికి రమ్మని సేనానాయకులు పిలిచారు. ఇవన్నీ జరిగిన తరువాత రావణుడు కూడా యుద్ధానికి బయల్దేరాడు. రాజాజ్ఞప్రకారం విరూపాక్షుడు, మహోదరుడు,మహాపార్శ్వుడు తమ రథాలెక్కి జయజయ ధ్వానాలు చేస్తూ రామలక్ష్మణులున్న ఉత్తర ద్వారం వైపు వేగంగా కదిలారు.

రావణుడికి అపశకునాలు

రావణుడు యుద్ధానికి బయల్దేరి పోతుంటే అంతటా అపశకునాలు కనిపించాయి. సూర్యకాంతి మాసింది. దట్టంగా చీకట్లు కమ్మాయి. భూమి వణికింది. మాంసంతినే పక్షులు కూశాయి. నెత్తురు వర్షం కురిసింది. నక్కలు పరుషంగా కూశాయి. ధ్వజం మీద గద్దలు రాలాయి. గుర్రాలు కాళ్లు జారి కిందపడ్డాయి. ఎడమ భుజం, ఎడమ కన్ను అదిరింది. ముఖంలో కాంతి తొలగింది. రావణుడి కంఠస్వరంలో హైన్యం ఆవేశించింది. నక్కలు, కాకులు వాడి చుట్టూ తిరిగాయి. ఆ అపశకునాల మధ్య, మృత్యువు ప్రేరణతో, జయిస్తానన్న అజ్ఞానంతో, రావణుడు యుద్ధానికి కదిలాడు తన సేనతో. వారి రథాల ధ్వనులు, వారి అరుపులు విని వానరులు ఇనుమడించిన ఉత్సాహంతో యుద్ధాసక్తులై రాక్షసులను ఎదిరించారు. ఇరువురికీ భయంకరమైన యుద్ధం జరిగింది. అలా జరుగుతుండగా రావణుడు యుద్ధం మధ్యలోకి పోయి తన విల్లును సంధించాడు. కపిసేనను నాశనం చేశాడు.

సర్గ–97
రాక్షసులను వధించిన సుగ్రీవుడు

రావణాసురుడు విడిచిన బాణాల తాకి వానరసేన అగ్నిలో దగ్ధమైనట్లు అయింది. రావణ బాణాల వల్ల పీడించబడిన వానరశ్రేష్టులు కలత చెంది యుద్ధాన్ని వదిలి నలుదిక్కులకూ పోయారు. ఇలా మూలకొక్కడుగా వానరులు పరుగెత్తగా, రావణుడు తన రథాన్ని రామచంద్రుడి వైపు తోలమన్నాడు. వానరులు అలా పోవడం చూసిన సుగ్రీవుడు తన స్థానంలో సుషేణుడిని నిలిపాడు. ఆ తరువాత పరాక్రమించి రాక్షసుల మీద యుద్ధం చేశాడు. వారిమీద కొండలను, చెట్లను కురిపించాడు. ఆయన దెబ్బకు రాక్షసుల గుంపు బలం చెడి నేలకూలింది.

విరూపాక్షుడిని వధించిన సుగ్రీవుడు

సుగ్రీవుడు ఈ విధంగా రాక్షసులను సంహరిస్తుంటే, విరూపాక్షుడు ఏనుగునెక్కి వానరులను ఎదుర్కుంటూ సుగ్రీవుడి మీద బాణాలను వేశాడు. ఆ బాణవర్షానికి సుగ్రీవుడు నొచ్చుకుని ఒక పెద్ద చెట్టును తీసుకుని గిరగిరా తిప్పి ఏనుగు ముఖం మీద కొట్టాడు. ఆ దెబ్బకు ఏనుగు వణికి బారెడు దూరం వెనక్కు పోయి ధ్వనిస్తూ నేలమీద పడింది. సుగ్రీవుడు, విరూపాక్షుడు ఘోరంగా యుద్ధం చేశారు. చివరకు సుగ్రీవుడు రాక్షసుడిని పిడికిటితో గట్టిగా కొట్టగా ఆ దెబ్బకు విరూపాక్షుడు నెత్తురు కక్కుకుంటూ చావుకేక వేసి కిందపడ్డాడు. ఈ విధంగా విరూపాక్షుడు చావగా రాక్షసులు దుఃఖపడ్డారు.

సర్గ-98

మహోదరుడిని చంపిన సుగ్రీవుడు

విరూపాక్షుడు చచ్చిన తరువాత రాక్షస వానర సేనలు పరాక్రమించి ఒకరినొకరు ఎదుర్కున్నారు. విరూపాక్షుడి మరణానికి రావణుడి కోపం రెట్టింపయింది. మనసులో మాత్రం దైవం అనుకూలించనందుకు దుఃఖించాడు. సమీపంలో వున్న మహోదరుడిని చూసి శత్రువులను వధించమని పురమాయించాడు. అతడు అలాగే చేస్తానని చెప్పి, శత్రు సేనమీద దూకి కొట్టగా, వానరులు వాడిని గట్టిగా ఎదిరించారు. అయినప్పటికీ మహోదరుడు వానరుల మీద బాణవర్షం కురిపిస్తుంటే దాన్ని భరించలేక వారు భయంతో పరుగెత్తారు. సుగ్రీవుడు అప్పుడు మహోదరుడి మీద యుద్ధానికి పోయాడు. ఒకరితో ఒకరు భయంకరంగా పోరాడారు. వారు ఒకరిమీద మరొకరు వేసిన ఆయుధాలు వ్యర్థమై పోవడంతో ముష్టి యుద్ధానికి దిగారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. కాసేపు కత్తులతో యుద్ధం చేశారు. చివరకు తన కత్తితో మహోదరుడి తల నరికాడు. అప్పుడు రాక్షసుడు అలా పడిపోవడం చూసిన మిగతా రాక్షసులు పారిపోయారు.

సర్గ–99

అంగదుడి చేతిలో హతుడైన మహాపార్శ్వుడు

యుద్ధంలో సుగ్రీవుడి చేతిలో మహోదరుడు చావడంతో మహాపార్శ్వుడు అమితంగా కోపించి, భయంకర బాణ సమూహాలతో అంగదుడితో యుద్ధానికి దిగాడు. అంగదుడు ఒక కత్తి తీసుకుని, రాక్షసుడిమీద వేయగా వాడు సారథితో సహా మూర్ఛపోయాడు. ఇంతలో జాంబవంతుడు పెద్ద రాయి వేసి రథాన్ని నుగ్గునుగ్గు చేశాడు. గుర్రాలను చంపాడు. ఇంతలో మహాపార్శ్వుడు తెలివి తెచ్చుకుని అంగదుడి మీద బాణాలు వేసి బాధించాడు. అలాగే జాంబవంతుడిని, గవాక్షుడిని అనేక బాణాలతో బాధపెట్టాడు. అంగదుడు కోపంతో ఒక గుదియను తీసుకుని బలం కొద్దీ రాక్షసుడి మీద వేశాడు. ఆ తరువాత వజ్రంలాంటి గట్టి పిడికిలి పట్టి రాక్షసుడి హృదయం మీద గుద్దాడు. ఆ దెబ్బకు మహాపార్శ్వుడు ప్రాణాలుపోయి నేలమీద పడ్డాడు. యుద్ధానికి వచ్చిన నలుగురు ముఖ్య యోధుల్లో రావణుడు తప్ప మిగిలిన ముగ్గురూ చావడం చూసి వానరులు సింహనాదాలు చేయగా ఆ ధ్వనికి లంకా నగరం గడగడ వణికింది. ఆ ధ్వనికి రావణుడు కలతచెంది వానరులమీదికి యుద్ధానికి పోయాడు.

సర్గ-100

శ్రీరామ రావణ యుద్ధం

సుగ్రీవుడు, జాంబవంతుడు, కుముదుడు, హనుమంతుడు, నలుడు, నీలుడు, అంగదుడు, మైంద ద్వివిదులు మొదలైన వానర వీరులను , శ్రీరాముడిని పడగొట్టాలనుకున్నాడు రావణుడు. రావణుడి సారథి రథాన్ని వేగంగా తోలాడు. వానరసేనను త్వరగా దగ్ధం చేసి బూడిద చేయాలనుకున్న రావణుడు ఏమాత్రం ఆలశ్యం చేయకుండా తామసాస్త్రాన్ని వానరసేనమీదికి ప్రయోగించాడు. బ్రహ్మ కల్పించిన ఆ అస్త్రం నివారించడానికి అలవికాకుండా దాని భయంకర జ్వాలలతో వానరసేనను కాల్చివేస్తుంటే వారంతా యుద్ధభూమిని వదిలి పరుగెత్తారు. ఇది చూసి శ్రీరామచంద్రమూర్తి యుద్ధకాంక్షతో విల్లు అందుకున్నాడు. ఇంతలో రావణుడు రాముడిని సమీపించగా వాడిని చూసిన రాముడు, ఇంతకాలానికి రావణుడు ఎదురుపడ్డాడు కదా అని సంతోషించి, కోపంతో కళ్ళెర్రచేసి, విల్లెత్తి అల్లెతాడు మీటాడు. ఆ ధ్వనికి వానరులు, రాక్షసులు గుంపులు గుంపులుగా నేలమీద పడ్డారు.

రాముడిని సమీపించిన రావణుడితో మొదలు లక్ష్మణుడు యుద్ధం చేశాడు కాసేపు. లక్ష్మణుడి బాణాలు ఖండించి రావణుడు ఆయన్ను దాటుకుని రాముడిమీద వాడి బాణాలు వేగంగా వేయడంతో శ్రీరాముడు వాటిని అణిచి వందలకొద్దీ బాణాలను రావణుడి మీద వేశాడు. ఆ ప్రకారం ఇరువురూ అసమానమైన, అద్భుతమైన బాణసమూహాలను ఒకరిపై మరొకరు ప్రయోగించారు. వారిద్దరూ ఒకరినొకరు చంపాలనుకుని భీకరంగా యుద్ధం చేశారు. ఇరువురూ అస్త్ర శస్త్ర ప్రయోగాలను సమంగా తెలిసినవారే కాబట్టి సరిసమానంగా యుద్ధం చేశారు. సర్వాస్త్రాలు తెలిసన రామచంద్రమూర్తి

రాక్షసుడి నొసలు చీల్చేట్లు ఐదు బాణాలను వేయగా, రావణుడు వాటిని కొట్టి ఆసురాస్త్రాన్ని వేశాడు. దానికి విరుగుడుగా రాముడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అది రావణుడి అస్త్రాన్ని నాశనం చేసింది. వానరులంతా సంతోషించారు.

సర్గ–101
దివ్యాస్త్రాలతో యుద్ధం చేసిన శ్రీరామ రావణులు

రావణుడు మయనిర్మితమైన భయంకరమైన రౌద్రాస్త్రాన్ని రామచంద్రుడి మీద ప్రయోగించగా దాన్నుండి శూలాలు, గదలు లాంటివి మహావాయువులాగా బయటికి రావడంతో సమస్త అస్త్రాలు తెలిసిన శ్రీరాముడు గాంధర్వాస్త్రాన్ని ప్రయోగించి దాన్ని అణిచి వేశాడు. తన అస్త్రం హతమై పోవడంతో రావణుడు సౌరాస్త్రాన్ని రామచంద్రమూర్తి మీద వేశాడు. సూర్యచంద్రులలాగా వస్తున్న దాన్ని రాముడు బాణాలతోనే నాశనం చేశాడు. అన్న రాముడితో సమానంగా యుద్ధం చేస్తున్న రావణుడిని చూసి సహించలేక లక్ష్మణుడు యుద్ధంలోకి దిగాలనుకున్నాడు.

రావణ లక్ష్మణ యుద్ధం

అనుకున్నదే తడవుగా లక్ష్మణుడు కోపంతో రావణుడి రథాన్ని ఒక్క బాణంతో తుంచాడు. ఇంకొక బాణంతో సారథిని చంపాడు. ఆ తరువాత ఐదు బాణాలతో రావణుడి విల్లును ఖండించాడు. రథం గుర్రాలను లక్ష్మణుడి సమీపంలో వున్న విభీషణుడు చంపాడు. గుర్రాలు చావగానే రావణుడు తటాలున భూమ్మీద దూకి భయంకరాకారుడై శక్తి అనే ఆయుధాన్ని తీసుకుని లక్ష్మణుడిని చంపడానికి సిద్ధమయ్యాడు. దాన్ని లక్ష్మణుడి మీదికి వేయగా, అది పిడుగులాగా రావడం చూసి లక్ష్మణుడు దాన్ని తన బాణాలతో నాశనం చేశాడు. అసమానమైన తన శక్తి ఆ విధంగా నాశనం కావడంతో మరొక శక్తిని తీసుకుని విభీషణుడి మీద వేయగా లక్ష్మణుడు దానికి అడ్డంగా పోయి, శక్తిని నాశనం చేసి, విభీషణుడిని రక్షించాడు. తన తమ్ముడిని మహాబలశాలి లక్ష్మణుడు రక్షించడం చూసిన

రావణుడు లక్ష్మణుడితో "నువ్వు విభీషణుడిని చావకుండా రక్షించావు. నీ శౌర్యానికి, అమోఘ పరాక్రమానికి మెచ్చుకుంటున్నాను. నువ్వక్కడే వుండు. విభీషణుడు చావకుండా తప్పించుకున్నాడు కాని నువ్వు తప్పించుకోలేవు. నీ ప్రాణాలు హరిస్తాను" అని అన్నాడు.

రావణుడి శక్తికి మూర్ఛపోయిన లక్ష్మణుడు

మండోదరి వివాహ సమయంలో మయుడు తన శక్తితో కల్పించి, రావణుడికి ఇచ్చిన "శక్తి" ని రావణుడు రాముడి తమ్ముడు లక్ష్మణుడి మీద ప్రయోగించాడు. ఆ బాణం లక్ష్మణుడి వక్షంలో నాటుకుంది. వెంటనే లక్ష్మణుడు మూర్ఛపోయి నేలకూలాడు. తమ్ముడి దురవస్థ చూసి రాముడు కోపంతో ఇది శోకించడానికి సమయం కాదని యుద్ధానికి సిద్ధమయ్యాడు. రావణుడిని చంపడానికి ప్రయత్నించాడు.

లక్ష్మణుడిని వానరులకు అప్పచెప్పిన శ్రీరాముడు

తాను బాణాలు వేయకపోయినా, వూరికే వున్నా, రావణుడు వదలకుండా తనమీద బాణాలు వేస్తుంటే భయపడక, లక్ష్మణుడి రొమ్ములో నాటుకున్న రావణ శక్తిని అవలీలగా బయటకు లాగి తునకలు చేశాడు రాముడు. ఇలా శ్రీరాముడు వేరే పనిలో నిమగ్నమై వుండగా, ఇదే సమయమనుకుని, రావణుడు ఆయన మీద బాణప్రయోగం చేశాడు. వాటిని లక్ష్యపెట్టక రాముడు తమ్ముడిని కౌగలించుకుని, సుగ్రీవాంజనేయులను చూసి లక్ష్మణుడిని హెచ్చరికగా చూసుకొమ్మని అంటాడు. తాను రావణుడిని సంహరిస్తానని చెప్తాడు. ఇక రాముడో, రావణుడో తేలిపోవాలి అని అంటాడు. తనకు కలిగిన దుఃఖాలన్నీ రావణుడిని చంపి తీర్చుకుంటానని చెప్పాడు. "దేనికై వాలిని చంపానో, దేనికై సుగ్రీవుడిని వానరరాజుగా చేశానో, దేనికై వానరులందరినీ ఒక గుంపుగా చేర్చానో, దేనికై సముద్రం మీద సేతువు కట్టానో, దేనికై లంకకు వచ్చానో, వీటన్నిటికీ కారణమైన రావణాసురుడిని చంపుతాను. నిండు మనస్సుతో దగ్గరున్న కొండమీద కూచుని రావణుడితో నేను చేయబోయే యుద్ధాన్ని చూడండి". అని వానరులతో అన్నాడు శ్రీరాముడు.

పరాజితుడై లంకకు పారిపోయిన రావణుడు

ఇలా అంటూ శ్రీరాముడు వాడి బాణాలను రావణుడి దేహంలో గుచ్చుకునేట్లు వేశాడు. వాడు కూడా వాటికి విరుగుడు బాణాలు వేశాడు. రావణుడి

బాణాలన్నిటినీ రాముడు తునకలు చేశాడు. రామరావణులు ప్రయోగించిన బాణాలు ఆకాశంలో ఒకదాన్నొకటి కొట్టుకుంటుంటే ఆ ధ్వనులు భీకరంగా వున్నాయి. ఆ బాణాలు తునకలై నేలరాలి పోయాయి. ఇంతసేపు వీడు నా ఎదుట నిల్చి యుద్ధం చేస్తాడా? అని కోపించిన శ్రీరాముడు, నిప్పులు కక్కే బాణాలను రావణుడి మీద వేయగా, వాడు ధైర్యం చెడి ఇక అక్కడ వుంటే చావడం ఖాయమని లంకలోకి పారిపోయాడు.

సర్గ–102
మూర్ఛిల్లిన లక్ష్మణుడిని చూసి దుఃఖించిన శ్రీరాముడు

ఒక వైపు రావణాసురుడితో యుద్ధం చేస్తూనే మరో వైపున ఒక కంటితో నెత్తురుతో తడిసిన దేహంకల లక్ష్మణుడిని చూస్తూ సుశేణుడితో ఇలా అన్నాడు. "అయ్యో! నా ప్రాణాలకంటే మిన్న నా తమ్ముడు పాములాగా నేలమీద పొర్లుతున్నాడు. ఇతడి స్థితి చూస్తుంటే మనస్సుకు ఎంతో బాధ కలుగుతున్నది. ఇక నాకు యుద్ధం చేయడం సాధ్యమవుతుందా? శూరుడు, నా తమ్ముడు మరణిస్తే నేను బతికున్నా ఏమి ప్రయోజనం? ఇక నాకు సుఖం ఎక్కడిది? తమ్ముడి స్థితి చూస్తుంటే చేతిలోని విల్లు జారిపోతున్నది. మనస్సు స్వాధీనం తప్పుతున్నది. బాణాలు గురి తప్పుతున్నాయి. కళ్లల్లో నీళ్లు కారి దృష్టి లోపిస్తున్నది. దుఃఖం మితిమీరుతున్నది. దేహంలో సత్తువ తగ్గుతున్నది. కీళ్లు వదులైతున్నాయి. నా కళ్లెదుటే నా తమ్ముడు దుష్టుడి చేతిలో ఈ విధంగా మరణిస్తే ఇక నా బలం ఏమి బలం? నాకీ విల్లెందుకు? ఇవి ఎవరిని ఉద్ధరిస్తాయి?".

ఇలా అంటూ శ్రీరాముడు కన్నీరు కార్చాడు.

శ్రీరాముడిని ఓదార్చిన సుశేణుడు

కన్నీరు కారుస్తున్న రామచంద్రమూర్తిని ఓదారుస్తూ సుశేణుడు, ఆయనతో లక్ష్మీవర్ధనుడైన లక్ష్మణుడు చనిపోలేదని ఇలా చెప్పాడు. "రామచంద్రా! లక్ష్మణుడు మృతుడేమోనని నువ్వు దుఃఖపడుతున్నావు. ఆయన మృతుడుకాదు. ఆయనలో కాంతి వృద్ధిగా వున్నదేకాని క్షీణించలేదు. మృతుడి చిహ్నాలు లక్ష్మణుడిలో వున్నవేమో చూడు. ఆయన ముఖం చూస్తుంటే యితడు

దీర్ఘాయుష్మంతుడు అనే విషయం స్పష్టంగా కనిపిస్తున్నది. అతడి గుండెలు కొట్టుకుంటున్నాయి. శ్వాస వస్తున్నది. రొమ్ము కిందికి, పైకి వుబుకుతున్నది. ఆయన ప్రాణాలతోనే వున్నాడు కాబట్టి దుఃఖించవద్దు".

సంజీవని పర్వతాన్ని తెచ్చిన హనుమంతుడు

సుశేణుడు రామచంద్రమూర్తితో ఇలా అని, హనుమంతుడి వైపు తిరిగి, "హనుమా! వేగంగా దక్షిణ కూటం పోయి, లక్ష్మణుడి దేహంలో నాటుకున్న ములుకులు వూడతీయడానికి విశల్య కరణిని, లక్ష్మణుడిని జీవింప చేయడానికి అక్కడే వున్న సవర్ణకరణిని, సంధాన కరణిని తీసుకునిరా" అని చెప్పాడు. వెంటనే హనుమంతుడు అక్కడికి పోయి, ఓషధులున్న స్థలాన్ని తెలుసుకోలేక, వెతకడానికి ఏమాత్రం ఆలశ్యం చేయకుండా, కొండనే పీక్కుని పోదామని నిర్ణయించుకుని, దాన్ని పెళ్లగించి, ఎత్తుకుని, ఆకాశానికి ఎగిరి, వానరుల మధ్యకొచ్చాడు. హనుమంతుడు రాగానే సుశేణుడు ఆ మందుల తీగెను కొండనుంచి బయటికి తీశాడు.

మూర్ఛతేరిన లక్ష్మణుడు

సుశేణుడు తాను తీసిన ఔషధులను లక్ష్మణుడికి వాసన చూపించాడు. వెంటనే అతడు సంతోషంగా మూర్ఛనుండి తేరుకున్నాడు. లేచిన లక్ష్మణుడిని శ్రీరాముడు ప్రేమతో కౌగలించుకున్నాడు. లక్ష్మణుడే మరణిస్తే తనకు రాజ్యం ఎందుకనీ, సీత ఎందుకనీ, రావణుడిని చంపి విజయం సాధించినా ఫలితం ఏమిటనీ లక్ష్మణుడితో అంటాడు రాముడు.

శ్రీరాముడిని యుద్ధానికి ప్రోత్సహించిన లక్ష్మణుడు

శ్రీరాముడి ప్రేమపూర్వకమైన మాటలకు జవాబుగా లక్ష్మణుడు ఇలా అన్నాడు. "మహాబలశాలీ! రావణుడిని చంపుతాననీ, లంకా రాజ్యాన్ని విభీషణుడికి ఇస్తాననీ నువ్వు రెండు ప్రతిజ్ఞలు చేశావుకదా? నువ్వెంతో బలవంతుడివైనప్పటికీ బలహీనుడిలాగా బేల పలుకులు పలుకుతున్నావు. ఇది సరైందికాదు. నేనున్నా, పోయినా, నాకై నీకార్యాన్ని ఆపవద్దు. రావణుడిని చంపుతానన్నావు...చంపు. నీ ప్రతిజ్ఞ నెరవేర్చు. లక్ష్మణుడు జీవించి వుంటేనే రావణుడిని చంపుతానని అనలేదుకదా? అన్నా! నీ బాణాలు తగిలితే రావణుడు ప్రాణాలతో వుండలేడు. నీకు నిజంగా రావణుడిని చంపాలని వుంటే, నా మాట వినదల్చుకుంటే, సూర్యుడు అస్తమించక ముందే రావణుడిని వధించు".

సర్గ-103
శ్రీరామరావణుల కడపటి యుద్ధం

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, శ్రీరాముడు శీఘ్రంగా ధనుస్సు సంధించాడు. ఇంతలో లంకకు పారిపోయిన రావణుడు ఒక రథాన్ని సిద్ధం చేసుకుని, యుద్ధానికి వచ్చి, శ్రీరాముడిని బాణాలతో కొట్టసాగాడు. శ్రీరాముడు కూడా వాడికి తన బాణాలతో సమాధానం చెప్పాడు. వారిరువురి మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో రామచంద్రమూర్తి నేలమీద నిలబడడం చూసిన దేవతలు, గంధర్వులు, రావణాసురుడు రథం మీద వుండి యుద్ధం చేస్తున్నందున ఇది సమమైన యుద్ధం కాదని ఇంద్రుడికి చెప్పారు. వెంటనే ఇంద్రుడు సూర్యుడితో సమానమైన గుర్రాలను కట్టిన తన బంగారు రథాన్ని రామచంద్రుడి దగ్గరికి పంపాడు.

ఇంద్రుడు పంపగా శ్రీరాముడి దగ్గరికి రథాన్ని తెచ్చిన మాతలి

ఇంద్రుడి ఆజ్ఞానుసారం మాతలి రథాన్ని తీసుకుని రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చి ఆయనకు మొక్కాడు. "దేవా! నీ గెలుపు కోరి ఇంద్రుడు ఈ రథాన్ని పంపాడు. దీనిమీద ఎక్కు. రథంతో పాటు రావణుడిని చంపడానికి ఐంద్రధనస్సును, అగ్నితో సమానమైన కాంతికల కవచాన్ని, సూర్యకాంతికల బాణ సమూహాన్ని, మెరుపులాంటి ఈ శక్తిని పంపాడు. తీసుకో. నేను నీకు సారథిగా వుండగా ఈ రావణుడిని చంపు" అని అన్నాడు. రామచంద్రమూర్తి రథానికి ప్రదక్షిణ చేసి, దానిమీద ఎక్కి యుద్ధం చేస్తుంటే అది చూసినవారికి గగ్గురుపాటు కలిగింది. రథం మీద వున్న శ్రీరాముడి మీదికి రావణుడు గాంధర్వాస్త్రాన్ని వేయగా దాన్ని గాంధర్వ బాణంతో, దైవాస్త్రం వేయగా దాన్ని

మరో బాణంతో రాముడు కొట్టివేయడంతో కోపించిన రావణుడు రాక్షసాస్త్రం వేశాడు. దాన్నుండి బంగారు భూషణాల పాములు రామచంద్రమూర్తి మీద పడ్డాయి. అయినా రాముడు భయపడకుండా గరుడాస్త్రం వేయడంతో దాన్నుండి గరుత్మంతుడి ఆకారంలో బాణాలు బయల్దేరి ఆపాముల బాణాలను సంహరించింది.

సర్గ–104

రావణుడి శూలాన్ని తునకలు చేసిన శ్రీరాముడు

రావణుడి పరాక్రమం, తనవారు చిన్నపోవడం గమనించిన రామచంద్రమూర్తి కోపంతో కళ్లెర్రచేసి, కనుబొమలు ముడిచి, తన చూపులతోనే వాడిని భస్మం చేసేట్లు చూడడంతో అప్పటి రాముడి మఖం చూసి సమస్త ప్రాణులు భయపడ్డాయి. భూమి వణికింది. మృగాలతో సహా కొండలు గడ-గడలాడాయి. సముద్రం కలత చెందింది. పక్షులు ఆకాశంలో కఠినంగా ధ్వనించాయి. మేఘాలు కఠోరంగా వురమడంతో పిడుగులు పడ్డాయి. రాముడి భయంకారాకారం చూసి రావణుడు భయపడ్డాడు. ఆకాశాన నిలబడ్డ దేవదానవులు రాముడు గెలవాలని ప్రార్థించారు. రాక్షస పక్షంవారు రావణుడు గెలవాలని కోరుకున్నారు. ఈ లోపల రావణుడు భయంకరమైన ఒక శూలాన్ని చేతిలో తీసుకుని, సముద్రం కలతపడేట్లు సింహనాదం చేసి, రామచంద్రమూర్తిని చూసి కఠినమైన మాటలతో ఇలా అన్నాడు.

"రాజకుమారా! ఈ ఆయుధం తమ్ముడు తోడుగాగల నిన్ను చంపి, యుద్ధంలో చనిపోయిన రాక్షసుల దగ్గరకు నిన్ను పంపుతుంది. ఒక్క నిమిషం అక్కడే నిలబడు చావడానికి". ఈ విధంగా అంటూ ఆ శూలాన్ని తిప్పి రాముడిమీద వేయడంతో, ప్రతిగా రాముడు ఇంద్రుడిచ్చిన శక్తిని దానిమీద వేశాడు. మాతలి తెచ్చి ఇచ్చిన ఇంద్ర శక్తి ఘంటల ధ్వనితో పోయి రాక్షస శక్తిని తాకడంతో అది జవబలాలు క్షీణించి నేలకూలింది. వానరులు అది చూసి బొబ్బలు పెట్టారు. దేవతలు సంతోషించారు. రామచంద్రమూర్తి అంతటితో ఆగక రావణుడి గుర్రాలను కొట్టాడు. ఆ తరువాత అమోఘమైన బాణాలతో రావణుడి వక్షాన్ని పగలగొట్టి మూడు బాణాలతో వాడి నొసలు బద్దలు చేశాడు. చీల్చబడి నెత్తురుతో తడిసిన దేహం కలవాడైన రావణుడు బాణాల బాధ సహించలేక యుద్ధభూమిలో చాలా దుఃఖపడ్డాడు.

సర్గ-105
రావణుడిని నిందించిన శ్రీరాముడు

ఒకవైపు బాధపడుతూనే మరో వైపు రోషం తెచ్చుకుని రావణుడు అగ్నిలాంటి బాణాలను రాముడి మీదికి వేశాడు. రామచంద్రమూర్తి వాటికి చలించకుండా ఆ బాణాలను ఆకాశంలోనే ఖండించాడు. అంతటితో ఆగకుండా తన బాణాలతో రావణుడిని తికమక పెట్టాడు. ఇరువురూ సందు లేకుండా ఒకరిపై మరొకరు బాణాలను వేసుకున్నారు. సీతను బలాత్కారంగా అపహరించి తెచ్చిన రావణుడికి తగిన శిక్ష విధిస్తానంటూ రాముడు రావణుడిని హెచ్చరించాడు. అనేక విధాలుగా రావణుడిని నిందించాడు రాముడు. ఇక రావణుడు బతకడని, తన బాణాలతో చంపుతాననీ మరీ మరీ హెచ్చరించాడు.

రావణుడి రథాన్ని మరలించిన సారథి

ఇలా రావణుడిని నిందిస్తూనే, వాడిని చంపడానికి తన అన్ని అస్త్రాలనూ మనస్సులో తలచుకున్నాడు రామచంద్రుడు. ఆ అస్త్రాలను ఒకటి వెంట మరొకటి రావణుడి మీద ప్రయోగించగా వాటి దెబ్బకు వాడు బలహీనుడై భయపడి తల్లడిల్లి పోయాడు. చేతిలో విల్లు పట్టుకోలేక పోయాడు రావణుడు. కష్టం మీద పట్టుకున్నా బాణాలను సంధించడం కష్టమై పోయింది. అల్లెతాడు ఎక్కుపెట్టలేక పోయాడు. ఎదురుగా తనమీదికి వస్తున్న బాణాలను కొట్టలేకపోయాడు. ఒకవేళ బాణాలు వేసినా అవి ఒక పక్కగా పోతున్నాయికాని రాముడిని తాకడం లేదు. రావణుడికి అప్పుడు ఏం తోచలేదు. చావడానికి సిద్ధంగా వున్న రావణుడి దుస్థితి చూసిన సారథి ఇక వాడక్కడే వుంటే చావు ఖాయమని రథాన్ని దూరంగా తీసుకుపోయాడు.

సర్గ–106
సారథిని దూషించిన రావణుడు

యుద్ధభూమికి దూరంగా రథాన్ని తోలుకుపోయిన సారథిని చూసి రావణుడు (మరణం సమీపిస్తుండగా) కళ్లెర్రచేసి, కోపంగా, ఇలా అన్నాడు.

"ఏమిరా! శక్తిలేనివాడిలాగా, బలపరాక్రమం, పౌరుషం లేనివాడిగా, పిరికివాడిలా, మానహీనుడిలాగా, రోషంలేని వాడిలాగా బుద్ధిలేనివాడా! నా సంగతి తెలుసుకోకుండా నీ ఇష్టం వచ్చినట్లు ఎందుకు ఈ రథాన్ని శత్రువు చూస్తుండగా ఇక్కడికి తెచ్చావు? నేనిక్కడికి రావాల్సిన గతి ఏమి పట్టిందిరా? యుద్ధం చేయడానికి నా అస్త్రాలన్నీ లేవారా? నా మాయలన్నీ లేవారా? దుష్టుడా! మర్యాద తప్పి నా గౌరవం నాశనం చేశావుకదరా! ఎంతకాలంగానో నేను సంపాదించిన కీర్తి, తేజస్సు, బలం యుద్ధంలో రావణుడు వెనుతీయడన్న పేరు నీవల్ల నేడు నాశనం అయింది కదరా? ఒకసారి పారిపోయి వచ్చి మళ్లీ ఏమని వాడికి ఎదురుగా యుద్ధం చేయడానికి పోవాలిరా? చూసినవారెవరైనా నవ్వరా? యుద్ధం చేస్తున్నప్పుడు పగవారి మీదికి తోలాల్సిన రథాన్ని ఒక మూలకు తెస్తావా? ఇక్కడ ఏమున్నదని రథాన్ని తెచ్చావు? నువ్వు చేసిన పని శత్రువు చేయాలికాని మిత్రుడు చేసేది కాదు. నువ్విలా చేశావంటే పగవాడి దగ్గర ఏదో లాభం పొంది వుంటావు. శత్రువు ఇక్కడికి రాకముందే నన్నక్కడికి తీసుకునిపో".

రావణుడికి సమాధానం చెప్పిన సారథి

సారథి చేసింది మేలా? కీడా? అని ఆలోచించకుండా రావణుడు తన మేలు కోరి చేసిన సారథిని పరుషంగా మాట్లాడడంతో సారథి హితమైన మాటలతో ఇలా జవాబిచ్చాడు.

"నేను భయపడలేదు రాజా! పగవారి దగ్గర లంచం తీసుకునే నీతిమాలినవాడిని కాదు. నేను నిష్ప్రయోజకుడిని కాదు. నువ్వు చేసిన మేలు మరిచేవాడిని కాదు. నీమీద స్నేహభావం వదిలినవాడిని కాదు. నీ శుభం కోరి, నీ కీర్తి కాంక్షించి, నీ క్షేమం కోరి, స్నేహకారణాన నీకు నేను మేలు చేస్తే అది నీకు కీడుగా కనిపించింది. దానికి నేనేమి చెప్పాలి? ఎందుకు నేను రథాన్ని ఇక్కడికి తెచ్చానో చెప్తా విను. నా మాటలు విను. నేను రథం తేవడానికి పూర్వం, నీ ముఖం తేటగా లేకుండా పోయింది. నీ దేహమే నీకు తెలియరాని పరిస్థితి వుంది. నీ బాణాలు ఎటు పోతున్నాయో నీకు తెలియదు. ఈ కారణాన నువ్వు యుద్ధంలో అలసిపోయావని భావించాను. నీ గతి అలా వుంటే గుర్రాలు కూడా బాగా అలసి పోయాయి. నీకు కీడు కలిగించే అపశకునాలు కనిపించాయి. అలాంటప్పుడు సారథి ఏంచేయాల్నో చెప్తా విను".

"సారథి అనేవాడు యుద్ధ ప్రదేశం అనుకూలంగా వుందా? ప్రతికూలంగా వుందా? తెలుసుకుని వుండాలి. శకునాలు అనుకూలమా? ప్రతికూలమా? తెలుసుకోవాలి. రథికుడి ముఖం సంతోషంగా వుందా? లేక ఉత్సాహం లేకుండా దుఃఖంగా వుందా? అర్థం చేసుకోవాలి. రాజు బలవంతుడై వున్నాడా? బలహీనుడై వున్నాడా? చూడాలి. తేజస్సు ఎలా వుందో విచారించాలి. రథాన్ని తోలేటప్పుడు ఎత్తుపల్లాలు గమనించి తోలాలి. యుద్ధభూమి ఎలా వుందో అంచనా వేయాలి. శత్రువు లోపాలు అర్థం చేసుకోవాలి. శత్రువుకు రథం ఎప్పుడు సమీపంలోకి తీసుకు పోవాలి, ఎప్పుడు దూరంగా తీసుకుపోవాలి తెలిసుండాలి. అన్నీ గమనించి రథికుడికి ఏ ప్రమాదమూ రాకుండా జాగ్రత్త పడాలి. ఇవన్నీ సారథి కృత్యాలు. నీకు మేలు చేయడానికి రథాన్ని ఇక్కడికి తెచ్చాను కాని నా ఇష్టం వచ్చినట్లు స్వతంత్రించి నిష్కారణంగా తేలేదు. రాజా! ప్రభువంటే అనురాగం వున్నవాడిని. నామాట నమ్ము. ఆ తరువాత నువ్వెలా చేయమంటే అలాగే చేస్తాను".

సారథి మాటలకు సంతృప్తి చెందిన రావణుడు రథాన్ని శ్రీరాముడికి అభిముఖంగా పోనిమ్మని అంటాడు. సారథి రావణుడి ఆజ్ఞానుసారం రథాన్ని శ్రీరాముడి వైపుకు తీసుకుపోయాడు.

సర్గ–107

శ్రీరాముడికి ఆదిత్య హృదయం ఉపదేశించిన అగస్త్యుడు

ఆదిత్య హృదయం
ధ్యానమ్
నమస్సవిత్రే జగదేక చక్షుసే
జగత్ప్రసూతి స్థితి నాశ హేతవే
త్రయీమయాయ త్రిగుణాత్మ ధారిణే
విరించి నారాయణ శంకరాత్మనే

తతో యుద్ధ పరిశ్రాంతం సమరే చింతయా స్థితమ్ |
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్ || 1 ||

దైవతైశ్చ సమాగమ్య ద్రష్టుమభ్యాగతో రణమ్ |
ఉపగమ్యా బ్రవీద్రామమ్ అగస్త్యో భగవాన్ ఋషిః || 2 ||

రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్ |
యేన సర్వానరీన్ వత్స సమరే విజయిష్యసి || 3 ||

ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్ |
జయావహం జపేన్నిత్యం అక్షయ్యం పరమం శివమ్ || 4 ||

సర్వమంగళ మాంగళ్యం సర్వ పాప ప్రణాశనమ్ |
చింతాశోక ప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమమ్ ‖ 5 ‖

రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్ |
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్ ‖ 6 ‖

సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః |
ఏష దేవాసుర గణాన్ లోకాన్ పాతి గభస్తిభిః ‖ 7 ‖

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః |
మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాం పతిః ‖ 8 ‖

పితరో వసవః సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః |
వాయుర్వహ్నిః ప్రజాప్రాణః ఋతుకర్తా ప్రభాకరః ‖ 9 ‖

ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్ |
సువర్ణసదృశో భానుః హిరణ్యరేతా దివాకరః ‖ 10 ‖

హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తి–ర్మరీచిమాన్ |
తిమిరోన్మథనః శంభుః త్వష్టా మార్తాండకోఽంశుమాన్ ‖ 11 ‖

హిరణ్యగర్భః శిశిరః తపనో భాస్కరో రవిః |
అగ్నిగర్భోఽదితేః పుత్రః శంఖః శిశిరనాశనః ‖ 12 ‖

వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుఃసామ–పారగః |
ఘనావృష్టి రపాం మిత్రో వింధ్యవీథీ ప్లవంగమః ‖ 13 ‖

ఆతపీ మండలీ మృత్యుః పింగళః సర్వతాపనః |
కవిర్విశ్వో మహాతేజా రక్తః సర్వభవోద్భవః ‖ 14 ‖

నక్షత్ర గ్రహ తారాణామ్ అధిపో విశ్వభావనః |

తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్–నమోఽస్తు తే ‖ 15 ‖

నమః పూర్వాయ గిరయే పశ్చిమాయాద్రయే నమః |
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః ‖ 16 ‖

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః |
నమో నమః సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః ‖ 17 ‖

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః |
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః ‖ 18 ‖
బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్య–వర్చసే |
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః ‖ 19 ‖

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయా మితాత్మనే |
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః ‖ 20 ‖

తప్త చామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే |
నమస్తమోఽభి నిఘ్నాయ రుచయే లోకసాక్షిణే ‖ 21 ‖

నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః |
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః ‖ 22 ‖

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః |
ఏష ఏవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్ని హోత్రిణామ్ ‖ 23 ‖

వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ |
యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః ‖ 24 ‖

రావణుడి రథాన్ని సారథి దూరంగా తీసుకుపోయినప్పుడు, ఆ తరువాత కార్యం ఏమిటా అని రామచంద్రమూర్తి ఆలోచన చేస్తున్నప్పుడు, అగస్త్యుడు

రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు. వచ్చి (పైన చెప్పిన) ఆదిత్య హృదయం ఉపదేశిస్తాడు. ఉపదేశిస్తూ ఇలా చెప్పాడు.

"శ్రీరామ రామ! శ్రద్ధగా నేను చెప్పేది విను. వింటే నీ శత్రువులందరినీ యుద్ధంలో గెలుస్తావు. నువ్వు మహాభుజబలపరాక్రమం కలిగినవాడివైనప్పటికీ శత్రు సంహారంలో నీకిది తోడ్పడుతుంది. ఆదిత్యహృదయం సంపత్కరమైనది. పుణ్యదమైనది. సకల బాహ్యాభ్యంతర శత్రువులను నాశనం చేస్తుంది. మిక్కిలి శుభకరమైనది. క్షేమానికి హేతువైనది. క్షయం కానిది. పూర్వోత్తర పాపాలన్నిటినీ నాశనం చేసి గెలుపు ప్రసాదించేది. దేహబాధ, మనోవేదన తొలగిస్తుంది. మంత్రాలలో ఉత్తమమైనది. విహితమైన ఆయువుకంటే అధికమైన ఆయువు కలిగిస్తుంది. సమస్త మంగళాలలో మిక్కిలి మంగళమైనది. జపించే వారికి అధికమైన కీర్తిని కలిగిస్తుంది. కాబట్టి ఆ మంత్రంతో రశ్మిమంతుడై ఉదయించే సూర్యుడిని, దేవతల, రాక్షసుల, మనుష్యుల నమస్కారాలందుకునే సూర్యుడిని, సమస్త లోకాలకు ప్రియమైన వాడిని, వివస్వంతుడిని ఇక కొలువు".

"ఇతడే అమితమైన తేజస్సుకలవాడు. సర్వ వేదస్వరూపుడు ఇతడే. కాంతులు కలవాడు ఇతడే. తన కిరణాలతో సమస్త దేవతల, అసురుల సమూహాన్ని, ప్రపంచాన్ని రక్షించేవాడు ఇతడే. ఇతడే బ్రహ్మ, ఇతడే విష్ణు. ఇతడే స్కందుడు. ఇతడే శివుడు. ఇతడే ప్రజాపతి. ఇతడే మహేంద్రుడు. ఇతడే కుబేరుడు. ఇతడే యముడు. ఇతడే కాలుడు. సోముడు, వరుణుడు, పితరులు, వసువులు, మరుత్తుడు ఇతడే. సాధ్యులు, అశ్వులు, మనువు, వాయువు, వహ్ని, ఋతుకర్త, ప్రభాకరుడు అన్నీ ఇతడే".

"అఖండ భూమండలానికి పతియగువాడు లేక పరమాకాశానికి పతియగువాడు ఆదిత్యుడు నువ్వే. సర్వం ప్రేరేపించేవాడివి నువ్వే. వర్షం కురిపించి పైరులు పండించేది నువ్వే. పరమాకాశంలో వుండేవాడివి నువ్వే. పోషించేవాడివి, లక్ష్మీదేవితో నిత్య సంయోగం కలవాడివి, ప్రపంచ సృష్టికి కారణమైన సాధనం కలవాడివి, ప్రకాశించే వస్తువులకు ప్రకాశం ఇచ్చేవాడివి, సూర్యచంద్రాగ్ని యమాదులను ఆజ్ఞతో తపింప చేసేవాడివి నువ్వే. ఆశ్రితులకు జ్ఞానం కలిగించేవాడివి, జీవకోటుల హృదయంలో వుండేవాడివి, లోకాన్ని సన్నగిల్ల చేసేవాడివి, గరుత్మంతుడిని వాహనంగా కలవాడివి, అనంత కల్యాణగుణాలు కలవాడివి, సుదర్శనాన్ని ధరించినవాడివి, సమస్త పదార్థాల లోపల వెలుపల వ్యాపించి వున్నవాడివి, కల్క్యవతారంలో గుర్రాన్ని వాహనంగా

కలవాడివి, అజ్ఞాన నాశకుడివి, సౌందర్య సౌశీల్యాలలో సుఖం కలిగించేవాడివి, నష్టమైన ప్రపంచాన్ని పునర్జీవింప శక్తికలవాడివి, స్తోత్రం చేయతగ్గవాడివి, అగ్నిని తనయందు కలవాడివి నువ్వే. సాయంకాలాన శమించేవాడివి, ప్రళయవేళ వ్యాపార రహితుడై వున్నవాడివి, చక్రాయుధుడివి, తాపత్రయ బాధితులకు తాపం ఆర్చుకోవడానికి చల్లటి ఆశ్రయమైనవాడివి, నిజభక్త విరోధులను తపించచేయగలవాడివి, మంచును నాశనం చేయగలవాడివి నువ్వే".

"దేవా! నువ్వే హిరణ్యగర్భుడివి. నువ్వే వామనమూర్తివి. నువ్వే కర్మకుల కర్మఫలాలను ఇచ్చేవాడివి. నువ్వే పరమాకాశనాథుడివి. ఉదకాలకు మిత్రుడివి నువ్వే. భక్తుల హృదయంలోని చీకటిని పోగొట్టేవాడివి నువ్వే. వేదాల అంతాన్ని పొందినవాడివి నువ్వే. కవిరాజు నువ్వే. ముక్తులను సుషుమ్నానాడిలో ప్రవేశపెట్టేవాడివి నువ్వే. సుశీలుడివి. ప్రకృతి శరీరంగా కలవాడివి. స్వరూప గుణాల విభవాలతో పూర్ణుడివి. ప్రపంచ నిర్మాణ విషయంలో సంకల్పం కలవాడివి. కౌస్తుభాద్యలంకారాలు కలవాడివి. ప్రపంచాన్ని అంతా ఒక్కసారిగా తపింప చేయగలవాడివి. సర్వ భూతకోటుల రంజింప చేయగలవాడివి. సమస్తం వాటివాటి స్థానాలలో స్థాపించగలవాడివి. గ్రహనక్షత్రాదులకు అంతర్యామివై వాటిని శాసించగలవాడివి".

"తేజోవంతులలో తేజోవంతుడవైనవాడా! పన్నెండు మూర్తులు కలవాడా! దినాధిపతీ! ప్రకాశించేవాడా! భక్తులకు జయం క్షేమం కలిగించేవాడా! జయస్వరూపుడా! కమలనాయకా! నీకు నమస్కారాలు. ఉదయపర్వతానికి, పశ్చిమపర్వతానికి, పాపాత్ములకు భయంకరమైన వాడికి, ముక్తులకు అధిపతి అయినవాడికి, హర్యశ్వునకు, జయుడికి మొక్కుతాను. ఆదిత్యుడికి మొక్కుతాను. ఎల్లప్పుడూ వెలిగేవాడికి మొక్కుతాను. సారంగమూర్తికి మొక్కుతాను. మార్తాండుడికి మొక్కుతాను. సృష్టి స్థితి సంహార కర్తలైన బ్రహ్మ, విష్ణు, శివుడికి మొక్కుతాను. ప్రపంచాన్ని సృష్టించే వాడికి మొక్కుతాను. ప్రాణికోటులను సంహరించి, మరల సృజించి, రక్షించే ప్రభువు ఇతడే. తపింప చేసేవాడు, మళ్లా వర్షం కురిపించి ఆ తాపాన్ని అణిచేవాడు ఇతడే".

సూర్యుడు దేవతా మధ్యలో నిలిచి రావణ వధకు సహాయపడునని శ్రీరామచంద్రమూర్తికి అగస్త్యుడు చెప్పాడు. ఇలా చెప్పి, ఈ ఆదిత్య హృదయం మంత్రాన్ని ఆపదల్లో, కష్టాలలో, భయం కలిగినప్పుడు మానవులు చదువుతే

వారికి మేలు జరుగుతుంది సీతానాథా అంటాడు. ఏకాగ్ర మనస్కుడివై లోకపతిని, దేవదేవుడిని పూజించమని చెప్పాడు. అలా చేస్తే మరుక్షణంలోనే రావణుడిని వధిస్తావు అని అంటాడు. అలా చెప్పి అగస్త్యుడు అంతర్ధానం అయ్యాడు. శ్రీరాముడు ముని చెప్పినట్లే మంత్రాన్ని జపించాడు. ఆ తరువాత రావణుడితో యుద్ధానికి సిద్ధమయ్యాడు.

సర్గ–108
శ్రీరాముడి పైకియుద్ధానికి వచ్చిన రావణుడు

మాతలిని హెచ్చరికగా వుండమన్న రాముడు

రావణుడి మాటలకు స్పందనగా సారథి రథాన్ని త్వరగా తోలాడు. రావణుడు ఆ రథం మీద కూర్చుని దూరం నుండే రాముడిమీదికి బాణాలు వేసుకుంటూ వచ్చాడు. ఆ రథాన్ని చూశాడు రాముడు. చూసి మాతలితో "మాతలీ! చూశావా! మన పగవాడి రథం ఎంత వేగంగా వస్తున్నదో! రావణుడు తన చావు సిద్ధమైనందునే మనకు అప్రదక్షిణంగా వస్తున్నాడు. నువ్వు చాలా హెచ్చరికగా వుండి, వాడి రథం అప్రదక్షిణగా వస్తున్నట్లే మన రథాన్ని కూడా వాడికి ఎదురుగా పోనివ్వు. రావణుడిని నాశనం చేస్తాను. నా మనసంతా ఆపనిమీదే వుంచి పరాక్రమిస్తాను. పగవాడిమీద వుంచిన దృష్టిని చెదరనీయవద్దు. మనస్సు కూడా దృష్టి ఎక్కడుందో అక్కడే వుండనియ్యి. ప్రమాద పడవద్దు. ఒకదాన్ని చూసి మరొకటి అని భ్రమ పడవద్దు. పగ్గాలు వదిలేటప్పుడు, బిగబట్టి లాగేటప్పుడు, నీ హస్తలాఘవాన్ని ప్రదర్శించు. ఇంద్రుడంతటి వాడికి జంకు–గొంకు లేకుండా రథం నడిపే నీ అంతటి వాడికి నేను బుద్ధులు చెప్పాల్నా? నేను కార్యభారం ఆలోచించి, నామనసంతా యుద్ధం మీదే నిలిపి వుంచుతాను. ఇతర కార్యాల మీద దృష్టి పెట్టలేను. అందుకే ఇప్పుడే ముందుగానే నిన్ను హెచ్చరిస్తున్నాను" అని అన్నాడు. రాముడు చెప్పినట్లే మాతలి రథాన్ని తోలాడు సంతోషంగా.

కనిపించిన రావణుడి మరణాన్ని తెలియచేసే చిహ్నాలు

ఇంద్రుడు తనకు పంపిన విల్లు తీసుకుని, కోపంతో, సూర్యకాంతితో సమానమైన కాంతికల వాడి బాణాలను రావణాసురుడి మీద వేశాడు

రామచంద్రమూర్తి. రామరావణులు ఒకరినొకరు చంపాలనే కోరికతో యుద్ధం చేస్తుంటే దేవతలు ఆకాశాన గుంపులుగా వీక్షించారు. ఎప్పుడు రావణుడు చస్తాడా అని ఆ మహావీరుల యుద్ధాన్ని చూడసాగారు. రావణాసురుడి రథం మీద నెత్తురు వాన కురిసింది. సుడిగాలి ఎడమవైపుగా చుట్టి వీచింది. వాడి రథం వెంట గద్దలు గుంపులుగా ఆకాశాన కలిసి తిరిగాయి. లంకలో సంధ్యా సమయం వాడిన పుష్పం లాంటి కాంతిగా కనిపించింది. పగటి పూట అయినా ఆ కాంతికి భూమి మండుతున్నట్లు కనిపించింది. తోకచుక్కలు రాలాయి. పిడుగులు విస్తారంగా పడ్డాయి. రాక్షసులు కలతపడ్డారు. వారు వానరులను కొట్టాలనుకున్నప్పుడు వాళ్ల చేతులను ఎవరో లాగినట్లు అయింది. రావణుడి రథం పోయే ప్రదేశంలో నేల అదిరింది. రావణుడి మీద సూర్యకాంతి పడ్డప్పటికీ అది ఎరుపు, పసుపు, తెలుపు, నలుపు వన్నెలు కలదై వుంది. ఎదురుగాలి దుమ్ముతో సహా వీచి రావణుడి దృష్టి పటుత్వాన్ని చెడగొట్టింది. ఉరుము లేకుండా పిడుగులు పడ్డాయి. ధూళి వర్షంతో ఆకాశం కనబడకుండా పోయింది. కలహిస్తున్న గోరువంకలు పరుషంగా కూస్తూ రావణుడి రథం మీద పడ్డాయి. గుర్రాల చెక్కిళ్ళలో మిణుగురు కళ్ళ నీరు వచ్చింది. రావణుడి కీడు తెలియచేసే ఇలాంటి అనేక అపశకునాలు కనబడ్డాయి. ఇక రాముడికి సౌమ్యమైన, క్షేమం కలిగించే శకునాలు కనబడడంతో రావణుడు చచ్చినట్లే అనుకున్నాడు

సర్గ-109

శ్రీరామ రావణ యుద్ధాన్ని దిగ్భ్రమపొంది చూసిన వానర రాక్షసులు

రావణుడు, రాముడు ఇద్దరూ శస్త్రాలను, మహాస్త్రాలను ఒకరిమీద ఇంకొకరు వర్షంలాగా కురిపించారు. ఈ విధంగా యుద్ధం భయంకరమై పోయింది. వానరులు, రాక్షసులు యుద్ధం చేయాల్సి వున్నా, చేద్దామని కోరిక బలంగా వున్నప్పటికీ, రామరావణ యుద్ధం చూడాలన్న ఆశతో కదలకుండా-మెదలకుండా తదేక ధ్యానంతో, గెలుపెవరిదో, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని రెప్పలు వాల్చకుండా చూడసాగారు. ఆ యుద్ధాన్ని చూడాలన్న కోరికతో వున్న వానరరాక్షసులు, తమ మీద శత్రువు పడ్డా వారిని కొట్టకుండా వుండిపోయారు. రావణుడిని చూసి రాక్షసులు, రాముడిని చూసి వానరులు ఆశ్చర్యంగా రెప్పపాటు వేయకుండా కళ్ళు, నోరు తెరుచుకుని బొమ్మల్లాగా యుద్ధాన్ని చూశారు.

రావణుడి ధ్వజాన్ని నరికిన శ్రీరాముడు

ఇలా శకునాలు కలగడంతో, అపశకునాలు కనబడ్డ రావణుడు తనకు చావు తప్పదని, శుభశకునాలు కనబడ్డ శ్రీరాముడు జయం తప్పకుండా తనదేనని తలచి తమ బలపరాక్రమాలు పూర్ణంగా ప్రదర్శిస్తూ, భయపడకుండా, మిక్కలి నేర్పుతో యుద్ధం చేశారు. ఆ సమయంలో రావణుడు, రామచంద్రమూర్తి ధ్వజాన్ని తాకాలన్న తలంపుతో నివారించనలవికాని బాణాలను వేసినప్పటికీ, అవి దాన్ని తాకకుండా వ్యర్థంగా నేల రాలాయి. అప్పుడు శ్రీరాముడు వాడు చేసిన దానికి ప్రతీకారంగా చేయాలనుకుని తన పూర్తి బలాధిక్యంతో విల్లు వంచి, అల్లెతాడు లాగి, బాణాన్ని ప్రయోగించాడు. అది వెంటనే పోయి రావణుడి

ధ్వజాన్ని ఖండించి భూమిలో ప్రవేశించింది. రావణుడి ధ్వజం వాడి పరాక్రమం లాగానే బిగువు చెడి నేలదొర్లింది. తన ధ్వజం నేలపడడంతో రావణుడు చాలా కోపంతో తన భుజబలమంతా చూపి రాముడి గుర్రాలను బాణాలతో ముంచాడు. ఆ గుర్రాలు కొంచెమైనా కదలక-మెదలక, కలతచెందక యథాప్రకారం సుఖంగా వున్నాయి.

తన సామాన్యమైన బాణాలు పనిచేయకపోవడంతో రావణుడు మాయాకల్పితమైన బాణాలతో, ఇనుప గుదియలతో, గదలతో, భయంకరమైన చక్రాలతో, పొడగాటి శూలాలతో, గండ్రగొడ్డళ్ళతో, బాణాలతో భూమ్యాకాశాలు నిండేవిధంగా శస్త్రసమూహాలను నలువైపులా వేశాడు. ఒక్క రామచంద్రమూర్తి రథం తప్ప మిగిలిన సేనంతా వాటితో నిండిపోయింది. అలా వేలకొద్దీ బాణాలను వేసి వానరులను చీకాకు పర్చాడు. అది చూసి రామచంద్రమూర్తి నవ్వుకుంటూ, తన అస్త్ర సమూహాలను వాడిమీదికి వేశాడు. వందలకొద్దీ, వేలకొద్దీ బాణాలు తనమీదికి రావడంతో రావణుడు కూడా అలాగే బాణాలను వదిలాడు. వారిరువురి బాణాలతో ఆకాశం బద్ధమైనట్లు పందిరి వేసినట్లయి మరో ఆకాశంలాగా కనిపించింది. ఒకరి బాణాలు మరొకరు వేసిన బాణాలతో తాకి రెండూ పొడి-పొడి అయిపోయి నేలరాలడంతో వారి యుద్ధాన్ని చూసిన సమస్త ప్రాణికోటి భ్రాంతిపడి, నివ్వెరపోయి, ఇలాంటి యుద్ధం ఎన్నడూ చూడలేదని అనుకున్నారు.

సర్గ–110
శ్రీరాముడితో భీకరంగా పోరిన రావణుడు

అలా యుద్ధం సాగుతున్న సమయంలో రామచంద్రమూర్తి రాక్షసరాజు నాలుగు గుర్రాలను నాలుగు బాణాలతో కొట్టాడు. ఆ దెబ్బలకు గుర్రాలు దారినుండి తొలగిపోవడంతో రావణుడు వజ్రాయుధ సమానమైన బాణాలను రామచంద్రుడి మీద వేశాడు. అవి తగిలినప్పటికీ రామచంద్రమూర్తి ఏమాత్రం నొప్పిపడకుండా మరిన్ని వాడి కల బాణాలను వాడిమీద వేశాడు. దానికి సమాధానంగా రావణుడు అసమానమైన బాణాలను మాతలి మీద వేశాడు. అవి తనకు తగిలినప్పటికీ చీమ కుట్టిన నొప్పి కూడా మాతలికి కలగలేదు. తనను కొట్టినా కోప్పడని రాముడు, తన సారథిని రావణుడు కొట్టడంతో కోప్పడి తన కరకు బాణాలతో రావణుడు ముఖం వాచేట్లు కొట్టాడు. రామచంద్రమూర్తి వేసిన బాణాలు తమలో ప్రవేశించే ఉపద్రవం ఉన్నందున సముద్రాలు కలత చెందాయి. పాతాళవాసులైన సర్పశ్రేష్టులు మహాబాధపడసాగారు. దానవులు భయపడి కలత చెందారు. భూచక్రం వణికింది. సూర్యుడు కాంతిహీనుడయ్యాడు. వాయువు దారితప్పి మొద్దుపారింది. దేవగంధర్వ ఋషుల సమూహాలు దిక్కు తెలియక చింతించాయి. “గోవులకు, బ్రాహ్మణులకు క్షేమం కలుగుగాక! లోకాలు, జనులు శాశ్వతంగా వుండుగాక! యుద్ధంలో లోక ద్వేషి రాక్షసరాజు రావణుడిని రాముడు జయించుగాక!” అంటూ ఆ యుద్ధాన్ని దేవతలు, ఋషులు చూడసాగారు. ఆకాశానికి ఆకాశమే సాటి అని, సముద్రానికి సముద్రమే సాటి అని, రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమానమని నిర్మల మనస్సుతో వారంతా ఆశ్చర్య పడ్డారు.

రావణుడి శిరస్సు నరికిన శ్రీరాముడు

తీవ్రమైన కోపంతో భయంకరాకారుడై రామచంద్రమూర్తి సర్పసమానమైన మంగలకత్తిలాంటి బాణాన్ని సంధించి దాంతో రావణుడి శిరస్సు నరికాడు. అది నేలబడడం ప్రపంచమంతా చూసింది. రావణుడి తల కిందపడ్డది కాని వెంటనే మరొక తల మొలిచింది. అలా తల నరకగానే మరొక తల మొలిచింది కాని వాడు చనిపోయే విధం రాముడికి కనబడలేదు. ఇదేమి చిత్రమని రాముడు ఆలోచన చేయసాగాడు. తన బాణాలు ఎప్పుడూ వ్యర్థం కాలేదని, ఈ రోజున ఎందుకు ఇలా జరుగుతున్నదని ఆలోచిస్తూనే బాణ వర్షాన్ని కురిపించాడు రావణుడి మీద. రావణుడు కూడా భయపడకుండా బాణాలు వేస్తూనే వున్నాడు. వారిద్దరూ భూమ్యాకాశాలను, త్రికూట శిఖరాన్ని కలిపి మూడింటినీ యుద్ధరంగం చేసి ఆ మూడు ప్రదేశాల్లో తిరుగుతూ యుద్ధం చేసారు. రాత్రి–పగలు అనే తేడా లేకుండా ఒక్క నిమిషమైనా ఆగకుండా యుద్ధం చేశారు. అప్పుడు మాతలి శ్రీరాముడితో ఇలా అన్నాడు.

సర్గ–111
బ్రహ్మాస్త్రం వేసి రావణుడిని వధించిన శ్రీరాముడు

"ఇదేంటి మహానుభావా! రామచంద్రా! ఏమీ తెలియనివాడిలాగా రావణుడు వేసిన అస్త్రానికి బదులుగా తిరిగి కొన్ని మహాస్త్రాలు వేస్తూ కాలం గడుపుతున్నావు? వాడిమీద బ్రహ్మాస్త్రం వేయి. వీడు ఏ గడియలో చస్తాడో అని దేవతలు చెప్పారో ఆ కాలం ఇప్పుడు సమీపించింది".

మాతలి ఇలా చెప్పగానే ఇంద్రుడికి బ్రహ్మదేవుడు, ఆయన దాన్ని అగస్త్యుడికి, అగస్త్యుడు తనకు ఇచ్చిన అస్త్రాన్ని తీశాడు శ్రీరాముడు. వాయుదేవుడు, సూర్యాగ్నులు, దేవతలు ఆవహించిన, మేరుమందర పర్వతాల భారం కలిగిన, బంగారు భూషణాలతో అలంకరించిన, దేన్నెయినా ఛేదించగలదైన, అసమానమైన, ప్రాణిభయంకరమైన, యముడితో సమానమైన, బ్రహ్మమంత్రంతో గొప్పదైన బాణాన్ని శాస్త్రం చెప్పిన ప్రకారం రామచంద్రమూర్తి వింట సంధించాడు. అలా ఆయన బ్రహ్మాస్త్రాన్ని సంధించగానే దిక్కులలో వున్న భూతలాలన్నీ తమను చంపుతాయేమోనని భయపడి అలా చేయవద్దని ప్రార్థించాయి. సముద్రాలు కలతచెందాయి. భూమి వణికింది. అమితమైన వేగంతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని బ్రాహ్మణహంతకుడైన రావణుడిమీద వేశాడు. అది పోయి రావణుడి రొమ్ముమీద పడింది. పడగానే ఆ గొప్ప అస్త్రం రావణాసురుడి రొమ్ము చీల్చి, ఆ నెత్తురులో స్నానం చేసి, వాడి దేహం నుండి ప్రాణాలను వెడలగొట్టి, పనంతా అయిపోయిన తరువాత భూమిలో దూరి వెలుపలికి వచ్చి, వినయంగా రాముడి అమ్ముల పొదిలో ప్రవేశించింది.

రావణుడు చావగానే ఆయన దేహం ప్రాణాన్ని వదిలినట్లే, విల్లు, బాణాలు కూడా రావణుడిని వదిలి నేలమీద పడ్డాయి. రావణుడి దేహం అలా శక్తిపోయి నేలమీద పడిపోయింది.

తమ ప్రభువు చావడం చూసి చావకుండా మిగిలిన రాక్షసులు రామజయంతో సంతోషించే వానరులు తరుముతుంటే లంకలోకి పారిపోయారు.

రావణుడి మృతికి సంతోషించిన లోకాలు

ముల్లోకాలను భయపెట్టిన రావణుడు శ్రీరామచంద్రమూర్తి చేతిలో చావగా లోకాలన్నీ సంతోషించాయి. దేవతలు దుందుభులు మోగించారు. కల్పవృక్షాల నుండి తేనెలు కురుస్తూ పూలు గుంపులుగా వర్షం లాగా రాముడి రథమ్మీద పడ్డాయి. కమ్మని గాలి పరిమళంతో సహా వీచింది. దేవతల వాక్యాలు స్తోత్రాలయ్యాయి. దేవతలు, చారణులు సంతోషించారు. సమస్త జనవిరోధైన రావణుడు దేవలోకానికి ప్రయాణమై పోవడంతో దేవతలు శాంతచిత్తులై సంతోషించారు. దిక్కులు తేటగా అయ్యాయి. ఆకాశం నిర్మలమై ప్రకాశించింది. భూమి వణకడం ఆపుచేసింది. మందమారుతం సువాసనతో వీచింది. సూర్యుడు భయం లేకుండా ప్రకాశించాడు. నిర్భయంగా జనులు వీథులవెంట తిరిగారు. యాగాల పొగలు ఆకాశాన్ని తాకాయి. లోకులంతా దిగులు మాని నిద్రించారు. ఇలా రావణాసురుడు చావగా విభీషణుడు, సుగ్రీవుడు, ఇతరులు (ఇంతదాకా దూరం నుండే యుద్ధాన్ని చూస్తున్న వారు) రామచంద్రుడిని సమీపించారు. ఆయన్ను అనేక విధాలుగా స్తోత్రం చేశారు.

సర్గ–112

రావణుడి కళేబరం చూసి ఏడ్చిన విభీషణుడు

రావణుడి కళేబరాన్ని చూసి విభీషణుడు దీనుడై ఏడ్చాడు. ఏడుస్తూ ఇలా అన్నాడు.

"ఎన్నో యుద్ధాలను జయించి, వీరుడని కీర్తి సంపాదించి, శాస్త్రాలెన్నో పఠించి, పండితులతో పొగడ్తలందుకుని, స్థిరంగా సౌఖ్యం ఇచ్చే పానుపు మీద పడుకునాల్సిన వాడివి అన్నా! ఇవ్వాళ ఇలా నేలమీద పడాల్సిన వాడివయ్యావు కదా! దైవమా! ఏమనాలి? కాళ్లు పారచాచి బంగారు భుజకీర్తులతో ప్రకాశించే రెండు చేతులు నేలమీద వేసి చేష్టలు మాని, కిరీటం నేలపడిపోగా ఇలా వున్నావు కదా? ఇలా జరుగుతుందని నీకు ఎన్ని సార్లు చెప్పినా కామాతిశయంతో నా మాటలు వినలేదుకదా? కుంభకర్ణుడైనా, ఇంద్రజిత్తయినా, ప్రహస్తుడైనా, నరాంతకుడైనా, అతికాయుడైనా బలంకలవారిమని ప్రవర్తించారే కాని ధర్మం శ్రేయస్కరమని, అధర్మం హానికరం అన్న నీతిని పాటించలేదు కదా? నువ్వు కూడా ఆలోచించ లేదు. దాని ఫలమే ఇప్పుడు ఇలా ప్రాప్తించింది కదా? నేనెంతగానో వద్దని వారించాను. నేను చెప్పినదంతా వ్యర్థమైపోయింది. కాలాన్ని ఎవరు తప్పించగలరు? నువ్వొక్కడివి భూమిని వీడిపోవడంతో నీటికి ఆనకట్ట లేకుండా పోయింది. ధర్మానికి ఆకారం తొలగింది. బలానికి నిలువ నీడలేదయింది. లోకంలో స్తోత్రం చేయదగ్గ పదార్థం లేకుండా పోయింది. ఈ వీరుడు దేహాన్ని వదలడంతో సూర్యుడు నేలపడ్డాడు. చంద్రుడు చీకట్లో మునిగాడు. అగ్ని చల్లబడింది. రావణుడు యుద్ధంలో చావడంతో లోకంలో వీరుడని చెప్పగలవారెవ్వరు మిగిలారు?"

విభీషణుడికి దుఃఖోపశమనం చేసిన శ్రీరాముడు

ఏడుస్తున్న విభీషణుడిని ఓదారుస్తూ శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "అయ్యా! విభీషణా! ఎందుకు ఏడుస్తున్నావు? బలహీనుడై యుద్ధం చేయలేక అవమానపడి చావలేదితడు. యుద్ధం అంటే కోరిక కలవాడు. అమితమైన పరాక్రమం, ఉత్సాహం కలవాడు. మేరునగ ధీరుడు. ఇలాంటి రావణుడు ఓడిపోతానని ఏమాత్రం సందేహం లేకుండా, చస్తానేమోనన్న భయం లేకుండా, అపరిమితమైన ధైర్యంతో చేతనైనంతదాకా యుద్ధం చేసి చనిపోయాడు. యుద్ధంలో క్షాత్ర ధర్మంతో వీరమరణం పొందినవారికోసం ఏడవడం న్యాయమా? ముల్లోకాలనూ బాధించాడు. దేవతలను జయించాడు. యుద్ధంలో అసమాన బలంతో పోరాడి వీరులు పోయే స్వర్గానికి పోయాడు. ఇలాంటివాడి కోసం ఏడవడం తగునా? యుద్ధంలో గెలుపు ఓటములు సహజం. ఫలానావారు గెలుస్తారన్న నమ్మకం లేదు. ఈ విధంగా యుద్ధంలో మరణించడం క్షత్రియులకు ఇష్టమైన పని. యుద్ధంలో చనిపోయిన క్షత్రియుడి కోసం ఎవరూ కన్నీరు కార్చరాదు. క్షత్రియ ధర్మం ఇదీ అని నిశ్చయించుకుని, వాస్తవం అర్థం చేసుకుని, తరువాత జరగాల్సిన పనికై త్వరపడు".

జవాబుగా విభీషణుడు ఇలా చెప్పాడు. "రామచంద్రా! దేవేంద్రుడు సేనలను వ్యూహంగా పన్ని ఎదిరించినప్పటికీ లోబడక కీర్తికరంగా ప్రసిద్ధ బలాతిశయంతో అతడి గర్వం అణిచాడు. సముద్రం చెలియలికట్ట దాటి చెడినట్లు నిన్నెదిరించి నేడు యుద్ధానికి వచ్చాడు. రామచంద్రా! వీడు ఎన్నో ఉత్తమ దానాలు ఇచ్చాడు. గురువులను, దేవతలను కొలిచాడు. అన్ని సుఖాలు అనుభవించాడు. ఆశ్రితులను రక్షించాడు. తన మేలుకోరినవారికి కావాల్సినంత ధనం ఇచ్చాడు. శత్రువులను భాదించాడు. నిత్యం అగ్నులను సేవించాడు. గొప్ప తపస్సు చేశాడు. వేదం, వేదాంతం చదివాడు. కర్మానుష్టానపరుడు అని కీర్తికాంచాడు. కాబట్టి ఇతడికి పరలోకంలో హితకరమైన ప్రేతకార్యాలు చేయమంటావా?". ఇలా అడిగిన విభీషణుడికి దయావంతుడైన రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

" విభీషణా! పగ అనేది జీవితకాలంలోనే కాని చచ్చినవాడి మీద పగ అనేది లేదు. ఇప్పుడు మనం ఏం చేసినా అతడేమి చేయగలడు? ఆ విధంగా ప్రతీకారం ఏమీ చేయలేనివాడి విషయంలో మనం ఏదీ చేయకూడదు. వాడిమీద పగ వాడి మరణంతోనే ముగిసింది. వాడు నేను పుట్టుకతో శత్రువులం కాదు. ఒక విషయంలో విరోధం వచ్చింది. ఆ కార్యం చక్కబడింది. మన కార్యాలు

చక్కనైనయ్యాయి. కాబట్టి ఇక వాడి మేలుకొరకై చేయాల్సిన సంస్కారాలు చేయి. వీడు నీకు ఎలాంటివాడో నాకూ అలాగే. నీకెలా తోడబుట్టినవాడు అన్న ప్రేమకలదో నాకూ అలాగే వుంది. నీకు వాడు తోడబుట్టినవాడైనప్పుడు, నువ్వు నాకు తోడబుట్టినవారిలో ఒకడివైనప్పుడు వీడు మాత్రం అలా కాడా? కాబట్టి వీడికి కర్మలు చేసే విషయంలో నేను అన్యధా భావిస్తానని అనుకోవద్దు".

సర్గ–113

రావణుడిని చూసి విలపించిన రావణుడి భార్యలు

ఇలా శ్రీరాముడు విభీషణుడితో అంటున్న సమయంలోనే రావణుడి భార్యలు, రాక్షస స్త్రీలు అంతఃపురం వదిలి ఏడ్చుకుంటూ వచ్చారక్కడికి. వారంతా రావణుడిని చూడడానికి వచ్చారు. "హా రాజనందనా! హా జీవితేస్వరా! హా ప్రాణ నాయకా! హా మదీశ! హా నాథా! హా పతీ!" అనుకుంటూ ఏడ్చారు. ఒక మనిషి చేతిలో చచ్చావా? అని ఏడ్చారు. సీతను రాముడికి ఇచ్చి వుంటే ఇంత జరిగేది కాదుకదా? అని ఏడ్చారు. "నీ ఒక్కడి మూర్ఖత్వం వల్ల నువ్వు, మేము, వూరివారంతా చెడిపోయాం కదా? నీ మృతికి కామం కారణం కాదు. అంతా దైవ వశం. దైవం తప్పుగా చూస్తే ఏదైనా జరుగవచ్చు. నీ నాశనానికి దైవమే కారణం. విధి సంకల్పం తప్పించడం ఎవరి తరం కాదు" అని ఏడ్చారు.

సర్గ– 114
మందోదరీ విలాపం

రావణుడి పెద్ద భార్య మందోదరి యుద్ధభూమికి చేరుకొని దుఃఖం ఆపుకోలేక ఏడ్చింది. మందోదరి వీరపత్నికదా! వీరపత్ని అంటే భర్త గెలిచినప్పుడు ఎంత సంతోషపడాలో, వీరమరణం పొందినప్పుడు కూడా తన వీరపత్నీత్వానికి హానిరాలేదు కదా అని సంతోషించాల్సి వుండగా పామరురాలిలాగా ఇలా ఏడవవచ్చా? మందోదరి రావణుడి మరణానికి ఏడవలేదు. రావణుడు తనకంటే అధములని భావించే మనుష్యుల చేతిలో చచ్చి, తన వీరపత్నీత్వానికి హాని కలిగించాడు కదా! ఇదెంత లజ్జావహం? ఎవరైనా వచ్చి నీ భర్త మనుష్యుడి చేతిలో చచ్చాడే, ఇది నిజమా? అంటే తానేమి చెప్పాలి అని ఏడ్చింది.

"ముల్లోకాలను గెలిచావు కదా! ఎక్కడెక్కడ లక్ష్మి, సంపద వుంటే అదంతా గెల్చావు కదా! ఎంతో పేరు గడించావు కదా! చివరకు ఒక మనిషి చేతిలో చచ్చావు కదా! నిన్నోక మనుష్యుడు చంపాడంటే నమ్మలేక పోతున్నాను. మనిషి మనుష్యులను తినేవాడిని చంపడంలో ఏం న్యాయం వుందో చెప్పు. ఇది విపరీతం, అవమానకరం కదా! సకల శస్త్రాస్త్రాలను పరిపూర్ణంగా తెలిసన యుద్ధకోవిదుడివైన నిన్ను యుద్ధంలో రాముడు చంపడమా? నమ్మలేకపోతున్నాను ప్రాణనాథా!" అని విలపించింది మందోదరి.

ఇంకా ఇలా విలపించింది ఆమె. "ఎప్పుడైతే జనస్థానంలో తమ్ములను సర్వరాక్షసులతో సహా రాముడు చంపాడో, అది మనుష్య సాధ్యమైన కార్యం కానందున రాముడు సామాన్య నరుడు కాదని అప్పుడే అనుకున్నాను. దేవతలకు, దానవులకు, ఆమాటకొస్తే ఎవరికీ పోవడం సాధ్యపడని లంకలోకి

హనుమంతుడు వచ్చినప్పుడే నేను పరితపాపం చెందాను. సముద్రానికి సేతువు కట్టినప్పుడే అనుకున్నాను రాముడు మానవమాత్రుడు కాదని. ఆ యముడే స్వయంగా ఈ రకమైన అవనీనాథ రూపంలో తన అద్భుతమైన శక్తిని ప్రదర్శించి నిన్ను చంపాడు నాథా! లేకపోతే ఇంద్రుడే ఆ రూపంలో వచ్చాడా? ఈ కారణాన ఈ రామచంద్రమూర్తి వాస్తవానికి మహాయోగి, ఆదిమధ్యాంత రహితుడు, సనాతనుడు, జీవాత్మల అన్నింటికంటే పరముడైన వాడు అయ్యుండాలి. పరాపరుడు, మహత్తుకంటే పరమ మహత్తు కలవాడు, సర్వాన్ని ధరించి పోషించేవాడు, వక్షంలో శ్రీవత్సం కలవాడు, శ్రీదేవితో నిత్యం కలిసివుండేవాడు, శంఖచక్రాలను సదా ధరించినవాడు, వికార శూన్యుడు, ధృవుడు, అజేయుడు, సత్యపరాక్రముడు, జగత్ప్రభువు అయిన విష్ణువే మనుష్య శరీరంలాంటి శరీరాన్ని ధరించి వానరులుగా పుట్టిన దేవతలతో లోకం మేలుకొరకు నీతోటి రాక్షసులతో సహా నిన్ను చంపాడు".

"నువ్వు తపస్సు చేస్తున్నప్పుడు ఇంద్రియాలను గెలిచి ఆ బలంతో ముల్లోకాలను జయించావు. ఆ పగ మనస్సులో వుంచుకుని ఇంద్రియాలు నిన్ను గెలిచి ఈ దశకు తెచ్చాయి. రామచంద్రమూర్తితో విరోధం వద్దు-వద్దని నేను చెప్పలేదా? నామాటలు నువ్వు విన్నావా? వినని ఫలం నిన్నీగతికి ఇప్పుడు తెచ్చింది. నీ పరువు, ప్రాణం బంధువులనందరినీ నాశనం చేయడానికి కాక మరేకారణంతో సీతాదేవిని తెచ్చావు? మతిలేకుండా నువ్వు ఆలోచన లేనివాడివి. కాబట్టే, రోహిణికంటే, అరుంధతికంటే అధికమైన పాతివ్రత్యంకల జానకిని, గౌరవించాల్సిన దానిని బాధించావు. బుద్ధికలవారు పోయే మంచి మార్గం ఇదేనా?"

"ప్రాణేశ్వరా! నువ్వు సీతాదేవిని ఏమని అనుకున్నావు? ఆమె వల్లే కదా, వసుధకు వసుధ అన్న పేరు వచ్చింది. శ్రీ, శ్రీ అయింది. అలాంటి స్త్రీరత్నమైన పతివ్రత సీత. ఆమె ఏ అవయవంలోనూ ఒక్కటంటే ఒక్క దోషం కనపడదు. దోషాలు లేకపోవడమే కాదు. సమస్త శుభచిహ్నాలు వున్నాయి. అలాంటి దాన్ని నువ్వు భక్తితో ఆశ్రయించి వుంటే ఎంతో బాగుపడేవాడివి. ఆ మార్గాన్ని వదిలి మహారణ్యంలో, ఏమూలనో, ఎవరూలేని చోట ఆమె వున్నప్పుడు మోసగించి ఆమె ఏడుస్తూ వుంటే మారీచుడిని పంపించి అపహరించావు. ఇది నిన్ను నువ్వు నాశనం చేసుకునే కార్యక్రమం కాదా? అపహరించడం తప్ప ఆమెవల్ల నువ్వు అనుభవించిన సుఖం ఏమైనా వుందా? సుఖానికి బదులు ఆమె పాతివ్రత్యంలో

కాలిపోయావు. వాస్తవానికి నువ్వామెను తాకిననాడే భస్మం కానందుకు నిన్ను చూసి దేవతలు భయపడ్డారు. నువ్వు చేసిన పని పాపకార్యం అయితే అప్పుడే పాపఫలం ఎందుకు అనుభవించలేదు అని అడగవచ్చు నువ్వు. దానికి కారణం వుంది. విత్తనం వేయగానే ఫలం నోటికి రాదు. కాలపక్వం కావాలి. పాపం చేసినవాడికి ఆ పాపఫలం కాలపక్వమైనప్పుడే అనుభవంలోకి వస్తుంది. అప్పుడిక ఏం చేసినా పోదు".

"శుభం చేసినవారికి శుభం కలుగుతుంది. పాపం చేసినవారికి పాపఫలం తప్పదు. పుణ్యాత్ముడైన విభీషణుడికి సుఖం కలిగింది, పాపశీలివైన నీకు ఇలాంటి కష్టం కలిగింది. సౌందర్యంలో సీతకంటే చక్కటివారు నీపక్కనే వున్నారు. కాని నువ్వు మదనుడి వలలో చిక్కుకుని చూడలేకపోయావు. ఎందరో స్త్రీలు నీకు తృప్తితీరా నీతో తిరిగేవారు కదా! కోరిన భోగాలు అనుభవించావు కదా! అలాంటి సుఖాలను పొందిన ఆ సుకుమారమైన నీ దేహం చివరకు ఇలా రామబాణాలతో ఛేదించబడి మాంసం నెత్తురుతో కూడి కాంతి చెడిపోయి వుందికదా! చివరకు నాకు వైధవ్యం ప్రాప్తించెకదా! మనోహరమైన నీ శరీరం బాణాల పదునైన ములుకులతో కూడి తాకడానికి కూడా సాధ్యపడకపోవడం వల్ల కౌగలించుకునే భాగ్యం కూడా లేదాయె. కలలో జరిగేది సత్యమైనా మేల్కొన్న తరువాత అది అసత్యమని ఎలా భ్రమపడతామో అలాగే నిన్ను రామచంద్రమూర్తి చంపడం వాస్తవమైనా, మృత్యువుకే మృత్యువైన నువ్వు, మృత్యువుకు వశపడుతావా అని భ్రమ పడుతున్నాను. నువ్వు రాముడి చేతిలో చావలేదనుకోవడం భ్రమే".

"నా ప్రాణనాథుడిని, వీరుడిని, నాలుగు వేదాలు, ధర్మశాస్త్రాలు చదివినవాడిని, ధర్మశాస్త్ర మర్యాదను ఉల్లంఘించిన వాడిని, దేవతాస్త్రీలను, మనుష్య స్త్రీలను అపహరించిన వాడిని, నిన్ను, మరణించిన దశలో చూసికూడా నా దేహంలో ప్రాణాలు వున్నాయంటే నేను స్థిరజీవిని, నాకు చావులేదు. నీ పట్టపు రాణినైన నేను ముసుగు వదిలి, కాలినడకన వూరు వదిలి పదిమంది వుండే ప్రదేశానికి వచ్చానుకదా! ఎందుకు నీకు కోపం రావడం లేదు? నేనొక్కదాన్నే కాదు. నీకు ప్రియమైన స్త్రీలంతా ఇలాగే వచ్చినా నీకు కోపం ఎందుకు రావడం లేదు? ఎందరో స్త్రీల భర్తలను చంపి వారిని విధవలుగా చేశావు. ఆ పతివ్రతలు నిన్ను శపించారు. వారి శాపంతో నువ్వు చచ్చావు. ఆ శాప ఫలితమే నీ భార్యలు విధవలు కావడం. పతివ్రతల కన్నీరు వృథా

కాదనడానికి నువ్వే ఉదాహరణ".

"నువ్వు శూరుడివై లోకాన్నంతా నీ భుజబలంతో గెలిచావు. కాబట్టే నువ్వు శూరుడివనుకున్నావు. కాని నువ్వు నిజానికి శూరుడివి కాదు. నిజమైన శూరుడివే అయితే పిరికివాడిలాగా ఆడదాన్ని దొంగిలించి తెచ్చే నీచకార్యానికి పూనుకుంటావా? మగవారికి భయపడే కదా నువ్విలా చేశావు? జింక నెపంతో రామచంద్రమూర్తిని ఆశ్రమానికి దూరంగా పోయేట్లు చేసి సీతను ఎత్తుకువచ్చావు. ఇది పిరికితనానికి నిదర్శనం కాదా? నిర్భాగ్యదశ పక్వమై నీకిలాంటి దుర్బుద్ధి కలిగింది. నువ్వెప్పుడైతే సీతను తెచ్చావో అప్పుడే సత్యవాదైన నామరది విభీషణుడు రాక్షసులు అంతా నాశనమవుతారని హెచ్చరించాడు. విభీషణుడి ప్రయత్నాలు ఫలించలేదు. మాట వినని నీలాగే రాక్షసులంతా నాశనం అయ్యారు. చేసిన దానికి ఫలం అనుభవించడానికి నీ గతికి నువ్వు పోయావు. కాబట్టి నీకొరకు నేను దుఃఖపడడం లేదు. నాగతి ఏమిటని నేను నాకై దుఃఖిస్తున్నాను".

ఇలా ఏడుస్తున్న మందోదరి చుట్టూ చేరి ఇతర రాక్షస స్త్రీలు, రావణుడి భార్యలు ఆమెతో ఇలా అన్నారు. "సుందరీ! రాజుల సంపత్తు, భువనస్థితిగతులు, అనుభవించువారి దశలు మారినాకొద్దీ మారుతాయని, నిలకడగా వుండవని నీకు తెలియదా? కాబట్టి నువ్వు ధైర్యం తెచ్చుకుని మమ్మల్ని సమాధానపర్చు. నువ్వే ఏడుస్తుంటే మాగతి ఏమిటి?".

రావణుడు సంస్కారానికి అనర్హుడని శ్రీరాముడికి చెప్పిన విభీషణుడు

చనిపోయిన అన్న రావణాసురుడికి దహన సంస్కారాలు జరిపించమని రామచంద్రమూర్తి తనకు చెప్పడంతో, విభీషణుడు ధర్మం ఏంటని ఆలోచన చేశాడు. రాముడు చెప్పినట్లే చేయడం ధర్మమని తీర్మానించుకుని ఇలా జవాబు చెప్పాడు రాముడికి.

"ధర్మ ప్రవర్తన వదిలినవాడు, దయలేని చోరుడు, అసత్యవాది, పాపపు మనస్సుకలవాడు, పర స్త్రీలను బాధించినవాడు రావణుడు వరసకు నాకు అన్నే కాని నడవడిలో నాకు గొప్ప శత్రువు. అహిత కార్యాలలో ప్రీతికలవాడు. ప్రపంచానికి ఉపద్రవం కలిగించినవాడు. ఇలాంటి వీడికా నేనిప్పుడు శాస్త్రప్రకారం సంస్కారాలు చేయాలి? నేనాపని చేయలేను. అన్నకదా అంటావేమో? అన్న అని చెప్పి లౌకిక గౌరవాలు చూపుతాను కాని పారలౌకిక

కర్మలకు వీడు అర్హుడు కాదు. నేను ఇప్పుడు వీడికి ఉత్తర క్రియలు చేయకపోతే నన్నెవరైతే శాస్త్రనియమం తప్పాడని తిట్టుతారో వారే వీడి నడవడి తెలుసుకున్న తరువాత విభీషణుడు సరైన పనే చేశాడనీ, పతితులకు శాస్త్రీయ సంస్కారాలు అవసరం లేదని నేను చేసిన పనిని మెచ్చుకుంటారు''.

ఈ మాటలకు రాముడు విభీషణుడితో ఇలా అన్నాడు. "విభీషణా! నీకు ప్రియమైనా, అప్రియమైనా నేను చెప్పేది విను. ఆ ప్రకారం చేయడం నీ విధి. నామాట ధిక్కరించడం నీకు మంచిదికాదు. నువ్వు చేయకూడని పని నేను చేయమని చెప్తే ఎలా చేయాలంటావేమో? ఈ యుద్ధంలో నువ్వు చేసిన సహాయం వల్ల నాకు జయం కలిగింది. నాకిలాంటి మేలు చేసిన నీకు హితమైనది చెప్పడం నీతి. కాబట్టి అది ప్రియమా, అప్రియమా అని నువ్వు ఆలోచించవద్దు. నాకు ప్రియమైనా నీకు ఆహితమైనదైతే నేను నీకు చెప్పకూడదు. కాబట్టి నీ మేలు కోరి నేను చెప్పినట్లు చేయి''.

"రావణుడు సంస్కారార్హుడు కాదు, పతితుడు అనడానికి నువ్వు చెప్పిన కారణాలు నేను తప్పనను. అవి నాకు తెలియకా కాదు. అతడు అధర్మానికి భయపడడని, అసత్యవాదని, నీతిమాలినవాడని నాకు తెలుసు. తెలిసి కూడా వాడికి సంస్కారం చేయమని చెప్పాను. ఎందుకంటే, పతితుడికి పరలోక క్రియలు లేవనడం లోక సామాన్య విధంగా చస్తే నిజమే కాని, ధర్మయుద్ధంలో న్యాయరీతిన చనిపోయిన వీరుడి విషయంలో కాదు. వాడు బలశాలి, శూరుడు, తేజస్వి, ఇంద్రాదులకైనా వెనుదీయని వాడు. అలాంటి లోక రావణుడు, పర్వతం లాంటి ధైర్యశాలి, సామాన్యుడా? యుద్ధంలో చనిపోయాడు. వీరస్వర్గం వాడికి లభించాలి. నువ్వు వాడికి సంస్కారం చేయకపోతే ప్రేతత్వం పోదు. ప్రేతత్వం పోకపోతే స్వర్గప్రాప్తి లేదు. వాడు కష్టపడి సంపాదించిన స్వర్గ సుఖాన్ని సంస్కరించని నువ్వు దాన్ని విఘ్నపరచడమే కాకుండా ప్రేతత్వ బాధ కలిగించిన వాడివవుతావు. అది నీకు శ్రేయస్కరం కాదు. చనిపోయినవాడిని ప్రేమ కలవాడు కదా సంస్కరించాల్సింది? వాడు నీకు విరోధి కదా అంటావేమో? ఎంత పాపాత్ముడైనా వీరమరణం పొందినవారికి వీరస్వర్గం వుంటుంది. కాబట్టి వాడు సంస్కారానికి అర్హుడు. రావణుడు లాంటి పాపికి, విరోదికి, సంస్కారాలు చేసినాడన్న కీర్తి నీకు కలుగుతుంది కాని అపకీర్తి రాదు''.

రావణుడికి దహనాది క్రియలు తీర్చిన విభీషణుడు

శ్రీరాముడు చెప్పిన మాటలకు స్పందించి విభీషణుడు సంస్కారానికి కావాల్సిన సరకులన్నీ తెప్పించాడు. శాస్త్రోక్తంగా రావణుడికి దహన సంస్కారాలు జరిపించాడు. స్నానం చేసి తడిబట్టలతో నువ్వులు, నీళ్ళతో తర్పణాలు విడిచాడు. ఆ తరువాత నమస్కారం చేసి, ఆడవారున్న చోటుకు పోయి వారికి సమాధానం చెప్పి, వారందరినీ నగరంలోకి పంపించి, నిర్మలమైన మనస్సుతో సవినయంగా రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు విభీషణుడు.

సర్గ–115

రామాజ్ఞ తీసుకుని ఇంద్రుడి దగ్గరికి పోయిన మాతలి

యుద్ధాన్ని చూడడానికి వచ్చిన దేవదానవులు రామరావణ యుద్ధాన్ని కథలుకథలుగా చెప్పుకుంటూ, సంతోషంగా వారి–వారి స్థానాలకు మరలిపోయారు. ఆ తరువాత రామచంద్రమూర్తి తన రథాన్ని నడిపిన సారథి మాతలిని చూసి, ఆయనకు తన మీద వున్న ప్రేమను పొగిడి, అతడు తన రథాన్ని తీసుకుని ఇంద్రుడి దగ్గరికి పొమ్మని అనుమతి ఇవ్వగా, మాతలి అక్కడినుండి వెళ్లిపోయాడు. అప్పుడు రామచంద్రమూర్తి సుగ్రీవుడిని కౌగలించుకుని అక్కడి నుండి లక్ష్మణుడు తోడురాగా, సమస్త వానరసేన సేవించగా, సేనలున్న ప్రదేశానికి పోయి లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

విభీషణ పట్టాభిషేకం

"లక్ష్మణా! దగ్గరికిరా. విభీషణుడు నేనంటే అనురాగం కలవాడు, నాకు భక్తుడు, నాకు ఎంతో ఉపకారం శక్తికొద్దీ చేశాడు. కాబట్టి అతడిని లంకలో అభిషేకం చేయాలని కోరుతున్నాను. ఇది నా మనస్సులో వున్న కోరిక. దీన్ని నువ్వు నెరవేర్చి రావాలి" అని శ్రీరాముడు చెప్పగానే లక్ష్మణుడు త్వరగా నగరంలోకి పోయి, బంగారు పాత్రలను తెచ్చి, వాటిని తీసుకుని సముద్రతీరానికి పోయి సముద్ర జలాలను తెమ్మని సైనికులను పంపాడు. వారలా జలాలను తీసుకుని రాగానే అందులో ఒకదాన్ని తాను తీసుకుని, రాజయోగ్యమైన ఉత్తమ సింహాసనాన విభీషణుడిని కూర్చోబెట్టి, రాక్షసులంతా చూస్తుండగా వారి మధ్యన మంత్రయుక్తంగా అతడిని అభిషిక్తుడిని చేశాడు. విభీషణుడు సంతోషించి రామచంద్రమూర్తి ఇచ్చిన రాజ్యాన్ని గ్రహించాడు. శ్రేష్ఠులైన

రాక్షసులు ఆయన్ను ఆశీర్వదించారు. వారిచ్చిన అక్షతలను, పుష్పాలను, పేలాలను ఇతర శుభకరమైన వస్తువులను తీసుకుని రామచంద్రుడి దగ్గరికి వచ్చాడు. వచ్చి అవి ఆయనకు సమర్పించాడు. శ్రీరాముడు చాలా సంతోషించాడు. అ ఆతరువాత సమీపంలో వున్న హనుమంతుడిని పిలచి ఇలా చెప్పాడు.

సీతాదేవి దగ్గరికి హనుమంతుడిని పంపిన శ్రీరాముడు

"ఆంజనేయా! విభీషణుడి అనుమతి తీసుకుని లంకకు పోయి అక్కడ రావణుడి ఇంట్లో వున్న సీతాదేవికి యుద్ధంలో నేను గెలిచిన వృత్తాంతాన్ని, సుగ్రీవ లక్ష్మణులతో క్షేమంగా వున్నానని, రావణుడిని జయించానని చెప్పి, సంతోష పరచి, ఆమె ఏమని ప్రత్యుత్తరం ఇస్తుందో తెలుసుకుని రా" అని చెప్పాడు రాముడు. రామాజ్ఞ శిరసావహించిన హనుమంతుడు తక్షణమే రాక్షసులంతా తనను ఆదరిస్తుంటే, రావణుడి ఇంట్లోకి ప్రవేశించి, దుఃఖిస్తున్న సీతాదేవిని చూశాడు.

సర్గ–116

సీతాదేవికి విజయవార్త తెలిపిన హనుమంతుడు

సీతాదేవి అప్పుడు రాక్షసులంతా చుట్టుకుని వుండగా చెట్టు మొదట్లో కూచుని వుంది. అప్పుడు అక్కడికి చేరుకున్న హనుమంతుడు, ఆమెకు తన పేరు చెప్పుకుని, సాష్టాంగంగా సాగిలబడి, నమస్కారం చేసిన తరువాత ఆమె ఆయన్ను చూసి లోగడ అతడు చేసిన కార్యమంతా జ్ఞప్తికి తెచ్చుకుంది. సీతాదేవి సుప్రసన్నమైన ముఖం చూసి సంతోషంతో హనుమంతుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు. "అమ్మా! మైథిలీ! తమ్ముడితో, సుగ్రీవుడితో, విభీషణుడితో, వానర సేనతో నీ భర్త కుశలంగా వున్నాడు. పతివ్రతా రత్నమైన సీతాదేవీ! నీ మగడు శత్రువులను గెలిచి, కార్యసాధకుడై, సంతోషంగా తన క్షేమవార్తను నీకు తెలియచేయమని నన్ను పంపాడు. పతివ్రతా శిరోమణీ! నీ మగడు సౌమిత్రి, విభీషణుడు సహాయపడగా వానరసేనతో కూడి రావణుడిని యుద్ధంలో చంపాడు. అలాంటి అద్భుత కార్యం సాధించిన నీ భర్త రామచంద్రమూర్తి నీ క్షేమాన్ని విచారించి, నీతో సంతోషకరమైన కొన్ని మాటలు చెప్పమన్నాడు. చెప్తా, వీనుల విందుగా విను" అన్నాడు.

రామచంద్రమూర్తి మాటలుగా హనుమంతుడు ఇలా చెప్పాడు. "దేవీ! నీకు ప్రియమైనదాన్ని చెప్తా విను. నీమీద అమితమైన ప్రేమకలవాడిని. ఆ అదృష్టం కొద్దీ నువ్వు బతికి వున్నావు. నా పరాక్రమం వల్ల మనకు విజయం కలిగింది. సతీధర్మం తెలిసినదానా! నువ్వు దుఃఖం వదులు. మనసులో కలత లేకుండా కుదుటపడు. రావణాసురుడు చచ్చాడు. లంక మన వశంలో వుంది. నిన్ను చెరనుండి విడిపిస్తానని ప్రతిజ్ఞ చేసి, అది నెరవేరేదాకా నిద్రపోకుండా సముద్రం మీద సేతువు నిర్మించి చేసిన ప్రతిజ్ఞను నేరవేర్చుకున్నాను. నువ్వు రావణుడి

ఇంట్లో వున్నానని భయపడవద్దు. లంకా నగరం, సర్వైశ్వర్యం విభీషణుడి స్వాధీనంలో వుంది. కాబట్టి నీ సొంత ఇంట్లో వున్నట్లే భావించు. నిశ్చింతగా వుండు. క్షణకాలంలో నిన్ను చూడడానికి విభీషణుడు వస్తాడు".

ఆ ఆమాటలు విన్న సీతాదేవి తటాలున లేచి నిలబడింది. కాని ఏమీ చేయలేదు. ఏమీ మాట్లాడలేదు. బొమ్మలాగా నిలిచిన ఆమెను చూసి హనుమంతుడు "ఏమమ్మా! ఎందుకు నాతో మాట్లాడవు? ఏమని ఆలోచన చేస్తున్నావు?" అని అడిగాడు.

హనుమంతుడిని ప్రశంసించిన సీతాదేవి

హనుమంతుడు ఇలా అడగగానే సీతాదేవి తాను పలకపోవడానికి కారణం ఇలా చెప్పింది. "ఆంజనేయా! నా ప్రాణేశ్వరుడి గెలుపు వార్త చెప్తున్న నీ మాటలు విని సంతోషంతో నిమిష కాలం మాట్లాడలేక పోయాను. ఇదొక కారణం. స్మృతి వచ్చిన తరువాత నాకు ప్రియమైన మాటలు చెప్పిన పూజ్యుడికి ఏమని బదులు చెప్పాల్నా అని ఆలోచించాను. కాని, నాకు సంతోషం కలిగించిన వార్త చెప్పిన నీకు అంతే సంతోషం కలిగించే మాట ఏదైనా చెప్పాలని ఎంతో ఆలోచన చేశాను. కాని నాకు ఏమీ తోచలేదు. అది నా అజ్ఞానం వల్ల కాదు. అలాంటి మాట ఏదీ లేదు. మాట చెప్పక పోయినా ఏదైనా బహుమానం ఇద్దామని అనుకుని ఈ లోకంలో అలాంటిది ఏదైనా వుందా అని ఆలోచించాను. ఒక్కటి కూడా సమానమైనది కనబడలేదు. లోకంలో వున్న వెండికొండ, బంగారుకొండ, రత్నాలు, వేరువేరుగా కాని, కలిపినా కాని సరిపోవని అనిపించింది. ఇతర లోకాలలో ఏదైనా వున్నదా అని ఆలోచన చేశాను. అక్కడా కనబడ లేదు. ఇన్ని లోకాల ఆధిపత్యమే అంటే బ్రహ్మత్వమే నీకిచ్చిన చాలునేమో అని ఆలోచించాను. అది కూడా చాలదని అనిపించింది. నేను వూపిరితో వున్నానని నా భర్తకు నువ్వు చెప్పగానే అతడు సంతోషించి నీకివ్వాల్సింది ఏదీ లేనందున తననే నీకు సమర్పించుకుంటున్నానని అన్నాడని విన్నాను. ఇలా ఆలోచించడం వల్ల నీతో మాట్లాడ లేకపోయాను".

జవాబుగా హనుమంతుడు "భర్త గెలుపు చెప్పిన వాడికి ఇవ్వదగ్గ పదార్థం లేదని ప్రేమతో చెప్పావు. స్నేహపూర్వకమైన ఆ మాటే అసమాన సారవంతమై ఎన్ని విధాల చూసినా దేవతారత్న సమూహాల కంటే, స్వర్గలోక ప్రభుత్వం కంటే శ్రేష్టమైనది. ఎందుకంటే ఇవన్నీ అశ్వరాలు. కొంతకాలం వుండి నశిస్తాయి. మీ ప్రేమ అలాంటిది కాదు. దానిలోని సారం వీట్లో లేదు. మీ అనుగ్రహం నామీద

వుంది. నాకదే చాలు. ఈ తుచ్ఛమైన ఐహికాలు నాకెందుకు? అమ్మా! ఈ పద్నాలుగు లోకాల ప్రభుత్వాన్ని నువ్వు నాకివ్వలనుకోవడం నన్ను సంతోషపెట్టడానికే కదా? అంతకు మించిన ఆనందం రావణుడిని చంపిన రామచంద్రమూర్తిని చూడడంలో వుంది” అన్నాడు.

ఆ మాటలకు సంతోషించిన సీతాదేవి, “వాయుపుత్రుడా! మహాత్మా! వాక్యలక్షణ సంపత్తి కలిగి మాధుర్య గుణాలతో అలంకరించబడి అష్టాంగ యుక్తమైన బుద్ధితో మాట్లాడడానికి నువ్వే సమర్థుడివి. మహాత్మా! నువ్వు వాయుదేవుడికి కుమారుడివి. మిక్కిలి ధర్మ గుణాలు కలవాడివి. గొప్ప బలం, శౌర్యం, సత్త్వం, జ్ఞానం, కాంతి, పరాక్రమం, ధైర్యం, ఓర్పు, వినయం, ధారణ లాంటి గుణాలతో ప్రసిద్ధుడివి. ఈ గుణాలన్నీ నిన్ను ఆశ్రయించి ప్రకాసిస్తున్నాయి కాని వాటివల్ల నీకు వచ్చిన ఘనత లేదు” అంటుంది.

రాక్షస స్త్రీలను చంపడానికి అనుమతి కోరిన హనుమంతుడు నిరాకరించిన సీతాదేవి

సీతాదేవి మాటలు విన్న హనుమంతుడు ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూనే రాక్షస స్త్రీలను చంపడానికి తనకు అనుమతి ఇవ్వమని ఆమెను అడిగాడు. పతే దైవమని ఆమె భావించి దుఃఖంలో మునిగి వుండగా, ఏ మాత్రం కరుణ చూపించకుండా, క్రూరంగా ఆమెను రాక్షస స్త్రీలు హింసించారని, వారందరినీ తన ముష్టి ఘాతంతో చంపుతానని అంటాడు హనుమంతుడు సీతాదేవితో. సీతాదేవికి అపకారం చేసిన పాపాత్ములైన ఆ స్త్రీలను చంపుతానని చెప్పగా ధర్మమార్గంలో సంచరించే సీతాదేవి ఇలా అన్నది.

“రాజాజ్ఞానుసారం ఆయన్నే ఆశ్రయించి వున్న ఆయన కార్యాన్ని నెరవేర్చాల్సిన ఈ దాసీజనం మీద నువ్వు కోప్పడవచ్చా? నా దురదృష్టం వల్ల, పూర్వం నేను చేసిన ఘోరపాపం వల్ల నేనలా అనుభవించాల్సి వచ్చింది. కలకాలం సుఖ దుఃఖాలు ఒక్కరీతిలోనే వుండవనే నీతివాక్యాన్ని అనుసరించి కొన్నాళ్లు సుఖం అనుభవించాను. ఇప్పుడు దుఃఖకాలం ప్రాప్తించింది. సుఖం అనుభవించినట్లే దుఃఖం అనుభవించాల్సి వచ్చింది ఆంజనేయా! మనస్సున నిశ్చయించుకుని, వేరే మార్గం లేనందున, వీరి బెదిరింపులు సహించాను. ప్రతీకార సామర్థ్యం లేనప్పుడు సహనమే సముచితం. రావణుడి కొలువులో పనిచేస్తున్నందున, ఆయన దాసులు కాబట్టి, వాడి ఆజ్ఞానుసారం వినకపోతే

వాడు చంపుతాడేమోనని, భయపడి నన్ను బెదిరించారు వీరంతా. ఇప్పుడు వాడు చచ్చాడు. ఇప్పుడు వీరు వాడి దాసులు కానందున ఇక వీరు నన్ను బెదిరిస్తారా? నామీద వీరికి స్వయంగా ద్వేషభావం లేదు. వీరు పాపాత్ములు అన్నావు. వాడి కొలువులో వున్న దోషం తప్ప వీరిలో ఇంకే దోషం లేదు. వీరితో ఈ పని చేయించిన రావణుడిది దోషం కాని వీరిది కాదు. వాడికి భయపడే కదా వీరీ పని చేశారు? కాబట్టి వీరిలో పాపం లేదని నా అభిప్రాయం".

"ఒకడు తనకు అపకారం చేసినప్పటికీ తాను సజ్జనుడైతే వాడికి బదులుగా అపకారం చేయకూడదు. ఈ నియతిని రక్షించాలి. ఎందుకంటే, సజ్జనులకు శీలమే భూషణం. (వాస్తవానికి రాక్షస స్త్రీలు సీతాదేవికి శరణాగతులు. వారిని రక్షిస్తానని ఆమె వారికి మాట ఇచ్చింది. కాబట్టి వారిని రక్షించాల్సిన భారం ఆమె మీద వుంది). వానరేంద్రా! పుణ్యాత్ములు కాని, పాపాత్ములు కాని వధకు అర్హులైతే అలాంటివారి మీద సుజనుడు కృప చూపాలికాని చంపకూడదు. ఎందుకంటే, లోకంలో అపరాధం చేయనివాడు లేడు. హనుమంతా! నేను వీరికి ఎలాంటి అపకారం చేయకపోయినా వీరు నన్ను నిష్కారణంగా బాధించారు కాబట్టి వీరు పాపాత్ములని నీ అభిప్రాయం. వీరు పరాధీనపు బతుకు బతుక్కుంటూ, స్వాతంత్ర్యం అనేది లేకుండా, రాజాజ్ఞానుసారం వాడు చంపుతాడేమోనని భయపడి నన్ను బాధించారు కాని నామీద ద్వేష భావంతో కానేకాదు. కాబట్టి వీరు పాపాత్ములు కారని నా అభిప్రాయం. ప్రాణాలు తీసేవారు కాబట్టి వీరిని అసురులు అన్నారు. వీరి స్వభావం పాపం చేయడమే. ఆ పాపాలు చేయడానికి వారు ఎలాంటి రూపాలు ధరించాలో అలాంటి రూపాలే ధరిస్తారు".

శ్రీరాముడిని చూడగోరిన సీతాదేవి

ఇలా సీతాదేవి చెప్పగా హనుమంతుడు ఆమెతో ఇలా అన్నాడు.

"అమ్మా! నువ్వు శ్రీరాముడికి తగిన పత్నివి. ఇక నేను రాముడి దగ్గరికి పోతాను. ఆయనకు నువ్వేమని బదులు చెప్తావు?". జవాబుగా సీతాదేవి, "ఆంజనేయా! నేను నా భర్తను చూడాలనుకుంటున్నాను" అన్నది. ఆమె అలాగే తన భర్తను చూస్తుందని చెప్పి, ఆమెకు ప్రదక్షిణ నమస్కారం చేసి రామచంద్రమూర్తిని చూడడానికి ఆయన సన్నిధికి వేగంగా పోయాడు హనుమంతుడు.

సర్గ–117
సీతాదేవి సందేశాన్ని శ్రీరాముడికి చెప్పిన హనుమ

రామచంద్రమూర్తి దగ్గరికి పోయి ఆంజనేయుడు ఇలా అన్నాడు. "ఎవరికోసమై రావణుడిని చంపావో ఆ సీతాదేవిని చూశాను. నువ్వు కూడా చూడాలి. శోకంతో కళ్ళనీళ్ళ పర్యంతమై దుఃఖిస్తున్న సీతాదేవి నీ గెలుపు వార్త వినగానే, ఆ నిమిషంలోనే చాలా సంతోషించింది. పూర్వం నన్ను నీ దూతగా నమ్మింది కాబట్టి నన్ను చూడగానే సీతాదేవి తన కార్యం నెరవేర్చిన నిన్ను తక్షణమే చూడాలని కోరికగా వుందని చెప్పింది".

సీతాదేవిని తోడ్కొని రావడానికి విభీషణుడిని నియమించిన శ్రీరాముడు

ఇలా హనుమంతుడు చెప్పగానే రామచంద్రుడు పది నెలలుగా నానా భాధలు పడుతున్న సీతాదేవిని ఇంకా తాను కష్టపెట్టాల్సి వచ్చింది కదా అని కళ్లల్లో నీరు కార్చాడు. చింతతో పరవశుడై ఏమీ తోచక, నేలచూపులు చూస్తూ, ఇలా అనుకున్నాడు. దీర్ఘకాలం, పగవాడి ఇంట్లో వున్నదాన్ని కాముకుడై రాముడు మరల పరిగ్రహించాడని లోకులు అంటారేమో అని బాధపడ్డాడు. అలాంటప్పుడు, నిర్దోషురాలిని, కఠిన వ్రతాలు చేసేదానిని విడిచి, మహాదోషం ఎలా మెడకు చుట్టుకోవాలని చింతించాడు.

అలా ఆలోచిస్తూనే, సమీపంలో వున్న విభీషణుడిని చూసి, "రాక్షస రాజా! భూకన్య అయిన సీతాదేవిని వేగంగా శిరస్నానం చేయించి, గంధాదులు పూసుకొనచేసి, ఆభరణాలు ధరింపచేసి తీసుకుని రా".

రామచంద్రమూర్తి ఇలా చెప్పగానే ఆయన అన్న మాటలు సీతాదేవికి చెప్పడానికి అంతఃపుర స్త్రీలను పంపి ఆయనా వెంట పోయాడు. పోయి,

"అమ్మా! నువ్వు దివ్య చందనాదులు పూసుకుని, దివ్యాభారణాలు ధరించుకుని, పల్లకి ఎక్కు. నిన్ను నీ భర్త చూడాలనుకుంటున్నాడు. పతివ్రతా! నీకు మేలు కలుగుతుంది" అని అన్నాడు సీతాదేవితో. జవాబుగా జానకి, తాను స్నానం చేయకుండానే భర్తను చూడాలనివుంది అంటుంది. ఆ మాటకు విభీషణుడు, తాను చెప్పింది భర్త ఆజ్ఞ కాని తన కోరిక కాదంటాడు. సీత అలాగే చేస్తానని చెప్పి సిద్ధమైంది. ఆమెకు అంతఃపుర స్త్రీలతో స్నానం చేయించి, ఆభరణాలతో అలంకరించి, మంచి వస్త్రాలను ఇచ్చి, పల్లకి ఎక్కించి, విభీషణుడు రామచంద్రమూర్తి దగ్గరికి తెచ్చాడు.

సీతాదేవి రాక శ్రీరాముడికి చెప్పిన విభీషణుడు

జానకి రావడం తెలిసి కూడా ఏదో ఆలోచిస్తున్న రామచంద్రమూర్తితో విభీషణుడు "రాజేంద్రా! సీతాదేవి వచ్చింది" అని చెప్పాడు. దీర్ఘకాలం రావణుడి ఇంట్లో వున్న సీతాదేవి వచ్చిందని వినగానే రామచంద్రమూర్తి మనస్సులో సంతోషం, దీనత్వం, కోపం ఆవేశించాయి. సీతను వెంటనే దగ్గరికి తీసుకు రమ్మన్నాడు రాముడు. ఆయన మాటలు విన్న విభీషణుడు సమీపంలో వున్న వానరులందరినీ దూరంగా పంపేందుకు ప్రయత్నం చేశాడు. దానికి రాక్షసులను వినియోగించాడు. అలా చేయగానే రాముడికి కోపం వచ్చింది విభీషణుడి మీద.

విభీషణుడిని కోప్పడ్డ శ్రీరాముడు

విభీషణుడి మీద కోప్పడుతూ శ్రీరాముడు ఇలా అన్నాడు. "విభీషణా! ఎందుకు నన్నింత అలక్ష్యం చేసి నా ఎదుటనే నా ఆప్తులైన వానరులను బాదిస్తున్నావు? ఇప్పుడు వారిని పరిభవించినవాడివి రేపు నన్ను కూడా పరిభవిస్తావు కదా? రాజ స్త్రీ ఈ గుంపు అంతా చూస్తుండగా ఎలా ఇక్కడికి రాగలదని అంటావా? ఆ మాత్రానికే, నలుగురు ఆమె ముఖం చూడగానే, ఆమె చెడిపోతుందా? ఆ కారణం చేతనా రాజస్త్రీలను ఎవరూ చూడకూడదు అని అంటారు? అది సరైంది కాదు. స్త్రీలను రక్షించేది వారి ముసుగులు కావు. కోటగోడలు కావు. అంతఃపురాలు కాదు. తెరలు కాదు. ఇలాంటి రాజగౌరవాలు కానేకాదు. ఇవేవీ స్త్రీలను కాపాడలేవు. వారి మనసు దుర్వృత్తిమీద పోతే అవేవీ అడ్డం రావు. మనస్సు చెడితే అవన్నీ చెడినట్లే. కాబట్టి స్త్రీలను కాపాడేది పాతివ్రత్యమే! వారి సదాచార సంపత్తే! ఈ సీత యుద్ధభూమిలో వుంది. చిరకాలంగా దుఃఖం అనుభవిస్తున్నది. అదీ కాకుండా నేను సమీపంలోనే

వున్నాను. కాబట్టి నా భార్య నా ఎదుట వెలుపల వస్తే తప్పేమీ లేదు. ఈ కారణాన స్నేహితులతో కూడి వున్న నన్ను సీత చూడవచ్చు. తీసుకుని రా ఆమెను".

శ్రీరాముడి సమీపానికి వచ్చిన సీతాదేవి

శ్రీరాముడు ఇలా అనగానే విభీషణుడు సందేహిస్తూనే సీతాదేవిని శ్రీరాముడి సమీపానికి తెచ్చాడు. శ్రీరాముడి మాటలకు లక్ష్మణుడు, హనుమంతుడు ఇతరులు ఏదో అనర్థం జరగబోతున్నదని సందేహించారు. సీతాదేవి సిగ్గుతో తన అవయవాలను ముడుచుకుని విభీషణుడి వెంట వచ్చి, రామచంద్రమూర్తి సౌమ్యమైన ముఖాన్ని సభలో చూసి, తన ఉత్తరీయాన్ని ముఖానికి అడ్డంగా వేసుకుని, "ప్రాణేశ్వరా!" అని గట్టిగా ఏడ్చింది.

సర్గ–118
సీతాదేవికి తన విజయం గురించి చెప్పిన శ్రీరాముడు

తన పార్శ్వంలో శరీరాన్ని వంచి నిలబడ్డ సీతాదేవిని చూసి రామచంద్రమూర్తి తన హృదయంలో బాధను దాచుకుంటూ ఇలా అన్నాడు.

"బాధ కలిగించిన విరోధిని యుద్ధంలో చంపాను. నిన్ను గ్రహించాను. పూర్ణ సామర్థ్యంతో ఏది చేయగలనో అదంతా చేశాను. నా కోపం సఫలమైంది. పగవాడు చేసిన అవమానాన్ని పారదోలాను. భూమ్మీద కీర్తి పొందాను. నా శౌర్యం లోకానికి తెల్సింది. నేను పడ్డ శ్రమంతా సఫలమైంది. నేను రావణాసురుడిని చంపుతానని చేసిన ప్రతిజ్ఞ వ్యర్థమైపోకుండా చేసి నేను స్వతంత్రుడను అయ్యాను. నా సరిరాజులు ఆశ్చర్యం పొందే విధంగా వారందరిలో తలెత్తి సగౌరవంగా తిరుగుతాను. నేను నీదగ్గర లేని సమయంలో ఆ చపలచిత్తుడు నిన్ను అపహరించాడు కదా! ఈ దోషం దైవానిదే. నీదికాదు, నాదీ కాదు. అలాంటి దైవ దోషాన్ని పౌరుషంతో ఎదుర్కున్నాను. గెలిచాను. అవమానం కలిగినప్పుడు దానిని పురుష శక్తితో చక్కచేయడానికి ప్రయత్నం చేయకపోతే తప్పు. అలా చేయనివాడు నీచ పురుషుడు. సముద్రాన్ని దాటడం, బలవంతుడైన శత్రుపురాన్ని కాల్చడం లాంటివి చేసిన హనుమంతుడి శ్లాఘుకార్యాలు నేడు ఫలవంతంయ్యాయి. సుగ్రీవుడి కష్టం నేడు ఫలించింది. విభీషణుడి శ్రమ ఫలించింది. నిన్ను శత్రు బాధ నుండి తప్పించాను".

ఇలా తన భర్త ఎవరో పరులతో మాట్లాడుతున్నట్లు ఏవేవో విషయాలు తనకు చెప్పడం, తన విషయంలో అంగీకార సూచకమైన మాట ఏదీ మాట్లాడక పోవడం గమనించిన సీత కళ్ళల్లో నీరు నిండింది. ఆ సమయంలో ఆమెను

చూస్తే తన మనస్సు మోహంలో పడుతుందేమోనని భావించిన రాముడు ఆమె ముఖం వైపు సరిగ్గా చూడలేదు.

సీతాదేని తాను గ్రహించనని చెప్పిన శ్రీరాముడు

సీతాదేవితో సంభాషణను కొనసాగిస్తూ శ్రీరాముడు ఇంకా ఇలా అంటాడు. "స్నేహితుల సహాయంతో యుద్ధంలో శత్రువులను ఓడించి, చంపి, శ్రమపడి ఇలా నిన్ను కలవడం నిన్ను గ్రహించడానికి కాదని తెలుసుకో. కులగౌరవం కాపాడడానికి, అపవాదం తొలగడానికి, కీర్తి నిలపడానికి చేయాల్సినదంతా చేశాను. ఇక నీ విషయానికొస్తే నువ్వు లోకులు సందేహించడానికి అవకాశం ఇచ్చే చరిత్ర కలదానివయ్యావు. ఎందుకంటే, నువ్వు వనజాక్షివి, తామర కళ్ళ లాంటి అందగత్తెవు. కాబట్టి ఇన్నాళ్లు చెడిపోకుండా వున్నావని లోకమెలా విశ్వసిస్తుంది? ఇలాంటి నువ్వు నా పక్కన నిలబడి నన్ను బాధిస్తున్నావు. అందుకే నీకు అనుమతి ఇస్తున్నాను. నీ ఇష్టం వచ్చిన చోటుకు పోవచ్చు. నీతో నాకింక ఏపనీ లేదు".

"ఉత్తమ వంశంలో, ఉత్తమ జాతిలో పుట్టినవాడు, కీర్తి ప్రతాపాలు కలవాడు, ఎవరైనా పరుడి ఇంట్లో దీర్ఘకాలం వున్న వయసొచ్చిన ఆడదాన్ని స్నేహభావంతో మళ్లీ భార్యగా స్వీకరిస్తాడా? నువ్వే చెప్పు. దుష్కామ దోషంకల చూపులతో దుష్టుడు నిన్ను చూశాడు. వాడి కళ్ళతో వాడు చూస్తే నేనేమి చేయాలి? నాదెలా బాధ్యత? వాడి కళ్ళు మూయాల్నా? అంటావేమో? వాడి ఒడిలో నిన్ను వుంచుకోవడం వల్ల నువ్వు భ్రష్టవయ్యావు. ఇలాంటి నిన్ను సద్వంశంలో పుట్టి, సదాచార సంపత్తికలిగి, సదాచార సంపన్నుడనని చెప్పుకునే నేను మళ్లీ ఎలా గ్రహిస్తాను? అలాంటి నీచం, గౌరవహానికరమైన కార్యం రాముడు చేయడు సుమా! రాముడు కామదాసుడు కాదు. రాక్షసుడు ఎత్తుకుని పోయిన తన భార్యను విడిపించుకోలేక పోయాడు రాముడనే అపకీర్తి రాకుండా వుండడానికి శత్రువులను వధించి మళ్లీ భార్యను గ్రహించాడన్న కీర్తి దక్కించుకోవడానికి నేను రావణుడిని చంపి నిన్ను వాడి చెరనుండి విడిపించాను కాని, నీమీద కామమోహంతో కాదు. అవి నామనస్సులో లేవు. అందుకే నువ్విక్కడ నుండి నీ ఇష్టం వచ్చిన చోటుకు పోవచ్చు. నీకు అనుమతి ఇస్తున్నాను".

"సీతా! నేను చెప్తున్న మాటలు ఆలోచన లేక చెప్పడం లేదు. ఎన్నో సార్లు చక్కగా ఆలోచించి స్పష్టంగా చెప్తున్నాను. సందేహించవద్దు. నువ్వు స్త్రీవి కాబట్టి

స్వతంత్రంగా వుండకూడదు. భర్త విడిచిన స్త్రీ బంధువుల ఇంట్లో వుండవచ్చు. కాబట్టి నువ్వు లక్ష్మణుడి ఇంట్లోనో, భరతుడి ఇంట్లోనో, సుగ్రీవుడి ఇంట్లోనో, విభీషణుడి ఇంట్లోనో కాలం గడుపు. వీటిలో నీకెక్కడ సుఖమో అక్కడే వుండు. నేను నిన్ను వదలాల్సిన కారణం ఏంటి? నా ఇంట్లోనే వుండవచ్చు కదా అంటావేమో? నువ్వు దేవతా స్త్రీలాంటి అందగత్తెవు. ఎలాంటి వారి చూపులనైనా, మనస్సునైనా ఆనందింప చేయగలవు. ఇలాంటి నిన్ను రావణుడు చెరచకుండా వూరుకుంటాడా? కాబట్టి నిన్ను గ్రహించను. నీమీద నాకు కామం లేదు. నీ ఇష్టం వచ్చినట్లు పోవచ్చు. నా ఇంట్లో వుంటే నేను నిన్ను భార్యగా అంగీకరించానని లోకం సందేహిస్తుంది. కాబట్టి నా ఇంట్లో తప్ప ఎక్కడైనా వుండు. ఇది నిశ్చయం''.

భర్త నుండి ప్రీతికరమైన మాటలు విందామని, విని సంతోషిద్దామని ఎదురు చూసిన సీతాదేవి అప్రియమైన మాటలు విని దుఃఖంతో కన్నీళ్లు కార్చింది.

సర్గ–119

శ్రీరాముడి మాటలకు దుఃఖిస్తూ ప్రత్యుత్తరం ఇచ్చిన సీత

భర్త మాటలకు జవాబుగా గద్గద స్వరంతో సీతాదేవి ఇలా అన్నది. "భద్రచరిత్రా! శిష్టుడవని చెప్పుకునేవాడా! కులాన, శీలాన నీచుడైనవాడు, కులశీలాల నీచురాలైన దాన్ని అన్నట్లు చెవులు చీల్చే కఠినవాక్యాలు ఎలా అన్నావు? అందునా నన్ను ఉద్దేశించి ఎలా అనగలిగావు? నువ్వు శిష్టుడివైతే నీ నోట ఇలాంటి మాటలు రావు. శిష్టులు నీచులనైనా ఇలాంటి మాటలు అనలేరు. నువ్వు క్షుద్రుడవైతే, ఎంత క్షుద్రుడైనా కులశీలాల శిష్టఅయిన దానిని ఇలా మాట్లాడడు. నువ్వెలాంటి వాడివైనా నీ మాటలు నాకు అన్వయించవు. నువ్వు వాస్తవానికి గొప్పవాడివి. గొప్పవాడిలాగా మాట్లాడకుండా ఇలా మాట్లాడడం నీకు తగదు. నా శీలంలో ఏ దోషం వుందని నువ్వు సందేహించావో అలాంటి దోషం నాలో లేదని నా పాతివ్రత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నాను".

"నువ్వు సందేహించిన దోషం స్త్రీలలో లేదా అని అంటావేమో? ఏ స్త్రీలలో వుంది? పతివ్రతలలోనా? నీతిమాలిన చెడ్డ రంకుటాల్లలోనా? ఎవరో దుష్ట స్త్రీలు ఏదో చేశారని స్త్రీలందరూ అలాంటి వారే అని నువ్వు భావించవచ్చా? అలా అయితే మగవారిలో మంచివారు, చెడ్డవారు లేరా? పురుషుడైన రావణుడు దుష్టుడు కాబట్టి నువ్వూ అలాంటివాడివే అని నేననవచ్చా? ఇన్నాళ్లు నేను నీదగ్గర లేనందున నువ్వెవరితో ఏం మాట్లాడావో అని నేను సందేహించవచ్చా? కూడదు. ఎందుకంటే నీ నడవడి నేను పరీక్షించాను కాబట్టి. అలాంటి గుణం నీలో లేదు. అలాగే నువ్వు నా గుణాన్ని పరీక్షించి వున్నట్లయితే ఇలాంటి కుశంకలకు అవకాశం కలగదు. కాబట్టి ఈ శంకలు వదులు. ఈ శంకలకు కారణం లేదు. నాలో దోషం నిర్ధారించకుండా కుశంకలతో నన్ను దండిస్తావా? ఇలా చేయాలని

ఏ ధర్మశాస్త్రం చెప్తున్నది?".

"నన్ను రావణుడు అంటుకున్నాడా? లేదా?అది దోషం కాదా? అని అడుగుతావేమో? వాడు నన్ను తాకింది నిజమే. కాదనను. వాడై వాడే నన్ను తాకాడు కాని నేను వాడిని తాకలేదు కదా? వాడెప్పుడు నన్ను తాకాడు? నేను పరవశనై మూర్ఛపోయిన సమయంలో తాకాడు. నేను దానికి సమ్మతించానా? లేదే! నా అనుమతిమీద వాడు నన్ను తాకలేదు. ఎలా స్పృశించినా దోషమేనా? దుష్ట భావాన స్పృశిస్తే దోషమంటావా? వాడి దుష్టభావానికి నేనెలా బాధ్యురాలిని?నా భావన దుష్టమైతే నన్ను దండించాలి కాని ఇతరుల భావన దుష్టమైతే నన్ను దండించవచ్చా? నన్ను రక్షించాల్సిన భారం నీమీద వుంది. నువ్వు రక్షించలేకపోయావు. నీ కర్తవ్య లోపంవల్ల నాకీ బాధ కలిగింది. కాబట్టి దోషం నీది కాని నాదికాదు. స్త్రీలు ఏవిషయంలోనూ స్వతంత్రులు కారుకదా?".

"నాథా! త్రికరణాలలో కార్యాలు చేసేవి మనస్సు, దేహం. మనస్సు తన సమ్మతి లేకుండా పరాధీనం కాలేదు. బలవంతంగా ఎవరూ దాన్ని లాక్కొని పోలేరు. అలాంటి నా మనస్సు నీమీదే నిలిచి వుంది. వుండేది. వుంటుంది. అది నిన్ను విడిచి పోలేదు. ఇక దేహమా? పరాధీనం అయింది. ఎవరు ఎటు ఈడిస్తే అటే పోతుంది. నా సమ్మతి లేకున్నా, నా ఇష్టానికి విరుద్ధంగా ఇతరులు దాన్ని లాక్కుని పోవచ్చు. అలాంటి దేహం విషయంలో రక్షకులు లేని నేనేమి చేయగలను? అందునా పరవశనై పట్టుబడ్డప్పుడు ఏమి చేయగలను? బలవంతుడైన వాడి పట్టు నేను విడిపించుకోగలనా? అప్పటికీ నేలమీద దూకడానికి ప్రయత్నించాను. నాకు సాధ్యపడలేదు. అరిచాను. ఏడ్చాను. మీరు రాలేదు. దీంట్లో నా దోషం ఏముంది?".

"ఆ సమయంలో నా మనసు ఎలా వుందో నీకెట్లా తెలుస్తుంది అంటావా? ఎలాంటి స్త్రీ అయినా తటాలున వున్నట్లుండి చెడిపోదు. కొంత పూర్వ ప్రయత్నం కావాలి. మొదలు మనస్సు మారాలి. దాన్ని అనుసరించి చేష్టలు, మాటలు మారుతాయి. ఎప్పుడో ఒకప్పుడు మనస్సు బయటపడక తప్పదు. కాబట్టి ఎలాంటి దుష్ట స్త్రీకైనా పూర్వరంగం కొంత వుంటుంది. నేను పుష్పవతిని కాకముందే మీ ఇంటికి వచ్చాను. అది మొదలు చిరకాలంగా మనం ఇరువురం ఒక మనస్సుతో ప్రవర్తించాం. ఎక్కడ తిరిగినా ఒకరిని విడిచి మరొకరం వుండలేదు. నీతోనే నేను పెరిగాను. పెద్దదాన్నైనాను. నీ రహస్యం నాకు, నా రహస్యం నీకు తెలియంది కాదు. ఒకరి సమ్మతి లేకుండా మరొకరం ఏపనీ

చేయలేదు. ఈ విధంగా వున్నప్పటికీ నా శీలం నువ్వు తెలుసుకోలేకపోతే నువ్వు తెలివితక్కువ వాడివని నేనన‌ను కాని, నీ లోపం వల్ల నేను శాశ్వతంగా చచ్చినదాన్నైపోయాను".

"ప్రాణేశ్వరా! నామీద నీకిలాంటి దురభిప్రాయం వుంటే ఎందుకిన్ని రోజులు దాచిపెట్టావు? ఆనాడు నాకొరకై నువ్వు లంకకు హనుమంతుడిని పంపించినప్పుడే నీ నడవడిమీద నాకు సందేహం కలిగింది. అప్పుడే నన్ను విడిచి పెట్టుతున్నానని చెప్పి పంపినట్లయితే నా ప్రాణాలు ఆనాడే పోయేవి. ఆ విషయంలో నా ప్రయత్నం అవసరం వుండేది కాదు. నేనే ప్రాణాలు వదిలినట్లయితే నీకిలాంటి ప్రాణాపాయకరమైన శ్రమ కూడా కలగకపోయేది. ఇక రావణుడిని చంపడం ఎవరికొరకు? నన్ను గ్రహించడానికి కదా? నన్ను గ్రహించానన్నావే? ఏవిధంగా గ్రహించావు? అశోకవనంలో వున్నదాన్ని సముద్రతీరంలో పడేసావు. ఇదేనా నువ్వు నన్ను గ్రహించడం అంటే? ఎప్పుడు నీకు నామీద సందేహం కలిగిందో అప్పుడే సీత చెడింది. రావణుడిని చంపి నువ్వు సాధించింది ఏంటి? అప్పుడే వూరక వున్నట్లయితే నీ స్నేహితులకు, నీకు శ్రమ తప్పేది కదా? నీ మనసు బయట పెట్టడం ఆలశ్యంచేసి నాకు, నీకు, నీ స్నేహితులకు ఎంత కష్టం కలిగించావో తెలుసుకోలేక పోయావుకదా?".

"ప్రాణేశ్వరా! 'నీ విషయంలో నా శంక నిష్కారణం కాదు. అశాస్త్రీయం కూడా కాదు. లోకంలో ఎవతో జారిణి అని చెప్పి స్త్రీలంతా జారిణులే అని నేను చెప్పలేదు. భర్త దగ్గర కాకుండా పరుల ఇంట్లో వయసు వచ్చిన స్త్రీ ఎక్కువకాలం వుంటే దాని శీలం సందేహించాలని శాస్త్రం చెప్తున్నది. నువ్వేమో పరుడే కాకుండా నాకు శత్రువు, స్త్రీల విషయంలో దుష్టుడని పేరున్నవాడి దగ్గర పదినెలలు నువ్వున్నప్పుడు శాస్త్రప్రకారం నేను సందేహించాల్నా? వద్దా? కాబట్టి నా సందేహానికి శాస్త్రమే ప్రమాణం' అని అంటావేమో. అట్లయితే నేను చెప్పాల్సింది ఇక ఏమీ లేదు". అని ముగుస్తుంది సీత.

అగ్నిప్రవేశం చేసిన సీతాదేవి

ఇలా గద్గత స్వరంతో చెప్పి సీతాదేవి ముఖమంతా చిన్నబుచ్చుకుని, మరది లక్ష్మణుడిని చూసి ఇలా అన్నది. "లక్ష్మణా! ఈ పెనుశోకం అనే వ్యాధికి ఔషధం అగ్నిప్రవేశం తప్ప మరొకటి లేదు. భర్త ఆజ్ఞలేకుండా నేనలా చేయవచ్చునా అని అంటావేమో? నేనిప్పుడు స్వతంత్రురాలిని. భర్తృపరతంత్రురాలిని కాదు. నాకు

అనుమతి ఇచ్చానని, నా ఇష్టం వచ్చినట్లు పొమ్మని పారతంత్ర్యంనుండి నన్ను నా భర్త విముక్తిరాలిని చేశాడు. ఇక నేను చేసే పనికి అడ్డం వచ్చే అధికారం ఆయనకు లేదు. ఆయన ఆజ్ఞకాని, ఆయన అనుమతి కాని ఇక నాకు అనవసరం. కాబట్టి నీకైనా నామీద పూర్వ భక్తి వుంటే చితి పేర్చు. ఇలాంటి అపనింద వచ్చిన తరువాత జీవచ్ఛవమై ఎందుకు బతకాలి? లక్ష్మణా! పతివ్రతకు ఏగతి యోగ్యమో నేను అగ్నిప్రవేశం చేసి ఆ గతికి పోతాను".

సీతాదేవి ఇలా చెప్పడంతో శోకాక్రాంతుడైన లక్ష్మణుడు రామచంద్రమూర్తి ముఖం వైపు చూసి, ఆయన సంజ్ఞల మేరకు ఆయన అభిప్రాయం గ్రహించినవాడై, ఆయన సమ్మతిమీద పెద్ద చితిని పేర్చాడు. సీతాదేవిని, నిర్దోషురాలిని నిష్కారణంగా ఎంత శ్రమ పెట్టున్నానే అని లోలోన విచారపడుతూ తలవంచుకున్న రామచంద్రమూర్తికి సీతాదేవి ప్రదక్షిణ చేసింది. ఆ తరువాత ఆమె అగ్నిహోత్రుడిని సమీపించి, చేతులు మోడ్చి, మనస్సులో దేవ బ్రాహ్మణులకు నమస్కారం చేసి, అగ్నిని ఉద్దేశించి భక్తితో ఇలా అన్నది.

"నా హృదయం సత్యంగా, నిత్యంగా రాముడిమీదే నిలిచి, తొలగకుండ వుంటే, నమ్మకంగా నన్ను అగ్నిహోత్రుడు సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలందు రక్షించుగాక! సదాచార సంపత్తిగలనా భర్త నన్ను దుష్టురాలని భావించాడు. నేను దుష్టస్త్రీని కాదేని సర్వజనులు చేసే కర్మలకు సాక్షైన సూర్యదేవుడు, ఇతర దేవతలు నమ్మితే అగ్నిదేవుడు కీడు తొలగించి నన్ను రక్షించుగాక! సూర్యచంద్రులు, దేవతలు, వాయువు, రాత్రులు, సంధ్యలు, పగళ్లు, భూమి, తక్కిన దేవతలంతా నా శీలాన్ని తెలిసున్నవారై దాని విషయంలో సందేహం లేనివారైతే, ఈ లోకులందరికీ తెలిసేట్లు ఓ అగ్నిహోత్రుడా! నన్ను రక్షించు".

ఈ విధంగా చెప్పి దేహాభిమానం వదిలి అగ్నికి భక్తితో ప్రదక్షిణ చేసి, పెద్ద మంటలతో ధగ ధగా ఎగురుతున్న అగ్నిలో పవిత్రమైన నడవడికల సీతాదేవి ప్రవేశించింది. అది చూసి అక్కడ గుమికూడిన స్త్రీబాలవృద్ధులు భయంతో గడగడలాడారు. మహామహిమ కల సీతాదేవి అగ్నిలో దూకగానే ముల్లోకాలు కంపించి అందరూ రెప్పవాల్చకుండా అటే చూడసాగారు. సీతాదేవి అగ్నిలో ప్రవేశించగానే గుంపుకూడిన స్త్రీలంతా భయపడి దిక్కు తెలియక గట్టిగా అరవసాగారు.

సర్గ-120

సీతాదేవి నిర్దోషురాలని శ్రీరాముడికి చెప్పిన దేవతలు

తన భార్య తన కళ్లెదుటే పదిమంది చూస్తుండగా అగ్ని ప్రవేశం చేస్తుంటే అది సహించడం మహాక్రూరమైన కార్యమైనప్పటికీ, ధర్మాన్ని ఆచరించడంలో ఏమాత్రం వెనుకాడని రామచంద్రమూర్తి, ఒక నిర్దోషురాలిని, అందునా తనమీద అమితమైన ప్రేమకల దాన్ని, ఇంతగా బాధ పెట్టాల్సి వచ్చెకదా అని పరితపిస్తూ తనలో తానే కుమిలిపోయాడు. సీతాదేవి అలా అగ్ని ప్రవేశం చేసిన తరువాత కుబేరుడు, యముడు, ఇంద్రుడు, వరుణుడు, ముక్కంటి శివుడు, బ్రహ్మ, ఇతర దేవతలంతా విమానాలమీద ఆకాశం వరకు వచ్చి, వాటిని అక్కడే నిలిపి, తమ దీర్ఘమైన చేతులు జోడించి, ఎదురుగా భూమ్మీద నిలబడి వున్న రామచంద్రమూర్తిని చూసి ఇలా అన్నారు.

"మహాత్మా! సమస్త లోకాలను సృష్టించడానికి సమర్థుడివి. జ్ఞానుల సమూహాలలో శ్రేష్టుడివి. ఇలాంటి నువ్వు సీతాదేవి అగ్నిజ్వాలల్లో ప్రవేశిస్తుంటే చూసి చలించకుండా వుండతగునా? ఎందుకు నిన్ను నువ్వు తెలుసుకోలేకపోతున్నావు? రామచంద్ర ప్రభూ! నువ్వు సమస్తదేవతలకు నాథుడివి. ఋతుధాముడు అని నీకు పేరు. అన్ని లోకాలను స్వయం సృష్టించి ఆ తరువాతసద్వారకంగాసృజిస్తావు.నీకునువ్వేప్రభువివి.నిన్నునియమించేవాడు లేడు. మహాదేవుడన్న పేరుకల ఎనిమిదవ రుద్రుడివి నువ్వే. ఐదవ వసువువి నువ్వే. నీకు అశ్వినీదేవతలు కర్ణాలు. సూర్యచంద్రులు నేత్రాలు. జగాలన్నీ ప్రళయకాలంలో సమసిపోయినా నువ్వు మాత్రం మిగిలే వుంటావు. సృష్టికి పూర్వం నుండి వున్నవాడివి నువ్వే. ఇలాంటి నువ్వు సామాన్య మనుషిలాగా సీతాదేవిని వదలవచ్చా? కమలాక్షా! నువ్వామెమీద కరుణచూపు".

ఈ విధంగా దేవతలంతా, లోకపాలకులంతా వినయంతో విన్నవించుకోగా రామచంద్రమూర్తి ఆ దేవతానాయకులతో ఇలా అన్నాడు. "దేవతలారా! నన్ను నేను మనుష్యుడినని, రాముడంటే దశరథ కుమారుడనని అనుకుంటున్నాను. నేనెవ్వరిని? ఎవరివాడిని? ఎందుకు పుట్టాను? తెలపండి". జవాబుగా బ్రహ్మదేవుడు "రామా! సత్యవిక్రమా! యథార్థం చెప్తా విను" అంటాడు. అని ఈ దండకం చదువుతాడు.

శ్రీరాముడిని నుతించిన బ్రహ్మ

"శ్రీరామరామా! మహాభావ! నారాయణా! దేవ! లక్ష్మీ సనాథా! యనాథాధినాథా! విభూ! శంఖచక్రాయుధా! నీవ మున్నొంటిశృంగంబు భూదారమై భూమి కాధారమైనిల్చు పెన్నేల్వవుం, జనన రానున్న యాసూదులం గీడులంగూర్చి వేధించి సాధించి బాధించు బల్ప్రోడవున్, నీవ బ్రహ్మంబు, సత్యంబు నీ, వక్షరంబెల్ల కాద్యుండు మధ్యాంతసంస్థుండును న్నీవ, లోకాలికిన్ సిద్ధధర్మంబు కర్మంబు మర్మంబునున్ నీవ, నీవే చతుర్బాహువున్ స్వామియున్ శార్జ్గివిన్ శంఖివిన్ ఖడ్గివిం గృష్ణుడున్ విష్ణుడున్ బుద్ధియున్ సిద్ధియున్ సత్త్వముం దత్త్వమున్ శాంతియుం దాంతియుం బూరుషాఖ్యుండవు బూరుషోత్కృష్టరూపంబును న్నీవ, నీవే హృషీ కేశ విఖ్యాతమూర్తీ! యజయ్యుండవున్ సర్వసేనానివిన్ గ్రామణీరత్నమున్ స్రష్ట వుం ద్రష్టవున్ నీవ, నీ యంద డిందున్ సమస్తం బుపేంద్రా! హరీ! మధ్వరీ! యింద్రకర్మా! మహేంద్రా! నరేంద్రా! మునీంద్రాది వంద్యా! పరా! పద్మనాభా! విరోధ్యంతకారీ! శరణ్యుండవున్ నీవ, నిన్నే సుమీ సర్వరక్షైక సామర్థ్యదక్షుండవున్ లోకచక్షుండవం చెల్లా దివ్యర్షు లుత్కర్ష భావించి సేవించి స్తోత్రంబు గావింత్రు శాఖాసహ స్రాత్మకామ్నాయరూపా! మహర్షిప్రవేకా! యనేకోరుజిహ్వా! జగత్పాలికీ వాద్యుడౌ కర్తవున్ ధర్తవున్ హర్తవున్ నీవ, నీవే స్వయంభర్తవున్, సిద్ధసాధ్యాశ్రయుం డీవ, నీవే సుమీ సృష్టికిన్ముందు భాసిల్లు రూపంబు, యజ్ఞంబును న్నీవ, నీవే వషట్కార మోంకారమున్నీవ, నీవే సముత్కృష్టయోగై కగమ్యుండవున్, భక్తరమ్యుండవున్ నీవ, నీ పుట్టువుం బుట్టునున్ గిట్టునున్ వెండి నీవిట్టివాడటంచు నెవ్వాడెరుంగన్, రమాధీశ! గోజాతభూనిర్జరాక్రాంతభూతావలీ శైలదిగ్జాలకాంతారదేశంబులన్ నిండి రాణింతు వో దేవదేవేశ! నీవే కదా వేయిపాదంబులన్ వేయిశీర్షంబులన్ వేయినేత్రంబులం బూని భూతంబులన్ గోత్రసంఘాతసంస్ఫీతమౌ భూతధాత్రిన్

వహింపన్‌సహింపంగ దక్షుండ, వీక్షోణి కల్పాంతవేళన్ మహాహీంద్రతల్పుండవై దేవ! గంధర్వ దైతేయ సంఘంబులం దాల్చి ప్రత్యక్షమై యందు, వోరామ! నీ చిత్తమే నేను, నీ జిహ్వయే వాని, రోమాళి దేవాళి, యోగీశహృద్ధామ! శ్రీ ధామ కన్ రెప్పలన్ మూయగా రేయి, విప్పం బగల్, నీదు విశ్వాసముల్ వేదముల్ రామ! నీకాని దావంతయున్ లేదు, సర్వంబులోకంబు నీకున్ శరీరంబు స్థైర్యంబు భూగోళ, మగ్నుల్ ప్రకోపంబు, శ్రీవత్సచిహ్నా! ప్రసాదంబు సోముండు, నీవేకదా మున్ను వైరోచనిం జేరి దానంబునుం గోరి పాదత్రయీన్యాసరూపంబునన్ సర్వలోకంబులున్ నిండి దండించి తా దైత్యు, దైత్యారికిం బట్టముం గట్టి రక్షించితో దివ్యమూర్తీ! లసత్కీర్తి! శ్రీలక్ష్మియే సీత, విష్ణుండవే నీవు, కృష్ణుండునున్ నీవ, నీవే ప్రజానాథవాచ్యుండ వా పంక్తికంఠున్ వధింపంగ నై మానుషీదేహమున జొచ్చి రక్షోధిపుం ద్రుంచి మా కార్యముం దీర్చి లోకంబులం దేర్చి తీ వింక హృష్ణుండవై ధాత్రి బాలించి యాపై దివిం జేరుమా, యో రమానాథ! నీవీర్యసారం బమోఘంబు, నీ ఘోరశౌర్యం బమోఘంబు, నీ దర్శనంబే అమోఘంబు, నీ స్తోత్రమున్ మోఘ మే వేళ నేవారికింగాదు, నిన్ భక్తిచే గొల్చి చిత్తంబునం దాల్చు నీ భక్తులౌ వారి కె లోపముల్ లేవు, నిన్నుం బురాణునిన్ సదాపూరుషోత్తంసు నిశ్చంచలం బైన సద్భక్తి సేవించు భక్తుల్ జగద్రక్షకా! యైహికాత్యంత సౌఖ్యంబు లెల్లప్పుడుం గందు రీశా నమస్తే నమస్తే నమః''.

(ఈ దండకం ద్వారా రాముడిని సేవించే భక్తులకు ఇహపర సౌఖ్యాలు కలుగుతాయని బ్రహ్మ వాక్కుగా చెప్పడం జరిగింది. ఈ స్తోత్రాన్ని ప్రతిదినం పఠిస్తే జన్మాంతర ప్రాప్తిని కాని, కామక్రోధాల వల్ల కాని, బాహ్య శత్రువుల వల్ల కాని తిరస్కారం కలగదని చెప్పడం జరిగింది. ఇది పాపహరమ, పురాణ, ఇతిహాస వేదం సంబంధమైనది. కాబట్టి దీనిలో ఎంతో మహాత్మ్యం వుంది).

సర్గ–121
సీతాదేవిని శ్రీరాముడికి అర్పించిన అగ్నిదేవుడు

ఇలా బ్రహ్మదేవుడు రామచంద్రమూర్తిని స్తుతిస్తుంటే అగ్నిహోత్రుడు మనిషి రూపంలో బిడ్డను ఎత్తుకొస్తున్నట్లు సీతాదేవిని ఒడిలో వుంచుకుని చితిలోని కట్టెలను చిమ్ముకుంటూ వచ్చాడు. అగ్నిలో ప్రవేశించినప్పుడు ఎలా వుందో ఇప్పుడూ ఆమె అలాగే వుంది. ఆమెను రాముడికి అప్పగిస్తూ, "ఈమె నీ సీత. ఈమెలో ఏపాపం ఏమాత్రం లేదు. మనోవాక్కుల వల్ల కాని, సంకల్పం వల్ల కాని, అనురాగంతో ఇతరులను చూసికాని ఈమె నిన్నెప్పుడూ అతిక్రమించలేదు. నిన్ను వదిలి మనుష్యులెవరూ లేని ప్రదేశంలో ఒంటరిగా వున్న సమయంలో ఈ సాధ్విని పాపాత్ముడైన రావణుడు బలవంతంగా తెచ్చాడు. తెచ్చి తన ఇంట్లో వుంచాడు. అలా చేసినప్పటికీ నిన్నే ధ్యానిస్తూ, నిన్నే భజిస్తూ ఇతర విషయాలమీద మనసు పోనివ్వలేదు. రావణుడు ఎంత బలవంత పెట్టినా మనసు నీమీదే లగ్నం చేసింది. ఏ పాపం ఎరుగని ఈ సాధ్వీమణిని నువ్వు స్వీకరించు" అన్నాడు.

సీతాదేవిని పరిగ్రహించిన శ్రీరాముడు

అగ్నిహోత్రుడి మాటలకు శ్రీరాముడు ఇలా బదులిచ్చాడు. "జానకిలో ఏ దోషంలేదని నాకు తెలుసు. నువ్వు నిజమే చెప్పావు. దీర్ఘకాలం రావణుడి అంతఃపురంలో వున్న సీతను పరీక్షించకుండా స్వీకరిస్తే నన్ను బుద్ధిహీనుడని అనేవారు ముల్లోకాలలోని పెద్దలు. ఆ నింద పడలేక జానకి పతివ్రత అని తెలిసికూడా లోకులను నమ్మించడానికి నేను ఉపేక్షించాను. నేను సత్యమే చెప్తున్నాను. ఈ స్త్రీరత్నం తన పాతివ్రత్య మహిమతో తనను తాను కాపాడుకోగలదని, ఈమెను మించి రావణుడు పోలేడని. ఆమెను తాకి

బతకలేదని నాకు తెలుసు. ఈమె రావణుడి అంతఃపురంలో సుఖసంపదలు అనుభవించతగ్గది కాదు. ఆ పాపపత్ముడి సొమ్ము ఈమె వాడుకోదు. పవిత్రమైన ఈ సీత నిష్కల్మష హృదయం కలది. నేనెలా ఈమెను వదులుకుంటాను? దేవతలారా! మీరంతా ఔనన్నదాన్ని నేనెలా కాదంటాను?". ఈ విధంగా తనకు తెలసిన విషయాన్ని దేవతలకు చెప్పి సీతను చేరదీసి రాముడు సుఖపడ్డాడు.

సర్గ-122
దశరథుడిని సందర్శించిన సీతా రామ లక్ష్మణులు

రామచంద్రమూర్తి ఇలా తమ మీద గౌరవంతో శుభకరమైన మాటలు చెప్పగా దేవతలలో వున్న శివుడు ఇలా అన్నాడు. "రామచంద్రా! మా అదృష్టాన నువ్వీ గొప్ప పని చేశావు. మా భాగ్యాన అఖిల లోకాలకు రావణుడి బాధ తొలగించావు. ఇక్కడ నీ కార్యం నెరవేరింది. అక్కడ భరతుడు దుఃఖిస్తున్నాడు. అయోధ్యకు వెళ్లి పట్టాభిషిక్తుడివికా! రామచంద్రమూర్తీ! నీ అవతార ప్రయోజనాలలో సాదు పరిత్రాణం, దుష్ట వినాశనం అనే రెండు పనుల్లో చాలా భాగం నెరవేర్చావు. ఇక మూడోది ధర్మసంస్థాపన చేయడం. దానికొరకై నువ్వు అయోధ్యకు పోవాలి. సంతానం పొంది అసమాన కీర్తికల ఇక్ష్వాకుల కులాన్ని నిలుపు. అశ్వమేధయాగం చేయి. ఈ కార్యాలన్నీ నెరవేర్చి వైకుంఠం పో. అదిగో ఆకాశంలోకి చూడు. అక్కడ నీ తండ్రి దశరథుడు వున్నాడు. విమానంలో నిలిచి వున్నాడు".

తన తండ్రిని చూసిన రాముడు చేతులు జోడించి మొక్కాడు. దశరథుడు ప్రేమతో కొడుకును కౌగలించుకున్నాడు.

శ్రీరాముడిని ప్రశంసించిన దశరథుడు

కొడుకు శ్రీరాముడిని కౌగలించుకుని ప్రేమతో దశరథుడు ఇలా అన్నాడు. "రామచంద్రా! నిజం చెప్తాను. దేవతలు నన్ను దేవలోకంలో ఎంత సత్కరించినా నిన్ను విడిచి వుండడం వల్ల నాకు సంతోషం లేదు. నిన్ను చూసి సంతోషం కలుగుతున్నది. నిన్ను అడవులకు పంపమని కైక పలికిన పరుషపు మాటలు నా మనస్సులో నాటుకుని బాధపెట్టేవి. ఇప్పుడు వనవాస దీక్ష తీరిన నిన్ను,

లక్ష్మణుడిని కౌగలించుకున్న తరువాత ఆ దుఃఖం పోయింది. నువ్వు నా ప్రియపుత్రుడవైనందున నేను తరించాను. రావణ వధ కావాలని కోరుకున్న దేవతలంతా నీ పట్టాభిషేకం జరగకుండా విఘ్నం కలిగించారు. అదిప్పుడు నాకు తెలిసింది. యుద్ధంలో శత్రువులను చంపి మళ్లీ అయోధ్యకు వెళ్తున్న నిన్ను చూడగల నీతల్లి ధన్యురాలుకదా! నువ్వు అయోధ్యకు పోవడం వల్ల నీతల్లితో పాటు అయోధ్య పురజనులు కూడా ధన్యులవుతారు. నువ్వు, నీ తమ్ముడు ఐకమత్యంతో వుండాలని కోరుకుంటున్నాను. ఇచ్చిన మాట ప్రకారం పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేశావు. నీ ప్రతిజ్ఞ నెరవేరింది. రావణుడిని చంపావు. చేయాల్సిన పనులన్నీ చేసి కీర్తి సంపాదించావు. ఇక పట్టాభిషిక్తుడవై తమ్ములతో దీర్ఘకాలం సుఖం అనుభవించు". జవాబుగా రామచంద్రుడు "తండ్రీ! ఆనాడు నీవు కైకను, భరతుడిని వదిలానన్నావు. వారిని స్వీకరించి ఈ శాపం తొలగించు" అన్నాడు.

శ్రీరామ సేవ కర్తవ్యమని లక్ష్మణుడికి బోధించిన దశరథుడు

సీతాదేవిని ఓదార్చిన దశరథుడు

రామచంద్రమూర్తితో ఇలా చెప్పిన దశరథుడు లక్ష్మణుడిని చూసి చెప్పాడిలా. "కుమారా! నువ్వు సీతారామచంద్రుల పాదసేవ చేసి నీ జన్మ సార్థకం చేసుకున్నావు. అంతకన్నా ఎక్కువగా నీ జన్మ సార్థకానికి చేసేది ఇంకా ఏమీలేదు. నీ నడవడికి నేను చాలా సంతోషించాను. ధర్మం ఇవ్వాల్సినంత ఫలం నీకిచ్చింది. ధర్మం లేని మోక్షం లేదుకాబట్టి నీకు సీతారాముల సేవ వల్ల మోక్షం లభించింది. దీనివల్ల నీకు ఆముష్మికఫలమే కాకుండా భూలోకంలో కీర్తి కలిగింది. రాముడి కరుణవల్ల నీకు వైకుంఠప్రాప్తి కూడా లభించింది. కాబట్టి నువ్వు ఇక ముందుకూడా రాముడి సేవే చేస్తుండు. ఆయనే ముల్లోకాలకు క్షేమం కలిగిస్తాడు. అందరూ ఆయన్నే పూజిస్తారు. (అక్కడున్న బ్రహ్మ, రుద్ర, దేవేంద్రాదులను చూపిస్తూ) లక్ష్మణా! ఇక్కడ వున్న దేవతలందరూ రాముడు ఆకారంలో పరబ్రహ్మమే కనిపించాడని చెప్పారు. (శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్ పరబ్రహ్మ అని, అవతార మూర్తి అని స్థిరీకరించడం జరిగిందిక్కడ). సీతాసమేతుడైన శ్రీరాముడిని నువ్వు భక్తితో సేవించడం వల్ల నిర్మలమైన సత్కీర్తి నీకు దక్కింది". ఇలా సౌమిత్రికి చెప్పి దశరథుడు జనకరాజ పుత్రి సీతను ఓదార్చాడు.

సర్గ-123
ఇంద్రుడి వరంతో పునర్జీవితులైన మృతవానరులు

అక్కడున్న దేవతలంతా, శ్రీరాముడి దర్శనం కలగడం వల్ల తమ జీవితాలు సార్థకమయ్యాయని ఆయనకు ఇష్టమైనదేమన్నా వుంటే కోరుకొమ్మని, అది తాము నెరవేరుస్తామని అన్నారు. వారికి అభివాదం చేసిన రాముడు ఇద్రుడిని చూసి ఇలా అన్నాడు. "ఇంద్రా! మృతులైన వానరులందరినీ బతికించు. వారంతా పునర్జీవించి భార్యాపిల్లలతో, స్నేహితులతో ఆనందంగా వుండాలి. ఇంద్రా! నాకోసం చనిపోయినవారు బతకడమే కాకుండా, బతికున్నవారిలో గాయపడినవారు, వ్యాధిగ్రస్తులైనవారు కూడా పూర్వంలాగే ఆరోగ్యవంతులై వుండేట్లు చేయాలని నా మనవి. వారున్న చోట నానారకాలైన ఫలాలు, కందమూలాలు, నీరు సమృద్ధిగా లభించాలి. ఇంద్రా ఇవే నేను కోరే వారాలు".

రాముడు కోరినట్లే ఇంద్రుడు చేశాడు. చనిపోయిన వానరులంతా బతికారు. గాయాలైన వారు బాగుపడ్డారు. వారికి సమృద్ధిగా ఆహారం లభించింది. ఆ తరువాత దేవతలు రామచంద్రమూర్తిని పొగిడి "జానకీ నాయకా! ఈ వానరులను వారివారి ప్రదేశాలకు పంపించి నువ్వు అయోధ్యకు పోయి అందరినీ పూరడించు. నీ కోసం శోకిస్తున్న భరతుడిని చూసి ఓదార్చు. శత్రుఘ్నుడిని ప్రేమతో చూడు. పట్టాభిషిక్తుడివై పురజనులందరినీ సంతోషపెట్టు. మామా స్థానాలకు మేం పోతాం" అని రామచంద్రమూర్తి ఆజ్ఞ తీసుకుని దేవతలు స్వర్గానికి పోయారు. దేవతలు వెళ్లగానే రామలక్ష్మణులు వానరసేనను మధ్యన గడిపారు కొంతసేపు.

సర్గ-124

శ్రీరాముడిని సంస్కారానికి అంగీకరించమని కోరిన విభీషణుడు

మర్నాడు ఉదయాన్నే విభీషణుడు రామచంద్రమూర్తిని చూసి, దివ్యతీర్థాలనుండి తెచ్చిన జలాలు, దేహానికి పూసుకునే యోగ్యమైన కుంకుమ పువ్వు, పట్టువస్త్రాలు, సొమ్ములు, చందనాలు, పూల దండలు సిద్ధంగా వున్నాయని ఆయన సుఖంగా స్నానం చేయాలనీ అడిగాడు. జవాబుగా శ్రీరాముడు "విభీషణా! సుగ్రీవాదులను స్నానం చేయమని చెప్పు. ఎంతో సుఖం అనుభవించాల్సిన భరతుడు నా నిమిత్తమై వానప్రస్థాశ్రమం స్వీకరించి, పద్నాలుగు సంవత్సరాలు పూర్తికాగానే మరుసటి రోజున నేను రాకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. వాడు ప్రతిజ్ఞ తప్పడు. నాకంటే చిన్నవాడు అలా బాధపడుతుంటే నేనిక్కడ సుఖపడడం భావ్యం కాదు. దానికి నా మనసు అంగీకరించదు. భరతుడు లేకుండా ఆభరణాలు, వస్త్రాలు ధరించను. మా అయోధ్యకు పోయే మార్గంలో ప్రయాణం కష్ట సాధ్యమైంది. కాబట్టి మేమిప్పుడే ప్రయాణమై పోవాలి" అన్నాడు.

విభీషణుడు ఆయన మాటలకు ప్రత్యుత్తరం ఇస్తూ, "మావద్ద పుష్పకం పేరుతో సూర్యకాంతికల విమానం వుంది. దాన్ని యుద్ధంలో కుబేరుడుని జయించి రావణుడు హరించాడు. అది కోరిన విధంగా పోగలదు. దీన్ని మీ కొరకే వుంచాను. ఇది మేఘాలలాగా విశాలమై వేగంగా పోతుంది. ఒక్క పగటిలో మిమ్మల్ని అయోధ్యకు చేరుస్తుంది. నువ్వు తమ్ముడితో, భార్యతో దీంట్లో ప్రయాణం చేయి".

పుష్పక విమానం తెమ్మని విభీషణుడికి చెప్పిన శ్రీరాముడు

విభీషణుడు అలా చెప్పినందుకు శ్రీరాముడు సంతోషించి ఇలా అన్నాడు. " విభీషణా! నీ మాట వినలేదని అనుకోవద్దు. నా మనసంతా నా తమ్ముడిమీద పోతున్నది. వాడిని చూడాలి. అలాగే మా తల్లి కౌసల్యను, సుమిత్రను, కైకేయిని చూడాలని వుంది. బిడ్డల్లాంటి పౌరులను, మా గురువులను చూడాలని వుంది. నువ్వు వెంటనే పుష్పక విమానం తెప్పించు. నువ్వు చేయాలనుకున్న పూజలన్నిటినీ అంగీకరించాను. నేను వేగంగా అయోధ్యకు పోవాలి. అక్కడివారంతా నా రాకకొరకై ఎదురు చూస్తున్నారు". అలా రామచంద్రమూర్తి చెప్పగానే విభీషణుడు పుష్పక విమానాన్ని తెప్పించాడు.

సర్గ-125
విభీషణుడితో వానరులకు కానుకలు ఇప్పించిన శ్రీరాముడు

పుష్పక విమానం తెప్పించి రాముడి దగ్గర నిలిపి ఇక ఆయన ఆజ్ఞ ఏమిటని అభ్యర్థించాడు విభీషణుడు. రాముడప్పుడు తమ్ముడితో ఆలోచించి స్నేహభావంతో విభీషణుడితో ఇలా అన్నాడు. "విభీషణా! నా పనిని తమ పనిగా ఎంచుకుని, నా కొరకై వానరులంతా శరీరం మీద ఆశ వదిలి, చావుకు తెగించి యుద్ధం చేసి దేవతలకైనా గెలవ సాధ్యంకాని లంకను పడగొట్టారు. కాబట్టి వీరందరికీ తగిన రీతిన బహుమానాలు ఇవ్వాలని కోరికగా వుంది. వీరందరికి దండిగా శ్రేష్టమైన మణులు, బంగారం, ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా వారివారి శ్రమకు తగినట్లు బహుమానంగా ఇవ్వు. విభీషణా! వానర శ్రేష్ఠులు గౌరవ యోగ్యులు. కృతజ్ఞుడవైన నీ గౌరవం పొంది సంతోషంగా వారి స్థావరాలకు పోతారు. నువ్విలా చేస్తే వీరంతా నిన్ను దాతవని, కష్టం తెలిసినవాడివని, దయగలవాడివని, కీర్తిపరుడవని భావిస్తారు. అందుకే నిన్ను నేను అడగాల్సి వచ్చింది. వారికి తగురీతిన బహుమానాలు ఇస్తే మనకు భవిష్యత్ లో ఎప్పుడు సహాయం కావాలన్నా వస్తారు".

పుష్పక విమానం ఎక్కి సుగ్రీవాదులకు అనుజ్ఞ ఇచ్చిన శ్రీరాముడు

శ్రీరాముడు తనకలా చెప్పగానే విభీషణుడు వానరులకు ధనం, రత్నాలు, మణులు తెచ్చి తగురీతి సత్కరించాడు. వారంతా చాలా సంతోషించారు. ఆ తరువాత శ్రీరాముడు ఆనందంగా పుష్పక విమానం ఎక్కాడు. తన పక్క ఎడమ తొడమీద సీతాదేవిని కూచోబెట్టుకున్నాడు. లక్ష్మణుడు విల్లు ధరించి పక్కనే నిలబడ్డాడు. వానర రాక్షస మిత్రులందరినీ తగురీతి ఆదరించాడు. వానరుల

స్నేహకార్యం నేరవేరిమ్దనీ ఇక వారికి సెలవిస్తున్నాననీ, వారంతా వారివారి సొంత స్థలాలకు వెళ్లవచ్చనీ అనుమతి ఇచ్చాడు. తాను అయోధ్యకు పోతున్నాననీ తనకు సెలవివ్వమనీ అడిగాడు వారందరినీ. శ్రీరాముడు ఇలా అనగానే కపిరాజు సుగ్రీవుడు, రాక్షసరాజు విభీషణుడు, ఇద్దరూ, వానరులతో కూడి తాము రామ పట్టాభిషేకం చూడడానికి అయోధ్యకు వస్తామనీ, ఆ తరువాత తమ ఇండ్లకు పోతామనీ, తమకు అనుమతి ఇవ్వమనీ కోరారు.

సుగ్రీవ విభీషణాదులు అయోధ్యకు రావడానికి అంగీకరించిన శ్రీరాముడు

సుగ్రీవుడు, విభీషణుడు అలా కోరగానే ధర్మాత్ముడైన శ్రీరాముడు తక్షణమే అంగీకరించాడు. స్నేహితులైన వారితో కలిసి అయోధ్యకు పోవడం తనకు మహా భాగ్యమని అంటూ సుగ్రీవ, విభీషణాదులను, కపులందరినీ విమానం ఎక్కమని చెప్పాడు. వారంతా ఎక్కగానే చూసేవారికి బ్రహ్మ రథంలాగా కనిపించే ఆ విమానం పైకి ఎగిరింది. మంత్రపూతమైన ఆ విమానంలో ఎంతమంది ఎక్కినా ఇరుకు లేకుండా సుఖంగా వుంది.

సర్గ–126
పూర్వ పరిచిత ప్రదేశాలను సీతాదేవికి చూపించిన శ్రీరాముడు

విమానం నడిపేవాడు శ్రీరాముడి అనుజ్ఞ తీసుకుని దాన్ని పోనివ్వగా అది ఆకాశమార్గాన రివ్వున పోతుంటే అటు–ఇటు చూస్తూ అలాగే చూస్తున్న సీతతో రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

"విశ్వకర్మ నిర్మించిన, కైలాసశిఖరానికి సమానమైన, త్రికూట శిఖరంలో లంక వున్నది. ఇది చూశావా? ఈ ప్రదేశాన్ని చూడు. వానర రాక్షసులు యుద్ధం చేయగా భూమి నెత్తురు, మాంసాలతో ముద్దగా, బురదగా అయిపోయింది. బ్రహ్మ రుద్రుల వరాలు పొందిన రావణుడిని నీకొరకై ఇక్కడే చంపాను. ఇక్కడ నా భుజబలంతో కుంభకర్ణుడు చచ్చాడు. అక్కడ ప్రహస్తుడు చచ్చాడు. ఇక్కడ ఆంజనేయుడు ధ్రూమాక్షుడిని చంపాడు. సుషేణుడు ఇక్కడే విద్యుజ్జిహ్వుడిని చంపాడు. మాయలమారి ఇంద్రజిత్తును లక్ష్మణుడు ఇక్కడే చంపాడు. వికటుడిని అంగదుడు ఇక్కడే చంపాడు. మహోదరుడు, విరూపాక్షుడు, అకంపనుడు, రూక్షబలుడు, త్కోపుడు, మహాపార్శ్వుడు ఇక్కడే చచ్చారు. రావణుడి భార్య మందోదరి ఇక్కడే కన్నీరు కార్చింది".

"సీతా! ఇదిగో చూడు. సముద్రాన్ని దాటడానికి దాని మధ్యన, కేవలం నీకోసం, అసాధ్యమైన విధంగా, శత్రువుల గుండెలు పగలగా, వానరులు సేతువు నిర్మించారు. ఇది లోకంలో 'నల సేతు'వని ప్రసిద్ధికెక్కుతుంది. జానకీ! అలలతో నిండిన అందమైన ఈ సముద్రాన్ని చూడు. దాని నడుమనున్న బంగారు శిఖరం కల మైనాక పర్వతాన్ని చూడు. హనుమంతుడు సముద్రాన్ని దాటేటప్పుడు ఆయన బడలిక తీర్చడానికి ఈ పర్వతం నీళ్లలోనుండి వచ్చింది.

సముద్రం ఉత్తర తీరాన సేతువుకు ఆవల వానర సేనలు శిబిరాలు ఏర్పాటు చేసుకుని దిగిన స్థలాన్ని చూడు. సముద్ర తీరంలో దేవతలు, మనుష్యులు పూజించే పవిత్రమైన స్థలాన్ని చూశావా? అక్కడే సేతువు కట్టడం ఆరంభించారు వానరులు. పూర్వం ఇక్కడ సముద్రుడు అనుగ్రహించాడు. ఇక్కడే విభీషణుడు వచ్చి నన్ను కలిశాడు. సీతా! ఇదిగో ఇదే కిష్కింధ. ఇక్కడే నేను వాలిని వధించాను".

తార ఇతర వానర కాంతలను అయోధ్యకు తీసుకుపోదామన్న సీతాదేవి

శ్రీరాముడు ఇలా ప్రదేశాలను వర్ణించుకు పోతుంటే కిష్కింధ గురించి చెప్పగానే సీతాదేవి రాముడితో, "రామచంద్రా! నాదొక విజ్ఞాపన. తారాదేవి మొదలైన సుగ్రీవుడి భార్యలను, ఇతర వానర స్త్రీలను తీసుకుని సంతోషంగా అయోధ్యకు పోవాలని నా కోరిక" అన్నది. ఆమె ఇలా అనగానే సంతోషించిన రాముడు విమానం నిలపమన్నాడు. (సీతాదేవికి తారాది స్త్రీల ముఖం కూడా తెలియదు. వారామెకు సహాయం కూడా చేయలేదు. అయినా వారిని తీసుకుని పోదామనడం ఆమె గొప్పతనానికి నిదర్శనం). సుగ్రీవుడితో "సుగ్రీవా! వానరులందరినీ వారివారి భార్యలను సీతాదేవితో అయోధ్యకు పోవడానికి రమ్మని కబురుచేయి. నువ్వు నీభార్యలను ఇతర ఆడవారిని పిలుచుకునిరా. ఎక్కువ ఆలశ్యం చేయవద్దు" అని శ్రీరాముడు అనగానే సుగ్రీవుడు అంతఃపురానికి శీఘ్రంగా పోయాడు. పోయి రామచంద్రుడు అయోధ్యకు రమ్మన్నాడని తారకు, తన ఇతర భార్యలకు చెప్తాడు. తన భర్త అలా చెప్పగానే తార ఆ మాట ఇతర వానర స్త్రీలకు తెలియచేస్తుంది. వారంతా సంతోషించి, వచ్చి, విమానానికి ప్రదక్షిణ చేసి, సీతాదేవిని చూడాలన్న కోరికతో త్వరగా విమానం ఎక్కారు. వెంటనే విమానం ఆకాశానికి ఎగిరింది. అప్పుడు రామచంద్రమూర్తి సీతతో ఇంతకు ముందు చెప్పినట్లు తాను తిరిగిన ప్రదేశాలను గురించి ఇలా వివరించసాగాడు.

"సీతా! ఇదిగో ఇదే ఋష్యమూక పర్వతం. అక్కడే నేను సుగ్రీవుడిని చూశాను. చూసి వాలిని చంపుతానని ప్రతిజ్ఞ చేశాను. ఇదే పంపా తీరం. అడవులు ఇప్పుడు చైత్రమాసం కాబట్టి పూలు పూసి అందంగా వున్నాయి. నిన్ను వదిలిన కారణాన నీ వియోగం భరించలేక కన్నీరు మున్నీరుగా కార్చాను. ఏడ్చాను. జానకీ! ఇక్కడే ధర్మచారిణి ఐన శబరిని చూశాను. అక్కడే యోజనం పొడవు చేతులున్న కబంధుడిని చంపాను. అదిగో జనస్థానంలో జటాయువున్న

చెట్టు. ఇక్కడే నీకొరకు జటాయువుకు రావణుడికి యుద్ధం జరిగింది. ఇక్కడే ఖరదూషణాదులు, త్రిశిరుడు నా బాణాలతో చచ్చారు. అదే మనమున్న ఆశ్రమ ప్రదేశం. నిన్ను రావణాసురుడు దొంగిలించిన పర్ణశాల ఇదే. ఇప్పుడు సంతోషంగా చూడు. అదే గోదావరి నది చూడు. అదే సుతీక్ష్ణుడి ఆశ్రమం. అదే శరభంగుడి ఆశ్రమం. అక్కడే పెద్ద దేహం కల విరాధుడిని చంపాను. అవే మనం పదేళ్లు గడిపిన ఋషుల ఆశ్రమాలు. యత్రి మహామునిని, ఆయన భార్య అనసూయను నువ్వు చూసింది ఇక్కడే. అదే మనోహరమైన చిత్రకూటం. ఇక్కడే కదా భరతుడు నన్ను చూడడానికి వచ్చాడు. అదే యమునా నది. భరద్వాజాశ్రమం అదే. భాగీరథిని కళ్లారా చూడు. అదే శృంగిబేరపురం. అక్కడే గుహుడు మనల్ని చూడడానికి వచ్చాడు. అదిగో అదే సరయూ నది. మా తండ్రి వున్న అయోధ్యానగారాన్ని మరలా క్షేమంగా చూడగలిగాం".

రామచంద్రమూర్తి అయోధ్య వచ్చింది అనగానే వానరులు, విభీషణుడు లేచి నిలబడి, మళ్లీ కూర్చుని, ఇంద్రుడి నగరంతో సమానమైన అయోధ్యా నగరాన్ని చూశారు.

సర్గ-127

భరద్వాజాశ్రమంలో పుష్పక విమానం దిగిన శ్రీరాముడు

పద్నాలుగు సంవత్సరాల వనవాస దీక్ష పూర్తైన కారణాన, చైత్ర శుద్ధ పంచమినాడు శ్రీరామభద్ర ప్రభువు భరద్వాజాశ్రమం దగ్గర విమానం దిగి, ఆ మునీశ్వరుడిని చూసి, నమస్కారం చేసి, "మునీంద్రా! అయోధ్యలో అంతా బాగున్నాదా? కరువులు, ఉపద్రవాలు లేవుకదా?అక్కడి సమాచారం మీరెప్పుడైనా విన్నారా? మా తల్లులంతా బతికున్నారా? భరతుడు ప్రజలను చక్కగా పాలిస్తున్నాడా?" అని అడిగాడు.

జవాబుగా మునీశ్వరుడు "మీ తల్లులే కాదు. పరిచారికలతో సహా అందరూ క్షేమంగా, సుఖంగా వున్నారు. భరతుడు దేహసంస్కారం లేకుండా నేలమీద పడుకుంటూ నారచీరెలు కట్టుకుని, జడలు ధరించి, ఎప్పుడూ నీ పాదుకలను ఎదురుగా వుంచుకుని నువ్వెప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నాడు. ఎప్పుడూ అడవుల్లో తిరుగుతున్న నిన్నే తలచుకుంటూ అయ్యో! మహాత్ముడు కష్టపడుతున్నాడే అని బాధపడుతున్నాడు. సాధుజనరక్షాదీక్షా! నిన్ను చూడడం సంతోషంగా వుంది. దండకారణ్యంలో బ్రాహ్మణులను రక్షించడానికి నువ్వు జనస్థానంలో రాక్షసులను చంపడంలాంటి విషయాలన్నీ నాకు తెలుసు. సీతాదేవి మాయలేడిని చూడడం, రావణాసురుడు ఆమెను బలాత్కారంగా ఎత్తుకుని పోవడం, భయంకరమైన అడవిలో మీరు కబంధుడిని సంహరించడం, సీతను వెతకడం, హనుమంతుడిని కలవడం, నలసేతువు నిర్మాణం, రాక్షసులను చంపడం, దేవతలు ప్రత్యక్షమై నీకు వరాలివ్వడం నాకు తెలుసు. అదంతా నా తపోబలంతో చూశాను. నేను నీకొక వరం ఇస్తాను కోరుకో. నువ్విక్కడ ఈ రోజు వుండి వెళ్లు" అని అన్నాడు.

జవాబుగా రామచంద్రమూర్తి, దానిని అంగీకరించి, వరం ఇలా కోరాడు. "దయామయా! అన్ని కాలాల్లో అన్ని రకాల తియ్యటి పండ్లు అయోధ్య పోయే మార్గంలో చెట్లకు వుండాలి". దానికి మునీశ్వరుడు అంగీకరించి అలాగే వుంటాయన్నాడు. ఆ వరబలంతో అయోధ్యకు పోయే అన్ని మార్గాలలో పూలులేని చెట్లు పూలతో, పండ్లు లేని చెట్లు తియ్యటి పండ్లతో, పసరులేనివి పసరుతో, మోద్దులన్నీ పచ్చటి ఆకులతో సారవంతం అయ్యాయి. వానరులు అధిక సంతోషంతో ఆ ఫలాలను భుజించారు.

సర్గ–128
హనుమంతుడిని భరతుడి దగ్గరికి పంపిన శ్రీరాముడు

ఇదంతా జరిగిన తరువాత శ్రీరాముడు హనుమంతుడిని పిలిచాడు. పిలచి ఇలా అన్నాడు. "హనుమంతా! నువ్వు అయోధ్యాపురంలో రాచనగరులో అంతా క్షేమంగా వున్నారా తెలుసుకునిరా. పోయేటప్పుడు శృంగిబేరపురంలో నాకాత్మీయుడైన నా ప్రాణ స్నేహితుడు గుహుడున్నాడు. అతడికి నా క్షేమ వార్త తెలియచేయి.అయోధ్యకు పోయే మార్గం అతడు నీకు చెప్తాడు. ఆ మార్గంలో పోయి అయోధ్యకు చేరి, భరతుడిని సమీపించి నేను చెప్పానని నా క్షేమసమాచారం చెప్పు. తండ్రి ఆజ్ఞ నెరవేర్చి తమ్ముడితో, సీతతో మరలి వచ్చానని చెప్పు. ఆ మాటలు విన్న ఆయన ముఖం ఎలా వుంటుందో పరీక్షించు. ఆ తరువాత రావణుడు సీతను అపహరించడం, నేను సుగ్రీవుడితో స్నేహం చేయడం, వాలిని చంపడం, సీతను మీరంతా వెతకడం, సీతకొరకై నువ్వు సముద్రాన్ని దాటడం, లంకలో సీతను చూడడం, మనం దండెత్తి పోవడం, సముద్రం మీద సేతువు కట్టడం, రావణుడిని చంపడం, బ్రహ్మేంద్ర వరుణులు వరాలివ్వడం, వానర రాజుతో రాక్షసరాజుతో నేను కలసి రావడం భరతుడికి వివరంగా చెప్పు. ఇదంతా విన్న తరువాత భరతుడి ఆకారం ఎలా వుంటుందో (తృప్తిగానా, అసంతృప్తిగానా) కనిపెట్టు".

"ఇంతవరకు నా మాటలుగా చెప్పు. ఇక నీ మాటలుగా నువ్వు చెప్పినట్లు కొన్ని చెప్పు. గౌరవించాల్సిన శక్తితో రాముడు శత్రువులందరినీ సంహరించాడనీ, లోకంలో కీర్తిని శాశ్వతంగా నిలిపాడనీ, అసమాన తేజస్సు పొందాడనీ, సగౌరంగా రాముడు వచ్చాడనీ చెప్పు. ఇలా నువ్వు చెప్పే సమయంలో భరతుడి ముఖం ప్రసన్నంగా వుందా? లేదా? తెల్లబోయిందా?

ముఖంలో కాంతి ఎలా వుంది? సంతోషం పెరిగిందా? చూపు తగ్గిందా? వికాసం పొందాడా? కంఠస్వరం ఎలా వుంది? వాడి మనస్సు నడవడి ఎలాగుంది? విసుగు కనపర్చాడా? అసంతుష్టి కనబర్చాడా? ఇవన్నీ చక్కగా తెలుసుకునిరా. నువ్వు త్వరగా వెళ్లు. నువ్వు త్వరగా పోకపోతే అతడు అగ్నిలో దూకుతాడు".

"ఏనుగులతో, గుర్రాలతో నిండి, ఉత్తమమైన భోగ భాగ్యాలు యోగ్యమైన పదార్థాలు కలిగి, వంశపరంగా తాతల తండ్రుల నుండి సంక్రమించిన రాజ్యం ఎలాంటివాడి మనస్సునందైనా ఆశలు కలిగించక మానవు. భరతుడికి రాజ్యం అంటే కోరిక వుంటే అతడే రాజ్యం ఏలుగాక. అలా కోరిక వుంటే మేము ఇక్కడ వుండగానే పరుగునరా. రాజ్యాభిలాష లేకపోతె నువ్వక్కడే వుండు మేమే వస్తాం".

హనుమంతుడు రాముడి ఆజ్ఞానుసారం వేగంగా పోయి మొదలు శృంగిబేరపురం పోయి గుహుడిని కలిశాడు. అతడికి శ్రీరామ లక్ష్మణ సీతా క్షేమ సమాచారం ఆయన చెప్పమన్నట్లు చెప్పాడు. ఆ తరువాత భరతుడి దగ్గరికి పోయాడు. పోవడానికి ముందుగా అయోధ్యకు కోసెడు దూరంలో వున్న ఒక ఆశ్రమాన్ని చూశాడు.

భరతుడిని సందర్శించిన హనుమంతుడు

ఆ ఆశ్రమంలో నారచీరెలు కట్టి, కృష్ణాజినం ఉత్తరీయంగా వేసుకుని, తపసి వేషంలో వున్నవాడిని, అన్నను విడిచి చింతతో దుఃఖపడ్తున్న వాడిని, దుమ్ముతో దేహం నిండిన వాడిని, వేలాడే జడలు కలవాడిని, బ్రహ్మర్షి కాంతితో వున్నవాడిని, పండ్లు, వేళ్ళు తింటూ పరమాత్మనే ధ్యానించేవాడిని, జితేంద్రియుడిగా నియమనిష్టలతో వున్నవాడిని, అన్న పాదుకలు ఎదురుగా వుంచుకుని రాజ్యపాలన చేస్తున్నవాడిని, కాషాయవస్త్రాలు కట్టుకుని సుఖాలకు దూరంగా వున్నవాడిని, పురోహితులు, మంత్రులు, సేనానాయకులు, పౌరులు సేవిస్తున్న రాజకుమారుడు భరతుడిని చూశాడు హనుమంతుడు. ధర్మం ఆకారం ఆయనలో వుందో అన్నట్లున్న ఆ ధర్మజ్ఞుడిని, భరతుడిని చూసి హనుమంతుడు వినయంగా నమస్కారం చేసి ఇలా అన్నాడు.

"భరతా! ఏ రామచంద్రమూర్తైతే దండకలో నారచీరెలు, కృష్ణాజినం ధరించి వున్నాడని నువ్వు విచారపడుతున్నావో ఆ రామచంద్రమూర్తి నీ క్షేమ సమాచారం కనుక్కుని రమ్మన్నాడు. భరతా! నీకు సంతోషకరమైన మాట చెప్తా విను. నువ్వీ

భయంకర దుఃఖం వదిలిపెట్టు. నీమీద ప్రేమకల నీ అన్నను నువ్వీ క్షణంలోనే చూడవచ్చు. రావణుడిని చంపి, సీతాసమేతంగా లక్ష్మణుడితో, వానర మిత్ర సేనా సమూహంతో కలిసి సంతోషంగా వస్తున్నాడు". ఈ మాటలు వింటూనే అమితమైన సంతోషంతో భరతుడు కాసేపు మూర్ఛపోయి, తేరుకుని, సంతోషవార్త చెప్పిన హనుమంతుడిని కౌగలించుకున్నాడు. ఈ సంతోష వార్త చెప్పడానికి వచ్చిన హనుమంతుడు మనుష్యుడా, దేవతా? అని అడిగాడు. సంతోష వార్త చెప్పిన హనుమంతుడికి నూరు గ్రామాలు, లక్ష ఆవులు, సాలంకృతలైన బంగారు చాయకల గొప్ప వంశంలో పుట్టిన కులకన్యలను కానుకగా ఇస్తాను అంటాడు. ఇలా చెప్పి, రాముడిని చూడాలన్న కోరికతో ఉత్సాహంగా హనుమంతుడితో ఇలా అన్నాడు.

సర్గ-129

భరతుడికి శ్రీరామ వృత్తాంతమంతా చెప్పిన హనుమంతుడు

"ఎన్నో సంవత్సరాల క్రితం రామచంద్రమూర్తి అడవులకు పోయాడు. మళ్లీ ఇన్ని రోజులకు ఆయన వార్త విన్నాను. అయ్యా! రాముడికి, వానరులకు ఏ కారణాన, ఏవిధంగా స్నేహం కుదిరిందో ఆ విషయమంతా సవివరంగా తెలియచేయి" అని భరతుడు హనుమంతుడిని అడిగాడు. జవాబుగా హనుమంతుడు ఆ విషయాలన్నీ వివరంగా చెప్పాడిలా.

"భరతా! మీ తల్లి కోరిన ప్రకారం మునివేషం ధరించి రాముడు అడవికి పోవడం, పుత్రశోకంతో మీ తండ్రి మరణించడం, పురోహితులు నిన్ను పిలిపించడం, నువ్వు అయోధ్యకు వచ్చి రాజ్యభారం వహించడానికి ఇష్టపడకుండా చిత్రకూటానికి ప్రయాణమై పోవడం, రాజ్యం స్వీకరించమని రామచంద్రమూర్తిని ప్రార్థించడం, ఆయన నిరాకరించడం, ఆయన పాదుకలు తీసుకుని నువ్వు అయోధ్యక రావడం నీకు తెలిసిన విషయమే కదా. ఇక ఆతరువాత జరిగింది చెప్తా విను. మీరు వచ్చిపోవడం వల్ల ఇక చిత్రకూటంలో వుండడం భావ్యం కాదనుకుని దాన్ని విడిచి భయంకరమైన దండకారణ్యానికి సీతారామలక్ష్మణులు ముగ్గురూ పోయారు. వారలా అడవిలో పోతుంటే విరాధుడు అనే రాక్షసుడు అడ్డుకుంటే వాడిని చంపారు రామలక్ష్మణులు. ఆ సంధ్యాకాలంలో శరభంగుడిని చూశారు".

"రామచంద్రమూర్తిని శూర్పణక అనే రాక్షసి దుర్బుద్ధితో సమీపించగా రామాజ్ఞప్రకారం లక్ష్మణుడు దాని ముక్కుచెవ్వులు కోశాడు. ఆ తరువాత రామచంద్రమూర్తి యుద్ధంలో పద్నాలుగు వేలమంది రాక్షసులను ఒక్కడే చంపాడు. ఈ విధంగా ఖరుడు మొదలైన రాక్షసులను చంపగా శూర్పణక తన

అన్నెన రావణుడి దగ్గరికి పోయింది. వాడు రామచంద్రమూర్తితో యుద్ధం చేయడానికి భయపడి మారీచుడి సహాయంతో సీతను దొంగిలించడానికి కుట్ర పన్నాడు. మారీచుడు మాయా జింక రూపంలో ఆశ్రమ సమీపంలోకి రాగా సీతాదేవి తనకా జింక కావాలని పతిని కోరింది. దానికై రామచంద్రమూర్తి బాణాలు ధరించి వెళ్లాడు. పరుగెడ్తున్న దాన్ని చూసి రాముడు బాణంతో చంపాడు. రాముడికోసం లక్ష్మణుడు పోయాడు. ఇద్దరూ లేకపోవడం గమనించిన రావణుడు సీతాదేవిని సమీపించి, అపహరించి, ఆకాశాన పోతుంటే జటాయువు అనే పక్షి వాడితో యుద్ధం చేసింది. పక్షిని చంపి రాక్షసుడు ఆకాశాన పరుగెత్తుతుంటే వారిని వానరులు చూశారు. వాడు సీతను తీసుకుని పోయి లంకానగరంలో తన బంగారింట్లో బంధించాడు. రాక్షసుడు ఎంత ప్రయత్నం చేసినా సీత వాడిని లెక్కపెట్టలేదు. అశోకవనంలో పతినే ధ్యానించేది''.

“రామలక్ష్మణులు వెనుతిరిగి వచ్చి సీత లేదని తెల్సుకుని దుఃఖించి, అడవుల్లో వెతక సాగారు. అడవిలో కబంధుడిని వధించారు. ఋష్యమూకంలో సుగ్రీవుడిని కలిశారు. తనకు, తన అన్న వాలికి సంవాదం గురించి చెప్పాడు సుగ్రీవుడు. వాలిని చంపి సుగ్రీవుడిని వానర రాజును చేశాడు రాముడు. సీతాదేవిని వెదకడానికి వానరులను నాలుగు దిక్కులకు పంపాడు సుగ్రీవుడు. సీత దొరకక తపిస్తున్న వానరులకు రావణుడి ఇంట్లో వున్నదని చెప్పాడు జటాయువు తమ్ముడు సంపాతి. నూరామడల పొడవున్న సముద్రాన్ని నేను నా పరాక్రమంతో దాటి లంకలో అశోకవనంలో వున్న సీతాదేవిని చూశాను. ఆమె వృత్తాంతమంతా తెల్సుకుని రామచంద్రమూర్తి నాకు గుర్తుగా ఇచ్చిన ఉంగరాన్ని ఆమెకు ఇచ్చి, ఆమె ఇచ్చిన మణిని రామచంద్రమూర్తి దగ్గరికి పోయి ఇచ్చాను. ఆ తరువాత యుద్ధానికి బయల్దేరి పోయాం. రామచంద్రమూర్తి రావణుడిని వధించాడు. అప్పుడు దేవతలంతా చూడడానికి వచ్చారు. వారంతా వెళ్లిపోయిన అనంతరం వానరులతో కలిసి సీతాలక్ష్మణ సుగ్రీవ విభీషణ సమేతంగా పుష్పక విమానంలో అయోధ్యకు బయల్దేరాడు. ఈ రోజు పునర్వసు జన్మతార కాబట్టి పుష్యం రావడానికి వేచి చూస్తూ గంగా తీరాన వున్నాడు. రేపు పుష్యమి రాగానే బయల్దేరి వస్తాడు. రాగానే నువ్వు చూస్తావు''. అని ముగించాడు. భరతుడు పట్టరాని సంతోషంతో రెండు చేతులు జోడించి ఎన్నాళ్లకు తన కోరిక నెరవేరిందో అని శత్రుఘ్నుడిని పిలిచాడు.

సర్గ–130
అయోధ్యానగారాన్ని శృంగారించిన శత్రుఘ్నుడు

భరతుడు శత్రుఘ్నుడిని చూసి, సామాన్య దేవాలయాల్లోనూ, కులదేవతాలయలోను, దేవతలందరినీ తగురీతిన గంధంతో, పూలదండలతో అలంకారం చేసి, మంగళవాద్యాల మధ్య జనులు స్నానం చేసి మడికట్టుకుని పూజ నిర్వహించేట్లు చేయమని చెప్పాడు. అంతా మంచి వస్త్రాలు కట్టుకుని అలంకరించుకుని శ్రీరామచంద్రమూర్తిని దర్శనం చేసుకోవడానికి రమ్మని చెప్పమని, వచ్చేవిధంగా ఏర్పాట్లు చేయమని చెప్పాడు భరతుడు శత్రుఘ్నుడితో. శత్రుఘ్నుడు అలాగే చేశాడు. అయోధ్యానగారాన్ని మొత్తం చక్కగా అలంకరించేట్లు ఉత్తర్వులు ఇచ్చాడు శత్రుఘ్నుడు. ఇండ్లన్నీ చిత్రంగా ప్రకాశించాయి. వూరంతా ముగ్గులు పెట్టారు. అలా చేయమని వూరంతా చాటింపు వేయించాడు.

శ్రీరాముడికి ఎదురుగా పోయిన భరతాదులు

ఉదయాన్నే రాజపత్నులు, మంత్రులు, బ్రాహ్మణులు, రాచవారంతా సైన్యంతో సహా వరుసలు–వరుసలుగా శ్రీరాముడిని చూడడానికి బయల్దేరారు. వారితో పాటే సుమంత్రుడు, అర్థసాధకుడు, జయంత, విజయులు, అశోక, సిద్ధార్థుడనేవారు బంగారు భూషణాలతో అలంకరించిన ఏనుగులతో బయల్దేరారు. రాజు అంతరంగికులు ఏనుగుల మీద, గుర్రాలు కట్టిన రథాలమీద బయల్దేరి పోయారు. వీరులంతా గుర్రాలనెక్కి భటులతో బయల్దేరారు. దశరథుడి భార్యలు కౌసల్యను, సుమిత్రను ముందుంచుకుని వారితో కలిసి వాహనాలమీద పోయారు. కైక కూడా అందరితో కలిసి బయల్దేరింది. వారలా

పోతుంటే, గుర్రాల గిట్టల ధ్వనులతో, రథ చక్రాల రాపిళ్ళ ధ్వనులతో, నగారాల ధ్వనులతో, శంఖధ్వనులతో, ప్రజల కోలాహల ధ్వనితో భూమి గడగడలాడింది. భరతుడు శ్రీరాముడి పాదుకలు నెత్తిమీద పెట్టుకుని, తన వెనుక పురవాసులంతా వస్తుంటే, అన్న రామచంద్రమూర్తిని దర్శించడానికి బయల్దేరాడు. ఇలా ప్రయాణమై పోయి నలుదిక్కులా చూసి రామచంద్రమూర్తి రాకపోవడంతో ఇలా అన్నాడు. "హనుమంతా! రామచంద్రుడు కనబడలేదు. ఒక్క కోతి కూడా కనబడడం లేదు" అన్నాడు.

వానరుల రాక ఆలశ్యం కావడానికి కారణం భరతుడికి చెప్పిన హనుమంతుడు

రామచంద్రమూర్తి రావడం ఆలశ్యం కావడానికి కారణం భరతుడితో హనుమంతుడు ఇలా చెప్పాడు. "రాజశ్రేష్టుడా! భరద్వాజ మహాముని వర బలంతో అయోధ్యానగరానికి వచ్చే అన్ని మార్గాలలో చెట్లన్నీ పూలతోను, పండ్లతోను కూడి తుమ్మెదల ఝంకారాలతో తేట తేనెలతో వున్నాయి. అంటే కాదు. వానరులుండే అన్ని ప్రదేశాలలో నేల అన్ని రకాల పండ్లు, పూలతో నిండి వుండేట్లు ఇంద్రుడు కూడా వరం ఇచ్చాడు. ఆయన ఆశ్రమానికి వచ్చిన అందరికీ భరద్వాజ మహర్షి ఇష్టమృష్టాన్నంతో విందు ఇచ్చాడు. ఈ కారణాన వానరులు కడుపునిండా తిని కాలం గడుపుతూ ఆలశ్యం చేస్తున్నారు. ఇదిగో ఇప్పుడే ధ్వని వస్తున్నది. వానరులు గోమతిని దాటుతున్నారనుకుంటాను. వాలుకీ నది పక్కన వున్న ప్రదేశంలో దుమ్ము ఆకాశానికి లేస్తున్నది. కోతులు సాలవనాన్ని నేలపాలు చేస్తున్నట్లు నాకనిపిస్తున్నది".

హనుమంతుడు ఇంకా ఇలా అన్నాడు భరతుడితో. "అదిగో దూరంగా ఆకాశాన నిర్మలమైన చంద్రమండలంలాగా, తెల్లగా కనిపిస్తున్న దాన్ని చూడు. దీన్ని బ్రహ్మ తన సంకల్పంతో సృష్టించాడు. యుద్ధంలో రామచంద్రమూర్తి రావణుడిని చంపి దీన్ని గ్రహించాడు. ఇది సూర్యకాంతి కలది. దేవతా సంబంధమైంది. మనసంత త్వరగా, వేగంగా పోతుంది. రాముడి ఈ వాహనాన్ని బ్రహ్మదేవుడు సృష్టించి కుబేరుడికి ఇస్తే, దాన్ని విరోధంతో గెలిచి రావణుడు సొంతం చేసుకున్నాడు".

విమానంలో వున్న శ్రీసీతారామలక్ష్మణులకు కనబడ్డ భరతుడు, హనుమంతుడు

హనుమంతుడు ఇంకా ఇలా అన్నాడు. "అదిగో అక్కడ కనబడుతున్నవాడే రామచంద్రమూర్తి. సీతతోను, తమ్ముడు లక్ష్మణుడితోను వున్నాడు. ఎడమ పక్క సీత, కుడిపక్క లక్ష్మణుడు వున్నారు. అదిగో అతడే సుగ్రీవుడు. అదిగో విభీషణుడు".

"అతడే రాముడు" అని హనుమంతుడు చెప్పగానే స్త్రీబాలవృద్ధులు అంతా ఆకాశం వైపు వేలు చూపిస్తూ "వాడే రాముడు! వాడే రాముడు! అదిగో రాముడు! రాముడదిగో!" అని ధ్వనించారు. అంతదాకా వాహనాల మీద వున్నవారంతా కిందికి దిగి ఆకాశం వైపు, రాముడి వైపు చూశారు. పద్నాలుగు సంవత్సరాలు దాటగానే తప్పక తిరిగి వస్తానని మాట ఇచ్చిన రామచంద్రమూర్తిని చూసి భరతుడు దూరం నుండే నమస్కారం చేశాడు. హంసలతో కూడిన విమానం నేలమీద దిగింది. రామచంద్రమూర్తి అజ్ఞానుసారం భరతుడు దానిమీదికి ఎక్కి రామచంద్రమూర్తిని సమీపించి నమస్కారం చేశాడు.

శ్రీరామ భరత సమాగమం

తనకు నమస్కారం చేసిన తమ్ముడు భరతుడిని చూసి, ప్రేమగా తన తొడమీద కూర్చుండబెట్టుకుని, ఆనంద భాష్పాలు రాలుతుంటే కౌగలించుకుని "నాయనా! సుఖమా?" అని ఆదరంగా పలికాడు రామచంద్రమూర్తి. భరతుడు ఆ తరువాత సంతోషంగా లక్ష్మణుడిని సమీపించి ఆయన్ను కౌగలించుకున్నాడు. ఆ తరువాత సీతాదేవికి నమస్కారం చేసి, వెంటనే సుగ్రీవుడిని, జాంబవంతుడిని, అంగదుడిని ప్రేమగా కౌగలించుకున్నాడు. మైంద, ద్వివిదులను, గంధమాదనుడిని, ఇతర వానర వీరులను కూడా కౌగలించుకున్నాడు. సుగ్రీవుడిని చూసి, "ఆపత్కాలంలో నువ్వు సహాయం చేశావు. నిర్మలమైన స్నేహం స్నేహితుడి లక్షణం. ఇదివరకు మేం నలుగురం సోదరులం. ఇప్పుడు నీతో కలిసి ఐదుగురం" అన్నాడు. ఆ తరువాత విభీషణుడిని చూసి, "పుణ్యాత్ముడా! నువ్వు సహాయం చేయబట్టే కదా మేం అసాధ్యకార్యం సాధించగలిగాం? అన్నాడు. శత్రుఘ్నుడు కూడా సీతారామలక్ష్మణులకు అభివాదం చేశాడు. మొక్కాడు.

ఆ తరువాత శ్రీరామచంద్రుడు తల్లి దగ్గరికి పోయాడు. పాదాలమీద పడి సాష్టాంగ నమస్కారం చేశాడు. చేసి, "తల్లీ! ఆనాడు నువ్వు చెప్పిన మాట వినలేకపోయాను. నా తప్పు క్షమించు". సుమిత్రకు, కైకకు, పురోహితుడు

వశిష్టుడికి మొక్కాడు. పురజనులంతా చేతులు జోడించి రామచంద్రమూర్తికి మొక్కుతూ స్వాగతం పల్కారు. వారందరినీ ప్రేమగా చూశాడు రామచంద్రమూర్తి. కుశల ప్రశ్నల తరువాత భరతుడు తనకు రామచంద్రమూర్తి ఇచ్చిన బంగారు పాదుకలను తీసుకొచ్చి అన్న పాదాలకు తొడిగి, చేతులు జోడించి, "రాజేంద్రా! ఈ రాజ్యమంతా నీది. నువ్వు లేని కారణాన ఇంతదాకా కావలి కాసి వుండి, ఇప్పుడు నీది నీకు అప్పగిస్తున్నాను. రాజేంద్రా! ధనాగారం, ధాన్యాగారం మొదలైనవన్నీ పరీక్షించు. నీ తేజస్సు వల్ల (నా సామర్థ్యం వల్ల కాదు) అవన్నీ పదింతలై పెరిగాయి. దీన్ని సర్వం నువ్వే గ్రహించు" అన్నాడు.

అన్న మీద ప్రేమ కల ఆ తమ్ముడిని చూసి తమ్ముడు అంటే ఇలా వుండాలి అని వానరులు, విబీషణుడు ఆనంద భాష్పాలు రాల్చారు.

భరతుడి ఆశ్రమానికి పోయిన శ్రీరాముడు

పూర్తి సంతోషంతో భరతుడిని తన ఒడిలో కూర్చుండబెట్టుకుని శ్రీరాముడు సైన్యంతో సహా భరతుడి ఆశ్రమానికి పోయాడు. నందిగ్రామంలో విమానం దిగిన రామచంద్రమూర్తి భూమ్మీద నిలబడి, విమానాధ్యక్షుడిని పిలిచి, ఇక దీన్ని నువ్వు కుబేరుడి దగ్గరికి తీసుకునిపొమ్మని చెప్పాడు. రామాజ్ఞతో ఆ విమానం కుబేరుడి దగ్గరికి పోయి అతడిని సేవించింది. రామచంద్రమూర్తి సంతోషంగా పురోహితుడైన వశిష్టుడి పాదాలను తాకగా, వారిద్దరూ వేర్వేరు పీటలమీద ఆసీనమయ్యారు.

సర్గ–131
రాజ్యాన్ని శ్రీరాముడికి అప్పగించిన భరతుడు

అప్పుడు భరతుడు శిరస్సున అంజలి ఘటించి, రామభద్రుడిని చూసి ఇలా అన్నాడు. "సద్గుణాల లక్ష్మీకరుడా! నా తల్లి వాక్యాన్ని పాలించి రాజ్యాన్ని, లక్ష్మిని వదిలి ఆమెను గౌరవించావు. నీకు నీ రాజ్యమంతా ఇస్తున్నాను. నువ్వు నాకెలాగైతే రాజ్యాన్ని ఇచ్చావో అదే విధంగా అప్పచెప్తున్నాను. ఇక నేను ఈ బరువు మోయలేను. ఈ రాజ్యాన్ని గొప్పదైన ప్రయత్నం చేస్తేనే కాని రక్షించలేం. ఇది నువ్వే ఆలోచించు. అలాగైతే ఇన్నాళ్ళూ నేనెలా పాలించానంటావా? ఏదో కొంత అల్ప ప్రయత్నం చేసి రక్షించాను కాని నీలాగా పూర్ణ శక్తి వుండికాదు. మనమిద్దరం క్షత్రియ జాతికి చెందినవారిమే అయినా నీ శక్తి నాకురాదు. మహాత్ముడివి నువ్వైతే అల్పాత్ముడిని నేను. మిట్ట మధ్యాహ్నం మండుతున్న కిరణాల సూర్యుడిని చూసినట్లు పట్టాభిషిక్తుడివైన నిన్ను ప్రజలు చూస్తారు. (అంటే రాముడిలో సౌశీల్య, సౌలభ్య, వాత్సల్య, కారుణ్య, పరమోదారత్వ, మధురభావ గుణాలున్నాయని, ఇక రాముడు తన ఈశ్వరత్వాన్ని ప్రకటించాలని అర్థం). మంగళ వాద్యాల మధ్య స్త్రీల మేలుకొలుపు పాటలతో నిద్ర మేల్కొనాలి నువ్వు ఇక. ఎంతవరకు భూమ్యాకాశాలు, నక్షత్ర మండలం వుంటాయో అందాకా నీ ప్రభుత్వం వర్ధిల్లుతుంది". భరతుడి మాటలకు సరే అన్నాడు రామభద్రుడు.

జడలు విడిచిన శ్రీరామాదులు

ఆ తరువాత శత్రుఘ్నుడి ఆజ్ఞానుసారం నేర్పరులైన క్షురకులను పిలిచి శ్రీరామ లక్ష్మణ భరతులకు మీసాలు కత్తిరించి, గడ్డాలు, క్షౌరం చేశారు. వారు

స్నానం చేసిన తరువాత సుగ్రీవ విభీషణులు స్నానం చేశారు. శ్రీరాముడు వెలగల వస్త్రాలను ధరించి అలంకరించుకున్నాడు. ఆయన అలా త్రిలోకాభిరాముడై వుండగా రామలక్ష్మణులకు శత్రుఘ్నుడు మంచి ఆభరణాలు తొడిగాడు. అప్పుడు దశరథుడి భార్యలు మనోహరంగా స్వయంగా వారే సీతాదేవిని అలంకరించారు. కౌసల్య వానర స్త్రీలందరికీ సొమ్ములు, చీరెలు ఇచ్చి అలంకరించుకోమన్నది.

అయోధ్యకు ప్రయాణమైన శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఇతరులు

ఇలా అంతా అలంకరించుకున్న తరువాత శత్రుఘ్నుడి ఆజ్ఞానుసారం ఒక దివ్యరథాన్ని సిద్ధం చేసి సుమంత్రుడు తీసుకొచ్చాడు. రామచంద్రమూర్తి దాన్ని ఎక్కి అయోధ్యకు పయనించాడు. ఆ రథం వెంట సుగ్రీవుడు, హనుమంతుడు ఇతరులు పయనించారు. వారివెంట సుగ్రీవుడి భార్యలు, వారి పరిచారికలు బయల్దేరారు. ఇక్కడ శ్రీరామాదులు ప్రయాణ సన్నాహంలో వుండగానే మంత్రులు అశోకుడు, సుమంత్రుడు, విజయుడు (వారితో పాటు దశరథుడి భార్యలు) ముందుగా అయోధ్యకు పోయి పురోహితుడైన వసిష్టుడితో ఇలా అన్నారు. "అయ్యా! మహానుభావుడైన రామచంద్రమూర్తికి పట్టాభిషేకం చేయడానికి అన్నీ సిద్ధం చేసుకో". అలా చెప్పి రామచంద్రమూర్తి దర్శనం కొరకు మళ్లీ నగరం బయటికి వచ్చారు. రామచంద్ర భూపాలుడు ఆకుపచ్చ గుర్రాలు కట్టిన రథం మీద ఎక్కాడు. ఎక్కి అయోధ్యా పురంలో రాచబాటల వెంట పయనించసాగాడు.

భరతుడు ముందు కూర్చుని పగ్గాలు చేతబట్టుకుని రథానికి సారథ్యం చేశాడు. ఉత్తమ శ్వేతచ్ఛత్రం శత్రుఘ్నుడు పట్టుకున్నాడు. ఇక లక్ష్మణుడు రామచంద్రమూర్తి శిరస్సుమీద విసనకర్రతో కుడి చేత్తో విసురుకుంటూ నిలబడ్డాడు. ఎడమ చేత్తో లక్ష్మణుడు వింజామర పట్టుకున్నాడు. ఆకాశంలో ఆ సమయాన దేవతలు, మునులు స్తోత్రం చేశారు. సుగ్రీవుడు శత్రుంజయం అనే ఏనుగునెక్కి బయల్దేరి వచ్చాడు. వానర శ్రేష్ఠులు మనుష్యుల ఆకారంలో తొమ్మిది వేల ఏనుగులమీద బయల్దేరారు. నగారా ధ్వనులు, శంఖాల మోతలు, వీణెల ధ్వనులు మోగుతుంటే రామచంద్రమూర్తి మేడలు, మిద్దెలు చూసుకుంటూ పోయాడు. రామచంద్రమూర్తిని మంత్రులు సమీపించి దీవెనలిచ్చి సంతోషపర్చారు. రాముడు వారిని మంచి మాటలతో తృప్తి పరిచాడు. ఇలా అమాత్యులు, పురజనులు, బ్రాహ్మణులు తనను సేవిస్తూ వుంటే,

రామచంద్రమూర్తి విశేషంగా ప్రకాశించాడు. మంగళవాద్యాలు మోగసాగాయి. పచ్చటి అక్షింతలు తీసుకుని బ్రాహ్మణులు, కన్యకలు, ఆవులు ముందు పోయారు. అప్పుడు రామచంద్రమూర్తి తన మంత్రులకు సుగ్రీవుడితో తనకు కలిగిన స్నేహం, హనుమంతుడి మహిమ, వానరుల గొప్ప కార్యం, విభీషణుడు తనను కలియడం గురించి వివరించాడు.

రామచంద్రమూర్తి చెప్పిన మాటలు విన్న లోకులు ఆశ్చర్యపోయారు. అయోధ్య చేరిన శ్రీరాముడు ఇక్ష్వాకువంశరాజులకు ఇష్టమైన దశరథుడి ఇంట్లోకి సంతోషంగా ప్రవేశించాడు. ముగ్గురు తల్లులకు సాష్టాంగనమస్కారం చేసి భరతుడితో, సుగ్రీవుడికి తన ఇంట్లోనే విడిది ఏర్పాటు చేయమని చెప్పాడు రామచంద్రమూర్తి. భరతుడు అలాగే చేశాడు. సుగ్రీవుడు ఆ తరువాత నలుగురు వానరులను పిలిచి, వారికి నాలుగు బిందెలు ఇచ్చి, వాటిని తీసుకుని పోయి నాలుగు సముద్రాల నుండి నీళ్లు తెమ్మన్నాడు. నీళ్ళు తీసుకుని ఉదయంలోపు రావాలన్నాడు. నలుగురు వానరులు, హనుమంతుడు, వేగదర్శి, జాంబవంతుడు, ఋషభుడు రివ్వున పోయి ముహూర్త కాలంలో దివ్య తీర్థాలతో నిండిన బిందెలు తెచ్చారు. ఇవి నదీ తీర్థాలు. ఆ నలుగురే కాకుండా మరికొందరు పోయి ఐదొందల నదుల తీర్థాలు తెచ్చారు. తూర్పు సముద్రం నుండి సుషేణుడు, దక్షిణ సముద్రం నుండి మరో ఋషభుడు, పడమటి సముద్రం నుండి గవయుడు, ఉత్తర సముద్రం నుండి నలుడు బంగారు బిందెలలో సముద్ర జలాలను తెచ్చారు. వానరులంతా ఇలా తీర్థాలు తీసుకుని రావడం చూసిన శత్రుఘ్నుడు, రామచంద్రమూర్తి పట్టాభిషేకం త్వరాగా చేయమని మంత్రులకు, పురోహితులకు చెప్పాడు.

శ్రీ సీతారామ పట్టాభిషేక మహోత్సవ ఘట్టం

ఇదంతా జరిగిన తరువాత శాంతచిత్తుడు, బ్రాహ్మణ శ్రేష్టులతో కూడిన వాడైన వసిష్టుడు, రామచంద్రమూర్తిని, సీతాదేవిని రత్నపీఠం మీద కూర్చోబెట్టాడు. ఇలా వారిద్దరినీ కూర్చోబెట్టిన తరువాత, వసిష్టుడు, కాత్యాయనుడు, జాబాలి, కాశ్యపుడు, విజయుడు, గౌతముడు, వామదేవుడు, సుయజ్ఞుడు మొదలైన ఎనిమిదిమంది బ్రాహ్మణ శ్రేష్ఠులు పరిమళాలు ఘుమ్మని వీస్తున్న జలాలతో వారిని అభిషేకించారు. ఆ తరువాత ఋత్విజులు, బ్రాహ్మణులు, కన్యకలు, మంత్రులు, యోధులు, వైశ్యులు దివ్యమైన గొప్ప మూలికల రసంతో ఆకాశాన గుంపులుగా చేరి చూస్తున్న దేవతల సమక్షంలో,

నలుగురు దిక్పాలకుల సమక్షంలో అభిషేక కార్యక్రమం అంతా జరిపించారు. బ్రహ్మ నిర్మితమై, అనేక రత్నాలతో ప్రకాశిస్తూ, తేజస్సుతో ప్రకాశిస్తూ, మనువు పూర్వం అభిషిక్తుడైన సమయంలో ధరించినదై, అది మొదలు వంశపారంపర్యంగా పట్టాభిషేక సమయంలో ధరించేదైన, వెలలేని మణులతో ప్రకాశిస్తున్న కిరీటాన్ని రత్న పీఠంమీద కూచున్న రామవిభుడి అంగీకారంతో వేదాధ్యయనపరులైన ఋత్విజులతో కలిసి వసిష్టుడు అలంకరించాడు.

అన్నకు శత్రుఘ్నుడు ప్రశస్తమైన శ్వేతఛ్ఛత్రం భక్తితో పట్టాడు. తెల్లటి చామరాన్ని సుగ్రీవుడు వీచాడు. మరొక చామరాన్ని విభీషణుడు పట్టుకున్నాడు. ఇంద్రుడి పక్షాన వాయుదేవుడు తళతళ ప్రకాశించే బంగారు సరాన్ని, సమస్త రత్నాలతో కూడిన మంచి ముత్యాల మనోహరమైన ముత్యాల సరాన్ని అర్పించాడు. గంధర్వులు దివిలో ఆడారు, పాడారు. శ్రీరామచంద్రమూర్తికి పట్టాభిషేక ఉత్సవం జరగగా పచ్చటి పైరులు భూమంతా నిండాయి. చెట్లన్నీ పరిమళాలతో పూచాయి, కాచాయి. రామచంద్రమూర్తి విరివిగా బ్రాహ్మణులకు, తక్కిన వారికి వస్త్రాలు, ఇతర దానాలు ఇచ్చాడు. బంగారు హారాన్ని ప్రీతిగా సుగ్రీవుడికి ఇచ్చాడు. వజ్ర వైడూర్యాలతో చిత్రించబడ్డ విశేష కాంతికల భుజకీర్తులను అంగదుడికి ఇచ్చాడు. రత్న శ్రేష్టాలతో కూడినదైన, మనోహరమైన, ఉత్తమోత్తమమైన, ఆణిముత్యాలతో కూడిన శ్రేష్టమైన హారాన్ని ప్రేమతో సీతాదేవికి ఇచ్చాడు రామచంద్రమూర్తి.

హనుమంతుడికి బహూకరించిన శ్రీ సీతాదేవి

పరిశుభ్రమైన దువ్వలువలు, బంగారు భూషణాలు, సీతాదేవి భర్త అనుమతితో ఆంజనేయుడికి ఇచ్చింది. ఇవన్నీ ఆంజనేయుడికి ఇచ్చి కూడా సంతృప్తి చెందలేదు సీత. తన మెడలో వున్న ఒక అందమైన హారాన్ని సంతోషంగా చేతిలో తీసుకుని ఎవరికీ ఇస్తే బాగుంటుంది అన్న విధంగా భర్తవైపు చూసింది. సమాధానంగా ఆయన "ఓ అలివేణీ! ఎవరు తన గుణాలతో నిన్ను మెప్పించాడో, ఎవరిలో మంచి బుద్ధి పరాక్రమాలు కలవో అలాంటివాడికి దీన్ని ఇవ్వు" అని అన్నాడు. సీతాదేవి భర్త అలా చెప్పగానే ఆ హారాన్ని హనుమంతుడికి ఇచ్చింది. అది ధరించి హనుమంతుడు కాంతితో ప్రకాశించాడు. ఆ తరువాత మైందుడికి, ద్వివిదుడికి, నీలుడికి వారికిష్టమైన బహుమానాలు రాముడిచ్చాడు. అలా వానరనాథులందరికీ ఇచ్చాడు. ఈ ప్రకారం విభీషణ, సుగ్రీవ, జాంబవంత తదితర వానరులంతా వారివారికి తగిన బహుమానాలు, గౌరవాలు తృప్తితీరా

పొంది రామచంద్రుడి ఆజ్ఞ తీసుకుని తమతమ ప్రదేశాలకు వెళ్లిపోయారు. అలాగే వానరనాథులంతా కిష్కింధకు పోయారు. రామచంద్రమూర్తి అనుగ్రహించిన కులధనం గ్రహించి విభీషణుడు రామాజ్ఞ తీసుకుని లంకకు పోయాడు.

రామచంద్రమూర్తి నీతి విధానం తప్పకుండా రాజ్యమంతా పరిపాలించాడు. రామచంద్రమూర్తి లక్ష్మణుడితో "ధర్మజ్ఞుడా! నువ్వు ధర్మాన్ని అనుసరించి నాతో పద్నాలుగు సంవత్సరాలు దుఃఖం అనుభవించావు. ఇక సుఖాలు కూడా అనుభవించాలి. కాబట్టి ఈ రాజ్యానికి నువ్వు యువరాజై నాతో సమానంగా అనుభవించు అని ఎన్నెన్నో విధాల చెప్పాడు. కాని, లక్ష్మణుడు దానికి అంగీకరించ లేదు. పరతంత్రుడైన భరతుడికి యౌవరాజ్యాన్ని ఇచ్చి, అశ్వమేధయాగం, పౌండరీకం, వాజపేయం లాంటి యజ్ఞాలను చేశాడు. రామచంద్రమూర్తి యుద్ధం లాంటి ఘోర కార్యాలు లేకుండా మనోహరంగా పదివేల సంవత్సరాలు భూమిని పాలించి నూరు అశ్వమేధ యాగాలు చేసి, తమ్ములతో, చుట్టాలతో, ఆప్తులతో, మిత్రులతో కలిసి అనేక విధాలైన యజ్ఞాలు చేశాడు.

శ్రీరామచంద్రమూర్తి రాజ్యం ఏలుతున్నప్పుడు ప్రజలు మనోవేదనలు లేకుండా వున్నారు. ప్రజలు ఒకరితో ఒకరు స్నేహభావంతో వుండేవారు. కలహించుకోలేదు. దొంగతనం అంటే తెలియదు. దారిద్ర్యం అసలే లేదు. రామా! రామా! అని రామచంద్రమూర్తిని సర్వ వేళల ధ్యానిస్తూ సమస్త జీవకోటి ధర్మ బుద్ధితో సంతోషంగా, సుఖంగా వుండేది. ఆయన రాజ్యం చేస్తున్నప్పుడు ఏనోట విన్నా రామశబ్దమే! ఏకథ విన్నా రాముడి కథే! ప్రపంచం అంతా రామమయం అయింది. రామచంద్రమూర్తి రాజ్యం ఏలుతున్నప్పుడు వృక్షాలు, ఋతువులు, నియమం లేకుండా సర్వదా పుష్పాలతో, పండ్లతో, కొమ్మలతో కూడి వుండేవి. కరువు భయం లేనేలేదు. సకాలంలో వానలు పడేవి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు వారివారి వర్ణాశ్రమ ధర్మాలను నియమం ప్రకారం పాటిస్తూ శుభలక్షణాలు కలిగి వుండేవారు. ఈ విధంగా శ్రీరామచంద్రమహారాజు పదకొండు వేల సంవత్సరాలు తమ్ములతో శ్రీమంతుడై జగత్ప్రసిద్ధిగా ప్రపంచాన్ని పాలించాడు.

ఫల శ్రుతి

నారద మహర్షి వాల్మీకికి రామాయణాన్ని ఉపదేశించినప్పుడు ముందు భూతకాలం చెప్పి, తరువాత భవిష్యత్కాలం చెప్పాడు, వాల్మీకి ప్రశ్న వేయడానికి ముందే "ఎవ్వడీ ధారుణిని యీకాలంలో" అనే ప్రశ్నించాడు కాని, గడిచినవారి గురించి కాని, రాబోయేవారిని గురించి కానీ ప్రశ్నించలేదు. అవతారానికి ముందే రామాయణం రచించినట్లయితే కొంత భూతార్థకంలో, కొంత వర్తమానార్థకంలో, కొంత భవిష్యత్ అర్థకంలో చెప్పాల్సిన పనిలేదు. అవతారానికి ముందే రామాయణం రచించడం జరిగిందని అంటే చాలా విరోధాలు వస్తాయి. అలా చెప్పడానికి ఒక్క ఆధారమైన రామాయణంలో లేదు. రామాయణం వేదంలాగా స్వతఃప్రమాణం. దానిలోని విషయాలను ఋజువు చేయడానికి ఇతర ప్రమాణాలు లేవు.

రామాయణమే ఆదికావ్యం. వేదార్థం ఇందులో విస్తరించి చెప్పడం జరిగింది. వాల్మీకి మహర్షి దీన్ని అశ్వమేధయాగం చేయడానికి పూర్వం రచించి బహిర్గతం చేశాడు. ఇది పుణ్యం కలిగించి ఆయువును వృద్ధి చేస్తుంది. ఇది మిక్కిలి కీర్తికరం. రాజులకు గెలుపు కలిగిస్తుంది. దీన్ని చదువుతే (పఠిస్తే) సకల పాపాలు తొలగిపోతాయి. కొడుకులు కావాలనుకున్నవారికి కొడుకులు, ధనం కోరినవారికి ధనం లభిస్తుంది. రామాభిషేక విధానం విన్న రాజు శత్రువులను గెలిచి రాజ్యం పాలిస్తాడు. రామాయణం ప్రజలు వింటే, వారి ఆయువు వృద్ధి అవుతుంది. కోపాన్ని జయించి, శ్రద్ధగా, ఏకాగ్ర మనస్సుతో, వేదార్థం విస్తరించిన, వాల్మీకి మహర్షి చెప్పిన రామాయణాన్ని మంచి మనసుతో చదివేవాడు సమస్త దుఃఖాలను దాటుతాడు. మరణించిన తరువాత మోక్ష

సుఖం కలుగుతుంది. జీవించిన కాలంలో శ్రీరామ కటాక్షం వల్ల వాడి కోరికలన్నీ నెరవేరుతాయి. ఇది సత్యం సత్యం అని స్వానుభవం వల్ల ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు ఆయన రచించిన ఆంధ్రవాల్మీకి రామాయణంలో పేర్కొన్నారు. ఆయనగారు సంకల్పించిన మహాకార్యం అతడి శక్తికి మించినవైనా లోకోత్తరంగా అన్నీ నెరవేరాయి.

రామాయణ కావ్యం వినేవారిని గురించి దేవతలు సంతోషిస్తారు. వారి ఇండ్లలో దుష్టగ్రహాలు నిలవలేక పారిపోతాయి. రాజు వింటే భూమిని జయిస్తాడు. పరదేశంలో వున్నవాడు ఆపదలేక ప్రయాణం చేస్తాడు. ముట్టు స్నానం చేసిన వయసు స్త్రీ వింటే ఆమెకు ఉత్తమ గుణాలుకల కొడుకులు పుట్తారు. ఎవరైతే ఈ రామాయణాన్ని ఇష్టంగా పఠిస్తాడో వాడి పాపాలన్నీ హరిస్తాయి.

శ్రీరాముడు ఏనాడో మరణించాడు కదా! అలాంటివాడు తనను సేవించినవారికి ఎలా సహాయం చేస్తాడు? అని ప్రశ్నించేవారికి సమాధానం రామాయణంలోనే వుంది. రామచంద్రమూర్తి నారాయణుడు. సమస్త భూతాలకు స్థానమై సర్వం తానై వుండేవాడు. కాబట్టి ఆనాడున్నాడు, నేడు లేడని అనకూడదు. సమస్త ప్రపంచానికి ప్రభువైన రాముడు లేకపోతే లోకం అనాయకమౌతుంది. అవతారానికి ముందు కాని, తరువాత కాని రామచంద్రమూర్తి లేకపోలేదు. రామచంద్రమూర్తి లేడంటే భగవంతుడు లేడని అర్థం. ఎందుకంటే ఆయనే ఆదిమదేవుడైన హరి. బ్రహ్మరుద్రాదులు లేనికాలంలో ఆయన వుండి వీరందరి జన్మకారకుడైనాడు. ఆయనే ఒక కాలంలో లేడంటే ఇక వుండేది ఏమిటి? దీర్ఘబాహుడైన యితడు సాకారుడు కాని నిరాకారుడు కాదు. ఈయన లక్ష్మీపతి. ఒంటరివాడుకాదు. లక్ష్మీ విశిష్టుడు. నరసింహావతారంలో లాగా సర్వాంతర్యామి అయివుంటాడు. ఒక కాలంలో వుండి వేరే కాలంలో లేకుండా వుండడు. ఇలాంటివాడు శ్రీరామచంద్రమూర్తి.

శుభకరమైన ఈ కావ్యాన్ని వింటే ధనధాన్య వృద్ధి, సంతాన వృద్ధి కలుగుతుంది. సద్గుణాల స్త్రీ సాంగత్యం, ఉత్తమ సౌఖ్యం లభిస్తుంది. పరమార్థమైన మోక్షం ప్రాప్తిస్తుంది. క్షేమ పద్ధతిన ఆయువు, కీర్తి, ఆరోగ్యం లభిస్తాయి. ఇది సోదర స్నేహం, సౌఖ్యం, సాదుబుద్ధి, తేజస్సు కలిగిస్తుంది. పుణ్యలాభం కోరి దీన్ని వినే సత్పురుషులు నియమంగా చపలత లేని మనస్సుతో గ్రంథమంతా వినాలి. రామాయణ శ్రవణ పఠనం వల్ల దుష్ట రోగాలు మానుతాయి. ఇది ప్రమాణానుభవ సిద్ధం.

రామాయణం పురావృత్తమణి అని చెప్పడం జరిగింది. పురావృత్తాలెన్నో వున్నాయి. అవి రామాయణానికి సరికావు. ఎందుకంటే, శ్రీమద్రామాయణం బ్రహ్మ అనుమతితో వాల్మీకి మహర్షి రచించాడు. ఈ కావ్యంలో అనృతం కొంచెమైనా వుండదని బ్రహ్మ వరం. ఇది వేదం స్వరూపం అని చెప్పడం జరిగింది. కాబట్టి ఇలాంటి యోగ్యత, మహాత్మ్యం, గాయత్రీ ప్రణవ మంత్రాది సంపుటీకరణ ఇతర గ్రంథాలలో లేవు. సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలో వున్నప్పుడు రాసింది కాబట్టి ఇది పురాతన చరిత్ర అన్నారు. రామాయణ పఠనం వల్ల, రామ కథా శ్రవణం వల్ల సర్వ సుఖాలు కలుగుతాయి. ఈ విధంగా వేదార్థం తెలిపే ఈ రామాయణ కావ్యం పూర్వం వాల్మీకి మహర్షి లోకులకు ఉపకారం చేయడానికి దాన్ని సంహితగా రచించాడు.

యుద్ధకాండాంత పద్యాలు

నయనీకృతరవిచంద్రా! యయనీకృతసాగారేంద్ర యవితసురేంద్రా
శయనీకృతభుజగేంద్రా, జయ జయ శ్రీరామ జనకజా హృద్ధామా

సూర్యచంద్రులను నేత్రాలుగాను, సముద్రం వాసవ స్థానంగాను, ఆదిశేషుడు శయ్యగాను కలవాడా! ఇంద్రుడిని రక్షించేవాడా! శ్రీ సీతా హృదయంలో వుండేవాడా! నీకు జయం జయం.

శ్రీకమనీయశీల! ఖల శిక్షణలోల! దయాలవాల! నీ
రాకరగర్వభంజన! ధుతాఘ! నిరంజన! భక్తరంజనా!
ప్రాకటకీర్తిధామ! యపవర్గదనామ! హితైకకామ! ఖ్యా
తైకశిలావిహార! జనకాత్మభవాహృదయాబ్జభాస్కరా!
ధీర! రసఖాబ్ర శుచి దృష్టిగతపద్యనుత దేవహిత ఘోరరణవృత్తా!
సూరకుల! దాశరథి సూరిహితతా శరధి శూర! వరధీ! విరథి! వై దే
హీరమణ! హీరమణి హేమరమణీయ నర హీర శయనా! వనధివాసా!
భూరమణవర్య! గుణ పూతశుభ చర్య! నత భూమిరథ మంగళమహాశ్రీ!

ఆరు ప్రాకారంబు లారు సముద్రంబు లారు కాండంబులు నారుదశలు
నారు వికారమ్ము లత్యమోఘంబైన భవదీయకరుణను బరమపురుష
తరియింపగంటిని దారిని బడలక త్వచ్చరిత్రాంబుధి ద్రచ్చుచోట
నాదిని బ్రభవించె హాలహాలం బదియారె దావకకరుణ సీతాకళత్ర


కామధేను చింతామణి కల్పవృక్ష
కౌస్తుభంభును లక్ష్మియు గలిగె నవల
నమృత మింకిట గలిగించి యఖిలజనుల
నంద జేయు మమర్త్యత్వ మాదిదేవ

ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన,
మానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్ర
రాయతనూభవ సుజనవిధేయ సుబ్బరాయ
(వాసుదాస) నామధేయ ప్రణీతంబైన
మంధరాఖ్య స్వయంకృత వ్యాఖ్యాన
సమేత శ్రీమదాంధ్ర వాల్మీకి
రామాయణ మను నిర్వచన
మహాకావ్యంబునందు
యుద్ధకాండము


అనువక్త–వాచవిగా
వనం
జ్వాలా నరసింహారావు
రాసిన
యుద్ధకాండ మందరమకరందం
శ్రీ రామార్పణమస్తు.
శ్రీ శ్రీ శ్రీ

నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.


దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ప్రచురించిన వనం జ్వాలా నరసింహారావు రాసిన విశిష్ట రచనలు









శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం 'మందర మకరందం' ఆరు కాండలు







వివిధ పత్రికల్లో జ్వాలా నరసింహారావు రాసిన ధార్మిక, ఆధ్యాత్మిక వ్యాసాల సంకలనం ధర్మధ్వజం



దర్శనమ్

సభక్తి పూర్వక సమర్పణ





వనం జ్వాలా నరసింహారావు తండ్రి వనం శ్రీనివాసరావు గారు - పరమ భాగవతోత్తములు, శ్రీరామ భక్తులు... తన 83వ ఏట 1998 లో పరమపదించారు. తల్లి వనం సుశీలమ్మ గారు- సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013లో తన 90వ ఏట మరణించారు.

స్వగ్రామం - జన్మస్థలం: ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం గ్రామం, ఆగస్ట్ 15, 1947 న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి, ఆగస్ట్ 8, 1948న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, నలుగురు తమ్ములు, విద్యాభ్యాసం: సొంత గ్రామంలో మాధ్యమిక; ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో; కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్ లలో విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్‌లలో... లెక్కలు, భౌతిక రసాయన శాస్త్రాల్లో డిగ్రీ; అడ్మిని స్ట్రేషన్ లో ఎంఏ లైబ్రరీ సైన్స్ లో డిగ్రీ. వివాహం: ఏప్రియల్ 30, 1969న (స్వర్గీయ) అయితరాజు రాంరావు - రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మితో నివాహం. ఇద్దరు ఆడపిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర); ఒక కొడుకు (ఆదిత్య). ఆరుగురు (యశ్విన్, మిహిర, అన్ష్, మేధ, కనక్, ఇరా) మనుమలు, మనుమరాళ్లు.

ఉద్యోగాలు - ఇతర వ్యాపకాలు, లైబ్రేరియన్ గా జీవనయానం ప్రారంభం ... గవర్నర్ కుముద్ బెన్ జోషి దగ్గర ప్రాజెక్టు అధికారిగా, (మాజీ) ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి దగ్గర పౌర సంబంధాల అధికారిగా... హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్లు... మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కొంత కాలం... అత్యవసర సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం.... ఇలా అక్కడా ఇక్కడా... ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి దగ్గర ప్రధాన ప్రజా పౌర సంబంధాల అధికారిగా.

ఆంగ్లంలో పుస్తకాలు - హైదారాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్), ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవెలప్మెంట్ ఆఫ్ ఏపీ, గవర్నెన్స్ విత్ ఎ డిఫరెన్స్, 51 మంత్స్ ఆఫ్ కేసీఆర్ గవర్నెన్స్ విత్ డిఫరెన్స్, తెలుగులో తిలక్ జ్ఞాపకాలు, అనుభవాలే అధ్యాయాలుగా, ఇదీ సుపరిపాలన, సుందరకాండ మందర మకరందం, బాలకాండ మందర మకరందం, అయోధ్య కాండ మందర మకరందం. అరణ్యకాండ మందర మకరందం, కిష్కింధాకాండ మకరందం, ధర్మధ్వజం, ఇది సుపరిపాలన - 51 నెలల కేసీఆర్ ప్రభుత్వం.

Yuddha Kanda *MANDARA MAKARANDAM*

Written by: *Vanam Jwala Narasimharao*

Published by: *Darshanam Devotional Magazine*